
# పోతన భాగవతము

(దశమ స్కంధము - ఉత్తర భాగం, ఏకాదశ, ద్వాదశ స్కంధములు)

ఐదవ సంపుటము



తిరుమల తిరుపతి దేవస్థానములు,
తిరుపతి

# పోతన భాగవతము

*(సరళ గద్యానువాద సహితము)*

## ఐదవ సంపుటము

**దశమ స్కంధము – ఉత్తర భాగము & 11, 12 స్కంధములు**


*అనువాదకులు*

**డా॥ అమరేంద్ర**

**శ్రీ డి. నాగసిద్ధారెడ్డి**

**డా॥ ప్రసాదరాయ కులపతి**

**శ్రీ టి. భాస్కర రావు (స్ఫూర్తిశ్రీ)**

*ప్రధాన సంపాదకులు*

**డా॥ జంధ్యాల పాపయ్యశాస్త్రి**



*ప్రచురణ*

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2010**

**POTANA BHAGAVATAMU,** with Lucid Prose
Fifth Volume - Second Part of 10th Skandha and 11th & 12th Skandhas

**Author :** Potana Mahakavi

**Prose Rendering :** Dr. A. Amarendra
Sri D. Nagasiddha Reddy
Dr. Prasadaraya Kulapathi
Sri T. Bhaskar Rao (Sphurthi Sri)

**Edited by :** Dr. Jandhyala Papaiah Sastry. "Karuna Sri"



T.T.D Religious Publication Series No. 639-E

**First Edition** : 1987
**Re-prints** : 1998, 2004, 2005, 2008, 2010
**Revised Edition** : 2015

**Copies :** 5,000

**Published by**

Dr. D.Sambasiva Rao , I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

**D.T.P**

Sri Asangananda Graphics
Sri Vyasasramam, Yerpedu.
Ph:08578-287528

**Printed at**

# ముందుమాట

బ్రహ్మదేవుని చతుర్ముఖాలనుండి పురాణాలు, తరువాత వేదాలు వినిస్సృతాలైనట్లు తెలుస్తుంది. కాగా పురాణాల అనాదిత్వం పావనత్వం విద్యోతిత మవుతుంది. ఏనాటినుంచో సజీవంగా వెలిగేదే పురాణమంటారు. 'పురాపి నవం పురాణం'- ఎంత పాతదైనా పురాణం సరికొత్తగానే ఉంటుందన్నమాట!

సర్గం, ప్రతిసర్గం, వంశం, మన్వంతరం, వంశానుచరితం - అని పురాణాలు అయిదు లక్షణాలు కలిగి ఉంటాయి. ఈ లక్షణాలతో కూడిన పురాణాలు పద్దెనిమిది. ఉపపురాణాల సంఖ్యకూడా అంతే. ఈ పురాణాలన్నీ వేదవ్యాస మహర్షి విరచితాలే అని ప్రతీతి. ఇవి భిన్న కర్తృకాలు అనే ప్రవాదం కూడా ఉన్నది. ఏమైనా పురాణాలు ప్రాచీన సంస్కృతి సంప్రదాయాలకు ఆదర్శం లాంటివే కాకుండా, పూర్వ రాజవంశాలను గురించికూడ తెలపడంవల్ల ఒక విధంగా చరిత్రగ్రంథాలుగా కూడా ఉపకరిస్తాయి.

కథలద్వారా ప్రజలకు నీతి ధర్మాలు ఉపదేశించడం వీటి పరమాశయంగా కనిపిస్తుంది. భాగవత రచనవల్ల వ్యాసభగవానుడికి మనశ్శాంతి చేకూరిందనడంలో పురాణ ప్రభావం ఏమిటో విదిత మవుతుంది.

అష్టాదశ పురాణాలలో ప్రశస్తి వహించిన శ్రీమద్భాగవతాన్ని బమ్మెరపోతనామాత్యులు తెలుగులోనికి అనువదించి ఆంధ్రలోకానికి మహోపకారం చేశారు. పరమభాగవతోత్తముడైన పోతనగారు తన సహజ పాండిత్యముతో అనితరభక్తితో భాగవతాన్ని రచించారు. మహాతపస్వి పోతరాజుగారి లేఖిని నుండి జాలు వారిన కవితా ప్రవంతి ఆంధ్ర జనహృదయ కేదారాలను తడుపుతూ తాపత్రయాన్ని హరిస్తున్నదనడం సత్యం. భాగవతంలోని ప్రతి పద్యం ఎంతో హృద్యం. తెలుగునాట పోతనగారి పద్యం నోటికి రాని పండితుడు గాని, పామరుడుగాని లేడంటే అతిశయోక్తి కాదు.

ఇలా తెలుగునాట ప్రముఖస్థానాన్ని అలంకరించిన ఆంధ్రమహాభాగవతం అక్షరాస్యులందరికీ సులభ గ్రాహ్యం అయ్యేందుకు తి.తి.దేవస్థానంవారు ప్రముఖ విద్వాంసులచేత సులభశైలిలో తాత్పర్యాలు వ్రాయించి, ముద్రించారు.

ప్రధాన సంపాదకులైన డా॥ జంధ్యాల పాపయ్యశాస్త్రి (కరుణశ్రీ) గారికి, ఆయా సంపుటాల తాత్పర్య రచయితలకును మా అభినందనలు. తి.తి.దేవస్థానం వారు ప్రచురించిన పోతన భాగవత సంపుటాల ప్రతులన్నీ చెల్లిపోయినందున పాఠకుల సౌకర్యార్థమై పరిష్కరించి పునర్ముద్రించటం జరిగింది. పాఠకులు యథాపూర్వం ఆదరించగలరు.

శ్రీనివాసుని కృపతో తిరుమల తిరుపతి దేవస్థానంవారు చేస్తున్న ధార్మిక గ్రంథ ప్రచురణలపట్ల తెలుగునాట బహుళామోదం లభిస్తున్నందుకు సంతోషం.

**కార్యనిర్వహణాధికారి,**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

## సంపాదక మండలి



## అనువాదకులు

డా॥ అమరేంద్ర - 10 వ స్కంధం - ఉత్తరభాగం (1-535 పద్యములు)

శ్రీ డి. నాగసిద్ధారెడ్డి - 10 వ స్కంధం - ఉత్తరభాగం (536-1342 పద్యములు)

డా॥ ప్రసాదరాయ కులపతి - (ఏకాదశ స్కంధము)

శ్రీ టి. భాస్కర రావు (స్ఫూర్తి శ్రీ) - (ద్వాదశ స్కంధము)

# పోతన భాగవతము

**అనువాదకులు** | **స్కంధములు**

**మొదటి సంపుటము**

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ జంధ్యాల పాపయ్య శాస్త్రి | --- | ప్రథమ స్కంధము |
| 2. | డా॥ సముద్రాల లక్ష్మణయ్య | --- | ద్వితీయ స్కంధము |
| 3. | డా॥ ఆశావాది ప్రకాశరావు | --- | తృతీయ స్కంధము |

**రెండవ సంపుటము**

| | | | |
|---|---|---|---|
| 4. | శ్రీ శనగన నరసింహస్వామి | --- | చతుర్థ స్కంధము |
| 5. | డా॥ సర్వోత్తమరావు | --- | పంచమ స్కంధము |
| 6. | శ్రీ తలమర్ల కళానిధి | --- | షష్ఠ స్కంధము |

**మూడవ సంపుటము**

| | | | |
|---|---|---|---|
| 7. | శ్రీ జంధ్యాల వేంకటేశ్వరశాస్త్రి | --- | సప్తమ స్కంధము |
| 8. | శ్రీ జి. చెన్నయ్య | --- | అష్టమ స్కంధము |
| 9. | డా॥ బి. భాస్కర చౌదరి | --- | నవమ స్కంధము |

**నాల్గవ సంపుటము**

| | | | |
|---|---|---|---|
| 10. | డా॥ ఎక్కిరాల కృష్ణమాచార్య | --- | దశమ స్కంధము (పూర్వభాగం 1- 725 పద్యములు) |
| 11. | శ్రీమాన్ ముదివర్తి కొండమాచార్యులు | --- | దశమ స్కంధము (పూర్వభాగం 726 - 1791 పద్యములు) |

**ఐదవ సంపుటము**

| | | | |
|---|---|---|---|
| 12. | డా॥ అమరేంద్ర | --- | దశమస్కంధము - ఉత్తరభాగము ( 1- 535 పద్యములు) |
| 13. | శ్రీ డి. నాగసిద్ధారెడ్డి | --- | దశమస్కంధము - ఉత్తరభాగము (536 - 1342 పద్యములు) |
| 14. | డా॥ ప్రసాదరాయ కులపతి | --- | ఏకాదశ స్కంధము |
| 15. | శ్రీ టి. భాస్కర రావు (స్ఫూర్తిశ్రీ) | --- | ద్వాదశ స్కంధము |

# ప్రవేశిక

## *( 1 వ పద్యం నుండి 535 వ పద్యం వరకు )*

అభిజ్ఞ రసజ్ఞులకు అభివాదాలు. ఇప్పుడు తమ చేతిలో ఉన్న గ్రంథం పోతన భాగవతం దశమస్కంధంలోని ఉత్తరభాగం.

గరుడ మహాపురాణంలో భాగవత ప్రశస్తి ఈవిధంగా పేర్కొన బడింది-

**అర్థోఽయం బ్రహ్మసూత్రాణాం భారతార్థ వినిర్ణయః,**
**గాయత్రీ భాష్యరూపోఽసౌ వేదార్థ పరిబృంహితః.**
**పురాణానాం సారరూపః సాక్షాద్భగవదోదితః**
**ద్వాదశ స్కంధ సంయుక్తః శతవిచ్ఛేద సంయుతః,**
**గ్రంథోఽష్టాదశ సాహస్రః శ్రీమద్భాగవతాభిధః.**

ఈ భాగవతం బ్రహ్మసూత్రాల పరమార్థం. భారతార్థాన్ని నిర్ణయం చేసే గ్రంథం. గాయత్రీ మహామంత్రానికి ఇది భాష్యం. వేదార్థ పరిపోషకం. సమస్త పురాణాల సారం. సాక్షాత్ భగవత్స్వరూపుడైన శుకమహర్షిచే ప్రోక్తం. ఈ మహాగ్రంథం ద్వాదశ స్కంధాలతో కూడింది. నూరు పరిచ్ఛేదాలు కలది. పద్దెనిమిది వేల శ్లోకాలతో నిండింది. ఈ మహాగ్రంథం పేరు శ్రీ మద్భాగవతం.

**"రాగములు గూర్చె కాకర్ల త్యాగరాజు;**
**గుడులు కట్టించె కంచెర్ల గోపరాజు;**
**పుణ్యకృతి చెప్పె బమ్మెర పోతరాజు;**
**రాజు లీ మువ్వురును భక్తి రాజ్యమునకు."**

అన్నట్లు పుణ్యపురుషుడైన పోతన్నగారు ఈ పుణ్యకృతిని తెనుగుచేశారు,.

పోతన్నగారు ప్రారంభంలోనే "నా పూర్వపుణ్య వశంవల్ల నన్నయ తిక్కనాది మహాకవులు భాగవతాన్ని తెలుగు చేయకుండా నా కోసం వదలి పెట్టారు. ఈ మహాగ్రంథాన్ని తెలుగుచేసి నా జన్మ సార్థకం చేసుకుంటాను'' అన్నారు. ఆయన పుణ్యం వల్ల మహాభాగవతం అయనకు చిక్కింది; మనపుణ్యం వల్ల పోతన భాగవతం మనకు దక్కింది.

ఈ భాగంలో ప్రద్యుమ్నాభ్యుదయం, శ్యమంతకోపాఖ్యానం, సత్యభామాపరిణయం, నరకాసుర సంహారం, ఉషాకల్యాణం, బాణాసుర గర్వభంగం, నృగమహారాజ చరిత్రం, పౌండ్రక వాసుదేవ వధ అనే కథాఘట్టాలు ఉన్నాయి.

శంబరాసురుణ్ణి సంహరించి రతి సహితుడై ద్వారకా నగరానికి చేరుకున్న ప్రద్యుమ్నుణ్ణి చూచి అంతఃపురకాంతలు పొందిన కలవర పాటును చిన్న పద్యంలో ఎంతో మిన్నగా వర్ణించారు పోతన్నగారు. చిత్తగించండి-

**హరి యని వెనుచని పిదపన్**
**హరిఁబోలెడు వాఁడు గాని హరి గాఁడనుచున్**
**హరిమధ్య లల్లనల్లన**
**హరి నందను డాయవచ్చి రాశ్చర్యమునన్.** **10 ఉ.28**

ఎప్పుడో చిన్నప్పుడు తప్పిపోయిన పిల్లవాడు పెరిగి పెద్దవాడై కంటబడితే కన్న తల్లి గుండెల్లో ప్రేమానురాగాలు పెల్లుబుకుతాయి. తన "తొలుచూలి పాపనికి బోర్కాడించి చన్నిచ్చి'' నిద్రపోతుంటే ఏ పాపాత్ముడో వచ్చి(శంబరాసురుడు) ఎత్తుకపోయాడు. ఆ బాలుడు ఇప్పటిదాకా బ్రతికి ఉంటే ఇంతవాడై ఉండేవాడు అనుకుంటుంది ప్రద్యుమ్నుణ్ణి తిలకించిన రుక్మిణీదేవి.

**ఇందాక వాఁడు బ్రతికిన**
**సందేహము లేదు; దేహ చాతుర్య వయ**
**స్సౌందర్యంబులు లోకులు**
**వందింపఁగ నితనియంతవాఁడగుఁ జుమ్మీ!** **10 ఉ. 33**

కమనీయమైన కన్నతల్లి కామనకు కమ్మని ప్రతిబింబం ఈ పద్యం. ప్రతిభాషకీ కొన్ని ప్రత్యేకమైన భావ వ్యక్తీకరణ పద్ధతులు ఉంటాయి. "మా తమ్ముడు'' అనటానికి బదులుగా "మా వాడు'' అని అనటం మన తెలుగువాళ్ల సంప్రదాయం. వేటకు వెళ్లిన ప్రసేన జిత్తు ఎంతకీ తిరిగి రానందుకు చింతిస్తూ సత్రాజిత్తు-

**"మణి కంఠంబునఁ దాల్చి నేఁ డడవిలో మావాఁడు వర్తింపఁగా**
**మణికై పట్టి వధించినాఁడు; హరికిన్ మర్యాద లేదు............"** **10 ఉ. 58**

అని కృష్ణుణ్ణి నిందిస్తాడు. పోతన్నగారి తెలుగు మర్యాదవిధానానికి పై పద్య పంక్తులలోని "మా వాఁడు'' అన్నమాట ఉదాహరణం.

సత్రాజిత్తు పలుకులకు స్పందించిన గోవిందుడు **"ఏ వ్రణమున్ నా యెడ లేదు; నింద గలిగెన్; వారించు టేరీతియో?"** అని అనుకోవటం కూడా తెలుగుదనాన్ని స్ఫురింప జేస్తుంది.

అలాగే పశ్చాత్తప్త చిత్తుడైన సత్రాజిత్తు-

**"మణిని గూఁతు నిచ్చి మాధవు పదములు పట్టు కొంటి నేని బ్రతుకు గలదు."** **10 ఉ. 79**

అని నిశ్చయించుకోవటంలో సైతం తెలుగువారి తీరు తియ్యాలు కనిపిస్తాయి

ఒకే పదాన్ని భిన్నార్థాలతో పదే పదే ప్రయోగించటం పోతన్న గారికి అభీష్టమైన విలక్షణ లక్షణం.

**రాజునగరి యడబాలలు**
**రాజీవము కడుపు వ్రచ్చి రాజనిభాస్యున్**
**రాజశిశువు గని చెప్పిరి**
**రాజీవ దళాక్షియైన రతికి నరేంద్రా!** **10 ఉ.7**

అన్నప్పుడు-

**మణి యిచ్చినాఁడు వాసర**
**మణి; నీకును మాకుఁ గలవు మణులు; కుమారీ**
**మణి చాలు నంచు కృష్ణుఁడు**
**మణి సత్రాజిత్తునకును మరలఁగ నిచ్చెన్.** **10 ఉ. 82**

అన్నప్పుడు-

**నారి మొరయించె రిపు సే**
**నారింఖణ హేతువైన నాదము నిగుడన్**
**నారీమణి బలసంప**
**న్నారీభాదికము మూర్ఛనంద నరేంద్రా!** **10 ఉ. 176**

అన్నప్పుడు-

**మగువ మగవారి ముందఱ**
**మగతనములు సూప రణము మానుట నీకున్**
**మగతనము గాదు; దనుజులు**
**మగువల దెసఁ జనరు మగల మగ లగుట హరీ!** **10 ఉ. 189**

అన్నప్పుడు ఈ విధమైన పదప్రయోగ నైపుణ్యం గోచరిస్తుంది.

పాత్రల స్వరూప స్వభావాలను చక్కగా ఆకళించుకొని చిక్కగా ప్రకటించటం పోతన్న గారి ప్రత్యేకత. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థనగరానికి వచ్చి పాండవులను పలుకరించిన సందర్భం పరికించండి-

**"వా రఖిలేశ్వరుండైన హరిం గౌఁగిలించుకొని కృష్ణుని దివ్యదేహ సంగమంబున నిర్ధూత కల్మషులై యనురాగహాస విభాసితంబైన ముకుంద ముఖారవిందంబు సందర్శించి యానందంబు నొందిరి. గోవిందుండును యుధిష్ఠిర భీమసేనుల చరణంబులకు నభివందనములు చేసి, యర్జును నాలింగనంబున సత్కరించి, నకుల సహదేవులు మ్రొక్కిన గ్రుచ్చియెత్తి యుత్తమపీఠంబున నాసీనుండై యుండె."** **10 ఉ.103**

కృష్ణుడు తనకంటె పెద్దవాళ్లు కావటం వల్ల ధర్మరాజుకీ భీముడికి పాదనమస్కారం కావించాడు. తనతో సమాన వయస్కుడు కావటంవల్ల అర్జునుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. తనకన్న చిన్నవాళ్లు కనుక ప్రణమిల్లిన నకులుణ్ణీ సహదేవుణ్ణీ ఆదరంతో లేవనెత్తాడు. అనంతరం క్రొత్త పెండ్లికూతురైన ద్రౌపది కొంచెం సిగ్గుపడుతూ కృష్ణుడికి మ్రొక్కిందట. ఆపైన కృష్ణుడు కుంతీదేవి వద్దకు వెళ్లి నమస్కరించి ఇలా అన్నాడు.

**అత్తా! కొడుకులు కోడలు**
**చిత్తానందముగ పనులు సేయఁగ నాత్మా**
**యత్తానుగవై యాజ్ఞా**
**సత్తాదులు గలిగి మనుదె సమ్మోదమునన్?** **10 ఉ. 106**

"అత్తయ్యా! నీ కొడుకులూ, కోడలూ, నీకు నచ్చిన విధంగా, నీవు మెచ్చిన విధంగా పనులు చేస్తున్నారా? చేయవలసిన పనులుచెబుతూ సంతోషంగా ఉంటున్నావు కదా! "అన్న మేనల్లుడి మాటలకు ఆ మేనత్త "ప్రేమ విహ్వలత నందుచు గద్గద భాషణంబులం గనుఁగవ నశ్రుతోయములు గ్రమ్మగ'' సముచితంగా సంభాషించింది.

లోకకంటకుడైన నరకాసురుడిపైకి యుద్ధానికి సిద్ధమై వెళుతున్న శ్రీకృష్ణుణ్ణి చేతులు మోడ్చి ఇలా వేడుకుంటుంది సత్యభామ.

**దేవా! నీవు నిశాటసంఘముల నుద్దీపించి చెండాడ నీ**
**ప్రావీణ్యంబులు సూడఁగోరుదు గదా ప్రాణేశ! మన్నించి న**
**న్నీ వెంటం గొనిపొమ్ము, నేఁడు కరుణన్, నేఁజూచి యేతెంచి నీ**
**దేవీసంహతి కెల్లఁ జెప్పుదు భవద్దీప్తప్రతాపోన్నతుల్.** **10 ఉ.151**

భార్య సమరరంగానికి వస్తానంటే ఏ భర్తా సమ్మతింపడు. అందు వల్ల సంభాషణాచతుర అయిన సత్యభామ "స్వామీ! సంగ్రామసీమలో మీ వీరవిజృంభణాన్ని వీక్షించాలని కుతూహలంగా ఉన్నది. అంతేకాదు తిరిగి వచ్చిన తరువాత మీ ప్రతాపప్రాభవాన్ని నా సపత్ను లందరికీ వివరించి చెబుతాను'' అని కాదనటానికి వీలులేని విధంగా అడిగింది. అయితే అందుకు అంత అనాయాసంగా అంగీకరిస్తాడా ఆ సత్యభామాధవుడు! అయన ఆమెను వద్దని ముద్దుముద్దుగా ఇలా వారించాడు.

**సమద పుష్పంధయ ఝుంకారములు కావు**
**భీషణ కుంభీంద్ర బృంహితములు;**
**వాయు నిర్గత పద్మవన రేణువులు కావు**
**తురగరింఖా ముఖోద్ధూత రజము;**
**లాకీర్ణ జలతరంగాసారములు కావు**
**శత్రు ధనుర్ముక్త సాయకములు;**
**కలహంస సారస కాసారములు కావు**
**దనుజేంద్ర సైన్య కదంబకములు;**
**కమల కల్హార కుసుమ సంఘములు కావు**
**చటుల రిపు శూల ఖడ్గాది సాధనములు;**
**కన్య! నీ వేడ! రణరంగ గమన మేడ?**
**వత్తు వేగమ; నిలుపుము; వలదు వలదు.** **10 ఉ. 153**

సమానమైన సీసపద్యపాదాలలో సత్యభామప్రస్తుత పరిస్థితినీ, సమర రంగపు భీషణస్థితిగతినీ సరిసమానంగా వర్ణించి కళ్లకు కట్టించారు పోతన్నగారు. మొదటి పాదాలలో పరుషమైన సంస్కృత సమాసాలనీ ప్రయోగించి రచనలోనే గొప్ప వైచిత్ర్యం ప్రదర్శించారు. చిట్టచివరకు తేటతెలుగు పలుకులతో 'త్వరగా

తిరిగి వస్తాను. ఆగిపో. రావద్దు' అని తేల్చి వేయటం ఆమెను బుజ్జగించే ధోరణికి అనుకూలంగా ఉన్నది.

**కొందఱకు తెనుఁగు గుణమగు**
**కొందఱకును సంస్కృతంబు గుణ మగు; రెండుం**
**గొందఱకు గుణము లగు; నే**
**నందఱ మెప్పింతు కృతుల నయ్యై యెడలన్.**

అన్న సహజపాండిత్యుని శపథం ఇక్కడ మనకు గుర్తుకు వస్తుంది.

యుద్ధభూమికి రాకుండా ఉద్యానభూమిలోనే ఉండమంటున్న కృష్ణుడితో సద్యస్స్ఫూర్తి గల సత్య-

**"దానవులైన నేమి! మఱి దైత్యసమూహములైన నేమి! నీ**
**మానిత బాహుదుర్గముల మాటున నుండఁగ నేమి శంక?............"** 10 ఉ. 155

అని చేతులు జోడించింది. ఆ వీరనారిని అనురాగంతో అవలోకించి వెంట బెట్టుకొని గరుత్మంతుణ్ణి అధిరోహించాడు శ్రీకృష్ణుడు.

**"శుంభద్రాజబింబోపరిస్థల శంపాన్విత మేఘమో!"**

అన్నట్లు గరుడారూఢుడై సత్యభామతో సంభాషిస్తున్న శ్రీకృష్ణుడు ఉన్నాడట. ఎంత చక్కని ఉత్ప్రేక్ష!

భర్తతో యుద్ధానికి సన్నద్ధు డౌతున్న నరకాసురుణ్ణి చూచి ఏ మాత్రం కలవరపడకుండా కేశపాశం ముడివేసి, నడుం బిగించి లేచి నిలచిన వీరనారి సాత్రాజితిని పోతన్నగారు ఎలా దర్శించారో గమనించండి.

**వేణిన్ జొల్లెము వెట్టి సంఘటిత నీవీబంధయై భూషణ**
**శ్రేణిం దాల్చి ముఖేందు మండల మరీచీజాలముల్ పర్వఁగా**
**పాణిం బయ్యెద చక్కఁగా ఁదుఱిమి శుంభద్వీరసంరంభయై**
**యేణీలోచన లేచి నిల్చె తన ప్రాణేశాగ్ర భాగంబునన్.** **10 ఉ. 170**

ఇందులో "పాణిం బయ్యెద చక్కగా తుఱిమి" అన్న పదగుంఫన లోకపరిశీలనా దృష్టి ఎంత నిశిత మైనదో వ్యక్తం చేస్తుంది. సమర్థుడైన వడ్డాది పాపయ్యగారివంటి చిత్రకారుడికి వెంటనే పని కల్పించే చలత్సౌందర్య చిత్రణం ఇది. ఈ సందర్భంలోనే పోతన్నగారి అమృత లేఖిని నుండి జాలువారిన మరొక అద్భుతమైన పద్యాన్ని అవలోకించండి-

**పరుఁ జూచున్ వరుఁ జూచు నొంప నలరింపన్ రోషరాగోదయా**
**విరత భ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్**
**జరగం గన్నులఁ గెంపు సొంపుఁ బరఁగం జండాస్త్రసందోహమున్**
**సరసాలోక సమూహమున్ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిన్.** **10 ఉ. 178**

ఆమె నరుకుణ్ణి చూస్తున్నది. నాథుణ్ణీ చూస్తున్నది. అయితే ఆ చూపుల్లో తేడా ఉన్నది. పరుణ్ణి చూచే చూపు సంతాపింప జేస్తున్నది. పరుడిపైన రోషం, విరత భ్రూకుటి, వీరం, కెంపు చండాస్త్ర సందోహం ప్రదర్శిస్తున్నది. వరుడి పైన రాగోదయం, మందహాసం, శృంగారం, సొంపు, సరసాలోక సమూహం ప్రసరిస్తున్నది. పూర్తిగా పరస్పర విరుద్ధమైన అంశాలను మేళవించి రసికరసాయనంగా అందించారు పోతన్నగారు. ఈ పద్యం "అరిఁ జూచున్ హరిఁజూచు" అన్న నాచనసోమన్నగారి పద్యం కన్న ఎంతగానో అందగించింది.

ఈ క్రింది పద్యంలోని రూపకాలంకాల సమలంకరణ సౌభాగ్యాన్ని సమీక్షించండి-

**జ్యావల్లీధ్వని గర్జనంబుగ, సురల్ సారంగ యూథంబుగా,**
**నా విల్లింద్రశరాసనంబుగ, సరోజాక్షుండు మేఘంబుగా,**
**తా విద్యుల్లత భంగి నింతి సురజిద్దావాగ్ని మగ్నంబుగా,**
**ప్రావృట్కాలము సేసె బాణచయ మంభశ్శీకరశ్రేణిఁగాన్.** **10 ఉ. 182**

నారిధ్వని అను ఉరుముతోనూ, దేవతలు అనే చాతక సమూహంతోనూ, విల్లుఅనే ఇంద్రధనుస్సుతోనూ, కృష్ణుడు అనే నీలిమబ్బుతోనూ, సత్యభామ అనే మెఱపుతీగతోనూ, రాక్షసులు అనే దావాగ్నితోనూ, శర పరంపర అనే వర్షధారతోనూ ఆ సమరసమయం వర్షాసమయంగా మారి పోయిందట.

సత్య వదనం హరికి రాకేందు బింబంగానూ, అరికి రవిబింబం గానూ కనపడింది. సత్య చేలాంచలం హరికి కందర్ప కేతువుగానూ, అరికి ఘన ధూమకేతువుగానూ దర్శన మిచ్చింది. సత్యధనుస్సు హరికి భావజు పరిధిగానూ, అరికి ప్రళయార్కు పరిధిగానూ ప్రత్యక్షమైంది. సత్య సందర్శనం హరికి అమృత ప్రవాహంగానూ, అరికి అనల సందోహంగానూ అనిపించింది. సత్య బాణవృష్టి హరికి హర్షదాయిగానూ, అరికి మహారోషదాయిగానూ సాక్షాత్కరించింది.. శృంగార వీరరసాల సరస సమన్వయం ఈ క్రింది సీసపద్యంలో చోటుచేసికొన్నది. ఆచార్య క్షేమేంద్రుడు చెప్పిన రస సంకరౌచిత్యానికి ఎత్తిన పతాక ఈ పద్యం. ఇది అమూలకం.

**రాకేందు బింబమై రవిబింబమై యొప్పు**
**నీరజాతేక్షణ నెమ్మొగంబు;**
**కందర్ప కేతువై ఘనధూమకేతువై**
**యలరు పూఁబోడి చేలాంచలంబు;**
**భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై**
**మెఱయు నాకృష్ణమై మెలఁతచాప;**
**మమృత ప్రవాహమై యనల సందోహమై**
**తనరారు నింతి సందర్శనంబు;**
**హర్షదాయియై మహారోషదాయియై**
**పరగు ముద్దరాలి బాణవృష్టి;**

**హరికి నరికి చూడ సందంద శృంగార**
**వీరరసము లోలి విస్తరిల్ల.** **10 ఉ. 183**

మాటల్లో విరుపుపెట్టి మహార్థాన్ని సాధించటం మన మహాకవికి మంచినీళ్ల ప్రాయం.

**లేమా! దనుజుల గెలువఁగ**
**లేమా? నీవేల కడగి లేచితి? విటురా**
**లే! మాను! మానవేనిన్**
**లేమా! విల్లంది కొనుము లీలం గేలన్.** **10 ఉ. 172**

ఈ పద్యం వంపుసొంపులలో మొదటి పాదంలో పౌరుషం, రెండవ పాదంలో సందేహం. మూడవ పాదంలో నిషేధం, నాల్గవ పాదంలో అంగీకారం స్ఫురిస్తున్నాయి. ఇలాంటిదే ఇంకొక అందమైన కందం-

**కొమ్మా! దానవనాథుని**
**కొమ్మాహవమునకుఁ దొలఁగె, గురు విజయము గై**
**కొమ్మా! మెచ్చితి నిచ్చెద**
**కొమ్మాభరణములు నీవు కోరిన వెల్లన్.** **10 ఉ. 187**

ఇవే కాకుండా "బొమ్మ పెండ్లిండ్లకు పోనొల్ల నను బాల", "వీణచక్కఁగఁబట్ట వెర వెఱుంగని కొమ్మ", "సౌవర్ణ కంకణ ఝణ ఝణ నినదంబు" - ఇవన్నీ మూలంలో లేని పోతన్న గారి సొంత పద్యాలే.

ఇక శ్రీకృష్ణుని సందర్శించిన పాండవులు"ప్రాణంబుం గనిన యింద్రియముల భంగి" ఉన్నారన్నప్పుడు, నాగ్నజితి స్వయంపర సందర్భంలో అడ్డు వచ్చిన శత్రువులను అర్జునుడు "శశకంబుల సింహము చంపు కైవడి" చంపినా డన్నప్పుడు, బాణాసురుడి బారి నుండి అనిరుద్ధుణ్ణి కాపాడటానికి యాదవసైన్యాలు కృష్ణుని వెంట "భగీరథు రథము వెనుక ననుగమించు వియన్నది ననుసరించి" వస్తున్నా యన్నప్పుడు, వాసుదేవుడి సుదర్శన చక్రంవల్ల పౌండ్రకుడు "కులిశాహతిన్నొరగు శైలేంద్రాకృతిన్" నేలకూలాడన్నప్పుడు, ఉపమాలంకారం ఉప్పొంగి పోయింది.

నరకాసురుడు చెరసాలలో చింతాక్రాంతలై కాలం గడుపుతున్న కాంతలు పదహారువేలమందీ తమను చెర విడిపించిన శ్రీకృష్ణుడి దివ్య మంగళ స్వరూపాన్ని తిలకించి ఇలా పులకించిపోయారట-

**వనజాక్షి! నేఁ గన్క వై జయంతిక నైన**
**కదసి వ్రేలుదుగదా కంఠ మందు;**
**బింబోష్ఠి! నేఁ గన్క పీతాంబరము నైన**
**మెఱసి యుండుదు గదా మేను నిండ;**
**కన్నియ! నేఁ గన్క కౌస్తుభమణి నైన**
**నొప్పు చూపుదుగదా యురము నందు;**

**బాలిక! నేఁ గన్కఁ బాంచజన్యము నైన**
**మొనసి చొక్కుదు గదా మోవిగ్రోలి;**
**పద్మగంధి! నేను బర్హదామము నైన**
**చిత్రరుచుల నుందు శిరము నందు;**
**ననుచు పెక్కు గతుల నాడిరి కన్యలు**
**గములు గట్టి గరుడగమనుఁ జూచి.** **10 ఉ. 212**

జాగ్రత్తగా పరిశీలిస్తే ఇవన్నీ పరవశించిన పోతన్న గారి భావాలే అనిపిస్తాయి. ఈ సందర్భంలోనే మనం రెండు విషయాలు గుర్తించాలి. ఒకటి లోకకంటకుడైనప్పుడు కన్నకొడుకునైనా సరే కనికరింపక సంహరిస్తాననే శ్రీకృష్ణుని భగవత్తత్త్వం. రెండవది నరకుడు చెరపట్టిన కన్య లందరినీ తాను వివాహమాడి సంఘంలో వారికి సమున్నతస్థానము కల్పించిన మాధవుడి మహోదార స్వభావం. ఇక పోతన్న గారికి ఎంతో ఇష్టమైన అంత్యానుప్రాసల విలాసం ఈ క్రింది పంక్తుల్లో లాస్యం చేస్తుంది.

"ప్రభాత్త దిగంతము నా స్యమంతమున్."
"దుర్గన్ గృతకుశలమార్గం దోషిత భర్గన్."
"భామామనోహారికిన్ దనుజాధీశ విదారికిన్ హారికిన్."
"చక్రముం బరిహతదైత్య చక్రముఁ బ్రభాచయ మోదిత దేవశక్రమున్".
"హలిచే నాశ్రిత నిర్జర ఫలిచేఁ ద్రైలోక్య వీరభటగణ బలిచేన్."
"తపనుని బాలికన్ మదన దర్పణ తుల్య కపోలపాలికన్."
"మిత్రవిందను నిత్యాపూరిత సుజనానందన్ చారుచికుర కాంతి విజిత షట్పదబృందన్."
"వృషభంబులఁ బర్వత సన్నిభంబులన్."
"అరిగర్వ విమోచనుఁ బద్మలోచనున్."
"సమద మృగేక్షణన్ నయవిచక్షణ లక్షణఁ బుణ్యలక్షణన్."
"పాంచజన్యము విముక్త ప్రాణిచైతన్యమున్."
"ధాత్రీజనమాన్యలన్ గుణవతీ వ్రతధన్యల రాజకన్యలన్."
"చేతోధనచోరు రత్నమకుట స్ఫారున్ మనోహారునిన్."
"త్రిజగదభిరామ గుణధామ చారుసత్యభామ సత్యభామ."
"సద్ధర్మచారిణి విశ్లేషిణి వీతతోషిణి పురంధ్రీగ్రామణిన్ రుక్మిణిన్."
"ఖగవాహున్ రుచిరదేహుఁ గలితోత్సాహున్."
"అతిమృదువాణికిం గిసలయారుణ పాణికి నీలవేణికిన్."
"జితారిన్ హారిన్ సన్నుతసూరిన్ సీరిన్ రైవత సుతార్ద్ర చిత్త విహారిన్."
"సగణ స్థాణున్ నిర్దళితాసమబాణున్ దాండవధురీణు భక్తత్రాణున్."

“శశిరకర చారు రుచిరేఖ చిత్రరేఖ.”

“వనధిగభీరు నుదారుని ననిరుద్ధకుమారు విదళితాహితవీరున్.”

“కలిత పరిశుద్ధు నఖిలలోకప్రసిద్ధు చతురు ననిరుద్ధు నంగనాజన నిరుద్ధు.”

“జనసంతాప నివారకన్ సుజనభాస్వత్తారకన్ ద్వారకన్.”

“నిన్నుఁ జూడగంటి నీ కృప కనుఁగొంటి నఖిల సౌఖ్యపదవు లందఁగంటి.”

**కవి వ్యక్తిత్వ ముద్రను భద్రపరచుకొన్న ఈ క్రింది సూక్తుల సౌందర్యాన్ని సందర్శించండి-**

“అన్యుల యాచింపరు రాజన్యులు.”

“తరుణులు పెక్కండ్రయినను, పురుషుఁడు మనలేఁడు సవతిపోరాటమునన్.”

“ఎఱుక వలదె! నిర్జరేంద్రత కాల్పనే!”

“సిరియును వంశము రూపము సరియైన వివాహ సఖ్యసంబంధంబుల్ జరుగును.”

“ఎద్దు క్రొవ్వి పెలుచ న్నాబోతుపై ఱంకె వైచిన చందంబు.”

“పలుకుల తన్నుతా పొగడ పాతక మందురు.”

“గుణహీనజనుల తగునే తగులన్?”

“తల్లి వచనంబు కూఁతున కభిమతంబు గాదె!”

“వనజాసను కృతము గడచువా రెవ్వ రిలన్?”

“విప్రతతి సొమ్ము కంటెను విషము మేలు.”

“మఱపున ననలము ముట్టిన దరికొని వెసఁగాల్పకున్నె తను వెరియంగన్.”

“తను నమ్మినవారి విడువఁదగునే హరికిన్?”

చదివిన కొలదీ చవులూరించే జాతీయాలు కుప్పలు తెప్పలుగా కనువిందు కావిస్తాయి ఈ సంపుటంలో. చిత్తగించండి. నోచికాంచిన తల్లి, చన్నులు సేపు, బోర్కాడించు, చన్నిచ్చి నిద్రించు, గుండెల్ జల్లను, ఈ దేహము గాల్పనే, పదివేలు వచ్చె, గ్రుచ్చియెత్తి, క్రొత్త పెండ్లి కూఁతురు, కాలుద్రవ్వు, ముత్తునియలు, తిల లంతలు, బొమ్మపెండ్లిండ్లు, మగతనములు, పువ్వులు కురియు. గములు గట్టి, అడుగులొత్తు. దొడ్డుగ జూచు, చెక్కిట చెయ్యిచేర్చు, మోమరవాంచు, చిత్త మిగురొత్తు, నవ్వులకు నాడిన మాటలు, కోరిక లీరిక లెత్తు, పిల్లచెఱకీనిన కైవడి, తామర తంపర, చూపోపక, ఎకసక్కెము, కికురించు, మొగమోటము, పెట పెట పండ్లు కొఱుకు, కన్నుల నిప్పులుప్పతిల్లు, చెవులకు ములుకులు, ముఖంబున వ్రేలినయట్లు, కళవళమందు, సన్న లేఁజెమట, తొంగలి ఱెప్పలు, కన్నీటి వఱద, నునుసిగ్గు, కన్నీరు మున్నీరు, గుజ గుజ వోవు, చిందఱ వందఱ, కాందిశీకులు, మఱుఁగు సొచ్చు, ఎదురెదురే చూచు, అచ్చున నొత్తు; రింగులు వాఱు; గుండె లవియు, మిఱుమిట్లు గొలుపు, ఖణిల్లని ఱంకెవైచు, పీనుంగు పెంటలు, నెత్తుటజొత్తిలు, చక్కాడు, అల్లననవ్వు, ఏ దిక్కుగానక, కోయని యార్చు. తనయాడు గోపకుమారులు, చే చఱచు, ఒకానొక వేళ, సిగ్గువో దట్టు, పొరపొచ్చెము- ఇటువంటి తీయతీయని జాతీయాలు మన కవీంద్రుడి సహజపాండిత్యానికి నిదర్శనాలు.

ఇక కొన్ని విచిత్రపదప్రయోగాలు కూడా మనకు ఈ సంపుటంలో కనిపిస్తాయి. ఉదాహరణకు కుసుమముల ముసురు, విలసించు, లోని మేడ, ఇచ్చయింతురు, ముష్టాముష్టి, రాజబుషుల్, కచాకరషణముల్, లజ్జించు, అనురాగిల్లు, కనుమాయ, కుమారిక, ద్రొబ్బించు మొదలైనవి.

ఇటువంటి పోతన భాగవతాన్ని భావార్థ సహితంగా ప్రకటించి ఆంధ్రులకు అందించాలని తిరుమల తిరుపతి దేవస్థానంవారు సంకల్పించటం సర్వథా ప్రశంసనీయం. ఈ ఉద్దేశంతోనే పోతన భాగవతం ప్రాజెక్టు ప్రారంభ మయింది.

ఈ సందర్భంలో అనువాద భాగా లన్నింటినీ పరిష్కరించి ఏకసూత్రత కల్పించే బాధ్యత నా మీద ఉంచిన టి.టి.డి. కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం. వి. ఎస్. ప్రసాద్, ఐ.ఏ.ఎస్. గారికి, డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తి పి. ఆర్. ఓ గారికి, ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు గారికి నా ధన్యవాదాలు.

దశమస్కంధంలోని ఈ పద్యభాగాన్ని హృద్యమైన గద్యంలో అనువదించినవారు డాక్టర్ అమరేంద్రగారు. శ్రీ అమరేంద్ర అనేక కళాశాలల్లో ఆంగ్లశాఖాధిపతిగా, అధ్యక్షులుగా వ్యవహరించారు. వీరు ఆంగ్లభాషలోనూ, ఆంధ్రభాషలోనూ మధురాతి మధురంగా మాట్లాడ గలరు. "భావవీణ" వంటి వ్యాససంపుటులు, "చక్రవర్తి" వంటి నాటికా సంపుటులు, "ఇంద్రధనుస్సు" వంటి కథాసంపుటులు రచించారు. రవీంద్ర కవీంద్రుడి కమనీయ కవిత లెన్నింటినో ఆంధ్రీకరించారు. వీరి అనువాదం అన్యూనాతిరిక్తంగా, సహజసుందరంగా సాగిపోయింది.

సహస్రాక్షులై అక్షరదోషాలు దొర్లకుండా ప్రూఫులు సరిచూచిన పూజ్యమిత్రులు మహాకవి శ్రీముదివర్తి కొండమాచార్యులు గారికి నా అభివాదాలు. ముద్రణకు తగినట్లు ప్రెస్‌కాపీ సిద్ధంచేసి ఇచ్చిన చి॥ కోరాడ రామకృష్ణ, ఎం.ఫిల్ కు ఆశీస్సులు. ఈ సంపుటాన్ని ఇంత నిర్దుష్టంగా, ఇంత ముచ్చటగా ముద్రించి ఇచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ విజయకుమార్‌రెడ్డి గారికీ, వారి సిబ్బందికీ నా అభినందనలు.

పోతన భాగవత సంపుటాలను ఎంతో ఆదరాభిమానాలతో అందుకుంటున్న సహృదయులకు నా సాధువాదాలు.

భవదీయుడు

**కరుణశ్రీ**

ప్రధాన సంపాదకుడు
పోతన భాగవతం ప్రాజెక్టు

*కళ్యాణ భారతి*
రవీంద్రనగర్, గుంటూరు
28-2-92

# ప్రవేశిక

## *( 536 వ పద్యం నుండి 1342 వ పద్యం వరకు )*

సహృదయులకు స్వాగతం. ఇప్పుడు మీ కరకమలాలను అలంకరించింది పోతన భాగవతం దశమస్కంధంలోని ఉత్తరభాగం.

శ్రీమద్భాగవతంలో ఈ విధంగా చెప్పబడింది-

**రాజంతే తావదన్యాని పురాణాని సతాం గణే ।**
**యావద్భాగవతం నైవ శ్రూయతేఽమృతసాగరమ్ ॥**

భాగవతం అమృతసముద్రం వంటిది. ఈ భాగవతసుధ కర్ణగోచరం కానంతవరకే ఇతర పురాణాలు సత్పురుషుల లెక్కలోకి వస్తాయి. భాగవత విన్నాక తక్కిన పురాణాలపై మనస్సు పోదు.

**సర్వవేదాంతసారం హి శ్రీ భాగవత మిష్యతే ।**
**తద్రసామృత తృప్తస్య నాన్యత్ర స్యాద్రతిః క్వచిత్ ॥**

భాగవతం సర్వవేదాంతాల సారభూతం, ఈ భాగవత రసాస్వాదన చేసి సంతృప్తులైన వారికి అన్యత్ర ఆసక్తి ఏ మాత్రం ఉండదు.

**నిమ్నగానాం యథా గంగా దేవానా మచ్యుతో యథా**
**వైష్ణవానాం యథా శంభుః పురాణానా మిదం తథా ।**
**క్షేత్రాణాం చైవ సర్వేషాం యథా కాశీ హ్యనుత్తమా**
**తథా పురాణ వ్రాతానాం శ్రీమద్భాగవతం ద్విజాః ॥**

నదులలో గంగానది, దేవతలలో శ్రీమహావిష్ణువు, వైష్ణవులలో పరమశివుడు శ్రేష్ఠులైనట్లే సమస్త పురాణాలలో శ్రీమద్భాగవతం ఉత్తమమైనది.

సమస్త క్షేత్రాలలో కాశీక్షేత్రం ఉత్తమోత్తమం. అదేవిధంగా పురాణాలలో శ్రీమద్భాగవతం సర్వోత్తమం.

సూతులవారు భాగవత మహత్మ్యాన్ని పై విధంగా శౌనకాది మహర్షులకు వెల్లడించారు. అటువంటి మహిమాన్వితమైన భాగవతాన్ని బమ్మెర పోతన్నగారు ప్రసన్న మధురమైన శైలిలో ఆంధ్రులకు అందించారు.

ఈ భాగవత సంపుటంలో ద్వివిదవానర సంహారం, లక్షణా పరిణయం, శ్రీకృష్ణ దక్షిణనాయకత్వం, జరాసంధ వధ, శిశుపాల వధ, సాల్వసంహారం, దంతవక్త్రదమనం, విదూరరథవధ, బలరామతీర్థయాత్ర, కుచేలోపాఖ్యానం, శ్రీకృష్ణార్జునుల గ్రహణస్నానం, వసుదేవ యజ్ఞం, దేవకీ మృతపుత్ర ప్రదానం, సుభద్రా పరిణయం, శ్రుతదేవ బహుళాశ్వచరిత్రం, శ్రుతిగీతలు, వృకాసుర వధ, భృగుమహర్షి పరీక్ష, విప్రబాలక పునరుజ్జీవనం, యదువంశ వర్ణనం అనే ఘట్టాలు ఉన్నాయి.

నరకాసురుడి స్నేహితుడైన ద్వివిదుడనే వానరుడు కృష్ణుడు లేని సమయంలో ద్వారకానగరంలోకి ప్రవేశించి నానా బీభత్సం చేయసాగాడు. ఇంతలో అతనికి 'లలితవినీలవస్త్రుడు', 'విలాసవతీయుతుడు',

'చంద్ర చంద్రికాకలిత మహోన్నతాంగుడు', 'మణికాంచన దివ్య విభూషణోన్నతుడు', 'విలసిత వారుణీ సమద విహ్వల లోచనుడు' అయిన బలరాముడు కనిపించాడు. ఇంకేం! వాడిలోని సహజలక్షణం ఎలా విజృంభించిందో వీక్షించండి -

**కనుఁగొని తత్పురోగమ భూమిరుహశాఖ లెక్కి యూచుచు చాల వెక్కిరించు**
**కికురించుచును బం డ్లి గిల్చి చూపుచు వెస కొమ్మకొమ్మకు నుఱుకుచు నదల్చుఁ**
**దోఁక నూరక మేను సోఁకఁగ నులివెట్టు వెడవెడ నాలుక వెళ్ళఁబెట్టు**
**బరుల నఖంబుల గిరగిర గోఁకుచుఁ బొరిబొరి ఫలములు గఱచివైచు**
**గోళ్ళు తెగగొర్కి యుమియును గుదము సూపు, బలసి మర్కటజాతి య ప్పగిదిఁ జూప. 10-ఉ.544**

కోతి చేష్ట లంటామే- అవన్నీ అక్షరాలా వాడు బలరాముడి ముందు ప్రదర్శించాడు. కొమ్మ లెక్కి ఊగటం, వెక్కిరించటం, కవ్వించటం, ఇకిలించటం, దూకటం, తోక జాడించటం, నాలుక వెళ్ల బెట్టటం, గోళ్ళతో గీరటం, పండ్లు కొరికి విసరటం మొదలైన వికారాలన్నీ కళ్ళకు కట్టేలా వర్ణించారు పోతన్నగారు. చివరకు ద్వివిదుడు తన చేతిలోని మధుపాత్రను విసురుగా లాక్కొని నేలకు విసరికొట్టటంతో పట్టరాని కోపం వచ్చింది బలరాముడికి. ఆయన వెంటనే తనముసలంతో వాణ్ణి గట్టిగా ఒక్క పెట్టు పెట్టాడు.

బలరాముడి ముసలంపేరు మనకు ఎక్కడా కనపడదు. కాని ఇక్కడ పోతన్నగారు చెప్పారు దాని పేరు 'సునంద' అని. కొంతసేపు భీకర సమరం జరిగిన తరువాత బలరాముడు తనబలమైన చేతులతో ద్వివిదుడి మెడ బిగించి మట్టు పెట్టి ద్వారకా నగరవాసులను కాపాడాడు.

సర్వలక్షణ లక్షిత అయిన ఆ అమ్మాయి పేరు లక్షణ. భానుమతీ దుర్యోధనుల ప్రియపుత్రిక. జాంబవతీ శ్రీకృష్ణుల ముద్దుల కుమారుడైన సాంబుడు హస్తినాపురం వచ్చి సాహసంతో లక్షణను ఎత్తుకొని రథం మీద తీసుకుపోసాగాడు. కర్ణ శల్య భూరిశ్రవస దుర్యోధనాది మహావీరులందరూ అతణ్ణి వెన్నంటి శరపరంపరలు కురిపించారు.

**చండకోదండ ముక్త నిశాత విశిఖ, జాల మందంద వఱపి యాభీలముగను**
**నంద నందననందన స్యందనంబు, ముంచి రచలేంద్రమును ముంచు మంచు పగిది. 10-ఉ.562**

నందనందనుడు శ్రీకృష్ణుడు. నందనందన నందనుడు సాంబుడు. అతని రథాన్ని పర్వతాన్ని మంచు ముంచివేసినట్లు బాణపరంపరలతో కప్పివేశారట కురువీరులు. పర్వతం చుట్టూ మంచు ఏర్పడితే ఆ పర్వతం కంటికి కనిపించదు. అలాగే సాంబుడిరథం బాణసమూహంతో కప్పబడి పోయింది. ఇలా సరిగ్గా సరిపోయే ఉపమాలంకారాన్ని, ఇక్కడ నిపుణంగా ప్రయోగించారు పోతన్నగారు. అంతేకాదు. 'నందనందన నందన స్యందనంబు' అన్న శబ్దసంపుటిలోని వృత్త్యనుప్రాస సౌందర్యం అనుభవైకవేద్యం. ఈచిన్న తేటగీతిలోనే శబ్దాలంకారాన్నీ అర్థాలంకారాన్నీ ఒక దానికన్న ఒకటి మిన్నగా ప్రయోగించాడు మహాకవి.

ఎంత కష్టపడినా ఈ హేమాహేమీలు ఎవ్వరూ సాంబుణ్ణి ఎదుర్కొని **'వ్రేలును వంపగలేక'** సిగ్గుపడటం, చిట్టచివరకు అందరూ కలిసి ఒక్క మాటుగా చుట్టుముట్టి ఆ ఏ కైక వీరుణ్ణి బంధించటం, బంధువులతో యుద్ధం భావ్యం కాదనే భావంతో బలరాముడు పరిమిత పరివారంతో వచ్చి సాంబుణ్ణి విడిచిపెట్టుమని దుర్యోధనుడికి బోధించటం, అందుకు దుర్యోధనుడు **'చాలు పురే ఏమన గలదు కాలగతి! చక్కన కాలందొడుగు పాదుకలు తల కెక్కెన్'** అని దుర్భాషలాడుతూ దిగ్గున లేచి నిజమందిరానికి పోవటం; ఆ మాటలకు అదరిపడిన బలరాముడు-

**'తామఁట తలపం దలలఁట, యేమఁట పాదుకల మఁట గణింపఁగ రాజ్య**
**శ్రీ మదమున నిట్లాడిన యీ, మనుజాధముని మాట కేమనవచ్చున్'** **10-ఉ.585**

అని పరివారంతో పలికి ఆగ్రహోదగ్రుడై గంగలో కలుపుతానని నాగలితో హస్తినాపురాన్ని పెకలించటం, అప్పుడు మహాజలమధ్య విలోలంబగు నావచందంబున న న్నగరంబు వడవడ' వణకటం, 'కళవళంబున భయాకుల మానసులై అందరూ వచ్చి సాంబుణ్ణి లక్షణాసహితంగా సలక్షణంగా బలరాముడికి సమర్పించి సాష్టాంగ దండప్రణామాలు చేయటం,

**'రామ! సమంచిత ముక్తా, దామ! యశఃకామ! ఘనసుధాదామ రుచి**
**స్తోమ! జయసీమ! జగదభి, రామ! గుణోద్దామ! నిఖిలరాజలలామా!** **10-ఉ.589**

అని చేతులు మోడ్చి ప్రార్థించటం, 'ప్రముదితాత్మకు'డైన బలరాముడు 'ఇంక భయంబుదక్కి పొం' డని వారిని క్షమించటం, కొడుకును గోడలిం దోడ్కొనుచు పరమానందంబు నొందుచు' దుర్యోధను డిచ్చిన అరణంతో బలరాముడు ద్వారకానగరానికి చేరటం- ఇవన్నీ సహజపాండిత్యుడి నాటకీయశిల్పానికి నాణ్యమైన తార్కాణాలు.

భగవంతుడు కూడా మానవరూపం ధరించినప్పుడు మహర్షులకు సైతం నమస్కరించి మన్నించటమే మర్యాద. దేవర్షీ బ్రహ్మర్షీ అయిన నారదుడు పదహారువేలమంది భార్యామణులతో సాగిస్తున్న జగన్నాథుడి సంసారాన్ని సందర్శించాలని ద్వారకానగరానికి చేరుకున్నాడు. షోడశ సహస్రహర్మ్యాలు ఆయనకు కనువిందు చేశాయి. వెంటనే ఒక రాజభవనంలోకి ప్రవేశించాడు. ఆ దివ్యమందిరంలో ఒక కాంతతో 'కాంచన సింహాసనాసీనుడైన పుండరీకాక్షుడు నారదుణ్ణి చూచి ప్రత్యుత్థానం చేసి-

**మునివరు పాదాంబుజములు, తన చారుకిరీటమణివితానము సోఁకన్**
**వినమితుఁడై నిజసింహా, సనమునఁ గూర్చుండఁబెట్టి సద్వినయమునన్.** **10-ఉ.606**

**తన పాదకమలతీర్థం,బున లోకములం బవిత్రముగఁ జేయు పురా**
**తన మౌని లోకగురుఁ డ, మ్ముని పదతీర్థంబు మస్తమున ధరియించెన్.** **10-ఉ.607**

అంతే కాదు, 'ఏపని పంచినఁ జేయుదు తాపసవర!' అని కూడా అన్నాడు. ఆయనను అభినందించి నారదుడు మరొకయువతి ఇంటికి వెళ్ళాడు. అక్కడ ఆమెతో పాచికలాడుతూ ప్రత్యక్షమైనాడు పద్మాక్షుడు.

ఈ విధంగా **'ఇందు గలఁ డందు లేఁడని సందేహము వలదు'** అన్నట్లుగా పదహారువేలమంది భార్యల సౌధాలలోనూ పరిపరివిధాలుగా నారదుడికి దర్శనమిచ్చాడు శ్రీకృష్ణుడు. నారదమహర్షి సందేహం పటాపంచలయింది. ఆయన 'హృషీకేశు యోగమాయాప్రభావా'నికి ఆశ్చర్యచకితుడై-

**'నీ మాయ దెలియువారలె, తామరసానన సురేంద్ర తాపసులైనన్**
**ధీమంతులు నీభక్తి సు, ధామాధుర్యమునఁ బొదలు ధన్యులు దక్కన్.'** **10-ఉ.631**

అని స్తుతించి సెలవు తీసుకొన్నాడు.

జరాసంధుడు బంధించిన ఇరవై వేలమంది రాజులు తమ కష్టాలు వినిపించటానికి శ్రీ కృష్ణుడి వద్దకు ఒక బ్రాహ్మణుణ్ణి పంపుతారు. ఆ బ్రాహ్మణుడు శ్రీ కృష్ణుడిని దర్శించి వారి విషయాన్ని తెలిపి **'నీ దయ వారి ప్రాప్తం'** అంటాడు. అసలైన తెలుగుదనంతో చూడండి.-

**వారు పుత్తేర వచ్చినవాఁడ నేను; నరవరోత్తమ! నృపుల విన్నపము గాఁగ**
**విన్న వించెద నామాట; వినిన మీఁద, ననఘ! నీదయ వారి భాగ్యంబు కొలఁది.** **10-ఉ.645**

వారి ప్రార్థన మన్నించి భీముడిచేత జరాసంధవధ చేయించి బంధవిముక్తులను కావిస్తాడు శ్రీకృష్ణుడు.

పాత్రల స్వభావాన్ని పోతన్నగారు ఎంతజాగ్రత్తగా చిత్రిస్తారో చిత్తగించండి-

రాజసూయమహాసభలో సహదేవుడి సలహాప్రకారం శ్రీకృష్ణుడికి అగ్రపూజ కావించిన ధర్మరాజు **'ఆనందబాష్పజలబిందు కందళిత నయనారవిందంబుల గోవిందుని సుందరాకారంబు దర్శింపజాలకుండె'** అనటంవల్ల అతని అచంచల భక్తి విశ్వాసాలు ద్యోతక మైనాయి.

శిశుపాలుడు శ్రీకృష్ణుడి వైభవం చూచి సహింపలేక కోపంతో **'పీఠము డిగ్గి నిలిచి నిజహస్తము లెత్తి మనోభయంబు దక్కినవాడై'** సభాసదులతో -

**'చాలు పురే! యహహా! యీ కాలము గడవంగ దురవగాహంబగు; నీ**
**తేలా తప్పెను నేఁ డీ, బాలకు వచనములచేత ప్రాజ్ఞుల బుద్ధుల్?'** **10-ఉ.688**

అని ఆక్షేపించటంలో అతని వక్రబుద్ధి, అసూయ స్పష్టమైనాయి.

అలాగే శిశుపాలుడి నిరంతరమైన నిందావాక్యాలను పట్టించుకోకుండా **'విశ్రుతఫేరవ రావమాత్మ గైకొనని మృగేంద్రురీతి'** వ్యవహరించిన శ్రీకృష్ణుడి తీరు గాంభీర్యాన్నీ, ఉదాత్తతనీ వెల్లడిస్తున్నది.

ఇక **'పాములకు పాలుపోసి పెంచిన విషంబు దప్పునే!', ' శ్రీమదాంధులు సామంబుచేత చక్కఁబడుదురే', 'ధారుణిలోన వదాన్యుల కీరాని వదార్థ మొక్కటేనియుఁ గలదే?', 'ధర్మపాలనమునఁ గాక నిల్చునె కులంబు బలంబు చిరాయురున్నతుల్?', 'వనరుహనాభు దాస్యజన వర్యులకుం గలవే యసాధ్యముల్', 'గురుభజనంబు పరమధర్మంబు'** అన్న పంక్తులలోని సూక్తి సౌందర్యం స్మరింపదగింది.

ఈ భాగంలో చివరిదైన కుచేలోపాఖ్యానం అసలు సిసలైన సఖ్యభక్తికి అపూర్వమైన ఉదాహరణం. ఈ ఉపాఖ్యానం ప్రారంభంలోనే పరీక్షిత్ రాజేంద్రుడు శుకయోగీంద్రునితో ఇలా అంటాడు-

**హరి భజియించు హస్తములు హస్తము; లచ్యుతుఁగోరి మ్రొక్కు త**
**చ్ఛిరము శిరంబు; చక్రధరుఁ జేరిన చిత్తము చిత్త; మిందిరా**
**వరుఁ గను దృష్టి దృష్టి; మురవైరి నుతించిన వాణి వాణి; య**
**క్షరు కథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుఁబో భువిన్.** **10-ఉ.963**

ఈ పద్యం సరిగ్గా సప్తమస్కంధంలో హిరణ్యకశిపునితో ప్రహ్లాదుడు పలికిన-

**'కమలాక్షు నర్చించు కరములు కరములు శ్రీనాథు వర్ణించు జిహ్వ జిహ్వ'**

అన్న పద్యానికి ప్రతి ధ్వనిగా ఉన్నది. అంటే అది సీసం, ఇది చంపకం. దేని గొప్పతనం దానిదే.

మానధనుడు, విజ్ఞాని, రాగాది విరహితస్వాంతుడు, శాంతుడు, ధర్మవత్సలుడు, ఘనుడు, విజితేంద్రియుడు, బ్రహ్మవేత్త అయిన కుచేలుడు 'లలిత పతివ్రతాతిలకమైన భార్య కోరికపై దుస్సహదరిద్ర పీడ' వదిలించుకుందామని తన చిన్ననాటి చెలికాడైన శ్రీకృష్ణుడివద్దకు వెళ్ళాడు. ద్వారకానగరం చేరుకున్నాడు. రాజమార్గంలో పయనించి కక్ష్యాంతరాలు గడచి రుక్మిణీదేవి మందిరంలో హంసతూలికా తల్పంమీద 'మహితలావణ్య మన్మథ మన్మథు'డైన మాధవుణ్ణి దర్శించాడు. ఇక్కడ ఇరవైయేడు విశేషణాలతో ఆ స్వామిని మనముందు సాక్షాత్కరింపజేశారు. పోతన్నగారు తారకాసంఖ్యతో ఎంత తన్మయత్వంతో వర్ణించారో చిత్తగించండి-

**ఇందీవరశ్యాము వందితసుత్రాము, కరుణాలవాలు భాసురకపోలు**
**కౌస్తుభాలంకారు కామిత మందారు సురుచిరలావణ్యు సురశరణ్యు**
**హర్యక్షనిభమధ్యు నఖిలలోకారాధ్యు, ఘన చక్రహస్తు జగత్ప్రశస్తు**
**ఖగకులాధిపయాను కౌశేయపరిధాను, పన్నగశయను నబ్జాతనయను**
**మకరకుండల సద్భూషు మంజుభాషు, నిరుపమాకారు దుగ్ధసాగరవిహారు**
**భూరిగుణసాంద్రు యదుకులాంభోధిచంద్రు, విష్ణు రోజిష్ణు జిష్ణు సహిష్ణు కృష్ణు.** **10-ఉ.979**

ఇంతటి భగవంతుడు కూడా ఆ పేదవిప్రుణ్ణి, అశ్రాంత దారిద్ర్య పీడితుణ్ణి, కృశీభూతాంగుణ్ణి, జీర్ణాంబరుణ్ణి, ఘనతృష్ణాతురచిత్తుణ్ణి, హాస్యనిలయుణ్ణి, ఖండోత్తరీయుణ్ణి, కుచేలుణ్ణి, తన భక్తుణ్ణి, తన స్నేహితుణ్ణి అల్లంతదూరంలో చూచీ చూడగానే 'దళత్కంజాక్షు'డై, 'సంభ్రమవిలోలుం'డై, తల్పం దిగి ప్రేమతో ఎదురువెళ్ళి కౌగిలించుకొని వెంట బెట్టుకొని వచ్చాడు. హంసతూలికాతల్పంమీద ఆసీనుణ్ణి చేశాడు. కనకకలశజలంతో కాళ్లు కడిగాడు. ఆ పాదజలాన్ని తన తలపై తాల్చాడు. కస్తూరి కుంకుమద్రవం చందనం కలిపి మెల్ల మెల్లగా అలదాడు. శ్రమ పోయేలా తాళవృంతంతో విసిరాడు. 'బంధురామోదకలిత ధూపంబు' లొసగాడు. 'మించు మణిదీపముల' నివాళించాడు. 'సురభికుసుమమాలికలు', 'సిగముడిం'

దురిమాడు. 'కర్పూరమిళిత తాంబూల' మిచ్చాడు. 'ధేనువు నొసంగి' సాదరంగా స్వాగత మడిగాడు. రుక్మిణిదేవి వింజామరలు వీచింది. రంగధాముడు తనకు కావించిన రంగ రంగవైభోగానికి కుచేలుడు 'మేనం బులకాంకురంబు లంకురింప నానందబాష్పజలబిందు సందోహు' డైనాడు. భక్తుడికీ భగవంతుడికీ మధ్య ఉండే సంబంధం ఎంత సమున్నతమైందో, ఎంత ప్రగాఢమైందో, ఎంత అనిర్వచనీయమైందో ఈ సందర్భం మనకు బోధిస్తుంది. ఈ అద్భుత సన్నివేశాన్ని తిలకించి అంతఃపురకాంత లంతా-

**ఏమి తపంబు సేసెనొకో! యీ ధరణీదివిజోత్తముండు తొల్**
**బాముస యోగివిస్ఫుర దుపాస్యకుఁడై తనరారు నీజగత్**
**స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్న వాఁ;**
**డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్!** **10-ఉ.985**

అని తమలో తాము అనుకొన్నారట.

అనంతరం మురారి కుచేలుడి 'కరము కరంబునఁ దెమల్చి' చిన్నప్పటి సంగతులు ఎన్నెన్నో ముచ్చటించాడు. మాట్లాడటం మాధవుడి వంతు; మైమరచి వినటం కుచేలుడి వంతు అయింది. పదహారు గద్య పద్యాలలో మాధవుడి మధురాలాపాలు సాగితే కేవలం రెండు కంద పద్యాలు మాత్రం మన కుచేలుడు బదులు పలుకుగా పలికాడు. మౌనంగా మహదానందాన్ని అనుభవించటమే అతని పని.

చివరికి శ్రీకృష్ణుడు 'నా కోసం ఏం తీసుకువచ్చావయ్యా?' అని 'మందస్మిత వదనారవిందుడై' మిత్రుణ్ణి ప్రశ్నించాడు. పాపం ! ఏం చెబుతాడు కుచేలుడు? అది గమనించిన కృష్ణుడు-

**దళమైన పుష్పమైనను, ఫలమైనను సలిలమైన పాయని భక్తిం**
**గొలిచిన జను లర్పించిన, నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్.** **10-ఉ.1010**

అని అనునయంగా అన్నాడు. అప్పటికీ కుచేలుడు తన చినిగిన ఉత్తరీయపు చెంగున కట్టితెచ్చిన అటుకులను అర్పించలేక మొగమాటంతో ముఖం వంచుకున్నాడు. నవనీతచోరుడు ఊరకుంటాడా! చనువుగా కుచేలుడి చేలంలోని ముడి విప్పి అటుకులు చూచి 'ఇవియ సకలలోకంబులను నన్నును పరితృప్తిం బొందింపజాలు'నని పిడికెడు తీసుకొని ఆనందంతో ఆరగించాడు. అతనికి అష్టైశ్వర్యాలూ అనుగ్రహించాడు. మనోహరమైన మైత్రీ మాధుర్యానికి మరపురాని లక్ష్యలక్షణాలు కుచేలుడు శ్రీకృష్ణుడు. సఖ్యభక్తికి విఖ్యాతమైన సన్నివేశం కుచేలోపాఖ్యానం.

బలరామకృష్ణులు బంధుసమేతంగా గ్రహణస్నానం కోసం స్యమంత పంచకానికి విచ్చేసిన సందర్భంలో వారిని చూడటానికి యశోదానందులు గోపికలు, గోపకులు అందరూ వ్రేపల్లెనుండి వచ్చారు. ఎప్పుడో కంససంహారంకోసం వెళ్ళిన తరువాత ఎంతో కాలానికి బలరామకృష్ణులను యశోదానందులు మళ్ళీ ఇప్పుడు ఇక్కడ సందర్శించటం సంభవించింది. ఈలోగా ఎన్నెన్నో ఘనకార్యాలూ, శుభకార్యాలూ కూడా

జరిగిపోయాయి. వసుదేవుడు సముచిత మర్యాదలతో యశోదానందులను ఆదరించాడు. బలరామకృష్ణులు వినయంతో వారికి నమస్కరించారు. ఆనందం అర్ణవమైనప్పుడు నోటి వెంట అసలు పలుకేరాదు. చూడండి. ఇక్కడ పోతన్న గారి వర్ణన-

**'అట్లు నమస్కృతులు సేసి యాలింగనంబులు గావించి, నయనారవిందంబుల నానంద బాష్పంబులు దొరగ, నఱలేని స్నేహంబులు చిత్తంబుల నత్తమిల్ల, నేమియు బలుకకుండిరి.'**

అప్పుడు యశోదాదేవి బలరాముణ్ణీ, కృష్ణుణ్ణి దగ్గరకు తీసుకొంది. ఒడిలో కూర్చుండబెట్టుకుంది. చెక్కిళ్ళు ముద్దుపెట్టుకొంది. శిరస్సులు మూర్కొనింది. చిబుకాలు నిమిరింది. మళ్లీ మళ్లీ కౌగిలించుకొని పరమానందభరితురా లయింది. ఆ పెంపుడు తల్లి ప్రేమను కన్నతల్లి ప్రేమకన్న మిన్నగా ఎంత సహజంగా వర్ణించారో పోతన్న గారు!

అనంతరం వసుదేవుడి భార్యలైన దేవకీ రోహిణులు 'నందగోపసుందరి' అయిన యశోదతో ఇలా అన్నారు.-

**వరుఁడును నీవు బంధుజన వత్సలతన్ మునుచేయు సత్కృతుల్**
**మఱవఁగ వచ్చునే తలఁప మా కిఁక నెన్నటికిం దలోదరీ!**
**జననం బందుట మొదలుగ, ఘనమోహముతోడఁ బెంచుకతమునఁ దమకున్**
**జననీజనకులు వీరని, మనముల తలపోయలేరు మము నీ తనయుల్.**

**అంటిన ప్రేమను వీరిం, గంటికి ఱెప్పడ్డమైనగతి పెంపఁగ మా**
**కంటెన్ నెనరౌటను మీ, యింటన్ వసియించియుండి రిన్ని దినంబుల్.**

'యశోదా! బంధుత్వాన్ని పాటించి మీరు చేసిన ఉపకారాలు ఎలా మరువగలం? పుట్టినప్పటినుండి మా బిడ్డలను మీ దంపతులు ఎంతో ప్రేమతో పెంచారు. కంటికి రెప్పలాగా చూచుకొన్నారు. అందువల్లనే అమ్మానాన్న అంటే వీళ్ళు మిమ్మల్నే అనుకొంటారు గాని మమ్మల్ని అనుకోరు.'

ఇక కృష్ణుడితోడిదే లోకంగా భావించిన గోపికలు ఆ కల్యాణమూర్తిని కనుగొని కనురెప్పలు కూడా మూయలేక పోతున్నారట. దివ్య మంగళ విగ్రహుడైన ఆ గోపాలుణ్ణి తలచుకొంటూ పరబ్రహ్మాన్ని మనసులో నిలుపుకొని మైమరచే యోగులు లాగా ఉన్నారట.

**నళినదళాక్షుఁ జూచి నయనంబులు మోడ్వఁగఁ జాల కాత్మలన్**
**వలచి తదీయమూర్తి విభవంబు దలంచుచు కౌఁగిలించుచుం**
**బులకలు మేన జాదుకొన పొల్తులు చొక్కిరి బ్రహ్మమున్ మనం**
**బులఁ గని చొక్కు యోగిజనమున్ బురుడింపఁగ మానవేశ్వరా!** **10. ఉ.1068**

శ్రీకృష్ణుడి అష్టభార్యలలో చివరిదైన మద్రరాజకన్య లక్షణ ద్రౌపదికి తన వివాహవృత్తాంతం చెప్పటం ఎంతో ఆసక్తి దాయకంగా ఉన్నది. మత్స్యయంత్రం భేదించిన వీరుడికి తన కొమార్తె నిచ్చి వివాహం

చేస్తానని చాటించాడు మద్రభూపతి, కొందరు ధనుస్సు పట్టుకోలేక పోయారు. కొందరు పట్టుకున్నా ఎత్తలేక పోయారు. కొందరు ఎత్తినా నారి బిగించలేకపోయారు. కొందరు బిగించినా ఎక్కుపెట్టలేక పోయారు. కొందరు ఎక్కుపెట్టినా ఆ యంత్రాన్ని భేదించలేకపోయారు. ఇలా అందరూ నానావిధాలుగా అవస్థలు పడుతూ చివరికి 'ఇక్కడకు రావటం మనదే బుద్ధి తక్కువ' అనుకొన్నారట. స్వాభావికమైన మానవ మనస్తత్వ చిత్రణకు ఉదాహరణం ఈ పద్యం.

**కొందఱు పూనలేక చన; కొందఱు పూని కదల్చలేక పోఁ;**
**గొంద ఱొకింతయెత్త; నొకకొందఱు మోపిడలేక దక్కగాఁ**
**గొంద ఱొకింత యెక్కిడుచుఁ గోరి నృపాలకు లిట్లు సిగ్గునుం**
**జెంది తలంగి పోవుచును 'చీ యిట కేగుట నీతి త' ప్పనన్.** **10-ఉ.1090**

అప్పుడు-

**సరసిజపత్రలోచనుఁడు చాపము సజ్యముచేసి యుల్లస**
**చ్ఛర మరిఁబోసి కార్ముకవిశారదుఁడై యలవోక వోలె ఖే**
**చరమగు మీనముం దునిమె సత్వరతన్; సురసిద్ధ సాధ్య ఖే**
**చర జయశబ్ద మొప్ప పెలుచం గురిసెన్ దివి పుష్ప వర్షముల్.** **10-ఉ.1095**

శ్రీకృష్ణుడు అఘటనఘటనా సమర్థు డనడానికి ఒక ఉజ్జ్వలమైన ఉదాహరణ దేవకీ మృతపుత్ర ప్రదానం. దేవకీదేవి కంసుడి కరకుకత్తికి బలైపోయిన తన కన్నబిడ్డలు ఆరుగురినీ చూడా లనుకుంటుంది. కృష్ణుడికి తన కోరికను వెల్లడిస్తుంది. అప్పుడు కృష్ణుడు అమ్మకోరిక తీర్చటానికి అన్న బలరాముణ్ణి వెంటబెట్టుకొని సుతలలోకానికి వెళ్తాడు. అక్కడ బలిచక్రవర్తికి రామకృష్ణులు ఎలా దర్శనమిచ్చారో చూడండి.-

**కనియెన్ దానవుఁ డింద్రసేనుఁడు దళత్కంజాక్షులన్ దక్షులన్**
**ఘనసారాంబుదవర్ణులన్ నిఖిలలోకైక ప్రభాపూర్ణులం**
**దనరారన్ హలచక్రపాణులను భక్తత్రాణులన్ నిత్య శో**
**భన వర్ధిష్ణుల రామకృష్ణుల జయభ్రాజిష్ణులన్ జిష్ణులన్.** **10-ఉ.1141**

శాపవశాన తనకు పుట్టిగిట్టిన పుత్రులను ఆరుగురినీ అవలోకించి దేవకీదేవి-

**చన్నులు దిగ్గన చేపఁగ, కన్నుల నానంద బాష్పకణములు దొరఁగం**
**గ్రన్నన కౌఁగిట నిడి 'నను, గన్నన్నలు వచ్చి' రనుచు కౌతుక మొప్పన్.** **10-ఉ.1161**

పులకించిపోయిందట.

అర్జునుణ్ణి తిలకించిన 'ప్రకటసద్గుణభద్ర' అయిన సుభద్ర చూపుల్లో ముప్పిరిగొన్న మూడు భావాలనూ భద్రంగా పరికించండి-

**ఆ తరుణీశిరోమణియు నర్జును నర్జునచారుకీర్తి వి**
**ఖ్యాతుని నింద్రనందను నకల్మషమానసు కామినీమనో**
**జాతుని చూచి పుష్పశరసాయకజర్జరితాంతరంగయై**
**భీతిలియుండె సిగ్గుమురిపెంబును మోహముదేరు చూపులన్.** **10-ఉ.1171**

బ్రాహ్మణబాలకులను వెదకి తీసుకొని రావటానికి అర్జునుడితో కలిసి తన దివ్యరథాన్ని అధిరోహిస్తున్న శ్రీకృష్ణుడు ఉదయాద్రిపై కాలూనే సూర్యభగవానుడిలాగా ఉన్నాడట.

**సుందరదివ్యరత్న రుచిశోభితమై తనరారు కాంచన**
**స్యందన మంబుజాప్తుఁ డుదయాచలమెక్కు విధంబు దోఁప పౌ**
**రందరి దాను నెక్కి తనురశ్మిలు దిగ్వితతిన్ వెలుంగ గో**
**విందుఁ డుదారలీలఁ జనె విప్రతనూజ గవేషణార్థియై.** **10-ఉ.1303**

శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో పలుకుతున్నాడు. పరిశీలించండి -

**హరినామాంకితమైన గీత మొకమా టాలించి మూఢాత్ములున్**
**విరతిం బొందఁగఁ జాలకుందురఁట యా విశ్వాత్ము వీక్షించుచుం**
**బరిరంభించుచు నంటుచున్ నగుచు సంభాషించుచు న్నుండు సుం**
**దరు లానందనిమగ్నలౌట కిలఁ జోద్యంబేమి భూవల్లభా!** **10-ఉ.1325**

నిజమే. కృష్ణుడి పేరున్న పాట నొకదాన్ని వింటేనే ఎంత మూర్ఖులైనా ఆనందాన్ని పొందుతున్నప్పుడు ఆయనను ఆలింగనం చేస్తూ స్పృశిస్తూ హసిస్తూ భాషిస్తూ ఉండే కాంతలు ఆనందంలో మునిగిపోతారనటంలో సందేహం ఏముంది!

పోతన్నగారు దశమస్కంధాన్ని ముగిస్తూ ఇలా మంగళాశాసనం చేశారు.

**మనుజేంద్రోత్తమ! యేను నీకు త్రిజగన్మాంగల్యమై యొప్ప చె**
**ప్పిన యీ కృష్ణకథాసుధారసము సంప్రీతాత్ములై భక్తిఁ గ్రో**
**లిన పుణ్యాత్ములు గాంతు రిందు సుఖముల్ నిర్ధూతసర్వాఘులై**
**యనయంబుం దుదిగాంతు రచ్యుత పదంబైనట్టి కైవల్యమున్.** **10-ఉ-1336**

కృష్ణకథాసుధారసాన్ని ఆస్వాదించినవారు లోకంలో సుఖాలు పొందటమే కాక పునరావృత్తి రహితమైన కైవల్యాన్ని కూడా అందుకుంటారట. గ్రంథప్రారంభంలో 'శ్రీకైవల్యపదంబు చేరుటకునై' అని ప్రకటించిన ఆకాంక్షను మళ్లీ ఇక్కడ దశమస్కంధంలో మరచిపోకుండా పునరుద్ఘాటించారు పోతన్నగారు.

లలితస్కంధమై శ్రీకృష్ణమూలమై శుకాలాపాభిరామమై మంజులతా శోభితమై సువర్ణ సుమన స్సుజ్ఞేయమై సుందరోజ్జ్వల వృత్తమై విమల వ్యాసాలవాలమై మహాఫలమైన శ్రీమద్భాగవత కల్పవృక్షాన్ని సహజ పాండిత్యుడైన పోతనామాత్యుడు ఆంధ్రుల ముంగిట్లో సంస్థాపించారు.

భక్తి రససంభరితమూ, ప్రసన్నకవితాసంకలితమూ అయిన పోతన భాగవతం అందరికీ అందుబాటులో ఉండి అర్థం కావాలనే ఆశయంతో తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఈ మహాగ్రంథాన్ని ప్రతిపద్యభావార్థ సహితంగా ప్రకటించాలని దృఢసంకల్పంతో ముందుకు రావటం ముదావహమైన విషయం. ఈ సందర్భంలో పోతన భాగవతం పన్నెండు స్కంధాలకు విద్వాంసులచేత సరళగద్యానువాదాలు వ్రాయించారు. ఆ అనువాద భాగాలన్నింటినీ పరిశీలించి పరిష్కరించి వాటికి ఏక సూత్రత కల్పించే భారం నాకు అప్పగించారు. ఇందుకు కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.వి. ఎస్. ప్రసాద్. ఐ.ఏ.ఎస్. మహోదయులకూ, పౌరసంబంధాధికారి డాక్టర్ రావుల సూర్యనారాయణమూర్తి గారికీ, ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు, ఎం.ఎ. గారికీ అభినందనాలు.

ఈ సంపుటంలోని దశమస్కంధం శేషభాగాన్ని సరళగద్యంలో అనువదించినవారు శ్రీ డి. నాగసిద్ధారెడ్డిగారు. వీరు శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలలో ఆంధ్రోపన్యాసకులుగా, ఇన్‌చార్జి ప్రిన్సిపాలుగా ఉద్యోగించి పదవీవిరమణ చేసి ప్రస్తుతం టి.టి.డి. పుస్తక ప్రచురణ విభాగంలో సంపాదకులుగా ఉన్నారు.

శ్రీ డి. నాగసిద్ధారెడ్డిగారి అనువాదం సరళమైన శిష్టవ్యావహారికంలో సహృదయ హృదయంగమంగా సాగింది.

ఈ సంపుటాన్ని ఇంతముచ్చటగా ముద్రించి ఇచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ ఎం. విజయకుమార్‌రెడ్డి గారికీ, వారి సిబ్బందీకి నా సాధువాదాలు.

అక్షరదోషాలు దొర్లకుండా సహస్రాక్షులై ప్రూపులు సరిదిద్దిన పూజ్యమిత్రులు శ్రీముదివర్తి కొండమాచార్యుల వారికి నా ధన్యవాదాలు

ముద్రణకు తగునట్లు స్పష్టంగా నిర్దుష్టంగా ప్రెస్‌కాపీ సిద్ధం చేసి ఇచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఎ., ఎం. ఫిల్., కు నా ఆశీర్వాదములు.

***భవదీయుడు***

**కరుణశ్రీ**

ప్రధానసంపాదకుడు

పోతనభాగవతం ప్రాజెక్టు

# విషయసూచిక

## 10 వ స్కంధము - ఉత్తరభాగము ( 1 వ పేజీ నుండి 290 వ పేజీ వరకు)


| | |
|---|---|
| ప్రద్యుమ్నకుమార చరిత్ర ప్రారంభము | 1 |
| శతధన్వుఁడు సత్రాజితునిఁ జంపి మణి నపహరించుట | 17 |
| శ్రీకృష్ణుం డింద్రప్రస్థపురంబున కరుగుదెంచుట | 21 |
| శ్రీకృష్ణుండు కాళింది మిత్రవింద నాగ్నజితి భద్ర లక్షణ యను వారలఁ బరిణయ మాడుట | 26 |
| శ్రీకృష్ణుఁడు సత్యభామతోఁ గూడ నరిగి నరకాసురుని వధించుట | 31 |
| సత్యభామ నరకాసురునితో యుద్ధంబు సేయుట | 35 |
| భూదేవి శ్రీకృష్ణుని స్తుతించుట | 42 |
| శ్రీకృష్ణుండు పదారువేల కన్నియల వరించి దేవలోకమునకుఁ బోయి పారిజాతముఁ దెచ్చుట | 43 |
| శ్రీకృష్ణుండు కేళీగృహమునందు రుక్మిణీదేవితో విరసోక్తు లాడుట | 48 |
| రుక్మిణీదేవి శ్రీకృష్ణ లాలితయై యతని స్తుతించుట | 53 |
| కృష్ణుండు రుక్మిణీదేవి నూరడించుట | 57 |
| అనిరుద్ధుని వివాహసమయమున బలరాముండు రుక్మి మొదలగు వారినిం జంపుట | 61 |
| బాణాసురుం డీశ్వర ప్రసాదంబు నొందుట | 66 |
| బాణాసురుం డనిరుద్ధుని నాగపాశబద్ధునిఁ జేయుట | 80 |
| నారదునివలన వృత్తాంతమును విని కృష్ణుఁడు బాణాసురునిపై దండెత్తుట | 82 |
| బాణాసురునికి సహాయభూతుండగు శివునకు కృష్ణునకు యుద్ధ మగుట | 85 |
| బాణాసురుఁడు రెండవసారి యుద్ధమునకు వచ్చుట | 93 |
| శివుండు బాణుని రక్షింప శ్రీకృష్ణుని స్తుతించుట | 95 |
| ఉషానిరుద్ధ సహితుండై కృష్ణుండు ద్వారకాపురి కరుగుట | 98 |
| నృగమహారాజు చరిత్రము | 99 |
| బలరాముండు సుహృద్బంధుజన దర్శనార్థమై వ్రేపల్లెకుఁ బోవుట | 106 |
| కృష్ణుండు పౌండ్రకవాసుదేవునిపై దండెత్తిపోయి వానిఁ జంపుట | 112 |
| బలరాముండు ద్వివిదుఁడను వానరుని సంహరించుట | 119 |
| బలరాముండు హస్తినాపురమును గంగలోఁ ద్రోయ బూనుట | 123 |
| షోడశసహస్ర స్త్రీ సంగతుండైన శ్రీకృష్ణుని మహిమ నారదుం డరయుట | 131 |
| నారదుండు శ్రీకృష్ణునితో ధర్మరాజు రాజసూయము నెరవేర్పుమని చెప్పుట | 143 |
| శ్రీకృష్ణుఁ డుద్ధవుని యాలోచన చొప్పున ధర్మరాజు పాలికిఁ బోవుట | 146 |
| పాండవులు శ్రీకృష్ణు నెదుర్కొని తోడ్కొని పోవుట | 149 |

| | |
|---|---|
| ధర్మరాజు శ్రీకృష్ణు ననుమతంబున భీమాదుల దిగ్విజయమునకుఁ బంపుట | 152 |
| శ్రీకృష్ణ భీమార్జునులు జరాసంధుని వధింపఁ బోవుట | 156 |
| శ్రీకృష్ణ సహాయుండగు భీముండు జరాసంధునితో యుద్ధము సేయుట | 159 |
| కారాగృహ విముక్తులగు రాజులు శ్రీకృష్ణుని స్తుతించుట | 162 |
| ధర్మరాజు చేసెడి రాజసూయమునందు శ్రీకృష్ణుండు శిశిపాలుని వధించుట | 166 |
| సాల్వుండు శివప్రసాదంబున సౌభకవిమానంబు వడసి ద్వారకాపురిపై దండెత్తుట | 181 |
| శ్రీకృష్ణుండు దంతవక్త్రుని వధించుట | 197 |
| బలరాముండు తీర్థయాత్రకుఁ జనుట | 200 |
| కుచేలోపాఖ్యానము | 207 |
| శ్రీ కృష్ణుండు సకుటుంబముగా గ్రహణస్నానమునకుఁ బోవుట | 221 |
| లక్షణ యను శ్రీకృష్ణుని భార్య ద్రౌపదిదేవికిఁ దన వివాహవృత్తాంతంబు దెలుపుట | 230 |
| నారదాది మహర్షులు శ్రీకృష్ణు దర్శనంబు సేసికొని వసుదేవునిచేఁ గ్రతువు సేయించుట | 236 |
| శ్రీకృష్ణ బలభద్రులు మృతులైన తమ సహోదరులఁ దెచ్చి దేవకీ దేవికిఁ గనఁబఱచుట | 241 |
| సుభద్రా పరిణయము | 247 |
| శ్రీకృష్ణుండు ఋషిసమేతుండయి మిథిలా నగరమునకుఁ బోవుట | 250 |
| శ్రుతిగీతలు | 256 |
| పరీక్షిత్తునకు శుకయోగి విష్ణుసేవా ప్రాశస్త్యంబు సెప్పుట | 264 |
| శివద్రోహంబు సేయం బూనిన వృకాసురుండు విష్ణుమాయచే మడియుట | 266 |
| భృగుమహర్షి త్రిమూర్తుల ప్రాశస్త్యంబు శోధించుటకుఁ బోవుట | 271 |
| శ్రీకృష్ణుండు మృతులైన విప్రసుతులఁ దెచ్చుట | 274 |


## పదునోకండవ స్కంధము (291 వ పేజీ నుండి 340 వ పేజీ వరకు)


| | |
|---|---|
| ప్రవేశిక | 293 |
| పరిక్షిన్మహారాజు శుకయోగీంద్రు నడిగెడు ప్రశ్న | 295 |
| విశ్వామిత్ర వసిష్ఠ నారదాది మహర్షులు శ్రీ కృష్ణ సందర్శనంబునకు వచ్చుట | 297 |
| వసుదేవునకు నారదుండు పురాతనంబగు విదేహర్షభ సంవాదంబు దెలుపుట | 301 |
| బ్రహ్మాది దేవతలు శ్రీకృష్ణుని వైకుంఠమునకుఁ బిలువ వచ్చుట | 319 |
| కృష్ణుండు దుర్నిమిత్తములం గని యాదవుల నెల్ల ద్వారక నుండి ప్రభాసతీర్థమునకుఁ బంపుట | 320 |
| కృష్ణుం డుద్ధవునకు బరమార్థోపదేశము సేయుట | 321 |
| అవధూత - యదు సంవాదము | 323 |
| శ్రీకృష్ణ బలరాములు వైకుంఠమున కరుగుట | 336 |

## పండ్రెండవ స్కంధము (341 - 376)

| | |
|---|---|
| ప్రవేశిక | 343 |
| శుకయోగి పరీక్షిత్తునకు భావికాలగతులఁ జెప్పుట | 346 |
| యుగధర్మ ప్రాకృతాది ప్రళయ చతుష్టయ వివేచనము | 354 |
| పరీక్షిత్తు తక్షకునిచే దష్టుండై మృతినొంద నతని పుత్రుఁడు సర్పయాగము సేయుట | 359 |
| శ్రీ వేదవ్యాసుండు వేదములను, బురాణములను లోకమందుఁ బ్రవర్తింపఁజేయుట | 361 |
| మార్కండేయోపాఖ్యానము | 366 |
| చైత్రాదిమాసంబుల సంచరించెడు ద్వాదశాదిత్యుల క్రమంబును దెలుపుట | 370 |

# పోతన భాగవతము

## ఐదవ సంపుటము

### పదవ స్కంధము - ఉత్తరభాగము

# పోతన భాగవతము

(దశమ స్కంధము - ఉత్తర భాగం, ఏకాదశ, ద్వాదశ స్కంధములు)

ఐదవ సంపుటము

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# పోతన భాగవతము

## (సరళ గద్యానువాద సహితము)

## పదవ స్కంధము - ఉత్తరభాగము

**శ్రీకర! పరిశోషిత ర, త్నాకర! కమనీయగుణగణాకర ! కారు**
**ణ్యాకర! భీకరశర ధా, రా కంపిత దానవేంద్ర! రామనరేంద్రా!** 1

* లక్ష్మీసమన్వితుడవు, సముద్రమును ఇంకింపజేసినవాడవు, మనోహరమైన గుణగణములకు నిలయుడవు, కరుణాసముద్రుడవు, భయంకరమైన బాణవర్షముచే దానవులను కంపింపజేసేవాడవు ఐన ఓ రామచంద్రా! అవధరించు.

**వ. మహనీయ గుణగరిష్ఠులగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖిల పురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుం డిట్లనియె, నట్లుప్రాయోపవిష్టుండైన పరీక్షిన్నరేంద్రుండు రుక్మిణీపరిణ యానంతరంబున నైన కథావృత్తాంతం బంతయు వినిపింపు మనిన శుకయోగీంద్రుం డిట్లనియె.** 2

* సద్గుణసంపన్నులైన ఆ మునీంద్రులతో సకలపురాణములకు వ్యాఖ్యాత అయిన సూతుడు భాగవతకథను ఇలా కొనసాగించాడు. ప్రాయోపవేశం చేస్తున్న పరీక్షిన్మహారాజు రుక్మిణీ పరిణయం జరిగిన తర్వాత కథను వివరించమని అడుగగా శుకయోగి ఇలా చెప్పనారంభించాడు.

### -: ప్రద్యుమ్న కుమార చరిత్ర ప్రారంభము :-

**ఉ. తామరసాక్షునంశమున దర్పకుఁ డీశ్వరు కంటిమంటలం**
**దా మును దగ్ధుఁడై పిదపఁ దత్పరమేశుని దేహలబ్ధికై**
**వేముఱు నిష్ఠఁ జేసి హరివీర్యమునం బ్రభవించె రుక్మిణీ**
**కామిని గర్భమం దసురఖండను మాఱట మూర్తియో యనన్.** 3

* విష్ణుదేవుని కుమారుడైన మన్మథుడు పూర్వం పరమేశ్వరుని కంటిమంటలలో కాలిబూడిద అయిపోయిన తర్వాత ఈశ్వరుణ్ణి తన దేహంకోసం ప్రార్థించి రుక్మిణీకృష్ణులకు విష్ణుమూర్తి అపరావతారమో అనేటట్లు ఉద్భవించాడు.

**వ. అంత నా డింభకుండు ప్రద్యుమ్నుండను పేర విఖ్యాతుండయ్యె, నా శిశువు సూతికాగృహంబునఁ దల్లి పొదిఁగిట నుండం దనకు శత్రుండని యెఱింగి శంబరుండను రాక్షసుండు దనమాయా**

**బలంబునం గామరూపియై వచ్చి కొనిపోయి సముద్రంబులో వైచి తన గృహంబునకుం జనియె, నంత నా శాబకుండు జలధి జలంబునం దిగఁబడ నొడిసి యొక మహామీనంబు మ్రింగె, నందు.** 4

*ఆ బాలుడు ప్రద్యుమ్నుడు అనే పేరుతో ప్రఖ్యాతి చెందాడు. ఆ శిశువు పురిటి గృహంలో తల్లి పొత్తిళ్ళలో ఉండగా శంబరు డనే రాక్షసుడు కామరూపంలో వచ్చి ఆ బాలుణ్ణి అపహరించుకొని వెళ్లి సముద్రంలో పారవేశాడు. ఆ బాలుడు తనకు శత్రువని గ్రహించి శంబరుడు అలాచేశాడు. ఆ బాలుడు సముద్రజలాలలో పడి మునగగానే ఒక పెనుచేప అమాంతంగా అతణ్ణి మ్రింగివేసింది.

క. **జాలిఁ బడి పాఱు జలచర, జాలంబులఁ బోవనీక చని రోషాగ్ని**
**జ్వాలలు నిగుడఁగ నూరక, జాలంబులు వైచి పట్టు జాలరు లంతన్** 5

వ. **సముద్రంబులోన నా మీనంబును దత్సహచరంబులైన మీనంబులనుం బట్టికొని తెచ్చి శంబరునకుం గానికఁగా నిచ్చిన నతండు వండి తెండని మహానస గృహంబునకుం బంచిన.** 6

* జాలరులు వలలతో వెళ్ళి సముద్రంలోని జలచరాలను అటునిటు పారిపోనీయకుండా ప్రద్యుమ్నుని మ్రింగిన పెనుచేపతోపాటు మరికొన్ని చేపలను గూడా పట్టుకొని శంబరునకు కానుకగా సమర్పించారు. శంబరుడు ఆ చేపలను వండితెమ్మని వంటశాలకు పంపించాడు.

క. **రాజునగరి యడబాలలు, రాజీవముకడుపు వ్రచ్చి రాజనిభాస్యున్**
**రాజశిశువుఁ గని చెప్పిరి, రాజీవదళాక్షియైన రతికి నరేంద్రా!** 7

* వంటవారు ఆ చేప కడుపు కోయగా చంద్రబింబంతో సమానమైన ముఖంతో విలసిల్లుతున్న బాలుడు కనిపించాడు. వారు ఈ విషయాన్ని రతిదేవికి విన్నవించారు.

వ. **అంత నారదుండు వచ్చి బాలకుని జన్మంబును శంబరోద్యోగంబును మీనోదరప్రవేశంబునుం జెప్పిన విని యా రతి మాయావతి యను పేర శంబరునియింట, బాతివ్రత్యంబు సలుపుచు దహనదగ్ధుం డయిన తన పెనిమిటి శరీరధారణంబు సేయుట కెదురు చూచుచున్న యది గావున, న య్యర్భకుండు దర్పకుం డని తెలిసి మెల్లన పుత్రార్థినియైన తెఱంగున శంబరుని యనుమతి వడసి సూపకారుల యొద్ద నున్న పాపనిం దెచ్చి పోషించుచుండె, నా కుమారుండును శీఘ్రకాలంబున నారూఢ యౌవనుండై.** 8

* అంతకుముందే నారదమహర్షి రతిదేవికి ఆ బాలుని పుట్టుకనూ, శంబరుని ప్రయత్నాన్ని, బాలుణ్ణి చేప మ్రింగడం చెప్పాడు. శంకరుని కంటిమంటల కాహుతియై పోయిన తన భర్త ఎప్పుడు సశరీరంగా సాక్షాత్కరిస్తాడా అని ఎదురుచూస్తూ శంబరుని గృహంలో మాయావతి అనే పేరుతో నీతిగా జీవిస్తున్న రతీదేవి ఆ బాలుడు మన్మథుడే అని తెలుసుకొన్నది. పుత్రార్థిని వలె శంబరుని యనుమతితో ఆ బాలుని వంటవారి దగ్గరనుండి తీసుకొని పోషింపసాగింది. ఆ బాలుడు శీఘ్రకాలంలో యౌవనవంతు డయ్యాడు.

క. **సుందర మగు తన రూపము సుందరు లొకమాఱు దేఱి చూచినఁ జాలున్**
**సౌందర్య మేమి చెప్పను?, బొందెద మని డాయుబుద్ధిఁ బుట్టించు నృపా!** 9

* ఓపరీక్షిన్మహారాజ! ప్రద్యుమ్నుని చక్కదనం ఒక్కమాటు చూచిన సుందరీమణులకు అతనితో కామసౌఖ్యా లనుభవించాలనే కోరిక కలుగుతుంది. ఇక అతని సౌందర్యాన్ని వేరే వర్ణించడ మెందుకు?

**సీ. చక్కని వారలు చక్కఁదనంబున కుపమింప నెవ్వండు యోగ్యుఁడయ్యె**
**మిక్కిలి తపమున మెఱయు నంబికకునై శంకరు నెవ్వండు సగము సేసె!**
**బ్రహ్మత్వమును బొంది పరఁగు విధాతను వాణికై యెవ్వఁడు వావి సెఱిచె!**
**వేయిడాఁగులతోడి విబుధలోకేశుని మూర్తికి నెవ్వఁడు మూల మయ్యె!**

**తే. మునుల తాలిమి కెవ్వఁడు ముల్లుసూపు, మగల మగువల నెవ్వండు మరులుకొలుపు!**
**గుసుమధనువున నెవ్వండు కొను విజయము, చిగురువాలున నెవ్వండు సిక్కువఱుచు? 10**

**వ. అని తన్ను లోకులు వినుతించు ప్రభావంబులు గలిగి పద్మదళలోచనుండును, బ్రలంబబాహుండును, జగన్మోహనాకారుండును నైన పంచబాణునిం గని లజ్జాహాస గర్భితంబులైన చూపులం జూచుచు మాయావతి సురతభ్రాంతిఁ జేసినం జూచి ప్రద్యుమ్నుం డిట్లనియె. 11**

* సౌందర్యవంతుల అందచందాలను వర్ణించేందుకు ఉపమానంగా చెప్పడానికి యోగ్యుడూ, తపోనిష్ఠతో విరాజిల్లు పరమేశ్వరుణ్ణి పార్వతీదేవి కోసం అర్ధనారీశ్వరుణ్ణి చేసినవాడూ, బ్రహ్మతేజస్సుతో విలసిల్లే బ్రహ్మదేవుణ్ణి సరస్వతీదేవికోసం వావివరుసలు మరచిపోయేటట్లు గావించినవాడూ, దేవేంద్రుని వేయికళ్ల వేల్పుగా నిలిపినవాడూ, మునీంద్రుల ధైర్యాన్నిసైతం చెదరగొట్టగలవాడూ, స్త్రీ పురుషుల కొకరిపై మరొకరికి ప్రేమభావం కల్గించేవాడూ, చెరకువింటితో ప్రపంచాన్ని జయించ గలిగినవాడూ, చిగురుటాకు అనేబాకుతో లోకులను చీకాకుపరచి చిక్కులపాలు గావించేవాడూ అని తనను జనులు స్తుతించేటంతటి ప్రభావం కలిగినవాడు ఆ ప్రద్యుమ్నుడు. తామరరేకుల వంటి నేత్రాలతో, ఆజానుబాహువులతో ప్రపంచాన్ని సమ్మోహితం చేయగల ఆకారవిశేషంతో అలరారే మన్మథుణ్ణి మాయావతి సిగ్గుతో చిరునవ్వుతో గూడిన చూపులతో ఆకట్టుకోవడానికి ప్రయత్నించింది. అప్పుడు ప్రద్యుమ్నుడు ఆమెతో ఇలా అన్నాడు.

**మత్త. 'నా తనూభవుఁ డీతఁ డంచును నాన యించుక లేక యో**
**మాత నీ విదియేమి? నేఁ డిటు మాతృభావము మాని సం**
**ప్రీతిఁ గామినిభంగిఁ జేసెదు పెక్కు విభ్రమముల్? మహా**
**ఖ్యాతవృత్తికి నీకు ధర్మము గాదు మోహము సేయఁగాన్.' 12**

* ఓ తల్లీ! నేను నీ కుమారుడ ననే భావం లేక సిగ్గు వీడి కామిని ప్రవర్తించినట్లు ప్రవర్తిస్తున్నావు. మాతృభావం వదిలివేశావు. నీ విట్లు నన్ను మోహించుట ధర్మబద్ధమైన కార్యము కాదు.

**వ. అనిన రతి యిట్లనియె: "నీవు నారాయణ నందనుండవైన కందర్పుండవు, పూర్వకాలంబున నేను నీకు భార్యనైన రతిని. నీవు శిశువై యుండునెడ నిర్దయుండై దొంగిలి తల్లిం దొఱంగఁజేసి శంబరుండు కొనివచ్చి నిన్ను నీరధిలో వైచిన నొక్కమీనంబు మ్రింగె; మీనోదరంబు వెడలితీవు, మీఁదటి కార్య మాకర్ణింపుము. 13**

* ఈ విధంగా పలికిన ప్రద్యుమ్నునితో రతిదేవి ఇట్లన్నది. నీవు విష్ణుమూర్తి పుత్రుడవైన మన్మథుడవు. గతజన్మలో నేను నీ భార్యనైన రతిదేవిని. నీవు బాలుడవై యుండగా దయలేనివాడై శంబరుడు నిన్ను తల్లికి వేరుచేసి తెచ్చి సముద్రంలో పారవేశాడు. అప్పుడు నిన్నొక మీనం మ్రింగింది. ఆ చేప కడుపునుండి నీవు బయట పడ్డావు. తర్వాతి విషయం విను.

**క. మాయావి వీఁడు దుర్మతి, మాయఁడు సంగరములం దమర్త్యుల గెలుచున్**
**మాయికరణమున వీనిన్, మాయింపుము మోహనాది మాయలచేతన్.** 14

* ఈ శంబరుడు మాయలమారి. దుర్మార్గుడు. యుద్ధాలలో దేవతలను జయించాడు. ఇతణ్ణి సమ్మోహనాది మాయలతో నీవు సంహరించు.

**మత్త. పాపకర్ముఁడు వీఁడు ని న్నిఁట బట్టి తెచ్చిన లేచి 'నా**
**పాపఁ డెక్కడఁ బోయెనో? సుతుఁ బాపితే విధి 'యంచుఁ దా**
**గ్రేపుఁ బాసిన గోవుభంగిని ఖిన్నయై పడి గాధ సం**
**తాపయై నిను నోఁచి కాంచిన తల్లి కుయ్యిడ కుండునే?** 15

* పాపాత్ముడైన శంబరుడు నిన్ను అపహరించి తెచ్చిన తర్వాత నీ తల్లి లేగను బాసిన గోవువలె నా కుమారు డే మయ్యాడో? దేవుడా? నన్ను నా కుమారుడికి దూరం చేశావా? అని ఎంతగానో దుఃఖించి వుండదా?

**వ. అని పలికి మాయావతి మహానుభావుండైన ప్రద్యుమ్నునికి సర్వశత్రుమాయావినాశి యయిన మహామాయావిద్య నుపదేశించె: ని వ్విధంబున.** 16

* ఈ విధంగా చెప్పి మాయావతి మహానుభావుడైన ప్రద్యుమ్నునికి సర్వశత్రువుల మాయలను మాయింపజేయ గల "మహామాయ"అనే విద్యను ఉపదేశించింది.

**మ. గురుమాయారణవేదియై, కవచియై, కోదండియై, బాణియై**
**హరిజుం డోరి నిశాట! వైచితివి నాఁ డంభోనిధిన్ నన్ను ఘో**
**ర రణాంభోనిధి వైతు నిన్ను నిదె వే రమ్మంచుఁ జీరెన్ మనో**
**హర దివ్యాంబరు నుల్లస ద్దనుజ సేనాడంబరున్ శంబరున్.** 17

* ఈవిధంగా మాయాయుద్ధ ప్రవీణుడైన ప్రద్యుమ్నుడు కవచమును ధరించి, ధనుర్బాణములను చేత దాల్చాడు. మనోహరమైన వస్త్రాలంకారాలతో దానవసేనా సమూహంతో విలసిల్లుతున్న శంబరుణ్ణి ఓరీ! రాక్షసా! ఆ నాడు నన్ను సముద్రంలో పారవేశావు. ఈనాడు నిన్ను యుద్ధసముద్రంలో పడవేస్తాను. వేగంగా రారా! అని పిలిచాడు.

**చ. అదలిచి యిట్టు కృష్ణసుతుఁ డాడిన నిష్ఠుర భాషణంబులం**
**బదహతమై వడిం గవియు పన్నగరాజముఁ బోలి శంబరుం**

డదరుచు లేచి వచ్చి గద నచ్యుతనందను వ్రేసె నుజ్జ్వల
ద్భిదురకఠోరఘోష సమభీషణనాదము చేసి యార్చుచున్. 18

* ఈ విధంగా తన్ను ప్రద్యుమ్నుడు దూషణవాక్యాలు పలుకగా తోకతొక్కిన సర్పంలాగా దర్పంతో విజృంభించి శంబరుడు పిడుగుపడి నట్లు కఠోరంగా గర్జిస్తూ తన గదాదండంతో ప్రద్యుమ్నుణ్ణి కొట్టాడు.

క. దనుజేంద్రుఁడు వ్రేసిన గదఁ, దన గదచేఁ బాయ నడిచి దనుజులు బెదరన్
దనుజాంతకుని కుమారుఁడు, దనుజేశుని మీఁద నార్చి తన గద వైచెన్. 19

* ప్రద్యుమ్నుడు రాక్షసరాజు గదను తన గదతో భగ్నంచేసి రాక్షసులు భయం చెందేటట్లుగా తన గదతో రాక్షసుణ్ణి మోదాడు.

వ. అంత నారక్కసుండు వెక్కసంబగు రోసంబునఁ దనకు దొల్లి మయుం డెఱింగించిన దైతేయమాయ నాశ్రయించి మింటికి నెగసి పంచబాణునిపై బాణవర్షంబు గురిసిన నమ్మహారథుండు నొచ్చియు సంచలింపక మచ్చరంబున సర్వమాయా వినాశిని యైన సాత్త్విక మాయం బ్రయోగించి దనుజుని బాణవృష్టి నివారించె. మఱియు వాఁడు భుజగ గుహ్యక పిశాచ మాయలు పన్ని నొప్పించిన నన్నియుం దప్పించి. 20

* అప్పుడు శంబరుడు మిక్కిలి రోషంతో తనకు పూర్వం మయుడు నేర్పిన రాక్షసమాయతో ఆకాశంలోకి ఎగిరి ప్రద్యుమ్నునిపై బాణవర్షం కురిపించాడు. ప్రద్యుమ్నుడు బాణవర్ష బాధకు ఓర్చుకొని సర్వమాయలను నశింపజేయగల సాత్త్వికమాయ అనే విద్యను ప్రయోగించి శంబరుని శరవర్షాన్ని ఆపగలిగాడు. మళ్ళీ శంబరుడు ఎన్నో పిశాచమాయలను గుప్పించి నొప్పించాడు. ఆ మాయల నన్నిటినీ ప్రద్యుమ్నుడు తప్పించుకున్నాడు.

క. దండధరమూర్తిఁ గై కొని, యొండాడక చక్రిసూనుఁ డుగ్రతరాసిన్
ఖండించె శంబరుని తలఁ, గుండల కోటీరమణులు గుంభిని రాలన్. 21

* శ్రీకృష్ణుని కుమారుడగు ప్రద్యుమ్నుడు యమధర్మరాజువలె భయంకరరూపము ధరించి పదునైన తన ఖడ్గంతో శంబరుని శిరస్సు ఖండించాడు. కిరీటకుండలాలతో గూడిన ఆ శిరస్సు నేలరాలింది.

క. చిగురాకడిదపు ధారను, జగములఁ బరవశము సేయు చలపాదికి దొ
డ్డగు నుక్కడిదంబునఁ దన, పగతుం దెగవ్రేయు టెంత పని చింతింపన్? 22

* చిగురాకు కత్తితోనే ప్రపంచాన్ని జయింపగల సమర్థునికి ఉక్కుకత్తితో శత్రువు శిరస్సు ఖండించటం ఏమంత గొప్పపని?

క. బెగడుచు నుండఁగ శంబరుఁ, దెగడుచుఁ బూవింటిజోదు ధీర గుణంబుల్
వొగడుచు గురిసిరి ముదమున, నెగడుచుఁ గుసుమముల ముసురు నిర్జరు లధిపా! 23

* దేవతలు శంబరుణ్ణి నిందిస్తూ, ప్రద్యుమ్నుని ధైర్యాన్ని అభినందిస్తూ ఆనందంతో పూలవాన కురిపించారు.

వ. ఇట్లు శంబరుని వధియించి విలసిల్లుచున్న ఇంచువిలుకానిం గొంచు నాకాశచారిణియైన యా రతీదేవి గగనపథంబుఁ బట్టి ద్వారకానగరోపరిభాగమునకుం జనుదెంచిన. 24

* ఈ విధంగా శంబరుణ్ణి సంహరించి శోభిస్తున్న ప్రద్యుమ్నుణ్ణి తీసికొని రతిదేవి ఆకాశమార్గంగుండా ద్వారకానగరానికి వచ్చింది.

ఆ. మెఱుఁగుఁదీగెతోడి మేఘంబుకై వడి, యువిదతోడ మింటి నుండి కదలి
యరుగుదెంచె మదనుఁ డంగనాజనములు, మెలఁగుచున్న లోని మేడకడకు. 25

*రతిదేవితో కూడిన ప్రద్యుమ్నుడు మెరపుతీగతో గూడిన మేఘంలా శోభించుతూ ఆకాశంలో నుండి దిగి స్త్రీలు నివసించే మేడదగ్గరకు చేరాడు.

మ. జలదశ్యాముఁ బ్రలంబబాహుయుగళుం జంద్రాననున్ నీల సం
కులవక్రాలకుఁ బీతవాసు ఘనవక్షున్ సింహ మధ్యున్ మహో
త్పల పత్త్రేక్షణు మందహాసలలితుం బంచాయుధున్ నీరజా
క్షులు దా రేమఱుపాటఁ జూచి హరి యంచుం డాఁగి రయ్యె యెడన్. 26

* మేఘమువలె నీలవర్ణం, ఆజానుబాహువులు, చంద్రునిబోలిన నెమ్మొగం, నల్లని ఉంగరాల ముంగురులు, పచ్చని వస్త్రం, విశాలవక్షః స్థలం, సన్నని నడుము, కలువరేకులవంటి కన్నులు, మృదువైన చిరునవ్వుగల ప్రద్యుమ్నుని అచ్చటి స్త్రీలు ఏమరుపాటుగా చూచి శ్రీకృష్ణుడని భ్రమించి అచ్చటచ్చట దాక్కున్నారు.

క. కొందఱు హరి యగు నందురు, కొందఱు చిహ్నములు కొన్ని కొన్ని హరికి లే
వందురు మెల్లనె తెలియుద, మందురు మరుఁ జూచి కొంద ఱబలలు గుములై. 27

*"ప్రద్యుమ్నుని గాంచి కొందరు స్త్రీలు శ్రీ కృష్ణుడే అని అనగా మరికొందరు శ్రీకృష్ణునిలో ఇతనిలోని కొన్ని లక్షణాలు లేవని అన్నారు. ఇంకా కొందరు నెమ్మదిగా ఈవిషయం తెలుసుకుందామని గుంపులు గుంపులుగా చేరారు.

క. హరి యని వెనుచని పిదపన్, హరిఁ బోలెడువాఁడు గాని హరి గాఁ డనుచున్
హరిమధ్య లల్లనల్లన, హరినందను డాయ వచ్చి రాశ్చర్యమునన్. 28

*శ్రీకృష్ణుడే అని కొంతదూరం వెళ్ళి శ్రీకృష్ణునిలా ఉన్నాడేగాని శ్రీకృష్ణుడు కాడని భావించి ద్వారకానగర స్త్రీలు శ్రీకృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుని సమీపించారు.

ఉ. 'అన్నులు సేర వచ్చి మరు నందఱుఁ జూడఁగఁ దాను వచ్చి సం
పన్నగుణాభిరామ హరిపట్టపుదేవి విదర్భపుత్త్రి క్రే

గన్నుల నా కుమారకుని కై వడి నేర్పడఁ జూచి బోటితోఁ
జన్నులు సేఁప నిట్లనియె సంభ్రమదైన్యము లుల్లసిల్లఁగన్. 29

* స్త్రీలందరూ ప్రద్యుమ్నుని చూడరాగా శ్రీకృష్ణుని పట్టపుదేవి, సుగుణాలదీవి అయిన రుక్మిణీదేవి క్రీగంటితో ఆ కుమారుని రూపురేఖలను చూచి పాలిండ్లు చేపగా దైన్యసంభ్రమాలతో చెలికత్తెతో ఇలా అంది.

శా. 'ఈ కంజేక్షణుఁ డీ కుమారతిలకుం డీ యిందుబింబాననుం
డీ కంఠీరవమధ్యుఁ డిచ్చటికి నేఁ డెందుండి యేతెంచెనో
యీ కల్యాణునిఁ గన్న భాగ్యవతి మున్నేనోములన్ నోఁచెనో
యే కాంతామణియందు వీని కనెనో యేకాంతుఁ డీకాంతునిన్. 30

* చెలీ! పద్మనేత్రుడు, చంద్రముఖుడు, సింహమధ్యుడు అయిన ఈ సుకుమారుడు ఇక్కడకు ఎక్కడినుండి వేంచేశాడో, ఈ బాలుని గన్న భాగ్యవతి పూర్వజన్మలో ఏ నోములు నోచిందో? ఏ కాంతుడు ఏ కాంతామణియందు ఈ కాంతుని కాంచెనో!

శా. ఆళీ! నా తొలుచూలి పాపనికి బోర్కాడించి నే సూతికా
శాలా మధ్యవిశాల తల్పగతనై చన్నిచ్చి నిద్రింప నా
బాలున్ నా చనుఁబాలకుం జెఱిచి యే పాపాత్ము లే త్రోవ ము
న్నే లీలం గొనిపోయిరో? శిశువుఁ దా నే తల్లి రక్షించెనో! 31

* ఓ చెలీ! నా తొలిచూలుబాలునికి స్నానం చేయించి పురిటిగదిలో మంచంపై పరుండి చన్నిచ్చి నిద్రించే సమయంలో ఏ పాపాత్ములు నా పుత్రుని నా చనుబాలకు దూరంచేసి ఏ విధంగా దొంగిలించుకొని వెళ్ళారో? ఆ పిల్లవాణ్ణి ఏ చల్లని తల్లి రక్షించినదో?

క. కొడుకఁడు నా పొదిగిఁటిలోఁ, జెడిపోయిన నాఁట నుండి చెలియా! తెలియం
బడ దే వార్తయు నతఁ డే, వడువున నె చ్చోట నిలిచి వర్తించెడినో! 32

నా కుమారుడు నా పొత్తిళ్ళనుండి దూరమైన నాటినుండి ఏ వార్తయునూ తెలియలేదు. ఆ నా బాలుడు ఏ విధంగా ఎక్కడ జీవిస్తున్నాడో గదా?

క. ఇందాకఁ వాఁడు బ్రదికిన, సందేహము లేదు దేహచాతుర్యవయ
స్సౌందర్యంబుల లోకులు, వందింపఁగ నితనియంతవాఁ డగుఁ జుమ్మీ! 33

* ఇప్పటిదాకా ఆ బాలుడు బ్రతికి ఉంటే వయోరూప రేఖావిలాసాలలో ఆ యువకు నంతటివాడై ఉండేవాడు సుమా!

మ. అతివా! సిద్ధము నాఁటి బాలకున కీయాకార మీ వర్ణ మీ
గతి యీ హాసవిలోకనస్వరము లీ గాంభీర్య మీ కాంతి వీఁ

డతఁడే కాఁదగు నున్నవారలకు నా యాత్మేశు సారూప్య సం
గతి సిద్ధింపదు, వీనియందు మిగులం గౌతూహలం బయ్యెడిన్. 34

* ఆనాటి ఆ బాలుడికి ఈ రూపం, ఈ రంగు, ఈ నవ్వు, ఈ చూపులు, ఈ కంఠస్వరం, ఈ గాంభీర్యం, ఈ కాంతి ఉండేవి. ఇతడు నా పుత్రుడే కావచ్చు. కాకపోతే నా పతియైన శ్రీకృష్ణుని పోలికలు వీనిలో ఎందుకుంటాయి? ఇతనిపై నాకు ఎంతో అభిమానంకూడా కలుగుతున్నది.

క. పొదలెడి ముదమునఁ జిత్తము, గదలెడి నాయెడమమూఁపు, గన్నుల వెంటం
బొదలెడి నానందాశ్రులు, మెదలెడిఁ బాలిండ్లఁ బాలు, మేలయ్యెడినో! 35

*ఆనందంతో నా హృదయం ఉప్పొంగుతున్నది. నా ఎడమ బుజం అదురుతున్నది. కండ్లనుండి ఆనందాశ్రువులు రాలుతున్నవి. పాలిండ్లలో పాలు జాలువారుతున్నవి. ఏం మేలు జరుగుతుందో!

వ. అని డోలాయమాన మానసయై వితర్కించుచు. 36

*అని మనస్సు ముందువెనుకల కూగుతుండగా రుక్మిణీదేవి ఇలా వితర్కించింది -

క. తనయుఁ డని నొడువఁ దలఁచును, దనయుఁడు గాకున్న మిగులఁ దతిగొని సవతుల్
దను నగియెద రని తలఁచు న, తను సంశయ మలమికొనఁగఁ దనుమధ్య మదిన్. 37

*ఇతడు నా కుమారుడే అని చెప్పబోతుంది. కాని ఆతడు తన కుమారుడు కాకపోతే సమయం చిక్కిందని తన సవతులు తనను గేలి చేస్తారేమో అనే సంశయం కలిగింది.

వ. ఇట్లు రుక్మిణీదేవి విచారించుచుండ లోపలి నగరి కావలి వారి వలన విని కృష్ణుండు దేవకీ వసుదేవులం దోడ్కొని చనుదెంచి సర్వజ్ఞుం డయ్యు నేమియు వివరింపక యూరకుండె, నంత నారదుండు సనుదెంచి శంబరుఁడు గుమారునిం గొనిపోవుట మొదలైన వార్త లెఱింగించిన, 38

* ఈ విధంగా రుక్మిణీదేవి ఆలోచిస్తుండగా అంతఃపురము కావలి వారి వలన విషయం తెలుసుకొని శ్రీకృష్ణుడు దేవకీవసుదేవులను తీసుకొని అక్కడకు వచ్చాడు. సర్వజ్ఞుడైకూడా ఏమీ మాట్లాడకుండా మౌనం వహించాడు. అప్పుడు నారదమునీంద్రుడు వచ్చి శంబరుడు ఈ బాలుని అపహరించుకొని పోయినప్పటి నుండి జరిగిన కథనంతా వివరించాడు.

క. "చచ్చిన బాలుఁడు గ్రమ్మఱ, వచ్చినక్రియ వచ్చెఁ బెక్కువర్షములకు నీ
సచ్చరితు నేఁడు గంటిమి, చెచ్చెర మున్నెట్టి తపము సేయంబడెనో?" 39

* "అపహరింపబడిన ఈ బాలుణ్ణి ఎన్నో ఏండ్లకు మళ్ళీ చూడగలిగాము. మరణించిన బాలుడు తిరిగి బ్రతికిరావటంలాంటిదే ఇది. ఈ బాలుని తిరిగి చూడటానికి మనం పూర్వజన్మలో ఏం తపస్సు చేశామో"!

వ. అని యంతఃపురకాంతలును, దేవకీ వసుదేవ రామకృష్ణులును యథోచిత క్రమంబున నా దంపతుల దివ్యాంబరాభర ణాలంకృతుల సత్కరించి సంతోషించిరి, రుక్మిణీదేవియు నందనుం గౌఁగిలించుకొని. 40

* అనుకుంటూ అంతఃపురకాంతలూ, దేవకీ వసుదేవులూ, బలరామకృష్ణులూ, రతీ ప్రద్యుమ్నులను మంచి మంచి వస్త్రాభరణాలతో సత్కరించి సంతోషించారు. రుక్మిణీదేవి తన పుత్రుని కౌగిలించు కొన్నదై ఇలా అన్నాది -

**శా. 'అన్నా? నా చనుఁబాపి నిన్ను దనుజుండంభోనిధిన్ వైచెనే**
**యెన్నే వర్షము లయ్యెఁ బాసి సుత! నీ వేరీతి జీవించి యే**
**సన్నాహంబున శత్రు గెల్చితివొ? యాశ్చర్యంబు సంధిల్లెడిన్**
**నిన్నుం గాంచితి నింతకాలమునకున్ నే ధన్యతం జెందితిన్. 41**

* బాబూ! రాక్షసుడు నిన్ను నానుండి వేరుచేసి సముద్రంలో పడవేసి ఎన్నో సంవత్సరాలైంది. కుమారా! నీవు ఏరకంగా బ్రదికి బయటపడి ఆ రాక్షసుణ్ణి సంహరించావో చాలా ఆశ్చర్యంగా వుంది. ఇంతకాలానికి మళ్లీ నిన్నుచూచి నేను ధన్యురాలి నయ్యాను.

**వ. అని కొడుకుం జూచి సంతోషించి కోడలి గుణంబులు కైవారంబు సేసి, వినోదించుచుండె, నంత ద్వారకానగరంబు ప్రజలు విని హర్షించి, రందు. 42**

* ఇలా పలుకుతూ రుక్మిణీదేవి తన కుమారుణ్ణి చూచి ఆనందించింది. కోడలి సద్గుణాలను సంస్తుతించింది. ద్వారకానగరవాసు లందరూ ఈ వార్త విని ఎంతో సంతోషించారు.

**క. సిరిపెనిమిటి పుత్త్రకుఁ డగు, మరుఁ గని హరిఁ జూచినట్ల మాతలు దమలోఁ**
**గరఁగుదు రఁట, పరకాంతలు, మరుఁగని మోహాంధకారమగ్నలు గారే? 43**

* శ్రీకృష్ణుని పుత్త్రుడైన ప్రద్యుమ్నుని గాంచిన ప్రద్యుమ్నుని తల్లులు శ్రీకృష్ణుని గాంచినట్లే భావించి కరగిపోవుదు రట. ఇక పరకాంతలు ఈ మన్మథుని చూచి మోహాంధకారంలో మునిగిపోరా?

**వ. అని చెప్పి శుకుం డిట్లనియె 44**

అని చెప్పి శుకుడు ఇంకా ఇలా పలికాడు.

**క. సత్రాజిత్తు నిశాచర, శత్రునకుం గీడు సేసి సద్వినయముతోఁ**
**బుత్త్రి స్యమంతకమణియును, మైత్రిం గొని తెచ్చి యిచ్చె మనుజాధీశా! 45**

*ఓ రాజా! సత్రాజిత్తు శ్రీకృష్ణునిపట్ల అపచారంచేసి తర్వాత పశ్చాత్తాపపడి స్యమంతకమణినీ, తన పుత్రికామణినీ మైత్రీభావంతో సమర్పించాడు.

**వ. అనిన విని రా జట్లనియె. 46**

* అని శుకమహర్షి చెప్పగా పరీక్షిత్తు విని ఇలా అన్నాడు.

**ఆ. శౌరి కేమి తప్పు సత్రాజితుఁడు సేసెఁ?, గూఁతు మణిని నేల కోరి యిచ్చె?**
**నతని కెట్లు కలిగె నా స్యమంతకమణి, విప్రముఖ్య! నాకు విస్తరింపు. 47**

* ఓ మునీంద్రా! సత్రాజిత్తు శ్రీకృష్ణుని పట్ల ఏమి అపరాధం చేశాడు? స్యమంతకమణినీ, తన కుమారీమణినీ ఎందుకు కోరి కోరి ఇచ్చాడు? సత్రాజిత్తుకు ఆ స్యమంతకమణి ఎలా లభించింది? ఈ విశేషాలన్నీ నాకు తెలియ జెప్పండి.

**వ. అనిన విని శుకయోగివర్యుం డిట్లనియె. సత్రాజిత్తనువాఁడు సూర్యునకు భక్తుండై చెలిమి సేయ నతనివలన సంతసించి సూర్యుండు స్యమంతకమణి నిచ్చె, నా మణి కంఠమున ధరియించి సత్రాజిత్తు భాస్కరుని భంగి భాసమానుండై ద్వారకా నగరంబునకు వచ్చిన దూరంబున నతనిం జూచి జనులు మణిప్రభాపటల తేజోహృతదృష్టు లయి సూర్యుం డని శంకించి వచ్చి హరి కిట్లనిరి.48**

* రాజు ఇలా అడుగగా శుకయోగి ఆ కథ చెప్పనారంభించాడు. సత్రాజిత్తు సూర్యుని భక్తితో ఆరాధించాడు. సూర్యుడు అతని భక్తికి సంతోషించి అతనికి స్యమంతకమణిని ఇచ్చాడు. ఆ మణిని కంఠంలో ధరించి సత్రాజిత్తు సూర్యునిలా వెలిగిపోతూ ద్వారకా నగరానికి వచ్చాడు. ద్వారకానగరవాసులు ఆ మణికాంతులకు కన్నులు మిరుమిట్లు గొనగా సూర్యుడని భ్రాంతిపడి శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చి ఇలా విన్నవించారు -

**క. నారాయణ! దామోదర!, నీరజదళనేత్ర? చక్రి! నిఖిలేశ! గదా**
**ధారణ! గోవింద! నమ,స్కారము యదుపుత్ర! నిత్యకల్యాణనిధీ! 49**

* నారాయణా! దామోదరా! పుండరీకాక్షా! చక్రాయుధా! సర్వేశ్వరా! గదాధారీ! గోవిందా! యదునందనా! కల్యాణప్రదా! నీకు నమస్కారం.

**మ. దివిజాధీశ్వరు లిచ్చగింతురు గదా దేవేశ! నిన్ జూడ యా**
**దవ వంశంబున గూఢమూర్తివి జగత్త్రాణుండవై యుండఁగా**
**భవదీయాకృతిఁ జూడ నేఁడిదె రుచిప్రచ్ఛన్నదిగ్భాగుఁడై**
**రవియో, నీరజగర్భుఁడో యొకఁడు సేరన్ వచ్చె మార్గంబునన్. 50**

* ఓ దేవదేవా! నీ దర్శనాన్ని దేవతలు సైతం కోరుకుంటారు. యాదవవంశంలో అవతరించి నీవు జగద్రక్షకుడవై ఉండగా దిక్కుల నిండా కాంతులు వెదజల్లుచూ సూర్యుడో, బ్రహ్మదేవుడో నిన్ను దర్శించ డానికి వస్తున్నాడు.

**వ. అని యిట్లు పలికిన మూఢజనులఁ జూచి గోవిందుండు నగి మణిసమేతుండైన సత్రాజితుండు గాని సూర్యుండు గాఁ డని పలికె, నంత సత్రాజితుండు శ్రీయుతంబయి మంగళాచారంబైన తన గృహంబునకుం జని, మహీసురులచేత నిజదేవతా మందిరంబున న మ్మణిశ్రేష్ఠంబు ప్రవేశంబు సేయించె, నదియును బ్రతిదినంబు నెనిమిది బారువుల సువర్ణంబు గలిగించుచుండు. 51**

* అని తనతో పలికిన అమాయికులను చూచి శ్రీకృష్ణుడు నవ్వి అతడు మణిని ధరించిన సత్రాజిత్తు. అంతేగాని సూర్యుడు కాడు అని చెప్పాడు. అనంతరం సత్రాజిత్తు మంగళాచార భాస్వంతమైన తన ఇంటికి

వెళ్ళి దేవతా మందిరంలో సత్యమంతకమణిని బ్రాహ్మణులచేత ప్రవేశ పెట్టించాడు. ఆ మణి దినదినమూ ఎనిమిది బారువుల బంగారాన్ని ప్రసాదిస్తుంది.

**క. ఏ రా జేలెడు వసుమతి, నా రత్నము పూజ్యమానమగు నక్కడ రో**
**గారిష్ట సర్పమాయిక, మారీ దుర్భిక్షభయము మాను నరేంద్రా! 52**

* ఓ పరీక్షిన్మహారాజా! ఏ ప్రభువు పరిపాలించే దేశంలో ఆ రత్నం పూజింపబడుతుందో ఆ రాజ్యంలో రోగాలూ, అరిష్టాలూ, కరువు కాటకాలూ ఉండనే ఉండవు.

**క. ఆ మ్మణి యాదవవిభునకు, ని మ్మని హరి యడుగ నాతఁ డీక ధనేచ్ఛం**
**బొమ్మని పలికెను జక్రికి, ని మ్మణి యీకున్న మీఁద నేమౌ ననుచున్. 53**

* స్యమంతకమణిని మహారాజైన ఉగ్రసేనునకు ఇమ్మని శ్రీకృష్ణుడు సత్రాజిత్తును అడిగాడు. స్వార్థ పరుడైన సత్రాజిత్తు "శ్రీకృష్ణునకు ఈ మణిని ఇయ్యకపోతే ఏమౌతుందిలే" అని నిరాకరించాడు.

**వ. అంత. 54**

**చ. అదరెడు వేడ్కఁ గంఠమున న మ్మణిఁ దాల్చి ప్రసేనుఁ డొక్కనాఁ**
**డడవికి ఘోరవన్యమృగయారతి నేగిన వానిఁ జంపి పైఁ**
**బడి మణిఁ గొంచు నొక్క హరి పాఱఁగ దాని వధించి డాసి యే**
**ర్పడఁ గనె జాంబవంతుఁడు ప్రభాత్తదిగంతము నా స్యమంతమున్. 55**

* అనంతరం సత్రాజిత్తు తమ్ముడైన ప్రసేనుడు ఎంతో కుతూహలంతో స్యమంతకమణిని కంఠాన ధరించి క్రూరమృగాలను వేటాడే నిమిత్తం అరణ్యానికి వెళ్ళాడు.ఆ అరణ్యంలో ఒక సింహం ప్రసేనుని చంపి ఆ మణిని నోట కరుచుకొని వెళ్లుతుండగా జాంబవంతుడు ఆ సింహాన్ని సంహరించి దిక్కులను వెలిగించే తేజస్సుతో గూడిన మణిని అందుకున్నాడు.

**క. కని జాంబవంతుఁ డా మణిఁ, గొనిపోయి సమీపశైలగుహఁ జొచ్చి ముదం**
**బునఁ దన కూరిమిసుతునకు, ఘనకేళీకందుకంబుగాఁ జేసె నృపా! 56**

* జాంబవంతుడు ఆ మణిని తీసుకొని దగ్గరలోనున్న కొండ గుహలోనికి వెళ్లి అక్కడ ఉన్న తన ప్రియ కుమారునికి ఆటబంతిగా ఉపయోగించుకొనడానికి ఆ మణిని ఆనందంతో ఇచ్చాడు.

**వ. అంత సత్రాజితుండు తన సహోదరుండైన ప్రసేనునిం గానక దుఃఖించుచు. 57**

* ఇక్కడ సత్రాజిత్తు తన తమ్ముడైన ప్రసేనుడు వేటకుపోయి తిరిగి రానందుకు ఎంతగానో దుఃఖించాడు.

**మ. 'మణి కంఠంబునఁ దాల్చి నేఁ డడవిలో మావాఁడు వర్తింపఁగా**
**మణికై పట్టి వధించినాఁడు హరికిన్ మరాద్య లే' దంచు దూ**
**షణముం జేయఁగ వానిదూషణముఁ గంపధ్వంసి యాలించి యే**
**వ్రణమున్ నా యెడ లేదు, నింద గలిగెన్ వారించు టే రీతియో?' 58**

* నా తమ్ముడు స్యమంతకమణిని ధరించి అరణ్యానికి వెళ్లాడు. శ్రీకృష్ణుడు మణికోసం నా తమ్ముణ్ణి సంహరించాడు. హరికి ఏ మాత్రమూ మర్యాదలేదని దూషింపసాగాడు. ఆ దూషణవాక్యాలను శ్రీకృష్ణుడు విని "నాలో ఏ దోషమూ లేదు. ఈ నింద నాపై వచ్చింది. ఈ నింద ఎలా నేను తొలగించుకోవాలి!" అని ఆలోచించాడు.

**వ. అని వితర్కించి.** **59**

**మ. తనవారెల్లఁ బ్రసేనుజాడఁ దెలుపం దర్కించుచున్ వచ్చి త**
**ద్వనవీథిం గనె నేలఁ గూలిన మహాశ్వంబుం బ్రసేనుం బ్రసే**
**నుని హింసించిన సింహమున్ మృగపతిన్ నొప్పించి ఖండించి యేఁ**
**గిన భల్లూకము సొచ్చి యున్న గుహయుం గృష్ణుండు రోచిష్ణుఁడై.** **60**

* ఇలా ఆలోచించినవాడై తనవారు ప్రసేనుని జాడచెప్పగా వెదకుతూ వచ్చి అరణ్యంలో నేలగూలిన గుఱ్ఱాన్నీ, ప్రసేనుణ్ణీ, ప్రసేనుణ్ణి సంహరించిన సింహాన్నీ, సింహాన్ని చంపి మణిని తీసుకొని ఎలుగుబంటి వెళ్ళిన గుహనూ కృష్ణుడు ఆసక్తితో చూచాడు.

**వ. కని తనవెంట వచ్చిన ప్రజల నెల్ల గుహాముఖంబున విడిచి, సాహసంబున మహానుభావుండైన హరి నిరంతర నిబిడాంధకార బంధురంబయి, భయంకరంబై, విశాలంబయిన గుహాంతరాళంబు సొచ్చి, చని యక్కడ నొక్క బాలున కెదురు దర్శనీయ కేళీకందుకంబుగా వ్రేలం గట్టఁబడిన యమ్మణి శ్రేష్ఠంబుఁ గని హరింప నిశ్చయించిరి.** **61**

* తన వెంట వచ్చిన ప్రజల నందరినీ గుహాద్వారం దగ్గర వదలి శ్రీకృష్ణుడు సాహసంతో దట్టమైన చీకటితో నిండి భయంకరంగా వున్న విశాలమైన ఆ గుహలోపలకు వెళ్లాడు. అక్కడ ఒక బాలునికి ఎదురుగా ఆటబంతిగా వ్రేలాడదీసిన స్యమంతకమణిని చూచాడు. దానిని తీసుకుందామని తలచాడు.

**క. మెల్లన పదము లిడుచు యదు, వల్లభుఁ డా శిశువుకడకు వచ్చిన గుండెల్**
**జల్లనఁగఁ జూచి కంపము, మొల్లంబుగ దానిదాది మొఱపెట్టె నృపా!** **62**

* ఓ రాజా! యదుశ్రేష్ఠుడైన శ్రీకృష్ణుడు మెల్లమెల్లగా ఆడుగులు వేస్తూ ఆ శిశువు దగ్గరకు రాగా దాది చూచి గుండెలు గుభిల్లుమనగా పెద్దకేక వేసింది.

**వ. అంత నాధ్వని విని బలవంతుండైన జాంబవంతుఁడు వచ్చి తన స్వామి యని కృష్ణు నెఱుంగక ప్రాకృత పురుషుం డని తలంచి కృష్ణునితో రణంబుచేసె నందు.** **63**

* దాది వేసిన కేక విని బలవంతుడైన జాంబవంతుడు అక్కడకు వచ్చాడు. శ్రీకృష్ణుడు తన ప్రభువైన శ్రీరామచంద్రుడే అని గ్రహించక సామాన్య మానవుడని భావించి కృష్ణునితో యుద్ధం చేయటానికి తలపడ్డాడు.

క. పలలమునకుఁ బోరెడు డే, గలక్రియ శస్త్రములఁ దరులఁ గరముల విజయే
చ్ఛల నిరువదియెనిమిది దివ, ములు వోరిరి నగచరేంద్రముఖ్యుఁడు హరియున్. 64

* మాంసంకోసం పోరాడే డేగలలాగా ఆ స్యమంతకంకోసం ఆయుధాలతో, చెట్లతో, చేతులతో ఒకరినొకరు జయించాలనే ఉద్దేశంతో ఇరవై ఎనిమిదిరోజులు కృష్ణజాంబవంతులు పోరాడారు.

క. అడిదములుఁ దరులు విఱిగిన, బెడిదము లగు మగతనములు బిఱుతివక వడిం
బిడుగుల వడువునఁ బడియెడి, పిడికిటి పోటులను గలన బెరసి రిరువురున్. 65

* కత్తులు, చెట్లు విరిగిపోయాయి. అప్పుడు ఒకరికొకరు వెనుకంజ వేయకుండా మిక్కిలి పౌరుషంతో పిడుగులవంటి పిడికిలి పోట్లతో వారిరువురూ తారసిల్లారు.

శా. స్పష్టాహంకృతు లుల్లసిల్ల హరియున్ భల్లూకలోకేశుఁడున్
ముష్టాముష్టి నహర్నిశంబు జయసమ్మోహంబునం బోరుచోఁ
బుష్టిం బాసి ముకుంద ముష్టిహతులం బూర్ణశ్రమోపేతుఁడై
పిష్టాంగోరు శరీరుఁడై యతఁడు దా భీతాత్ముఁడై యిట్లనున్. 66

* కృష్ణజాంబవంతులు ఇలా విజయం పొందాలనే కోరికతో అహోరాత్రాలు ముష్టాముష్టిగా పోరాడారు. కొంతకాలానికి శ్రీకృష్ణుని పిడికిలిపోట్లకు జాంబవంతుని అవయవాలన్నీ పిండి పిండి అయిపోయాయి. బలం తరిగిపోయింది. అలసట అధికమైంది. అప్పుడు జాంబవంతుడు భయకంపితుడై కృష్ణపరమాత్మునితో ఇలా అన్నాడు.

వ. 'దేవా! నిన్నుఁ బురాణపురుషు నధీశ్వరు విష్ణుం బ్రభవిష్ణు నెఱుంగుదు! సర్వభూతంబులకుం బ్రాణప్రతాప ధైర్యబలంబులు నీవే, విశ్వంబునకు సర్గస్థితిలయంబు లెవ్వ రాచరింతురు, వారికి సర్గస్థితిలయంబులఁ జేయు నీశ్వరుండవు నీవ, యాత్మవు నీవ'యన మఱియును. 67

* దేవా! పురాణపురుషుడవు, జగన్నాయకుడవు, విష్ణుడవు, ప్రభవిష్ణుడవు నీవని నేను తెలుసుకున్నాను. సర్వప్రాణులకూ ప్రాణము, ప్రతాపము, ధైర్యము, బలము నీవే. ఈ ప్రపంచం సృష్టికీ, స్థితికీ, నాశనానికీ ఎవరు కారకులో వారి సృష్టిస్థితిలయాలకు నీవు కారకుడవు. ఆత్మ స్వరూపుడవు" - అని ఇంకా ఇలా స్తుతించాడు.

సీ. బాణాగ్ని నెవ్వఁడు పఱపి పయోరాశి, నింకించి బంధించి యేపు సూపెఁ
బరఁగ నెవ్వఁడు ప్రతాప ప్రభారాశిచే దానవగర్వాంధతమస మడఁచెఁ
గంజాతములు ద్రెంచు కరిభంగి నెవ్వఁడు దశకంఠు కంఠబృందములు ద్రుంచె
నాచంద్రసూర్యమై యమరు లంకారాజ్యమునకు నెవ్వఁడు విభీషణుని నిలిపె

తే. నన్ను నేలిన లోకాధినాథుఁ డెవ్వఁ, డంచితోదార కరుణారసాబ్ధి యెవ్వఁ
డాతఁడవు నీవ కావె, మహాత్మ! నేఁడు, మాఱుపడి యెగ్గ సేసితి మఱవవలయు. 68

* బాణాగ్నిచే సముద్రాన్ని ఇంకించి సేతువు కట్టిన వాడవు, రాక్షసుల గర్వమనే చీకటిని ప్రతాపమనే కాంతిరాశిచే అణచివేసినవాడవు, పద్మాలను త్రెంచే ఏనుగులాగా రావణాసురుని శిరస్సులు త్రెంచినవాడవు ఆచంద్రార్కమైన లంకారాజ్యానికి విభీషణుని రాజుగా చేసినవాడవు, కరుణాసముద్రుడవు, నన్నేలిన లోకనాథుడవు నీవే కదా! మహాత్మా! పొరబడి నీ కపచారం చేశాను. నన్ను మన్నించు.

**వ. అని యిట్లు పరమభక్తుండైన జాంబవంతుండు వినుతించిన నతని శరీర నిగ్రహ నివారణంబుగా భక్తవత్సలుండైన హరి దన కరంబున నతని మేను నిమిరి గంభీరభాషణంబుల నిట్లనియె.** **69**

* ఈ ప్రకారంగా పరమభక్తుడైన జాంబవంతుడు శ్రీకృష్ణుని వినుతించాడు. భక్తవత్సలుడైన గోపాలుడు తన చేతితో జాంబవంతుని శరీరం నిమిరి యుద్ధం వలన కలిగిన శ్రమను తొలగించి గంభీరమైన కంఠ స్వరంతో ఇలా అన్నాడు.

**క. 'ఈ మణి మాచేఁబడె నని, తామసు లొనరించు నింద దప్పెడు కొఱకై**
**నీ మందిర మగు బిలమున, కే మరుదెంచితిమి భల్లుకేశ్వర! వింటే!'** **70**

* భల్లూకరాజా! ఈ స్యమంతకమణిని నే నపహరించానని అజ్ఞానులు నాపై వేసిన అపనిందను తొలగించుకోడానికి నీ మందిరమైన ఈ గుహకు నేను వచ్చాను.

**వ. అనిన విని సంతసించి జాంబవంతుఁడు మఱియునుం, దన కూఁతు జాంబవతి యను కన్యకామణియునుం దెచ్చి హరికిం గానికఁగా సమర్పించె, నటమున్న హరివెంట వచ్చినవారలు బిలంబు వాకిటం బండ్రెండు దినంబులు హరిరాక కెదురుచూచి వేసరి వగచి పురంబునకుం జని, రంత దేవకీవసుదేవులును రుక్మిణియును మిత్ర బంధు జ్ఞాతి జనులును గుహ సొచ్చి కృష్ణుండు రాక చిక్కెనని శోకించి.** **71**

* అని కృష్ణు డనగానే జాంబవంతుడు సంతోషించి స్యమంతకమణిని, ఆ మణితోపాటే తన కుమార్తెయైన జాంబవతి అనే పేరుకల కన్యకామణిని తెచ్చి హరికి కానుకగా ఇచ్చాడు. శ్రీకృష్ణునితోపాటు వచ్చి గుహాద్వారం దగ్గర నిలిచిన వారందరూ పన్నెండు రోజులు శ్రీకృష్ణుని కోసం ఎదురుచూచి వేసారి దుఃఖించి ద్వారకకు తిరిగి వెళ్ళారు. దేవకీ వసుదేవులు, రుక్మిణి, తక్కిన బంధుమిత్రులు, దాయాదులు గుహలో ప్రవేశించిన కృష్ణుడు తిరిగి రానందుకు శోకించారు.

**క. దుర్గమ మగు బిలమున హరి, నిర్గతుఁడై చేరవలయు నేఁ డని పౌరుల్**
**వర్గములై సేవించిరి, దుర్గం గృతకుశలమార్గఁ దోషితభర్గన్.** **72**

* దుర్గమమైన బిలంలో ప్రవేశించిన శ్రీ కృష్ణుడు క్షేమంగా తిరిగి రావాలని పౌరులంతా దుర్గాదేవిని ప్రార్థించారు.

**క. డోలాయిత మానసులై, జాలింబడి జనులు గొలువఁ జండిక పలికెన్**
**బాలామణితో మణితో, హేలాగతి వచ్చు నంబుజేక్షణుఁ' డనుచున్.** **73**

* ప్రజలు డోలాయమానమానసులై దీనంగా ప్రార్థించగా మణితో, బాలామణితో పద్మాక్షుడు అనాయాసంగా తిరిగి వస్తాడని దుర్గాదేవి పలికింది.

**క. యత్నము సఫలం బయిన స, పత్న సమూహములు బెగడఁ బద్మాక్షుం డా**
**రత్నముతోఁ గన్యాజన, రత్నముతోఁ బురికి వచ్చె రయమున నంతన్.** 74

* విరోధు లందరూ బెదరిపోయేటట్లు తన ప్రయత్నాన్ని సఫలం చేసుకొని మణితో, బాలామణితో శ్రీకృష్ణుడు వేగంగా ద్వారకాపురం చేరాడు.

**క. మృతుఁ డైనవాఁడు పునరా, గతుఁడైన క్రియం దలంచి కన్యామణి సం**
**యుతుఁడై వచ్చిన హరిఁ గని, వితతోత్సవ కౌతుకముల వెలసిరి పౌరుల్.** 75

* కన్యామణితో వచ్చిన శ్రీహరిని గాంచి మరణించిన వాడు తిరిగి వచ్చినట్లుగా ద్వారకాపుర పౌరులు ఎంతో సంతోషించారు.

**వ. ఇట్లు హరి దన పరాక్రమంబున జాంబవతీ దేవిం బరిగ్రహించి, రాజసభకు సత్రాజిత్తుం బిలిపించి తద్వృత్తాంతం బంతయు నెఱింగించి సత్రాజిత్తునకు మణి నిచ్చె, నతండును సిగ్గువడి మణిం బుచ్చుకొని పశ్చాత్తాపంబు నొందుచు బలవద్విరోధంబునకు వెఱచుచు నింటికిఁ జని.** 76

* ఇట్లు శ్రీకృష్ణుడు తన పరాక్రమంతో జాంబవతీ దేవిని పరిగ్రహించి రాజసభకు సత్రాజిత్తును రప్పించి జరిగిన విషయమంతా చెప్పి మణిని అతనికి అప్పగించాడు. సత్రాజిత్తు సిగ్గుపడి మణిని తీసికొని పశ్చాత్తాపం పొందాడు. బలవంతునితో విరోధం వచ్చినందుకు భయపడుతూ ఇంటికి చేరాడు.

**క. పాపాత్ముల పాపములం, బాపంగా నోపునట్టి పద్మాక్షునిపైఁ**
**బాపము గల దని నొడివిన, పాపాత్ముని పాపమునకుఁ బారము గలదే?** 77

* పాపాత్ములైనవారి పాపాల నన్నిటినీ పోగొట్టగలిగిన పద్మాక్షునిపైన అపనింద వేశాను. ఈ నా పాపానికి అంతం ఉన్నదా?

**మ. మితభాషిత్వము మాని యేల హరిపై మిథ్యాభియోగంబు సే**
**సితిఁ? బాపాత్ముఁడ నర్థలోభుఁడను దుశ్చిత్తుండ మత్తుండ దు**
**ర్మతి నీ దేహముఁ గాల్పనే? దురిత మే మార్గంబునం బాయు? నే**
**గతిఁ గంసారి ప్రసన్నుఁడై మనుచు నన్ గారుణ్య భావంబునన్?** 78

* మితభాషిగా ఉండక ఎందుకు నందనందనునిపై లేనిపోని నిందవేశాను? నేను పాపాత్ముడను. ధనాశాపరుడును. దుష్టుడను, దుర్మతిని, మత్తుడను. నా ఈ శరీరం కాల్చనా? నా పాపం ఏ విధంగా తొలగిపోతుంది? ఏ రీతిగా శ్రీకృష్ణుడు ప్రసన్నుడై నన్ను కనికరంతో రక్షిస్తాడు?

**ఆ. మణిని గూఁతు నిచ్చి మాధవుపదములు, పట్టుకొంటినేని బ్రదుకు గలదు**
**సంతసించు నతఁడు సదుపాయమగు నిది, సత్య మితరవృత్తిఁ జక్కఁబడదు.** 79

* స్యమంతకమణినీ, మణితోపాటు నా కూతురిని ఇచ్చి మాధవుని పాదాలు పట్టుకుంటాను. అప్పుడే నాకు బ్రతుకు. కృష్ణుడు సంతోషిస్తాడు. మరే విధంగానూ నా పాపం తొలగిపోదు. ఇది సత్యం.

**మ. అని యిబ్భంగి బహుప్రకారముల నేకాంతస్థుఁడై యింటిలోఁ**
**దనబుద్ధిం బరికించి నీతి గని సత్రాజిత్తు సంప్రాప్తి శో**
**భనుఁడై యిచ్చె విపత్పయోధితరికిన్ భామామనోహారికిన్**
**దనుజాధీశవిదారికిన్ హరికిఁ గాంతారత్నమున్ రత్నమున్. 80**

* అని అనేకరీతులుగా తన ఇంట్లో ఏకాంతంగా ఆలోచించి సత్రాజిత్తు ఆపదలనే సముద్రాలను తరింపజేసేవాడూ, కాంతాహృదయాలను అపహరించేవాడూ, దానవులను సంహరించేవాడూ ఐన శ్రీకృష్ణునకు తన పుత్రికా రత్నాన్నీ, స్యమంతక రత్నాన్నీ సమర్పించాడు.

**ఉ. తామర సాక్షుఁ డచ్యుతుఁ డుదార యశోనిధి పెండ్లి యాడె నా**
**నా మనుజేంద్రనందిత గుణస్థితిలక్షణ సత్యభామ ను**
**ద్దామ పతివ్రతాత్వ నయ ధర్మవిచక్షణతా దయా యశః**
**కాముఁను సత్యభామను ముఖద్యుతినిర్జితసోమ నయ్యెడన్. 81**

* పద్మనేత్రుడు, అచ్యుతుడు, కీర్తిశాలి అయిన శ్రీకృష్ణుడు సకలరాజులచే సద్గుణవతిగా కీర్తింపబడి, పాతివ్రత్యమూ, నీతీ, ధర్మ విచక్షణత్వమూ, దయా, కీర్తికాంక్ష గల చంద్రముఖియైన సత్యభామను పెండ్లాడాడు.

**క. 'మణి యిచ్చినాఁడు వాసర, మణి, నీకును మాకుఁ గలవు మణులు, కుమారీ**
**మణి చాలు' నంచుఁ గృష్ణుఁడు, మణి సత్రాజిత్తునకును మరలఁగ నిచ్చెన్. 82**

* "ఈ స్యమంతకమణిని సూర్యభగవానుడు నీకు ప్రసాదించాడు. మాకు మణులకు కొదువలేదు. ఈ కన్యామణి చాలు''అని శ్రీకృష్ణుడు స్యమంతకమణిని తిరిగి సత్రాజిత్తుకు ఇచ్చివేశాడు.

**వ. అంత నక్కడఁ గుంతీసహితు లయిన పాండవులు లాక్షాగారంబున దగ్ధులైరని విని నిఖిలార్థదర్శ నుండయ్యును, గృష్ణుండు బలభద్ర సహితుండై కరినగరంబునకుం జని కృప విదుర గాంధారీ భీష్మద్రోణులం గని దుఃఖోపశమనాలాపంబు లాడుచుండె! నయ్యెడ. 83**

* ఈ వృత్తాంతం ఇలా వుండగా పాండవులు కుంతీసహితంగా లక్క ఇంటిలో దగ్ధమయ్యారని విన్నాడు శ్రీ కృష్ణుడు. సర్వము నెరిగిన వాడై గూడా శ్రీకృష్ణుడు బలరామునితోపాటు హస్తినాపురానికి వెళ్లి కృపవిదుర గాంధారీ భీష్మ ద్రోణులను ఓదార్చాడు.

## -: శతధన్వుఁడు సత్రాజితునిఁ జంపి మణి నపహరించుట :-

సీ. జగతీశ! వినవయ్య శతధన్వుఁ బొడగని యక్రూరకృతవర్మ లాప్తవృత్తి
'మనకిత్తు' ననుచు సమ్మతిఁ జేసి తన కూఁతుఁ బద్మాక్షునకు నిచ్చి పాడి దప్పె
ఖలుఁడు సత్రాజిత్తుఁ, డలయ కేక్రియనైన మణిపుచ్చుకొనుము నీ మతము మెఱసి'
యని తన్నుఁ బ్రేరేఁప నా శతధన్వుఁడు పశువుఁ గటికివాఁడు పట్టి చంపు

ఆ. కరణి నిదురవోవఁ గడఁగి సత్రాజిత్తుఁ, బట్టి చంపి, వాని భామలెల్ల
మొఱలువెట్ట లోభమునఁ జేసి మణిగొంచుఁ, జనియె నొక్కనాఁడు జనవరేణ్య! 84

* పరీక్షిన్మహారాజా! అక్రూరుడూ, కృతవర్మా శతధన్వుణ్ణిచూచి "దుర్మార్గుడైన సత్రాజిత్తు సత్యభామను మనకిస్తానని చెప్పి శ్రీకృష్ణుని కిచ్చి వివాహం చేసి మాటతప్పాడు. నీవు ఏదోవిధంగా స్యమంతక మణిని గ్రహించు''అని ప్రేరేపించారు. శతధన్వుడు కసాయివాడు పశువును కట్టి చంపినట్లుగా నిద్రిస్తున్న సత్రాజిత్తును బలవంతంగా చంపివేశాడు. సత్రాజిత్తు భార్యలు రోదిస్తుండగా లోభంతో మణిని తీసుకొని వెళ్లాడు.

వ. ఇట్లు హతుండైన తండ్రిం గని శోకించి సత్యభామ యతనిం దైలద్రోణియందుఁ బెట్టించి హస్తిపురంబునకుం జని సర్వజ్ఞుండైన హరికి సత్రాజిత్తు మరణంబు విన్నవించిన హరియును బలభద్రుండు నీశ్వరు లయ్యును మనుష్య భావంబుల విలపించి, రంత బలభద్ర సత్యభామా సమేతుండై హరి ద్వారకానగరంబునకు మరలి వచ్చి శతధన్వుం జంపెదనని తలంచిన నెఱింగి శతధన్వుండు ప్రాణభయంబునఁ గృతవర్ము నింటికిం జని తనకు సహాయుండవు గమ్మని పలికినం గృతవర్మ యిట్లనియె. 85

* సత్యభామ తండ్రిమరణానికి దుఃఖించి తండ్రి శరీరాన్ని నూనె తొట్టిలో పెట్టించి హస్తినాపురానికి వెళ్ళి శ్రీకృష్ణునితో సత్రాజిత్తు మరణవార్త తెల్పింది. బలరామకృష్ణులు భగవంతులై కూడా, మనుష్య భావంతో దుఃఖించారు. సత్యభామా బలరాములతో ద్వారకకు తిరిగి వచ్చిన శ్రీకృష్ణుడు శతధన్వుని సంహరించడానికి నిశ్చయించుకున్నాడు. శతధన్వుడు ప్రాణభయంతో కృతవర్మ ఇంటికి వెళ్లి తనకు సహాయపడమని కోరాడు. అప్పుడు శతధన్వునితో కృతవర్మ ఇలా అన్నాడు.

ఉ. 'అక్కట! రామకృష్ణులు మహాత్ములు వారల కెగ్గు సేయఁగా
నిక్కడ నెవ్వఁ డోపు? విను మేర్పడఁ గంసుఁడు బంధు యుక్తుఁడై
చిక్కఁడె? మున్ను మాగధుఁడు సేనలతోఁ బదియేడు తోయముల్
దిక్కులఁ బాఱఁడే! మనకు దృష్టము, వారల లావు వింతయే? 86

* "అయ్యో! ఎంతపని చేశావు? బలరామకృష్ణులు మహానుభావులే! వారిని ఎదుర్కొనడానికి ఇక్కడ సమర్థు లెవ్వరు? కంసుడు బంధుమిత్ర సమేతంగా నేల కూలలేదా! జరాసంధుడు పదిహేడు పర్యాయాలు పరాజితుడు కాలేదా! వారి పరాక్రమం మనకు తెలియనిది కాదు గదా!"

**వ. అని యుత్తరంబు సెప్పిన విని శతధన్వుం డక్రూరుని యింటికిం జని హరితోడ పగకుం దోడు రమ్మని
చీరిన నక్రూరుండు హరిబల పరాక్రమ ధైర్య స్థైర్యంబు లుగ్గడించి మఱియు నిట్లనియె. 87**

* కృతవర్మ ఇలా పలుకగా విని శతధన్వుడు అక్రూరుని ఇంటికి వెళ్ళి శ్రీకృష్ణుని ఎదిరించడానికి సహాయం చేయమని అర్థించాడు. అక్రూరుడు శ్రీకృష్ణుని బలపరాక్రమాలనూ, ధైర్యస్థైర్యాలనూ వెల్లడించి ఇంకా ఇలా చెప్పాడు.

**సీ. 'ఎవ్వఁడు విశ్వంబు నెల్ల సలీలుఁడై పుట్టించు రక్షించుఁ బొలియఁజేయు,
నెవ్వనిచేష్టల నెఱుఁగరు బ్రహ్మాదు, లెవ్వనిమాయ మోహించు భువన,
మే డేండ్లపాపఁడై యే విభుఁ డొకచేత గోరక్షణమునకై కొండ నెత్తె,
నెవ్వఁడు కూటస్థుఁ డీశ్వరుఁ డద్భుత కర్ముఁ డనంతుండు కర్మసాక్షి,**

**తే. యట్టి ఘనునకు శౌరికి ననవరతము, మ్రొక్కెదము గాక! విద్వేషమునకు నేము
వెఱతు మొల్లము నీ వొండు వెంటఁబొమ్ము, చాలు పదివేలు వచ్చె నీ సఖ్యమునను. 88**

* ఎవడు ఈ ప్రపంచాన్ని లీలామాత్రంగా పుట్టించి, రక్షించి, నశింపజేస్తాడో, ఎవని కృత్యాలు బ్రహ్మాది దేవతలుగూడా తెలియలేరో, ఎవరిమాయ ఈ లోకాన్ని మోహింపజేస్తుందో, ఎవడు ఏడేండ్ల వయస్సులోనే గోవులను రక్షించడానికై పర్వతాన్ని ఒకచేత్తో పైకెత్తి పట్టాడో, ఎవడు కూటస్థుడో, పరమేశ్వరుడో, అద్భుతాలు సాధించగలవాడో, అనంతుడో, కర్మసాక్షియో అట్టి మహానుభావుడైన వాసుదేవునికి ఎల్లప్పుడు నమస్కరించే వారమేగాని వైరానికి రాము. నీవు మరోమార్గం ఆలోచించుకో. నీ స్నేహంవల్ల మాకింత జరిగింది చాలు.

**వ. అని యిట్లక్రూరుం డుత్తరంబు పలికిన న మ్మహామణి యక్రూరునియొద్ద నునిచి, వెఱచి శత
ధన్వుండు తురగారూఢుండై శతయోజనదూరంబు సనియె, గరుడ కేతనాలంకృతంబైన తేరెక్కి
రామకృష్ణులు వెనుచని, రంత నతండును మిథిలా నగరంబుఁ జేరి తత్సమీపంబునందు. 89**

* ఈ విధంగా అక్రూరుడు అనగానే శతధన్వుడు శ్యమంతకమణిని అక్రూరుని కిచ్చి, భయంతో గుఱ్ఱమెక్కి నూరుయోజనాల దూరం పారిపోయాడు. గరుడధ్వజం వెలుగొందే రథం ఎక్కి రామకృష్ణు లతనిని వెంటాడారు. శతధన్వుడు మిథిలానగర ప్రాంతం చేరాడు.

**చ. తురగము డిగ్గి తల్లడముతో శతధన్వుఁడు పాదచారియై
పరువిడఁ 'బోకు పోకు'మని పద్మదళాక్షుఁడు గూడఁ బాఱి భీ
కరగతి వాని మస్తకము ఖండితమై పడ వ్రేసెఁ జక్రముం
బరిహతదైత్యచక్రముఁ బ్రభాచయ మోదితదేవశక్రమున్. 90**

* అక్కడ శతధన్వుడు గుఱ్ఱం దిగి తొందరగా పరుగెత్తుతుండగా శ్రీకృష్ణుడు పోకు పోకుమంటూ అతనిని వెంటాడి దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేసే చక్రాయుధాన్ని ప్రయోగించాడు. చక్రఘాతానికి శతధన్వుని శిరస్సు భయంకరంగా తెగి క్రిందపడింది.

**వ. ఇట్లు హరి శతధన్వుని వధియించి వాని వస్త్రంబులందు మణి వెదకి లేకుండటఁ దెలిసి బలభద్రునికడకు వచ్చి శతధన్వుం డూరక హతుం డయ్యె, మణిలే'దనిన బలభద్రుం డిట్లనియె.91**

* శ్రీకృష్ణుడు శతధన్వుని సంహరించి అతని దగ్గర వెతికాడు. కాని స్యమంతకమణి కన్పించలేదు. అప్పుడు అతడు బలరాముని చెంతకు వచ్చి "శతధన్వుడు వ్యర్థంగా మరణించాడు. అతని దగ్గర మణి లే''దని చెప్పాడు. అప్పుడు బలరాముడిలా అన్నాడు.

**సీ. 'ఆ మణి శతధన్వుఁ డపహరించుట నిక్క, మెవ్వరిచే దాఁప నిచ్చినాఁడొ?**
**వేగమె నీ వేఁగి వెదకుము పురిలోన, వైదేహు దర్శింప వాంఛ గలదు,**
**పోయి వచ్చెద, నీవు పొ'మ్మని వీడ్కొని మెల్లన రాముండు మిథిలఁ జొచ్చి**
**పోయిన జనకుండు పొడగని హర్షించి యెంతయుఁ బ్రియముతో నెదురు వచ్చి**

**తే. యర్ఘ్యపాద్యాది కృత్యంబు లాచరించి, యిచ్చగించిన వస్తువు లెల్ల నిచ్చి**
**'యుండు' మని భక్తిచేసిన నుండె ముసలి, కువలయేశ్వర, మిథిలలోఁ గొన్ని యేండ్లు. 92**

* స్యమంతకమణిని శతధన్వు డపహరించడం సత్యం. దాచిపెట్టమని ఎవరి కిచ్చాడో? నీవు వెంటనే ద్వారకకు వెళ్ళి మణికోసం అన్వేషించు. నాకు జనకభూపాలుని చూడాలనే కోరిక కలిగింది. నేను మిథిలకు వెళ్లి వస్తాను. నీవు ద్వారకకు వెళ్ళు - అని శ్రీకృష్ణుని పంపించాడు. బలరామునికి జనకమహారాజు అర్ఘ్యపాద్యాది విధులతో సత్కారాలు చేసి, అభీష్టవస్తువుల నిచ్చి అక్కడ ఉండుమని ప్రార్థించాడు. బలరాముడు కొన్ని సంవత్సరాలు మిథిలానగరంలో ఉన్నాడు.

**వ. అంత దుర్యోధనుండు మిథిలానగరంబునకుం జనుదెంచి జనకరాజుచేత సమ్మానితుండై. 93**

**క. చలమున గాంధారేయుఁడు, లలిత గదాయుద్ధకౌశలము నేర్చెఁ దగన్**
**హలిచే నాశ్రితనిర్జర, ఫలిచేఁ ద్రైలోక్య వీరభటగణబలిచేన్. 94**

* ఆ సమయంలో దుర్యోధనుడు మిథిలకు వెళ్లి జనకునిచేత గౌరవింపబడినవాడై ఆశ్రిత పారిజాతమూ, త్రిలోక వీరుడూ ఐన బలరాముని చెంత గదాయుద్ధ కౌశలము నంతటినీ పట్టుదలతో నేర్చుకున్నాడు.

**వ. అటఁ గృష్ణుండును ద్వారకానగరంబునకుం జని శతధన్వుని మరణంబును మణి లేకుండుటయును, సత్యభామకుం జెప్పి, సత్యభామా ప్రియకరుండు గావున సత్రాజిత్తునకుఁ బరలోక క్రియలు సేయించె, నక్రూరకృతవర్మలు శతధన్వు మరణంబు విని వెఱచి ద్వారకా నగరంబు వెడలి బహుయోజన దూర భూమికిం జని, రక్రూరుండు లేమింజేసి వానలు లేక మహోత్పాతంబులును, శరీరమానస తాపంబులును ద్వారకావాసులకు సంభవించిన నందుల వృద్ధజనులు బెగడి హరి కిట్లనిరి. 95**

* శ్రీకృష్ణుడు ద్వారకానగరం చేరి సత్యభామతో శతధన్వుని సంహరించిన సంగతీ, వానిదగ్గర మణి కానరాని విషయమూ తెలిపి సత్రాజిత్తుకు పరలోక క్రియలు జరిపించాడు. శతధన్వుని మరణం విని అక్రూర కృతవర్మలు భయపడి ద్వారకానగరం విడిచి ఎన్నో యోజనాల దూరం వెళ్ళారు. అక్రూరుడు లేనందువలన ద్వారకానగరంలో అనేక ఉపద్రవాలు కలిగాయి. వర్షాలు కురియలేదు. మానవులకు శారీరక మానసిక తాపాలు సంభవించాయి. అప్పుడు ద్వారకానగరంలోని వయోవృద్ధులు భయపడి శ్రీకృష్ణునితో ఇలా అన్నారు.

**సీ. 'కమలాక్ష వినవయ్య! కాశీశుఁ డేలెడి కుంభిని వానలు గురియకున్నఁ**
**గోరి శ్వఫల్కునిఁ గొనిపోయి యతనికిఁ గాందిని యనియెడు కన్య నిచ్చి**
**కాశీవిభుండు సత్కారంబు సేసిన వానలు గురిసె నా వసుధమీఁద,**
**నాతని పుత్త్రకుఁ డైన యక్రూరుండు నంతటివాఁడు, మహాతపస్వి**

**ఆ. మరలి వచ్చెనేని మాను నుత్పాతంబు, లెల్ల, వాన గురియు నీ స్థలమున,**
**దేవ! యతనిఁ దోడి తెప్పింపు, మన్నింపు, మానవలయుఁ బీడ మానవులకు.** 96

* "కమలాక్షా! కాశీరాజు తన రాజ్యంలో వర్షాలు కురవనప్పుడు అక్రూరుని తండ్రి అయిన శ్వఫల్కుని తీసికొని వెళ్లి "కాందిని" అనే తన కన్యనిచ్చి వివాహం చేసి సత్కరించగా కాశీరాజ్యంలో వానలు కురిశాయి. శ్వఫల్కుని కుమారుడైన అక్రూరుడు కూడా అంతటివాడే. మహాతపస్వి. అతడు తిరిగివస్తే ఈ ఉపద్రవాలు తొలగిపోతాయి. వానలు కురుస్తాయి. అతనిని రప్పించండి. మన్నించండి. ప్రజల పీడను తొలగించండి."

**వ. అని పలుకు పెద్దల పలుకు లాకర్ణించి దూతలం బంపి కృష్ణుం డక్రూరుని రావించి పూజించి ప్రియకథలు కొన్ని సెప్పి సకల లోకజ్ఞుండు గావున మృదుమధుర భాషణంబుల నతని కిట్లనియె.** 97

* అని పలికిన పెద్దల మాటలను విని శ్రీకృష్ణుడు దూతలను పంపి అక్రూరుణ్ణి రప్పించాడు. అతనిని పూజించి, ప్రియమైన పలుకులు పలికి మృదుమధుర భాషణాలతో ఇలా అన్నారు.

**సీ. 'తా నేగుతఱి శతధన్వుండు మణిఁ దెచ్చి నీ యింటఁ బెట్టుట నిజము తెలిసి**
**నాఁడ, సత్రాజిత్తునకుఁ బుత్రకులు లేమి నతనికిఁ గార్యంబు లాచరించి**
**విత్తంబు ఋణమును విభజించుకొనియెద రతని పుత్త్రికలెల్ల, నతఁడు పరుల**
**చేత దుర్మరణంబుఁ జెందినాఁ, డతనికై సత్కర్మములు మీఁద జరుపవలయు,**

**ఆ. మఱి గ్రహింపు మీవ, మా యన్న నను నమ్మఁ, డెలమి బంధుజనుల కెల్లఁ జూపు**
**మయ్య! నీ గృహమున హాటక వేదికా, సహితమఖము లమరు సంతతమును'.** 98

* "శతధన్వుడు తాను వెళుతూ మీ ఇంటిలో మణిని దాచిపెట్టిన సంగతి తెలుసుకున్నాను. సత్రాజిత్తుకు కుమారులు లేరు. కనుక అతనికి పరలోక క్రియలను ఆచరించి, ఆతని ఆస్తిని, అప్పును సత్రాజిత్తు కుమార్తెలు పంచుకుంటారు. అతడు పరులచేత దుర్మరణం చెందాడు. ఆతనికై సత్కర్మలు జరగాలి.

స్యమంతకమణిని నీవే గ్రహించు. మా అన్న నన్ను నమ్మడు గనుక బంధువుల కందరకూ చూపించు. నీ గృహంలో ఎల్లప్పుడూ బంగారు వేదికలమీద యజ్ఞకార్యాలు కొనసాగుతాయి.''

**వ. అని యిట్లు సామవచనంబు హరి పలికిన నక్రూరుండు వస్త్రచ్ఛన్నంబైన మణిం దెచ్చి హరి కిచ్చిన.99**

* ఈ విధంగా కృష్ణుడు సాంత్వనవాక్యాలు పలుకగా వస్త్రంలో దాచి తెచ్చిన స్యమంతకమణిని అక్రూరుడు కృష్ణునికి సమర్పించాడు.

**ఉ. సంతసమంది బంధుజనసన్నిధికిన్ హరి దెచ్చి చూపె న**
**క్రాంతవిభాసమాన ఘృణిజాలపలాయిత భూనభోంతర**
**ధ్వాంతము హేమభారచయ వర్షణవిస్మిత దేవ మానవ**
**స్వాంతముఁ గీర్తి పూరితదిశా వలయాంతము నా శ్యమంతమున్. 100**

* శ్రీకృష్ణుడు సంతోషంతో తనకాంతితో సర్వలోకాల చీకట్లు పోకార్చగలదీ, తానిచ్చే బంగారంతో దేవ మానవుల కాశ్చర్యం కల్గించగలదీ, సమస్త దిశావలయంలో కీర్తి గాంచినదీ అయిన స్యమంతకమణిని తన బంధువుల కందరకూ చూపించాడు.

**క. చక్రాయుధుఁ డీ క్రియఁ దన, యక్రూరత్వంబు జనుల కందఱకును ని**
**ర్వక్రముగఁ దెలిపి క్రమ్మఱ, నక్రూరుని కిచ్చె మణిఁ గృపాకలితుండై. 101**

* చక్రాయుధుడు తన నిష్కళంకత్వాన్ని సర్వజనులకూ తెలిపి స్యమంతకమణిని తిరిగి అక్రూరునికే ఇచ్చివేశాడు.

**క. ఘనుఁడు భగవంతుఁ డీశ్వరుఁ, డనఘుఁడు మఱి దెచ్చి యిచ్చినట్టి కథనమున్**
**వినినఁ బఠించినఁ దలఁచిన, జనులకు దుర్యశముఁ బాపసంఘముఁ దలఁగున్. 102**

* పాపరహితుడు, ఐశ్వర్యవంతుడు, మహానుభావుడు, పరమేశ్వరుడు నైన శ్రీకృష్ణుడు స్యమంతకమణిని తెచ్చిన కథను విన్నా, పఠించినా, తలచినా జనుల పాపాలు పటాపంచ లవుతాయి. అపకీర్తి తొలగిపోతుంది.

## -: శ్రీకృష్ణుం డింద్రప్రస్థపురంబున కరుగుదెంచుట :-

**వ. అంత నొక్కనాఁడు పాండవులం జూడ నిశ్చయించి సాత్యకి ప్రముఖ యాదవులు గొలువఁ బురుషోత్తముం డింద్రప్రస్థ పురంబునకుం జనినం బ్రాణంబులం గనిన యింద్రియంబుల భంగి వా రఖిలేశ్వరుం డైన హరిం గని కౌఁగిలించుకొని కృష్ణుని దివ్యదేహసంగమంబున నిర్ధూతకల్మషులై యనురాగ హాస విభాసితంబైన ముకుంద ముఖారవిందంబు దర్శించి యానందంబు నొందిరి, గోవిందుండును యుధిష్ఠిర భీమసేనుల చరణంబులకు నభివందనంబులు సేసి యర్జును నాలింగనంబున సత్కరించి, నకుల సహదేవులు మ్రొక్కిన గ్రుచ్చి యెత్తి, యుత్తమపీఠంబున నాసీనుండై యుండె; నప్పుడు.103**

* ఒకనాడు పురుషోత్తముడు పాండవులను చూచి రావాలని సాత్యకి మొదలైన యాదవులతోగూడి ఇంద్రప్రస్థనగరానికి వెళ్లాడు. పాండునందనులు ప్రాణాన్ని పొందిన ఇంద్రియాలలాగా సర్వేశ్వరుడైన శ్రీకృష్ణుని కౌగిలించుకొన్నారు. విష్ణుదేవుని దివ్యశరీరాన్ని కౌగిలించుకోవడం వలన వారిపాపాలన్నీ పటాపంచ లయ్యాయి. అనురాగపూరితమైన చిరునవ్వుతో గూడిన శ్రీకృష్ణుని ముఖపద్మాన్ని దర్శించి వారు ఎంతో ఆనందించారు. శ్రీకృష్ణుడు ధర్మజభీమసేనుల పాదాలకు నమస్కరించాడు. అర్జునుణ్ణి ఆలింగనం చేసుకున్నాడు. తనకు నమస్కరించిన నకుల సహదేవులను ఆదరించి ఒక ఉన్నతపీఠంపైన ఆసీనుడయ్యాడు.

**క. చంచద్ఘనకుచభారా, కుంచితయై క్రొత్త పెండ్లికూఁతు రగుట నిం**
**చించుక సిగ్గు జనింపఁగఁ, బాంచాలతనూజ మ్రొక్కెఁ బద్మాక్షునకున్. 104**

* స్తనభారంతో కొంచెం వంగి, క్రొత్త పెండ్లికూతురు కావడంచేత సిగ్గుపడుతూ పాంచాలరాజపుత్రి ద్రౌపది పద్మాక్షునికి మ్రొక్కింది.

**వ. అంత సాత్యకి పాండువులచేతం బూజితుండై యొక్క పీఠంబున నాసీనుండై యుండెఁ, దక్కిన యనుచరులును వారిచేతఁ బూజితులై కొలిచి యుండిరి, హరియుం గుంతీదేవి కడకుం జని నమస్కరించి యిట్లనియె. 105**

* సాత్యకి గూడా పాండవులచేత గౌరవింపబడి ఒక ఆసనాన్ని అలంకరించాడు. తక్కిన యాదవులను గూడా పాండవులు మిక్కిలిగా సమ్మానించారు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు కుంతీదేవి చెంతకు వెళ్ళి నమస్కరించి ఇలా అన్నాడు.

**క. 'అత్తా! కొడుకులుఁ గోడలుఁ, జిత్తానందముగఁ బనులు సేయఁగ నాత్మా**
**యత్తానుగవై యాజ్ఞా, సత్తాదులు గలిగి మనుదె సమ్మోదమునన్? 106**

* "అత్తా! నీ కుమారులూ, ద్రౌపదీ నీ హృదయానికి ఆనందం కల్గిస్తుండగా సమ్మోదంతో జీవితం గడుపుతున్నావా?"

**చ. అనవుడుఁ బ్రేమవిహ్వలత నందుచు గద్గదభాషణంబులం**
**గనుఁగవ నశ్రుతోయములు గ్రమ్మఁగఁ గుంతి సుయోధనుండు సే**
**సిన యపచారముం దలఁచి చెందిన దుఃఖము లెల్లఁ జెప్పి యా**
**దనుజవిరోధి కి ట్లనియెఁ దద్దయుఁ బెద్దఱికంబు సేయుచున్. 107**

* ఈ విధంగా శ్రీకృష్ణుడు అడుగగా కుంతీదేవి ప్రేమ విహ్వలతతో డగ్గుత్తికతో, కనుల నీరు నిండగా దుర్యోధనుడు చేసిన అపకారాన్నీ, తాము పడ్డ కష్టాలనూ చెప్పి శ్రీకృష్ణునకు పెద్దరిక మిచ్చి ఇట్లన్నది.

**సీ. 'అన్న! నీ చుట్టాల నరయుదు! మఱవవు, నీవు పుత్తెంచిన నెమ్మితోడ**
**మా యన్న యేతెంచి మముఁ జూచి పోయెను, నిల్చి యున్నారము నీ బలమున,**

నా పిన్నవాండ్రకు నాకు దిక్కెవ్వరు నేఁ డాదిగా నింక నీవె కాక?
యఖిల జంతువుల కీ నాత్మవు గావునఁ బరులు నా వారని భ్రాంతి సేయ.

తే. వయ్య! నా భాగ్యమెట్టిదో? యనవరతముఁ జిత్తమున నుండి కరుణ మా చిక్కులెల్లఁ
వాపుచుందువు గాదె! యో పరమపుణ్య!, యదుకుమారవరేణ్య! బుధాగ్రగణ్య!. 108

* కృష్ణా! నీవు నీ బంధువులను మరచిపోకుండా ఆదరిస్తావు. నీవు పంపగా అక్రూరుడు వచ్చి ఆదరంగా మమ్మల్ని చూచిపోయాడు. నీ అండవల్లనే మేము జీవించి ఉన్నాము. నాపిల్లలకు నాకు నీవు కాక మరెవరు దిక్కు? సర్వప్రాణలకు నీవే ఆత్మవు గనుక 'పరులు, నావారు' అని నీకు భేదం లేదు. ఓ పుణ్యాత్మా! మమ్మల్ని మరచిపోకుండా నీవు కరుణతో మా చిక్కుల నన్నిటినీ తొలగిస్తున్నావు. యదుకుల తిలకా! పురుషోత్తమా! ఇదంతా నా భాగ్యం గాక మరేమిటి!

వ. అనిన యుధిష్ఠిరుం డి ట్లనియె. 109

* అప్పుడు ధర్మరాజు శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

మ. 'పట్టఁగ లేరు నిన్నుఁ దమభావములందు సనందనాదు లే
పట్టుననైన, నట్టి గుణభద్రచరిత్రుఁడ వీవు, నేఁడు మా
చుట్టమ వంచు వచ్చెదవు, చూచెద వల్లులమైన మమ్ము; నే
మెట్టి తపంబు చేసితి మధీశ్వర! పూర్వశరీర వేళలన్?' 110

* సనందాది మహర్షులే ఎంతో ప్రయత్నించికూడా నిన్ను పట్టలేరు. అట్టి మహానుభావుడవు నీవు. ఈనాడు నీవు మా బంధు వయ్యావు. అల్లులమైన మమ్ములను చూడవచ్చావు. పూర్వజన్మలో మేము ఎంత తపస్సు చేశామో!

వ. అని ధర్మజుండు దన్నుఁ బ్రార్థించిన నింద్రప్రస్థపురంబువారలకు నయనానందంబు సేయుచు హరి గొన్ని నెలలు వసియించి యుండె, నం దొక్కనాఁడు. 111

* అని ధర్మరాజు శ్రీకృష్ణుని స్తుతించాడు. శ్రీకృష్ణుడు ఇంద్రప్రస్థంలోని ప్రజలకు నేత్రానందం కల్గిస్తూ అక్కడే కొన్ని నెలలపాటు ఉన్నాడు.

మ. తురగశ్రేష్ఠము నెక్కి కంకటధనుస్తూణీశరోపేతుఁడై
హరితోడన్ వనభూమి కేగి విజయుం డాసక్తుఁడై చంపె శం
బర శార్దూల తరక్షు శల్య చమరీ భల్లూక గంధర్వ కా
సర కంఠీరవ ఖడ్గ కోల హరిణీ సారంగముఖ్యంబులన్. 112

* ఒకనాడు అర్జునుడు అశ్వారూఢుడై శ్రీకృష్ణునితో గూడి అరణ్యానికి వెళ్లాడు. అక్కడ జింకలను, పెద్దపులులను, సివంగులను, ఏదుపందులను, చమరీమృగాలను, ఎలుగుబంట్లను, ఎనుబోతులను, సింహాలను, ఖడ్గమృగాలను, వనవరాహాలను, ఏనుగులను ఆసక్తితో వేటాడాడు.

క. అచ్చోటఁ బవిత్రములై, చచ్చిన మృగరాజి నెల్ల జననాథునకున్
దెచ్చి యొసంగిరి మెచ్చుగఁ, జెచ్చెర నరుఁ గొల్చియున్న సేవకు లధిపా! 113

* "చనిపోయిన మృగాల నన్నింటినీ సేవకులు రాజుగారికి తెచ్చి యిచ్చారు.

వ. అంత నర్జునుండు నీరువట్టున డస్సిన యమునకుం జని యమ్మహారథులైన నరనరాయణు లందు వార్చి జలంబులు ద్రావి యొక పులినప్రదేశంబున నుండి. 114

* అప్పుడు అర్జునునకు దాహంవేసింది. నరనారాయణు లిద్దరూ యమునానదికి వెళ్ళి దాహం తీర్చుకొని ఇసుక ప్రదేశంలో కూర్చున్నారు.

ఉ. ఉపగతులైన యట్టి పురుషోత్తమ పార్థులు గాంచి రాపగా
విపుల విలోల నీలతర వీచికలందు శిరోజభార రు
చ్యపహసితాళిమాలిక నుదంచిత బాలశశిప్రభాలికం
దపనుని బాలికన్ మదనదర్పణతుల్య కపోలపాలికన్. 115

* అప్పుడు కృష్ణార్జునులు యమునాతరంగాలలో తుమ్మెదల సమూహాన్ని ధిక్కరించే శిరోజ శోభతో, బాలచంద్రుని బోలిన నెన్నుదురుతో, అద్దాలవంటి చెక్కిళ్ళతో ప్రకాశించే సూర్యుని కుమార్తెను చూచారు.

వ. కని యచ్యుతుండు పంచిన వివ్వచ్చుండు సని యా కన్యకిట్లనియె. 116

* శ్రీకృష్ణుడు పంపగా అర్జునుడు ఆమె చెంతకు వెళ్లి ఇలా అన్నాడు.

మ. 'సుదతీ! యెవ్వరిదాన? వేమికొఱ కిచ్చోటం బ్రవర్తించె? దె
య్యది నీ నామము? కోర్కి యెట్టిది? వివాహాకాంక్షతోఁగూడి యీ
నదికిన్ వచ్చిన జాడ గానఁబడె? ధన్యం బయ్యె నీ రాక, నీ
యుదయాదిస్థితి నెల్లఁ జెప్పు మబలా! యుద్యత్కురంగేక్షణా! 117

* ఓ అమ్మాయీ! నీ వెవర్తెవు? ఎందుకోసం ఇక్కడికి వచ్చావు? నీ పేరేమిటి? నీ కోరిక ఏమిటి? వివాహ కాంక్షతో ఈ నదీ ప్రాంతానికి వచ్చినట్లున్నావు? నీ రాక ధన్యమైనది. నీ ప్రయత్నం నెరవేరుతుంది. ఓ లేడికన్నుల వన్నెలాడీ! నీ విశేషాల నన్నిటినీ చెప్పు.

వ. అనిన నర్జునునకుఁ గాళింది యి ట్లనియె. 118

* అప్పుడు అర్జునునితో ఆ అమ్మాయి ఇలా చెప్పింది.

మ. 'నరవీరోత్తమ! యేను సూర్యుని సుతన్, నాపేరు కాళింది, భా
స్కర సంకల్పితగేహమందు నదిలోఁ గంజాక్షు విష్ణుం బ్రభున్
వరుగాఁ గోరి తపంబు సేయుదు, నొరున్ వాంఛింపఁ, గృష్ణుండు వ
న్యరతిన్ వచ్చి వరించు నంచుఁ బలికెన్ నా తండ్రి నాతోడుతన్.' 119

* ఓ వీరాధివీరా! నేను సూర్యుని కుమార్తెను. నాపేరు కాళింది. ఈ నదిలో నా తండ్రి నా కోసం ఏర్పాటు చేసిన గృహంలో పద్మాక్షుడైన శ్రీకృష్ణుని భర్తగా కోరి తపస్సు చేస్తున్నాను. ఇతరులను నేను కోరను. శ్రీకృష్ణుడు వేటకు వచ్చి నిన్ను వివాహ మాడగలడని నా తండ్రి నాకు తెలిపాడు.

**వ. అనిన విని ధనంజయుఁ డా నీలవేణి పలుకులు హరికిం జెప్పిన విని సర్వజ్ఞుండైన హరియు హరి మధ్యను రథంబుమీఁద నిడుకొని ధర్మరాజు కడకుం జని వారలు గోరిన విశ్వకర్మను రావించి వారి పురం బతివిచిత్రంబు సేయించె. 120**

* ఈ విధంగా కాళింది చెప్పిన మాటలను అర్జునుడు శ్రీకృష్ణునకు విన్నవించాడు. సర్వజ్ఞుడైన హరి సన్నని నడుము గల కాళిందిని రథ మెక్కించుకొని ధర్మరాజు దగ్గరకు వెళ్ళాడు. పాండవులు కోరగా విశ్వకర్మ వచ్చి ఇంద్రప్రస్థ పురాన్ని చిత్ర విచిత్రంగా అలంకరించి తీర్చిదిద్దాడు.

**క. దేవేంద్రుని ఖాండవ మ, ప్పావకునకు నీఁ దలంచి పార్థుని రథికుం**
**గావించి సూతుఁ డయ్యెను, గోవిందుఁడు మఱఁదితోడఁ గూరిమి వెలయన్. 121**

* దేవేంద్రుని ఖాండవ వనాన్ని అగ్నిదేవుడికి ఆహారంగా అర్పించడానికి నిశ్చయించుకొని అర్జునుని రథానికి శ్రీకృష్ణుడు తాను సారథి అయ్యాడు.

**వ. ఇట్లు నరనారాయణులు సహాయులుగా దహనుండు ఖాండవ వనంబు దహించిన సంతసించి విజయునకు నక్షయతూణీరంబులు, నభేద్యకవచంబును, గాండీవ మనియెడి బాణాసనంబును, దివ్యరథంబును, ధవళరథ్యంబులను నిచ్చె నందు. 122**

* నర నారాయణుల సహాయంతో అగ్నిదేవుడు ఖాండవ వనాన్ని దహించ సంతోషించి అర్జునునికి అక్షయతూణీరాలు, భేదించడానికి వీలులేని కవచం, గాండీవమనే ధనుస్సు, దివ్య రథమూ, తెల్లగుఱ్ఱాలూ సమర్పించాడు.

**ఉ. వాసవసూనుచేఁ దనకు వహ్నిశిఖాజనితోగ్రవేదనన్**
**వాసినఁ జేసి యొక్క సభ పార్థున కిచ్చె మయుండు ప్రీతుఁడై**
**యా సభలోనఁ గాదె గమనాగమనంబులఁ గౌరవేంద్రుఁ డు**
**ల్లాసముఁ బాసి యుండుట జలస్థలనిర్ణయ బుద్ధిహీనుఁడై. 123**

* అగ్నిజ్వాలల బాధనుండి తప్పించి అర్జునుడు తనను రక్షించినందువలన మయుడు సంతోషంతో ఒక మహాసభను నిర్మించి అర్జునునకు బహూకరించాడు. ఆ సభలోనే దుర్యోధనుడు సంచరిస్తూ భూమికీ, జలాశయానికీ తేడా తెలియక అవమానం పొందాడు.

## -:శ్రీకృష్ణుండు కాళింది మిత్రవింద నాగ్నజితి భద్ర లక్షణ యను వారలఁ బరిణయమాడుట :-

వ. అంతఁ గృష్ణుండు ధర్మరాజ ప్రముఖుల వీడుకొని సాత్యకి ప్రముఖ సహచరులు గొలువ, మరలి తన పురంబునకుం జని బంధుజనంబులకుఁ బరమానందంబు సేయుచు నొక్క పుణ్య దివసంబున శుభలగ్నంబునం గాళిందిం బెండ్లి యయ్యె, మఱియు నవంతిదేశాధీశ్వరు లయిన విందానువిందులు దుర్యోధనునకు వశులై హరికి మేనత్తయైన రాజాధిదేవి కూఁతురైన తమ చెలియలిని వివాహంబు సేయ నుద్యోగించి స్వయంవరంబుఁ జాటించిన. 124

* శ్రీకృష్ణుడు ధర్మరాజాదులను వీడ్కొని సాత్యకి మొదలైన సహచరులతో ద్వారకకు తిరిగి వచ్చాడు. బంధువు లందరూ ఆనందిస్తుండగా ఒక శుభముహూర్తంలో కాళిందిని పరిణయమాడాడు. అనంతరం సంగతి. అవంతీ పరిపాలకులైన విందానువిందులు దుర్యోధనునకు వశమయ్యారు. వారి తల్లియైన రాజాధిదేవి శ్రీకృష్ణునికి మేనత్త. వారు తమ చెల్లెలి పెండ్లికి స్వయంవరం చాటించారు.

క. భూ రమణులు సూడఁగ హరి, వీరతఁ జేకొనియె మిత్రవిందను నిత్యా
పూరిత సుజనానందం, జారు చికురకాంతి విజిత షట్పదబృందన్. 125

* రాజు లందరూ చూస్తూ ఉండగా శ్రీకృష్ణుడు ఎదురులేని తన పరాక్రమం ప్రదర్శించి అలినీలవేణి, అందాలరాణి ఐన మిత్రవిందను చేకొన్నాడు.

సీ. జననాథ! వినుము కోసలదేశ మేలెడి నగ్నజిత్తను నరనాథుఁ డొకఁడు
సుమతి ధార్మికుఁడు దత్సుత నాగ్నజితి యను కన్యక గుణవతి గలదు దానిఁ
బెండ్లియాడుటకునై పృథివీశు లేతెంచి వాఁడికొమ్ముల గల వాని, వీర
గంధంబు సోఁకినఁ గాలు ద్రవ్వెడివాని, నతిమదమత్తంబులైన వాని

తే. గోవృషంబుల నేడింటిఁ గూర్చి తిగిచి, బాహుబలమున నెవ్వఁడు పట్టి కట్టు
నతఁడు కన్యకుఁ దగు వరుం డనిన వానిఁ, బట్టఁజాలక పోదురు ప్రజలు బెగడి. 126

* ఓ పరీక్షిన్మహారాజా! కోసలదేశాన్ని సద్గుణుడు, ధర్మపరుడు నైన నగ్నజిత్తు అనేరాజు పరిపాలిస్తు న్నాడు. అతని కుమార్తె నాగ్నజితి. సద్గుణసంపన్న. వాడికొమ్ములు గలిగి, వీరగంధం సోకితే చాలు కాలు ద్రవ్వుతూ మిక్కిలి మదించిన ఏడు ఆబోతులు ఆ రాజుదగ్గర ఉన్నాయి. ఆ వృషభాలను తన బాహుబలంతో ఎవడు కట్టివేస్తాడో అతడే నాగ్నజితికి భర్త అని ఆ రాజు నిర్ణయించాడు. ఎందరో రాజులు వచ్చి ఆ ఎద్దు లను పట్టి కట్టడానికి ప్రయత్నం చేశారు. కాని ఫలితం లేకపోయింది.

వ. ఇట్లు గోవృషంబుల జయించినవాఁడక్కన్యకు వరుండనిన భగవంతుండైన హరి విని సేనాపరివృతుండై కోసలపురంబునకుం జనినం గోసలాధీశ్వరుండును హరి నెదుర్కొని యర్ఘ్య పాద్యాది విధులం బూజించి పీఠంబు సమర్పించి ప్రతివందితుండై యున్నయెడ. 127

* ఆ వృషభాలను జయించినవాడే ఆ కన్యకు భర్త అని శ్రీకృష్ణుడు విని సేనాసమేతంగా కోసలదేశానికి వెళ్ళాడు. కోసలరాజు శ్రీకృష్ణుని గొప్పగా గౌరవించాడు.

**క. ఆ రాజకన్య ప్రియమున, నా రాజీవాక్షు మోహనాకారుఁ ద్రిలో**
**కారాధితు మాధవుఁ దన, కారాధ్యుండైన నాథుఁడని కోరె నృపా! 128**

* రాజుకుమార్తె నాగ్నజితి మోహనాకారుడూ, పద్మనేత్రుడూ, త్రిలోకపూజితుడూ ఐన మాధవుణ్ణే తనకు భర్తగా భావించింది.

**వ. మఱియు న క్కన్యకారత్నంబు తన మనంబున. 129**

* ఇంకా నాగ్నజితి ఇలా తలపోసింది.

**ఆ. విష్ణుఁ డవ్యయుండు విభుఁడు గావలె నని, నోఁచినట్టి తొంటి నోముఫలము**
**సిద్ధ మయ్యెనేనిఁ జేకొనుఁబో నన్నుఁ, జక్రధరుఁడు వైరిచక్రహరుఁడు. 130**

* అచ్యుతుడు, శ్రీహరి నాకు భర్త కావాలని నేను పూర్వజన్మలో నోచిన నోము ఫలం సిద్ధించింది. శత్రురాజులను చెండాడే చక్రధరుడు నన్ను వివాహం చేసుకుంటాడు.

**మ. సిరియుం బద్మభవేశ దిక్పతులు మున్ సేవించి యెవ్వాని శ్రీ**
**చరణాంభోజపరాగముల్ శిరములన్ సమ్యగ్గతిం దాల్తుఁ రీ**
**ధరణీచక్రభరంబు వాపుటకు నుద్యత్కేళిమూర్తుల్ దయా**
**పరుఁడై యెవ్వఁడు దాల్చు నట్టి హరి యెబ్భంగిం బ్రవర్తించునో! 131**

* లక్ష్మీదేవి, బ్రహ్మదేవుడు, ఈశ్వరుడు, దిక్పాలకులు ఎవని పాదధూళిని శిరసా ధరించి సేవిస్తారో, భూభారాన్ని తగ్గించడానికి ఎవడు లీలావతారాలు ధరిస్తాడో ఆ శ్రీకృష్ణుడు ఇపు డెలా ప్రవర్తిస్తాడో?

**వ. అని యిట్లు నాగ్నజితి విచారించు నెడఁ గృష్ణుం డా రాజుం జూచి మేఘగంభీర నినదంబున నిట్లనియె.132**

* ఈ రకంగా నాగ్నజితి ఆలోచిస్తున్న సమయంలో కృష్ణుడు కోసలరాజును గాంచి మేఘగంభీరస్వరంతో ఇలా అన్నాడు.

**క. అన్యుల యాచింపరు రా, జన్యులు సౌజన్యకాంక్షఁ జనుదెంచితి నీ**
**కన్యన్ వేఁడెద నిమ్మా!, కన్యాశుల్కదుల మేము గాము నరేంద్రా! 133**

* రాజులు పరులను యాచింపరు. సౌజన్యంతో నేను వచ్చాను. నీ కుమార్తెను నేను కోరుకుంటున్నాను. మేము కన్యాశుల్కం ఇచ్చేవారము కాము.

**వ. అనిన రాజిట్లనియె. 134**

* కృష్ణుని మాటలు విని అప్పుడు రాజు ఈ విధంగా అన్నాడు.

**శా. కన్యం జేకొన నిన్నిలోకముల నీకన్నన్ ఘనుండైన రా**
**జన్యుం డెవ్వఁడు? నీ గుణంబులకు నాశ్చర్యంబునుం బొంది తా**

నన్యారంభము మాని లక్ష్మి భవదీయాంగంబునన్ నిత్యయై
ధన్యత్వంబునుఁ జెంది యున్నది గదా తాత్పర్యసంయుక్తమై. 135

* నా కుమార్తెను వివాహమాడడానికి ఈ లోకా లన్నిట్లో నీ కంటే తగిన వాడెవడు? నీ సద్గుణాలకు ఆశ్చర్యం చెంది లక్ష్మీదేవి ఇతరులను కాదని నీ వక్షఃస్థలంలో స్థానం సంపాదించుకొని ధన్యు రాలయింది.

శా. చంచద్గోవృషసప్తకంబుఁ గడిమిన్ సైరించి యెవ్వాఁడు భం
జించున్ వానికిఁ గూఁతు నిత్తునని యేఁ జీరించినన్ వైభవో
దంచ ద్గర్వులు వచ్చి రాజతనయుల్ తత్పాద శృంగాహతిం
గించిత్కాలము నోర్వ కేగుదు రనిం గేడించి భిన్నాంగులై. 136

* ఏడు వృషభాలను బాహుబలంతో ఎదుర్కొని ఎవడు జయిస్తాడో అతనికి నా కుమార్తె నిచ్చి వివాహం జరుపుతానని చాటించాను. గర్విష్ఠులైన రాజు లెందరో వచ్చి ఆ ఆబోతుల గిట్టల దెబ్బలకు తట్టు కొనలేక భిన్నభిన్నాలైన శరీరాలతో రంగాన్నుంచి తప్పుకున్నారు.

శా. ఉష్ణాంశుండు తమంబుఁ దోలు క్రియ నీవుగ్రాహవక్షోణిలోఁ
గృష్ణా! వైరులఁ దోలినాఁడవు, రణక్రీడా విశేషంబులన్
నిష్ణాతుండవు, సప్తగోవృషములన్ నేఁ డాజి భంజించి రో
చిష్ణుత్వంబున వచ్చి చేకొనుము మా శీతాంశుబింబాననన్. 137

* శ్రీకృష్ణా! సూర్యుడు చీకటిని పారదోలునట్లు నీవు రణరంగంలో నీ శత్రువులను పారదోలావు. సంగర క్రీడలో నీవు సర్వ సమర్థుడవు. ఏడు వృషభాలతో ఈ రోజు పోరాడి జయించి చంద్రముఖియైన మా నాగ్నజితిని చేపట్టు.

వ. అని నగ్నజిత్తు తన కూఁతు వివాహంబునకుం జేసిన సమయంబు సెప్పిన విని. 138

* అని నగ్నజిత్తు తన కుమార్తె వివాహవిషయంలో చేసుకున్న నియమాన్ని చెప్పగా కృష్ణుడు విన్నాడు.

చ. కనియె నఘారి వత్స బక కంస విదారి ఖలప్రహారి దా
ఘనతర కిల్బిషంబుల నగణ్య భయంకర పౌరుషంబులన్
సునిశిత శృంగ నిర్దళితశూరసమూహ ముఖామిషంబులన్
హనన గుణోన్మిషంబుల మహాపరుషంబుల గోవృషంబులన్. 139

* అఘాసుర వత్సాసుర బకాసుర కంసులను చీల్చిచెండాడిన కృష్ణభగవానుడు గొప్ప పౌరుషము గలవీ, తమ వాడి కొమ్ములతో ఎందరో వీరుల ముఖాలను క్రుమ్మి గాయపరచినవీ, రూపం ధరించిన పాపరాసులవలె అతిభయంకరమైనవీ అయిన ఆబోతులను ఆలోకించాడు.

ఉ. చేలము చక్కఁ గట్టుకొని చిత్రగతిన్ వడి నేడు మూర్తులై
బాలుఁడు దారురూపములఁ బట్టెడు కైవడిఁ బట్టి వీర శా

ర్దాలుఁడు గ్రుద్ది నేలఁ బడఁద్రోచి మహోద్ధతిఁ గట్టి యీడ్చె భూ
పాలకు లెల్ల మెచ్చ వృషభంబులఁ బర్వతసన్నిభంబులన్. 140

* శ్రీకృష్ణుడు పై వస్త్రాన్ని నడుముకు బిగించి కట్టుకొని విచిత్ర రీతిలో ఏడుమూర్తులు ధరించి బాలుడు కొయ్యబొమ్మలను పట్టుకున్నట్లుగా పర్వతాలవంటి ఆ ఏడు వృషభాలను పట్టుకొని గ్రుద్ది క్రుమ్మి అవలీలగా నేలపై కూలద్రోశాడు. అది చూచి అచ్చటి వారంతా మెచ్చుకున్నారు.

వ. ఇట్లు వృషభంబుల నన్నింటినిం గట్టి యీడ్చినం జూచి హరికి నగ్నజిత్తు నాగ్నజితి నిచ్చిన విధివత్ప్రకారంబునం బెండ్లి యయ్యె, నా రాజసుందరు లానందంబును బొంది, రా సమయంబున బ్రాహ్మ ణాశీర్వాదంబులును, గీత పటహ శంఖ కాహళ భేరీ మృదంగ నినదంబులును జెలంగె, నంత నా కోసలేంద్రుండు దంపతుల రథారోహణంబు సేయించి పదివేల ధేనువులును, విచిత్రాంబరాభరణ భూషితలైన యువతులు మూఁడువేలును, దొమ్మిదివేల గజంబులును, గజంబులకు శతగుణంబులైన రథంబులును, రథంబులకు శతగుణంబులైన హయంబులును, హయంబులకు శతగుణాధికంబైన భటసమూహంబును నిచ్చి పుత్తెంచిన వచ్చునప్పుడు. 141

* ఈ విధంగా శ్రీకృష్ణుడు ఏడు వృషభాలను నేలగూల్చి ఈడ్వగా నగ్నజిత్తు తన కుమార్తెను కృష్ణున కిచ్చి వివాహం చేశాడు. ఆసమయంలో అంతఃపురకాంతలంతా ఎంతో సంతోషించారు. బ్రాహ్మణులు ఆశీర్వదించారు. మంగళగీతాలు భేరీమృదంగాది మంగళవాద్యధ్వనులు మిన్నుముట్టాయి. కోసలరాజు నూతన దంపతులను రథ మెక్కించి సాగనంపాడు. పదివేల గోవులను వస్త్రాభరణాలంకృతలైన మూడువేల మంది కన్యలను, తొమ్మిదివేల ఏనుగులను, అంతకు వందరెట్లు రథాలను, అంతకు వందరెట్లు గుఱ్ఱాలను, అంతకు వందరెట్లు సైనికులను కృష్ణునకు ఆ రాజు కానుకగా ఇచ్చాడు.

ఉ. భూతి యెలర్పఁ గోసలుని పుత్త్రికకై చనుదెంచి తొల్లి యాఁ
బోతులచేత నోటువడి పోయిన భూపతులెల్ల మాధవుం
డా తరుణిన్ వరించుట చరావలిచే విని త్రోవ సైన్య సం
ఘాతముతోడఁ దాఁకి రరిగర్వవిమోచనుఁ బద్మలోచనున్. 142

* ఇంతకు పూర్వం నాగ్నజితిని వివాహమాడడానికి వచ్చి ఆబోతుల నోడించలేక పరాజితులైన రాజులందరూ మాధవుడు ఆ కన్యను వివాహమాడిన విషయం గూఢచారుల వలన తెలుసుకొని శత్రుగర్వ భంజనుడైన శ్రీకృష్ణుని జయించడానికి సైన్యసమేతంగా వచ్చి మార్గ మధ్యంలో అడ్డగించారు.

ఉ. దండి నరాతు లెల్ల హరిఁ దాఁకిన నడ్డము వచ్చి వీఁకతో
భండనభూమియందుఁ దన బాంధవులెల్లను సన్నుతింపఁగా
గాండివచాపముక్త విశిఖంబుల వైరుల నెల్లఁ జంపె నా
ఖండల నందనుండు శశకంబుల సింహము చంపుకైవడిన్. 143

* రాజు లందరూ శ్రీకృష్ణునిపైకి రాగా అర్జునుడు పరాక్రమంతో వారి నెదుర్కొన్నాడు. గాండీవంనుండి వదలిన బాణాలతో సింహం కుందేళ్ళను సంహరించినట్లు శత్రువుల నందరినీ హతమార్చాడు. బంధువులంతా సంతోషించారు.

**వ. ఇట్లు హరి నాగ్నజితిం బెండ్లియై యరణంబులు పుచ్చుకొని, ద్వారకానగరంబునకు వచ్చి సత్య భామతోడం గ్రీడించుచుండె; మఱియును. 144**

* ఇలా శ్రీకృష్ణుడు నాగ్నజితిని పెండ్లాడి మామగా రిచ్చిన కానుకలతో ద్వారకానగరానికి వచ్చి నాగ్నజితీ సమేతుడై ఆనందించాడు.

**మ. జనవంద్యన్ శ్రుతకీర్తి నంద్యఁ దరుణిన్ సందర్శనక్షోణి పా**
**ద్యనుజన్ మేనమఱందలిన్ విమలలోలాపాంగఁ గై కేయి ని**
**ర్ధ నయోన్నిద్రఁ బ్రపూర్ణసద్గుణసముద్రన్ భద్ర నక్షుద్ర నా**
**వనజాతాక్షుఁడు పెండ్లియాడె నహితవ్రాతంబు భీతిల్లఁగన్. 145**

* కేకయదేశాధిపతియైన శ్రుతకీర్తి కుమార్తె, సందర్శనాదులకు సోదరి, సద్గుణవతి, తన మేనత్త కూతురు అయిన భద్రను శత్రువు లెల్లరూ తల్లడిల్లగా శ్రీకృష్ణుడు వివాహమాడాడు.

**వ. మఱియును. 146**

**చ. అమరులఁ బాఱఁదోలి భుజగాంతకుఁడైన ఖగేశ్వరుండు ము**
**న్నమృతముఁ దెచ్చుకైవడి మదాంధుల రాజుల నుక్కడంచి యా**
**కమలదళాయతేక్షణుఁడు గైకొని తెచ్చెను మద్ర కన్యకన్**
**సమదమృగేక్షణన్ నయవిచక్షణ లక్షణఁ బుణ్యలక్షణన్. 147**

* అంతేగాక పూర్వం గరుత్మంతుడు దేవతలను పారదోలి అమృతం తెచ్చిన విధంగా మదాంధులైన రాజులను జయించి శ్రీకృష్ణుడు లేడికన్నులవంటి కన్నులుకలది, మద్రరాజ కుమార్తె, శుభలక్షణ అయిన లక్షణను పరిగ్రహించాడు.

**వ. ఇట్లు హరికి రుక్మిణియు, జాంబవతియు, సత్యభామయుఁ, గాళిందియుఁ, మిత్రవిందయు, నాగ్న జితియు, భద్రయు, మద్రరాజనందనయైన లక్షణయు ననంగ నెనమండ్రు భార్యలైరి, మఱియు నరకాసురుని వధియించి తన్నిరుద్ధకన్యల షోడశసహస్రకన్యల రోహిణి మొదలైన వారిం బరిగ్రహించెనని విని. 148**

* ఈ విధంగా శ్రీకృష్ణునికి రుక్మిణి, జాంబవతి, సత్యభామ, కాళింది, మిత్రవింద, నాగ్నజితి, భద్ర, లక్షణ అనే వారు అష్టభార్య లయ్యారు. అంతేకాక నరకాసురుని సంహరించి అతని చెరలో నున్న రోహిణి మొదలైన పదహారువేలమంది కన్యకామణులను పరిగ్రహించాడు అని చెప్పగా పరీక్షిత్తు విని ఇలా అన్నాడు.

**క. ధరకుం బ్రియనందనుఁడగు, నరకుని హరి యేల చంపె? నరకాసురుఁ డా**
**వరకుంతల లగు చామీ, కర కుంభస్తనుల నేల కారం బెట్టెన్? 149**

* భూదేవి ప్రియపుత్రుడైన నరకాసురుని శ్రీకృష్ణుడు ఎందుకు సంహరించాడు? నరకాసురుడు నవయౌవనవతులైన సుందరీమణులను ఎందుకు చెరసాలలో బంధించాడు?

**వ. అనిన నరేంద్రునకు మునీంద్రుం డిట్లనియె, నరకాసురుని చేత నదితి కర్ణకుండలంబులును, వరుణచ్ఛత్త్రంబును, మణి పర్వత మనియెడు నమరాద్రి స్థానంబును గోలుపడుటయు నింద్రుండు వచ్చి హరికి విన్నవించిన హరి నరకాసుర వధార్థంబు గరుడవాహనారూఢుండై చను సమయంబున హరికి సత్యభామ యిట్లనియె. 150**

* ఇలా ప్రశ్నించిన ఆ పరీక్షిన్నరేంద్రునితో శుకమునీంద్రు డిలా చెప్పాడు. నరకాసురుడు అదితిదేవి కుండలాలనూ, వరుణదేవుని ఛత్రాన్నీ, దేవతల మణి పర్వతాన్నీ అపహరించాడు. దేవేంద్రుడు శ్రీకృష్ణునికి నరకుని అత్యాచారాలు విన్నవించాడు. శ్రీహరి నరకాసురుని సంహరించడానికి గరుడవాహనం ఎక్కి వెళ్ళ బోతున్న సమయంలో సత్యభామ ఆయనతో ఇలా అన్నది.

### -: శ్రీకృష్ణుఁడు సత్యభామతోఁ గూడ నరిగి నరకాసురుని వధించుట :-

**శా. 'దేవా! నీవు నిశాటసంఘముల నుద్దీపించి చెండాడ నీ**
**ప్రావీణ్యంబులు సూడఁగోరుదుఁ గదా! ప్రాణేశ! మన్నించి న**
**న్నీ వెంటం గొనిపొమ్ము, నేఁడు కరుణన్ నేఁజూచి యేతెంచి నీ**
**దేవీ సంహతి కెల్లఁ జెప్పుదు భవద్దీప్త ప్రతాపోన్నతుల్,' 151**

* ప్రభూ! నీవు రణరంగంలో విజృంభించి రాక్షసుల సమూహాలను చెండాడుతుంటే నీ ప్రావీణ్యం చూడాలని కోరికగా ఉంది. ప్రాణనాథా! నా మాట మన్నించి నన్ను దయతో నీ వెంట తీసుకొని పో. నేను అక్కడి నీ ప్రతాపాన్ని కనులారా చూచి వచ్చి ఇక్కడి రాణుల కందరకూ తెలియజేస్తాను.

**వ. అనినఁ బ్రాణవల్లభకు వల్లభుం డిట్లనియె. 152**

**సీ. 'సమద పుష్పంధయ ఝంకారములు గావు, భీషణకుంభీంద్ర బృంహితములు**
**వాయునిర్గత పద్మవనరేణువులు గావు, తురగ రింఖాముఖోద్ధూతరజము**
**లాకీర్ణజలతరం గాసారములు గావు, శత్రుధనుర్ముక్త సాయకములు**
**గలహంససారస కాసారములు గావు, దనుజేంద్రసైన్య కదంబకములు**

**తే. కమలకహ్లార కుసుమసంఘములు గావు, చటుల రిపు శూల ఖడ్గాది సాధనములు**
**కన్య! నీ వేడ? రణరంగ గమన మేడ?, వత్తు, వేగమ నిలువుము, వలదు వలదు.' 153**

* ఈ విధంగా అడిగిన సత్యభామతో శ్రీకృష్ణు డిలా అన్నాడు. సత్యా! అబలవైన నీ వెక్కడ? రణరంగ మెక్కడ? అక్కడ వినిపించేవి మదించిన తుమ్మెదల ఝంకారాలు కావు, భయంకరమైన ఏనుగుల ఘీంకారాలు. అక్కడ కనిపించేవి తామరవనం నుండి గాలికి రేగి వచ్చిన పరాగరేణువులు కాదు, గుఱ్ఱపు గిట్టల చివరలనుండి లేచిన ధూళి దుమారాలు. అవి నీటికెరటాల తుంపురులుకావు, శత్రు ధనుస్సులనుండి వెడలిన శరపరంపరలు.

రాజహంసలతో నిండిన సరోవరాలు కావు, రాక్షససైన్య సమూహాలు. కమలాలు, కలువలు కనిపింపవు. అక్కడ కనపడేవి భయంకరమైన శత్రు శూలాలు, ఖడ్గాలు, ఆయుధాలు. ఇటువంటి యుద్ధరంగానికి నీ వెందుకు? నేను త్వరగా తిరిగి వస్తాను. వద్దు. వద్దు. నీవు రావద్దు.

**వ. అనినఁ బ్రియునకుం బ్రియంబు జనియింప డగ్గఱి.** **154**

* ఇలా పలుకుతున్న ప్రాణప్రియునకు దగ్గరకు వచ్చి ప్రియురాలు ప్రియం కలిగేటట్లు ఇలా అన్నది.

**ఉ. 'దానవులైన నేమి? మఱి దైత్యసమూహము లైన నేమి? నీ**
**మానితబాహు దుర్గముల మాటున నుండఁగ నేమి శంక? నీ**
**తో నరుదెంతు' నంచుఁ గరతోయజముల్ ముకుళించి మ్రొక్కె న**
**మ్మానిని దన్ను భర్త బహుమాన పురస్సరదృష్టిఁ జూడఁగన్.** **155**

* నాథా! నీ బాహువులు అనే దుర్గాల అండ నాకు ఉండగా వారు రాక్షస సమూహాలైతే మాత్రం నాకేం భయం? నేను నీతో వస్తాను అని అభిమానవతి అయిన సాత్రాజితి పద్మాలవంటి తన చేతులు జోడించి నమస్కరించింది. శ్రీకృష్ణుడు సత్యభామవంక మెచ్చుకోలుగా చూచాడు.

**వ. ఇట్లు తనకు మ్రొక్కిన సత్యభామను గరకమలంబులఁ గ్రుచ్చి యెత్తి తోడ్కొని గరుడారూఢుండై హరి గగనమార్గంబునం జని, గిరి శస్త్ర సలిల దహన పవన దుర్గమంబై మురాసురపాశ పరివృతం బయిన ప్రాగ్జ్యోతిషపురంబు డగ్గఱి.** **156**

* తనకు నమస్కరించిన సత్యభామను వెంట పెట్టుకొని గరుత్మంతునిపై ఎక్కి ఆకాశమార్గాన ప్రాగ్జ్యోతిషనగరాన్ని చేరాడు. ఆ పట్టణం పర్వత దుర్గాలతో, శస్త్రదుర్గాలతో, వాయుదుర్గాలతో, జలదుర్గాలతో, అగ్నిదుర్గాలతో కూడినట్టిది. మురాసురుని బాహుపాశాలతో చుట్టుకొనబడిన పురం అది.

**మ. గదచేఁ బర్వతదుర్గముల్ శకలముల్ గావించి సత్తేజిత**
**ప్రదరశ్రేణుల శస్త్రదుర్గచయమున్ భంజించి చక్రాహతిం**
**జెదరన్ వాయుజలాగ్ని దుర్గముల నిశ్శేషంబులం జేసి భీ**
**ప్రదుఁడై వాలునఁ ద్రుంచెఁ గృష్ణుఁడు ముర ప్రచ్ఛన్నపాశంబులన్.** **157**

* శ్రీకృష్ణుడు తన గదాదండంతో పర్వత దుర్గాలను ముక్కలు చేశాడు. బాణ సమూహంతో శస్త్రదుర్గాల సమూహాన్ని ఛేదించి వేశాడు. వాయు, జల, అగ్ని దుర్గాలను చక్రపు దెబ్బలతో నాశనం చేశాడు. అరిభయం కరుడైన అరవిందాక్షుడు మురాసురుని పాశాలను ఖడ్గంతో ఖండించాడు.

**వ. మఱియును.** **158**

**శా. ప్రాకారంబు గదాప్రహారముల నుత్పాటించి యంత్రంబులున్**
**నాకారాతుల మానసంబులును భిన్నత్వంబు నెందంగ న**

**స్తోకాకారుఁడు శౌరి యొత్తె విలయోద్ధూతాభ్ర నిర్ఘాత రే**
**ఖా కాఠిన్యముఁ బాంచజన్యము విముక్తప్రాణి చైతన్యమున్. 159**

* అంతేకాక గదాప్రహారాలతో ప్రాకారాలను పడగొట్టి యంత్రాలను రాక్షసుల హృదయాలతో పాటు భేదించాడు. మహానుభావుడైన వాసుదేవుడు ముల్లోకాలను మూర్ఛిల్ల జేయగలదీ, ప్రళయకాల మేఘ నిర్ఘోషంవలె కఠోరధ్వానంతో కూడినదీ అయిన పాంచజన్యమనే శంఖాన్ని పూరించాడు.

**వ. అంత లయకాల కాలాభ్రగర్జనంబు పగిది నొప్పు న మ్మహాధ్వని విని పంచశిరుండైన మురాసురుండు నిదుర సాలించి యావులించి నీల్గి లేచి జలంబులు వెడలి వచ్చి హరిం గని ప్రళయకాల కీలికైవడి మండుచు దుర్నిరీక్ష్యుండై కరాళించుచుం దన పంచముఖంబులం బంచభూతమయం బయిన లోకంబుల మ్రింగ నప్పళించు చందంబునం గదిసి యాభీల కీలాజటాలం బగు శూలంబున గరుడుని వైచి భూనభోఽంతరంబులు నిండ నార్చుచు. 160**

* ప్రళయ కాలంనాటి కాలమేఘ గర్జనవంటి ఆ పాంచజన్య ధ్వనిని విని అయిదుతలల మురాసురుడు నిద్ర మేల్కొన్నాడు. ఆవులించి, లేచి, నీటినుండి బయటకు వచ్చాడు. శ్రీకృష్ణుని చూచాడు. ప్రళయకాలంనాటి అగ్నిజ్వాలలాగా మండుతూ చూడశక్యం కానివాడై పెడ బొబ్బలు పెడుతూ తన అయిదు నోళ్ళతో పంచ భూతాలతో గూడిన లోకాలను మ్రింగడానికి ప్రయత్నించినట్లు శ్రీకృష్ణుని సమీపించాడు మురాసురుడు. భయంకరమైన అగ్నిజ్వాలలవంటి జడలతో గూడిన తన శూలాన్ని గరుత్మంతునిపై ప్రయోగించి భూమ్యాకాశాలు దద్దరిల్లేటట్లు గర్జించాడు.

**క. దురదురఁ బరువిడి బిరుసున, 'హరి హరి! నిలునిలువు' మనుచు నసురయుఁ గదిసెన్**
**మురముర దివిజుల హృదయము, మెరమెర యిదె యడఁగు ననుచు మెఱసెన్ హరియున్. 161**

* ముందుకు పరుగెత్తి గర్వంతో "నిలు, నిలు" అంటూ ఆ రాక్షసుడు కృష్ణుని సమీపించాడు. శ్రీహరి గూడా దేవతల మనోవ్యథ ఈ నాటితో తీరుతుందని భావించాడు.

**వ. అప్పుడు. 162**

**క. గరుడునిపైఁ బడ వచ్చిన, మురశూలము నడుమ నొడిసి ముత్తునియలుగాఁ**
**గరముల విఱిచి ముకుందుఁడు, మురముఖముల నిశితవిశిఖములు వడిఁ జొనిపెన్. 163**

* ఆ సమయంలో గరుత్మంతునిపై మురాసురుడు ప్రయోగించిన శూలాన్ని శ్రీకృష్ణుడు మధ్యలోనే ఒడిసిపట్టుకుని మూడు ముక్కలుగా విరిచేశాడు. వాడిబాణాలను ఆ రాక్షసునిపై ప్రయోగించాడు.

**మ. గద వ్రేసెన్ మురదానవుండు హరిపైఁ, గంసారియుం దద్గదన్**
**గదచేఁ ద్రుంచి సహస్రభాగములుగాఁ గల్పించె, నాలోన వాఁ**
**డెదురై హస్తము లెత్తికొంచు వడి రా నీక్షించి లీలాసమ**
**గ్ర దశన్ వాని శిరంబు లైదును వడిన్ ఖండించెఁ జక్రాహతిన్. 164**

* ఆ రాక్షసుడు విష్ణుమూర్తిపై తన గదను ప్రయోగించాడు. కంసారి ఆ గదను తన గదతో వేయిముక్కలు గావించాడు. అప్పుడు ఆ రాక్షసుడు చేతులు పై కెత్తుకొని వేగంతో తన మీదకు రావడం చూచి శ్రీకృష్ణుడు తన చక్రాయుధంతో ఆ రాక్షసుని అయిదు తలలనూ అవలీలగా ఖండించాడు.

**వ. ఇట్లు శిరంబులు చక్రిచక్రధారాచ్ఛిన్నంబు లయిన వజ్రివజ్ర ధారాదళితశిఖరంబై కూలెడి శిఖరిచందంబున మురాసురుండు జలంబులందుఁ గూలిన, వాని సూనులు జనకవధజనిత శోకాతురులై జనార్దను మర్దింతు మని రణకుర్దనంబునం దామ్రుండు, నంతరిక్షుండు, శ్రవణుండు, విభావసుండు, వసుండు, నభస్వంతుండు, నరుణుండు నన నేడ్వురు యోధులు సక్రోధులై కాలాంతక చోదితంబైన ప్రళయపవన సప్తకంబు భంగి నరకాసుర ప్రేరితులై రయంబునఁ బీఠుం డనియెడు దండనాథుం బురస్కరించుకొని, పఱతెంచి హరిం దాఁకి శర శక్తి గదా ఖడ్గ కరవాల శూలాది సాధనంబులు ప్రయోగించిన. 165**

* దేవేంద్రుని వజ్రాయుధం దెబ్బకు శిఖరాలు తెగి కూలిన పర్వతంలాగా శ్రీకృష్ణుని చక్రాయుధం దెబ్బకు శిరస్సులు తెగిన మురాసురుడు నీటిలో కూలిపోయాడు. తండ్రిమరణానికి దుఃఖించిన మురాసురుని ఏడుగురు కుమారులు కోధోద్రిక్తులై శ్రీకృష్ణుని సంహరిస్తామని యుద్ధానికి బయలుదేరారు. కాలంతకునిచే పంపబడిన ప్రళయకాలంనాటి పవనసప్తకంలాగా నరకాసురునిచేత ప్రేరేపింపబడిన తామ్రుడు, అంతరిక్షుడు, శ్రవణుడు, విభావసుడు, వసుడు, నభస్వంతుడు, అరుణుడు అనే ఆ ఏడుగురు యోధులు పీఠుడనే సేనానాయకుని నాయకత్వంలో యుద్ధానికి వచ్చి గద, ఖడ్గం, శూలం మొదలైన అనే కాయుధాలను కృష్ణునిపై ప్రయోగించారు.

**ఉ. ఆ దనుజేంద్రయోధ వివిధాయుధసంఘము నెల్ల నుగ్రతన్**
**మేదినిఁ గూలనేయుచు సమిద్ధనిరర్గళ మార్గణాళిఁ గ్ర**
**వ్యాద కులాంతకుం డసురహస్త భుజానన కంఠ జాను జం**
**ఘాదులఁ ద్రుంచి వైచెఁ దిలలంతలు ఖండములై యిలం బడన్. 166**

* ఆ దానవ యోధులు ప్రయోగించే ఆయుధాల నన్నిటినీ పరాక్రమంతో నేలపై పడగొడుతూ నిరాటంకంగా బాణాలను ప్రయోగించి ఆ రాక్షసుల చేతులు, కాళ్ళు, కంఠాలు మొదలైన అవయవాల నన్నింటినీ నవ్వుగింజలంత ముక్కలు చేసివేశాడు శ్రీకృష్ణుడు.

**వ. మఱియు హరి శరజాలచక్రనిహతులయి తనవారలు మడియుటకు వెఱఁగుపడి రోషించి గరుడగమనుని దూషించి తన్ను భూషించుకొని సరకుసేయక నరకుండు వరకుండల ప్రముఖా భరణభూషితుం డయి దానసలిల ధారాసిక్త గండంబులును, మహోద్దండశుండాదండంబులు నైన వేదండంబులు తండ తండంబులై నడువ వెడలి భండనంబునకుం జని. 167**

* తన పక్షం వారంతా శ్రీకృష్ణుని చక్రాయుధానికీ, భాణసమూహానికీ బలిఅయిపోయినందుకు నరకాసురుడు ఆశ్చర్యపడి రోషంతో శ్రీహరిని దూషించాడు. తనను తాను స్తుతించుకున్నాడు. కుండలాలు మొదలైన అనేకాభరణాలు ధరించినవాడై దాన జలంతో తడిసిన గండ స్థలాలు, గొప్పతుండాలూ గల ఏనుగుల గుంపులతో యుద్ధరంగానికి బయలుదేరాడు.

మ. బలవంతుండు ధరాసుతుండు గనె శుంభద్రాజ బింబోపరి
స్థల శంపాన్విత మేఘమో యన ఖగేంద్రస్కంధపీఠంబుపై
లలనారత్నముఁ గూడి సంగరకథాలాపంబులం జేయు ను
జ్జ్వలనీలాంగుఁ గనన్నిషంగుఁ గుహనాచంగున్ రణాభంగునిన్. 168

* నరకాసురుడు నీలవర్ణంతో శోభిస్తున్న, రణకోవిదుడైన శ్రీకృష్ణుని చూచాడు. గరుత్మంతుని మూపుమీద సత్యభామతో ఆసీనుడై యున్న శ్రీకృష్ణుడు చంద్రబింబంపై మెఱపుతీగెతోగూడిన మేఘంలా ప్రకాశిస్తున్నాడు. వీపున తూపులపొది తాల్చిన ఆ గోపాల కృష్ణుడు సాత్రాజితికి సంగ్రామ రహస్యాలను బోధిస్తున్నాడు.

వ. కని కలహంబునకు నరకాసురుండు గమకింపం దమకింపక విలోకించి సంభ్రమంబున. 169

* ఈవిధంగా ఉన్న శ్రీకృష్ణుని చూచి నరకాసురుడు యుద్ధానికి సిద్ధం కావటం సత్యభామ చూచింది. ఆమె ఏ మాత్రం ఆలస్యం చెయ్యకుండా తొందర తొందరగా ముందుకు వచ్చింది.

శా. వేణిం జొల్లెము వెట్టి సంఘటిత నీవీబంధయై భూషణ
శ్రేణిం దాల్చి ముఖేందుమండల మరీచీజాలముల్ పర్వఁగాఁ
బాణిం బయ్యెదఁ జక్కగాఁ దుఱిమి శుంభద్వీరసంరంభయై
యేణీలోచన లేచి నిల్చెఁ దన ప్రాణేశాగ్రభాగంబునన్. 170

* సాత్రాజితి వడి వడిగా వాలుజడ ముడివేసుకొన్నది. చీర ముడి బిగించింది. భూషణాలను సరిచేసి కొన్నది. పైట సవరించుకొన్నది. ముఖచంద్రుడు కాంతు లీనుతుండగా తనకాంతుడైన మురాంతకుని చెంత నిబ్బరంగా నిలిచింది ఆ లేడికన్నుల వన్నెలాడి.

## -: సత్యభామ నరకాసురునితో యుద్ధంబు సేయుట :-

క. జన్యంబున దనుజుల దౌ, ర్జన్యము లుడుపంగఁ గోరి చనుదెంచిన సౌ
జన్యవతిఁ జూచి యదురా, జన్యశ్రేష్ఠుండు సరససల్లాపములన్. 171

* రణరంగంలో రాక్షసుల ఔద్ధత్యాన్ని అణచివేయడానికి సిద్ధమై వచ్చిన సత్యభామను చూచి యాదవశ్రేష్ఠుడైన మాధవుడు సరసంగా సంభాషించాడు.

క. లేమాఁ దనుజుల గెలువఁగ, లేమా? నీ వేల కడఁగి లేచితి? విటు రా
లే మాను మాన వేనిన్, లేమా విల్లందికొనుము లీలం గేలన్. 172

* భామా! రాక్షసులను గెలువలేమా? నీవెందుకు యుద్ధానికి సిద్ధపడ్డావు? ఇలా రా! యుద్ధప్రయత్నం మాను. మానదలుచుకోకపోతే విలాసంగా ఇదుగో ఈ విల్లు అందుకో.

వ. అని పలికి. 173

క. హరిణాక్షికి హరి యిచ్చెను, సురనికరోల్లాసనమును శూరకఠోరా
సురసైన్యత్రాసనమును, బలగర్వనిరాసనమును బాణాసనమున్. 174

* ఈ విధంగా పలికి శ్రీకృష్ణుడు దేవతలకు సంతోషాన్నీ, రాక్షసులకు సంతాపాన్నీ కలిగించుతూ, శత్రువుల గర్వాన్ని అణచివేసే ధనుస్సును సత్యభామ చేతి కిచ్చాడు.

శా. ఆ విల్లంది బలంబు నొంది తదగణ్యానంత తేజోవిశే
షావిర్భూత మహాప్రతాపమున వీరాలోక దుర్లోకయై
తా వేగన్ సగుణంబుఁ జేసె ధనువుం దన్వంగి దైత్యాంగనా
గ్రీవాసంఘము నిర్గుణంబుగ రణక్రీడా మహోత్కంఠతోన్. 175

* కృష్ణభగవాను డిచ్చిన ఆ ధనుస్సు అందుకొన్నది సత్యభామా దేవి. అందువల్ల ఆమెకు ఎక్కడలేని శక్తి వచ్చింది. గొప్ప తేజో విశేషంతో మహాప్రతాపంతో వీరలోకానికి తేరిచూడరాని రీతిలో సాత్రాజితి విల సిల్లింది. యుద్ధోత్సాహంతో ఆ నారీమణి రాక్షసనారుల కంఠాలలో మంగళసూత్రాలు తెగేటట్లు నారి బిగించి ధనుష్టంకారం చేసింది.

క. నారి మొరయించె రిపు సే, నా రింఖణ హేతువైన నాదము నిగుడన్
నారీమణి బలసంప, న్నారీభాదికము మూర్ఛనంద నరేంద్రా! 176

* ఆ నారీమణి వైరిసేనల కధైర్యం కలిగేటట్లూ, శత్రువుల యేనుగులు మొదలైనవి మూర్ఛ పొందేటట్లూ నారి సారించింది.

సీ. సౌవర్ణ కంకణ ఝణఝణ నినదంబు శింజినీరవముతోఁ జెలిమిసేయఁ
దాటంక మణిగణ ధగధగ దీప్తులు గండమండల రుచిఁ గప్పికొనఁగ
ధవళతరాపాంగ ధళధళరోచులు బాణజాల ప్రభాపటలి నడఁప
శరఘాత ఘుమఘుమశబ్దంబు పరిపంథి సైనిక కలకలస్వనము నుడుప

తే. వీరశృంగార భయరౌద్ర విస్మయములు, గలసి భామిని యయ్యెనో కాక యనఁగ
నిషువుఁ దొడుగుట దివుచుట యేయు టెల్ల, నెఱుఁగ రాకుండ నని సేసె నిందువదన. 177

* బంగారు కంకణాల ఝణఝణ ధ్వనులు వింటినారిధ్వనితో కలిసిపోగా, చెవి కమ్మలకు పొదిగిన మణుల ధగధగ కాంతులు చెక్కిళ్ళ కాంతులపై వ్యాపింపగా, అందమైన క్రీగంటి చూపుల ధళధళకాంతులు బాణాల కాంతులను కప్పి వేయగా, శరములు ప్రయోగించుటవలన కలిగిన ఘుమ ఘుమ శబ్దం శత్రుసైన్యాల కలకలధ్వనులను అణచి వేయగా; వీరము, శృంగారము, భయము, రౌద్రము, విస్మయము అనే భావాలన్నీ కలిసి ఈ భామగా రూపొందాయా అన్నట్లుగా సత్యభామ బాణం తొడగడం, లాగడం, ప్రయోగించడం గూడా గుర్తించలేనంత వేగంగా యుద్ధం చేయసాగింది.

మ. పరుఁ జూచున్ వరుఁ జూచు నొంప నలరింపన్, రోషరాగోదయా
విరతభ్రూకుటి మందహాసములతో వీరంబు శృంగారమున్

జరగన్, గన్నులఁ గెంపు సొంపుఁ బరఁగం జండాస్త్ర సందోహమున్
సరసాలోక సమూహమున్ నెఱపుచుం జంద్రాస్య హేలాగతిన్. 178

* చంద్రముఖియైన సత్యభామ కోపంతో కనుబొమలు ముడివేసి, వీరత్వం మూర్తీభవించినట్లు కను లెఱ్ఱజేసి, వాడియైన బాణాలను ప్రయోగిస్తూ, శత్రువైన నరకాసురుణ్ణి నొప్పిస్తున్నది. అదే సమయంలో అనురాగంతో మందహాసం చేస్తూ, శృంగారం ఆకారం దాల్చినట్లు సొంపైన కన్నులతో సరసపు చూపులు ప్రసరింపజేస్తూ. ప్రియుడైన శ్రీకృష్ణుని మెప్పిస్తున్నది.

మ. అలినీలాలక చూడ నొప్పెసఁగెఁ బ్రత్యాలీఢ పాదంబుతో
నలికస్వేద వికీర్ణకాలకలతో నాకర్ణికానీత స
ల్లలిత జ్యానఖపుంఖ దీధితులతో లక్ష్యావలోకంబుతో
వలయాకార ధనుర్విముక్త విశిఖవ్రాతాహతారాతియై. 179

* సత్యభామ ఎడమపాదం ముందుకుపెట్టి, కుడికాలు వంచి, చెమటకు తడిసి ముఖాన వ్యాపించిన ముంగురులతో, చెవిదాకా లాగిన అల్లెత్రాటిని పట్టుకున్న చేతివ్రేళ్ల గోళ్ల కాంతులతో, వైరి సమూహం వైపు గురి చూస్తూ, గుండ్రని ధనుస్సు నుండి వదలుతున్న శరపరంపరలతో శత్రువులను సంహరిస్తూ శోభించింది.

సీ. 'బొమ్మ పెండిండ్లకుఁ బోనొల్ల' నను బాల రణరంగమున కెట్లు రాఁ దలంచె?
మగవారిఁ గనినఁ దా మఱుఁగు జేరెడు నింతి పగవారి గెల్వ నే పగిదిఁ జూచెఁ?
బసిఁడియుయ్యెల లెక్క భయ మందు భీరువు ఖగపతి స్కంధ మే కడిఁది నెక్కె?
సఖుల కోలాహల స్వనము లోర్వనికన్య పటహభాంకృతుల కెబ్బంగి నోర్చె?

ఆ. నీలకంఠములకు నృత్యంబుఁ గఱపుచుఁ, నలసి తలఁగిపోవు నలరుఁ బోఁడి
యే విధమున నుండె నెలమి నాలీఢాది, మానములను రిపులమాన మడఁప? 180

* బొమ్మల పెండ్లిండ్లకే వెళ్లలేని ముద్దరాలు యుద్ధరంగాని కెలా రావాలని భావించింది? మగవారిని చూడగానే చాటుకు వెళ్ళే లతాంగి పగవారిని గెలవాలని ఎలా అనుకున్నది? బంగారు ఉయ్యాలలు ఎక్కడానికి భయపడే పడతి గరుత్మంతుని వీపుపై ఎలా ఎక్కింది? చెలికత్తెల కోలాహలమే ఆలకింపలేని లీలావతి తప్పెట్ల ధ్వనులను ఎలా ఓర్చుకుంటున్నది? నెమిళ్లకు నాట్యం నేర్పి అలసిపోయే అబల ఎడమపాదం ముందుకుంచి కుడిపాదంవంచి సంగరరంగంలో శత్రువుల అభిమానాన్ని అంతం చేయడానికి ఎలా సిద్ధమైంది? ఎంత వింత!

సీ. వీణెఁ జక్కఁగఁ బట్ట వెర వెఱుంగని కొమ్మ బాణాసనం బెట్లు పట్ట నేర్చె?
బ్రాఁకునఁ దీఁగెఁ గూర్పంగ నేరని లేమ గుణము నే క్రియ ధనుఃకోటిఁ గూర్చె?
సరవి ముత్యము గ్రువ్వఁ జాలని యబల యే నిపుణత నంధించె నిశితశరముఁ?
జిలుకకుఁ బద్యంబు సెప్పనేరని తన్వి యస్త్రమంత్రము లెన్వఁ డభ్యసించెఁ?

ఆ. బలుకు మనినఁ బెక్కు పలుకని ముగుద యే, గతి నొనర్చె సింహగర్జనములు?
ననఁగ మెఱసెఁ ద్రిజగదభిరామ గుణధామ, చారుసత్యభామ సత్యభామ. 181

* వీణను చక్కగా పట్టుకోలేని విరిబోణి విల్లు నెలా పట్టుకున్నదొ? మ్రాకుకు తీగెను ప్రాకించడం తెలియని బాల నారిని ధనుస్సుకు ఎట్లా తగిలిస్తున్నదో? దారానికి ముత్యాలు గ్రుచ్చలేని కోమలి వాడి బాణాలను ఏ విధంగా వింట సంధిస్తున్నదో? చిలుకకు పద్యాలు చెప్పలేని చెలువ అస్త్రమంత్రాల నెప్పుడు నేర్చుకున్నదో? ఎంతగా కోరినా ఎక్కువ మాట్లాడని ముగ్ధ సింహనాదాలను ఏ విధంగా చేస్తున్నదో? అని అందరూ అనుకొనేటట్లుగా ముల్లోకాలు మెచ్చే సద్గుణాలు గల సత్యభామ సమరరంగంలో విలసిల్లింది.

**శా. జ్యావల్లీధ్వని గర్జనంబుగ, సురల్ సారంగ యూథంబుగా,**
**నా విల్లింద్రశరాసనంబుగ, సరోజాక్షుండు మేఘంబుగాఁ,**
**దా విద్యుల్లతభంగి నింతి సురజిద్దావాగ్ని మగ్నంబుగాఁ**
**బ్రావృట్కాలము సేసె బాణచయ మంభశ్శీకరశ్రేణిగాన్.** **182**

* వింటినారిధ్వని మేఘగర్జనంగా, దేవతలు చాతకపక్షులుగా, ధనుస్సు ఇంద్రచాపంగా, శ్రీకృష్ణుడు మేఘంగా, తాను మెరుపుతీగెగా, బాణసమూహమే వర్షపునీరుగా, రాక్షసులనే దావాగ్నిని చల్లార్చడానికి సత్యభామాదేవి సంగ్రామభూమిలో వర్షాకాలాన్ని సృష్టించింది.

**సీ. రాకేందుబింబమై రవిబింబమై యొప్పు నీరజాతేక్షణ నెమ్మొగంబు,**
**కందర్పకేతువై ఘనధూమ కేతువై యలరుఁ బూఁబోఁడి చేలాంచలంబు,**
**భావజు పరిధియై ప్రళయార్కు పరిధియై మెఱయు నాకృష్టమై మెలఁత చాప,**
**మమృత ప్రవాహమై యనలసందోహమై తనరారు నింతిసందర్శనంబు,**

**తే హర్షదాయియై మహారోషదాయియై, పరఁగు ముద్దరాలి బాణవృష్టి,**
**హరికి నరికిఁ జూడ నందంద శృంగార, వీరరసము లోలి విస్తరిల్ల.** **183**

* ఆ సంగర రంగంలో సత్యభామ ముద్దుల ముఖం నందనందనునికి చంద్రబింబంగానూ నరకాసురునికి సూర్యబింబంగానూ భాసించింది. ఆ నారీమణి చీర చెరగు మురారికి మన్మథుని జెండాగానూ, సురారికి ధూమకేతువులాగానూ కన్పించింది. ఆ మానినీమణి మండలాకారమైన ధనుస్సు అచ్యుతునకు మన్మథపరివేషంగా. అసురునకు ప్రళయభాను పరివేషంగా విరాజిల్లింది. ఆ సుందరీమణి సందర్శనం హరికి అమృత ప్రవాహంగా అరికి అగ్నిజ్వాలగా తోచింది. ఆ అలివేణి బాణవృష్టి శౌరికి సంతోషం కల్గించింది. వైరికి రోషం కలిగించింది. శ్రీకృష్ణునిలో శృంగారరసం, నరకాసురునిలో వీరరసం విస్తరిల్లేటట్లుగా సత్యభామ సమరం సాగించింది.

**వ. ఇ వ్విధంబున.** **184**

**క. శంపాలతాభ బెడిదపు, టంపఱచే ఘోరదానవానీకంబుల్**
**పెంపఱి సన్నాహంబుల, సొంపఱి భూసుతుని వెనుకఁ జొచ్చెన్ విచ్చెన్.** **185**

* ఈ విధంగా తటిల్లతవలె తళతళ మెరుస్తూ ఉన్న సత్యభామ ప్రయోగించే బాణాలవలన రాక్షససైన్యం శక్తి కోల్పోయింది. యుద్ధంలో వెనుకంజవేసి నరకాసురుని మరుగు జొచ్చింది.

వ. అ య్యవసరంబునం గంససంహారి మనోహారిణిం జూచి సంతోషకారియుం, గరుణారసావలోకన ప్రసారియు, మధుర వచన సుధారసవిసారియుం, దదీయ సమరసన్నాహ నివారియునై యిట్లనియె.186

* ఆ సమయంలో కంససంహారి తన ప్రియురాలిని ఆనందాన్నీ 'అనుగ్రహాన్నీ ప్రదర్శించే చూపులతో అవలోకించి యుద్ధ ప్రయత్నం నుండి ఆమెను మరల్చడానికి మధురంగా సంభాషించటం ఆరంభించాడు.

క. 'కొమ్మా! దానవనాథుని, కొమ్మాహవమునకుఁ దోలఁగె గురువిజయముఁ గై
కొమ్మా! మెచ్చితి నిచ్చెదఁ, గొమ్మాభరణములు నీవు గోరిన వెల్లన్.' 187

* సత్యా! రాక్షససైన్యం యుద్ధరంగంనుండి పారిపోయింది. నిన్ను విజయలక్ష్మి వరించింది. నీ ధైర్యసాహసాలకు మెచ్చుకున్నాను. నీవు ఎన్ని ఆభరణాలు కోరుకుంటే అన్ని ఆభరణాలు ఇస్తాను.

వ. అని పలికి సమ్మానరూపంబులును, మోహనదీపంబులును, దూరీకృతచిత్తవిక్షేపంబులు నైన సల్లాపంబులం గళావతిం దద్దయుఁ బెద్దఱికంబు సేసి, తత్కరకిసలయోల్లసిత బాణాసనంబు మరల నందుకొనియె, నప్పుడు సురవైరి మురవైరి కిట్లనియె. 188

* అని మానసిక క్లేశం తొలగించేటట్లు, సమ్మాన ధోరణిలో సమ్మోహనంగా సముచిత సల్లాపాలతో పొగడి, చిగురుటాకువంటి ఆమె చేతినుండి ధనుస్సును తిరిగితీసుకొన్నాడు. అప్పుడు నరకాసురుడు శ్రీకృష్ణునితో ఇలా పలికాడు.

క. మగువ మగవారి ముందఱ, మగతనములు సూప రణము మానుట నీకున్
మగతనము గాదు; దనుజులు, మగువల దెసఁ జనరు మగలమగ లగుట హరీ! 189

* కృష్ణా! పురుషులయెదుట ఒక స్త్రీ పౌరుషం ప్రదర్శిస్తుంటే యుద్ధం మాని మౌనం ప్రదర్శించటం నీకు గొప్పకాదు. రాక్షసవీరులు వీరాధివీరులు కాబట్టి ఆడవారితో పోరాటానికి ఆరాటపడరు.

వ. అనిన హరి యిట్లనియె. 190

* నరకుని మాటలకు నందనందనుడు ఇలా అన్నాడు.

క. 'నరకా! ఖండించెద మ, త్కరకాండాసనవిముక్త ఘనశరముల భీ
కరకాయు నిన్ను సుర కి, న్నరకాంతలు సూచి నేఁడు నందం బొందన్.' 191

* నరకాసురా! తొందరపడకు. నా చేతిలోని ధనుస్సు నుండి వెలువడే బాణపరంపరతో భయంకర స్వరూపుడవైన నిన్ను చించి చెండాడుతాను. ఇదిచూచి ఈనాడు దేవకాంతలు ఎంతో సంతోషిస్తారు.

వ. అని పలికి హరి నరకాసుర యోధులమీఁద శతఘ్ని యను దివ్యాస్త్రంబు ప్రయోగించిన నొక్క వరుసను వార లందఱు మహావ్యథం జెందిరి, మఱియును. 192

* అని పలికి శ్రీకృష్ణుడు నరకాసురుని సైన్యంపై శతఘ్ని అనే దివ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. అప్పుడు ఆ శతఘ్ని ధాటికి ఆ సైనికులంతా తీవ్రవేదనకు లోనయ్యారు.

**మ. శర విచ్ఛిన్న తురంగమై పటుగదాసంభిన్న మాతంగమై,**
**యురుచక్రాహతవీరమధ్య పదబాహుస్కంధ ముఖ్యాంగమై,**
**నురభిత్సైన్యము దైన్యముం బొరయుచున్ శోషించి హైన్యంబుతో**
**హరి మ్రోలన్ నిలువంగ లేక పఱచెన్ హాహానినాదంబులన్. 193**

* అంతేకాదు. జనార్దనుడు ప్రయోగించిన శరసమూహాలకు గుఱ్ఱాలు కుప్పగూలాయి. గదాఘాతాలకు మదగజాలు నేలగరచాయి. చక్రాయుధ విజృంభణానికి సైనికుల కాళ్ళు, చేతులూ, శిరస్సులూ తుత్తుమురై నాయి. ఈ విధంగా నరకాసురుని సైన్యం దైన్యంతో కృష్ణుని యెదుట నిలువలేక హాహాకారాలు చేస్తూ పారిపోయింది.

**వ. అప్పుడు. 194**

**ఆ. మొనసి దనుజయోధముఖ్యులు నిగుడించు, శస్త్రసముదయముల జనవరేణ్య!**
**మురహరుండు వరుస మూఁడేసి కోలలం, ఖండితంబు సేసె గగనమందు. 195**

* అప్పుడు దైత్యవీరులు దామోదరునిపై శస్త్రాస్త్రాలు ప్రయోగించారు. రాక్షసులు ప్రయోగించే అయుధా లన్నిటినీ మురారి మూడేసి బాణాలు ప్రయోగించి కదనరంగంలో ఖండించివేశాడు.

**క. వెన్నుని సత్యను మోచుచుఁ, బన్నుగఁ బదనఖర చంచుపక్షాహతులన్**
**భిన్నములు సేసె గరుడుఁడు, పన్నిన గజసముదయములఁ బౌరవముఖ్యా! 196**

* ఓ పరీక్షిన్మహారాజా! సత్యభామా శ్రీకృష్ణులను తనమూపున మోస్తున్న గరుత్మంతుడు తన కరకు గోళ్లతో, వాడి ముక్కుతో, రెక్కల దెబ్బలతో శత్రుసైన్యంలోని ఏనుగుల గుంపుల్ని ఛిన్నాభిన్నం చేశాడు.

**వ. మఱియును విహగరాజపక్ష విక్షేపణసంజాతవాతంబు సైరింపం జాలక హతశేషంబైన సైన్యంబు పురంబు సొచ్చుటం జూచి నరకాసురుండు మున్ను వజ్రాయుధంబుం దిరస్కరించిన తనచేతి శక్తిం గొని గరుడుని వైచె, నతండును విరుల దండవ్రేటునఁ జలింపని మదోద్దండ వేదండంబునుంబోలె విలసిల్లె, న య్యవసరంబున గజారూఢుండై కలహరంగంబున. 197**

* గరుత్మంతుని రెక్కల విసురువలన పుట్టిన గాలివేగానికి నిలువలేక చావగా మిగిలిన నరకుని సైనికులు పట్టణంలోకి పారిపోయారు. అది చూచి నరకాసురుడు దేవేంద్రుని వజ్రాయుధాన్ని తిరస్కరించిన తన చేతిలోని శక్తి అనే ఆయుధాన్ని గరుత్మంతునిమీద ప్రయోగించాడు. పూలదండదెబ్బకు చలించని మదపుటేనుగులాగా గరుత్మంతుడు ఏమాత్రం చెక్కుచెదరలేదు. ఆ సమయంలో మదగజారూఢుడైన నరకుడు యుద్ధ రంగంలో ముందుకు సాగాడు.

**మ. సమదేభేంద్రము నెక్కి భూమిసుతుఁ డా చక్రాయుధున్ వైవ శూ**
**లము చేఁబట్టిన నంతలోన రుచిమాలాభిన్న ఘోరాసురో**
**త్తమ చక్రంబగు చేతిచక్రమున దైత్యధ్వంసి ఖండించె ర**
**త్నమయోదగ్ర వినూత్నకుండల సమేతంబైన తన్మూర్ధమున్. 198**

* నరకాసురుడు మదగజాన్నెక్కి చక్రాయుధునిపై ప్రయోగించటానికి శూలాన్ని పట్టుకుని పైకెత్తే లోపుగానే శ్రీకృష్ణుడు ఎందరో రాక్షసవీరులను ఖండించిన తన చక్రాయుధాన్ని వానిమీద ప్రయోగించాడు. ఆచక్రం రత్నాలు పొదిగిన కుండలాలతోకూడిన నరకుని శిరస్సును తెగవేసింది.

**శా. 'ఇల్లాలం గిటియైన కాలమున మున్నే నంచు ఘోషింతు వో**
**తల్లీ! నిన్నుఁ దలంచి యైన నిచటం దన్నుం గృపం గావఁడే!**
**చెల్లంబో! తలఁ ద్రుంచె' నంచు నిల నాక్షేపించు చందంబునన్**
**ద్రెళ్లం జప్పుడు గాఁగ భూమిసుతుఁ డుద్దీప్తాహవక్షోణిపై. 199**

* "అమ్మా! వరాహావతారంలో నేను విష్ణుమూర్తి ఇల్లాలినని చాటి చెప్పావు. నిన్ను చూచి అయినా నాపై దయచూపకుండా శ్రీకృష్ణుడు నా తల త్రుంచా"డని భూదేవిని అధిక్షేపిస్తున్నట్లుగా నరకాసురుడు యుద్ధ రంగంలో నేలమీద కూలిపోయాడు.

**క. కంటిమి నరకుఁడు పడఁగా, మంటిమి నేఁ'డనుచు వెస నమర్త్యులు మునులున్**
**మింటం బువ్వులు గురియుచుఁ, బంటింపక పొగడి రోలిఁ బద్మదళాక్షున్. 200**

* "అమ్మయ్యా! నరకాసురుని చావు కనులారా చూశాము. ఇక మనం బ్రతికాము"అని దేవతలూ, మునీంద్రులూ మింటినుండి వెంటనే పూలవర్షం కురిపిస్తూ పద్మాక్షుని ప్రస్తుతించారు.

**వ. అంత భూదేవి వాసుదేవుని డగ్గఱ నేతెంచి జాంబూనదరత్న మండితంబైన కుండలంబులును, వైజయంతియును, వనమాలయును, వరుణదత్తంబైన సితచ్ఛత్త్రంబును, నొక్క మహారత్నంబును సమర్పించి మ్రొక్కి భక్తితాత్పర్యంబుల తోడం గరకమలంబులు ముకుళించి, విబుధవందితుండును, విశ్వేశ్వరుండును నైన దేవదేవుని నిట్లని వినుతించె. 201**

అప్పుడు భూదేవి వాసుదేవుని దగ్గరకు వచ్చి రత్నాలు పొదిగిన బంగారు కుండలాలనూ, వైజయంతి అనే వనమాలనూ, వరుణు డిచ్చిన వెల్లగొడుగునూ, ఒక గొప్పరత్నాన్నీ సమర్పించి నమస్కరించి భక్తి భావంతో ఆ దేవదేవుని ఈ విధంగా స్తుతించింది.

## -: భూదేవి శ్రీకృష్ణుని స్తుతించుట :-

సీ. 'అంభోజనాభున కంభోజనేత్రున కంభోజమాలా సమన్వితునకు
నంభోజపదున కనంతశక్తికి వాసుదేవునకును దేవదేవునకును
భక్తులు గోరిన భంగి నే రూపైనఁ బొందువానికి నాదిపురుషునకును
నఖిల నిదానమై యా పూర్ణవిజ్ఞానుఁ డైన వానికిఁ బరమాత్మునకును

ఆ. ధాతఁ గన్న మేటితండ్రికి నజునికి, నీకు వందనంబు నే నొనర్తు
నిఖిలభూతరూప! నిరుపమ! యీశ! ప, రాపరాత్మ మహిత! యమితచరిత! 202

* ఓ పరమేశ్వరా! అనంతలీలావిలాసా! మహానుభావా! సాటిలేనివాడా! సమస్త భూతస్వరూపా! నీవు పద్మనాభుడవు. పద్మనేత్రుడవు. పద్మమాలా విభూషితుడవు. అనంతశక్తిమంతుడవు. వసుదేవసుతుడవు. భక్తులు కోరిన రూపం ధరించ గలవాడవు. ఆదిపురుషుడవు. దేవదేవుడవు. సమస్త జగత్తుకు కారకుడవు. పరిపూర్ణవిజ్ఞాన వంతుడవు. పరమాత్ముడవు. పుట్టుక లేనివాడవు. బ్రహ్మపుట్టుటకు కారణ మైనవాడవు. అట్టి నీకు నేను నమస్కరిస్తున్నాను.

వ. దేవా! నీవు లోకంబులు సృజియించుటకు రజోగుణంబును, రక్షించుటకు సత్త్వగుణంబును, సంహరించుటకుఁ దమో గుణంబును ధరియింతువు; కాలమూర్తివి. ప్రధానపూరుషుండవు పరుండవు, నీవ! నేనును, వారియు, వహ్నియు, ననిలుండు, నాకాశంబు, భూతతన్మాత్రలును, నింద్రియంబులును, దేవతలును, మనంబును, గర్తయును, మహత్తత్త్వంబును, జరాచరంబైన విశ్వంబును, నద్వితీయుండవైన నీయందు సంభవింతుము. 203

* ఓ దేవా! నీవు ప్రపంచాన్ని సృష్టించడానికి రజోగుణాన్నీ, రక్షించడానికి సత్త్వగుణాన్నీ, నశింపజేయడానికి తమోగుణాన్నీ ధరిస్తావు. నీవు కాలమూర్తివి. ప్రధానవ్యక్తివి. పరుడవు. నేను (భూమి), నీరు, అగ్ని, వాయువు, ఆకాశము, శబ్ద స్పర్శ రూప రస గంధాలు, ఇంద్రియాలు, 'దేవతలు, మనస్సు, కర్త, మహత్తత్త్వం, ఈ చారచరమయమైన సమస్త ప్రపంచం అద్వితీయుడవైన నీయందే ఉద్భవిస్తాము.

చ. దయ నిటు సూడుమా! నరకదైత్యుని బిడ్డఁడు వీఁడు, నీ దెసన్
భయమున నున్న వాఁడు, గడు బాలుఁ, డనన్యశరణ్యుఁ, డార్తుఁ, డా
శ్రయరహితుండు, దండ్రిక్రియ శౌర్యము నేరఁడు, నీ పదాంబుజ
ద్వయిఁ బొడఁ గాంచె భక్తపరతంత్ర సువీక్షణ! దీనరక్షణా! 204

* భక్తమందారా! దీనరక్షణా! దయతో ఇటు చూడు. ఈ బాలుడు నరకుని కుమారుడు. నిన్ను చూచి భయపడుతున్నాడు. వీడు వేరే దిక్కు లేనివాడు. ఆర్తి నొందినవాడు. ఆశ్రయం లేనివాడు. తండ్రిలాగా పరాక్రమవంతుడు కాడు. నీ పాదాలనే ఆశ్రయించాడు.

వ. అని యిట్లు భూదేవి భక్తితోడ హరికిం బ్రణమిల్లి వాక్కుసుమంబులం బూజించిన నర్చితుండై భక్తవత్సలుం డయిన పరమేశ్వరుండు నరకపుత్త్రుం డయిన భగదత్తున కభయం బిచ్చి, సర్వసంపద లొసంగి నరకాసురగృహంబు ప్రవేశించి యందు. 205

* ఈ విధంగా భూదేవి భక్తితో హరికి నమస్కరించి మాటలనే పూలతో పూజించగా భక్తవత్సలుడైన శ్రీకృష్ణుడు నరకుని కుమారుడైన భగదత్తునికి అభయ మిచ్చి సర్వసంపదలనూ ప్రసాదించాడు. అనంతరం నరకాసురుని సౌధంలోకి ప్రవేశించాడు.

## శ్రీకృష్ణుఁడు పదాఱువేల కన్నియల వరించి దేవలోకమునకుఁ బోయి పారిజాతముఁ దెచ్చుట

ఉ. రాజకులావతంసుఁడు పరాజిత కంసుఁడు సొచ్చి కాంచె ఘో
రాజుల రాజులం బటుశరాహతి నొంచి ధరాతనూజుఁ డు
త్తేజితశక్తిఁ దొల్లిఁ జెఱదెచ్చినవారిఁ బదాఱు వేల ధా
త్రీజన మాన్యలన్ గుణవతీ వ్రతధన్యల రాజకన్యలన్. 206

* సంసారియైన యదుకులావతంసుడు ఆ రాజసౌధంలో నరకుడు ఘోరయుద్ధాలలో రాజులను శర పరంపరలతో ఓడించి చెరపట్టి తెచ్చిన మాననీయలూ, గుణవతులూ అయిన పదహారువేలమంది రాజకన్యలను చూచాడు.

మ. కని రా రాజకుమారికల్ పరిమళత్కౌతూహలాక్రాంతలై
దనుజాధీశ చమూవిదారు నతమందారున్ శుభాకారు నూ
తన శృంగారు వికారదూరు సుగుణాధారున్ మృగీలోచనా
జన చేతోధనచోరు రత్నమకుటస్ఫారున్ మనోహారునిన్. 207

* ఆ రాజపుత్రికలు రాక్షససైన్య సంహారుడూ, సుందరాకారుడూ, సుగుణాధారుడూ, మానినీ మానసచోరుడూ, ఆశ్రితమందారుడూ, మనోహరుడూ, రత్నకిరీటధరుడూ ఐన శ్రీకృష్ణుని మిక్కిలి కుతూహలంతో చూశారు.

వ. కని యతని సౌందర్య గాంభీర్య చాతుర్యాది గుణంబులకు మోహించి, తమకంబులు జనియింప, ధైర్యంబులు సాలించి, సిగ్గులు వర్జించి, పంచశరసంచలిత హృదయలై, దైవయోగంబునం బరాయత్తం బులైన చిత్తంబుల నమ్మత్త కాశినులు దత్తరంబున మనోజుం డుత్తల పెట్ట నతండు దమకుఁ బ్రాణ వల్లభుం డని వరియించి. 208

* అలా చూచి శ్రీకృష్ణుని సౌందర్యం, చాతుర్యం, గాంభీర్యం, మొదలైన సుగుణాలకు ఆకర్షితలై మోహించారు. వలపులు పొంగి, ధైర్యం కోల్పోయి, సిగ్గులు వదలి, శృంగార భంగిమలతో, సంచలించిన హృదయాలతో పంచబాణుడు తొందరపెట్టగా ఆ రాచకన్నెలు అతడే తమ ప్రాణవల్లభుడని భావించారు.

ఉ. పాపపు రక్కసుండు సెఱపట్టె నటంచుఁ దలంతుఁ మెప్పుడుం
బాపుఁడె? వీని ధర్మమునఁ బద్మదళాక్షునిఁ గంటి మమ్మ! ము

న్నీ పురుషోత్తముం గదియ నేమి వ్రతంబులు సేసినారమో?
యా పరమేష్ఠి పుణ్యుఁడు గదమ్మ! హరిన్ మముఁ గూర్చె నిచ్చటన్. 209

* పాపాత్ముడైన రాక్షసుడు మనల్ని చెరపట్టాడని ఎప్పుడూ భావిస్తుండేవాళ్లం. వాని ధర్మాన పద్మాక్షుని దర్శించాం. ఈ పురుషోత్తముని దగ్గర చేరడానికి మనం పూర్వజన్మలో ఏ వ్రతాలు చేశామో! శ్రీకృష్ణునితో మనలను జతకూర్చిన ఆ బ్రహ్మదేవుడు ఎంత పుణ్యాత్ముడో.!

క. ఉన్నతి నీతఁడు కౌఁగిట, మన్నింపఁగ నింక బ్రదుకు మానిని మనలో
ము న్నేమి నోము నోఁచెనొ, సన్నుతమార్గముల విపిన జల దుర్గములన్. 210

* ఈ కమలాక్షుడు కనికరంతో కౌగిట జేర్చి గౌరవింపగా జీవించే సౌభాగ్యవతి పూర్వజన్మలో ఏ అరణ్యాలలో, ఏ జలదుర్గాలలో ఎంత తపస్సు చేసిందో!

క. విన్నారమె యీ చెలువముఁ?, గన్నారమె యిట్టి శౌర్యగాంభీర్యంబుల్?
మన్నార మింతకాలముఁ, గొన్నారమె యెన్నఁ డయినఁ గూరిమి చిక్కన్. 211

* ఇటు వంటి సౌందర్యాన్ని గూర్చి ఎక్కడైనా విన్నామా? ఇంతటి శౌర్యాన్నీ, గాంభీర్యాన్నీ ఎప్పుడైన కనుగొన్నామా? ఇంతకాలం జీవించాంగాని ఇంతటి అనురాగాన్ని అందుకున్నామా?

సీ. వనజాక్షి! నేఁ గన్క వైజయంతిక నైన గదిసి వ్రేలుదు గదా కంఠమందు
బింబోష్ఠి! నేఁ గన్క బీతాంబరము నైన మెఱసి యుండుదు గదా మేను నిండఁ
గన్నియఁ నేఁ గన్క గౌస్తుభమణి నైన నొప్పు సూపుదుఁ గదా యురమునందు
బాలిక! నేఁ గన్కఁ బాంచజన్యము నైన మొనసి చొక్కుదుఁ గదా మోవిఁ గ్రోలి

ఆ. పద్మగంధి! నేను బర్హ దామము నైనఁ, జిత్రరుచుల నుందు శిరమునందు
ననుచుఁ బెక్కుగతుల నాడిరి కన్యలు, గములు గట్టి గరుడగమనుఁ జూచి. 212

* ఓ పద్మాక్షీ! నేను గనుక వైజయంతిక నైనట్లైతే అతని మెడలో వ్రేలాడే దానిని గదా! ఓ బింబోష్ఠీ! నేను గనుక పట్టువ్రస్త్రాన్నై నట్లైతే ఆ శరీరంపై ప్రకాశిస్తుండే దానిని గదా! ఓ బాలా! నేను కౌస్తుభమణిని అయినట్లయితే ఆయన వక్షఃస్థలంపై మెరుస్తూ ఉండే దానిని గదా! ఓ కన్యామణీ! నేను పాంచజన్యాన్నైనట్లైతే అతని పెదవిని తాకి పరవశించిపోయే దానిని గదా! ఓ పద్మగంధీ! నేను నెమలి పింఛాన్నైనట్లైతే ఆయన శిరస్సుపై చిత్రమైన కాంతులతో విలసిల్లే దానిని గదా! అని అనేకవిధాలుగా అనుకుంటూ ఆ కన్యలు గుంపులు కూడి ఆ కృష్ణుణ్ణి ఆలోకించారు.

శా. భూనాథోత్తమ! కన్యకల్ వరుస నంభోజాతనేత్రుండు న
న్నే నవ్వెం దగఁ జూచె డగ్గఱియె వర్ణించెన్ వివేకించె స
మ్మానించెం గరుణించెఁ బే రడిగె సన్మార్గంబుతోఁ బెండ్లి యౌ
నేనే చక్రికి దేవి నంచుఁ దమలో నిర్ణీతలై రందఱున్. 213

* శ్రీకృష్ణుడు నన్ను చూచే నవ్వాడు. నావైపే చూశాడు, నా చెంతకు వచ్చాడు, నన్నే వర్ణించాడు, నన్నే గౌరవించాడు, నన్నే కరుణించాడు, నా పేరు అడిగాడు, నన్నే పెండ్లాడుతాడు, నేనే శ్రీకృష్ణుని భార్య నౌతానని ఆ కన్యలందరూ తమలో తాము తలపోశారు.

**వ. ఇట్లు బహువిధంబులం దమ తమ మన్ననలకు నువ్విళ్ళూరు కన్నియలం బదాఱువేల ధవళాంబరాభరణ మాల్యానులేపనంబు లొసంగి, యందలంబుల నిడి, వారలను నరకాసుర భాండాగారంబులం గల నానావిధంబు లయిన మహాధనంబులను, రథంబులను, దురంగంబులను; ధవళంబులై, వేగవంతంబులై, యైరావత కులసంభవంబులైన చతుర్దంత దంతావళంబులను, ద్వారకానగరంబునకుం బనిచి, దేవేంద్రుని పురంబునకుం జని యదితిదేవి మందిరంబు సొచ్చి, యా పెద్దమ్మకు ముద్దు సూపి, మణికిరణపటల పరిభావిత భాను మండలంబులైన కుండలంబు లొసంగి, శచీసమేతుండైన మహేంద్రునిచేత సత్యభామతోడం బూజితుండై, పిదప సత్యభామ కోరిన నందనవనంబు సొచ్చి. 214**

* ఈ విధంగా తన ఆదరణకోసం ఉవ్విళ్ళూరుతున్న ఆ కన్యల కందరకూ తెల్లని చీరలను, ఆభరణాలను, పూమాలలను, సుగంధపు పూతలను శ్రీకృష్ణుడు పంపించాడు. నరకాసురుని కోశాగారంలో ఉన్న నానావిధాలైన ధనసంపదనూ, రథాలనూ, అశ్వాలనూ, అమితమైన వేగం గలిగిన ఐరావతకులంలో ఉద్భవించిన తెల్లని నాల్గుదంతాల ఏనుగులనూ ద్వారకానగరానికి పంపించాడు. ఈ పదారువేలమంది స్త్రీలను పల్లకీలలో ఎక్కించి ద్వారకకు సాగనంపాడు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు దేవేంద్రుని పట్టణమైన అమరావతికి వెళ్లాడు. దేవమాత అదితి అంతఃపురానికి వెళ్లి ఆమె ప్రేమను చూరగొని తమ కాంతులతో సూర్యమండలాన్ని తిరస్కరిస్తున్న మణికుండలాలను ఆమెకు సమర్పించాడు. సత్యభామతో కూడి తాను శచీసమేతుడైన దేవేంద్రుని పూజ లందుకొన్నాడు. తర్వాత సత్యభామ కోరికపై నందనవనంలో ప్రవేశించాడు.

**మ. హరి కేలం బెకలించి తెచ్చి భుజగేంద్రారాతిపైఁ బెట్టె సుం**
**దరగంధానుగత భ్రమద్భ్రమర నాదవ్రాతముం బల్లవాం**
**కుర శాఖాఫల పర్ణ పుష్పకలికా గుచ్ఛాది కోపేతమున్**
**గిరిభిత్త్రాతముఁ బారిజాతముఁ ద్రిలోకీయాచకాఖ్యాతమున్. 215**

* శ్రీకృష్ణుడు కమ్మతావులకోసం క్రమ్ముకుంటున్న తుమ్మెదలతో నిండినదీ, చిగురుటాకులతో, పూగుత్తులతో, ఫలాలతో గూడినదీ, ముల్లోకములందలి యాచకుల కోరికలను తీర్చుటలో ప్రసిద్ధి గాంచినదీ, ఇంద్రునిచే రక్షింపబడేదీ అయిన పారిజాతవృక్షాన్ని చేతితో పెకలించి గరుత్మంతునిపై పెట్టాడు.

**వ. ఇట్లు పారిజాతంబును హరించి యదువల్లభుండు వల్లభయుం, దానును విహగవల్ల భారూఢుండయి చనుచున్న సమయంబున.' 216**

* శ్రీకృష్ణుడు ఇలా పారిజాతాన్ని అపహరించి తన ప్రాణసతి అయిన సాత్రాజితితో పాటు పక్షీంద్రునిపై నెక్కి ప్రయాణమైనాడు.

సీ. నరకాసురుని బాధ నలఁగి గోవిందుని కడ కేగి తత్పాదకమలములకుఁ
దన కిరీటము సోఁక దండప్రణామముల్ గావింప నా చక్రి కరుణ సేసి
చనుదెంచి భూసుతు సమయించి తనవారిఁ దన్ను రక్షించుటఁ దలఁప మఱచి
యింద్రుండు బృందారకేంద్రత్వ మదమునఁ బద్మలోచన! పోకు పారిజాత

ఆ. తరువు విడువు' మనుచుఁ దాఁకె నడ్డము వచ్చి, తఱిమి సురలు నట్లు దాఁకి రకట!
యెఱుక వలదె నిర్జరేంద్రత కాల్పనే?, సురల తామసమును జూడ నరిది. 217

* దేవేంద్రుడు త్రిలోకాధిపతిననే గర్వంతో 'ఓ శ్రీకృష్ణా! దొంగతనంగా పారిజాతవృక్షాన్ని అపహరించుకొని వెళ్ళవద్దు. విడువు విడువు' అని త్రోవకు అడ్డం వచ్చి శ్రీకృష్ణుణ్ణి ఎదిరించాడు. దేవసైన్యం శ్రీకృష్ణునిపై యుద్ధానికి వచ్చింది. నరకాసురుడు పెట్టే బాధలకు ఓర్చుకోలేక దేవేంద్రుడు తాను శ్రీకృష్ణుని దగ్గరకు వెళ్లి, సాష్టాంగనమస్కారం చేస్తే కృష్ణుడు దయతలచి నరకాసురుని సంహరించి దేవతలను రక్షించిన సంగతి మరచిపోయాడు. ఆమాత్రం జ్ఞానం లేని దేవేంద్రపదవి ఎందుకు? దేవతల అహంకారం చాలా ఆశ్చర్యకరంగా ఉంది.

వ. ఇట్లు దనకు నొడ్డారించి యడ్డంబు వచ్చిన నిర్జరేంద్రాదుల నిర్జించి తన పురంబునకుం జని, నిరంతర సురభి కుసుమ మకరంద మాధురీ విశేషంబులకుఁ జొక్కి చిక్కక నాకలోకంబున నుండి వెంట నరుగుదెంచు తుమ్మెదలకు నెమ్మి దలంచు చున్న పారిజాతమ్ము నాశ్రితపారిజాతుం డయిన హరి మహా ప్రేమాభిరామ యగు సత్యభామతోఁ గ్రీడించు మహోద్యానంబున సంస్థాపించి, నరకాసురుని యింటం దెచ్చిన రాజకన్యక లెందఱందఱకు నన్ని నివాసంబులు గల్పించి గృహోపకరణంబులు సమర్పించి. 218

* తనను ఎదిరించిన దేవేంద్రాదులను ఓడించి ఆశ్రితపారిజాతమైన శ్రీకృష్ణుడు పారిజాతవృక్షాన్ని భూలోకానికి తెచ్చి సత్యభామాదేవి ఉద్యానవనంలో నాటించాడు. సువాసనలు విరజిమ్మే పారిజాతపుష్పాల మకరంద మాధుర్యాన్ని వదలలేక దేవలోకంనుండి తుమ్మెదలు సైతం పారిజాత వృక్షాన్ని అనుసరించి వచ్చాయి. శ్రీకృష్ణుడు నరకాసురుని బారినుండి తప్పించి తెచ్చిన రాజకన్యక లందరకూ గృహోపకరణాలతో పాటు వేరువేరు సౌధాలను ఏర్పాటు చేయించాడు.

చ. అమితవిహారుఁ డీశ్వరుఁ డనంతుఁడు దా నొకనాఁడు మంచి ల
గ్నమునఁ బదాఱు వేల భవనంబులలోనఁ బదాఱువేల రూ
పములఁ బదాఱువేల నృపబాలలఁ బ్రీతిఁ బదాఱువేల చం
దముల విభూతి నొందుచు యథావిధితో వరియించె భూవరా! 219

* మహానుభావుడైన శ్రీకృష్ణుడు ఒక శుభముహూర్తాన ఈ పదహారువేల భవనాలలో ఉన్న పదహారువేలమంది రాజకన్యలను, పదహారు వేలరూపాలతో, పదహారువేల రీతులతో శోభిస్తూ శాస్త్రోక్తంగా వివాహమాడాడు.

ఉ. దానములందు సమ్మదవిధానములం దవలోక భాషణా
హ్వానములందు నొక్కక్రియ నా లలితాంగుల కన్నిమూర్తులై
తా ననిశంబు గానఁబడి తక్కువ యెక్కువ లేక యుత్తమ
జ్ఞాన గృహస్థధర్మమునఁ జక్రి రమించెఁ బ్రపూర్ణకాముఁడై. 220

* ప్రేమ నిండిన చూపులలో, సంభాషణలలో, ఆహ్వానాలలో, దానాది క్రియలలో శ్రీకృష్ణుడు ఎక్కువ తక్కువలు లేకుండా ఈ బాలామణుల కందరకూ అన్ని విధాలుగా కన్పించి ఉత్తమమైన గృహస్థ ధర్మాన్ని పాటిస్తూ ఆనందించాడు.

క. తరుణులు బెక్కం డ్రయినను, బురుషుఁడు మనలేఁడు సవతి పోరాటమునన్
హరి యా పదాఱువేవురు, తరుణులతో సమత మనియె దక్షత్వమునన్. 221

* ఎక్కువమంది భార్యలున్నప్పుడు పురుషుడు సవతిపోరాటంతో సతమతమై జీవించలేడు. కాని శ్రీకృష్ణుడు పదహారువేలమంది తరుణుల పట్ల సమానభావాన్ని ప్రదర్శించడంలో తన సామర్థ్యాన్ని చూపించాడు.

శా. ఎన్నేభంగుల యోగమార్గముల బ్రహ్మేంద్రాదు లీక్షించుచున్
ము న్నేదేవునిఁ జూడఁ గానక తుదిన్ మోహింతు, రా మేటి కే
విన్నాణంబుననో సతుల్ గృహిణులై విఖ్యాతి సేవించి ర
చ్ఛిన్నాలోకన హాస భాషణ రతిశ్లేషానురాగంబులన్. 222

* బ్రహ్మ, దేవేంద్రుడు మొదలైనవారు యోగమార్గంలో విష్ణుమూర్తిని దర్శించాలని ఎన్నోరీతులుగా ప్రయత్నించి సాధ్యం కాక చివరకు మాయామోహితు లౌతారో; ఆ మహాత్మునికి ఎంతో నేర్పుతో ఈ స్త్రీలు ఇల్లాండ్రై నిరంతరం వలపుచూపులతోనూ, చిరునవ్వులతోనూ, సరససంభాషణలతోనూ, బిగి కౌగిలింతలతోనూ, కౌతుకంతో కూడిన కలయికలతోనూ సేవించారు.

సీ. ఇంటికి వచ్చిన నెదురేగుదెంచుచు నానీత వస్తువు లందుకొనుచు
సౌవర్ణమణిమయాసనములు వెట్టుచుఁ బదములు గడుగుచు భక్తితోడ
సంవాసిత స్నానజలము లందించుచు సద్గంధవస్త్రభూషణము లొసఁగి
యిష్టపదార్థంబు లిడుచుఁ దాంబూలాదు లొసఁగుచు విసరుచు నోజ మెఱసి

తే. శిరము దువ్వుచు శయ్యపైఁ జెలువు మిగుల, నడుగు లొత్తుచు దాసీసహస్రయుక్త
లయ్యుఁ గొలిచిరి దాసులై హరి సుదారుఁ, దారకాధిప వదనలు దారు దగిలి. 223

* ఇంటికి రాగానే ఎదురు వెళ్ళి తెచ్చిన వస్తువు లందుకుంటారు. మణులతో పొదిగిన బంగారు ఆసనాలు వేస్తారు. భక్తితో పాదాలు కడుగుతారు. స్నానానికి సుగంధంతో గూడిన నీళ్లను అందిస్తారు. సుగంధాలు, వస్త్రాలు, ఆభరణాలు సమర్పించుతారు. ఇష్టమైన పదార్థాలు వడ్డిస్తారు. తాంబూలం అందిస్తూ,

విసురుతూ, తలదువ్వుతూ; పాదాలు పడుతూ వేలకొలది దాసీలు ఉన్నాకూడా ఆ చంద్రముఖులు స్వయంగా వాసుదేవుని సేవించారు.

శా. 'నన్నే పాయఁడు, రాత్రులన్ దివములన్ నన్నే కృపం జెందెడిన్,
నన్నే దొడ్డగఁ జూచు వల్లభలలో, నాథుండు నా యింటనే
యున్నా' డంచుఁ బదాఱు వేలుఁ దమలో నూహించి సేవించి రా
యన్నుల్ గాఢపతివ్రతాత్వ పరిచర్యా భక్తి యోగంబులన్. 224

* ఆ పదహారువేలమంది పడతులుగూడా పాతివ్రత్యంతో, భక్తితో శ్రీకృష్ణుడు రాత్రింబవళ్ళు నా చెంతనే వుంటూ నన్నే ప్రేమిస్తున్నాడని తమలో తాము సంబరపడుతూ యదువల్లభుని ఆదరాభిమానాలతో ఆరాధించారు.

క. ఆ రామలతో నెప్పుడుఁ, బోరాములు సాల నెఱపి పురుషోత్తముఁడున్
గారామునఁ దిరిగెను సౌ, ధారామ లతాసరోవిహారముల నృపా! 225

* ఓ రాజా! ఆ పురుషోత్తముడు ఆస్త్రీలపట్ల స్నేహం ప్రదర్శిస్తూ భవనాలలో, ఉద్యానవనాలలో, సరోవరాలలో స్వేచ్ఛగా విహరించాడు.

క. ఏ దేవుఁడు జగముల, న త్పాదించును మనుచుఁ జెఱుచుఁ బ్రాభవమున మ
ర్యాదా రక్షణమునకై, యా దేవుం డట్లు మెఱసె యాదవులందున్. 226

* ప్రపంచాన్ని తన ప్రభావంతో సృష్టించి, పోషించి, అంతంచేసే ఆ పరమాత్ముడు జగద్రక్షకుడై యాదవులలో శ్రీకృష్ణుడుగా అవతరించి ఆ విధంగా ప్రవర్తించాడు.

## -: శ్రీకృష్ణుండు కేళీగృహమునందు రుక్మిణీదేవితో విరసోక్తు లాడుట :-

వ. అంత నొక్కనాఁడు రుక్మిణీదేవి లోఁగిట మహేంద్రనీల మరకతాది మణిస్తంభ వలభి విటంకపటల దేహళీకవాట విరాజమానంబును, శాంతకుంభ కుడ్య గవాక్ష వేదికా సోపానంబును, విలంబమాన ముక్తాఫలదామ విచిత్ర కౌశేయవితానంబును, వివిధ మణిదీపికా విసర విభ్రాజమానంబును, మధుకరకుల కలిత మల్లికాకుసుమ మాలికాభిరామంబును, జాలకరంధ్ర వినిర్గత కర్పూరాగరుధూప ధూమంబును, వాతాయన విప్రకీర్ణ శిశిరకర కిరణస్తోమంబును, బారిజాతప్రసవామోద పరిమళిత పవన సుందరంబు నయిన లోపలి మందిరంబున శరచ్చంద్రచంద్రికా ధవళపర్యంక మధ్యంబున, జగదీశ్వరుం డయిన హరి సుఖాసీనుండై యుండ, సఖీజనంబులుం దానును డగ్గఱి కొలిచి యుండి. 227

* ఒకనాడు రుక్మిణీదేవి అంతఃపురంలో శరత్కాలపు వెన్నెలవలె తెల్లనైన పాన్పుపై జగదీశ్వరుడైన శ్రీకృష్ణుడు సుఖాసీనుడై ఉన్నాడు. ఆ అంతఃపురం నవరత్నాలు పొదిగిన స్తంభాలతో ఇంద్రనీల మణులు పొదిగిన చంద్రశాలలతో నిండినట్టిది, ఆ చంద్రశాలలోని ద్వారబంధాలు, గడపలు, మండపాలు, తలుపులు, గోడలు, కిటికీలు, అరుగులు, మెట్లు అన్నీ సువర్ణకాంతులు విరజిమ్ముతున్నవి. ఆ అంతఃపురం వ్రేలాడుతున్న

ముత్యాలసరాలతో నిండిన విచిత్రమైన పట్టువస్త్రాల చాందినీలతో వెలుగుతున్నది. అనేక మణిదీపాలతో ప్రకాశిస్తున్నది. అక్కడ వున్న మల్లెపూల దండలపై తుమ్మెదలు మూగివున్నాయి. కర్పూరం, అగరు మొదలైన సుగంధద్రవ్యాల పొగలు ఆ అంతఃపురపు కిటికీల గుండా బయటకు వ్యాపిస్తున్నవి. గవాక్షాలగుండా చల్లని తెల్లని కిరణాలు ప్రసరిస్తున్నాయి. ఉద్యానవనంనుంచి పారిజాత సుగంధపవనాలు వీస్తున్నాయి. అటువంటి అంతఃపురంలో సుఖాసీనుడై వున్న శ్రీహరినీ రుక్మిణీదేవి, ఆమె సఖులూ సేవిస్తున్నారు.

**సీ. కుచకుంభములమీఁది కుంకుమతో రాయు హారంబు లరుణంబు లగుచు మెఱయఁ**
**గరపల్లవము సాఁచి కదలింప నంగుళీయక కంకణప్రభ లావరింపఁ**
**గదలిన బహురత్న కలిత నూపురముల గంభీర నినదంబు గడలు కొనఁగఁ**
**గాంచన మణికర్ణికా మయూఖంబులు గండపాలికలపై గంతు లిడఁగఁ**

**తే. గురులు నర్తింపఁ బయ్యెదకొంగు దూఁగ, బోటి చేనున్న చామరఁ బుచ్చుకొనుచు**
**జీవితేశ్వరు రుక్మిణి సేర నరిగి, వేడ్క లిగురొత్త మెల్లన వీవఁదొడఁగె.** 228

* ఆ సమయంలో వక్షఃస్థలంమీది కుంకుమ అంటుకొని హారాలు ఎఱ్ఱని కాంతితో మెరుస్తుండగా, చిగురుటాకువంటి చేతిని కదలించినప్పుడు కదలిన కంకణాలు, ఉంగరాల కాంతులు ప్రసరిస్తుండగా, రత్నాల అందెలు గంభీరమైన ధ్వని చేస్తుండగా, చెవులకు ధరించిన బంగారు కమ్మల ధగధగలు గండస్థలాలపై వ్యాపిస్తుండగా, ముఖంమీద ముంగురులు కదలాడుతుండగా, పైటకొంగు తూగాడుచుండగా చెలికత్తె చేతిలోని వింజామరను తీసికొని రుక్మిణీదేవి తన జీవితేశ్వరుడైన శ్రీకృష్ణునికి మెల్లగా విసరడం ప్రారంభించింది.

**వ. అప్పుడు.** 229

**మ. పతి యే రూపము దాల్చినం దదనురూపంబైన రూపంబుతో**
**సతి దా నుండెడు నట్టి రూపవతి నా చంద్రాస్య నా లక్ష్మి నా**
**సుతనున్ రుక్మిణి నా యనన్యమతి నా శుద్ధాంతరంగం గళా**
**చతురత్వంబున శౌరి యిట్లనియెఁ జంచన్మందహాసంబుతోన్.** 230

* రుక్మిణి రూపవతి. తన పతికి అనురూపమైన రూపంతో ప్రవర్తించే వివేకవతీ, సౌందర్యవతీ, సౌభాగ్యవతీ, సద్గుణవతీ, తన ప్రియసతీ ఐన ఆ రుక్మిణీదేవిని చూచి శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వుతూ చమత్కారంగా ఇలా అన్నాడు.

**మ. బలశౌర్యంబుల భోగమూర్తి కుల రూప త్యాగ సంపద్గుణం**
**బుల దిక్పాలురకంటెఁ జైద్యముఖరుల్ పూర్ణుల్ ఘనుల్, వారికిన్**
**నెలఁతా! తల్లియుఁ దండ్రియున్ సహజుఁడున్ ని న్నిచ్చినం బోక యీ**
**బలవద్భీరుల వార్ధిలీనుల మముం బాటింప నీ కేటికిన్?** 231

* బలంలో, శౌర్యంలో, భోగంలో, కులంలో, రూపంలో, త్యాగంలో, సంపదలో, సద్గుణంలో దిక్పాలురకంటె చైద్యుడు మొదలైన వారు ఘనులు, పరిపూర్ణులు. అటువంటి శిశుపాలునికి నీ తల్లీ, తండ్రీ, సోదరుడూ నిన్నిచ్చి వివాహం చేద్దామనుకుంటే ఒప్పుకోక సముద్రగర్భంలో తలదాచుకున్న పిరికివాడను నన్నెందుకు నీవు వివాహమాడావు?

**సీ. లోకుల నడవడిలోని వారము గాము, పరులకు మా జాడ బయలు పడదు,**
**బలమదోపేతులు పగగొండ్రు మా తోడ, రాజపీఠములకు రాము తఱచు,**
**శరణంబు మాకు నీ జలరాశి సతతంబు నిష్కించనుల మేము, నిధులు లేవు,**
**కలవారు చుట్టాలు గారు, నిష్కించన జనబంధులము ముక్తసంగ్రహులము,**

**ఆ. గూఢవర్తనులము, గుణహీనులము, భిక్షు, లైన వారిఁ గాని నాశ్రయింప,**
**మిందుముఖులు దగుల, రిటువంటి మముబోఁటి, వారి నేల దగుల వారిజాక్షి! 232**

* పద్మాక్షీ! లోకులకు భిన్నమైన నడవడి గలిగినవారము. ఇతరులు మాజాడ తెలుసుకోలేరు. బలవంతులతోనే శత్రుత్వం పాటిస్తాము. రాజసింహాసనాల కోసం ఆశపడం. సముద్రమే ఎల్లవేళలా మాకు ఆశ్రయస్థానం. మేము దరిద్రులం, ధనహీనులం, గుణహీనులం, పేదలతోనే తప్ప ధనవంతులతో బంధుత్వం చేయం. రహస్యవర్తనులం. భిక్షుకులనే ఆశ్రయిస్తాము. ఇటువంటి వారిని స్త్రీలు వరిస్తారా? ఈ గుణాలున్న నన్ను నీ వెందుకు వలచావు?

**క. సిరియును వంశము రూపును సరియైన వివాహసఖ్య సంబంధంబుల్**
**జరుగును, సరి గాకున్నను, జరగవు, లోలాక్షి! యెట్టి సంసారులకున్. 233**

* సంపద, సౌందర్యం, వంశం సమానంగా వున్నప్పుడే వియ్యం, నెయ్యం శోభిస్తుంది. ఓ లోలాక్షీ! లోకంలో ఎటువంటి వారికైనా ఇవి సమానంగా లేకపోతే సంబంధాలు సమకూరవు.

**క. తగ దని యెఱుఁగవు మమ్మును, దగిలితివి మృగాక్షి! దీనఁ ద ప్పగు, నీకుం**
**దగిన మనుజేంద్రు నొక్కనిఁ, దగులుము, గుణహీనజనులఁ దగునే తగులన్? 234**

* హరిణాక్షీ! నా సంబంధం తగినది కాదని గ్రహించలేకపోయావు. తెలియక నన్ను వివాహమాడావు. చాలా పొరపాటు చేశావు. నీకు తగిన రాజేంద్రుణ్ణి మరెవరినైనా వివాహమాడు. గుణహీనులైన వారితో సంబంధం దగదుగదా!

**సీ. సాల్వ జరాసంధ చైద్యాది రాజులు చెలఁగి నన్ వీక్షించి మలయుచుండ**
**నది గాక రుక్మి నీ యన్నయు గర్వించి వీర్యమదాంధుఁడై వెలయుచున్న**
**వారి గర్వంబులు వారింపఁగాఁ గోరి చెలువఁ నిన్నొడిచి తెచ్చితిమి, గాని**
**కాంతా తనూజార్థ కాముకులము గాము, కామమోహాదులఁ గ్రందుకొనము.**

తే. విను, ముదాసీనులము, క్రియావిరహితులము, పూర్ణులము మేము, నిత్యాత్మ బుద్ధితోడ
వెలుఁగుచుందుము గృహదీపవిధము మెఱసి, నవలతాతన్వి! మాతోడ నవయ వలదు. 235

* సాల్వభూపతి, జరాసంధుడు, శిశుపాలుడు మొదలైన రాజులు నన్ను ద్వేషంతో చూస్తున్నారు. నీ సోదరుడైన రుక్మి బలగర్వంతో మిడిసి పడుతున్నాడు. వారి అహంకారాన్ని అణచడానికి మాత్రమే ఆనాడు నిన్ను బలవంతంగా తీసుకొని వచ్చాను. అంతేకాని కాంతలపట్ల, సంతానంపట్ల, ఐశ్వర్యంపట్ల ఆసక్తి కలిగి కాదు. కామమోహములకు మేము లోనుగాము. ఉదాసీనులము, క్రియారహితులము, పరిపూర్ణులము. నాలుగు గోడలమధ్య వున్న దీపంలాగా నిత్యాత్మబుద్ధితో వెలుగుతుంటాము. అటువంటి మమ్ములను కట్టుకొని ఓ లతాంగీ! ఎందుకు బాధపడతావు?

వ. అని యిట్లు భగవంతుండైన హరి దన్నుఁబాయక సేవించుటం బ్రియురాలను, పట్టంపుదేవి ననియెడి రుక్మిణి దర్పంబు నేర్పున నుపసంహరించి యూరకుండిన నమ్మానవతి యప్రియంబులు నపూర్వంబులునైన మనోవల్లభు మాటలు విని దురంతంబైన చింతాభరంబున సంతాపంబు నొందుచు. 236

* ఈ విధంగా భగవంతుడైన శ్రీ కృష్ణుడు ప్రతినిత్యం తన్ను సేవిస్తూ పట్టపురాణి ననే గర్వంతో ఉన్న రుక్మిణీదేవి అత్మాభిమానం అంతరించే విధంగా పలికాడు. ఆ మానవతి ఇంతకు ముందెన్నడు తన ప్రాణప్రియుని నోట వినని అప్రియమైన మాటలు విని అంతులేని ఆవేదనతో బాధపడుతుంది.

సీ. కాటుక నెఱయంగఁ గన్నీరు వరదలై కుంచకుంభయుగళ కుంకుమము దడియ
విడువక వెడలెడు వేఁడినిట్టూర్పుల, లాలితాధర కిసలయము గందఁ
జెలువంబు నెఱిదప్పి చిన్నవోవుచు నున్న వదనారవిందంబు వాడు దోఁప
మారుతాహతిఁ దూలు మహిత కల్పకవల్లి వడువున మేన్ వడవడ వడంకఁ

తే. జిత్త మెఱియంగఁ జెక్కిటఁ జెయ్యి సేర్చి, కౌతుకం బేది పదతలాగ్రమున నేల
వ్రాసి పెంపుచు మో మరవాంచి వగలఁ, బొందె మవ్వంబు గందిన పువ్వుఁబోలె. 237

* కాటుకతో నిండిన కన్నీటి ధారలు కుచకుంభముల మీది కుంకుమను తడిపి వేశాయి. ఆగకుండా వెల్వడుతున్న వేడి నిట్టూర్పుల వలన చిగురుటాకు వంటి అందమైన పెదవి కందిపోయింది. ముఖపద్మం చెలువం కోల్పోయి వాడిపోయింది. గాలితాకిడికి తూలిపోతున్న కల్పవల్లి విధంగా నెమ్మేను కంపించింది. ఈ విధంగా రుక్మిణి మనస్సు బాధపడి చెక్కిలిపై చెయ్యి చేర్చి దీనదీనంగా కాలితో నేలను రాస్తూ ముఖం వంచుకొని సౌకుమార్యం కోల్పోయిన పూవులాగా ఆకులపాటు చెందింది.

చ. అలికుల వేణి తన్నుఁ బ్రియుఁ డాడిన యప్రియభాష లిమ్మెయిన్
సొలవక కర్ణరంధ్రముల సూదులు చొచ్చిన రీతిగాఁగ బె
బ్బులి రొద విన్న లేడి క్రియఁ బొల్పఱి చేష్టలు దక్కి నేలపై
వలనఱి వ్రాలెఁ గీ లెడలి వ్రాలిన పుత్తడిబొమ్మ కైవడిన్. 238

* తన ప్రియుడు తనతో పలికిన అప్రియమైన వాక్యాలు చెవులలో సూదులు పెట్టి పొడిచినట్లు ఆమెకు బాధ కలిగించాయి. పెద్దపులి గాండ్రింపు విన్న లేడిలాగా, కీలు తప్పి క్రిందపడిపోయిన బంగారు బొమ్మలాగా నిశ్చేష్టురాలై నేలపై వాలిపోయింది.

**వ. ఇట్లు వ్రాలిన.** **239**

**మ. ప్రణతామ్నాయుఁడు కృష్ణుఁ డంతఁ గదిసెన్ బాష్పావరుద్ధారుణే**
**క్షణ విస్రస్త వినూత్నభూషణ దురుక్త క్రూర నారాచ శో**
**షణ నాలింగితధారుణిన్ నిజకులాచారైక సద్ధర్మ చా**
**రిణి విశ్లేషిణి వీతతోషిణిఁ బురంధ్రీగ్రామణిన్ రుక్మిణిన్.** **240**

* ఈ విధంగా ఆమె క్రింద పడిపోగా వేదవేద్యుడైన శ్రీకృష్ణుడు కన్నీటితో నిండి ఎఱ్ఱబడిన నేత్రాలతో, చెదరిన భూషణాలతో, కఠోరములైన పలుకుల ములుకులవలన కలిగిన అలజడితో, నేలపై పడివున్న రుక్మిణిని పట్టుకున్నాడు. సద్వంశ సంభూతురాలూ, శోకసంతప్తురాలూ, సహధర్మచారిణీ, సాధ్వీశిరోమణీ అయిన రుక్మిణిని లేవనెత్తాడు.

**సీ. కని సంభ్రమంబునఁ దనువునం దనువుగా ననువునఁ జందనం బల్ల నలఁది**
**కన్నీరు పన్నీటఁ గడిగి కర్పూరంపుఁ బలుకులు సెవులలోఁ బాఱ నూఁది**
**కరమొప్ప ముత్యాలసరుల చిక్కెడలించి యురమునఁ బొందుగా నిరవు కొలిపి**
**తిలకంబు నునుఫాల ఫలకంబుపైఁ దీర్చి వదలిన భూషణావళులఁ దొడిగి**

**తే. కమలదళ చారు తాలవృంతమున విసరి, పొలుచు పయ్యెదఁ గుచములఁ బొందు పఱిచి**
**చిత్త మిగురొత్త నొయ్యన సేదఁదీర్చి బిగియఁ గౌఁగిటఁ జేర్చి నెమ్మొగము నిమిరి.** **241**

* శ్రీకృష్ణుడు సంభ్రమంతో ఆమె దేహానికి బాగా మంచిగంధం పూశాడు. పన్నీటితో కన్నీటిని కడిగాడు. కర్పూరపు పలుకుల్ని చెవులలో ఊదాడు. ముత్యాలమాలల చిక్కుతీసి వక్షఃస్థలంపై చక్కదిద్దాడు. ముఖాన తిలకం సరిదిద్దాడు. జారిపోయిన భూషణాల నన్నిటినీ అలంకరించాడు. తామరరేకుల విసనకఱ్ఱతో విసిరాడు. పైటను సరిచేశాడు. ముఖం నిమిరాడు. గట్టిగా కౌగిలించుకొని సేదదేర్చి హృదయానందం కలిగించాడు.

**తే. నెరులు గల మరునీలంపు టురుల సిరుల, నరులుగొనఁ జాలి నరులను మరులు కొలుపు**
**నిరుల గెలిచిన తుమ్మెద గఱులఁ దెగడు, కురుల నులిదీర్చి విరు లిడి కొప్పువెట్టి.** **242**

* తుమ్మెద రెక్కలను మించి మానవుల్ని మరులు గొలిపే వినీల కుంతలాలను చక్కగా దువ్వి, కొప్పుతీర్చి, పూలతో అలంకరించాడు.

**క. మురసంహరుఁ డిందిందిర, గరుదనిలచలత్ప్రసూనకలికాంచిత సుం**
**దరశయ్యఁ జేర్చె భీష్మక, వరపుత్రిన్ నుతచరిత్ర వారిజనేత్రన్.** **243**

* శ్రీకృష్ణుడు శీలవతీ, కమలలోచన అయిన రుక్మిణీదేవిని తుమ్మెదల రెక్కల గాలికి కదలుతున్న పూలతో గూడిన అందమైన పాన్పుపైకి చేర్చాడు.

వ. ఇట్లు పానుపునం జేర్చి మృదుమధుర భాషణంబుల ననునయించిన. 244

క. పురుషోత్తము ముఖకోమల, సరసిజ మ య్యిందువదన సవ్రీడా హా
స రుచి స్నిగ్ధాపాంగ, స్ఫుర దవలోకనము లొలయఁ జూ చిట్లనియెన్. 245

* ఈ విధంగా పాన్పుపై చేర్చి మనోహరమైన మధురవాక్కులతో ఊరడించాడు. రుక్మిణీదేవి పురుషోత్తముని అందమైన ముఖారవిందాన్ని సిగ్గుతో గూడిన స్నిగ్ధమైన చూపులతో చూస్తూ ఇలా అన్నది.

## -: రుక్మిణిదేవి శ్రీకృష్ణ లాలితయై యతనిని స్తుతించుట :-

క. మురహర! దివసాగమ దళ, దరవిందదళాక్ష! తలఁప నది యట్టిదగున్
నిరవధిక విమలతేజో, వరమూర్తివి, భక్తలోకవత్సల! యెందున్. 246

* ఓ మురాంతకా! ఉదయాన వికసించుతున్న తామరరేకులను బోలిన నేత్రములతో శోభించువాడా! భక్తలోకమును వాత్సల్యముతో రక్షించు దేవా! నీవు అనంత తేజోమూర్తివి. నీవన్నమాట వాస్తవం,

తే. సంచిత జ్ఞాన సుఖ బలైశ్వర్య శక్తు, లాదిగాఁ గల సుగుణంబు లమరు నీకు,
నేను దగుదునె? సర్వలోకేశ్వరేశ!, లీలమై సచ్చిదానందశాలి వనఘ! 247

* జ్ఞానము, సుఖము, బలము, ఐశ్వర్యము మొదలైన సద్గుణాలన్నీ నీలో నెలకొన్నాయి. ఓ సర్వలోకేశ్వరా! సచ్చిదానందమూర్తీ! పుణ్యపురుషా! నీకు నేను తగినదానను కాను.

సీ. రూఢిమైఁ బ్రకృతి పూరుష కాలములకు నీశ్వరుఁడవై భవదీయ చారుదివ్య
లలితకళా కౌశలమున నభిరతుఁడై కడఁగు నీ రూప మెక్కడ మహాత్మ!
సత్త్వాది గుణ సముచ్చయయుక్త మూఢాత్మ నయిన నే నెక్కడ? నవఘచరిత!
కోరి నీ మంగళ గుణభూతి దానంబు సేయంగఁబడు నని చెందు భీతి

తే. నంబునిధి మధ్యభాగమం దమృతఫేన పటల పాండుర నిభమూర్తి! పన్నగేంద్ర
భోగశయ్యను బవ్వళింపుచును దనరు, నట్టి యున్నతలీల దివ్యంబు దలఁప. 248

* ఓ మహాత్మా! నీవు ప్రకృతి పురుషులకూ, కాలానికీ, ఈశ్వరుడవు. కళాకౌశలంతో శోభించే నీ మనోహరమైన రూప మెక్కడ? త్రిగుణాలతో గూడిన మూఢురాలను నే నెక్కడ? నీ సద్గుణ సంపదదానం చేయబడుతుందనే భయంతో నేమో ఎవరికీ అందకుండా పాలసముద్రంలో శేషతల్పంపై పవ్వళిస్తున్నావు. ఇట్టి నీ లీలలు దివ్యమైనవి.

వ. శబ్ద స్పర్శ రూప రస గంధంబు లనియెడు గుణంబులచేతఁ బరిగ్రహింపఁబడిన మంగళ సుందర విగ్రహుండవై, యజ్ఞానాంధకార నివారకంబైన రూపంబుఁ గైకొని, భవదీయులైన సేవకులకు

**ననుభావ్యుండ వైతి, భవత్పాదారవింద మకరంద రసాస్వాద లోలాత్ములైన యోగీంద్రులకైనను భవన్మార్గంబు స్ఫుటంబు గా, ద ట్లగుటం జేసి యీ మనుజ పశువులకు దుర్విభావ్యం బగుట యేమి సెప్ప? నిట్టి యీశ్వరుండవైన నీకు నిచ్చ స్వతంత్రంబు గావున నదియును నా కభిమతంబు గావున నిన్ను నే ననుసరింతు, దేవా! నీ వకించనుఁడ వైతేని బలిభోక్త లయిన బ్రహ్మేంద్రాదు లెవ్వని కొఱకు బలి సమర్పణంబు సేసిరి? నీవు సమస్త పురుషార్థమయుండ వనియును, ఫలస్వరూపి వనియును నీ యందలి ప్రేమాతిశయంబులం జేసి విజ్ఞానదీపాంకురంబున నిరస్త సమస్త దోషాంధకారులై యిహసౌఖ్యంబులు విడిచి సుమతులు భవదీయదాస సంగంబు గోరుచుండుదు; రట్లు సేయనేరక నిజాధికారాంధకారమగ్నులైన వారు భవత్తత్త్వంబు దెలిసి బలిప్రక్షేపణంబులు సేయంజాలక మూఢులై సంసారచక్రంబునం బరిభ్రమింతు రదియునుం గాక.** 249

* శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనే గుణాలచేత పరిగ్రహింపబడిన మంగళాకారుడవు నీవు. అజ్ఞానాంధకారాన్ని తొలగించే రూపాన్ని పొంది నీ భక్తులచే సేవింపబడుతున్నావు. నీ పాదపద్మ మకరంద రసాన్ని ఆస్వాదించే యోగీంద్రులకు గూడా నీ మార్గం స్పష్టం కాదు. ఇక ఈ మనుష్య పశువులకు ఊహింపరానిది కావడంలో ఆశ్చర్యం ఏముంది? ఇట్టి పరమేశ్వరుడైన నీవు స్వతంత్రుడవు. నిన్ను నేను అనుసరిస్తున్నాను. దేవా! నీవు దరిద్రుడవైతే పూజా ద్రవ్యాలను స్వీకరించే బ్రహ్మేంద్రాది దేవతలు పూజాద్రవ్యాలను ఎవరికి సమర్పిస్తున్నారు? నీవు సమస్త పురుషార్థమయుడవనీ, ఫలస్వరూపివనీ భావించి నీ మీది ప్రేమచేత సమస్తదోషాలనే అంధకారాన్ని విజ్ఞానమనే దీపంతో అణచివేసి, ఇహలోక సౌఖ్యాలను వదలివేసి, సత్పురుషులు నీ సన్నిధిని కోరుతున్నారు. అధికారమనే అంధకారంలో మునిగి నీ తత్త్వం తెలుసుకోలేక, నిన్ను పూజింపక కొందరు సంసారచక్రంలో పరిభ్రమిస్తుంటారు.

**ఆ. వరమునీంద్ర యోగివర సురకోటిచే, వర్ణిత ప్రభావ వైభవంబు**
**గలిగి యఖిల చేతనులకు విజ్ఞాన ప్ర, దుండ వగుదు వభవ! దురితదూర!** 250

* ఓ జన్మరహితా! పాపరహితా! మునీంద్రులచే, యోగివరులచే, దేవతలచే వర్ణితమైన ప్రభావం గల నీవు అఖిల జీవులకు విజ్ఞానదాయకుడవైన వాడవు.

**వ. దేవా! భవదీయ కుటిలభ్రూవిక్షేపోదీరిత కాలవేగంబుచేత విధ్వస్త మంగళులగు కమలభవ భవ పాకశాసనాదులం దిరస్కరించినట్టి మదీయ చిత్తంబున.** 251

* ఓ దేవా! నీ కనుబొమలు ముడిపడినంత మాత్రాన సిరులు గోల్పోయి చెదరి బెదరిపోయే బ్రహ్మ, ఈశ్వరుడు, దేవేంద్రుడు మొదలైనవారి నందరినీ నా హృదయం తిరస్కరించింది.

**చ. నిను వరియించినం బెలుచ నీరజలోచన! శార్ఙ్గసాయ కా**
**సన నినదంబులన్ సకల శత్రుధరాపతులన్ జయించి బో**
**రన పశుకోటిఁదోలు మృగరాజు నిజాంశము భూరిశక్తిఁ గై**
**కొనిన విధంబునన్ నను నకుంఠిత శూరతఁ దెచ్చి తీశ్వరా!** 252

* నా మనస్సు నిన్ను వరించింది. ఆ సమయంలో ఓ నీరజలోచనా! నీ ధనుష్టంకారముతో సమస్త శత్రురాజులను జయించి మృగరాజు మృగాలను పారద్రోలి తన భాగాన్ని గ్రహించినట్లు శూరత్వంతో నీదాననైన నన్ను పరిగ్రహించావు.

**ఉ. అట్టి నృపాల కీటముల నాజి నెదుర్పఁగ లేనివాని య**
**ట్లొట్టిన భీతిమై నిటు పయోధిశరణ్యుఁడ వైతి వింతయున్**
**నెట్టన మాయ గాక యివి నిక్కములే? భవదీయ భక్తులై**
**నట్టి నరేంద్రమౌళిమణు లంచిత రాజబుషుల్ ముదంబునన్. 253**

**ఆ. వితత రాజ్యగరిమ విడిచి కాననముల, నాత్మలందు మీ పదాబ్జయుగము**
**వలఁతి గాఁగ నిలిపి వాతాంబు పర్ణాశ, నోగ్రనియతు లగుచు నుందు రభవ! 254**

* అటువంటి రాచపురుగులను రణరంగంలో ఎదిరించలేక భయపడినట్లు నీవు సముద్ర మధ్యంలో నివాసం ఏర్పాటు చేసుకున్నావు. ఇది నీ మాయ కాక వాస్తవమా? నీ భక్తులైన రాజాధిరాజులు, రాజర్షులు సంతోషంతో సమస్త రాజ్యసంపదలను వదలి, అరణ్యాలకు వెళ్ళి నీ పాదాబ్జాలనే ధ్యానిస్తూ నీటిని, గాలిని, ఆకులను మాత్రమే ఆహారంగా స్వీకరిస్తూ ఉగ్రమైన నియమాలను పాటిస్తూ తపస్సు చేస్తున్నారు.

**మ. విమలజ్ఞాననిరూఢులైన జనముల్ వీక్షింప మీ పాద కం**
**జ మరంద స్ఫుట దివ్యసౌరభము నాస్వాదించి నిర్వాణ రూ**
**పము సత్పూరుష వాగుదీరితము శోభాశ్రీనివాసంబు నౌ**
**మిము సేవింపక మానవాధముని దుర్మేధాత్ము సేవింతునే? 255**

* నిర్మలజ్ఞానధనులైన జనులు వీక్షిస్తుండగా మీ పాదపద్మ మకరంద మాధుర్య సౌరభాలనూ ఆస్వాదించుతూ మోక్షదాయకమూ సత్పురుషుల స్తుతికి పాత్రమూ, శుభావహమూ అయిన మీ మూర్తిని సేవించక దుర్మేధాత్ముడైన మానవాధముణ్ణి ఎవరు సేవిస్తారు?

**వ. మఱియును దేవా! భూలోకంబునందును, నిత్యనివాసంబునందును, సకలప్రదేశంబులందును జగదీశ్వరుండ వయిన నిన్ను నభిమతంబు లయిన కామరూపంబులు గైకొని వరియింతు, భవదీయ చరణారవింద మకరందాస్వాదన చాతుర్య ధుర్యభృంగియైన కామిని యతిహేయంబైన త్వక్ శ్మశ్రు రోమ నఖ కేశంబులచేతఁ గప్పంబడి యంతర్గతం బయిన మాంసాస్థి రక్త క్రిమి విట్కఫ పిత్త వాతంబులం గల జీవచ్ఛవం బయిన నరాధముని మూఢాత్మయై కామించునే? యదియునుం గాక. 256**

* అంతేకాక ఓ దేవా! సకల చరాచర ప్రపంచానికి అధీశ్వరుడవైన నిన్ను భూలోకమందునూ, వైకుంఠంలోనూ, అన్ని ప్రదేశాలలోనూ, నేను అభిమతాలైన కామరూపాలతో సేవిస్తాను. నీ పాదపద్మ మకరందాన్ని ఆనందంగా ఆస్వాదించే నేర్పుగల తుమ్మెద వంటి వాల్గంటి ఎముకలతో, మాంసంతో, చర్మాదులతో కప్పబడి జీవచ్ఛవంలా ఉండే నరాధముణ్ణి ఎలా కామిస్తుంది? అంత తెలివితక్కువది ఎక్కడైనా ఉంటుందా?

సీ. నీరదాగమమేఘనిర్యత్పయః పాన చాతకం బేగునే చౌటి పడెకుఁ?
బరిపక్వ మాకంద ఫలరసంబులు గ్రోలు కీరంబు సనునె దుత్తూరములకు?
ఘనరవాకర్ణనోత్కలిక మయూరము గోరునే కఠిన ఝిల్లీరవంబుఁ?
గరికుంభ పిశిత సద్గ్రాస మోదిత సింహ మరుగునే శునక మాంసాభిలాషఁ

తే. బ్రవిమలాకార! భవదీయ పాదపద్మ, యుగ సమాశ్రయ నైపుణోద్యోగచిత్త
మన్యుఁ జేరునె తన కుపాస్యంబు గాఁగ? భక్తమందార! దుర్భర భవవిదూర! 257

* వర్షాకాలంలో మేఘం నుండి వెలువడే జలబిందువులను ఆస్వాదించే చాతకపక్షి చవిటిగుంటలోని నీటికోసం వెళుతుందా? పండిన మామిడి పండ్ల రసాన్ని గ్రోలే చిలుక ఉమ్మెత్తలను ఆశ్రయిస్తుందా? నీలమేఘ గర్జనాన్ని విని ఆనందించే నెమలి ఈలపురుగు ధ్వనిని కోరుకుంటుందా? ఏనుగు కుంభస్థలంలోని మాంసాన్ని భుజించి తృప్తి చెందే సింహం కుక్కమాంసం కోసం కక్కుర్తి పడుతుందా? ఓ శుభాకారా! నీ పాదపద్మద్వయాన్ని కోరి ఆశ్రయించి ఆనందించే హృదయం ఓ భక్తమందారా! భవవిదూరా! మరొకదానిని ఎందుకు అభిలషిస్తుంది.?

క. వాసవవందిత ! భవ కమ, లాసన దివ్యప్రభా సభావలి కెపుడున్
నీ సమధిక చారిత్ర క, థా సురుచిరగాన మవితథం బయి చెల్లున్. 258

* దేవేంద్రునిచే స్తుతింపబడు ఓ దేవాదిదేవా! కైలాసంలోనూ, సత్యలోకంలోనూ, ఎప్పుడూ నీ దివ్యగాథలే కమ్మగా గానం చేయబడుతుంటాయి.

క. ధరణీనాథులు దమతమ, వరవనితామందిరముల వసియించుచు గో
ఖర మార్జాలంబుల గతి, స్థిరబద్ధు లగుదురు నిన్నుఁ దెలియని కతనన్. 259

* నిఖిలేశ్వరుని నిన్ను గుర్తింపలేని రాజులు తమ ప్రేయసీ మందిరాలలో నివసిస్తూ పశువులలాగా స్థిరంగా బంధింపబడుతుంటారు.

ఆ. జలజనాభ! సకల జగదంతరాత్మవై, నట్టి దేవ! నీ పదారవింద
యుగళి సానురాగయుక్తమై నా మదిఁ, గలుగునట్లు గాఁగఁ దలఁపు మనఘ! 260

* ఓ పద్మనాభా! సకల జగదంతర్యామివి నీవు. అటువంటి నీ పాదపద్మాల మీద నా బుద్ధి అనురాగంతో ప్రసరించేటట్లు అనుగ్రహించు.

ఆ. పృథు రజోగుణ ప్రవృద్ధ మైనట్టి నీ, దృష్టిచేత నన్నుఁ దేరుకొనఁగఁ
జూచు టెల్ల పద్మలోచన! నా మీఁద, ఘనదయార్ద్ర దృష్టిగాఁ దలంతు. 261

* రాజీవలోచనా! రాజసంతో విరాజిల్లే నీ దృష్టితో నన్ను తేరుకొనేటట్లు చూడడం నన్ను దయార్ద్ర దృష్టితో చూడడంగానే భావిస్తాను.

వ. అదియునుం గాక, మధుసూదనా! నీ వాక్యంబులు మిథ్యలు గావు, తల్లి వచనంబు కూఁతున కభిమతంబు గాదె? యౌవనారూఢ మదంబున స్వైరిణి యగు కామిని పురుషాంత రాసక్త యగుట విచారించి పరిజ్ఞాని యైనవాఁడు విడుచు, నవివేకి యయిన పురుషుం డింద్రియలోలుండై రతిందగిలి దాని విడువనేరక పరిగ్రహించి యుభయ లోకచ్యుతుండగు, నట్లు గావున నీ యెఱుంగని యర్థంబు గలదే? యని విన్నవించిన రుక్మిణీదేవి వచనంబులకుఁ గృష్ణుండు సంతసిల్లి యిట్లనియె. 262

* ఓ మధుసూదనా! నీ వాక్యాలు అసత్యాలు కావు. కన్నతల్లిమాట గారాబు కుమార్తెకు అభిమతమే గదా! యౌవనమదంతో స్వైరిణియైన కామిని అన్యపురుషాసక్త అయితే జ్ఞానవంతు డైనవాడు ఆమెను పరిత్యజిస్తాడు. అవివేకియైన పురుషుడు ఇంద్రియలోలత్వంతో ఆ స్త్రీని విడువలేక ఉభయలోకాలకు భ్రష్టుడౌతాడు. అందువలన నీకు తెలియని ధర్మం లేదు- అని రుక్మిణి విన్నవించింది. అప్పుడు కృష్ణుడు మిక్కిలి సంతోషంతో ఇలా అన్నాడు.

## -: కృష్ణుండు రుక్మిణీదేవి నూరడించుట :-

చ. 'అలికులవేణి! నవ్వులకు నాడిన మాటల కింత నీ మదిం
గలఁగఁగ నేల? వేఁటలను గయ్యములన్ రతులందు నొవ్వఁగాఁ
బలికిన మాట లెగ్గు లని పట్టుదురే? భవదీయ చిత్తముం
దెలియఁగఁ గోరి యేఁ బలికితిన్ మదిలో నిటు గుంద నేఁటికిన్? 263

* అలివేణీ! రుక్మిణీ! నేను నవ్వులాటకన్న మాటలకు నీ వెందుకు ఇంత బాధపడుతున్నావు? వేటలో, రణరంగంలో, రతి సమయంలో సూటి పోటుమాటలు మాట్లాడినా తప్పుగా భావించకూడదు. నీ మనస్సు తెలుసుకోవడంకోసం ఇలా అన్నాను. ఈ భాగ్యానికి నీవు బాధ చెందవద్దు.

వ. అదియునుం గాక. 264

ఉ. కింకలు ముద్దుబల్కులును గెంపుఁగనుంగవ తియ్యమోవియున్
జంకెలు తేఱిచూపు లెకసక్కెములున్ నెలవంక బొమ్మలుం
గొంకక వీడనాడుటలుఁ గూరిమియుం గల కాంతఁ గూడుటల్
అంకిలిలేక జన్మఫల మబ్బుట గాదె కురంగలోచనా!' 265

* అదీగాక హరిణలోచనా! పొలయలుక, మురిపెపు మాటలు, బెదరింపు చూపులు, తియ్యని కెమ్మోవి, ఎకసెక్కాలు, నెలవంకలు కనుబొమలు, విదిలింపులు, అదలింపులు, వలపులు గల చెలువలతో సమాగమం లభిస్తే జన్మ సఫలమైనట్లే గదా!

వ. అని మఱియు నిట్లనియె. 266

ఉ. 'నీవు పతివ్రతామణివి నిర్మల ధర్మవివేక శీల స
ద్భావవు నీ మనోగతులఁ బాయక యెప్పుడు నస్మదీయ సం

సేవయ కాని యన్యము భజింపవు, పుట్టిన నాఁట నుండి నీ
భావ మెఱింగి యుండియును బల్కిన తప్పు సహింపు మానినీ!' 267

* అని కృష్ణుడు మరల ఇలా పలికాడు. దేవీ! నీవు మహా పతివ్రతవు, సౌశీల్యవతివి. నాసేవ తప్ప నీకు బాల్యంనుండి అన్యచింత లేనేలేదు. ఇదంతా తెలిసికూడా నేను నిన్నలా బాధపెట్టినందుకు నన్ను మన్నించు.

వ. అని వెండియు నిట్లనియె, 'నీ వాక్యంబులు శ్రవణసుఖంబు గావించె, నీవు వివిధంబులైన కామంబులు గోరితివేని, నవియన్నియు నా యంద యుండుటం జేసి యేకాంతసేవా చతురవైన నీకు నవి యన్నియు నిత్యంబులై యుండు. నీ పాతివ్రత్యంబును, నా యందలిస్నేహంబు నతివిశదంబు లయ్యె, నా వాక్యములచేత భవదీయ చిత్తంబు చంచలంబు గాక నా యందలి బుద్ధి దృఢం బగుం గావున సకల సంపద్విలసితంబైన ద్వారకానగర దివ్యమందిరంబులందు నీదు భాగ్యంబునం జేసి సంసారి కైవడి నీ యందు బద్ధానురాగుండనై వర్తింతుఁ, దక్కిన ప్రాణేంద్రియ పరవశత్వంబున వికృత శరీరధారిణియైన సతి నన్నుం జెందుట దుష్కరం;, బదియునుం గాక మోక్షప్రదుండనైన నన్నుఁ గామాతురలైన యల్పమతులు వ్రత తపోమహిమలచేత దాంపత్య యోగంబుకై సేవింతు, రదియంతయు నా మాయావిజృంభితంబు, దానంజేసి వారు మందభాగ్యలై నిరయంబు నొందుదు; రట్లు గావున నీ సమానయైన కాంత యే కాంతలందైనఁ గలదె? నీ వివాహకాలంబున ననేక రాజన్యవర్యులఁ గైకొనక భవదీయ మధురాలాప శ్రవణాత్మకుండ నయిన నా సన్నిధికి నా శరీరం బితర యోగ్యంబు గాదు, నీకు శేషంబునయి యున్నదాన'నని యేకాంతంబునం బ్రాహ్మణుం బుత్తెంచిన నేనును జనుదెంచి నీ పరిణయ సమయంబున భవత్సహోదరుం బట్టి విరూపుం గావించిన నది గనుంగొనియును నా యందలి విప్రయోగ భయంబున నూరకుండితి; వది గావున బహు ప్రకారంబులై వర్తించు నీ సద్గుణంబులకు సంతసింతు! నని యి వ్విధంబున దేవకీసుతుండు నరలోక విడంబనంబుగ గృహస్థుని భంగి నిజగృహకృత్యంబు లాచరించు చుండెనని శుకుండు మఱియు ని ట్లనియె. 268

* నీ మాటలు నాకు శ్రవణానందాన్ని కల్గించాయి. నీవు కోరిన వన్నీ నాయందే ఉన్నవి గనుక ఏకాంతసేవా చతురవైన నీకు అవన్నీ లభిస్తాయి. నీ పాతివ్రత్యమూ, నామీది ప్రేమా స్పష్టమయ్యాయి. నామాటలచేత నీ మనస్సు సంచలించకుండా నామీది నీ అనురాగం ఇంకా దృఢమవుతుంది. కాబట్టి సమస్త భోగభాగ్యాలతో నిండిన ఈ ద్వారకానగర దివ్యమందిరాలలో కేవలం ఒక గృహస్థులాగా నీపై బద్ధానురాగంతో ప్రవర్తిస్తాను. ఇదంతా నీ అదృష్టం. ఇంద్రియలోలురాలైన వికృతస్వరూపిణి అయిన స్త్రీ నన్ను పొందడం దుష్కరం.అంతేకాదు. మోక్షదాయకుడనైన నన్ను కామాతురలైన అల్పబుద్ధులు వ్రతాలతో తపస్సుతో దాంపత్య జీవితంకోసం సేవిస్తుంటారు. ఆ భావం నామాయవలన విజృంభించిందే. అందువలన వారు భాగ్యవిహీనలై నరకాన్ని పొందుతారు. నీతో సమానమైన స్త్రీ ఈ లోకంలో లేదు. నీవు వివాహకాలంలో ఎందరినో గొప్ప గొప్ప రాజన్యులను తిరస్కరించావు. నేను నీ దానను. ఈ నా దేహంమీద అన్యులెవ్వరికీ అధికారం లేదు అంటూ బ్రాహ్మణుని నా చెంతకు పంపించావు. నేను నీ ఆహ్వానాన్ని మన్నించి వచ్చి నిన్ను వివాహమాడే సందర్భంలో నీ సోదరుణ్ణి వికారస్వరూపుణ్ణి గావించాను. అది చూచి కూడా నా వియోగాన్ని

సహించలేక ఊరకున్నావు. ఇటువంటి నీ సద్గుణాలకు ఎంతో సంతోషించాను' అని ఈ విధంగా పలికి దేవకీ తనయుడు మానవలోక ధర్మా న్ననుసరించి గృహస్థువలెనే తన గృహకృత్యాలను ఆచరిస్తున్నాడని శుకుడు తెలిపి పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు.

**క. అని యిట్లు కృష్ణుఁ డాడిన, వినయ వివేకానులాప వితతామృత సే**
**చన, ముదితహృదయయై య, వ్వనితామణి వికచ వదన వనరుహ యగుచున్.** 269

* శ్రీకృష్ణుడు ఇలా ఇంపుగా, ఊరడింపుగా, వినసొంపుగా పలికాడు. ఆ వాగమృత ధారలకు రుక్మిణీదేవి ముఖారవిందం సంతోషంతో వికసించింది.

**క. నగ వామతించు చూపులు, నగధరు మోమునను నిలిపి నయమునఁ గరముల్**
**మొగిచి వినుతించెఁ గృష్ణున్, ఖగవాహున్ రుచిరదేహుఁ గలితోత్సాహున్.** 270

* అప్పుడు రుక్మిణి చిరునవ్వుతో నిండిన చూపులతో శ్రీకృష్ణుని వైపు చూచి చేతులు జోడించి ఖగవాహనుడైన ఆ జగన్మోహనుని, ఆ దేవ దేవుని స్తుతించింది.

**చ. అతుల విరాజమానముఖుఁడై వివిధాంబర చారుభూషణ**
**ప్రతతులతోడఁ గోరిన వరంబులు దద్దయు నిచ్చె గృష్ణుఁ డు**
**న్నతశుభమూర్తి దేవగణ నందితకీర్తి దయానువర్తియై**
**యతిమృదువాణికిం గిసలయారుణపాణికి నీల వేణికిన్.** 271

* దేవతాగణాల స్తోత్రాలకు పాత్రుడైన శ్రీకృష్ణుడు సంతోషంతో ప్రకాశించే ముఖం కలవాడై, చిగురువలె ఎఱ్ఱని హస్తములూ, నల్లనైన కురులూ, మృదుమధురములైన మాటలూ గల రుక్మిణీదేవికి అనేక విధాలైన ఆభరణాలనూ, వస్త్రాలనూ బహూకరించాడు. కోరిన కోరికలు తీర్చాడు.

**వ. ఇట్లు సమ్మానించి కృష్ణుండు రుక్మిణియుం దానును దదనంతరంబ.** 272

**చ. ఎలమి ఘటింపఁగాఁ గలసి యాడెల నీడల మల్లికా లతా**
**వలిఁ గరవీరజాతి విరవాదుల వీథులఁ గమ్మ దెమ్మెరల్**
**వొలయు నవీనవాసములఁ బొన్నలఁ దిన్నెలఁ బచ్చరచ్చలన్**
**గొలఁకుల లేఁగెలంకులను గోరిక లీరిక లొత్తఁ గ్రొత్తలై.** 273

* ఈ ప్రకారంగా రుక్మిణిని సమ్మానించిన అనంతరం ఆ దంపతు లిరువురూ మల్లెపొదలలో, విరాజాజి నికుంజాలలో, చిరుగాలులకు పులకరించే చంద్రకాంత శిలా వేదికలపైనా, మరకత మణిసౌధాలలో, సరోవరతీరాలలో తనివితీరా విహరించారు,

**క. ఆరామభూములందు వి, హారామల సౌఖ్యలీల నతిమోదముతో**
**నా రామానుజుఁ డుండెను, నా రామామణియుఁ దాను నభిరామముగన్.** 274

* శ్రీకృష్ణుడు రమణీయాలైన ఉద్యానవనాలలో రమణీమణి అయిన రుక్మిణితో గూడి విహరించి ఆనందించాడు.

**వ. మఱియు ననేకవిధ మణివితానాభిశోభిత ప్రాసాదోపరిభాగంబులను, లాలిత నీలకంఠ కలకంఠ కలవింక శుక కలాపకలిత తీరంబులను, మకరందపాన మదవదిందిందిర ఝంకార సంకుల కమల కహ్లార సుధాసార నీహారపూరిత కాసారంబులను, ధాతునిర్ఝర రంజిత సానుదేశగిరి కుంజ పుంజంబులను, గృతకశైలంబులను, గ్రీడాగృహంబులనుం జెలంగి నందనందనుండు విదర్భరాజనందనం దగిలి కందర్పకేళీ లోలాత్ముండయ్యె, ననంతరం బా సుందరీలాలామంబు వలనఁ బ్రద్యుమ్నుండు, చారుధేష్ణుండు, చారుదేవుండు, సుధేష్ణుండు, సుచారువు, చారుగుప్తుండు, భద్రచారువు, చారుభద్రుండు, విచారువు, చారువు ననియెడు పదుగురు తనయులం బడసె, నట్లు సత్యభామాజాంబవతీ నాగ్నజితీ కాళిందీ మాద్రి మిత్రవిందా భద్రలకు వేఱు వేఱ పదుగురేసి భద్రమూర్తులైన కుమారు లుదయించి రవ్విధంబున మఱియును. 275**

* నానావిధాలైన విచిత్రమణులతో శోభించే చాందినీలతో విలసిల్లే ప్రాసాదాలలోనూ, పెంపుడు నెమిళ్లతో, కోకిలలతో, గోరువంకలతో, చిలుకలతో నిండి మకరందపానము చేసి మదించిన తుమ్మెదల ఝుంకారములతో, చల్లని తెల్లని మధురజలాలతో కూడిన కమనీయ కమల సరోవరతీరాలలో, జలప్రవాహాలతో ఎఱ్ఱనైన కొండచరియల పొదరిండ్లలో, లీలాపర్వతాలలో, క్రీడాగృహాలలో శ్రీ కృష్ణుడు రుక్మిణీదేవితో కలిసి మన్మథవిలాసాలలో మునిగితేలాడు.

రుక్మిణీదేవివలన శ్రీకృష్ణునకు ప్రద్యుమ్నుడు, చారుధేష్ణుడు, చారుదేవుడు, సుధేష్ణుడు, సుచారువు, చారుగుప్తుడు, భద్రచారువు, చారుభద్రుడు, విచారువు, చారువు అనే పదిమంది పుత్రులు కలిగారు. సత్యభామ, జాంబవతి, నాగ్నజితి, కాళింది, మాద్రి, మిత్రవింద, భద్రలకు కూడా ఒక్కొక్కరికి పదిమంది అందమైన కుమారులు ఉదయించారు.

**చ అనఘ! పదాఱువేల సతులందు జనించిరి వేఱు వేఱ నం**
**దన దశకంబు తత్సుతవితానము గాంచి రనేక సూనుల**
**న్నె నయఁగ నిట్లు పిల్లచెఱ కీనిన కైవడిఁ బుత్త్రపౌత్త్ర వ**
**ర్ధనమున నొప్పెఁ గృష్ణుఁడు ముదంబునఁ దామరతంపరై భువిన్. 276**

* పదహారువేలమంది భార్యలలో ఒక్కొక్కరికి పదిమంది పుత్రులు శ్రీ కృష్ణునికి ఉద్భవించారు. ఆ పుత్రులందరికి మళ్ళీ కుమారులు కలిగారు. ఈ విధంగా పిల్ల చెఱకుకు పిలకలు పుట్టినట్లు తామరతంపరగా విలసిల్లిన పుత్రపౌత్రులతో శ్రీకృష్ణుడు శోభించాడు.

**తే. అట్లు యదు వృష్ణి భోజాంధకాది వివిధ, నామధేయాంతరముల నెన్నంగ నూట**
**యొక్కటై చాల వర్ధిల్లె న క్కులంబు, నృపకుమారులఁ జదివించు నేర్పు గలుగు. 277**

తే. గురుజనంబులు విను మూఁడు కోట్లమీఁద, నెనుబ దెనిమిదివేలపై నెసఁగ నూర్వు
రన్నఁ దద్బాలకావలి నెన్న ఁదరమె, శూలికైనను దామరచూలికైన? 278

* ఈ విధంగా యాదవ, వృష్ణి భోజ, అంధక మొదలైన నూట ఒక్క పేర్లతో ఆకులం వర్ధిల్లింది. ఆ రాజకుమారులకు విద్యనేర్పే గురువర్యులు మూడుకోట్ల ఎనభైవేల ఒక్క వందమంది ఉన్నారంటే ఇక ఆ రాజకుమారుల వైభవం వర్ణించడానికి బ్రహ్మకైనా, పరమేశ్వరుని కైనా సాధ్యమౌతుందా?

వ. అందు గోవిందనందనుండైన ప్రద్యుమ్నునకు రుక్మి కూఁతువలన ననిరుద్ధుండు సంభవించె ననిన మునివరునకు భూవరుం డిట్లనియె. 279

* అందులో గోవిందుని నందనుడైన ప్రద్యుమ్నునికి రుక్మి కుమార్తెవలన అనిరుద్ధుడు ఉద్భవించాడు అని చెప్పగా రాజేంద్రుడు మునీంద్రునితో ఇలా అన్నాడు.

## -: అనిరుద్ధుని వివాహ సమయమున బలరాముఁడు రుక్మి మొదలగు వారినిం జంపుట :-

క. బవరమునఁ గృష్ణుచే ము, న్నవమానము నొంది రుక్మి యచ్యుతు గెలువం
దివురుచుఁ దన సుత నరిసం, భవునకు నెట్లిచ్చె? నెఱుఁగఁ బలుకు మునీంద్రా! 280

* ఓ శుకయోగీంద్రా! అలనాడు శ్రీకృష్ణునితో జరిగిన యుద్ధంలో రుక్మి కృష్ణునిచేత అవమానం పొంది ఏలాగైనా శ్రీకృష్ణునిపై పగదీర్చుకోవాలని చూస్తున్నాడు గదా; అటువంటివాడు తన శత్రువు కుమారుడికి తనకూతురు నిచ్చి ఎలా వివాహం చేశాడు? ఈ సంగతి నాకు తెలియజేయండి.

సీ. నావుడు శుకయోగి 'నరనాయకోత్తమ! నీవు చెప్పిన యట్ల నెమ్మనమునఁ
బద్మాయతాక్షుచేఁ బడిన బన్నమునకుఁ గనలుచు నుండియు ననుజతోడి
నెయ్యంబునను భాగినేయున కిచ్చెను గూఁతు నంచితపుష్ప కోమలాంగిఁ
దనపూన్కి దప్పినఁ దగ విదర్భేశుండు విను మెఱింగింతు న వ్విధము దెలియఁ

తే. బరఁగ 'రుక్మవతీ స్వయంవరమున కొగి, నరుగుదెండని భీష్మభూవరసుతుండు
వరుస రప్పించె రాజన్యవర కుమార, వరుల ననువార్త కలరి యా హరిసుతుండు. 281

* పరీక్షిత్తు మాటలు విన్న శుకయోగీంద్రుడు ఆ మహారాజుతో ఇలా చెప్పనారంభించాడు. ఓ రాజేంద్రా! నీవు అన్నట్లుగానే రుక్మి శ్రీకృష్ణుని వలన పొందిన అవమానానికి మనసులో బాధపడుతూనే వున్నాడు. అయినా తాను చేసిన ప్రయత్నం ఫలించకపోగా ఆ విదర్భరాజు తన చెల్లెలిపైగల అభిమానంతో తన మేనల్లునికి కుసుమ కోమలియైన తన కుమార్తె నిచ్చాడు. ఆ విషయం తెలియజేస్తాను. విను. రుక్మి తన కుమార్తెయైన రుక్మవతీ స్వయంవరానికి రాజకుమారుల నందరినీ ఆహ్వానించాడు. ఆ వార్త విని ప్రద్యుమ్నుడు సంతోషించాడు.

చ. వరమణిభూషణ ప్రభలవర్గ మనర్గళభంగిఁ బర్వఁ బ్ర
స్ఫురిత రథాధిరోహణవిభూతి దలిర్ప మనోహరైక సు
స్థిరశుభలీల నేగె యదుసింహకిశోరము రాజకన్యకా
పరిణయవైభవాగత నృపాలక కోటికి రుక్మివీటికిన్. 282

* మహోజ్జ్వలాలైన మణిభూషణాల కాంతులతో శోభిస్తూ రమణీయమైన రథాన్ని అధిరోహించి మనోహరమైన సౌందర్య విలాసంతో యదుకుల సింహకిశోరమైన ప్రద్యుమ్నుడు రుక్మవతిని వివాహ మాడాలనే కోరికతో మేనమామ పట్టణానికి వెళ్లాడు. అప్పటికే స్వయంవరానికి రాజకుమారులందరూ విచ్చేశారు.

చ. చని పురిఁ జొచ్చి వృష్ణికులసత్తముఁ డచ్చట మూఁగియున్న య
మ్మనుజవరేణ్యనందనులు మానము దూలి భయాకులాత్ములై
చనఁగ ననేక చండతర సాయకసంపదఁ జూపి రుక్మి నం
దనఁ గొనివచ్చి వేడ్క నిజధామము సొచ్చె నవార్యశౌర్యుఁడై. 283

* అలా వెళ్లి పట్టణంలో ప్రవేశించి ప్రద్యుమ్నుడు అచ్చట చేరిన రాజకుమారులపై తీవ్రమైన బాణసమూహాన్ని ప్రయోగించి తన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. ఆ రాకుమారులు ధైర్యం కోల్పోయి భయంతో పారిపోగా రుక్మవతిని తన నగరానికి తీసికొని వచ్చాడు ప్రద్యుమ్నుడు.

వ. ఇట్లు తెచ్చి ప్రద్యుమ్నుండు హరిణనయనం బరిణయంబంది నిఖిల సుఖంబు లనుభవింపుచుండె. ననంతరంబ. 284

* ఈ విధంగా రుక్మవతిని తన నగరానికి తెచ్చి ప్రద్యుమ్నుడు ఆ హరిణాక్షిని పరిణయమాడాడు. సకలసౌఖ్యాలను అనుభవిస్తూ ఉన్నాడు.

క. ధీరుఁడు కృతవర్మని సుకు, మారుఁడు వరియించె రుచిరమండనయుత నం
భోరుహముఖి రుక్మిసుతం, జారుమతీకన్యఁ బ్రకట సజ్జనమాన్యన్. 285

* ధీరుడైన కృతవర్మ కుమారుడు పద్మముఖి సజ్జనసమ్మాన్యయైన చారుమతిని వివాహమాడాడు. చారుమతికూడా రుక్మి కుమార్తెయే.

తే. ప్రకటచరితుండు భీష్మభూపాలసుతుఁడు,మనము మోదింపఁ దన కూర్మిమనుమరాలి
రుక్మలోచన నసమాన రుక్మకాంతిఁ, జెలిమి ననిరుద్ధునకు బెండ్లి సేయు నపుడు. 286

* సుప్రసిద్ధుడైన రుక్మి బంగారు కాంతులతో శోభిస్తున్న తన మనుమరాలైన రుక్మలోచనను అనిరుద్ధున కిచ్చి వివాహం చేయించాడు.

క. పొలుపుగ రత్నవిభూషో, జ్జ్వలుఁడయి శుభవేళ న వ్వివాహార్థము ని
ర్మల బహువైభవ శోభన, కలితవిదర్భావనీశ కటకంబునకున్. 287

చ. హరియును రుక్మిణీసతియు నా బలభద్రుఁడు శంబరారియున్
నరిమదభేది సాంబుఁడును నాదిగ రాజకుమారకోటి సిం
ధుర రథవాజి సద్భటులతోఁ జని యందు సమగ్రవైభవా
చరిత వివాహయుక్త దివసంబులు వేడుకఁ బుచ్చి యంతటన్. 288

* ఆ వివాహ శుభ సందర్భంలో రత్న ఖచిత భూషణాలు అలంకరించుకొని రుక్మిణీ కృష్ణులు, బలరాముడు, సాత్యకి, ప్రద్యుమ్నుడు, సాంబుడు మున్నగు వారంతా విదర్భరాజధానికి వచ్చారు. వివాహం జరిగినన్ని రోజులూ అందరూ ఆనందంగా కాలం గడిపారు.

క. ఒకనాఁడు యదుకుమారకు, లకలంక సమగ్ర వైభవాటోప మహో
త్సుకులై యుండఁగఁ జూపో, పక యెకసెక్కెమున నవని పాలురు వరుసన్. 289

* ఒకరోజున యాదవులంతా మహావైభవంతో ఉత్సాహపూరితులై ఉండగా కొందరు భూపాలురు అది చూచి ఓర్వలేకపోయారు.

ఉ. ఎచ్చరికం గళింగధరణీశుఁడు రుక్మిమొగంబు సూచి నీ
యొచ్చెముఁ దీర్చికో నిదియ యొప్పగు వేళ బలుండు జూదమం
దిచ్చ గలండు, గాని పాలు పెక్కిన నేర్పరి గాఁడు, గాన నీ
కిచ్చు నవశ్యమున్ జయము నీఁగుము తొల్లిటఁబడ్డ బన్నముల్. 290

* కళింగాధీశుడు రుక్మిని చూచి ఇలా అన్నాడు! నీ కింతకుముందు జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకొనడానికి ఇదే తగిన సమయం. బలరామునికి జూదంపై ఎక్కువ ఇష్టం. కాని ఆటలో నేర్పరి కాదు. అందువలన నీకే విజయం లభిస్తుంది. ఇంతకు ముందు పొందిన అవమానాన్ని ఇప్పుడు ఈ విధంగా తొలగించుకో!

క. అని పురికొల్పిన రుక్మియుఁ, దన చేటు దలంపలేక తాలాంకుని తో
డన జూదమాడఁ దివిరెను, వనజాసను కృతము గడచు వా రెవ్వ రిలన్? 291

* కళింగదేశాధీశుడు ఈ విధంగా పురికొల్పగా రుక్మి తనకు కలిగే నష్టాన్ని గమనించకుండా బలరామునితో జూదమాడడానికి సిద్ధమయ్యాడు. బ్రహ్మవ్రాత తప్పించుకోటం ఎవరికీ శక్యం కాదు.

వ. అంత 292

క. కోరి విదర్భుఁడు కుటిల వి, హారుండై పిలిచె జూదమాడ జితారిన్
హారిన్ సన్నుతసూరిన్, సీరిన్ రైవతసుతార్ద్ర చిత్తవిహారిన్. 293

* అటుపిమ్మట రుక్మి కుటిల స్వభావంతో శత్రుసంహారకుడు, సజ్జన సేవితుడు, రేవతీ వల్లభుడూ, హలాయుధుడూ అయిన బలరాముణ్ణి జూదమాడటానికి రమ్మని ఆహ్వానించాడు.

ఆ. 'పూని మనము గొంత ప్రొద్దుపోకకు రామ!, నెత్త మాడ నీవు నేర్తు వనఁగ
విందు, మిపుడు గొంత వెల యొడ్డి యాడుద' మనిన బలుఁడు లెస్స యని చెలంగె. 294

* "బలరామా! మనం కాలక్షేపానికి జూదమాడుదాం. జూదంలో నీవు సమర్థుడవని విన్నాను. ఇపుడు పందెం పెట్టుకొని జూదమాడుదాం. సరేనా"అని రుక్మి ఆహ్వానించగా బలరాముడు అందుకు అంగీకరించాడు.

**క. మదిలోని చలము డింపక, పది యిరువది నూఱు వేయి పదివే లిదె ప**
**న్నిద మని యొడ్డుచు నాడిరి, మదమున నిద్దఱును దురభిమానము పేర్మిన్.** 295

* మనస్సులోని పట్టుదలలు ఏ మాత్రం సడలించుకోకుండా పది, ఇరవై, నూరు, వేయి, పదివేలు, అంటూ పందేలు పెట్టుకొని దురభిమానంతో వారిద్దరూ జూదమాడారు.

**ఉ. ఆడిన యాటలెల్లను హలాయుధుఁ డోడిన రుక్మి గెల్చుడున్**
**దోడి నృపాలకోటి పరితోషముఁ జెందఁ గళింగభూవిభుం**
**'డోడె బలుం'డటంచుఁ బ్రహసోక్తుల నెంతయు రాముఁ జుల్కఁగా**
**నాడెను దంతపంక్తి వెలి యై కనుపట్టఁగఁ జాల నవ్వుచున్.** 296

* ఆడిన ప్రతిఆటలో బలరాముడు ఓడిపోయాడు. రుక్మి జయించాడు. అచ్చటి రాజులందరూ ఆనందించేటట్లు కళింగరాజు బలరాముడు ఓడిపోయాడని ఎగతాళిచేస్తూ పండ్లు బయటపడేటట్లు ఇకిలించాడు.

**తే. బలుఁడు కోపించి యొక లక్ష పణము సేసి, యాడి ప్రకటంబుగా జూద మపుడు గెల్చె,**
**గెల్చినను రుక్మి 'యిది యేను గెల్చియుండ, గెలుపు నీ దని కికురింప నలవి యగునె?** 297

* బలరాముడికి కోపం వచ్చింది. అప్పుడు ఒకలక్ష పందెం కాచి బలరాముడు రుక్మిపై విజయం సాధించాడు. బలరాముడు గెలిచినప్పటికీ రుక్మి ఆ గెలుపును అంగీకరింపక విజయం నాదైతే నీదని చెప్పి మోసగిస్తున్నావా అని ఎదురు తిరిగాడు.

**తే. అనవుడు హలధరుఁ డచ్చటి, జనపాలకసుతులఁ జూచి సత్యము పలుకుం**
**డని యడిగిన వారలు రు, క్మని హితులై పలుకరైరి మొగమోటమునన్.** 298

* అప్పుడు బలరాముడు అక్కడ చేరిన రాజుల నందరిని చూసి నిజం చెప్పండని అడిగాడు. వారు రుక్మిమీది పక్షపాతంతో ఏమీ చెప్పకుండా మౌనం వహించారు,

**ఉ. అప్పటి యట్ల యొడ్డి ముసలాయుధుఁ డేపున నాడి జూదముం**
**జొప్పడ గెల్చి యీ గెలుపు సూడగ నాదియొ వాని దో జనుల్**
**దప్పక చెప్పుఁ డన్న విదితధ్వనితో నశరీరవాణి తా**
**నిప్పటియాట రాముఁడె జయించె విదర్భుఁడె యోడె నావుడున్.** 299

* బలరాముడు మళ్లీ మరో ఆట ఆడి తాను గెల్చాడు. "ఇప్పటి విజయం నాదా? లేక ఇతనిదా? చెప్పండి" అని అక్కడి జనులను తిరిగి ప్రశ్నించాడు. ఆ సమయంలో ఆశరీరవాణి " ఈ ఆటలో బలరాముడే గెల్చాడు, రుక్మి ఓడిపోయాడు"అని స్పష్టంగా తెలిపింది.

వ. అనిన విని సకలజనంబులు నద్భుతానంద నిమగ్న మానసులైరి. కుటిల స్వభావు లయిన భూవరులు రుక్మిం గైకొల్పిన నతండు తన తొల్లింటి పరాభవము దలంచి యెదిరిం దన్ను నెఱుంగక బలాబల వివేకంబు సేయనేరక విధివశానుగతుండై చలంబున బలునిం గని "యిప్పటి యాటయు నేన గెల్చియుండ వృథా జల్పకల్పనుండవయి 'గెల్చితి" నని పల్కెద, వక్షవిద్యానైపుణ్యంబు గల భూపకుమారులతోఁ బసులకాపరు లెత్తువత్తురే" యని క్రొవ్వున నవ్వుచుం బలికిన న ప్పలుకులు సెవులకు ములుకుల క్రియం దాఁకినఁ గోపోద్దీపిత మానసుండై పెట పెటం బండ్లు గొఱుకుచుం గన్నుల నిప్పు లుప్పతిల్లం గినుకం దోఁకత్రొక్కిన మహోరగంబు నోజ రోఁజుచు దండతాడితం బయిన పుండరీకంబు లీల హుమ్మని మ్రోయుచుఁ బ్రచండ బాహుదండంబులు సాఁచి పరిఘం బందుకొని పరిపంథియైన రుక్మిని నతని కనుకూలం బయిన రాజలోకంబును బడలుపడ నడిచె, న య్యవసరంబున. 300

* ఆ మాటలు విని అక్కడి జనులంతా ఆనందించారు. కానీ దుష్టస్వభావులైన కొందరు రాజులు ప్రేరేపించగా రుక్మి పూర్వం జరిగిన పరాభవాన్ని జ్ఞప్తికి తెచ్చుకొని, బలాబలాలు తెలుసుకోలేక విధివశాన బలరాముని చూచి "ఈ ఆటగూడా నేనే గెల్చాను. వ్యర్థప్రలాపాలతో నేనే గెల్చానని చెప్పుకుంటున్నావు. జూదంలో ప్రావీణ్యం గల రాకుమారులతో పసులకాపరులు జూదమాడి గెలువగలరా?" అని అహంకారంతో అవహేళనగా నవ్వుతూ అన్నాడు, ఈ పలుకులు బలరాముని చెవులకు ములుకు లయ్యాయి. అపుడు ఆయన కోపంతో పండ్లు పట పట కొరకుతూ తోకత్రొక్కిన త్రాచులాగా బుసలు కొడుతూ కర్రదెబ్బ తగిలిన పెద్దపులివలె గాండ్రించి తన బాహుదండం చాచి ఒక ఇనుప గుదియను గ్రహించి రుక్మినీ, అతని పక్షంవారయిన రాజలోకాన్ని చావ చితకబాదాడు.

క. మును దంతపంక్తి వెలిగాఁ, దను నవ్విన య క్కళింగుఁ దల వట్టి రయం
బునఁ బడఁదిగిచి వదన మే, పునఁ బెడచే వ్రేసి దంతములు వెస డులిచెన్. 301

* ఇంతకుముందు తనను చూసి పండ్లికిలించి నవ్విన కలింగుణ్ణి తలపట్టుకొని క్రిందపడద్రోసి ఎడమచేతితో నోటిమీద గుద్ది పండ్లూడగొట్టాడు.

క. అంతం బోవక రుక్మిని, దంతంబులు మున్ను డులిచి తను వగలింపన్
అంతకుపురి కేగెను వాఁ, డెంతయు భయ మంది రాజు లెల్లం గలఁగన్. 302

* బలభద్రుడు అంతటితో ఊరుకోక రుక్మిని పట్టుకొని పండ్లు రాలగొట్టి, రాజులంతా భయపడేటట్లు వాడిని యమలోకానికి పంపించాడు.

వ. అట్లుచేసి య య్యాదవసింహం బసహ్యావిక్రమంబునం జెలంగె నంత. 303

* ఈ విధంగా యదుసింహమైన ఆ బలరాముడు భయంకరమైన పరాక్రమంతో ప్రకాశించాడు.

క. భూవర పద్మాక్షుఁడు దన, బావ హతుం డగుట గనియుఁ బలుకక యుండెన్
భావమును రుక్మిణీ బల, దేవుల కే మనఁగ నెగ్గు దేరునొ? యనుచున్. 304

* పరీక్షిన్మహారాజా! ఇదంతా శ్రీకృష్ణుడు చూస్తూనే ఉన్నాడు. తన బావమరది మరణాన్ని చూచి గూడా ఏ మాటంటే రుక్మిణీ, బలరాములు ఏమనుకుంటారో నని మౌనం వహించాడు.

**వ. అంత నా విదర్భానగరంబు నిర్గమించి. 305**

**క. పరమానురాగరస సం, భరితాంతఃకరణు లగుచుఁ బాటించి వధూ**
**వరులను రథమం దిడి హల, ధర హరి రుక్మిణులఁ గొల్చి తగ యదువీరుల్. 306**

* యదువీరులు విదర్భానగరం వదలి పెట్టారు. యాదవవీరులు అనురాగమయ హృదయులై వధూవరులను రథం ఎక్కించుకొని రుక్మిణీ బలరామకృష్ణులతో పాటు తమ రాజ్యానికి బయలుదేరారు.

**ఉ. మంగళతూర్యఘోషము లమందగతిం జెలఁగంగ మత్త మా**
**తంగ తురంగ సద్భట కదంబముతోఁ జని కాంచి రంత నా**
**రంగ లవంగ లుంగ విచరన్మదభృంగ సురంగనాద స**
**త్సంగ తరంగిణీకలిత సంతతనిర్మల నా కుశస్థలిన్. 307**

* మంగళవాద్య ధ్వనులు మ్రోగుతుండగా, చతురంగ బలాలతో బయలుదేరి వికసించిన నానావిధ వృక్షాలతో, ఝుంకారం చేసే తుమ్మెదలతో, స్వచ్ఛమైన తరంగాలతో పొంగి ప్రవహించే నదులతో కూడిన కుశస్థలిని చేరారు.

**వ. ఇట్లు పురోప వనోపకంఠంబునకుం జని. 308**

**క. అందు వసించిరి నందిత, చందన మందార కుంద చంద్ర లస న్మా**
**కందముల నీడ హృదయా, నందము సంధిల్ల నందనందనముఖ్యుల్. 309**

* అలా వెళ్లి చందనవృక్షాలు, మందారాలు, మంచిమామిళ్లు మొదలైన అనేక వృక్షాలతో శోభిస్తున్న ఆ పట్టణసమీపంలోని ఉద్యానవనం చేరారు. అక్కడ ఆ యాదవులు చందన మందారాది ఉద్యానవన వృక్షాల నీడలలో ఆనందంతో విశ్రమించారు.

**వ. తదనంతరంబ పురప్రవేశంబు సేసి రని చెప్పి శుక యోగీంద్రుండు పరీక్షి న్నరేంద్రున కిట్లనియె.310**

* ఆ తరువాత యాదవ వీరులు పురప్రవేశం చేశారని చెప్పి శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుతో ఇలా అన్నాడు.

## -: బాణాసురుం డీశ్వర ప్రసాదంబు నొందుట :-

**తే. అనఘ! బలినందనులు నూర్వు రందులోన, నగ్రజాతుండు బాణుఁ డత్యుగ్రమూర్తి**
**చిర యశోహారి విహితపూజిత పురారి, యహిత తిమిరోష్ణకరుఁడు సహస్రకరుఁడు. 311**

* అనఘా! బలిచక్రవర్తికి నూర్గురు కుమారులు. వారిలో పెద్దవాడు బాణుడు. అతడు కీర్తిమంతుడు. శత్రు భయంకరుడు. అతనికి వేయి చేతులు. శివపూజాధురంధరుడు.

క. బాణుఁడు విక్రమజిత గీ, ర్వాణుఁడు సని కాంచె భక్తివశుఁడై నగణ
స్థాణున్ నిర్దళితా సమ, బాణుం దాండవధురీణు భక్త త్రాణున్. 312

* తన పరాక్రమంతో దేవతల నోడించిన బాణాసురుడు భక్తి భావంతో భక్తవశంకరుడు, నటరాజు, కామారి యగు పరమేశ్వరుని చెంతకు వెళ్ళి ఆ దేవదేవుని దర్శించాడు.

క. కని యనురాగ వికాసము, దన మనమునఁ గడలుకొనఁగ ధరఁ జాఁగిలి వం
దన మాచరించి మోదము, దనరఁగఁ దాండవము నలుపు తఱి న య్యభవున్. 313

* పరమేశ్వరుని గాంచి అధికమైన భక్తి భావంతో శంకరుడు నాట్యం చేసే సమయంలో సాష్టాంగ నమస్కారం గావించాడు.

ఉ. సంచిత భూరిబాహుబలసంపద పెంపున నారజంబు వా
యించి యనేకభంగుల సుమేశుఁ ద్రిలోకశరణ్యు నాత్మ మె
చ్చించి ప్రమోదియై నిజవశీకృత నిశ్చలితాంతరంగుఁ గా
వించి తదాననాంబురుహ వీక్షణుఁడై తగ మ్రొక్కి యిట్లనున్. 314

* తన బాహుబలంకొద్దీ డమరుకం వాయించి ఆ త్రిలోక శరణ్యుడైన పరమేశ్వరుని మెప్పించి ఆనందపరవశుడైన ఆ దేవుని ముఖపద్మం వైపు దృష్టి బరపి ఇలా స్తుతించాడు.

ఉ. శంకర ! భక్తమానసవశంకర! దుష్టమదాసురేంద్ర నా
శంకర! పాండునీలరుచి శంకరవర్ణ నిజాంగ! భోగి రా
ట్కంకణ! పార్వతీహృదయ కైరవ కైరవమిత్ర! యోగి హృ
త్పంకజ పంకజాప్త! నిజతాండవఖేలన! భక్త పాలనా! 315

* శంకరా! భక్తవశంకరా! నీవు మదోన్మత్తులైన రాక్షసులను నశింపజేయగల వాడవు. ధవళాంగుడవు. సర్పభూషణుడవు. పార్వతీ ప్రాణవల్లభుడవు, యోగిజనుల హృదయ పంకజాలకు సూర్యునివంటి వాడవు. తాండవప్రియుడవు. భక్తపరిపాలకుడవు.

వ. అని వినుతించి. 316

ఉ. దేవ! మదీయ వాంఛితము తేటపడ న్నిటు విన్నవించెదన్
నీవును నద్రినందనయు నెమ్మిని నా పురి కోటవాకిటం
గావలియుండి నన్నుఁ గృపఁ గావుము భక్తఫలప్రదాత! యో
భావభవారి! నీ చరణపద్మము లెప్పుడు నాశ్రయించెదన్. 317

* అని స్తుతించి ఇంకా ఇలా అన్నాడు. ఓ దేవా! నా కోరిక విన్నవిస్తాను. విను. నీవు పార్వతీసహితంగా నాకోట వాకిటికి రక్షకుడవై యుండి నన్ను రక్షించు. మదనాంతకా! నా మనోవాంఛ ఇదే. నీ పాద పద్మాల నాశ్రయించిన నన్ను దయజూడు.

వ. అని యభ్యర్థించినం బ్రసన్నుం డై భక్తవత్సలుం డగు పురాంతకుండు గౌరీసమేతుండై తారకాంతక గజాననాది భూతగణంబులతో బాణనివాసం బగు శోణపురంబు వాకిటం గాఁ పుండెఁ, బదంపడి యొక్కనాఁ డబ్బలినందనుండు. 318

* బాణాసురుడు ఇలా ప్రార్థించగా భక్తవత్సలుడైన పరమేశ్వరుడు పార్వతీ సమేతుడై బాణుని పట్టణమైన శోణపురం చేరాడు. భూతగణాలతో వేంచేసి శంకరుడు కోటద్వారం చెంత కాపలా వున్నాడు.

తే. దర్పమునఁ బొంగి రుచిర మార్తాండ దీప, మండలముతోడ మార్పడు మహితశోణ
మణికిరీటము త్రిపుర సంహరుని పాద, వనజములు సోఁక మ్రొక్కి యిట్లని నుతించె. 319

* ఒకనాడు బాణాసురుడు అహంకారంతో భుజాలు పొంగగా సూర్యకాంతిని ధిక్కరించే మణికిరీటం త్రిపురసంహరుడైన హరుని పాదపద్మాలకు సోకేటట్లు నమస్కరించి ఇలా స్తుతించాడు.

సీ. 'దేవ! జగన్నాథ! దేవేంద్రవందిత! వితతచారిత్ర! సంతత పవిత్ర!
హాలాహలాహార! యహిరాజకేయూర! బాలేందుభూష! సద్భక్తపోష!
సర్వలోకాతీత! సద్గుణసంఘాత! పార్వతీహృదయేశ ! భవవినాశ!
రజతాచలస్థాన! గజచర్మపరిధాన! సురవైరివిధ్వస్త! శూలహస్త!

తే. లోకనాయక! సద్భక్తలోకవరద!, సురుచిరాకార! మునిజనస్తుతవిహార!
భక్త జనమందిరాంగణ పారిజాత!, నిన్ను నెవ్వఁడు నుతిసేయ నేర్చు నభవ! 320

* ఓ దేవా! నీవు జగన్నాథుడవు. దేవేంద్ర వందితుడవు. పరిశుద్ధ చరిత్రుడవు. పరమపవిత్రుడవు. హాలాహల భక్షకుడవు. నాగభూషణుడవు. చంద్రశేఖరుడవు. భక్త సంరక్షకుడవు. సర్వలోకేశ్వరుడవు. పార్వతీపతివి. కైలాసవాసివి. గజచర్మధారివి. రాక్షసాంతకుడవు. త్రిశూల ధారివి. భక్తజనుల ముంగిటిలోని పారిజాతానివి. అట్టి నిన్నెవ్వరు స్తుతింపగలరు?

వ. అని స్తుతియించి. 321

మ. అనిలో నన్ను నెదిర్చి బాహుబలశౌర్యస్ఫూర్తిఁ బోరాడఁ జా
లిన వీరుం డొకఁడైన బందెమునకున్ లేఁడయ్యె, భూమండలి
న్ననయంబున్ భవదగ్రదత్తకరసాహస్రంబు కండూతి వా
యు నుపాయంబును లేద యీ భరము నెట్లోర్తు న్నుమానాయకా! 322

* ఇలా స్తుతించి బాణుడు ఈ విధంగా అన్నాడు. ఓ పార్వతీపతీ! యుద్ధంలో నన్నెదిరించి తన బాహుబలాన్ని ప్రదర్శింపజాలిన వీరాధి వీరుడొకడైనా ఈ భూమండలంలో కన్పించడం లేదు. నీవు ప్రసాదించిన నా వేయిచేతులు రణకండూతి కలిగి వున్నాయి. ఈ కండూతిని ఎలా తీర్చుకోవాలి?

సీ. హుంకార కంకణ క్రేంకార శింజినీ టంకార నిర్ఘోషసంకులంబు
చండ దోర్దండ భాస్వన్మండలాగ్ర ప్రకాండ ఖండిత రాజమండలంబు

శూలాహత క్షతోద్వేల కీలాల కల్లోలకేళీ సమాలోకనంబు
శుంభ దున్మద కుంభి కుంభస్థలధ్వంస సంభూత శౌర్య విజృంభణంబు

తే. గలుగు నుద్దామ భీమ సంగ్రామ కేళి, ఘన పరాక్రమ విక్రమక్రమము గాఁగ
జరపలేనట్టి కరములు కరము దుఃఖ, కరము లగుఁగాక సంతోషకరము లగునె? 323

* దిక్కులు దద్దరిల్లే హుంకారాలతో ధనుష్టంకారాలతో నిండినదీ, చండ ప్రచండ బాహుదండాలతో ప్రకాశించే ఖడ్గాలతో ఖండింపబడిన శత్రురాజుల శిరస్సులతో గూడినదీ, శూలపు పోట్లకు శరీరాలనుండి జలజల ప్రవహించే రక్తధారలతో భయంకరమైనదీ, మదించిన ఏనుగుల కుంభస్థలాలను బద్దలుకొట్టే వీరవిజృంభణం కలదీ ఐన భీకర యుద్ధరంగంలో పరాక్రమాన్ని ప్రదర్శించలేనట్టి వట్టి చేతులవలన ఉపయోగ మేముంది? ఆ కరాలు నావంటి వీరులకు దుఃఖకరాలే గాని సంతోష కరాలు కాదు గదా స్వామీ?

ఉ. కాన మదీయ చండభుజగర్వ పరాక్రమ కేళికిన్ సముం
డీ నిఖిలావనిం గలఁడె యిందుకళాధర! నీవు దక్కనా;
నా నిటలాంబకుండు దనుజాధిపు మాటకుఁ జాల రోసి లో
నూనిన రోషవార్ధి గడ లొత్తఁగ నిట్లని పల్కె భూవరా! 324

* ఓ చంద్రధరా! నా ప్రచండ బాహుదండాల పరాక్రమకేళిని ఎదిరించగల వీరుడు ఈ విశాల ప్రపంచంలో నీవు తప్ప మరెవ్వరూ లేరు.' ఇలా పలుకుతున్న బాణుని ప్రగల్భాలకు ఫాలనేత్రుడు అసహ్యించుకొని రోషం పొంగిపొరలగా ఆ దోషాచరునితో ఇలా అన్నాడు.

క. 'విను మూఢహృదయ! నీ కే, తన మెప్పు డకారణంబ ధారుణిపైఁ గూ
లును నపుడు నీ భుజావలి, దునియఁగ నా యంతవానితో నని గల్గున్. 325

* ఓ మూఢహృదయా! తొందరపడకు, నీ కేతనం అకారణంగా ఎప్పుడు భూమిపై కూలిపోతుందో అప్పుడు నాయంత వానితో నీకు యుద్ధం జరుగుతుంది. నీ భుజాలతీట తీరుతుంది.

వ. అని పలికిన నట్లు సంప్రాప్త మనోరథుండై నిజభుజవినాశ కార్య ధురీణుండగు బాణుండు సంతుష్టాంతరంగుం డగుచు నిజనివాసంబునకుం జని, తన ప్రాణవల్లభల యుల్లంబులు పల్లవింపఁ జేయుచు నిజధ్వజ నిపాతంబు నిరీక్షించుచుండె, తదనంతరంబ. 326

* పరమేశ్వరుని పలుకులు విని బాణాసురుడు తన కోరిక తీరబోతున్నందుకు చాలా సంతోషించి తన సౌధానికి వెళ్లిపోయాడు. తన ప్రియురాండ్రతో కూడి ఆనందడోలికలలో తూగుతూ "ఎప్పుడు తన రథకేతనం నేల కూలుతుందా!" అని ఎదురు చూస్తున్నాడు.

సీ. ఆ దానవేశ్వరు నకుఁగుఁ గుమారి యుషాకన్య విమల సౌజన్యధన్య
రూపవిభ్రమ కళారుచిర కోమలదేహ యతను నాఱవబాణ మనఁగఁ బరఁగు

సుందరీరత్నంబు నిందునిభానన యలినీల వేణి పద్మాయతాక్షి
యొకనాఁడు రుచిరసౌధోపరి వేదికా స్థలమున మృదుశయ్య నెలమిఁ గూర్కి

తే. మున్ను దన దౌల నెన్నఁడు విన్న యతఁడుఁ, గన్నులారంగఁ దాఁ బొడగన్న యతఁడుఁ
గాని యసమాన రూపరేఖావిలాస, కలితు ననిరుద్ధు నర్మిలిఁ గవిసినటులు. 327

* దానవేశ్వరుడైన బాణాసురునికి ఒక ముద్దుల కూతురు ఉంది. ఆమె పేరు ఉషాకన్య. ఆమె సౌందర్యవతి. సద్గుణవతి. చంద్రముఖి. నీలవేణి. పద్మనేత్ర. మన్మథుని ఆరవబాణం. ఇటువంటి ఉషాబాల ఒకనాడు తన సౌధంలో మెత్తని పాన్పుపై నిద్రిస్తున్నది. అసమాన సౌందర్యవంతుడైన అనిరుద్ధునితో సుఖించునట్లు ఆమెకు ఒక కల వచ్చింది. ఆ సుందరాంగుని ఉష ఇంతకుముందు వినలేదు. కనలేదు.

చ. కల గని యంత మేలుకని కన్నుల బాష్పకణంబు లొల్కఁగాఁ
గలవలెఁ గాక నిశ్చయముగాఁ గమనీయ విలాస విభ్రమా
కలిత తదీయరూపము ముఖంబున వ్రేలిన యట్ల దోఁచినం
గళవళ మందుచున్ బిగియఁ గౌఁగిటిచే బయ లప్పళించుచున్ 328

* కల గన్న ఉషా కన్య మేలుకొన్నది. ఆమె కన్నుల వెంట బాష్పకణాలు జాలువారుతున్నాయి. అది కల కాక వాస్తవ మేమో అనే భ్రాంతి కలిగింది. ఆ సౌందర్యవంతుని అందమైన ఆకారం కన్నులయెదుట కన్పిస్తున్నట్లే వుంది. ఉషాబాల కళవళ పడింది. వట్టి బయలును కౌగిలించుకుంటున్నది.

వ. మఱియును. 329

చ. సరసమృదూక్తులుం గుసుమసాయక కేళియు శాటికా కచా
కరషణముల్ నఖక్రియలుఁ గ్రమకపోల లలాట మేఖలా
కర కుచ బాహుమూలములుఁ గైకొని యుండుట లాదిగాఁ దలో
దరి మది గాఢమై తగిలె దర్పకుఁ డచ్చున నొత్తినట్లయై. 330

* మరియు సరససంభాషణలూ, మన్మథలీలలూ, వస్త్రకచాకర్షణలూ, కపోల లలాట బాహుమూల కుచాదులపై గోటి గుర్తులూ, అన్నీ ఆమె మనస్సులో గాఢముద్ర వేశాయి. ఆ యువకుడు అచ్చంగా పచ్చవిల్తునిలాగా ఆమెను గ్రుచ్చి కౌగిలించినట్లే ఆమెకు అనిపించింది.

సీ. కలికిచేష్టలు భావగర్భంబు లైనను బ్రియుమీఁది కూరిమి బయలుపఱుపఁ
బిదపిదనై లజ్జ మదిఁ బద నిచ్చినఁ జెలి మేనఁ బులకలు చెక్కు లొత్త
మదనాగ్ని నంతప్తమానస యగుటకు గురుకుచహారవల్లరులు గందఁ
జిత్తంబు నాయకాయత్తమై యుంటకు మఱుమాట లాడంగ మఱపు గదుర

తే. నతివ మనమున సిగ్గు మోహంబు భయముఁ, బొడమ నునుమంచు నెత్తమ్మిఁ బొదుపు మాడ్కిఁ
బ్రథమచింతాభరంబునఁ బద్మనయన, కోరి తలచీర వాటింప నేరదయ్యె. 331

* ఉషాబాలచేష్టలు ఎంత భావగర్భితాలైనా ప్రియునిపై ప్రేమ వ్యక్తమౌతూనే వుంది. మనస్సులోపల లజ్జ పొడముతున్నా శరీరంపైన పులకాంకురాలు మొలకలెత్తాయి. మదనాగ్నికి ఆమె హృదయం తపించి నందుకు గుర్తుగా వక్షస్థలంపై నున్న హారాలు కందిపోయాయి. హృదయం నాయకాధీనమై పోయిందనటానికి సూచనగా నెచ్చెలులతో బదులుపల్కడం మరచిపోయింది. ఆ ఉషాకన్య హృదయంలో మోహం, సిగ్గు, భయం ఉద్భవించాయి. అందువల్ల ఆమె మంచు క్రమ్మిన పద్మంలాగా శోభించింది. ప్రియుని గూర్చిన శృంగారచేష్టలలో మొదటి దైన చింతతో ఆ బాల మేలి ముసుగుకూడా ధరించలేదు.

**వ. ఇట్లు విరహవేదనా దూయమాన మానసయై యుండె, నంత నెచ్చెలులు డాయం జనుదెంచినం**
**దన మనంబునం బొడము మనోజవికారంబు మఱు వెట్టుచు నప్పుడు.** 332

* ఇలా ఉషాబాల విరహవేదనతో బాధపడుతున్నది. చెలికత్తెలు ఆమె చెంతకు రాగా తన మనోవికారాన్ని వాళ్ళకు తెలియకుండా మరుగు పరచింది.

**చ. పొరిఁబొరిఁ బుచ్చు నూర్పుగమిఁ బుక్కిటనుంచి కుచాగ్రసీమపై**
**బెరసిన సన్న లేఁజెమట బిందువు లొయ్యన నార్చుఁ గన్నులం**
**దొరఁగెడు బాష్పపూరములు దొంగలిఱెప్పల నాని చుక్కలం**
**దరుణులు రండు చూత మని తా మొగ మెత్తును గూఢరాగయై.** 333

* నిట్టూర్పులను అణచుకున్నది. వక్షోజాలపై పొడసూపిన చిరుచెమటను తుడిచివేసింది. నేత్రాల నుండి జారనున్న కన్నీటిని రెప్పల నిమిడించి నక్షత్రాలను చూద్దాం రండని స్నేహితురాండ్రను పిలిచి ఆ వంకతో ముఖం పైకెత్తింది. ఇలా తన అనురాగం బయలుపడకుండా దాచుకున్నది.

**వ. ఇ వ్విధంబునం జరియించుచుండె నట్టియెడ.** 334

**తే. అంతకంతకు సంతాప మతిశయించి, వలుఁద చన్నులు గన్నీటి వఱదఁ దడియఁ**
**జెలులదెసఁ జూడఁ జాల లజ్జించి మొగము, వాంచి పలుకక యుండె న వ్వనరుహాక్షి.** 335

* ఈ విధంగా ఉషాకన్య సంచరిస్తున్నది. అంతకంతకూ సంతాపం అధికమై వక్షోజాలపై కన్నీరు కాల్వలు కట్టగా చెలికత్తెల వైపు కన్నెత్తి చూడటానికి సిగ్గుపడి ముఖం వంచుకొని మౌనం వహించింది.

**వ. అంత.** 336

**తే. బలితనాభవుమంత్రి కుంభాండుతనయ, తన బహిఃప్రాణ మిది యనఁ దనరునట్టి**
**కామినీమణి ముఖపద్మకాంతి విజిత, శిశిరకర చారు రుచిరేఖ చిత్రరేఖ.** 337

**వ. కదియవచ్చి య బ్బాల నుపలక్షించి.** 338

* అప్పుడు చంద్రరేఖను మించిన సౌందర్యవతియైన చిత్రరేఖ ఇదంతా గమనించింది. ఆమె ఉషాకన్యకు బహిఃప్రాణం. ఈ చంద్రరేఖ బాణాసురుని మంత్రియైన కుంభాండకుని కుమార్తె. చంద్రరేఖవంటి చిత్రరేఖ ఉషాబాల దగ్గరకు వచ్చింది. ఆమెను పరికించి చూచి ఇలా అన్నది.

తే. భామినీమణి సొబగుని బయల వెదకు, విధమునను నాత్మవిభుఁ బాసి విహ్వలించు
వగను జేతికి లోనైనవానిఁ బాసి, భ్రాంతిఁ బొందిన భావంబు ప్రకట మయ్యె. 339

* ఓ సఖీ! నీ ప్రవర్తన చూస్తుంటే ప్రియుని వెదకుతున్న ధోరణీ, ప్రాణేశ్వరునికి దూరమై బాధ చెందుతున్న రీతీ, చేతికి చిక్కిన వానిని కోల్పోయి భ్రాంతితో మునిగిన పద్ధతీ ప్రకట మవుతున్నాయి.

తే. వనిత నాకన్న నెవరైనవారు నీకుఁ గలుగ నేర్తురె! నీ కోర్కిఁ దెలియఁ జెప్ప
కున్న మీ యన్నతో డన్నఁ గన్నుఁగవను, నలరు నునుసిగ్గుతో నగ వామతింప. 340

వ. ఇ వ్విధంబునఁ జిత్రరేఖం గనుంగొని యిట్లనియె. 341

* 'నెచ్చెలీ! నా కన్నా నీకు దగ్గరవా రింకెవరైనా ఉన్నారా? నాకు నీ మనసు తెలియజేయకపోతే ఒట్టు' అని చిత్రరేఖ పలుకగా ఉషాసుందరి కళ్లలో సిగ్గు దోబూచు లాడింది! అప్పుడు ఉష చిత్రరేఖతో ఇలా పలికింది.

చ. 'చెలి కలలోన నొక్క సరసీరుహనేత్రుఁడు రత్నహార కుం
డల కటకాంగుళీయక రణ న్మణినూపురభూషణుండు ని
ర్మల కనకాంబరుండు సుకుమారతనుండు వినీలదేహుఁ డు
జ్జ్వలరుచి నూతనప్రసవసాయకుఁ డున్నతవక్షుఁ డెంతయున్. 342

* సఖీ! నా కొక కల వచ్చింది. ఆ కలలో హారకేయూరాది వివిధాలంకార శోభితుడూ, పద్మనేత్రుడూ, కనకాంబరధారీ, సుకుమార శరీరుడూ, నీలవర్ణుడూ, ఉన్నతవక్షుడూ, అభినవ మన్మథుడూ అయిన ఒక నవయౌవనుడు కన్పించాడు.

చ. నను బిగియారఁ గౌఁగిట మనం బలరారఁగఁ జేర్చి మోదముం
దనుకఁగ నంచితాధర సుధారస మిచ్చి మనోజ కేళికిం
బనుపడఁ జేసి మంజుమృదుభాషలఁ దేలిచి యంతలోననే
చనియెను దుఃఖవార్ధిఁ బెలుచన్ ననుఁ ద్రోచి సరోరుహాననా! 343

* చెలీ! ఆ వన్నెకాడు నన్ను గాఢంగా కౌగిలించుకున్నాడు. అధరామృతం అందించాడు. మృదువుగా సంభాషించాడు. మన్మథ విలాసంలో ముంచి తేల్చి ఆనందం కలిగించి అంతలోనే నన్ను దుఃఖసాగరంలో ముంచి మాయ మయ్యాడు.

వ. అనుచు న మ్మత్తకాశిని చిత్తంబు చిత్తజాయత్తం బయి తత్తరంబున విరహానలం బుత్తలపెట్టఁ గన్నీరు మున్నీరుగా వగచుచు విన్ననయిన వదనారవిందంబు వాంచి యూరకున్నఁ జిత్రరేఖ దన మనంబున నయ్యింతి సంతాపంబు చింతించి యిట్లనియె. 344

* ఇలా చెప్పి ఉషాసుందరి తన మనస్సు మన్మథవేదనకు లోనై విరహానలం అధికం కాగా కన్నీరు మున్నీరుగా విలపిస్తూ తలవంచుకొని ఊరకున్నది. చిత్రరేఖ ఉషాకుమారి సంతాపాన్ని గ్రహించి ఇలాపలికింది.

**చ. 'సరసిజనేత్ర! యేటికి విచారము? నా కుశలత్వ మేర్పడన్**
**నర సుర యక్ష కింపురుష నాగ నభశ్చర సిద్ధ సాధ్య కి**
**న్నరవర ముఖ్యులం బటమునన్ లిఖియించినఁ జూచి నీ మనో**
**హరుఁ గని 'వీడె పో' మ్మనిన నప్పుడె వానిని నీకుఁ దెచ్చెదన్.' 345**

* ఓ పద్మాక్షీ! ఎందుకు నీవు విచారిస్తావు? నా నేర్పరితనంతో దేవ మానవ యక్ష కిన్నర సిద్ధ సాధ్య శ్రేష్ఠుల చిత్రపటాలను వ్రాసి నీకు చూపిస్తాను. అందులో నీ మనోహరు డెవరో నీవు గుర్తిస్తే ఆ క్షణంలోనే వానిని నీ చెంతకు తీసికొని వస్తాను.

**వ. అని యొడంబఱిచి మిలమిలని మంచుతోడం బురుడించు ధళ ధళ మను మెఱుంగులు దుఱం గలిగొను పటంబు నావటంబుసేసి, వజ్రంబున మేదించి, పంచవన్నియలు వేఱు వేఱ కనక రజత పాత్రంబుల నించి కేలం దూలిక ధరించి యొక్క విజన స్థలంబునకుం జని ముల్లోకంబులం బేరు గలిగి వయో రూప సంపన్ను లయిన పురుష ముఖ్యుల నన్వయ గోత్రనామధేయంబులతోడ వ్రాసి, యాయితంబయిన య ప్పటంబు దన ముందటఁ దెచ్చి పెట్టి య ప్పటంబునం దగులని వారు లేరు, వారిం జెప్పెద, సావధానంబుగ నాకర్ణింపు' మని యిట్లనియె. 346**

* ఈ విధంగా చిత్రరేఖ ఉషాకన్యను సమ్మతింపజేసింది. మంచువలె కాంతిమంతమైన పటాన్ని పొందుపరచింది. ఐదురంగులను బంగారు వెండి పాత్రలలో నింపుకొన్నది. కుంచెను చేతదాల్చి యేకాంత ప్రదేశానికి వెళ్లి ముల్లోకాలలో ప్రసిద్ధిగాంచిన సౌందర్యవంతుల చిత్రాలను వారి వారి గోత్రనామాలతో పాటు సిద్ధంచేసింది. ఆ పటాన్ని ఉషాకన్య చెంతకు తెచ్చి చూపించి ఈ చిత్రపటంలో లేనివాడు ఈ లోకంలో లేడు, వీరినిగూర్చి వివరిస్తాను విను''అని చిత్రరేఖ చెప్ప నారంభించింది.

**సీ. కమనీయ సంగీత కలిత కోవిదులు కింపురుష గంధర్వ కిన్నరులు వీరె**
**సతత యౌవన యదృచ్ఛావిహారులు సిద్ధ సాధ్య చారణ నభశ్చరులు వీరె**
**ప్రవిమల సాంఖ్య సంపద్వైభవులు సుధాశనమరుద్యక్ష రాక్షసులు వీరె**
**నిరుపమ రుచికళాన్విత కామరూపులై పొగడొందునట్టి పన్నగులు వీరె**

**తే. చూడు'మని నేర్పుఁ దీపింపఁ జూపుటయును, జిత్తము నిజమనోరథసిద్ధి వడయఁ**
**జాలకుండిన మధ్యమ క్ష్మాతలాధి, పతులఁ జూపుచు వచ్చె నప్పద్మనయన. 347**

* కల్యాణీ! వీరు కమనీయ గానవిద్యా విశారదులైన గంధర్వకిన్నర కింపురుషులు. వీరు నిత్య యౌవనులూ, స్వేచ్ఛా విహారులూ అయిన సిద్ధసాధ్య చారణులు. ఇరుగో వీరు అమితమైన సౌఖ్యాలలో తేలియాడే అమరులు, యక్షులు, రాక్షసులు. వీరు కామరూపులై గణుతిగాంచిన కళానిధులు, నాగకుమారులు.

వీరిని చూడు! నీ ప్రియుని గుర్తించు' అని చిత్రరేఖ చెప్పగా ఉషాకన్యకు వారిలో ఆమె ప్రియుడు కన్పించలేదు. అప్పుడు చిత్రరేఖ భూలోకవాసులైన రాజకుమారులను చూపించ నారంభించింది.

**ఉ. మాళవ కొంకణ ద్రవిడ మత్స్య పుళింద కళింగ భోజ నే**
**పాళ విదేహ పాండ్య కురు బర్బర సింధు యుగంధ రాంధ్ర బం**
**గాళ కరూశ టేంకణ త్రిగర్త సుధేష్ణ మరాట లాట పాం**
**చాల నిషాద ఘూర్జరక సాళ్వ మహీశులు వీరె కోమలీ!** 348

* ఓ కోమలీ! ఇరుగో వీరిని చూడు. మాళవ, కొంకణ, ద్రవిడ, మత్స్య, పుళింద, కళింగ, భోజ, నేపాల, విదేహ, పాండ్య, కురు, బర్బర, సింధు, ఆంధ్ర, బంగాళ, కరూశ, టేంకణ, త్రిగర్త, సుధేష్ణ, మరాట, లాట, పాంచాల, నిషాద, ఘూర్జర, సాళ్వదేశాధీశ్వరులు వీరు.

**ఉ. సింధురవైరి విక్రముఁడు శీతమయూఖ మరాళికా పయ**
**స్సింధు పటీర నిర్మలవిశేష యశోవిభవుండు శౌర్య ద**
**ర్పాంధ రిపుక్షితీశ నికరాంధతమః పుటలార్కుఁ డీ జరా**
**సంధునిఁ జూడు మాగధుని సద్బృహదశ్వసుతుం గృశోదరీ!** 349

* ఇదుగో! ఇతడు బృహదశ్వుని పుత్రుడు, మగధరాజైన జరాసంధుడు. ఈ జరాసంధుడు సింహపరాక్రముడు. నిర్మల కీర్తిమంతుడు. శత్రుభయంకరుడు.

**మ. సకలోర్వీతలనాథ సన్నుతుఁడు శశ్వద్భూరి బాహాబలా**
**ధికుం డుగ్రాహవకోవిదుండు త్రిజగద్విఖ్యాత చారిత్రకుం**
**డకలం కోజ్జ్వల దివ్యభూషుఁడు విదర్భాధీశ్వరుండైన భీ**
**ష్మక భూపాలకుమారుఁ జూడు మితనిన్ మత్తద్విరేఫాలకా!** 350

* ఓ నీలవేణీ! ఇతడు భీష్మక మహారాజు కుమారుడు రుక్మి. ఈ విదర్భరాజు సమస్త రాజలోక సన్నుతుడు. భుజబల సంపన్నుడు. రణకోవిదుడు. ప్రఖ్యాత చరిత్రుడు. దివ్యాలంకార భూషితుడు.

**ఉ. సంగరరంగ నిర్దళిత చండవిరోధి వరూధినీశ మా**
**తుంగ తురంగ సద్భట రథప్రకరైక భుజావిజృంభణా**
**భంగ పరాక్రమ ప్రకట భవ్యయశోమహనీయమూర్తి కా**
**ళింగుఁడు వీఁడె చూడు తరళీకృత చారుకురంగలోచనా!** 351

* కురంగ లోచనా! ఇడుగో ఇతడు కళింగ భూపాలుడు. సంగర రంగంలో శత్రువులను చించి చెండాడేవాడు. వైరి సేనాపతుల చతురంగబలాలను తన అవక్ర పరాక్రమంతో పరాజితులను గావించి అఖండ మైన కీర్తిగాంచిన వీరాధి వీరుడు.

మ. సుగుణాంభోనిధి ఫాలలోచను నుమేశు న్నాత్మ మెప్పించి శ
క్తి గరిష్ఠంబగు శూలముం బడసె నక్షీణప్రతాపోన్నతిన్
జగతిన్ మిక్కిలి మేటివీరుఁడు రణోత్సాహుండు భూపాత్రుఁ డీ
భగదత్తుం గనుఁగొంటె! పంకజముఖీ! ప్రాగ్జ్యోతిషాధీశ్వరున్. 352

* ఓ పద్మముఖీ! ఈతడు ప్రాగ్జ్యోతిషాధీశ్వరుడు. భగదత్తుడు. ఫాలలోచనుడైన పరమేశ్వరుణ్ణి మెప్పించి శక్తిమంతమైన శూలాన్ని ఆయుధంగా పొందాడు. యుద్ధోత్సాహం గల సాటిలేని మేటి వీరుడు.

మ. వికచాంభోరుహ పత్రనేత్రుఁ డగు గోవిందుండు దాఁ బూను నం
దక చక్రాబ్జ గదాదిచిహ్నములచేతన్ వాసుదేవాఖ్య ను
త్సుకుఁడై యెప్పుడు మచ్చరించు మదిఁ గృష్ణుం డన్న నేమేటి పౌం
డ్రకుఁ గాశీశసఖుం గనుంగొనుము వేడ్కం జంద్రబింబాననా! 353

* ఓ చంద్రముఖీ! ఇతడు పౌండ్రకుడు. పద్మాక్షుడైన గోవిందుడు ధరించే నందక మనే ఖడ్గమూ, సుదర్శనమనే చక్రమూ, పాంచజన్యమనే శంఖమూ, కౌమోదకి అనే గదా మొదలైన వానిని ధరించి వాసుదేవుడనే పేరు పెట్టుకొని శ్రీకృష్ణునిపై మాత్సర్యం పెంపొందించుకున్నాడు. కాశీ రాజుకు ఆప్తమిత్రుడు.

మ. ద్విజశుశ్రూషయు సూనృతవ్రతము సద్వృత్తిన్ భుజాగర్వమున్
విజయాటోపముఁ జాప నైపుణియు ధీవిస్ఫూర్తియుం గల్గు నీ
రజనీనాథకుల ప్రదీపకులఁ బాఱం జూడు పద్మాక్షి! ధ
ర్మజ భీమార్జున మాద్రినందనుల సంగ్రామైకపారీణులన్. 354

* సఖీ! చంద్రవంశ ప్రదీపకులైన పంచపాండవులు వీరు. ఇతడు ధర్మరాజు, ఇతడు భీముడు, ఇతడు అర్జునుడు, వీరిద్దరు నకుల సహదేవులు. ఈ పాండవులు బ్రాహ్మణ భక్తిపరులు. సత్యవ్రతులు భుజబల సంపన్నులు. విజయశీలురు. బుద్ధిమంతులు, యుద్ధరంగంలో ఆరి తేరిన వీరశిరోమణులు.

మ. బలిమిన్ సర్వనృపాలుర న్నదిమి కప్పంబుల్ దగం గొంచు ను
జ్జ్వల తేజో విభవాతిరేకమున భాస్వత్కీర్తి శోభిల్లఁగాఁ
బొలుపొందం దను రాజరా జన మహాభూరి ప్రతాపంబులుం
గల దుర్యోధనుఁ జూడు సోదరయుతుం గంజాతపత్రేక్షణా! 355

* కమలాక్షీ! ఇతడు సోదర సమేతుడైన సుయోధనుడు. గొప్ప పరాక్రమవంతుడు. తేజోనిధి. రారాజను ప్రశస్తి గాంచినవాడు. తన మహాశౌర్యంతో సమస్తరాజుల నోడించి వారిచే కప్పములను గైకొనుచున్నాడు. అఖండ కీర్తి మంతుడు.

వ. అని యిట్లు సకలదేశాధీశ్వరులగు రాజవరుల నెల్లఁ జూపుచు యదువంశ సంభవులైన శూరసేన వసుదేవోద్ధవాదులం జూపి మఱియును. 356

* ఈ విధంగా చిత్రరేఖ సమస్త రాజులను ఉషాకన్యకు చూపిస్తూ యాదవ వంశస్థులైన శూరసేనుడు, వసుదేవుడు, ఉద్ధవుడు మొదలైన వారినికూడా చూపించింది.

ఉ. శారద నీరదాబ్జ ఘనసార సుధాకర కాశ చంద్రికా
సార పటీరవర్ణు యదుసత్తము నుత్తమనాయకుం బ్రమ
త్తారి నృపాల కానన హుతాశనమూర్తిఁ బ్రలంబదైత్య సం
హారునిఁ గామపాలుని హలాయుధుఁ జూడుము దైత్యనందనా! 357

* ఓ దనుజేంద్రనందనా! శరత్కాల మేఘం, శంఖం, ఘనసారం, చంద్రుడు, చందనంవంటి వర్ణంతో శోభిస్తున్న ఈ వీరుడు బలరాముడు. ఇతడు ఉత్తమ నాయకుడు. ప్రమత్తులైన శత్రురాజులు అనే అరణ్యాలకు అగ్ని దేవుని వంటివాడు. ప్రలంబుడనే దైత్యుని సంహరించిన మహావీరుడు. యదువంశశేఖరుడు.

సీ. కమనీయ శుభగాత్రుఁ గంజాత దళనేత్రుఁ వసుధాకళత్రుఁ బావనచరిత్రు
సత్యసంకల్పు నిశాచరోగ్రవికల్పు నతపన్నగాకల్పు నాగతల్పుఁ
గౌస్తుభమణిభూషు గంభీరమృదుభాషు శ్రితజనపోషు నంచితవిశేషు
నీలనీరదకాయు నిర్జితదైతేయు, ధృతపీతకౌశేయు నతవిధేయు

తే. నఘమహాగదవైద్యు వేదాంత వేద్యు, దివ్యముని సన్నుతామోదుఁ దీర్ఘపాదు
జిష్ణు వర సద్గుణాలంకరిష్ణుఁ గృష్ణుఁ, జూడు దైతేయకులబాల! సుభగలీల! 358

* ఓ సుందరీ! ఇటుచూడు! ఇతడు శ్రీకృష్ణుడు. మనోహర గాత్రుడు. పద్మనేత్రుడు. పావనచరిత్రుడు. సత్యసంకల్పుడు. దుష్టరాక్షస విరోధి. శివునికిసైతం ఆరాధ్యుడు. శేషశయనుడు. కౌస్తుభమణిధారి. గంభీరభాషణుడు. ఆశ్రితజనపోషణుడు. నీలమేఘశ్యాముడు. పీతాంబరుడు. వేదవేద్యుడు. సుజన విధేయుడు. జయశీలుడు. సుగుణాలవాలుడు

చ. స్ఫుర దళి శింజినీరవ విభూషిత పుష్పధనుర్విముక్త భా
స్వర నవచూతకోరక నిశాత శిలీముఖ పాతభీత పం
క రుహభవాది చేతన నికాయు మనోజనిజాంశు రుక్మిణీ
వరసుతు రాజకీరపరివారుని మారునిఁ జూడు కోమలీ! 359

* కోమలీ! ఇతడు రుక్మిణీ సుతుడు. ప్రద్యుమ్నుడు. తన తుమ్మెదల నారి సారించి వదలిన పుష్పబాణాల దెబ్బతో బ్రహ్మాదిదేవతలనే భయపెట్ట గలిగిన మన్మథుని అవతారమే ఈ ప్రద్యుమ్నుడు.

వ. ఇ వ్విధంబునం జూపిన. 360

మ. వనితారత్నము కృష్ణనందనుని భావప్రౌఢిఁ దాఁ జూచి గ్ర
ద్దనఁ ద న్నర్థి వరించి చన్న సుగుణోత్తంసంబ కా నాత్మలో
ననుమానించి యనంతరంబ యనిరుద్ధాఖ్యున్ సరోజాక్షు నూ
తన చేతోభవమూర్తిఁ జూచి మది సంతాపించుచు న్నిట్లనున్. 361

* ఈ విధంగా చిత్రరేఖ యాదవవీరులను చూపించే సమయంలో ఆ బాలామణి కృష్ణుని కుమారుడైన ప్రద్యుమ్నుని గాంచి తనకు కలలో కన్పించిన వాడితడే యని అనుమానించింది. అటుపిమ్మట చిత్రరేఖ చూపించిన అపరమన్మథుడూ, పద్మనేత్రుడూ ఐన అనిరుద్ధుణ్ణి చూచి సంతోషంతో ఇలా పలికింది.

**ఉ. ఇంతి మదీయ మానధన మెల్ల హరించిన మ్రుచ్చు ని మ్మెయిం**
**బంత మెలర్ప వ్రాసి పటభాగనిరూపితుఁ జేసినట్టి నీ**
**యంతటి పుణ్యమూర్తిఁ గొని యాడఁగ నేర్తునె? నీ చరిత్రముల్**
**వింతలె నాకు? నీ మహిత వీరకులంబు బలంబుఁ జెప్పుమా! 362**

* సఖీ! నా మానధనాన్ని కొల్లగొట్టిన దొంగను ఈ విధంగా చిత్రపటంలో చూపించిన పుణ్యమూర్తివి నీవు. నిన్నేమని పొగడగలను చెలీ! ఈ వీరాధివీరుని విశేషాలు వివరించు.

**చ. అనవుడుఁ జిత్రరేఖ జలజాక్షికి నిట్లను 'నీ కుమారకుం**
**డనఘుఁడు యాదవాన్వయ సుధాంబుధి పూర్ణసుధాకరుండు నాఁ**
**దనరిన కృష్ణపౌత్రకుఁ డుదారచరిత్రుఁడు భూరిసింహ సం**
**హననుఁ డరాతిసైన్య తిమిరార్కుఁడు, పే రనిరుద్ధుఁ డంగనా! 363**

* అని ఉషాసుందరి చిత్రరేఖను అడిగింది. ఆమె ఉషాసుందరికి ఆ సుకుమారుని వివరాలు ఇలా తెల్పింది. నెచ్చెలీ! ఇతడు యాదవవంశ చంద్రుడు శ్రీకృష్ణులవారి మనుమడు. ఉదారచరిత్రుడు. శత్రు భయంకరుడు. సింహ పరాక్రముడు. ఇతని పేరు అనిరుద్ధుడు.

**వ. అని చెప్పి యే నతిత్వరితగతిం జని య క్కుమారరత్నంబుఁ దొడ్కొనివచ్చు నంతకు సంతాపింపకుండు మని యా క్షణంబ వియద్గమనంబునం జని ముందట. 364**

* చిత్రరేఖ ఈ విధంగా పలికి "నేను శీఘ్రంగా వెళ్లి ఈ కుమార రత్నాన్ని తీసికొని వస్తాను. అంతవరకూ నీవు విచారం మాని ఉండు" అని ఆక్షణంలోనే ఆకాశమార్గాన బయలుదేరింది.

**క. సరసిజముఖి గనుఁగొనె శుభ, భరిత విలోకన విధూత భవ వేదనమున్**
**బరసాధనమును సుకృత, స్ఫురణాపాదనముఁ గృష్ణు పుటభేదనమున్. 365**

* ఆ చిత్రరేఖ అలా వెళ్లి ఇహలోక దుఃఖాన్ని పోగొట్టగలిగినదీ, పరలోకాన్ని సాధించడానికి తోడ్పడగలదీ, పుణ్యాలపుట్ట అయిన శ్రీకృష్ణుని పట్టణాన్ని దర్శించింది.

**వ. కని డాయం జని తదీయ సుషమావిశేషంబులకుం బరితోషంబు నొందుచుం గామినీచరణ రణిత మణినూపుర ఝుణంఝుణధ్వనిత మణిగోపురంబును, నతి విభవ విజిత గోపురంబును నగు ద్వారకాపురంబు నిశాసమయంబునం బ్రచ్ఛన్న వేషంబునం జొచ్చి కనక కుంభ కలిత సౌధాగ్రంబున మణిదీపనిచయంబు ప్రకాశింపఁ జంద్రకాంత శిలాభవనంబున సుధాధామ రుచిరరుచి చయంబు నపహసించు హంసతూలికాతల్పంబున నిజాంగనా రతిశ్రమంబున నిద్రాసక్తుండై యున్న యనిరుద్ధుం**

**జేరి తన యోగవిద్యా మహత్త్వంబున నతని నెత్తుకొని మనోవేగంబున శోణపురంబునకుం జని బాణాసురనందన యగు నుషాసుందరీ తల్పంబునం దునిచి యిట్లనియె.** 366

* చిత్రరేఖ ఆ పట్టణ సౌందర్యానికి సంతోషించింది. నిశాసమయంలో మారువేషంలో ద్వారకలో ప్రవేశించింది. మానినీమణుల మణిమంజీరాలతో మారుమ్రోగే సౌధాలతో స్వర్గాన్ని తిరస్కరించే ఆ ద్వారకా పట్టణంలో బంగారు కుంభాలతో గూడిన రాజప్రాసాదం మీద, మణిదీపాలతో ప్రకాశిస్తున్న చంద్రకాంత శిలాభవనంలో, చంద్రకాంతిని ధిక్కరించే హంసతూలికా తల్పంపై, సురతశ్రమవలన నిద్రిస్తున్న అనిరుద్ధుని చెంతకు చేరింది. తన యోగవిద్యానైపుణ్యంతో అతని నెత్తుకొని మనోవేగంతో శోణపురం చేరింది. ఉషాసుందరి పాన్పుపై అనిరుద్ధుణ్ణి పరుండబెట్టింది. అలా చేసి ఉషాబాలతో చిత్రరేఖ ఇలా పలికింది.

**క. 'వనజాక్షి! చూడు నీ విభు, ననిమిషనగధీరు శూరు నభినవమారున్**
**వనధి గభీరు నుదారుని, ననిరుద్ధకుమారు విదళితాహితవీరున్.** 367

* ఓ సారసాక్షీ! మేరునగధీరుడూ, రణశూరుడూ, నవమన్మథాకారుడూ, సముద్రగంభీరుడూ, ఉదారుడూ, శత్రుసంహారుడూ, అయిన నీ హృదయచోరుని అనిరుద్ధకుమారుని దర్శించు.

**క. అనిన నుషాసతి దన మన, మున ననురాగిల్లి మేనఁ బులకాంకురముల్**
**మొనయఁగ నానందాశ్రులు, గనుఁగవ జడి గురియ ముఖవికాస మెలర్పన్.** 368

* ఈ మాటలు వినగానే అనురాగంతో ఉషాబాల తనువు పులకించింది. ఆనందాశ్రువులు జాలువారాయి. ముఖకమలం వికసించింది.

**వ. ఇట్లు మనంబున నుత్సహించి చిత్రరేఖం గనుంగొని య య్యింతి యిట్లనియె.** 369

* ఈ విధంగా అంతరంగంలో ఆనందం పొంగిపొరలగా ఉషాకుమారి చిత్రరేఖతో ఇలా అన్నది.

**సీ. 'అతివ! నీ సాంగత్య మను భానురుచి నాకుఁ గలుగుటఁ గామాంధకార మడఁగెఁ**
**దరలాక్షి! నీ సఖిత్వం బను నావచేఁ గడిఁది వియోగాబ్ధిఁ గడవఁ గంటి**
**నబల! నీ యనుబంధ మను సుధావృష్టిచే నంగజ సంతాప మార్పఁ గంటి**
**వనిత! నీ చెలితనం బను రసాంజనముచే నా మనోహర నిధానంబుఁ గంటిఁ**

**తే. గలలఁ దోఁచిన రూప గ్రక్కన లిఖించు, వారు 'నౌ'నన్నఁ దోడ్తెచ్చు వారు గలరె?**
**నీటిలో జాడఁ బుట్టించు నేర్పు నీక, కాక గల్గునె మూఁడు లోకములయందు?** 370

* "చెలీ! నీ సాంగత్యమనే సూర్యకాంతి లభించటం వలన నా కామాంధకారం పటాపంచలై పోయింది. తరళాక్షీ! నీ స్నేహమనే నావవలన వియోగసాగరాన్ని దాట గలిగాను. అతివా! నీ అనుబంధమనే అమృతవర్షంతో మన్మథతాపం చల్లారిపోయింది. మగువా! నీ మైత్రి అనే అంజనంతో మనోహరుడనే నిధిని కనుక్కున్నాను. కలలో కన్పించిన ఆకారాన్ని చిత్రపటంలో చిత్రించే వారు ఉండవచ్చునేమో గాని అవును అనగానే అతనిని తీసుకొని వచ్చేవారెవరైనా ఉంటారా? నీటిలో జాడలు తీయగల నేర్పుగల దానివి నీవు. ఈ ముల్లోకాలలో నిన్ను మించే వారు లేరు".

**వ. అని వినుతించి చిత్రరేఖను నిజమందిరంబునకుం బోవం బనిచినం జనియె, ననంతరంబ వింత జనుల కెవ్వరికిం బ్రవేశింప రాని యంతఃపుర సౌధాంతరంబున ననిరుద్ధుండు మేల్కని య య్యింతిం గనుంగొని యప్పుడు.** 371

* అని ఉషాబాల చిత్రరేఖను కొనియాడి సాగనంపింది. పరపురుషులు ప్రవేశింపరాని ఆ అంతః పురంలో అనిరుద్ధుడు నిద్రమేల్కొని ఆ రమణీమణిని కనుగొన్నాడు.

**క. సురుచిర మృదుతల్పంబునఁ, బరిరంభణ సరసవచన భావకళా చా**
**తురి మెఱయ రాకుమారుఁడు, తరుణీమణిఁ బొందె మదనతంత్రజ్ఞుండై.** 372

* అందమైన ఆ మృదుతల్పంపైన అనిరుద్ధుడు కౌగిలింతలతో, సరససల్లాపాలతో ఉషాసుందరిని ఉత్సాహపరుస్తూ శృంగార లీలావిలాసాలలో ఓలలాడాడు.

**వ. ఇ వ్విధంబున నతిమనోహర విభవాభిరామంబులగు దివ్యాంబరాభరణ మాల్యానులేపనంబులను, గర్పూర తాంబూలంబులను, వివిధాన్నపానంబులను, సురుచిర మణిదీప నీరాజనంబులను, సుగంధ బంధురాగరు ధూపంబులను, నాటపాటల వీణా వినోదంబులను, బరితుష్టిం బొంది కన్యాకుమారకు లానంద సాగరాంతర్నిమగ్న మానసులై యుదయాస్తమయ నిరూపణంబు సేయనేరక, ప్రాణంబు లొక్కటియైన తలంపులం గదిసి యిష్టోపభోగంబుల సుఖియించుచుండి, రంత.** 373

* ఈ విధంగా అత్యంత మనోహరాలైన వస్త్రాలు, ఆభరణాలు, పూలదండలు, మైపూతలు, కర్పూరతాంబూలాలు, షడ్రసోపేతభోజనాలు, ఆటపాటలు, అగరుధూపాలు, మణిదీపాలు, వీణావాదనలు మొదలైన సౌఖ్యాలతో ఉషానిరుద్ధులు ఆనందసాగరంలో మునిగితేలారు. వారికి సూర్యోదయాస్తమయాలు తెలియడం లేదు. శరీరాలు వేరైనా ప్రాణం ఒకటిగా ఇష్టోపభోగాలతో సుఖించారు.

**క. ఆలోనన యతిచర మగు, కాలము సుఖలీల జరుగఁగా వరుస నుషా**
**బాలాలలామ కొయ్యనఁ, జూ లేర్పడి గర్భ మొదవె సురుచిరభంగిన్.** 374

* ఇలా కొంతకాలం వారు ఎంతో సంతోషంతో గడిపారు. తర్వాత కొన్నాళ్ళకు ఉషాబాల గర్భం దాల్చింది.

**క. ఆ చిన్నె లంగజాలలు, సూచి భయాకులత నొంది స్రుక్కుచుఁ దమలో**
**'నో చెల్ల! యెట్టులో? యీ, రా చూలికిఁ జూలు నిలిచెరా! యి బ్బంగిన్'** 375

* ఆ బాల గర్భచిహ్నాలను అంతఃపుర కంచుకులు చూచి భయపడ్డారు. మన రాచూలికి చూలు నిలిచింది. ఇక ఇప్పుడు ఏం చేయాలని లోలోపల మథనపడ్డారు.

**క. అని గుజగుజ వోవుచు 'ని, ప్పని దప్పక దనుజలోక పాలునితోడన్**
**వినిపింపవలయు' నని వే, చని బాణునిఁ జేరి మ్రొక్కి సద్వినయమునన్.** 376

* ఇలా గుసగుసలాడుకొని ఈ విషయం తప్పక బాణాసురుల వారికి చెప్పవలసిందే నని నిశ్చయించుకున్నారు. శీఘ్రంగా దానవేశ్వరుని దగ్గరకు వెళ్లి వినయంతో నీ విధంగా విన్నవించుకున్నారు.

క. మంతనమున దేవర! క, న్యాంతఃపుర మేము గాచి యరయుచు నుండన్
వింతజనములకుఁ జొరఁగ దు, రంతము విను పోతుటీఁగకైన సురారీ! 377

* ఓ దానవేంద్రా! దాసులమైన మేము దేవరవారి అంతఃపురాన్ని జాగరూకతతో కావలికాసే వాళ్లం. పోతుటీగకైనా మమ్మల్ని కాదని లోనికి వెళ్లడం అసాధ్యం.

తే. ఇట్టిచోఁ గావలున్న మే మెవ్వరమును, నేమి కనుమాయయో కాని యెఱుఁగ మధిప!
నీ కుమారిక గర్భంబు నివ్వటిల్ల, యున్నదన్నను విని రోషయుక్తుఁ డగుచు. 378

* ప్రభూ! ఈ పరిస్థితిలో అదేమి మాయయో మాకు తెలియదు. మేము కావలి కాస్తూనే ఉన్నాం. నీ కుమార్తె గర్భం ధరించింది అని చెప్పగానే విని అసురేంద్రుడు ఆగ్రహోదగ్రుడైనాడు.

వ. అట్టియెడ దానవేంద్రుండు రోషభీషణాకారుండై, కటము లదర, బొమలు ముడివడం, గనుంగవల ననలకణంబు లుప్పతిల్ల, సటలు వెఱికినం జటుల గతి నెగయు సింగంబు విధంబున లంఘించుచు, భీకర కరవాలంబు గేలం దాల్చి సముద్దండ గతిం గన్యాసౌధాంతరంబునకుం జని. 379

* రోషభీషణాకారుడైన రాక్షసేంద్రుని చెక్కిళ్ళు అదిరాయి. కమబొమలు ముడివడ్డాయి. కళ్లవెంట నిప్పులు రాలాయి. జూలుబట్టి లాగగా విజృంభించిన సింహంలాగా ముందుకు లంఘించి భయంకరమైన కరవాలాన్ని ధరించి ఆగ్రహావేశంతో అంతఃపురానికి వెళ్లాడు.

## -: బాణాసురుం డనిరుద్ధుని నాగపాశబద్ధునిఁ జేయుట :-

సీ. కనియె శుభోపేతుఁ గందర్పసంజాతు మానితదేహు నాజానుబాహు
మకరకుండలకర్ణు మహితప్రభాపూర్ణుఁ జిరయశోల్లాసుఁ గౌశేయవాసుఁ
గస్తూరికాలిప్తు ఘనకాంతికుముదాప్తు హారశోభితవక్షు నంబుజాక్షు
యదువంశతిలకు మత్తాలినీలాలకు నవపుష్పచాపుఁ బూర్ణప్రతాపు

తే. నభినవాకారు నక్షవిద్యావిహారు, మహితగుణవృద్ధు మన్మథమంత్రసిద్ధుఁ
గలితపరిశుద్ధు నఖిలలోక ప్రసిద్ధుఁ, జతురు ననిరుద్ధు నంగనాజననిరుద్ధు. 380

* అచ్చట బాణాసురుడు ఆజానుబాహువులతో, శుభాకారంతో, మణిమయ మకరకుండలాలతో, పట్టుపీతాంబరంతో, రాజీవనేత్రాలతో, సుకుమార రత్నహారాలతో, వినీలకేశాలతో, కమ్మ కస్తూరి మైపూతతో, అభినవ మన్మథునివలె అలరారే అఖిలలోక ప్రసిద్ధుడైన అనిరుద్ధుణ్ణి అలోకించాడు.

చ. కని కన లగ్గలింప సురకంటకుఁ డుద్ధతి సద్భటావళిం
గనుఁగొని 'యీ నరాధమునిఁ గట్టుఁడు, పట్టుఁడు, కొట్టుఁ'డన్న వా

**రనుపమ హేతిదీధితు లహర్పతితేజము మాయఁ జేయ డా**
**సిన నృపశేఖరుండు మదిఁ జేవయు లావును నేర్పు దర్పమున్.** 381

* ఆ రాక్షసరాజు అనిరుద్ధుని చూచి అత్యంత కోపంతో మండిపడుతూ భటులను గాంచి "ఈమానవా ధముని బంధించండి" అని ఆజ్ఞాపించాడు. ఆ రాక్షసభటులు సూర్యకాంతిని ధిక్కరించే ఆయుధాల కాంతులతో శోభిస్తూ అనిరుద్ధుని బంధించడానికి వెళ్లారు.

**చ. కలిగి మహోగ్రవృత్తిఁ బరిఘంబు గరంబున లీలఁ దాల్చి దో**
**ర్బల ఘనవిక్రమప్రళయభైరవు భంగివిజృంభణక్రియా**
**కలన నెదిర్చె దానవ నికాయముతోఁ దలపాటుఁ బోటునుం**
**జలము బలంబు ధైర్యమును శౌర్యము వ్రేటును వాటుఁ జూపుచున్.** 382

* అప్పుడు అనిరుద్ధుడు అనివార్య శౌర్యసాహసాలతో ఇనుపకట్ల గుదియను చేతదాల్చి ప్రళయకాల భైరవునివలె మహోగ్రంగా విజృంభించి దానవసేనను ఎదిరించాడు. తనశక్తియుక్తుల్నీ శౌర్యధైర్యాలనూ ప్రదర్శించాడు.

**చ. పదములు బాహులుం దలలు ప్రక్కలు చెక్కులు జానుయుగ్మముల్**
**రదములు గర్ణముల్ మెడ లురంబులు మూఁపులు వీఁపు లూరువుల్**
**చిదురుపలై ధరం దొఱఁగఁ జిందఱవందఱ సేయ సైనికుల్**
**కదన పరాఙ్ముఖక్రమముఁ గైకొని పాఱిరి కాందిశీకులై.** 383

* అనిరుద్ధుని యుద్ధకౌశలానికి దానవసైనికులు పాదాలు, చేతులు, తలలు, మోకాళ్లు, పండ్లు, చెవులు, మెడలు, తొడలు, వీపులు, మూపులు చిన్న చిన్న ముక్కలుగా భూమి నిండా చిందరవందరగా పడ్డాయి. అనిరుద్ధునితో యుద్ధం చేయలేక రాక్షససైనికులు రణరంగంనుండి పారిపోయారు.

**వ. ఇవ్విధంబున సైన్యంబు దైన్యంబు నొంది వెఱచియుం, బఱచియు; విచ్చియుం, జచ్చియుఁ; గలంగియు, నలంగియు; విఱిగియు, సురిఁగియుఁ; జెదరియు, బెదరియుఁ; జేవదఱిఁగి నుఱుములై తన మఱుఁగు సొచ్చిన బాణుండు శౌర్యధురీణుండును, గోపోద్దీపిత మానసుండునై కదిసి యేసియు, వ్రేసియుఁ; బొడిచియు, నడిచియుఁ బెనంగె.** 384

* ఈ విధంగా దానవ సైన్యం చేవచచ్చి, బాధతో భయంతో బెదరి చెదరి వచ్చి బాణాసురుని మరుగు చొచ్చింది. బాణాసురుడు శౌర్య క్రోధాలతో అనిరుద్ధునిపై దూకి భీకర యుద్ధం చేశాడు.

**క. క్రుద్ధుండై యహిపాశ ని, బద్ధుం గావించె నసురపాలుఁడు రణ స**
**న్నద్ధున్ శరవిద్ధు న్నని, రుద్ధున్ మహితప్రబుద్ధు రూపసమృద్ధున్.** 385

* ఈ విధంగా విజృంభించి బాణాసురుడు రూపసమృద్ధుడూ, రణసన్నద్ధుడూ అయిన అనిరుద్ధుణ్ణి నాగపాశంతో బంధించాడు.

వ. ఇట్లు కట్టి త్రోచిన నుషాసతి శోకవ్యాకులితచిత్తయై యుండె నంత. 386

* తన తండ్రి తనప్రియుడైన అనిరుద్ధుణ్ణి ఈ విధంగా బంధించటం చూచి ఉషాకాంత శోక సంతప్త హృదయురాలయింది.

క. నీలపటాంచితమై సువి, శాలంబై వాయునిహతిఁ జండధ్వని నా
భీలమగు నతని కేతన, మాలోన నకారణంబ యవనిం గూలెన్. 387

* సరిగా అదే సమయంలో సుడిగాలి వీచింది. ఆ గాలి దెబ్బకు నీలవస్త్రంతో విశాలమైన బాణాసురుని జెండా భయంకరధ్వని చేస్తూ నేలగూలింది.

క. అది చూచి దనుజపాలుఁడు, మదనాంతకుఁ డాడినట్టి మాట నిజముగాఁ
గదనంబు గలుగు ననుచును, నెదురెదురే చూచుచుండె నెంతయుఁ బ్రీతిన్. 388

* ఈ కేతనపతనాన్ని చూచిన దానవరాజు సంతోషపడ్డాడు. పరమేశ్వరుడు పలికిన విధంగా తనకు తగిన వానితో సమరం సంప్రాప్తమౌతుందని భావించి ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నాడు.

వ. అంత నక్కడ. 389

క. ద్వారకలో ననిరుద్ధ కు, మారుని పోకకును యదుసమాజము వగలం
గూరుచు నొకవార్తయు విన , నేరక చింతింప నాల్గునెల లరిగె నృపా! 390

* ఇక అక్కడ ద్వారకా నగరంలో అనిరుద్ధుడు అంతర్ధాన మైనందుకు యాదవులంతా విచారించారు. నాలుగ నెలల వరకు అనిరుద్ధుని గూర్చిన వార్తే వారికి తెలియలేదు.

## -: నారదుని వలన వృత్తాంతమును విని కృష్ణుఁడు బాణాసురునిపై దండెత్తుట :-

వ. అ య్యవసరంబున. 391

క. శారద నిర్మల నీరద, పారద రుచిదేహుఁ డతుల భాగ్యోదయుఁ డా
నారదముని యేతెంచె న, పార దయామతి మురారిభజన ప్రీతిన్. 392

* అసమయంలో శరత్కాల మేఘంవటి దేహంతో కూడిన నారద మునీంద్రుండు దయాసాగరుడైన శ్రీకృష్ణుని పూజించే కుతూహలంతో ద్వారకకు వచ్చాడు.

వ. ఇట్లు సనుదెంచిన య ద్దివ్యమునికి నిర్మల మణివినిర్మిత సుధర్మాభ్యంతరంబున యదు వృష్ణి భోజాంధకవీరులు గొలువం గొలువున్న గమలలోచనుండు ప్రత్యుత్థానంబు చేసి, యర్ఘ్య పాద్యాది విధులం బూజించి, సముచిత కనకాసనాసీనుం జేసిన నత్తాపసోత్తముండు పురుషోత్తము నుదాత్త తేజోనిధిం బొగడి, యనిరుద్ధ వృత్తాంతం బంతయుఁ దేటపడ నెఱింగించి, యప్పుండరీకాక్షునిచేత నామంత్రణంబు వడసి, యంతర్ధానంబు నొందెఁ, దదనంతరంబ కృష్ణుండు శుభముహూర్తంబున దండయాత్రాభిముఖుండై ప్రయాణభేరి వ్రేయించి, బలంబుల వెడలింప బ్రద్దలవారిం బనిచి, తానును గట్టాయితం బయ్యె, నంత. 393

* ద్వారకకు విచ్చేసిన నారదమునీంద్రునకు యదువృష్ణి భోజాంధక వీరులతో శ్రీకృష్ణుడు ఎదురు వెళ్లి అర్ఘ్యపాద్యాదులతో పూజించి బంగారు ఆసనంపై ఆసీనుణ్ణి చేశాడు. తర్వాత నారదమునీంద్రుడు పురుషోత్తముని స్తుతించి అనిరుద్ధుని వృత్తాంతం అంతా వివరించాడు. అనంతరం పుండరీకాక్షుని చెంత సెలవుతీసికొని వెళ్లిపొయ్యాడు. అటు పిమ్మట శ్రీకృష్ణుడు ఒక శుభముహూర్తంలో బాణాసురునిపై దండయాత్ర చేయటానికి ప్రయాణభేరి వేయించాడు. సైన్యాన్ని సర్వసన్నద్ధం చేయించాడు. తాను చతురంగబలాలతో యుద్ధరంగానికి వెళ్లడానికి సిద్ధమయ్యాడు.

**సీ. హార కిరీట కేయూర కంకణ కట కాంగులీయక నూపురాది వివిధ**
**భూషణప్రతతిచేఁ బొలుపారి కరముల ఘనగదా శంఖ చక్రములు దనర**
**సురభి చందన లిప్త సురుచి రోరస్థలిఁ బ్రవిమల కౌస్తుభ ప్రభలు నిగుడఁ**
**జెలువారు పీత కౌశేయచేలము కాసె వలనుగా రింగులు వాఱఁ గట్టి**

**తే శైబ్య సుగ్రీవ మేఘ పుష్పక వలాహ, కములఁ బూన్చిన తే రాయితముగఁ జేసి**
**దారుకుఁడు దేర నెక్కె మోదం బెలర్ప, భానుఁ డుదయాచలం బెక్కు పగిది మెఱసి.** 394

* శ్రీకృష్ణుడు హారములు, కిరీటము, కేయూరములు, కంకణములు, అంగుళీయకములు, నూపురములు మొదలైన ఆభరణాలను ధరించినాడు. శంఖ చక్ర గదాయుధాలను దాల్చాడు. చందనం అలదిన వక్షస్థలంపై కౌస్తుభ రత్నకాంతులు ప్రసరించుతుండగా పీతాంబరాన్ని రింగులు వారగట్టాడు. శైబ్యము, సుగ్రీవము, మేఘపుష్పకము, వలాహకము అనే గుఱ్ఱాలను కట్టిన రథాన్ని సిద్ధం చేసి దారుకుడు తీసుకొని రాగా శ్రీకృష్ణుడు సూర్యుడు ఉదయపర్వతాన్ని ఆరోహించినట్లు ఆ రథాన్ని అధిరోహించాడు.

**వ. ఇట్లు రథారోహణంబు సేసి, భూసురాశీర్వచనపూతుండును, మహితదూర్వాంకు రాలంకృతుండును, లలితపుణ్యాంగనా కరకిసలయ కలిత శుభాక్షత విన్యాసభాసుర మస్తకుండును, మాగధ మంజుల గానానుమోదితుండును, వందిజనసంకీర్తనా నందితుండును, పాఠక పఠనరవ వికాసిత హృదయుండును నయి వెడలు నవసరంబున.** 395

* శ్రీ కృష్ణుడు రథాన్ని అధిరోహించగా బ్రాహ్మణులు ఆశీర్వదించారు. పుణ్యాంగనలు శిరస్సుపై శుభాక్షతలు చల్లారు. వందిమాగధులు కైవారాలు చేశారు. స్తోత్ర పాఠకులు స్తుతించారు. ఈ విధంగా ముకుందుడు ఆనందంతో ముందుకు సాగాడు.

**సీ. బలభద్ర సాత్యకి ప్రద్యుమ్న ముఖ యదు వృష్టి భోజాంధక వీరవరులు**
**దుర్వార పరిపంథి గర్వభేదన కళా చతురబాహాబలోత్సాహలీల**
**వారణ స్యందన వాజి సందోహంబు సవరణ సేయించి సంభ్రమమున**
**సముచిత ప్రస్థాన చటుల భేరీ భూరి, ఘోష మంభోనిధి ఘోష మడఁప**

**తే. ద్వాదశాక్షౌహిణి బలోత్కరము లోలి, నడచెఁ గృష్ణుని రథము వెన్వెంటి చెలఁగి**
**పృథులగతి మున్ భగీరథు రథము వెనుక, ననుగమించు వియన్నది ననుకరించి. 396**

* అప్పుడు బలరాముడు సాత్యకి ప్రద్యుమ్నుడు మొదలైన యదువీరులు మదోన్మత్తులయిన శత్రు వీరులను అణచి వేయాలనే అఖండ బలోత్సాహాలతో చతురంగబలాలను సమకూర్చుకొని ప్రస్థానభేరి మ్రోగించాడు. ఆ భేరీధ్వని సముద్ర ఘోషను మించి పోయింది. శ్రీకృష్ణుని రథం వెంట బయలుదేరిన పన్నెండు అక్షౌహిణుల సైన్యం భగీరథుని వెంట బయలుదేరిన ఆకాశ గంగావాహినిలా తోచింది.

**వ. ఇవ్విధంబునం గదలి కతిపయ ప్రయాణంబుల శోణపురంబు సేరం జని వేలాలంఘనంబు సేసి యదువీరు లంత. 397**

* ఈ ప్రకారంగా బయలు దేరిన యదువీరులు కొన్నాళ్లకు శోణపురం సమీపించి పొలిమేర దాటారు.

**మ. సరి దారామ సరోవరోపవన యజ్ఞస్థానముల్ మాపి వే**
**పరిఖల్ పూడిచి యంత్రముల్ దునిమి వప్రవ్రాతముల్ ద్రొబ్బి గో**
**పురముల్ గూలఁగఁద్రోచి సౌధభవనంబుల్ నూకి ప్రాకారముల్**
**ధరణిం గూల్చి కవాటముల్ విఱిచి రుద్దండక్రియాలోలు రై. 398**

* యాదవ వీరులు ఉద్దండులై శోణపుర ప్రాంతంలోని నదులను, సరోవరాలను, ఉద్యానవనాలను, యజ్ఞవాటికలను చిందరవందర చేశారు. అగడ్తలను పూడ్చివేశారు. యంత్రాలను చెడగొట్టారు. కోటలను పడగొట్టారు. గోపురాలను కూలద్రోశారు. సౌధాలను, ప్రాకారాలను నేలగూల్చారు! కవాటాలు విరగగొట్టారు.

**వ. ఇట్లనేకప్రకారంబులు గాసి చేసి, పురంబు నిరోధించి పేర్చి యార్చినం జూచి యాగ్రహ సమగ్రోగ్రమూర్తియై బాణుండు సమర సన్నాహ సంరంభ విజృంభమాణుండై సంగరభేరి వ్రేయించిన. 399**

* ఈ రీతిగా యాదవవీరులు శోణపురాన్ని చుట్టుముట్టి విజృంభించారు. అప్పుడు బాణుడు మిక్కిలి ఆగ్రహంతో సమరసన్నాహం చేసి యుద్ధభేరి వేయించాడు.

**సీ. ఆచక్రవాళాచలాచక్ర మంతయు బలసి కుమ్మరిసారె పగిదిఁ దిరిగె**
**ఘన ఘోణి ఖుర కోటిఘట్టిత నదముల కరణి నంభోనిధుల్ గలఁగి పొరలెఁ**
**గాలరుద్రాభీల కర శూలహతి రాలు పిడుగుల గతి రాలె నుడుగణంబు**
**చటులానిలోద్ధూత శాల్మలీతూలంబు చాడ్పున మేఘముల్ చదలఁ దూలె**

**తే. గిరులు వడఁకాడె దివి పెల్లగిల్లె సురల, గుండె లవిసె రసాతలక్షోభ మొదవె**
**దిక్కు లదరె విమానముల్ తెరలి చెదరెఁ, గలఁగి గ్రహరాజ చంద్రుల గతులు దప్పె. 400**

* ఈ యుద్ధ ప్రారంభసమయాన ధరణీచక్రమంతా కుమ్మరి సారెలాగా తిరిగింది. ఆదివరాహపు గిట్టల తాకిడి తగిలిన నదాలలాగా సముద్రాలు కలగిపోయాయి. కాలరుద్రుని శూలపు దెబ్బలకు రాలిన

పిడుగులలాగా చుక్కలు విచ్ఛిన్నమై నేలరాలాయి. భయంకరమైన గాలికి ఎగిరిన బూరుగదూది పింజలవలె మేఘాలు తూలిపోయాయి. పర్వతాలు వణకిపోయాయి. దివి పెల్లగిల్లింది. దేవతల గుండెలు అవిసిపోయాయి. పాతాళం క్షోభించింది. దిక్కులు సంచలించాయి. విమానాలు చెల్లాచెద రయ్యాయి. సూర్యచంద్రులు గతులు తప్పారు.

**వ. అట్టి సమర సన్నాహంబునకుఁ గట్టాయితంబై, మణిఖచితభర్మ వర్మ నిర్మలాంశు జాలంబులును, శిరస్త్రాణ కిరీట కోటి ఘటిత వినూత్నరత్న ప్రభాపటలంబులును, గనక కుండల గ్రైవేయ హార కంకణ తులాకోటి వివిధ భూషణవ్రాత రుచినిచయంబులును, బ్రచండ బాహుదండ సహస్రంబున వెలుంగుచు శరశరాసన శక్తి ప్రాస తోమర గదా కుంత ముసల ముద్గర భిందివాల కరవాల పట్టిస శూల క్షురికా పరశు పరిఘాది నిశాత హేతివ్రాత దీధితులును, వియచ్చరకోటి నేత్రంబులకు మిఱుమిట్లు గొలుపం గనకాచల శృంగ సముత్తుంగం బగు రథం బెక్కి యరాతివాహినీ సందోహంబునకుం దుల్యంబైన నిజ సేనాసమూహంబు లిరుగడల నడవ బాణుం డక్షీణప్రతాపంబు దీపింప ననికి వెడలె, న య్యవసరంబున. 401**

* యుద్ధానికి సిద్ధపడి బాణాసురుడు మేరుపర్వత శిఖరంవలె ఉన్నతమైన రథాన్ని అధిరోహించాడు. మణులు పొదిగిన బంగారు కవచాన్ని ధరించాడు. రత్నకాంతులతో అతని కిరీటం శోభించింది. కుండలాలు, హారాలు, కంకణాలు మొదలైన బంగారు ఆభరణాల కాంతులు అంతటా వ్యాపించాయి. బాణ కుంత తోమర ముసల గదా కరవాలాది ఆయుధాలతో అతని వేయి చేతులు వెలిగిపోతూ దేవతల నేత్రాలకు మిరుమిట్లు గొల్పాయి. ఈ విధంగా అమిత పరాక్రమంతో ఆ రాక్షసరాజు శత్రుసైన్యంతో సమానమైన సైన్యం ఇరుదిక్కులా నడవగా యుద్ధ రంగానికి బయలుదేరాడు.

### -: బాణాసురునికి సహాయభూతుండగు శివునకు కృష్ణునకు యుద్ధ మగుట :-

**చ. వరదుఁ డుదార భక్తజనవత్సలుఁడైన హరుండు బాణునిం**
**గర మనురక్తి నాత్మజులకంటె దయామతిఁ జూచుఁ గానఁ దా**
**దుర మొనరించు వేడ్కఁ బ్రమథుల్ గుహుఁడున్ నిజభూతకోటియున్**
**సరస భజింప నుజ్జ్వల నిశాతభయంకరశూలహస్తుఁడై. 402**

* వరదుడు, ఉదారుడు, భక్తజన వత్సలుడైన పరమేశ్వరుడు బాణాసురుని తన కన్న కొడుకులకన్న అధికంగా అభిమానిస్తాడు. కనుక బాణుని పక్షాన యుద్ధం చేయాలనే కోరికతో ప్రమథులు వెంటరాగా భయంకరమైన శూలాన్ని ధరించి బయలుదేరాడు.

**సీ. ఖరపుటాహతి రేఁగు ధరణీపరాగంబు పంకేరుహాప్త బింబంబుఁ బొదువ**
**విపులవాలాటోప విక్షేపజాత వాతాహతి వారివాహములు విరియఁ**
**గుఱుచ తిన్నని వాఁడికొమ్ములఁ జిమ్మిన బ్రహ్మాండభాండ కర్పరము వగుల**
**నలవోక ఖణి ఖణిల్లని ఱంకె వైచిన రోదసీకుహరంబు భేదిలంగ**

తే. గళ చలద్ఘర్మఘంటికా ఘణఘణ ప్ర, ఘోషమున దిక్తటంబు లాకులత నొంద
లీల నడతెంచు కలధౌతశైల మనఁగ, నుక్కు మిగిలిన వృషభేంద్రు నెక్కి వెడలె. 403

* విలాసంగా కదలివస్తున్న కైలాస పర్వతంలాగా మహోన్నతమైన నందీశ్వరునిపై ఎక్కి శంకరుడు యుద్ధరంగానికి వచ్చాడు. నందీశ్వరుని కాలిగిట్టల తాకిడికి పైకి లేచిన దుమ్ము సూర్యబింబాన్ని క్రమ్మివేసింది. తోక కదలికవలన పుట్టిన గాలిదెబ్బకు మేఘాలు చెదరిపోయాయి. వాడికొమ్ముల ధాటికి బ్రహ్మాండభాండం బ్రద్దలయింది. ఖణిల్లని విలాసంగా వేసిన రంకెకు రోదసీకుహరం దద్దరిల్లింది. మెడలోని గంటల గణగణ ధ్వనులకు దిక్తటాలు పెటపెటలాడాయి.

వ. ఇట్లు వెడలి సమరసన్నాహ సముల్లాసంబు మొగంబులకు వికాసంబు సంపాదింపం బ్రతిపక్ష బలం బులతోడం దలపడిన ద్వంద్వయుద్ధం బయ్యె, నప్పు డ ప్పురాతన యోధుల యా యోధనంబుఁ జూచు వేడ్కం జనుదెంచిన, నరసిజసంభవ శక్ర సుర యక్ష సిద్ధ సాధ్య చారణ గంధర్వ కిన్నర కిం పురుష గరుడోరగాదులు నిజవిమానారూఢులై వియత్తలంబున నిలిచి రట్టి యెడం గృష్ణుండును హరుండును, మారుండును గుమారుండును, గూప కర్ణ కుంభాండులును, గామపాలుండును బాణుపుత్త్రుండగు బలుండును, సాంబుండును; సాత్యకియును బాణుండును, రథికులు రథికు లును, నాశ్వికులు నాశ్వికులును, గజారోహకులు గజారోహకులును, బదాతులు పదాతులునుం దలపడి యితరేతర హేతిసంఘట్టనంబుల మిణుఁగుఱులు సెదరం బరస్పరాహ్వాన బిరుదాంకిత సింహనాద హుంకార శింజినీటంకార వారణఘీంకార వాజిహేషారవంబులను, బటహ కాహళ భేరీ మృదంగ శంఖ తూర్యఘోషంబులను బ్రహ్మాండకోటరంబు పరిస్ఫోటితంబయ్యె, న య్యవసరంబున. 404

* పరమేశ్వరు డిలా బయలుదేరి యుద్ధోత్సాహంతో ప్రతిపక్షంతో తలపడ్డాడు. అప్పుడు ఇరుపక్షాల వారికి ద్వంద్వయుద్ధం జరిగింది. ఆ పురాతన యోధుల యుద్ధాన్ని చూడడానికి బ్రహ్మాది దేవతలు, మునీంద్రులు, యక్షరాక్షస సిద్ధ చారణ గంధర్వ కిన్నరాదులు తమ తమ విమానాల నెక్కి ఆకాశంలో గుమికూడారు. అట్టి సమయంలో శివకేశవులూ, కుమార ప్రద్యుమ్నులూ, కూపకర్ణ కుంభాండులూ బలరాముడూ, సాంబుడూ బాణనందనుడు బలుడూ, బాణ సాత్యకులూ ఒండొరులతో తలపడ్డారు. రథికులు రథికులతోను, ఆశ్వికులు ఆశ్వికులతోను, గజారోహకులు గజారోహకులతోను, పదాతులు పదాతులతోను యుద్ధం ప్రారంభించారు. ఖడ్గాల రాపిడికి నిప్పులు రాలుతున్నాయి. సింహనాదాలతో, ధనుష్టంకారాలతో, ఏనుగుల ఘీంకారాలతో, గుఱ్ఱాల సకిలింపులతో; పటహము, భేరి, కాహళము, మృదంగము, శంఖము మొదలైన వాని సంకుల ధ్వనులతో బ్రహ్మాండం దద్దరిల్లిపోయింది.

చ. జలరుహనాభుఁ డార్చి నిజ శార్ఙ్గ శరాసన ముక్త సాయ కా
వలి నిగుడించి నొంచెఁ బురవైరి పురోగములన్ రణక్రియా
కలితుల గుహ్యక ప్రమథ కర్బుర భూత పిశాచ డాకినీ
బలవ దరాతియోధులను బమ్మెరపోయి కలంగి పాఱఁగన్. 405

* శ్రీ కృష్ణుడు సింహనాదం చేసి శార్ఙ్గమనే తన ధనుస్సును ఎక్కు పెట్టి బాణవర్షాన్ని కురిపించాడు. యుద్ధ విశారదులైన ప్రమథగణాలనూ, భూత పిశాచ డాకినీ వీరులను దిగ్భ్రమ చెంది పారిపోయేటట్లు చేశాడు.

**వ. ఇ ట్లేసి యార్చిన కుంభినీధరు భూజావిజృంభణ సంరంభంబునకు సహింపక, నిటలాంబకుం డనలకణంబు లుమియు నిశితాంబకంబులం బీతాంబరుని నేసిన, వాని నన్నింటి నడుమన ప్రతి బాణంబు లేసి చూర్ణంబు సేసినం గనుంగొని మఱియును. 406**

* ఇలా బాణప్రయోగం చేసి శ్రీకృష్ణుడు విజృంభించటాన్ని సహించలేక పరమేశ్వరుడు నిప్పులు క్రక్కే శరపరంపరలను పీతాంబరునిపై ప్రయోగించాడు. ఆ బాణాల నన్నిటినీ నడుమనే శ్రీకృష్ణుడు చూర్ణం చేశాడు.

**మ. అనలాక్షుండు త్రిలోకపూజ్యమగు బ్రహ్మాస్త్రం బరింబోసి యా**
**వనజాతేక్షణు మీఁదఁ గ్రోధమహిమవ్యాకీర్ణుఁడై యేసె, నే**
**సినఁ దద్దివ్యశరంబుచేతనె మఱల్చెం గృష్ణుఁ డత్యుద్ధతిన్**
**జనితాశ్చర్య రసాబ్ధిమగ్ను లగుచున్ శక్రాదు లగ్గింపఁగన్. 407**

* ఫాలలోచనుడు పరిస్థితిని గమనించాడు. త్రిలోకపూజ్యమైన బ్రహ్మాస్త్రాన్ని నిటలాక్షుడు కమలాక్షునిపై ప్రయోగించాడు. శ్రీకృష్ణుడు ఆ అస్త్రాన్ని అవలీలగా చేతితోనే మరలించాడు. ఇది చూచి దేవేంద్రాది దేవతలు ఆశ్చర్యచకితులై శ్రీకృష్ణుని స్తుతించారు.

**శా. వాయవ్యాస్త్ర ముపేంద్రుపై నలిగి దుర్వారోద్ధతి న్వేయ దై**
**తేయధ్వంసియుఁ బార్వతాశుగముచేఁ ద్రెంచెం, గ్రతుధ్వంసి యా**
**గ్నేయాస్త్రం బడరించె నుగ్రగతి లక్ష్మీనాథుపై, దాని వే**
**మాయం జేసెను నైంద్రబాణమునఁ బద్మాక్షుండు లీలాగతిన్. 408**

* అప్పుడు ఉమాపతి ఉపేంద్రునిపై వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. దైత్యారి ఆ అస్త్రాన్ని పార్వతాస్త్రంతో నివారించాడు. ఉగ్రుడు మహోగ్రుడై అగ్నేయాస్త్రాన్ని ప్రయోగించగా పద్మాక్షుడు ఐంద్రబాణంతో దానిని అణచివేశాడు.

**వ. మఱియును. 409**

**ఉ. పాయని కిన్కతో హరుఁడు పాశుపతాస్త్రము నారిఁ బోసినన్**
**దోయరుహాయతాక్షుఁడును దోడన లోకభయంకరోగ్ర నా**
**రాయణబాణరాజము రయంబున నేసి మరల్చె దానిఁ జ**
**క్రాయుధుఁ డిత్తెఱంగునఁ బురారి శరావలి రూపుమాపినన్. 410**

* "అనంతరం మిక్కిలి కోపంతో పరమేశ్వరుడు పాశుపతాస్త్రాన్ని వింట సంధించాడు. చక్రాయుధుడు లోక భయంకరమైన నారాయణాస్త్రాన్ని ప్రయోగించి పాశుపతాన్ని మరలించాడు. ఈ విధంగా శ్రీకృష్ణుడు పరమశివుని అస్త్రాలన్నిటినీ శాంతింపజేశాడు.

క. ఊహ కలంగియు విగతో, త్సాహుండగు హరునిమీఁద జలజాక్షుఁడు స
మ్మోహన శిలీముఖం బ, వ్యాహత జయశాలి యగుచు నడరించె నృపా! 411

* అప్పుడు పరమేశ్వరుడు నిరుత్సాహం చెందాడు. ఆ సమయం కనిపెట్టి జయశాలియైన శ్రీకృష్ణుడు సమ్మోహనాస్త్రం ప్రయోగించాడు.

వ. అట్లేసిన. 412

క. జృంభణశరపాతముచే, శంభుఁడు నిజతనువు పరవశం బయి సోలన్
జృంభితుఁడై ఘననిద్రా, రంభత వృషభేంద్రు మూఁపురముపై వ్రాలెన్. 413

* ఆ సమ్మోహనాస్త్ర ప్రభావం వలన శరీరం స్వాధీనం తప్పి శంకరుడు నందీశ్వరుని మూపురంపై వ్రాలిపోయాడు.

వ. ఇట్లు వ్రాలినం జక్రపాణి పరబలంబుల నిశితబాణ పరంపరలం దునిమియు, నొక్కయెడం గృపాణంబులం గణికలు సేసియు, నొక్కచో గదాహతులం దుత్తుమురుగా మొత్తియు ని వ్విధంబునఁ బీనుంగు పెంటలఁ గావించె, నంత. 414

* శూలపాణి స్పృహ తప్పుట చూచి చక్రపాణి శత్రుసైన్యాన్ని శరపరంపరలతో చిందరవందర చేశాడు. కొందరిని కత్తిదెబ్బలతో ముక్కలుచెక్కలు చేశాడు. కొందరిని గదాఘాతాలతో తుత్తుమురు గావించాడు. ఈ విధంగా శత్రుసైన్యాన్ని హతమార్చాడు.

చ. తఱిమి మురాంతకాత్మజుఁ డుదాత్తబలంబున బాహులేయుపైఁ
గఱకరిఁ దాఁకి తీవ్రశితకాండ పరంపర లేసి నొంపఁగా
నెఱఁకులు గాఁడి పైఁదొరఁగు నెత్తుట జొత్తిలి వైరు లార్వఁ గాఁ
బఱచె మయూరవాహనముఁ బైకొని తోలుచు నాజిభీతుఁడై. 415

* ఆ సమయంలో ప్రద్యుమ్నుడు అనివార్యమైన శౌర్యంతో కుమారస్వామిని ఎదుర్కొన్నాడు. పట్టుదలతో తీవ్రమైన బాణాలను ప్రయోగించాడు. అప్పుడు నెత్తురుముద్దగా మారిన కుమారస్వామి శత్రువులు సింహనాదాలు చేస్తుండగా నెమలివాహనంపై యుద్ధరంగం నుండి పరాజితుడైనాడు.

ఉ. పంబి రణక్షితిన్ శరవిపాటిత శాత్రవవీరుఁడైన యా
సాంబుఁడు హేమపుంఖశిత సాయకజాలము లేర్చి భూరి కో
పంబున నేసినన్ బెదరి బాణతనూభవుఁ డోడి పాఱె శౌ
ర్యంబును బీరముం దగవు నాఱడివోవ బలంబు లార్వఁగన్. 416

* శత్రుభయంకరుడైన సాంబుడు విజృంభించి తీవ్రక్రోధంతో వాడిబాణాలను ప్రయోగించగా బాణుని పుత్రుడు బెదరి శౌర్యం కోల్పోయి శత్రువీరులు హేళన చేస్తుండగా పలాయనం చిత్తగించాడు.

మ. వరబాహాబలశాలి యా హలి రణావష్టంభ సంరంభ వి
స్ఫురదుగ్రాశనితుల్యమైన ముసలంబుం బూన్చి వ్రేసెన్ బొరిం
బొరిఁ గుంభాండక కూపకర్ణులు శిరంబుల్ వ్రస్సి మేదంబు నె
త్తురు గర్ణంబుల వాతనుం దొరఁగ సంధుల్ వ్రీలి వే చావఁగన్. 417

* పరాక్రమశాలి యైన బలరాముడు వజ్రాయుధంతో సమానమైన తన రోకలిని చేతదాల్చి కుంభాండక కూపకర్ణులను ఎదుర్కొన్నాడు. ఆ ముసలాయుధపు దెబ్బలకు వారిద్దరూ నెత్తురు కక్కుకొని అసువులు వీడారు.

వ. అట్టియెడ సైన్యంబు దైన్యంబు నొంది యనాథం బయి చెడి, విఱిగి పాఱినం గని బాణుండు సాత్యకిం గేడించి ప్రళయాగ్నియుం బోలె విజృంభించి చెయి వీచి బలంబుల మరలం బురికొల్పి తానును ముంగలియై నడచె, నప్పు డుభయ సైన్యంబు లన్యోన్యజయకాంక్షం దలపడు దక్షిణోత్తర సముద్రంబుల రౌద్రంబున వీఁకం దాఁకినం బోరు ఘోరంబయ్యె, నట్టియెడ గదల నడిచియుఁ, గుఠారంబులఁ బొడిచియు; సురియలం గ్రుమ్మియు, శూలంబులం జిమ్మియు; శక్తుల నొంచియుఁ, జక్రంబులం ద్రుంచియు; ముసలంబుల మొత్తియు, ముద్గరంబుల నొత్తియుఁ; గుంతంబుల గ్రుచ్చియుఁ, బంతంబు లిచ్చియుఁ; బరిఘంబుల నొంచియుఁ, బట్టిసంబులం ద్రుంచియు; శరంబుల నేసియుఁ, గరవాలంబుల వ్రేసియు; సత్రాసులై పాసియు, విత్రాసులై డాసియుఁ బెనఁగినం దునిసిన శిరంబులును, దునుకలైన కరంబులును, దెగిన కాళ్ళును, ద్రెస్సిన వ్రేళ్ళును; దుమురులైన యెముకలును, బ్రోవులైన ప్రేవులును; నులిసిన మేనులును, నలిసిన జానువులును; నొగిలిన వర్మంబులును, బగిలిన చర్మంబులును, వికలంబు లయిన సకలావయవంబులును,వికీర్ణంబు లయిన కర్ణంబులును; విచ్ఛిన్నంబులైన నయనంబులును, వెడలు రుధిరంబులును; బడలుపడు బలంబులును, గొండలవడువునం బడు మాంసఖండంబులును; వాచఱచు కొఱప్రాణంబులును, వ్రాలిన తేరులును; గూలిన కరులును, నొఱగిన గుఱ్ఱంబులును; దెరలిన కాలుబలంబులును గలిగి, పలలఖాదన కుతూహలజనిత మదాంధీభూత పిశాచ డాకినీ భూత బేతాళ సమాలోల కోలాహల భయంకరారావ బధిరీకృత సకలదిశావకాశంబయి సంగరాంగణంబు భీషణం బయ్యె, న య్యవసరంబున. 418

* ఆ సమయాన బాణుని సైన్యం దీనత్వంతో అనాథయై పారిపోవ నారంభించింది. అదిచూచి బాణాసురుడు సాత్యకిని అలక్ష్యంచేసి ప్రళయాగ్నివలె విజృంభించి తనసైన్యాన్ని పురికొల్పి తాను సేనకు అగ్రభాగాన నడిచాడు. అప్పుడు ఉభయసైన్యాలూ అన్యోన్యజయకాంక్షతో తలపడిన ఉత్తర దక్షిణ సముద్రాలవలె విజృంభించి యుద్ధానికి సిద్ధ పడ్డాయి. సంకుల యుద్ధం సాగింది. గదలు, ఖడ్గాలు, సురియలు, శూలాలు, చక్రాలు, శక్తులు, బల్లెములు, పట్టిసములు మున్నగు ఆయుధాలతో ఇరుపక్షాల సైనికులు యుద్ధం చేశారు. కొందరు భయంతో పారిపోయారు. కొందరు ధైర్యంతో ఎదిరించారు. కాళ్ళు, వ్రేళ్లు,

తలలు, చేతులు తెగిపోయాయి. ఎముకలు ముక్కలయ్యాయి. ప్రేగులు కుప్పలు పడ్డాయి. చెవులు తెగిపోయాయి. కళ్లు విచ్ఛిన్నమైనాయి. మాంసఖండాలు కొండలవలె యుద్ధరంగంలో పడ్డాయి. రథాలు కుప్పగూలాయి. గజాలు నేలవ్రాలాయి. గుర్రాలు కూలబడ్డాయి. కాల్బలం మట్టికరచింది. యుద్ధరంగంలో పడిన ఈ శవాల మాంసాన్ని భక్షించడానికి గుమికూడిన భూతపిశాచ బేతాళుల భయంకర ధ్వనులతో సకలదిశలు మార్మోగాయి. సంగరాంగణం ఈ తీరున మహాభీషణమై ఘోరాతిఘోరంగా మారిపోయింది.

**చ. శరకుముదంబు లుల్లసితచామర ఫేనము లాతపత్ర భా**
**సుర నవపుండరీకములు శోణితతోయము లస్థి సైకతో**
**త్కరము భుజాభుజంగమనికాయము కేశకలాప శైవల**
**స్ఫురణ రణాంగణం బమరెఁ బూరిత శోణనదంబు పోలికన్.** 419

* అమ్ములు కలువపూలుగా, చామరాలు నురుగు తెట్టెలుగా, ఆతపత్రాలే తెల్లదామరలుగా, రక్తమే నీరంగా, ఎముకలు ఇసుక తిన్నెలుగా, భుజాలే సర్పాలుగా, కేశాలే నాచుగా, రణరంగం ఒక రక్త సరస్సుగా ఆ సమయంలో భాసించింది.

**వ. అట్టి యెడ బాణుండు గట్టలుకం గృష్ణునిపైఁ దన రథంబుఁ బఱపించి, యఖర్వబాహా సహస్ర దుర్వారగర్వాటోప ప్రదీప్తుండై కదిసి.** 420

* అప్పుడు బాణాసురుడు మిక్కిలి కోపంతో తన రథాన్ని ముందుకు నడిపించి, సహస్ర బాహువు లున్నవనే అహంకారంతో శ్రీకృష్ణుని మార్కొన్నాడు.

**మ. ఒక యే నూఱు కరంబులన్ ధనువు లత్యుగ్రాకృతిం దాల్చి త**
**క్కక యొక్కొక్కట సాయకద్వయము వీఁకం బూన్చ నాలోన నం**
**దకహస్తుండు తదుగ్రచాపచయ విధ్వంసంబు గావించి కొం**
**చక తత్సారథిఁ గూల నేసి రథముం జక్కాడి శౌర్యోద్ధతిన్.** 421

* బాణాసురుడు అయిదువందల చేతులతో ధనుస్సులను ధరించి తక్కిన ఐదువందల హస్తాలతో రెండేసి చొప్పున బాణాలను సంధించే సమయంలోనే శ్రీ కృష్ణుడు అవక్రవిక్రమంతో విజృంభించి ఆ ధనుస్సులను ధ్వంసం చేసి సంకోచించకుండా సారథిని సంహరించి బాణుని రథాన్ని నుగ్గు గావించాడు.

**తే. ప్రళయ జీమూత సంఘాత భయద భూరి, భైరవారావముగ నొత్తెఁ బాంచజన్య**
**మఖిలజనులు భయభ్రాంతులయి చలింపఁ, గడఁగి నిర్భిన్న రాక్షసీగర్భముగను.** 422

* అలాచేసి శ్రీకృష్ణుడు ప్రళయకాలంనాటి మేఘగర్జనంతో కూడిన తన పాంచజన్య శంఖాన్ని పూరించాడు. ఆ శంఖారావం ధ్వని విని సమస్తజనులు భయభ్రాంతు లయ్యారు. రాక్షసస్త్రీల గర్భనిర్భేదక మైంది.

**వ. అట్టి యవక్ర విక్రమ పరాక్రమంబునకు నెగడుపడి బాణుండు లేటమొగంబు వడి చేయునది లేక విన్ననయి యున్నయెడ.** 423

* శ్రీకృష్ణుని భయంకర పరాక్రమానికి వెరగుపడి బాణాసురుడు ఏమీచేయలేక నిశ్చేష్టుడయ్యాడు.

సీ. అత్తఱిఁ గోటర యను బాణజనయిత్రి సుతుఁ గాచు మతము సన్మతిఁ దలంచి
వీడి శిరోజముల్ వ్రేలంగ నిర్ముక్త పరిధానయై మురాసురవిభేది
యెదుర నిల్చినఁ జూడ మదిఁ జూల రోసి పరాఙ్ముఖుఁడై యున్న నను వేచి
తల్లడించుచు బాణుఁ డుల్లంబు గలగంగఁ దలచీర వీడ యాదవులు నవ్వ

తే. నవ్యకాంచనమణి భూషణములు రాలఁ, బాదహతి నేలఁ గంపింపఁ బాఱి యాత్మ
పురము వడిఁ జొచ్చె నప్పుడు భూతగణము, లాకులతతోడ నెక్కడే నరుగుటయును. 424

* ఆ సమయంలో బాణాసురుని తల్లి అయిన "కోటర" తన కుమారుని రక్షించుకో దలచి వీడినజుట్టుతో, వివస్త్రయై శ్రీకృష్ణుని యెదుట నిలిచింది. అమెను చూడటానికి అసహ్యించుకొని మాధవుడు మారుమొగం పెట్టాడు. ఆసమయంలో బాణాసురుడు తలపాగ వీడిపోగా, భూషణాలు రాలిపోగా యాదవులు పరిహసిస్తుండగా తన పట్టణానికి పారిపోయాడు. అప్పుడు భూతగణాలు గూడా యుద్ధరంగం వీడి పోయాయి.

క. శిరములు మూఁడును ఘన భీ, కరపదములు మూఁడుఁ గలిగి కనలి మహేశ
జ్వర మురు ఘోరాకృతితో, నరుదేరఁగఁ జూచి కృష్ణుఁ డల్లన నగుచున్. 425

చ. పరువడి వైష్ణవజ్వరముఁ బంచిన న య్యుభయజ్వరంబులున్
వెరవును లావుఁ జేవయును వీరము బీరము గల్గి ఘోర సం
గర మొనరింప నందు గరకంఠకృతజ్వర ముగ్రవైష్ణవ
జ్వరమున కోడి పాఱె ననివారణ వైష్ణవి వెంట నంటఁగన్. 426

* అదే సమయంలో మూడు శిరస్సులతో మూడుపాదాలతో తీవ్ర క్రోధంతో శివజ్వరం భయంకరా కారంతో అరుదెంచింది. అదిచూచి శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి వైష్ణవ జ్వరాన్ని ప్రయోగించాడు. ఆ శైవ వైష్ణవ జ్వరాలు తమ తమ శక్తి సామర్థ్యాలతో ఘోరంగా పోరాడాయి. ఆ సంగ్రామంలో శివజ్వరం వైష్ణవజ్వరానికి ఓడిపోయి పారిపోయింది. అప్పుడు వైష్ణవజ్వరం వెన్నంటి తరిమింది.

తే. పాఱి యే దిక్కుఁ గానక ప్రాణభీతి, నెనసి యేడ్చుచు నా హృషీకేశు పాద
కంజములఁ బడి 'ననుఁ గావు కావు' మనుచు, నిటలతట ఘటితాంజలిపుటయు నగుచు. 427

* శివజ్వరానికి ఎటు పారిపోవడానికి దిక్కుతోచక దుఃఖిస్తూ పంకజాక్షుని పాదాలపై పడి ప్రణామం చేసి నెన్నుదుట చేతులు జోడించి రక్షించుమని ప్రార్థించింది.

వ. ఇట్లు వినుతించె. 428

సీ. అవ్యయు ననఘు ననంతశక్తిని బరు లై నట్టి బ్రహ్మ రుద్రామరేంద్ర
వరుల కీశ్వరుఁ డైనవాని సర్వాత్మకు జ్ఞానస్వరూపు సమానరహితు

వరదుని జగదుద్భవ స్థితి సంహార హేతుభూతుని హృషీకేశు నభవు
బ్రహ్మచిహ్నంబులై పరఁగు సుజ్ఞాన శ క్త్యాదుల నొప్పు బ్రహ్మంబు నీశు

ఆ. నజు షడూర్మిరహితు నిజయోగమాయా వి, మోహితాఖిలాత్ము ముఖ్యచరితు
మహితతేజు నాదిమధ్యాంతహీనునిఁ, జిన్మయాత్ము నిను భజింతుఁ గృష్ణ! 429

* శివజ్వరం శ్రీకృష్ణుని ఇలా స్తుతించింది. 'అవ్యయుడవు, అనంత శక్తియుక్తుడవు, బ్రహ్మాది దేవతలకే అధీశ్వరుడవు, సర్వాత్మకుడవు, జ్ఞాన స్వరూపుడవు, అనుపమానుడవు, వరదుడవు, సృష్టి స్థితి లయకారకుడవు, హృషీకేశుడవు, అభవుడవు, పరబ్రహ్మస్వరూపుడవు, యోగమాయచేత సర్వజగత్తును సమ్మోహపరచువాడవు, మహనీయతేజుడవు, ఆదిమధ్యాంత రహితుడవు, చిన్మయాత్ముడవు అయిన ఓ శ్రీకృష్ణా! నిన్ను ప్రార్థిస్తున్నాను.

వ. అదియునుం గాక లోకంబున దైవం బనేక ప్రకారంబులై యుండు, నది యెట్టి దనినం గలాకాష్ఠాముహూర్తం బులనం గల కాలంబును, సుకృత దుష్కృతానుభవ రూపంబులైన జీవకర్మంబులును; స్వభావంబును, సత్త్వ రజ స్తమోగుణాత్మకంబైన ప్రకృతియును, సుఖదుఃఖాశ్రయంబైన శరీరంబును, జగజ్జంతు నిర్వాహకం బైన ప్రాణంబును, సకలపదార్థ పరిజ్ఞాన కారణంబైన యంతఃకరణంబును, మహదహంకార శబ్ద స్పర్శ రూప రస గంధ తన్మాత్ర తత్కార్యభూత గగన పవనానలసలిల ధరాది పంచభూతంబు లాదిగాఁ గల ప్రకృతి వికారంబులును, నన్నింటి సంఘాతంబును, బీజాంకుర న్యాయంబునం గార్యకారణ రూప ప్రవాహంబునునై, జగత్కారణశంకితంబై యుండు, నది యంతయు భవదీయ మాయా విడంబనంబుగాని యున్నయది కాదు, తదీయ మాయానివర్తకుండవైన నీవు నానావిధ దివ్యావతారాది లీలలం జేసి దేవగణంబులను, సత్పురుషులను, లోకనిర్మాణచణులైన బ్రహ్మాదులను బరిరక్షించుచు లోకహింసా ప్రవర్తకులైన దుష్టమార్గగతులం గ్రూరాత్ముల హింసించుచుందువు, విశ్వ విశ్వంభరాభార నివారణంబు సేయుటకుఁ గదా భవదీయ దివ్యావతార ప్రయోజనంబు, గావున నిన్ను శరణంబు వేఁడెద. 430

* దేవా! లోకంలో దైవం అనేక రీతులలో గోచరిస్తాడు, కాలం, ప్రకృతి, శరీరం, ప్రాణం, అంతఃకరణం, పంచభూతాలు- ఈ అన్నింటి సంఘాతం బీజాంకురన్యాయంతో కార్యకారణరూపమైన ప్రవాహమై ఈ జగత్తుకు కారణమేమో అని సందేహం కలిగిస్తుంది. ఇది అంతా నీ మాయయే గాని వాస్తవం కాదు. ఆ మాయను నివారించగల నీవు అనేకమైన దివ్యావతారాలను ధరించి లోకనిర్మాణ చణులైన బ్రహ్మాది దేవతలనూ, పుణ్యపురుషులనూ, దేవగణాలనూ రక్షిస్తూ హింసారూపమైన చెడ్డమార్గాన్ననుసరించే దుష్టాత్ములను శిక్షిస్తుంటావు. ఈ భూభారాన్ని తొలగించడమే గదా నీ దివ్యావతారాల ప్రయోజనం? అందువలన నిన్ను శరణు కోరుతున్నాను.

సీ. శాంతమై మహితతీక్ష్ణ సుదుస్సహంబై యుదారమై వెలుఁగొందు తావకీన
భూరిభాస్వత్తేజమునఁ దాప మొందితిఁ, గడుఁ గృశించితి, నన్ను గరుణఁ జూడుఁ
మితరదేవోపాస్తిరతి మాని మీ పాద కమలముల్ సేవించు విమలబుద్ధి
యెందాక మది దోఁప దందాఁకనే కదా ప్రాణులు నిఖిలతాపములఁ బడుట?

తే. యవిరళానన్యగతికుల నరసి ప్రోచు, బిరుదు గల నీకు నను( గాచు టరుదె? దేవ!
ప్రవిమలాకార! సంసారభయవిదూర! భక్త జనపోషపరితోష! పరమపురుష! 431

* ఓ పరమపురుషా! భక్తజనానందదాయకా! సంసార భయనివారకా! దివ్యాకారా! శాంతమూ, తీక్ష్ణమూ, దుస్సహమూ, ఉదారమూ అయి వెలుగొందుతున్న నీ మహత్తర తేజస్సుచే తాపం పొందాను. కృశించిపోయాను. నన్ను రక్షించు. ఇతరదైవాలను సేవించడం మాని నీ పాదపద్మాలను సేవించాలనే బుద్ధి ఉదయించేటంత వరకే అన్ని తాపాలు. అనాథరక్షకుడనే బిరుదుగల నీకు నన్ను రక్షించటం ఏ మంత గొప్ప విషయం!'

చ. అనిన( బ్రసన్ను(డై హరి యనంతు(డు దైత్యవిభేది దాని కి
ట్లనియె 'మదీయ సాధన మనన్యనివారణమౌట నీ మదిం
గని నను నార్తి( జొచ్చితివి గావున మజ్జ్వర తీవ్రదాహ వే
దన నిను( బొంద దింక( బరితాపము దక్కుము నీ మనంబునన్. 432

* అని స్తుతించగా దానవాంతకుడైన అనంతుడు శివజ్వరంతో ఇలా అన్నాడు. 'నా పరాక్రమం అనన్య నివారణమని గమనించి నీవు ఆర్తితో నా శరణం కోరావు గనుక నా జ్వరం నిన్ను బాధింపదు. నీ మనస్సులో పరితాపం మాను'.

వ. అని మఱియు న ప్పుండరీకాక్షుం డిట్లను, 'నెవ్వరేనియు నీ యుభయజ్వర వివాదంబును, నీవు మత్ప్ర పత్తిం జొచ్చుటయును( జిత్తంబులం దలంతు రట్టిపుణ్యాత్ములు శీతోష్ణజ్వరాది తాపంబుల( బొరయ' రని యానతిచ్చిన న మ్మహేశ్వర జ్వరంబు పరమానందభరిత హృదయంబై యా రథాంగ పాణికి సాష్టాంగ దండప్రణామం బాచరించి నిజేచ్ఛం జనియె, నంత బాణాసురుండు నక్కడ. 433

* అని ఇంకా ఇలా అన్నాడు. ఈ శైవ వైష్ణవ జ్వరాల వివాద వృత్తాంతాన్నీ, నీవు నన్ను శరణుకోరిన విధానాన్నీ, ఎవ్వరు మనస్సులో తలచు కుంటారో అటువంటి పుణ్యాత్ములకు శీతోష్ణ జ్వరాది తాపాలు కలుగవు అని అనగా మహేశ్వర జ్వరం మిక్కిలి సంతోషించి శ్రీ కృష్ణునకు సాష్టాంగ నమస్కారం చేసి వెళ్లి పోయింది. ఇది ఇలా ఉండగా అక్కడ బలికుమారుడైన బాణాసురుడు మళ్లీ యుద్ధసన్నద్ధుడై బయలుదేరాడు.

## -: బాణాసురు(డు రెండవసారి యుద్ధమునకు వచ్చుట :-

సీ. కమనీయ కింకిణీఘంటికా సాహస్ర ఘణఘణధ్వనిచేత గగన మ గల
నన్యజనాలోక నాభీలతరళోగ్ర కాంచనధ్వజపతాకలు వెలుంగ(
బృథునేమి ఘట్టన( బృథివి కంపింపంగ వలనొప్పు పటుజవాశ్వముల( బూన్చి
నట్టి యున్నత రథం బత్యుగ్రగతి నెక్కి కరసహస్రమున భీకరతరాసి

తే. శర శరాసనముఖ దివ్యసాధనములు, దనర( జలమును బలము నుత్కటము గా(గ
హర్ష మిగురొత్త( గయ్యంపు టాయితమున(, బురము వెలువడె బలిపుత్త్రు( డురుజవమున. 434

* ఆకాశాన్ని బ్రద్దలు చేస్తున్న అసంఖ్యాకమైన చిరుగంటల ధ్వనితో కూడినదీ, శత్రువులకు తేరిచూడరానంత భయంకరమైన బంగారు ధ్వజపతాకలతో ప్రకాశించేదీ, చక్రాల తాకిడితో భూమిని కంపింప జేస్తున్నదీ, వేగవంతములైన అశ్వాలను కూర్చినదీ ఐన ఒక ఉన్నత రథాన్ని అధిరోహించి అమితోత్సాహంతో బాణాసురుడు యుద్ధరంగానికి వచ్చాడు. అతని వేయిచేతులలో ధనుర్బాణాలూ, భయంకరమైన ఖడ్గాది ఆయుధాలూ ప్రకాశిస్తున్నాయి.

**క. చని రణభూమిని మధ్యం, దిన మార్తాండ ప్రచండ దీప్తాకృతితోఁ**
**దనరుచుఁ బరిపంథిబలేం, ధన దవశిఖియైన కృష్ణుఁ దాఁకెం బెలుచన్.** 435

* బాణాసురుడు ఈ విధంగా కదలి కదన రంగంలో మధ్యాహ్న మార్తాండునివలె ప్రకాశిస్తూ శత్రువులనే ఇంధనాలకు అగ్నిజ్వాలవలె విరాజిల్లే శ్రీకృష్ణుని ఎదుర్కొన్నాడు.

**ఉ. తాఁకి భుజావిజృంభణము దర్పము నేర్పును నేర్పడంగ నొ**
**క్కూఁకున వేయిచేతుల మహోగ్రశరావళి పింజ పింజతోఁ**
**దాఁకఁగ నేసినన్ మురవిదారుఁడు తోడన తచ్ఛరావళి**
**న్నాఁక గొనంగఁ ద్రుంచె నిశితార్ధశశాంక శిలీముఖంబులన్.** 436

* బలిపుత్రుడు తన భుజబలం ద్యోతకమౌతుండగా ఒకేసారి వేయి చేతులతో శ్రీకృష్ణునిపై వాడిబాణాలను ప్రయోగించాడు. మురాంతకుడు ఆ బాణవర్షాన్ని లెక్కచేయకుండా మార్గమధ్యంలోనే తన అర్ధచంద్రబాణాలతో వాటిని త్రుంచివేశాడు.

**వ. అంత.** 437

**చ. నుతనవ పుండరీకనయనుం డన నొప్పు మురారి రోష ఘూ**
**ర్ణిత మహితారుణాబ్జదళ నేత్రుఁడు దా నటు పంచె దైత్యుపై**
**దితిసుత కాననప్రవర దీపితశుక్రము రక్షితాంచితా**
**శ్రితజన చక్రమున్ సతతసేవితశక్రము దివ్యచక్రమున్.** 438

* అప్పుడు తెల్లదామరరేకుల వంటి శ్రీకృష్ణుని నేత్రాలు రోషంతో ఎఱ్ఱదామరరేకులుగా మారిపోయాయి. రాక్షసులనే అరణ్యాలను అగ్నివలె కాల్చివేసేది, ఆశ్రితజన రక్షణ గావించేదీ, దేవేంద్రాది దేవతలచే సేవింప బడేదీ అయిన సుదర్శన చక్రాన్ని శ్రీకృష్ణుండు బాణాసురునిపై ప్రయోగించాడు.

**వ. అదియునుం బ్రచండమార్తాండమండల ప్రభావిడంబితంబును, భీషణ శతసహస్రకోటి దంభోళి నిష్ఠుర నిబిడ నిశిత ధారాసహస్ర ప్రభూత జ్వలన జ్వాలికాపాస్త సమస్తకుటిల పరిపంథి దుర్వార బాహాఖర్వ గర్వాంధకారంబును, సకల దిక్పాల దేవతాగణ జేగీయమానంబును, సమదదానవజన శోకకారణ భయంకర దర్శనంబును, సముచిత సజ్జనలోక ప్రియంకర స్పర్శనంబును నగు సుదర్శనం బసురాంతక ప్రేరితంబై చని, యారామకారుండు కదళికా కాండంబుల నేర్చు చందంబునం బేర్చి**

సమద వేదండశుండా దండంబుల విడంబించుచుఁ గనకమణివలయ కేయూరకంకణాలంకృతంబు నగు తదీయ బాహాసహస్రంబుఁ గరచతుష్టయావశిష్టంబుగాఁ దునుము నవసరంబున. 439

* ప్రచండ సూర్యమండలంలా శోభిస్తూ, పదివేలకోట్ల వజ్రాయుధాల జ్వలన జ్వాలలతో శత్రువుల గర్వాంధకారాన్ని నివారిస్తూ, సమస్త దేవతల స్తుతుల నందుకుంటూ, తన దర్శనంతో దానవులకు శోకం కలిగించేదీ, తన సంస్పర్శనంతో సజ్జనులకు ఆనందం కలిగించేదీ అయిన సుదర్శన చక్రం దానవాంతకునిచే ప్రయోగింపబడి రత్నఖచితాలైన ఆభరణాలతో శోభిస్తూ మదగజం తుండాల లాగా వెలుగొందుతున్న బాణాసురుని వేయిచేతులలో నాల్గింటిని మాత్రం వదలి తక్కిన వానిని తోటమాలి అరటిస్తంభాలను నరకివేసినట్లు ధ్వంసం చేసింది.

## -: శివుండు బాణుని రక్షింప శ్రీకృష్ణుని స్తుతించుట :-

తే. కాలకంఠుఁడు బాణుపైఁ గరుణ గలఁడు, గాన నఖిలాండపతిఁ గృష్ణుఁ గదియ వచ్చి
పురుషసూక్తంబు సదివి సంపుటకరాబ్జుఁ, డగుచుఁ బద్మాయతాక్షు నిట్లని స్తుతించె. 440

* పరమేశ్వరునికి బాణాసురుండటే ఎంతో దయ. అందువల్ల ఆయన అతనిని రక్షించడానికి లోకనాయకుడైన శ్రీకృష్ణుని చెంతకు వచ్చి నమస్కరించి పురుషసూక్తం పఠించి పద్మనేత్రుని ఇలా స్తుతించాడు.

వ. 'దేవా! నీవు బ్రహ్మరూపంబగు జ్యోతిర్మయుండవు, నిఖిల వేద వేదాంత నిగూఢుండవు, నిర్మలుండవు, సమానాధిక రహితుండవు, సర్వవ్యాపకుండవైన నిన్ను నిర్మలాంతఃకరణులైనవార లాకాశంబు పగిది నవలోకింతు, రదియునుం గాక పంచోపనిషన్మయం బయిన భవదీయ దివ్యమంగళ మహావిగ్రహ పరిగ్రహంబు సేయు నెడ నాభియం దాకాశంబును, ముఖంబునం గృశానుండును, శిరంబున స్వర్గంబును, శ్రోత్రంబుల దిశలును, నేత్రంబుల సూర్యుండును, మనంబునఁ జంద్రుండును, బాదంబుల వసుంధరయు, నాత్మయం దహంకారంబును, జఠరంబున జలధులును, రేతంబున నంబువులును, భుజంబుల నింద్రుండును, రోమంబుల మహీరుహౌషధీవ్రాతంబును, శిరోజంబుల బ్రహ్మలును, జ్ఞానంబున సృష్టియు నవాంతర ప్రజాపతులును, హృదయంబున ధర్మంబును గలిగి మహాపురుషుండవై లోకకల్పనంబు కొఱకు నీ యకుంఠిత తేజంబు గుప్తంబు సేసి జగదుద్భవంబు కొఱకుఁ గైకొన్న భవదీయ దివ్యావతారవైభవం బెఱింగి నుతింప నెంతవారము; నీవు సకల చేతనాచేతన నిచయంబులకు నాద్యుండవు, అద్వితీయుండవు, పురాణపురుషుండవు, సకలసృష్టి హేతుభూతుండవు, ఈశ్వరుండవు, దినకరుండు కాదంబినీ కదంబావృతుం డగుచు భిన్నరూపుండై బహువిధచ్ఛాయలం దోఁచు విధంబున నీ యఘటితఘటనా నిర్వాహకంబైన సంకల్పంబునఁ ద్రిగుణాతీతుండ వయ్యును సత్త్వాదిగుణ వ్యవధానంబుల ననేక రూపుండవై గుణవంతులైన సత్పురుషులకుఁ దమోనివారకంబైన దీపంబు రూపంబునం బ్రకాశించుచుందువు, భవదీయమాయా విమోహితు లయిన జీవులు పుత్త్ర దార గృహ క్షేత్రాది సంసారరూపకంబైన పాప పారావారమహావర్త గర్తంబుల మునుంగుచుం దేలుచుందురు, దేవా! భవదీయ దివ్యరూపానుభవంబు

**సేయంజాలక యింద్రియపరతంత్రుండై భవత్పాద సరసీరుహంబులఁ జేర నెఱుంగని మూఢాత్ముం డాత్మవంచకుం డనంబడు, విపరీతబుద్ధిం జేసి ప్రియుండవైన నిన్ను నొల్లక యింద్రియార్థానుభవంబు సేయుట యమృతంబు మాని హాలాహలంబు సేవించుట గాదె? జగదుదయపాలన లయ లీలాహేతుండవై శాంతుండవయి సుహృజ్జన భాగధేయుండవై సమానాధిక వస్తుశూన్యుండవైన నిన్ను నేనును బ్రహ్మయుం బరిణతాంతఃకరణులైన మునిగణంబులును భజియించుచుందుము, మఱియును.** **441**

* దేవా! నీవు బ్రహ్మస్వరూపుడవు. జ్యోతిర్మయుడవు. సమస్త వేదవేదాన్త నిగూఢుడవు. నిర్మలుడవు. నీతోసమానుడు అధికుడు మరొకడు లేడు. సర్వవ్యాపకుడవైన నిన్ను నిర్మల స్వభావులు ఆకాశం లాగా దర్శిస్తారు. నీవు పంచోపనిషన్మయం బయిన నీ దివ్యమంగళ విగ్రహాన్ని పరిగ్రహించునప్పుడు నాభియందు ఆకాశాన్నీ, ముఖంలో అగ్నినీ, శిరస్సున స్వర్గాన్నీ, చెవులలో దిక్కులనూ, నేత్రాలలో సూర్యుణ్ణీ, మనస్సులో చంద్రుణ్ణీ, పాదాలలో భూమినీ, ఆత్మలో అహంకారాన్నీ, కడుపులో సముద్రాలనూ, రేతస్సులో నీటినీ, భుజాలలో దేవేంద్రుణ్ణీ, వెంద్రుకలలో వృక్షౌషధీవిశేషాలనూ, శిరోజాలలో బ్రహ్మలనూ, జ్ఞానంలో సృష్టినీ ప్రజాపతులనూ, హృదయంలో ధర్మాన్నీ వహించిన మహాపురుషుడవు. అయితే లోకంకోసం నీ తేజాన్ని దాచి జగత్కల్యాణం నిమిత్తం అవతారం దాల్చావు. అటువంటి నీ దివ్యావతార వైభవాన్ని స్తుతించడం ఎవరికి సాధ్యమౌవుతుంది? నీవు సమస్తసృష్టికి మూలకారకుడవు, అద్వితీయుడవు, పురాణపురుషుడవు. సూర్యుడు మేఘమాలచే కప్పబడి భిన్నరూపాలతో కన్పించే విధంగా అఘటితఘటనా సమర్థమైన సంకల్పంతో త్రిగుణాతీతుడవై గూడా అనేకరూపాలతో గోచరిస్తుంటావు. సత్పురుషులకు అంధకారం తొలగించే దీపంలా ప్రకాశిస్తుంటావు. నీ మాయకు లోనైన జీవులు సంసారమనే సముద్రపు సుడిగుండంలో మునిగి తేలుతుంటారు. నీ దివ్యరూపాన్ని దర్శించకుండా, నీ పాదకమలపూజ చేయకుండా ఇంద్రియలోలుడైన మూఢుడు ఆత్మవంచకు డనబడతాడు. నిన్ను ధ్యానించకుండా విపరీతబుద్ధితో ఇంద్రియలోలుడు కావటం అమృతాన్ని వదలి హాలాహలం సేవించడం. సృష్టి స్థితి లయకారకుడవై, శాంతుడవై, సజ్జనభాగధేయుడవై అనుపమానుడవైన నిన్ను బ్రహ్మాది దేవతలూ, మహా మునీంద్రులూ, నేనూ భజిస్తుంటాము.

**తే. అవ్యయుండ, వనంతుండ, వచ్యుతుండ, వాదిమధ్యాంత శూన్యుండ, వఖిలధృతివి**
**నిఖిలమం దెల్ల వర్తింతు నీవు దగిలి, నిఖిలమెల్లను నీయంద నెగడుఁ గృష్ణ!** **442**

* వాసుదేవా! నీవు అవ్యయుడవు. అనంతుడవు. అచ్యుతుడవు. ఆదిమధ్యాంత శూన్యుడవు. విశ్వంభరుడవు. నీవు సమస్త జగత్తులో సంచరిస్తుంటావు. సమస్త జగత్తు నీలో లీనమై ఉంటుంది.

**సీ. అని సన్నుతించిన హరి యాత్మ మోదించి మొగమునఁ జిఱునవ్వు మొలకలెత్త**
**లలిత బాలేందు కళామౌళి కిట్లను శంకర! నీ మాట సత్య మరయ**
**నేది నీకిష్టమై యొసఁగెడు దానిన వేఁడుము, నీ కిత్తు వీఁ డవధ్యుఁ,**
**డిది యెట్టి దనినఁ బ్రహ్లాదుండు మద్భక్తుఁ, డతనికి వరము నీ యన్వయమున**

తే. జనన మందిన వారలఁ జంప' ననుచుఁ, గడఁక మన్నించితిని యది కారణమున
విశ్వవిశ్వంభరాభార విపులభూరి, బలభుజాగర్వ మడఁపంగ వలయుఁ గాన. 443

* అని స్తుతించగా శ్రీ కృష్ణుడు సంతోషించి చిరునవ్వు నవ్వుతూ చంద్రశేఖరునితో ఇలా సంభాషించాడు. శంకరా! నీ ఇష్టమైన కోరిక కోరుకో. తీరుస్తాను. ఈ బాణాసురుడు చంపదగినవాడు కాదు. ఎందుకంటే నా భక్తుడైన ప్రహ్లాదుని వంశంవాడు. "నీ వంశస్థులను సంహరించ"నని ప్రహ్లాదునికి నేను వరం ఇచ్చాను. అందువలన ఇతడు అవధ్యుడు. అందువలన ఇతనిని క్షమించాను. కాని సమస్త భూభారాన్ని మోస్తున్నానని అహంకరించే వీని భుజబలగర్వాన్ని అణచివేయక తప్పదు.

క. కరములు నాలుగు సిక్కం, బరిమార్చితి, వీఁడు నీదు భక్తుల కగ్రే
సరుఁడై పొగడొంది జరా, మరణాది భయంబు దక్కి మను నిట మీఁదన్. 444

* అందుకనే నాలుగుచేతులు తప్ప తక్కిన హస్తాలను ఛేదించాను. ఈ బాణాసురుడు నీ భక్తులలో అగ్రేసరుడుగా స్తుతింపబడుతూ జరామరణాది భయాలు లేకుండా జీవిస్తాడు.

వ. అని యాన తిచ్చిన నంబికావరుండు సంతుష్టాంతరంగుం డయ్యె, న బ్బలినందనుం డట్లు రణరంగవేదిం గృష్ణదేవతా సన్నిధిం బ్రజ్వలిత చక్రకృశాను శిఖాజాలంబులందు నిజబాహాసహస్ర శాఖా సమిత్ప్ర చయంబును, దత్క్షతోద్వేలకీలాల మహితాజ్యధారాశతంబును, బరభయంకర వీరహుంకార మంత్రం బులతోడ వేల్చి పరిశుద్ధిం బొంది విజ్ఞానదీపాంకురంబున భుజాఖర్వ గర్వాంధకారంబు నివారించి నవాఁడై యనవరత పూజిత స్థాణుండగు న బ్బాణుండు భుజవన విచ్ఛేదజనిత విరూపితస్థాణుండయ్యును దదీయవరదాన కలితానంద హృదయారవిందుం డగుచు గోవింద చరణారవిందంబులకుఁ బ్రణామంబు లాచరించి యనంతరంబ. 445

* ఈ విధంగా శ్రీకృష్ణుడు అనుగ్రహించగా పరమేశ్వరుడు పరమానందం పొందాడు. బాణాసురుడు రణరంగమనే యజ్ఞవేదికపై కృష్ణుడనే దేవుని సన్నిధిలో భగభగమండుతున్న చక్రాయుధ జ్వాలలతో తన హస్తాలనే సమిధలను, రక్తధారలనే ఆజ్యధారలతో, హుంకారాలనే మంత్రాలతో వేల్చి పరిశుద్ధుడయ్యాడు. విజ్ఞానదీపం ఆవిర్భవించడం వలన భుజగర్వమనే అంధకారం తొలగిపోయింది. నిరంతర పరమేశ్వరధ్యానాను రక్తుడైన బాణుడు శ్రీకృష్ణు డిచ్చిన వరదానంతో ఆనందకందళిత హృదయారవిందుడై గోవిందుని పాదారవిందాలకు అభివందనం చేశాడు.

### -: ఉషానిరుద్ధ సహితుండై కృష్ణుండు ద్వారకాపురి కరుగుట :-

క. పురమున కేగి యుషా సుం, దరికిని ననిరుద్ధునకు ముదంబున భూషాం
బర దాసదాసికాజన, వరవస్తువితాన మొసఁగి వారని భక్తిన్. 446

క. కనకరథంబున నిడుకొని, ఘనవైభవ మొప్పఁ గన్యకా యుక్తముగా
ననిరుద్ధుని గోవిందుం, డనుమోదింపంగఁ దెచ్చి యర్పించె నృపా! 447

* అనంతరం బాణుడు తన నగరానికి వెళ్లి ఉషానిరుద్ధులకు సంతోషంతో వస్త్రాభరణాదుల నిచ్చి, దాసీజనులను తోడిచ్చి బంగారు రథంపై ఎక్కించి మిక్కిలి వైభవంతో తీసికొని వచ్చి కన్యతో పాటుగా అనిరుద్ధుని గోవిందునకు అప్పగించాడు. శ్రీకృష్ణుడు సంతోషించాడు.

ఉ. అంత మురాంతకుండు త్రిపురాంతకు వీడ్కొని బాణు నిల్పి య
త్యంత విభూతిమై నిజబలావలితోఁ జనుదేర నా యుషా
కాంతుఁడు మున్నుగాఁ బటహ కాహళ తూర్యనినాద పూరితా
శాంతరుఁడై వెసం జనియె నాత్మపురీముఖుఁడై ముదంబునన్. 448

* తర్వాత మురాంతకుడు త్రిపురాంతకుని చెంత సెలవుతీసుకొని బాణాసురుని అచటనే నిలిపి అత్యంతవైభవోపేతంగా పరివారసమేతు డై అనిరుద్ధుని ముందిడుకొని పటహ కాహళ తూర్యాదుల ధ్వనులు దిక్కులు పిక్కటిల్ల జేస్తుండగా ద్వారకానగరానికి బయలుదేరాడు.

మ. కనియెన్ గోపకుమారశేఖరుఁడు రంగత్ఫుల్లరాజీవ కో
కనదోత్తుంగ తరంగసంగత లసత్కాసారకన్ భూరి శో
భన నిత్యోన్నత సౌఖ్యభారక నుదంచద్వైభవోదారకన్
జనసంతాప నివారకన్ సుజనభాన్వత్తారకన్ ద్వారకన్. 449

* శ్రీకృష్ణుడు వికసించిన కమలోత్పలాలతో, ఉత్తుంగతరంగాలతో శోభిస్తున్న సరోవరాలతో నిండినదీ, అనునిత్యమూ సుఖ వైభవాలకూ భోగభాగ్యాలకూ దాపురమైనదీ, సుజనులకు కాపురమైనదీ అయిన ద్వారకా పురాన్ని దర్శించాడు.

వ. కని డాయం జనఁ బురలక్ష్మి కృష్ణసందర్శన కుతూహలయై చేసన్నలం జీరు చందంబున నందంబు నొందు నుద్ధూతతరళ విచిత్ర కేతుపతాకాభిశోభితంబును, మహనీయ మరకత తోరణ మండితంబును, గనకమణి వినిర్మిత గోపురసౌధప్రాసాద వీథికావిలసితంబును, మౌక్తిక వితాన విరచిత మంగళ రంగవల్లీ విరాజితంబును, శోభనాకలిత విన్యస్త కదళికాస్తంభ సురభి కుసుమమాలి కాక్షతాలంకృతంబును, గుంకుమ సలిల సిక్త విపణిమార్గంబును, శంఖ దుందుభి భేరీ మృదంగ పటహకాహళ మృదంగాది మంగళారావకలితంబును, వందిమాగధ సంగీత ప్రసంగంబునునై యతిమనోహర విభవాభిరామంబైన య ప్పురవరంబు సచివ పురోహిత సుహృద్బాంధవ ముఖ్యులెదురుకొన భూసురాశీర్వాదంబులను బుణ్యాంగనా కరకలిత లలితాక్షతలను గైకొనుచుం గామినీమణులు గర్పూరనీరాజనంబులు నివాళింప నిజమందిరంబుం బ్రవేశించి య ప్పుండరీకాక్షుండు పరమానందంబున సుఖం బుండె, నంత. 450

* ద్వారకానగరంలోని కేతనాలు శ్రీకృష్ణుని రమ్మని నగరలక్ష్మి చేసన్న చేస్తున్నట్లున్నాయి. మరకతాల తోరణాలతో, మణులు పొదిగిన బంగారు భవనాలతో ఆ నగరం విలసిల్లుతున్నది. ఆ పట్టణంలో ముత్యాల

రంగవల్లులు తీర్చబడ్డాయి. అరటి స్తంభాలకు సువాసనతో నిండిన పుష్పమాలలు అలంకరించారు. ఆ పట్టణ విపణిమార్గం కుంకుమనీటితో తడిసిపోయింది. శంఖ దుందుభి భేరీ మృదంగాది మంగళ వాద్యాలు మ్రోగుతున్నాయి. వంది మాగధుల సంగీతప్రసంగాలు అతిశయించాయి. ఇంతటి వైభవంతో విలసిల్లుతున్న ద్వారకాపట్టణం లోనికి శ్రీకృష్ణుడు ప్రవేశించాడు. పురోహిత బంధుమిత్రులు స్వాగతం పలికారు. బ్రాహ్మణులు ఆశీర్వదించారు. పుణ్యస్త్రీలు అక్షతలు చల్లారు. కామినీ మణులు కర్పూరహారతు లిచ్చారు. గోవిందుడు తన మందిరంలో ప్రవేశించి ఆనందడోలికలలో తేలియాడాడు.

**క. శ్రీకృష్ణుని విజయం బగు, నీ కథఁ బఠియించువార లెప్పుడు జయముం**
**గై కొని యిహపరసౌఖ్యము, లాకల్పోన్నతి వహింతు రవనీనాథా! 451**

* ఓ పరీక్షిన్మహారాజా! ఈ శ్రీకృష్ణ విజయగాథను పఠించిన వారికి ఎల్లప్పుడూ విజయాలు చేకూరుతాయి. ఇహపర సౌఖ్యాలు శాశ్వతంగా లభిస్తాయి.

**క. అని చెప్పిన శుకయోగికి, జననాయకుఁ డనియెఁ 'గృష్ణచరితము విన నా**
**మన మెపుడుఁ దనియ దింకను, విన వలతుం గరుణఁ జెప్పవే మునినాథా!' 452**

* అని పరీక్షిత్తుతో శుకయోగీంద్రుడు చెప్పగా పరీక్షిత్తు ఆ మునీంద్రునితో కృష్ణుని చరిత్ర వినడానికి మనస్సు ఇంకా ఉవ్విళ్లూరు తున్నది. సంతృప్తి కలుగుట లేదు. కరుణతో ఆ కథలను ఇంకా చెప్పమని ప్రార్థించాడు.

**వ. అనినఁ బరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియె. 453**

* ఈ విధంగా తనను కోరిన పరీక్షిన్నరేంద్రునితో శుకమునీంద్రుడు ఇలా చెప్పసాగాడు.

## -: నృగమహారాజు చరిత్రము:-

**సీ. ధరణీశ! యొకనాఁడు హరితనూజులు రతీశ్వర సాంబ సారణ చారుభాను**
**లాదిగా యదుకుమారావలి యుద్యాన వనమున కతివైభవమున నేగి**
**వల నొప్ప నిచ్ఛానువర్తులై సుఖలీలఁ జరియించి ఘనపిపాసలను జెంది**
**నెఱి దప్పి సలిల మన్వేషించుచును వేగ వచ్చుచో నొకచోట వారిరహిత**

**తే. కూపమును నందులో నొక కొండవోలె, విపుల మగుమేని యూసరవెల్లిఁ గాంచి**
**చిత్తముల విస్మయం బంది తత్క్షణమున, దాని వెడలించు వేడుక దగులుటయును. 454**

* ఓ పరీక్షిన్మహారాజా! ఒకనాడు శ్రీకృష్ణుని పుత్రులైన ప్రద్యుమ్నుడు, సాంబుడు, సారణుడు, చారుభానుడు మొదలైన యాదవకుమారులు మిక్కిలి వైభవంగా ఉద్యానవనానికి వెళ్లారు. స్వేచ్ఛగా ఆ ఉద్యానవనంలో విహరించి అలసిపోయారు. దప్పిక తీర్చుకోడానికి నీటికోసం వెదికారు. ఒకచోట వారికి ఒక నీరులేని పాడుబడ్డ బావి కన్పించింది. అందులో పెద్దకొండను బోలిన ఊసరవెల్లి ఉన్నది. దానిని చూచి వారందరూ ఎంతో ఆశ్చర్యపోయారు. ఆ ఊసరవెల్లిని బావిలో నుంచి బయటకు తీయాలనుకున్నారు.

చ. పరువిడి పోయి తెచ్చి ఘనపాశచయంబుల నంటఁగట్టి య
గ్గురుభుజు లందఱుం గదిసి కోయని యార్చుచు దాని నెమ్మెయిం
దరలఁగఁ దీయలేక దగ దట్టముగా మది దుట్టగిల్ల నొం
డొరు గడవంగ వే చని పయోరుహనాభున కంతఁ జెప్పినన్. 455

* వారంతా పరుగు పరుగున వెళ్లి పెద్దతాళ్లు తెచ్చారు. ఆ శౌర్యవంతు లందరూ ఆ ఊసరవెల్లిని బయటకు తీయడానికి ప్రయత్నించారు. కాని లాభం లేకపోయింది. వారు వేగంగా వెళ్లి శ్రీకృష్ణునితో ఈ విషయం విన్నవించారు.

ఉ. విని నరసీరుహాక్షుఁ డతివిస్మితుఁడై జలశూన్యకూప మ
ల్లన కదియంగ నేఁగి కృకలాసము నొక్కతృణంబుఁ బోలె గొ
బ్బున వెడలించె వామకర పద్మమున న్నది యంతలోనఁ గాం
చనరుచి మేనఁ గల్గు పురుషత్వముతోఁ బొడసూపి నిల్చినన్. 456

* పద్మాక్షుడు ఈ విషయం విని ఆశ్చర్యపడి ఆ నీరులేని బావిచెంతకు వచ్చాడు. తన ఎడమచేతితో ఆ తొండను ఒక గడ్డిపరకను తీసినట్లు అవలీలగా బయటకు తీశాడు. అంతలో ఆ ఊసరవెల్లి బంగారు రంగుతో శోభిల్లుతూ పురుషరూపాన్ని పొందింది.

వ. చూచి కృష్ణుం డతని వృత్తాంతం బంతయు నెఱింగియు నక్కడి జనంబులుం గుమారవర్గంబును దెలియుకొఱకు నతని చేతఁ దద్వృత్తాంతం బంతయు నెఱింగించువాఁడై యిట్లనియె. 457

* అతనిని చూచి శ్రీకృష్ణుడు ఆతని వృత్తాంతం తనకు తెలిసినా గూడా తన కుమారులకూ, తక్కిన జనసమూహానికి తెలియడం కోసం అతని చేతనే అతని కథను చెప్పించాలని భావించి ఇలా అన్నాడు.

చ. కనదురు రత్నభూషణ నికాయుఁడవై మహనీయ మూర్తివై
యనుపమకీర్తి శోభితుఁడవై విలసిల్లుచు ధాత్రిమీఁదఁ బెం
పొనరిన నీకు నేమి గతి నూసరవెల్లితనంబు చొప్పడెన్
విన నిది చోద్యమయ్యె సువివేకచరిత్ర! యెఱుంగఁ జెప్పుమా!' 458

* ఓ విచిత్ర చరిత్రుడా! రత్నభూషణాలను ధరించి, అసమానమైన కీర్తిని గడించి మహనీయమూర్తివై భూలోకంలో విలసిల్లిన నీకు ఈ ఊసరవెల్లి రూపం ఎలా కలిగింది? ఇది చాలా విచిత్రంగా ఉంది. మాకు నీ వృత్తాంతం వివరంగా చెప్పు.

క. అని యడిగిన మురరిపు పద, వనజంబులఁ దన కిరీటవరమణు లొరయన్
వినయమున మ్రొక్కి యిట్లను, ఘనమోదముతోడ నిటల ఘటితాంజలియై. 459

* అని శ్రీకృష్ణుడు అడుగగా ఆ పురుషుడు మురారి చరణసరోజాలకు తన కిరీటమణులు సోకునట్లుగా నమస్కరించి తన నుదుట చేతులు మోడ్చి ఆనందంతో ఇలా విన్నవించాడు.

తే. విశ్వసంవేద్య! మహిత! యీ విశ్వమందుఁ, బ్రకటముగ నీ వెఱుంగని దొకటి గలదె
యైన నాచేత విన నిష్ట మయ్యెనేని, నవధరింపుము వినిపింతు నంబుజాక్ష! 460

* ఓ విశ్వవేద్యా! నీవు సర్వజ్ఞుడవు. ఈ ప్రపంచంలో నీకు తెలియని విషయం లేదు. అయినా నా చేత చెప్పించుకోవాలని భావించావు గనుక వినిపిస్తాను.

శా. ఏ నిక్ష్వాకుతనూజుఁడన్ నృగుఁడు నా నేపారు భూపాలుఁడన్
దీనవ్రాతము నర్థిఁ బ్రోచుచు ధరిత్రీనాయకుల్ గొల్చి స
న్మానింపం జతురంత భూభరణసామర్థ్యుండనై సంతత
శ్రీ నిండారిన వాఁడ నుల్లసిత కీర్తిస్ఫూర్తి శోభిల్లఁగన్. 461

* నేను ఇక్ష్వాకుని పుత్రుడను. నాపేరు నృగుడు. నేను అనేకులైన భూపాలురు నన్ను సేవిస్తూండగా రాజ్యపాలన సాగించాను. దీనజనులను పోషించాను. పెంపొందిన కీర్తి సంపదలతో శోభించాను.

చ. పలుకులఁ దన్నుఁ దాఁ బొగడఁ బాతకమందు ర టుండెఁ దారకా
వలి సికతావ్రజంబు హిమవారికణంబులు లెక్క పెట్టఁగా
నలవడుఁ గాని యేను వసుధామర కోటికి దాన మిచ్చు గో
వుల గణుతింప ధాతయును నోపఁడు మాధవ! యేమి సెప్పుదున్? 462

* తన్ను తాను పొగడుకోవడం పాతకమని పెద్దలంటారు. తారలను, ఇసుకరేణువులను, మంచుబిందువులను లెక్కించవచ్చు. కాని నేను బ్రాహ్మణశ్రేష్ఠుల కిచ్చిన గోవులను లెక్కించడానికి బ్రహ్మకు గూడా శక్తిచాలదు. మాధవా! ఏమి చెప్పేది!

వ. అదియునుం గాక 463

చ. పొలుచు సువర్ణశృంగఖురముల్ దనరం దొలిచూలులై సువ
త్సలు గల పాఁడియావుల నుదాత్త తపోవ్రత వేదపాఠముల్
గలిగి కుటుంబులై విహితకర్మములం జరియించు వేద వి
ప్రులకు సదక్షిణంబుగ విభూతి దలిర్పఁగ నిత్తు నచ్యుతా! 464

* అదీ గాక అచ్యుతా! తపోనిధులై వేదపండితులై విహితకర్మల నాచరించే బ్రాహ్మణులకు బంగారుకొమ్ములు గిట్టలు కలిగి తొలుచూలు దూడలు గల పాడియావులను దక్షిణతోపాటు ఘనంగా దానం చేశాను.

వ. మఱియును న్యాయసముపార్జిత విత్తమ్ములగు గో భూ హిరణ్య రత్న నివాస రథ హస్తి వాజి కన్యా సరస్వతీ వస్త్ర తిల కాంచన రజత శయ్యాది బహువిధ దానంబు లనూనంబులుగా ననేకంబులు సేసితిఁ, బంచమహాయజ్ఞంబు లొనరించితి, వాపీ కూప తటాక వన నిర్మాణంబులు సేయించితి, ని వ్విధంబునం జేయుచో నొక్కనాఁడు. 465

* అంతేకాదు. న్యాయసముపార్జితమైన ధనంతో నేను గోదానం, భూదానం, బంగారుదానం, రత్నదానం, గృహదానం, రథదానం, గజదానం, అశ్వదానం, సరస్వతీదానం, వస్త్రదానం, తిలదానం, కన్యాదానం మొదలైన దానాలను ఎన్నిటినో చేశాను. పంచ మహాయజ్ఞాలు నెరవేర్చాను. బావులను దిగుడు బావులను, చెఱువులను, వనాలను నిర్మింప జేశాను. ఈ విధంగా దానధర్మాలు చేస్తుండగా ఒక రోజున ఒక విశేషం జరిగింది.

**క. అనఘా! మునుపడఁ గశ్యపుఁ, డను విప్రున కే నకల్మషాత్ముఁడనై యి**
**చ్చిన గోవు దప్పి నా మం, దను గలసినఁ దెలియలేక తగ నా గోవున్. 466**

**క. ఒండొక భూమీసురకుల, మండనునకు దాన మీయ మసలక యా వి**
**ప్రుం డా గోవుం గొని చను, చుండన్ మును ధారగొన్న యుర్వీసురుఁడున్. 467**

* ఓ పుణ్యాత్ముఁడా! అంతకుముందు నేను కశ్యపుడనే విప్రునికి పవిత్రహృదయంతో దానమిచ్చిన గోవు తప్పిపోయి తిరిగి వచ్చి ఆలమందలో కలిసిపోయింది. నాకు అది తెలియక ఆ గోవును ఇంకొక బ్రాహ్మణోత్తమునికి దాన మిచ్చాను. ఆ బ్రాహ్మణుడు ఆ ఆవును తోలుకొని వెళుతున్నాడు. ఇంతకుముందు నాచే దానం పొందిన కశ్యపుడు ఆ గోవును చూచాడు.

**క. మది రోష మొదవ దోవతి, వదలిన బిగియించుకొనుచు వడిఁ గది 'సిది నా**
**మొదవు, నడివీథి దొంగిలి, వదలక కొనిపోయె, దిట్టివారుం గలరే?' 468**

* అలా చూచిన కశ్యపుడు అతిశయించిన రోషంతో ఊడిపోతున్న దోవతి బిగించి వేగంగా ఆవును తోలుకొని వెళ్లే బ్రాహ్మణుని దగ్గరకు వెళ్లి 'ఇది నా ఆవు. దీనిని దొంగిలించి నడివీథిలో తోలుకొని పోతున్నావు. ఇటువంటివారు ఎక్కడైనా ఉంటారా?' అన్నాడు.

**చ. అనవుడు నాతఁ డిట్లనియె నాతనితో 'నిపు డేను దీని నీ**
**జనపతిచేత ధారగొని సాధుగతిం జన నీది యంట యె?'**
**ట్లనిన నతండు 'నేనును ధరాధిపుచే మును ధారగొన్న యా'**
**వని వినిపింప నిద్దఱకు నయ్యె నపార వివాద మచ్చటన్. 469**

* ఆ మాటలు విని గోవును తోలుకొని వెళుతున్న బ్రాహ్మణుడు కశ్యపునితో 'ఈ ఆవును నేను రాజుగారి దగ్గర దానంగా స్వీకరించాను. ఈ గోవు నీది అంటున్నావు. ఇదేమిటి?' అన్నాడు. అప్పుడు కశ్యపుడు 'నేను గూడా ఈ ఆవును రాజుగారి దగ్గరే దానంగా గ్రహించా' నని అన్నాడు. ఈ విధంగా ఇద్దరు బ్రాహ్మణులకూ అక్కడ పెద్ద వివాదం జరిగింది.

**వ. ఇట్లు విప్రు లిద్దఱుం దమలో నంతకంతకు మచ్చరంబు పెచ్చు పెరిఁగి కలహించి నా యున్న యెడకుం జనుదెంచిరి, మున్ను నాచేత గోదానంబు గొన్న బ్రాహ్మణుం డిట్లనియె. 470**

* ఆ బ్రాహ్మణు లిద్దరూ అంతకంతకూ అసూయతో బాగా కలహించుకొని నా దగ్గరకు వచ్చారు. అప్పుడు కశ్యపుడనే భూసురుడు నాతో ఇలా అన్నాడు.

**సీ. 'మనుజేంద్ర! ప్రజ లధర్మ ప్రవర్తనముల నడవకుండఁగ నాజ్ఞ నడపు నీవు**
**మనమున నే ధర్మ మని యాచరించితి? మును నాకు నిచ్చిన మొదవు దప్పి**
**వచ్చి నీ మందలోఁ జొచ్చిన నిప్పు డీ భూసురునకు ధార వోసి యిచ్చి**
**తగవు మాలితివి, దాతవు నపహర్తవు నైన నిన్నేమందు? నవనినాథ!**

**తే. యనిన మాటలు సెవులు సోఁకినఁ గలంగి, భూసురోత్తమ! యజ్ఞానపూర్వకముగ**
**నిట్టి పాపంబు దొరసె నే నెఱిఁగి సేయఁ, గొనుము నీ కిత్తు నొక లక్ష గోధనంబు.' 471**

* 'ఓ రాజేంద్రా! నీవు ప్రజలను అధర్మమార్గంలో నడవకుండా ఆజ్ఞాపించవలసిన వాడవు. నీవు ఏ విధంగా అధర్మమైన ఈ పనిచేశావు? ఇంతకుముందు నాకు దానమిచ్చిన ఈ గోవు తప్పిపోయి నీ మందలో కలిసిపోయింది. దీనిని ఇప్పుడు ఈ బ్రాహ్మణునికి దానం ఇచ్చావు. ధర్మం తప్పావు. దానకర్తవు, అపహర్తవు రెండూ నీవే అయ్యావు. నిన్నేమనగలము?' అన్నాడు. ఈ మాటలకు నేను బాధపడి ఓ బ్రాహ్మణోత్తమా! అజ్ఞానంవలన ఈ పొరపాటు జరిగింది. ఇది నేను తెలిసి చేసిన తప్పు కాదు. ఇందుకు బదులుగా నీకు లక్షగోవులను సమర్పిస్తాను. స్వీకరించు' అన్నాను.

**క. అని మఱియును న వ్విప్రుని, సునయోక్తుల ననునయింపుచును నిట్లంటిన్**
**ననుఁ గావు, నరకకూపం, బునఁ బడఁగా జాలఁ విప్రపుంగవ!' యనుచున్. 472**

* ఇంకా ఆ బ్రాహ్మణుని అనేక రీతులుగా బతిమాలి ప్రాధేయపడి 'మహాత్మా! నన్ను నరకకూపంనుండి రక్షించండి' అని ప్రార్థించాను.

**తే. ఎంత వేఁడిన మచ్చరం బంత పెరిఁగి, 'మొదల నా కిచ్చినట్టి యీ మొదవె కాని**
**యెనయ నీ రాజ్యమంతయు నిచ్చితేని, నొల్ల' నని విప్రుఁ డచ్చట నుండ కరిగె. 473**

* నేను ఎంత వేడుకుంటే అతనిలో మచ్చరం అంత పెచ్చు పెరిగింది. 'మొదట నీవు నా కిచ్చిన గోవును తప్ప నీవు నీ రాజ్యమంతా ఇచ్చినా నేను అంగీకరించను' అని చెప్పి అక్కడనుంచి విసవిస వెళ్లి పోయాడు.

**వ. అ ట్లతం డరిగిన నా రెండవ బ్రాహ్మణునిం బ్రార్థించిన నతండును జలంబు డింపక పదివే లేఱి కోరిన పాఁడి మొదవుల నిచ్చిన నైనను 'దీనిన కాని యొల్ల' నని నిలువక చనియె, నంతఁ గాలపరిపక్వంబైన నన్ను దండధర కింకరులు గొనిపోయి వైవస్వతు ముందటం బెట్టిన నతండు నన్ను నుద్దేశించి యిట్లనియె. 474**

* ఆ బ్రాహ్మణుడు వెళ్లిన తర్వాత రెండవ బ్రాహ్మణుని ఆ గోవు నిమ్మని ప్రార్థించాను. అతడు గూడా పట్టుదలతో 'నీవు పదివేల గోవులను ఇచ్చినా నాకు అవసరం లేదు. నాకు ఈ గోవే కావాలి' అని

అచ్చట నిలబడకుండా వెళ్లిపోయాడు. ఆ తర్వాత కాలం పరిపూర్తి కాగా నన్ను యమభటులు తీసికొని వెళ్లి యమధర్మరాజు ముందు నిలిపారు. యమధర్మరాజు నాతో ఇలా అన్నాడు.

**మ. మనుజేంద్రోత్తమ! వంశపావన! జగన్మాన్యక్రియాచార! నీ**
**ఘనదాన క్రతుధర్మముల్ త్రిభువన ఖ్యాతంబులై చెల్లెడిన్,**
**మును దుష్కర్మఫలంబు నొంది పిదపం బుణ్యానుబంధంబులై**
**చను సౌఖ్యంబులఁ బొందు, పద్మజుని యాజ్ఞం ద్రోవఁగా వచ్చునే? 475**

* 'ఓ మహారాజా! నీ దానక్రియలు, యజ్ఞకార్యాలు ముల్లోకాలలో ప్రఖ్యాతి గాంచాయి. నీ పాపఫలాన్ని మొదట అనుభవించి అటుపిమ్మట స్వర్గసౌఖ్యాలను అనుభవించు. బ్రహ్మదేవుని ఆజ్ఞ దాటరానిది కదా!'

**వ. అని వేగంబున ద్రొబ్బించిన నేను బుడమిం బడునపుడ యీ నికృష్టంబయిన యూసరవెల్లి రూపంబుఁ గైకొంటి. నింత కాలంబు దద్దోషనిమిత్తంబున నిద్దురవస్థం బొందవలసెఁ, బ్రాణులకుఁ బుణ్యపాపంబు లనుభావ్యంబులు గాని యూరక పోనేరవు, నేఁడు సమస్త దురితనిస్తారకం బయిన భవదీయ పాదారవింద సందర్శనంబునం జేసి యీ ఘోరదుర్దశలం బాసి నిర్మలాత్మకుండ నైతి నని పునఃపునః ప్రణామంబు లాచరించి మఱియు నిట్లనియె. 476**

* ఇలా పలికి యముడు నన్ను అచ్చటినుండి త్రోసివేయించాడు. నేను భూమిపై పడేటప్పుడే ఈ ఊసరవెల్లి రూపం సంభవించింది. ఇంత కాలము ఆ దోషం పోవడానికే ఈ దురవస్థ పొందవలసి వచ్చింది. ప్రాణులు తమ తమ పుణ్యాపాప ఫలాలను రెంటినీ అనుభవించ వలసిందే. అవి ఊరకపోవు. ఈ నాడు సమస్తపాపాలను పోగొట్టగల నీ పాదపద్మాలను దర్శించి ఘోర దుర్దశనుండి బయటపడి నిర్మల హృదయుడ నయ్యాను' అని నమస్కరించి ఇంకా ఇలా ప్రార్థించాడు.

**క. 'కృష్ణ! వాసుదేవ! కేశవ! పరమాత్మ!, యప్రమేయ! వరద! హరి! ముకుంద!**
**నిన్నుఁ జూడఁ గంటి, నీ కృపం గనుగొంటి, నఖిలసౌఖ్యపదవు లందఁ గంటి'. 477**

* ఓ శ్రీకృష్ణా! వాసుదేవా! కేశవా! పరమాత్మా! అప్రమేయా! వరదా! హరీ! ముకుందా! నిన్ను చూడగలిగాను. నీ కృపను పొంద గలిగాను. సమస్త సౌఖ్యపదవులను అందుకో గలిగాను.

**వ. అని యనేకభంగులం గొనియాడి గోవిందుని పదంబులు దన కిరీటంబు సోఁకం బ్రణమిల్లి 'దేవా! భవదీయ పాదారవిందంబులు నా హృదయారవిందంబును బాయకుండునట్లుగాఁ బ్రసాదింపవే?' యని తదనుజ్ఞాతుండై యచ్చటి జనంబులు సూచి యద్భుతానందంబులం బొంద నతుల తేజోవిరాజిత దివ్యవిమానారూఢుండై దివంబున కరిగె, నంత న మ్మాధవుండు నచ్చట నున్న పార్థివోత్తములకు ధర్మబోధంబుగా నిట్లనియె. 478**

* అని అనేకవిధాలుగా స్తుతించి ఆ నృగుడు గోవిందుని చరణారవిందాలకు నమస్కరించాడు. దేవా! నీ పాదపద్మాలకు నా హృదయపద్మం స్థానమయేటట్లు అనుగ్రహింపుమని ప్రార్థించాడు. శ్రీకృష్ణుని

అనుజ్ఞ గైకొని అచ్చట చేరిన సకలజనులు ఆశ్చర్యానందాలు పొందుతుండగా నృగమహారాజు ఒక దివ్యవిమానాన్ని ఎక్కి స్వర్గానికి వెళ్లాడు. శ్రీకృష్ణుడు అచ్చట గల రాజేంద్రులకు ఇలా ధర్మబోధ గావించాడు.

సీ. నరనాథకుల కాననము దహించుటకును నవనీసురుల విత్త మగ్ని కీల,
జననాయకుల నిజైశ్వర్యాబ్ధి నింకింప బ్రాహ్మణక్షేత్రంబు బాడబంబు,
పార్థివోత్తముల సంపచ్ఛైలములఁ గూల్ప భూసురధనము దంభోళిధార,
జగతీవరుల కీర్తి చంద్రిక మాప విప్రోత్తము ధనము సూర్యోదయంబు,

తే. విప్రతతి సొమ్ముకంటెను విషము మేలు, గరళమునకును బ్రతికృతి గలదు గాని
దాని మాన్పంగ భువి నౌషధములు లేవు, గాన బ్రహ్మస్వములు గొంట గాదు పతికి. 479

* రాజకులం అనే అరణ్యాన్ని దహించే అగ్నిజ్వాల బ్రాహ్మణధనం, నరనాథుల ఐశ్వర్యం అనే సముద్రాన్ని ఇంకించే బడబానలం బ్రాహ్మణక్షేత్రం. భూమిపతుల సంపద అనే శైలాలకు భూసురుల ధనం వజ్రాయుధం. జగతీపతుల కీర్తి అనే వెన్నెలను తొలగించే సూర్యోదయం విప్రుల సంపద. బ్రాహ్మణుల ధనం కంటె విషం మేలు. విషానికి విరుగుడు ఉన్నది. కాని బ్రాహ్మణ ధనాపహరణం వల్ల ప్రాప్తించే పాపానికి ప్రాయశ్చిత్తం లేదు. అందువలన భూపతులు బ్రాహ్మణుల ధనాన్ని అపహరించడం మంచిదికాదు.

క. ఎఱుఁగమి నైనను భూసుర, వరుల ధనం బపహరింప వలవదు పతికిన్.
మఱపున ననలము ముట్టిన, దరికొని వెసఁ గాల్పకున్నె తను వెరియంగన్? 480

* అజ్ఞానం చేతనైనా సరే బ్రాహ్మణుల ధనాన్ని రాజు అపహరించ గూడదు. తెలియక అగ్నిని ముట్టుకుంటే శరీరం బొబ్బలెక్కి బాధ చెందేటట్లు ఆ అగ్ని దహించకుండా ఉంటుందా?

వ. మఱియును దన ధనంబు పరులచేతఁ గోల్పడిన విప్రుండు దుఃఖమున రోదనంబుసేయ రాలిన యశ్రుకణంబుల నవని రేణువు లెన్ని తడియు నన్ని వేలేండ్లు తదుపేక్షాపరుండైన పతి దారుణవేదనలు గల కుంభీపాక నరకంబు నొందు, మఱియు నతనితోడఁ గ్రిందటఁ బదితరంబుల వారును, ముందటఁ బదితరంబులవారును మహానరక వేదనలం బొందుదురు. స్వదత్తంబైన నర్థలోభంబునం జేసి దుశ్శీలుండై యెవ్వఁడు బ్రాహ్మణక్షేత్ర సంభూత ధాన్యధనాదికంబు భుజించు నప్పాపాత్ముం డఱువదివేల సంవత్సరంబులు మలకూపంబునం గ్రిమిరూపంబున వర్తించు, నట్లగుట యెఱింగి విప్రు డెంత తప్పు చేసిన నెన్ని గొట్టిన, నెన్ని దిట్టిన నతని కెదురు పలుకక వినయంబున వందనం బాచరించు పుణ్యాత్ములు నాదు పాలింటివా, రదియునుం గాక యేనును బ్రతిదినంబును భూసురుల నతి వినయంబునఁ బూజింతు, నిట్లు సేయక విపరీత వర్తనులైన తామసుల నేను వెదకి దండింతు, నది గావున మీరలును బ్రాహ్మణ జనంబుల వలనం బరమభక్తి గలిగి మెలంగుం డని యానతిచ్చి యాదవప్రకరంబులు సేవింప నఖిలలోక శరణ్యుండైన యప్పుండరీకాక్షుండు నిజ నివాసంబునకుం జనియె' నని చెప్పి శుకుం డిట్లనియె. 481

* పరుల వలన తన ధనాన్ని కోల్పోయిన బ్రాహ్మణుడు దుఃఖించి నపుడు స్రవించిన కన్నీటి ధారలవలన భూమిమీద ఎన్నిరేణువులు తడుస్తాయో అన్నివేల సంవత్సరాలు ఆ రాజ్యాన్ని పాలించేరాజు కుంభీపాక నరకంలో బాధల ననుభవిస్తాడు. అంతేకాదు అతనికి పది తరాల పూర్వులూ, తర్వాత పదితరాలవారూ నరకవేదనలను పొందుతారు. స్వదత్తమైనదైనా, పరదత్తమైనదైనా బ్రాహ్మణ భూములనుండి వచ్చిన ధనధాన్యాలను రాజు దుశ్శీలుడై ఆశించగూడదు. అట్లాశించిన పాపాత్ముడు అరవైవేల సంవత్సరాలు మలకూపంలో పురుగై బ్రతుకుతాడు. అందువలన ఈ విశేషాలు గ్రహించి బ్రాహ్మణుడు ఎంత తప్పు చేసినా ఎన్నికొట్టినా ఎన్ని తిట్టినా అతనికి ఎదురు చెప్పకుండా వినయంతో నమస్కరించాలి. అటువంటివారే పుణ్యాత్ములు. అటువంటివారే నా అనుగ్రహానికి పాత్రులౌతారు. అంతేకాదు. నేనుగూడా ప్రతిరోజూ బ్రాహ్మణులను మిక్కిలి వినయంతో పూజిస్తాను. ఇలా కాక విపరీతంగా ప్రవర్తించే తామసులను నేను వెదకి దండిస్తాను. అందుచేత మీరు బ్రాహ్మణులపట్ల మిక్కిలి భక్తిపరులై ప్రవర్తించండి అని శ్రీకృష్ణుడు ఆనతిచ్చాడు. ఇలా ధర్మబోధను చేసి యాదవులు సేవిస్తుండగా శ్రీకృష్ణుడు తనమందిరం చేరాడు. ఇలా చెప్పి అనంతరం శుకమహర్షి ఇలా అన్నాడు.

**క. ఈ కథఁ జదివిన వారలుఁ, గైకొని వినువారు విగత కలుషాత్మకులై**
**లౌకికసౌఖ్యము నొందుదు, రా కైవల్యంబుఁ గరతలామలక మగున్.** 482

* ఈ కథ చదివినవారికీ, విన్నవారికీ, సర్వపాపాలు తొలగిపోతాయి. ఇహలోకంలో సౌఖ్యం ప్రాప్తిస్తుంది. పరలోకంలో సులభంగా మోక్షం లభిస్తుంది.

## -: బలరాముండు సుహృద్బంధుజన దర్శనార్థమై వ్రేపల్లెకుఁ బోవుట. :-

**సీ. నరనాథ! విను మొకనాఁడు తాలాంకుండు చుట్టాల బంధులఁ జూచు వేడ్క**
**సుందర కాంచన స్యందనారూఢుఁడై భాసిల్లుచున్న వ్రేపల్లె కరిగి**
**చిరకాల సంగత స్నేహులై గోప గోపాంగనా నికర మాలింగనములు**
**సముచిత సత్కృతుల్ సలుపఁ గైకొని మహోత్సుకలీల నందయశోదలకును**

**తే. వందనం బాచరించిన వారు మోద, మంది బిగియారఁ గౌఁగిళ్ల నొందఁ జేర్చి**
**సమత దీవించి యంకపీఠమునఁ జేర్చి, శిరము మూర్కొని చుబుకంబుఁ గరము పుణికి.** 483

**వ. మఱియు నానందబాష్పధారాసిక్త కపోలయుగళంబులతోడం గుశల ప్రశ్నంబుగా నిట్లని' రన్నా! నీవును నీ చిన్నతమ్ముండగు వెన్నుండును లెస్సయున్నవారె? మమ్మెప్పుడు నరసి రక్షింపవలయు, మాకు నేడుగడయు మీరు కాక యొరులు గలరే?' మని సముచిత సంభాషణంబులం బ్రొద్దుపుచ్చు చుండి రంత.** 484

* మహారాజా! ఒకనాడు బలరాముడు తన బంధుమిత్రుల్ని చూచి రావడానికి సుందరమైన బంగారురథం ఎక్కి వ్రేపల్లెకు వెళ్లాడు. ఎంతో కాలంగా స్నేహసాంగత్యాలు కలిగి ఉండడం వలన గోపికలు, గోపాలురు అతనిని ఆలింగనం చేసుకొని తగిన మర్యాదలు చేశారు. ఆ గౌరవాలను అందుకొని బలరాముడు

యశోదా నందులకు నమస్కరించాడు. వారు సంతోషించి కౌగిలించుకొని, దీవించి, దగ్గరకు తీసుకొని, ఒళ్ళంతా తడివి చూచి ఆనందబాష్పాలు జాలువారుతుండగా కుశల ప్రశ్నలు వేశారు. "బలరామా! నీవూ, నీ ముద్దుల తమ్ముడు కృష్ణుడూ క్షేమంగా ఉన్నారా? మమ్ములను మీరే రక్షించాలి. మాకు ఆధారం మీరు కాక మరెవ రున్నారు'' అని సంతోషంతో చక్కగా సంభాషించారు.

**క. గోపాలవరులు ప్రమదం, బాపోవని మది నివర్తి తాఖిల గేహ**
**వ్యాపారు లగుచు హలధరు, శ్రీపాదంబులకు నతులు సేసిరి వరుసన్.** 485

* అక్కడి గోపాలురు తమ గృహకృత్యాలు కూడా మరచి ఆనందంతో నిండిన హృదయాలతో బలరామునకు పాదనమస్కారాలు చేశారు.

**క. సీరియు వారికిఁ గరుణో, దారుండై నడపె సముచితక్రియ లంతం**
**గోరి తనయీడు గోప కు, మారులఁ జే చఱచి బలుఁడు మందస్మితుఁడై.** 486

* హలాయుధుడు వారందరినీ యథోచితంగా గౌరవించాడు. అ తర్వాత తన యీడువారైన కొందరు గోపాలురను స్నేహపూర్వకంగా చేతితో చరచి చిరునవ్వు నవ్వాడు.

**క. నిజసుందర దేహద్యుతి, రజతాచలరుచులఁ దెగడ రాముఁడు వారల్**
**భజియింప నేగి యొకచో, విజనస్థలమున వసించి విలసిల్లు నెడన్.** 487

* బలభద్రుడు వెండికొండ కాంతులతో నిండిన శరీరద్యుతులు శోభిస్తూ ఉండగా గోపాలురతో కూడి ఒక ఏకాంతస్థలానికి వెళ్లాడు.

**కవిరాజ విరాజితము :**

**చరణములం గనక స్ఫుటనూపురజాలము గల్లనుచుం జెలఁగం**
**గరములఁ గంకణముల్ మొరయన్ నలికౌ నసియాడఁ గుచాగ్రములన్**
**సరులు నటింపఁ గురుల్ గునియన్ విలసన్మణి కుండలకాంతులు వి**
**స్ఫురిత కపోలములన్ బెరయన్ వ్రజసుందరు లంద ఱమందగతిన్.** 488

* ఆ సమయంలో కాళ్ల బంగారుపట్టాలు ఘల్లుఘల్లని శబ్దం చేస్తుండగా, చేతి కంకణాలు గణగణ ధ్వనిస్తుండగా, నడుము వణుకుతుండగా, వక్షస్థలంపై తారహారాలు నటిస్తుండగా, మణికుండలాల కాంతులు కపోలాలపై వ్యాపిస్తుండగా గొల్లభామలు అక్కడకు వచ్చారు.

**కవిరాజవిరాజితము :**

**చని బలభద్రుని శౌర్య సముద్రుని సంచితపుణ్యు నగణ్యునిఁ జం**
**దన ఘనసార పటీర తుషార సుధారుచికాయు విధేయు సుధా**

శనరిపుఖండను సన్మణిమండను సారవివేకు నశోకు మహా
త్ముని( గని గోపిక లోపిక లేక యదుప్రభు ని ట్లని రుత్కలికన్. 489

* అలా వచ్చిన శౌర్యసముద్రుడూ, చందనంవలె, కర్పూరంవలె, మంచువలె, అమృతంవలె, తెల్లని కాంతితో విలసిల్లుతున్నవాడూ, రాక్షసాంతకుడూ, వివేకవంతుడూ అయిన ఆ యాదవశ్రేష్ఠుని అవలోకించి ఆపుకోలేని అనురాగంతో ఇలా అన్నారు.

చ. 'హలధర! నీ సహోదరు( డుదంచితకంజ విలోచనుండు స
ల్లలిత పురాంగనా జనవిలాస విహార సమగ్ర సౌఖ్యముల్
గలిగి సుఖించునే? మము నొకానొక వేళన యేని బుద్ధిలో(
దల(చునొ? నూతన ప్రియల( దార్కొని యేమియు( బల్కకుండునో? 490

* ఓ హలాయుధా! నీ సోదరుడైన పద్మాక్షుడు అంతఃపుర కాంతలతో విహరిస్తూ ఆనందిస్తున్నాడా? మమ్ములను ఎప్పుడైనా తలచుకుంటున్నాడా? క్రొత్త కాంతలవలన కలిగిన ఆనందంలో మైమరచి మమ్మల్ని గూర్చి మాట్లాడటమే మానివేశాడా?

క. జననీ జనకుల ననుజుల(, దనుజుల బంధువుల మిత్రతతుల విడిచె నె
మ్మనమున నొండు దలంపక, తను నమ్మినవారి విడువ(దగునే హరికిన్? 491

* తలిదండ్రులనూ, సోదరులనూ, పుత్రులనూ, బంధువులనూ, మిత్రులనూ, అందరినీ విడిచి మనస్సులో ఏ మాత్రం సంకోచించకుండా తననే నమ్ముకున్న మమ్మలిని విడిచి వెళ్లటం శ్రీకృష్ణునకు ఏమైనా న్యాయమా?

సీ. సలలిత యామునసైకత స్థలమున నుండ మ మ్మేమని యూఱడించె
విమల బృందావనవీథి మా చుబుకముల్ పుణుకుచు నే మని బుజ్జగించె(
బుష్పవాటికలలో( బొలుచు మా కుచయుగ్మ మంటుచు నే మని యాదరించె(
గాసారముల పొంత( గౌ(గిట మము( జేర్చి నయమొప్ప నే మని నమ్మ( బలికె

తే. నన్నియు మఱచె( గా(బోలు వెన్ను( డాత్మ, గోరి తా( జాయలున్నైన వారి విడుచు
నట్టి కృష్ణు(డు దము ఱట్టు వెట్టు ననక, యేల నమ్మిరి పురసతుల్ బేల లగుచు.' 492

* బలదేవా! యమునానది ఇసుక తిన్నెలపైన మమ్ములను ఏమో చెప్పి ఎంత ఊరడించాడు? బృందావనంలో మా గడ్డాలు పట్టుకొని ఎంతగా బుజ్జగించాడు? పూలతోటలలో మా వక్షస్థలాన్ని తాకుతూ ఎలా ఆదరించాడు? సరోవర ప్రాంతాలలో మమ్ములను కౌగిలించుకొని ఎంతో విశ్వాసంగా మాట్లాడాడు? ఈ విషయాల నన్నిటినీ మరచిపోయాడు కాబోలు! శ్రీకృష్ణుడు తన్ను కోరి వలచి వచ్చిన భార్యనైనా విడువ గల్గినవాడు. అటువంటి వానిని పురకాంతలు బేలలై ఎందుకు నమ్మారో!

**మ. అని యిబ్భంగి సరోజలోచనుని నర్మాలాపముల్ నవ్వులు**
**న్ననుబంధుల్ పరిరంభణంబులు రతి వ్యాసంగముల్ భావముల్**
**వినయంబుల్ సరసోక్తులుం దలఁచి యువ్విళ్ళూరు చిత్తంబులన్**
**జనితానంగశరాగ్ని చేత దురవస్థం బొంది శోకించినన్. 493**

* ఈ విధంగా శ్రీకృష్ణుని ఛలోక్తులనూ, నవ్వులనూ, అనురాగాలనూ, కౌగిలింతలనూ, రతికార్యాలనూ, వినయాలనూ, సరసాలాపాలనూ, తలచుకొని ఉవ్విళ్లూరుతూ, ప్రియవియోగబాధతో దుర్దశలపాలై ఆ గోపికలు వాపోయారు.

**వ. అంత బలభద్రుండు వారల మనంబుల సంతాపంబులు వారింప నుపాయంబు లగు సరస చతుర వచనంబులఁ గృష్ణుని సందేశంబులు సెప్పి విగతఖేదలం జేసి యచ్చట మాసద్వయంబు నిలిచి వసంతవాసరంబులు గడపుచుఁ గాళిందీ తీరంబున. 494**

అప్పుడు బలరాముడు వారి సంతాపం తొలగిపోయేటట్లు మంచి మాటలు చెప్పి, శ్రీకృష్ణుని సందేశం వినిపించి వారు దుఃఖాన్ని మరచి పోయేటట్లు చేశాడు. వ్రేపల్లెలో రెండు నెలలుపాటు ఉన్నాడు. ఒకనాడు కాళింది తీరానికి వెళ్లాడు.

**సీ. మాకంద జంబీర మందార ఖర్జూర ఘనసార శోభిత వనములందు**
**నేలాలతా లోల మాలతీ మల్లికా వల్లీమతల్లికా వాటికలను**
**దరళ తరంగ శీకర సాధు శీతల సైకతవేదికా స్థలములందు**
**మకరంద రసపాన మదవ దిందిందిర పుంజ రంజిత మంజుకుంజములను**
**తే. విమలరుచి గల్గు సానుదేశములయందు, లలిత శశికాంత ఘనశిలాతలములందు**
**లీల నిచ్ఛావిహారవిలోలుఁ డగుచు, సుందరీజనములు గొల్వఁ జూడ నొప్పె. 495**

* మామిళ్లూ, నిమ్మలూ, మందారాలూ, ఖర్జూరాలూ, కర్పూరపు అరటిచెట్లూ శోభించే ఉద్యానవనాల లోనూ; ఏలకి, మాలతి, మల్లె, మొదలైన తీగె పొదరిండ్లలోనూ, తరంగాల తుంపురులచేత మిక్కిలి చల్లనైన ఇసుక తిన్నెలపైననూ, మధుపానంతో మత్తిల్లిన గండు తుమ్మెదలతో నిండిన నికుంజాల లోనూ, తళతళ మెరిసే కొండచరియల యందూ, చంద్రకాంత శిలావేదికల పైననూ సుందరీమణులతో బలరాముడు స్వేచ్ఛగా సంచరించాడు.

**తే. అట్లు విహరింప వరుణుని యాజ్ఞఁ జేసి, వారుణీదేవి మద్యభావంబు నొంది**
**నిఖిల తరుకోటరములందు నిర్గమించి, మించు వాసనచేత వాసించె వనము. 496**

* అప్పుడు వరుణుని ఆజ్ఞవలన వారుణీదేవి మద్యభావాన్ని పొంది సమస్తమైన తరుకోటరాలలో ప్రవేశించింది. అప్పుడు ఆ వనమంతా మంచి మదనవాసనలతో శోభించింది.

**వ. అట్టియెడ. 497**

మ. కర మొప్పారు నవీనవాసనల నాఘ్రాణించి గోపాల సుం
దరులుం దానును డాయనేగి యతిమోదం బొప్ప సేవించి యా
తరళాక్షుల్ మణిహేమ కంకణఝుణత్కారానుకారంబులై
కరతాళంబులు మ్రోయఁ బాడుచును వేడ్కన్నాడుచున్ సోలుచున్. 498

* ఆ సమయంలో ఆ క్రొత్త సువాసనలు ఆఘ్రాణించి గోపాలకకాంతలూ, తానూ వెళ్లి సంతోషంతో ఆ మద్యాన్ని సేవించాడు. అప్పుడు ఆ తరళాక్షులు బంగారు కంకణాల ఝుణఝుణ ధ్వనులతో తాళం వేస్తూ ఆనందంతో ఆడిపాడి సోలిపోయారు.

సీ. తనమీఁది బిరుదాంకితములైన గీతముల్ వాడుచు రా బలభద్రుఁ డంత
మహిత కాదంబరీ మధుపానమదవిహ్వ లాక్షుండు లలితనీలాలకుండు
నాలోల నవపుష్పమాలికోరస్థ్సలుఁ డనుపమ మణికుండలాంచితుండు
ప్రాలేయ సంయుక్త పద్మంబుగతి నొప్పు సలలితానన ఘర్మజలకణుండ

తే. నగుచు వనమధ్యమున సలిలావగాహ, శీలుఁడై జలకేళికిఁ జేరి యమున
నిందు రమ్మని పిలువఁ గాళింది యతని, మత్తుఁడని సడ్డసేయక మసలుటయును. 499

* వారు బలరామునిపై బిరుదగీతాలు పాడుతూ అతనిచెంతకు వచ్చారు. అప్పుడు మద్యపానం వలన విహ్వలమైన నేత్రాలతో, వినీల కేశాలతో, వక్షస్థలంపై వ్రేలాడుతున్న పుష్పమాలతో, చెవులయందలి మణికుండలాలతో, చెమట బిందువులతో నిండిన ముఖారవిందంతో శోభిస్తున్న బలరామునకు జలక్రీడ గావించాలని అనిపించింది. జలకేళికోసం యమునానదిని 'ఇటురా'అని పిలిచాడు. కాళింది 'త్రాగుబోతు'అని బలరాముని మాటలను లక్ష్యపెట్టలేదు.

చ. ఘనకుపితాత్ముఁడై యమునఁ గన్గొని రాముఁడు వల్కెఁ డాయఁ జీ
రినఁ జనుదేక తక్కితి పురే! విను నిందఱుఁ జూడ మద్భుజా
సునిశిత లాంగలాగ్రమున సొంపఱ నిప్పుడు నూఱు త్రోవలై
చన వెసనఁ జించివైతు నని చండపరాక్రమ మొప్ప నుగ్రుఁడై. 500

* అప్పుడు బలరాముడు కోపించి యమునానదితో ఇలా అన్నాడు. 'దగ్గరకు రమ్మని పిలిస్తే నీవు రాలేదు. ఇప్పుడు ఇక్కడివారంతా చూస్తుండగా నా నాగలితో నిన్ను నూరుత్రోవలై ప్రవహించేటట్లు చీల్చివేస్తాను' అని ఉగ్రుడై పరాక్రమించాడు.

వ. అట్లు కట్టలుక రాము డుద్దామంబగు బాహుబలంబున హలంబు సాఁచి య మ్మహా వాహినిం దగిల్చి పెకలిరాఁ దిగిచిన న న్నది భయభ్రాంతయై సుందరీరూపంబు గైకొని యతిరయంబునం జనుదెంచి, య య్యదువంశ తిలకుండగు హలధరుని పాదారవిందంబులకు వందనం బాచరించి యి ట్లనియె. 501

* హలాయుధుడు తనహలాయుధాన్ని తీసికొని ఆ నదిని పెకల్చి తనవైపుకు వచ్చేటట్లు లాగాడు. అప్పుడు ఆ నది భయపడి స్త్రీ రూపాన్ని ధరించి, వేగంగా బలరాముని చెంతకు వచ్చి, అతని పాద పద్మాలకు నమస్కరించి ఇలా విన్నవించుకొన్నది.

**మ. 'బలరామా! ఘనబాహ! నీ యతుల శుంభద్విక్రమం బంగనల్**
**దెలియం జాలెడివారె? యీ యఖిలధాత్రీభారధౌరేయ ని**
**శ్చల సత్త్వుండగు కుండలీశ్వరుఁడునుం జర్చింప నీ సత్కళా**
**కలితాంశ ప్రభవుండు! నీ గురుభుజా గర్వంబు సామాన్యమే?'** 502

* బాహుబల పరాక్రమా! నీ విక్రమం అంగనలు తెలియ జాలుదురా? తన శక్తి సామర్థ్యాలతో ఈ భూభారాన్ని భరిస్తున్న ఆదిశేషుడు గూడా నీ అంశకు చెందినవాడే. నీ భుజబలం అసామాన్యమైనది.

**చ. అని వినుతించి 'యేను భవదంఘ్రి సరోజము లాశ్రయించెదన్**
**ననుఁ గరుణింపు' మన్న యదునందనుఁ డన్నదిఁ 'బూర్వమార్గవై**
**చను' మని కామినీనికర సంగతుఁడై జలకేళి సల్పె నిం**
**పెనయఁ గరేణుకాయుత మదేభము చాడ్పున న మ్మహానదిన్.** 503

* ఇలా స్తుతించి 'నీ పాదపద్మాల నాశ్రయించిన నన్ను కరుణించు'అని కాళింది బలరాముని వేడుకున్నది. అప్పుడు ఆ యాదవ వీరుడైన బలభద్రుడు పూర్వమార్గంలోనే పయనించుమని పలికి ఆ యమునా నదిలో గోపాంగనామణులతో కూడి కరిణీసహితుడైన గజరాజులాగా జలకేళి గావించాడు.

**తే. అంత జలకేళి సాలించి సంతసంబు, నందుచుండ వినీలవస్త్రాదిరత్న**
**మండనంబులుఁ గాంచనమాలికయును, దెచ్చి హరి కిచ్చి చనె నా నదీలలామ.** 504

* జలకేళి ముగించి బలరాముడు ఆనందిస్తున్న సమయంలో కాళిందీనది నీలవస్త్రాలూ, రత్నాలంకారాలూ, బంగారుహారం కానుకగా తెచ్చి ఆయనకు సమర్పించింది.

**క. అవి యెల్లఁ దాల్చి హలధరుఁ, డవిరళగతి నొప్పి వల్లవాంగనలును దా**
**దివిజేంద్రుఁ బోలి మహితో, త్సవమున వర్తించుచుండె సౌఖ్యోన్నతుఁడై.** 505

* వాని నన్నిటినీ ధరించి గోపాంగనలతో గూడిన బలరాముడు దేవేంద్రునివలె సౌఖ్యాలలో మునిగి తేలుతూ ఆనందంతో విహరించాడు.

**క. అవనీశ! యిట్లు హలమునఁ, దివిచినఁ గాళింది వ్రయ్య దెలియఁగ నేఁడున్**
**భువి నుతి కెక్కెను రాముని, ప్రవిమలతరమైన బాహుబలసూచకమై.** 506

* ఓ రాజా! ఈ విధంగా బలరాముని హలంతో ఏర్పడిన కాళిందీ నది చీలిక ఈ నాటికి గూడా బలరాముని బాహుబలానికి ప్రతీకగా నిలిచి ప్రఖ్యాతి గాంచినది.

**వ. అంత బలభద్రుండు వ్రజసుందరీ సమేతుండై నందఘోషంబునం బరితోషంబు నొందుచుండె, నంత నక్కడఁ గరూశాధిపతియైన పౌండ్రకుండు తన దూతం బిలిచి యిట్లనియె. 507**

* బలరాముడు ఈ విధంగా గోపాంగనలతో ఆనందిస్తుండగా కరూశదేశపు రాజయిన పౌండ్రకుడు తన దూతను పిలిచి ఇలా పలికాడు.

## -: కృష్ణుండు పౌండ్రకవాసుదేవునిమీఁద దండెత్తిపోయి వానిం జంపుట :-

**సీ. మనుజేశ! బలగర్వమున మదోన్మత్తుఁడై 'యవనిపై వాసుదేవాఖ్యుఁ డనఁగ
నే నొక్కరుఁడ గాక యితరుల కీ నామ మలవడునే?' యని యదటు మిగిలి
తెగి 'హరి దా వాసుదేవుఁడ ననుకొను నఁట! పోయి వల'దను మనుచు దూతఁ
బద్మాయతాక్షుని పాలికిఁ బొమ్మన నరిగి వాఁ డంబుజోదరుఁడు పెద్ద**

**తే. కొలువుఁ గైకొని యుండ సంకోచపడక, 'వినుము మా రాజుమాటగా వనజనాభ!
యవని రక్షింప వాసుదేవాఖ్య నొంది, నట్టి యే నుండ సిగ్గు వో ఁదట్టి నీవు. 508**

* 'భూలోకంలో వాసుదేవు డనుపేరు నా కొక్కడికే చెల్లుతుంది. ఇతరులకు ఏ మాత్రం చెల్లదు. కృష్ణుడు పొగరెక్కి వాసుదేవుడని అనుకుంటున్నాడట! పోయి వద్దని చెప్పు'అని బలగర్వంతో మదోన్మత్తుడై పద్మాక్షుని చెంతకు పౌండ్రకుడు తన దూతను పంపించినాడు. వాడు వెళ్ళి శ్రీ కృష్ణుడు సభతీర్చియుండగా సంకోచపడకుండా ఇలా అన్నాడు. 'ఓ శ్రీకృష్ణా! మారాజు చెప్పిన మాటలు విను. భూమిని రక్షించడానికి 'వాసు దేవు'డనే పేరు నాకుండగా నీవు సిగ్గు విడిచి ఆ పేరు పెట్టుకున్నావు.

**క. నా పేరును నా చిహ్నము, లేపున ధరియించి తిరిగె దిది పంతమె? యిం
తే పో! మదిఁ బరికించిన, నే పంత మెఱుంగు గొల్లఁ డే మిట నైనన్? 509**

* నా పేరూ, నా చిహ్నాలూ ధరించి సంచరిస్తున్నావు. ఇది నీ పంతమా! ఐనా గోపాలుడికి పంత మేమిటి?

**ఆ. ఇంతనుండి యైన నెదిరిఁ ద న్నెఱిఁగి నా, చిన్నె లెల్ల విడిచి చేరి కొలిచి
బ్రదుకు మనుము కాక పంతంబు లాడెనా, యెదురు మనుము ఘోరకదనమునను. 510**

* ఇకనుంచి అయినా నీ శక్తి, ఎదుటివారి శక్తీ తెలుసుకొని నా చిహ్నాల నన్నిటినీ వదలిపెట్టి నాకు సేవకుడవై బ్రదుకు. కాక పంతమాడ దల్చుకుంటే యుద్ధానికి సిద్ధపడు.'

**క. అను దుర్భాషలు సభ్యులు, విని యొండొరు మొగము సూచి విస్మితు లగుచున్
'జనులార! యెట్టి క్రొత్తలు, వినఁబడియెడు నిచట? లెస్స వింటిరె?' యనఁగన్. 511**

* దూత పలికిన దుర్భాషలను సభ్యులంతా విని ఒకరి మొగం మరొకరు చూచుకున్నారు. ఆశ్చర్యపోయారు. 'ఈరోజు ఎటువంటి క్రొత్తమాటలు విన్నాము'అని అనుకున్నారు.

**వ. అట్టియెడ కృష్ణుండు వాని కిట్లనియె. 512**

* ఆ సమయాన శ్రీకృష్ణుడు పౌండ్రకుని దూతతో ఇట్లా అన్నాడు.

మ. 'వినరా! మీ నృపుఁ డన్న చిహ్నములు నే వే వచ్చి ఘోరాజిలో
దనమీఁదన్ వెస వైవఁ గంకముఖగృధ్రవ్రాతముల్ మూఁగఁగా,
ననిలో దర్పము దూలి కూలి వికలంబై సారమేయాళికి
న్ననయంబున్ నశనంబ వయ్యె' దను మే నన్నట్లుగా వానితోన్. 513

* 'ఓరీ! మీ రాజు ఏ చిహ్నాలను ధరించానని నన్ను గురించి చెప్పాడో ఆ చిహ్నాలను రేపు నేను వచ్చి ఘోరయుద్ధంలో మీ ప్రభువు పైన ప్రయోగిస్తాను. యుద్ధంలో శక్తి కోలుపోయి కూలిపోయిన నిన్ను గ్రద్దలూ, రాబందులూ, చుట్టుముట్టుతాయనీ, కుక్కల గుంపులు నిన్ను చీల్చుకొని తింటాయనీ నేను చెప్పినట్లుగా అతనికి చెప్పు.'

క. అని యుద్రేకముగా నా, డిన మాటల కులికి వాఁడు డెందము గలఁగం
జని తన యేలిక కంతయు, వినిపించెను నతని మదికి విరసము గదురన్. 514

* ఈ విధంగా శ్రీకృష్ణుడు ఉద్రేకంగా పలికిన పలుకులకు వాడు ఉలికిపడి, గుండె జారిపోయి, తన ప్రభువు దగ్గరకు వెళ్లి జరిగిందంతా అతని మనస్సుకు ఆందోళన కలిగేటట్లు విన్నవించాడు,

వ. అంతఁ గృష్ణుండు దండయాత్రోత్సుకుఁడై వివిధాయుధ కలితంబును, విచిత్రకాంచన పతాకాకేతు విలసితంబునగు సుందరస్యందనంబుఁ బటు జవతురంగంబులం బూన్చి దారుకుండు తెచ్చిన నెక్కి యతిత్వరితగతిం గాశికానగరంబున కరిగినం బౌండ్రకుండును రణోత్సాహంబు దీపింప నక్షౌహిణీద్వితయంబుతోడం బురంబు వెడలె, నప్పు డతని మిత్రుండైన కాశీపతియును మూఁ డక్షౌహిణులతోడం దోడుపడువాఁడై వెడలె, ని ట్లాప్తయుతుండై వచ్చువాని. 515

* అనంతరం శ్రీకృష్ణుడు పౌండ్రుకునిపై దండయాత్రకు ఉత్సహించి దారుకుడు తెచ్చిన రథాన్ని అధిరోహించాడు. ఆ రథంలో వివిధములైన ఆయుధాలున్నాయి. బంగారుజెండా ఆ రథంపై విలసిల్లుతున్నది. వేగవంతాలైన గుఱ్ఱాలు కట్టిన ఆ రథంపై ఎక్కి శ్రీకృష్ణుడు కాశీనగరానికి వెళ్లాడు. పౌండ్రకుడు గూడా అతిశయించిన రణోత్సాహంతో, రెండక్షౌహిణుల సైన్యంతో పట్టణం బయటకు వచ్చాడు. అతని స్నేహితుడైన కాశీరాజు గూడ మూడక్షౌహిణుల సైన్యంతో పౌండ్రకునికి సహాయంగా వచ్చాడు. ఈ విధంగా మిత్రసహితుడై యుద్ధరంగానికి వస్తున్న పౌండ్రకుని శ్రీకృష్ణుడు చూచాడు.

సీ. చక్ర గదా శంఖ శార్ఙ్గాది సాధనుఁ గృత్రిమ కౌస్తుభ శ్రీవిలాసు
మకరకుండల హార మంజీర కంకణ మణిముద్రికా వనమాలికాంకుఁ
దరళ విచిత్ర పతంగ పుంగవకేతుఁ జెలువొందు పీతకౌశేయవాసు
జవనాశ్వకలిత కాంచన రథారూఢుని రణకుతూహలు లసన్మణికిరీటు

తే. నాత్మసమవేషు రంగవిహారకలిత, నటసమానునిఁ బౌండ్రభూనాథుఁ గాంచి
హర్ష మిగురొత్త నవ్వెఁ బద్మాయతాక్షుఁ, డంత వాఁడును నుద్వృత్తుఁ డగుచు నడరి. 516

* పౌండ్రకుడు శంఖం, చక్రం, గద, శార్ఙ్గం మొదలైన ఆయుధాలను ధరించాడు. కృత్రిమమైన కౌస్తుభమణి వక్షాన తగిలించుకున్నాడు. మకరకుండలాలు, హారాలు, కంకణాలు దాల్చాడు. కంఠంలో వనమాల వేసుకున్నాడు. గరుడ కేతనాన్ని చేకూర్చుకున్నాడు. పీతాంబరాన్ని కట్టాడు. వడిగల గుఱ్ఱాలతో గూడిన బంగారు రథాన్ని అధిరోహించాడు. కాంతిమంతమైన కిరీటాన్ని తలపై అలంకరించుకొని యుద్ధానికి కుతూహలపడుతున్నాడు. ఇలా తన వేషాన్ని ధరించిన పౌండ్రకుని చూచి రంగస్థలనటునిగా భావించి శ్రీకృష్ణుడు పకపక నవ్వాడు. ఆ పరిహాసానికి పౌండ్రకుడు మండిపడ్డాడు.

**క. పరిఘ శరాసన పట్టిస, శర ముద్గర ముసల కుంత చక్ర గదా తో**
**మర భిందిపాల శక్తి, క్షురికాసి ప్రాస పరశు శూలముల వెసన్.** 517

**చ. పరువడి వైచినన్ దనుజభంజనుఁ డంత యుగాంత కాల భీ**
**కరమహితోగ్ర పావకుని కైవడి నేచి విరోధి సాధనో**
**త్కరముల నొక్కటన్ శరనికాయములన్ నిగిడించి త్రుంచి భా**
**స్వరగతి నొత్తె సంచలితశాత్రవసైన్యముఁ బాంచజన్యమున్.** 518

* పరిఘ, పట్టిసం, ముసలం, సమ్మెట, ఈటె, చక్రం, గద, చిల్లకోల, బాకు, శక్తి, చురకత్తి, గొడ్డలి, శూలం మొదలైన ఆయుధాలను శ్రీకృష్ణునిపై మిక్కిలి వేగంగా ప్రయోగించాడు. విల్లెక్కువెట్టి శరవర్షం కురిపించాడు. దానవాంతకుడు భయంకర ప్రళయాగ్నివలె విజృంభించి విరోధి ప్రయోగించిన ఆయుధాల నన్నిటినీ తన బాణసమూహంతో త్రుంచి వేశాడు. శత్రుసైన్యాలకు సంచలనం కల్గించే తన పాంచజన్యశంఖాన్ని పూరించాడు.

**ఉ. వారని యల్కతోఁ గినిసి వారిజనాభుఁడు వారి సైన్యముల్**
**మారి మసంగినట్లు నుఱుమాడినఁ బీనుఁగుఁబెంటలై వెసం**
**దేరులు వ్రాలె, నశ్వములు ద్రెళ్ళె, గజంబులు మ్రొగ్గె, సద్భటుల్**
**ధారుణిఁ గూలి, రిట్లు నెఱి దప్పి చనెన్ హతశేషసైన్యముల్.** 519

* అమితమైన ఆగ్రహంతో సరోజనాభుడు విరోధిసైన్యాలను నాశనం చేశాడు. రథాలు విరిగిపోయాయి. అశ్వాలు కూలాయి. ఏనుగులు వ్రాలాయి. కాల్బలం గడ్డిగరచింది. ఈ విధంగా రణరంగమంతా పీనుగు పెంటలై పోయింది. మరణించకుండా మిగిలిన సైన్యం పరాక్రమాన్ని వదలి పారిపోయింది.

**వ. అట్టియెడ రుధిర ప్రవాహంబులును, మేదోమాంసపంకంబును నై సంగరాంగణంబు ఘోరభంగి యయ్యె, న య్యవసరంబునం గయ్యంబునకుం గాలు ద్రవ్వు న ప్పౌండ్రకునిం గనుంగొని హరి సంబోధించి యి ట్లనియె.** 520

* నెత్తుటి ప్రవాహంతో, మాంసపు బురదతో సంగరాంగణం భయంకరమైపోయింది. ఆ సమయంలో తనపై కాలు ద్రవ్వుతున్న పౌండ్రకుణ్ణి చూచి శ్రీకృష్ణుడు ఇలా అన్నాడు.

మ. 'మనుజేంద్రాధమ! పౌండ్రభూపసుత! నీ మానంబు బీరంబు నేఁ
డనిలో మాపుదు, నెద్దు క్రొవ్వి పెలుచ న్నాఁబోతుపై ఱంకె వై
చిన చందంబున దూతచేత నను నాక్షేపించి వల్గన్న పే
రును జిహ్వంబులు నీ పయిన్ విడుతు నర్చుల్ పర్వ నేఁ డాజిలోన్. 521

* 'ఓ రాజాధమా! పౌండ్రకా! ఈ రోజు యుద్ధంలో నీ మానం మంటగలుపుతాను. నీ పౌరుషం పటాపంచలు చేస్తాను. ఎద్దు క్రొవ్వి ఆబోతుపై రంకెవేసినట్లు నీవు నా చెంతకు దూతను పంపి నన్నాక్షేపించావు. నీవు నన్ను వదలివేయుమన్న చక్రాది చిహ్నాలనే నిప్పులు చెలరేగేటట్లు నీపై యుద్ధంలో ప్రయోగిస్తాను.

క. అది గాక నీదు శరణము, పదపడి యేఁ జొత్తు నీవు బలవిక్రమ సం
పద గల పోటరి వేనిం, గదలక నిలు 'మనుచు నిశితకాండము లంతన్. 522

* అలా చేయలేకపోతే నిన్ను శరణు వేడుతాను. నీవు బలపరాక్రమాలు గల వీరాధివీరుడవే అయితే యుద్ధరంగంలో నిశ్చలంగా నిలబడు' అంటూనే శ్రీకృష్ణుడు వాడి బాణాలను వాడిపై ప్రయోగించాడు.

మ. చల మొప్పన్ నిగుడించి వాని రథముం జక్కాడి తత్సారథిం
దల వే త్రుంచి హయంబులన్ నరికి యుద్దండప్రతాపక్రియం
బ్రలయార్కప్రతిమాన చక్రమున నప్పౌండ్రున్ వెసం ద్రుంప వాఁ
డిలఁ గూలెం గులిశాహతి న్నొరగు శైలేంద్రాకృతిన్ భూవరా! 523

* ఇలా పట్టుదలతో బాణాలు ప్రయోగించి వాని రథాన్ని కూల్చివేసి, సారథిని సంహరించి, గుఱ్ఱాలను నరికి, ఉద్దండప్రతాపంతో ప్రళయకాల సూర్యునితో సమానమైన తన చక్రాయుధాన్ని ప్రయోగించి పౌండ్రకుని శిరస్సును ఖండించాడు. వజ్రాయుధపు దెబ్బతో కూలిన పర్వతంలా పౌండ్రకుడు నేలకూలాడు.

చ. మడవక కాశికావిభుని మస్తక ముద్ధతిఁ ద్రుంచి బంతి కై
వడి నది పింజ పింజ గఱవన్ విశిఖాళి నిగుడ్చి వాని యే
లెడి పురిలోన వైచె నవలీల మురాంతకుఁ డిట్లు వైరులన్
గడఁగి జయించి చిత్తమునఁ గౌతుకముం జిగురొత్త న త్తటిన్. 524

* అనంతరం కాశీరాజు శిరస్సును గూడా శ్రీకృష్ణుడు ఖండించి బంతిలాగా ఆ శిరస్సును బాణాలతో పై పైకి ఎగురగొడుతూ అతని పట్టణంలో పడేటట్లు చేశాడు. ఈ విధంగా మురాంతకుడు శత్రువులను జయించి మనస్సులో ఎంతో ఆనందించాడు.

క. సుర గంధర్వ నభశ్చర, గరుడోరగ సిద్ధ సాధ్యగణము నుతింపన్
మరలి చనుదెంచి హరి నిజ, పురమున సుఖముండె నతివిభూతి దలిర్పన్. 525

* దేవ గంధర్వ సిద్ధ సాధ్య గరు డోరగ గణాలన్నీ స్తుతిస్తుండగా, శ్రీకృష్ణుడు మిక్కిలి వైభవంతో తన నగరానికి తిరిగివచ్చి సుఖంగా కాలం గడుపుతున్నాడు.

క. వనజోదరు చిహ్నంబులు, గొనకొని ధరియించి పౌండ్రకుఁడు మచ్చరియై
యనవరతము హరి దన తలఁ, పునఁ దగులుటఁ జేసి ముక్తిఁ బొందె నరేంద్రా! 526

* ఓ పరీక్షిన్నరేంద్రా! వనజనాభుని చిహ్నాల నన్నిటినీ పట్టుదలతో ధరించి అసూయాపరుడై, నిరంతరం తన మనస్సులో శ్రీకృష్ణుణ్ణే ధ్యానించడం వలన పౌండ్రకుడు మోక్షాన్ని పొందాడు.

సీ. అక్కడఁ గాశిలో నా రాజు మందిరాంగణమునఁ గుండల కలిత మగుచుఁ
బడి యున్న తలఁ జూచి పౌరజనంబులు దమ రాజు తలయకాఁ దగ నెఱింగి
చెప్పిన నా నృపు జీవితేశ్వరులును సుతులు బంధువులును హితులు గూడి
మొనసి హాహాకారమున నేడ్చి, రత్తఱిఁ దత్తనూభవుఁడు సుదక్షిణుండు

తే. వెలయఁ దండ్రికిఁ బరలోకవిధు లొనర్చి, జనకు ననిలో వధించిన చక్రపాణి
నడరి మర్దింపఁ దగు నుపాయంబు దలఁచి, చతురుఁ డగునట్టి తన పురోహితునిఁ బిలిచి. 527

* ఇక అక్కడ కాశీపట్టణంలో ఆ రాజుమందిరంలో కుండలసహితమైన శిరస్సు పడగానే పురజను లందరూ అది తమ రాజు శిరస్సని గుర్తించారు. ఆరాజుభార్యలు, పుత్రులు, మిత్రులు, బంధువులు హాహాకారాలు చేసి దుఃఖించారు. కాశీరాజు కుమారుడైన సుదక్షిణుడు తండ్రికి పరలోకక్రియలు నిర్వర్తించాడు. తన తండ్రిని యుద్ధంలో సంహరించిన శ్రీకృష్ణుని సంహరించడానికి ఉపాయం ఆలోచించాడు. చతురుడైన తన పురోహితుణ్ణి పిలిపించాడు.

క. అతడుం దానును జని పశు, పతిపద సరసిజములకును బ్రమదముతో నా
నతుఁడై య ద్దేవుని బహు, గతులం బూజింప నతఁడు కరుణాన్వితుఁడై. 528

* పురోహితుడూ, తానూ వెళ్లి పరమేశ్వరుని పాదాలకు ప్రణామం చేసి బహువిధాలుగా పూజలు చేశారు. పరమశివుడు కరుణామయుడై ప్రత్యక్ష మయ్యాడు.

క. 'మెచ్చితి నే వర మైనను నిచ్చెద నను వేఁడు' మనిన 'నీశ్వర ! నన్నున్
మచ్చిక రక్షింతువు పార, పొచ్చెము సేయక మహేశ! పురహర! యభవా! 529

క. దేవా! మ జ్జనకుని వసు, దేవాత్మజుఁ డాజిలో వధించెను, నే నా
గోవిందుని ననిలోపల, నే విధమున గెలుతు నానతీవె పురారీ!' 530

* నీ భక్తికి మెచ్చాను. నీ వేవరం కోరుకున్నా ఇస్తానని పలికాడు. అప్పుడు సుదక్షిణుడు పరమేశ్వరా! నీవు నిన్ను నమ్మినవారిని తప్పక రక్షిస్తావు. దేవా! నా తండ్రిని యుద్ధంలో వాసుదేవుడు సంహరించాడు. ఆ గోవిందుని నేను యుద్ధంలో గెలిచే ఉపాయం తెలియజేయి అని ప్రార్థించాడు.

తే. అనిన శంకరుఁ డతనికి ననియె ననఘ!, నీవు ఋత్విజులును భూసురావళియును
బ్రీతి నభిచార మొనరింప భూతయుక్తుఁ, డగుచు ననలుండు దీర్చు నీ యభిమతంబు'. 531

* అప్పుడు శంకరుడు అతనితో ఇలా అన్నాడు - అనఘా! నీవూ, ఋత్విజులూ, బ్రాహ్మణ శ్రేష్ఠులూ ప్రీతితో అభిచారహోమం చేస్తే అగ్ని దేవుడు నీ కోరిక నెరవేరుస్తాడు.

తే. అనిన నా చంద్రమౌళి వాక్యముల భంగి, భూరినియమముతో నభిచారహోమ
మొనరఁ గావింప నగ్ని యథోచితముగఁ, జెలఁగ దక్షిణవలమాన శిఖల వెలిఁగె. 532

* ఈ విధంగా శంకరుడు చెప్పగా పరమేశ్వరుని వాక్యానుసారం సుదక్షిణుడు గొప్పనియమాలతో అభిచారహోమం చేశాడు. అగ్నిదేవుడు దక్షిణదిశ వైపు వ్యాపిస్తున్న జ్వాలలతో వెలిగాడు.

వ. అందుఁ దామ్రశ్మశ్రుకేశకలాపంబును, నశనిసంకాశంబు లైన నిడుదకోఱలును, నిప్పులుప్పతిల్లు చూడ్కులును, ముడివడిన బొమలును, జేవురించిన మొగంబును గలిగి కృత్య యతి రౌద్రాకారంబునఁ బ్రజ్వరిల్లుచుఁ గుండంబు వెలువడి యనుదిన నిహన్యమాన ప్రాణిరక్తారుణ మృత్యుకరవాలంబు లీలం జూపట్టు నాలుకను సెలవుల నాకికొనుచు నగ్ని కీలాభీలంబగు శూలంబు గేలం దాల్చి భువన కోలాహలంబుగా నార్చుచు, నుత్తాల తాలప్రమాణ పాదద్వయహతులం దూలు పెంధూళి నింగిమ్రింగ, భూతంబులు సేవింప, నగ్నవేషయై, నిజవిలోచన సంజాత సముద్భూత నిఖిల భయంకరజ్వాలికా జాలంబున దిశాజాలంబు లోలిం బ్రేల్చుచు, నుద్వేగగమనంబున నగధరు నగరంబున కరుగుదేరఁ, బౌరజనంబులు భయాకులమానసులై దావదహనునిం గని పఱచు వనమృగంబుల చాడ్పునం బఱచి, సుధర్మాభ్యంత రంబున జూదంబాడు దామోదరునిం గని 'రక్షర' క్షేతి రవంబుల నార్తులయి 'కృష్ణ! కృష్ణ! పెనుమంటల బురంబు గాల్పం బ్రళయాగ్ని సనుదెంచె' నన వారిం జూచి 'యోడకోడకుఁ' డని భయంబు నివారించి, సర్వరక్షకుండైన పుండరీకాక్షుండు జగదంతరాత్ముండు గావునం దద్వృత్తాంతం బంతయుఁ దన దివ్య చిత్తంబున నెఱింగి కాశీరాజపుత్త్ర ప్రేరితయైన య మ్మహాకృత్యను నిగ్రహింపం దలంచి నిజపార్శ్వవర్తియై యున్న య ద్దివ్య సాధనంబు గనుంగొని యప్పుడు. 533

* అగ్నిజ్వాలల నుండి ఎఱ్ఱని జుట్టూ, పిడుగుల వంటి కోరలూ, నిప్పులు క్రక్కే చూపులూ, ముడివడిన కనుబొమలూ, జేవురించిన మొగంతో 'కృత్య' అతి భయంకరాకారంతో హోమకుండం నుంచి వెలువడింది. ఆ కృత్య మృత్యుదేవత కరవాలంలాగా కనిపిస్తున్న నాలుకతో పెదవులు తడుపుకుంటూ, అగ్నిజ్వాలలవంటి శూలాన్ని కేలదాల్చి, లోకం దద్దరిల్లేటట్లు బొబ్బలు పెడుతూ, తాటిచెట్లవంటి పాదాల తాకిడికి లేచిన దుమ్ము నింగినిండా వ్యాపించగా, భూతాలు సేవిస్తుండగా, దిగంబరంగా కళ్లనుంచి రాలే నిప్పులతో దిక్కులను కాల్చివేస్తూ అతివేగంగా శ్రీకృష్ణుని నగరానికి వచ్చింది. ద్వారకానగర వాసులంతా కృత్యను చూచి దావానలాన్ని చూచి పారిపోయే అరణ్య జంతువులలాగా పారిపోయి అంతఃపురంలో జూదమాడుతున్న శ్రీకృష్ణునితో ఈ విషయం వివరించారు. మన పట్టణాన్ని దహించడానికి ప్రళయకాలాగ్ని వచ్చింది. మమ్మల్ని రక్షించు రక్షించు అని ప్రార్థించారు. పుండరీకాక్షుడు వారిని భయపడవద్దని చెప్పి, జరిగిన సంగతినంతా మనస్సులో భావించి, కాశీరాజు పంపించిన కృత్యను సంహరించాలని భావించి తన చక్రాయుధాన్ని పరికించాడు.

సీ. భీమమై బహుతీవ్రధామమై హతరిపు స్తోమమై సుమహితోద్దామ మగుచుఁ
జండమై విజితమార్తాండమై పాలితాజాండమై విజయప్రకాండ మగుచు
దివ్యమై నిఖిలగంతవ్యమై సుజన సంభావ్యమై సద్భక్త సేవ్య మగుచు
నిత్యమై నిగమసంస్తుత్యమై వినమితాదిత్యమై నిర్జితదైత్య మగుచు

తే. విలయసమయ సముద్భూత విపులభాస్వ, దళికలోచన లోచనానల సహస్ర
ఘటిత పటుసటాజ్వాలికా చటుల సత్త్వ, భయదచక్రంబు కృత్యపైఁ బంపె శౌరి. 534

* భయంకరమైనదీ, శత్రువులను హతం గావించేదీ, సూర్యకాంతిని ధిక్కరించే కాంతి గలిగినదీ, అన్నివైపులా పయనించ గలిగినదీ, సుజనులచే స్తుతింపబడేదీ, భక్తులచే సేవించబడేదీ, దేవతలచే నమస్కరింప బడేదీ, దానవులను సంహరించేదీ, ప్రళయకాలంలోని పరమేశ్వరుని ఫాలనేత్రం నుంచి వెలువడిన జ్వలనజ్వాలా మాలికవలె భయంకరమైనదీ అయిన తన చక్రాయుధాన్ని శ్రీకృష్ణుడు కృత్యపై ప్రయోగించాడు.

వ. ఆదియును బ్రళయ వేళాసంభూత జీమూతసంఘాతప్రభూత ఘుమఘుమాటోప నినదాధరీకృత మహోదుస్సహ కహకహ నిబిడనిస్వన నిర్ఘోషపరిపూరిత బ్రహ్మాండకుహరంబును, నభ్రంలిహ కీలాసముత్కట పటు చిటపట స్ఫుట ద్విస్ఫులింగచ్ఛటాభీలంబును, సకలదేవతాగణ జయ జయ శబ్దకలితంబును, ననంతతేజో విరాజితంబును నగుచుం గదిసినం బంటింపక కంటగించు కృత్యను గెంటి వెంట నంటిన నది తన తొంటి రౌద్రంబు విడిచి మరలి కాశీపురంబు సొచ్చి పౌరలోకంబు భయాకులతం బొంది వాపోవ, రోషభీషణాకారంబుతో నప్పుడు ఋత్విజ్నికాయ యుతంబుగ సుదక్షిణుని దహించె, నత్తఱిఁ జక్రంబును దన్నగరంబు సౌధప్రాకార గోపురాట్టాలకాది వివిధవస్తువాహన నికరంబుతో భస్మంబు గావించి మరలి యమరులు వెఱఁగందఁ గమలలోచన పార్శ్వవర్తియై నిజ ప్రభాపుంజంబు వెలుఁ గొందఁ గొల్చియుండె నని చెప్పి మఱియు నిట్లనియె. 535

* ఆ చక్రాయుధం ప్రళయకాలంనాటి మేఘాలనుంచి పుట్టిన ధ్వనివంటి భయంకర ధ్వనితో, ఆకాశాన్నంటుతున్న అగ్నిజ్వాలలతో, సకల దేవతలు జయ జయధ్వానాలు చేస్తుండగా, అమిత తేజస్సుతో వెలుగొందుతూ కృత్యను సమీపించింది. తనను చూచి తడబడకుండా కంటిగించుకుంటున్న కృత్యను గెంటివేసి వెంటబడింది. అప్పుడు కృత్య తన పూర్వపు రౌద్రరూపాన్ని వదలి తిరిగి కాశీపురం వచ్చింది. మరలి వచ్చిన కృత్యను చూచి పౌరులంతా భయపడి శోకిస్తుండగా ఆ కృత్య రోషభీషణమైన ఆకారంతో ఋత్విజులతోపాటు సుదక్షిణుని దహించివేసింది. అప్పుడు శ్రీ కృష్ణుని చక్రాయుధం సౌధగోపుర ప్రాకారాలతో పాటు ఆ నగరాన్ని భస్మీపటలం చేసింది. దేవతలంతా ఆశ్చర్యపడేటట్లు శ్రీకృష్ణుని చెంతకు చేరింది అని శుకమహర్షి పరీక్షిత్తు మహారాజుతో చెప్పి కృష్ణ గాథను ఇంకా కొనసాగించాడు.

**క. మురరిపు విజయాంకితమగు, చరితము సద్భక్తిఁ దగిలి చదివిన వినినన్**
**దురితములఁ బాసి జను లిహ పర సౌఖ్యము లతనిచేతఁ బడయుదు రధిపా! 536**

* ఓ పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణుని విజయాలతో కూడిన కథను భక్తితో చదివినా వినినా, జనులు పాపరహితులై ఆ దేవుని దయచేత ఇహపరసౌఖ్యాలను పొందుతారు.

**వ. అనిన శుకయోగికి రాజయోగి యిట్లనియె. 537**

* ఈ విధంగా చెప్పిన శుకయోగితో రాజయోగి ఐన పరీక్షిత్తు ఇలా అన్నాడు.

## -: బలరాముండు ద్వివిదుఁడను వానరుని సంహరించుట :-

**క. బలభద్రుఁ డప్రమేయుం, డలఘుఁ డనంతుండు నతని యద్భుతకర్మం**
**బులు వినియు, దనియ దింకను, దెలియఁగ నా కానతిమ్ము దివ్యమునీంద్రా! 538**

* ఓ మునీంద్రా! బలరాముడు మహాత్ముడు. ఆయన కావించిన ఆశ్చర్యకరమైన పనులను గూర్చి విని కూడ నాకు తృప్తి కలగటం లేదు. ఇంకా వివరంగా ఆయనను గూర్చి నాకు చెప్పండి.

**వ. అనిన రాజునకు శుకుం డిట్లనియె. 539**

* అనగా రాజుతో శుకమహర్షి ఇలా అన్నాడు.

**క. జననాయక! విను సుగ్రీ, వుని సచివుఁడు మైందునకు సహోదరుఁ డనఁగా**
**వినుతికి నెక్కిన ద్వివిదుం, డను ప్లవగుఁడు నరకసఖ్యుఁ డతిదర్పితుఁడై. 540**

* ఓ రాజా! విను. సుగ్రీవునికి మంత్రి మైందుడు. వాని తమ్ముడు ద్వివిదుడనే పేరుగల వానరు డొకడున్నాడు. వాడు నరకాసురునికి చెలికాడు. మహాగర్విష్ఠి.

**సీ. చెలికానిపగఁ దీర్పఁ దలఁచి కృష్ణుం డేలు పురములు జనపదంబులు దహించి**
**సరి దుపవన సరోవరములు గోరాడి మందలఁ గొందలమందఁ జేసి**
**ప్రాసాదములు ద్రొబ్బి పరిఖలు మాయించి చతురంగ బలముల సమయఁ జేసి**
**పురుషుల సతులను భూధరగుహలలోఁ బెట్టి వాకిలి గట్టి బిట్టు నొంచి**

**తే. ఫలిత తరువులఁ ద్రుంచి సాధుల నలంచి, కోట లగలించి పడుచుల నీట ముంచి**
**ధరణి నిబ్బంగిఁ బెక్కుబాధలఁ జలంబు, పరఁగఁజేయుచు నొకనాఁడు ప్లవగవరుఁడు. 541**

* ఆ వానరుడు తన మిత్రుడైన నరకుని పగను తీర్చదలచి శ్రీకృష్ణుడు పరిపాలించే పట్టణాలనీ, పల్లెలనీ తగల పెట్టటం; వనాలనీ, సరోవరాలనీ నాశనం చేయటం, ఆవులమందలను బెదరించటం, సౌధాలను పడద్రోయటం, అగడ్తలను పూడ్చివేయటం, చతురంగ బలాలను సంహరించటం, స్త్రీ పురుషులను కొండగుహల్లో బంధించి బాధించటం, పండినచెట్లను విరిచివేయటం, కోటలను పడగొట్టటం, యువతులను నీళ్లలో ముంచటం మొదలైన పనులతో అందరినీ బాధిస్తూ ఉండేవాడు.

క. చతుర మృదు గీతరవము, న్నతి వీతెంచినఁ జెలంగి నగచరుఁ డా రై
వతగిరి కందరమున కా, యతిగతిఁ జని యందు నెత్త మాడెడు వానిన్. 542

* ఒకనా డా ద్వివిదుడు తనకు మనోహరమైన సంగీతం వినబడగా రైవతపర్వతం గుహకు వచ్చి అక్కడ జూదమాడుతూ ఉన్న బలరాముణ్ణి చూచాడు.

చ. లలితవినీలవస్త్రుని విలాసవతీయుతుఁ జంద్రచంద్రికా
కలిత మహోన్నతాంగు మణికాంచన దివ్యవిభూషణోన్నతున్
విలసితవారుణీ సమదవిహ్వల లోచనుఁ గాంచె సీర ని
ర్దళిత రిపుక్షితీశ నిజధాముని రాముని కామపాలునిన్. 543

* నల్లనివస్త్రం ధరించినవాడూ, యువతులమధ్యలో ఉన్నవాడూ, పండువెన్నెలలాగా చల్లని తెల్లని ఉన్నతమైన అవయవాలు కలిగినవాడూ, మణిమయాలైన దివ్యాభరణాలను ధరించినవాడూ, మత్తుపానీయం త్రాగిన మైకంలో చంచలమైన కన్నులు గలవాడూ, శత్రురాజుల పట్టణాలను ధ్వంసం చేసినవాడూ, కామపాలుడూ అయిన బలరాముణ్ణి అక్కడ ఆ ద్వివిదుడు చూచాడు.

సీ. కనుఁగొని తత్పురోగమ భూమిరుహశాఖ, లెక్కి యూఁచుచుఁ జాల వెక్కిరించుఁ;
గికురించుచును బండ్లిగిల్చి చూపుచు వెసఁ గొమ్మకొమ్మకు నుఱుకుచు నదల్చుఁ;
దోఁక నూరక మేను సోఁకఁగ నులివెట్టు; వెడవెడ నాలుక వెడలఁ బెట్టు;
బరుల నఖంబుల గిరగిర గోఁకుచుఁ బొరిఁ బొరి ఫలములు గఱచివైచు;

తే. గోళ్ళు తెగ గొర్కి యుమియును; గుదము సూపు;, బలసి మర్కటజాతి యి ప్పగిదిఁ జేయఁ
గోపమున హలధరుఁ డొక గుండు వైవ, దానిఁ దప్పించుకొని ప్రల్లదమున నతని. 544

* అలా చూచినవాడై ఆ వానరుడు బలరామునికి ముందుభాగంలో ఉన్న చెట్లకొమ్మలను ఊపుతూ, వెక్కిరిస్తూ, తప్పించుకుంటూ, ఒకకొమ్మపై నుంచి మరొక కొమ్మపైకి దుముకుతూ, తన తోకను బలరామునికి తాకిస్తూ, నాలుక వెళ్ళబెడతూ, గోళ్ళతో గోకుతూ, పండినపండ్లను కొరికి పారవేస్తూ- ఇంకా అనేకవిధాలుగా ఏవేవో వెకిలిచేష్టలు చేస్తూ ఉన్నాడు. అవి చూచి బలరాముడికి కోపం వచ్చి వాణ్ణి ఒక రాతితో కొట్టాడు.

క. నగి యాసవకలశముఁ గొని, జగతీరుహశాఖ యెక్కి చాపలమున న
జ్జగతిపయి వైచెఁ దద్ఘట, మగలగఁ; నది చూచి కోప మగ్గల మొదవన్. 545

* వా డా రాతిదెబ్బను తప్పించుకుని నవ్వుతూ బలరామునికి సమీపంలో ఉన్న కల్లుపాత్రను తీసుకపోయి చెట్టుకొమ్మపై కెక్కి దాన్ని నేలమీద విసరికొట్టాడు. అది పగిలిపోయింది. ఆ కోతి చేష్టలు చూచి బలరాముడికి చాలా కోపం వచ్చింది.

వ. మఱియును. 546

క. సీరినిఁ దన మనమున నొక, చీరికిఁ గైకొనక కదిసి చీరలు చింపన్
వారక దా భువిజనములఁ, గారించుట మాన్పఁ దలఁచి ఘనకుపితుండై. 547

* బలరాముణ్ణి లక్ష్య పెట్టకుండా ఆ వానరుడు అతని పరివారాన్ని సమీపించి వారి వస్త్రాలను చించివేశాడు. అపుడు బలరాముడు కోపంతో, ఆ వానరుడు ప్రజలను బాధించటం మాన్పించాలనే నిశ్చయానికి వచ్చాడు.

వ. ఇట్లు కోపోద్దీపిత మానసుండై కనుంగొని హలాయుధుం డప్పుడు. 548

* హలాయుధుడు ఆగ్రహోదగ్రుడైనాడు.

చ. ముసలముఁ దీవ్రశాతహలమున్ ధరియించి సమస్తచేతన
గ్రసనమునాఁడు పొంగు లయకాలునిభంగి నదల్చి నిల్వ; వా
డసదృశవిక్రమక్రమ విహార మెలర్ప సమీపభూజమున్
వెసఁ బెకలించి మస్తకము వ్రేసెఁ జలంబు బలంబు చొప్పడన్. 549

* ముసలాయుధాన్ని ధరించి ప్రళయకాలంనాడు విజృంభించే కాలయముడిలాగా బలరాముడు ద్వివిదుణ్ణి అదలించి నిలబడ్డాడు. వానరుడు కూడా మహాపరాక్రమంతో సమీపంలో ఉన్న చెట్టును పెకలించి బలరాముని తలపైన బలంగా కొట్టాడు.

వ. ఇట్లు వ్రేయ బలుం డప్పుడు. 550

చ. ఉరవడి దండతాడిత మహోరగుభంగిఁ గడంగి వీర సా
గరమన నేఁచి హేమకటకంబుల నొప్పు సునందనామ భీ
కర ముసలంబునన్ ద్వివిదుకంఠము వ్రేసినఁ బొల్చె వాఁడు జే
గురు గల కొండచందమునఁ గోయని యార్చి సురల్ నుతింపఁగన్. 551

* ఇలా ద్వివిదునిచేత దెబ్బతిన్న బలరాముడు కఱ్ఱదెబ్బతిన్న కాలసర్పంలాగా చెలరేగినవాడై బంగారుకట్లు వేసిన 'సునంద' అనే పేరుగల తన రోకలితో ద్వివిదుణ్ణి కొట్టాడు. బలరాముడు కొట్టిన దెబ్బకు వానరుని శరీరంనుంచి రక్తం చిమ్మింది. దాని కారణంగా వాడు ఎర్రని కొండవలె కన్పడ్డాడు. ఇది చూచి దేవతలు ఎంతో సంతోషించారు.

మత్త. అంత వాఁడొకయింత మూర్ఛిలి యంతలోఁ దెలివొంది దు
ర్దాంతభూరి భుజావిజృంభణుఁడై మహీజము పూన్చి దై
త్యాంతకాగ్రజు వ్రేసె; వ్రేసిన నాగ్రహంబున దాని నిం
తింతలై ధర రాలఁ జేసె నహీనవిక్రమశాలియై. 552

* బలరాముడు కొట్టిన దెబ్బకు వాడు క్షణకాలం మూర్ఛపోయి, కొంతసేపటిలో తేరుకొన్నవాడై అతిశయించిన భుజబలంతో ఒక పెద్దచెట్టు పెరికి దానితో బలరాముణ్ణి కొట్టాడు. బలరాము డావృక్షాన్ని మొక్కవోని పరాక్రమంతో ముక్కలు ముక్కలు చేశాడు.

**క. మఱియును జల ముడుగక వెసఁ, దరుచరుఁ డొకతరువు వ్రేయఁ దాలాంకుఁ డనా**
**దరమునఁ దునిమిన వెండియుఁ, దొరఁగించెఁ గుజంబు లతఁడు దోర్ద్పేఁ దునుమన్.** 553

* వానరుడు పట్టువిడువకుండా చెట్లను పెళ్ళగించి బలరామునిమీద వేశాడు. వాడు వేసే వృక్షాల నన్నిటినీ బలరాముడు నడుమలోనే నరికివేశాడు.

**క. ఆ చందంబున వనచరుఁ, డేచి మహీరుహచయంబు లెల్లను హలిపై**
**వైచి యవి శూన్య మగుటయుఁ, జూచి శిలావృష్టిఁ గురిసె సుర లగ్గింపన్.** 554

* ఆ విధంగా ద్వివిదుడు సమీపంలో ఉన్న చెట్లన్నీ పెరికి బలరామునిమీద వేశాడు. అవన్నీ వృథా అయిపోగా రాళ్ళవర్షం కురిపించాడు.

**క. బలుఁ డపుడు ఱాలు తుమురై, యిల రాలఁగఁ జేసి యార్వ నే పుడుగక యా**
**వలిముఖుఁడు తాలసన్నిభ, ము లయిన నిజబాహుదండముల నుగ్రుండై.** 555

* వాడువేసే రాళ్ళనన్నిటినీ బలరాముడు పొడిపొడి చేశాడు. దానితో ద్వివిదుడు తాటి చెట్లవంటి తన బాహువులతో బలరామునితో ముష్టియుద్ధానికి తలపడ్డాడు.

**క. వడిఁ బిడుగుఁ బోని పిడికిటఁ, బొడిచిన వడి సెడక బలుఁడు ముసలము హలమున్**
**విడిచి ప్లవంగుని మెడఁ గడు, వెడవెడ బిగియించె గ్రుడ్లు వెలి కుఱుకంగన్.** 556

* ద్వివిదుడు బలరాముణ్ణి పిడుగులాంటి పిడికిటితో పొడిచాడు. అప్పుడు బలరాముడు తన చేతిలోని రోకలినీ, నాగలినీ ప్రక్కన పెట్టి కనుగ్రుడ్లు బయటికి వచ్చేటట్లు రెండు చేతులతో ద్వివిదుని మెడ గట్టిగా బిగించాడు.

**క. వదనమునఁ జెవుల రుధిరము, మెదడును దొరఁగంగ వాఁడు మేదిని మీఁదం**
**జదికిలఁ బడి యొక యింతయు, మెదలక మిడుకంగలేక మృతిఁ బొందె నృపా!** 557

* ఓ రాజా! బలరాము డావిధంగా ద్వివిదుని గొంతు నులుమగా, వాని ముఖంలో నుంచీ, చెవుల్లో నుంచీ రక్తం స్రవించింది. మెదడు చెదరిపడింది. వాడు దభీలుమని భూమిమీద పడి చలనం మాని ప్రాణాలు విడిచాడు.

**తే. వానిపాటున కప్పుడు వనసమేత, మగుచు నా శైలరాజ మల్లల్ల నాడె;**
**సురగణంబులు రాముపై సురభి కుసుమ, వృష్టి గురియించి రతుల సంతుష్టి మెఱసి.** 558

* ద్వివిదుని శరీరపాతానికి రైవతపర్వతం వణికిపోయింది. దేవతలు ఆనందంతో బలరామునిమీద పుష్పవర్షం కురిపించారు.

వ. ఇ వ్విధంబున భువనకంటకుండైన దుష్టశాఖామృగేంద్రుని వసుంధరకుం బలిచేసి సకల జనంబులుఁ బరమానంద కందళిత హృదయారవిందులై తన్ను నందింప న య్యదునందనుండు నిజనగరంబున కరుదెంచె; నని శుకుండు వెండియు న మ్మనుజపతి కిట్లనియె. 559

* ఈ విధంగా లోకకంటకుడైన ఆ వానరుణ్ణి సంహరించి సమస్త ప్రజలూ ఆనందంలో తన్ను పొగడుతూ ఉండగా బలరాముడు తన నగరానికి విచ్చేశాడు అని చెప్పి శుకుడు తిరిగి పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

## -: బలరాముండు హస్తినాపురమును గంగలోఁ ద్రోయఁ బూనుట :-

సీ. కోరి సుయోధను కూఁతురు సర్వలక్షణములు గల్గి లక్షణ యనంగ
మహినొప్పు కన్యకామణి వివాహంబునఁ జక్రహస్తుని తనూజాతుఁడైన
సాంబుఁడు బలసాహసమున నెత్తుక పోవఁ గౌరవు లీక్షించి కడఁగి క్రొవ్వి
'పడచువాఁ డొకఁ డదె బాలికఁ గొనిపోవు చున్నాఁడు గై కొన కుక్కు మిగిలి

తే. యిట్టి దుర్మదుఁ గయిముట్టి పట్టి తెచ్చి, జనులు వెఱఁ గందఁ బెఱపట్టి యునుతుమేని
యదువులు మనల నేమి సేయంగఁ గలరొ, యనుచుఁ గురువృద్ధజనముల యనుమతమున.560

* రాజా! దుర్యోధనుని కుమార్తె పేరు లక్షణ, ఆమె సమస్త శుభలక్షణాలు కలిగిన కన్య. శ్రీకృష్ణుని కుమారుడైన సాంబుడు వివాహ సమయంలో ఆమెను ధైర్యసాహసాలతో ఎత్తుకుపోయాడు. అదిచూచి కౌరవులు 'కుర్రవా డొకడు మన అమ్మాయిని దౌర్జన్యంగా తీసుకుపోతున్నాడు. ఆ పొగరుబోతును బంధించి తెచ్చి చెరసాలలో వేద్దాము. యాదవులు మనలను ఏమిచేస్తారో చూద్దాం' అని పెద్దలైన భీష్మాదుల అనుమతిని పొందారు.

వ. ఇట్లు గడంగి యుద్ధసన్నద్ధులై బలశౌర్యోపేతులగు కర్ణ శల్య భూరిశ్రవో యజ్ఞకేతు సుయోధనాదులు సమున్నతరథారూఢులై కూడ నరిగిన వారలఁ గనుంగొని జాంబవతీనందనుండు మందస్మిత వద నారవిందుం డగుచు సింగంబు భంగి గర్జించుచు మణిదీప్తం బైన చాపంబుఁ బూని నిల్చిన వారును సాంబు నదల్చి నిలునిలు మని పలికి. 561

* మహాపరాక్రమోపేతులైన కర్ణ శల్య భూరిశ్రవ యజ్ఞకేతు దుర్యోధనాదులు యుద్ధసన్నద్ధులై చెలరేగి రథాలెక్కి సాంబుణ్ణి వెంబడించారు. సాంబుడు వారిని చూచి చిరునవ్వులు చిందులాడే ముఖారవిందంతో సింహంలాగా గర్జిస్తూ ధనుర్ధారియై ఎదురొడ్డి నిలబడ్డాడు. కౌరవులు సాంబుని పైకి తారసిల్లారు.

తే. చండకోదండ ముక్త నిశాత విశిఖ, జాల మందంద వఱప యాభీలముగను
నందనందన నందన స్యందనంబు, ముంచి రచలేంద్రమును ముంచు మంచు పగిది. 562

* కౌరవులు ధనుస్సులు ఎక్కుపెట్టి సాంబునిమీద వాడియైన బాణాలను ప్రయోగించి 'మంచు మహాపర్వతాన్ని ముంచి వేసిన విధంగా' అతడి రథాన్ని కప్పివేశారు.

వ. మఱియును. 563

శా. శౌర్యాటోప విజృంభణంబుల సరోజాతాక్షసూనున్ సురా
హార్యస్థైర్యుని మీఁద నేయ నతఁడుద్యద్భూరి బాహాబలా
వార్యుండై శితసాయకాలి నవి మాయం జేసినన్ దేవతా
తూర్యంబుల్ దివి మ్రోసెఁ; నంత నతఁ డస్తోకప్రతాపోన్నతిన్. 564

* ఈ విధంగా మేరుపర్వతంతో సమానమైన ధైర్యంగల సాంబునిమీద కౌరవులు పరాక్రమాతిశయంతో బాణాలను ప్రయోగించారు. అతడు భుజబల సంపద మెరయగా, ఆకసంలో దేవదుందుభులు మ్రోగగా కౌరవులు తనపై వేసిన బాణా లన్నింటినీ ధ్వంసం చేశాడు.

వ. ఇట్లు గడంగి బాణజాలంబులు పరఁగించి యందఱ కన్నిరూపులై రథ సూత ధ్వజ పతాకాతపత్రంబులు చూర్ణంబులు గావించి విరథులం జేసి వారల మెయిమఱవు లఱువుళ్ళు గావించి యొక్కొక్కనిఁ బెక్కు బాణంబుల నుచ్చిపో నేసిన వారలు శోణిత దిగ్ధాంగులై కుసుమిత కింశుకంబులం బోలియుండిరంత.565

* అపారపరాక్రమంతో సాంబుడు కౌరవుల మీద బాణసమూహాన్ని ప్రయోగించి అందరకూ అన్ని రూపాలతో కనపడతూ వారి రథాలనూ, గుర్రాలనూ, సూతులనూ, కేతనాలనూ పొడిపొడి చేసి వారు ధరించిన కవచాలను సైతం ఛేదించి, వారిశరీరాలలో దూసుకుపోయేటట్లు శరపరంపర ప్రయోగించాడు. సాంబుని శరజాలంవల్ల కలిగిన గాయాలనుంచి కారిన రక్తం కారణంగా కౌరవులు పుష్పించిన కింశుక వృక్షాల్లాగా కనబడ్డారు.

ఉ. వార లనేకులయ్యు బలవంతులు నయ్యు మహోగ్రసంగ రో
దార పరాక్రమ ప్రకటదక్షులు నయ్యుఁ గుమారకున్ జగ
ద్వీరుని నొక్కనిం జెనకి వ్రేలును వంపఁగలేక సిగ్గునం
గూరిన చింత నొండొరులఁ గూడుచు విచ్చుచు వెచ్చనూర్పుచున్. 566

* కౌరవులలో బలవంతులూ యుద్ధవిశారదులూ పెక్కుమంది ఉండికూడా ఒక్క సాంబునితో తలపడి వాని వ్రేలు కూడా వంచలేక పోయారు. అందుచేత వారు సిగ్గుపడి అవమానభారంతో చాలా బాధపడ్డారు. నిట్టూర్పులు నిగుడించారు.

వ. మగిడి సమరసన్నద్ధులై సంరంభించి. 567

* కౌరవులు తిరిగి యుద్ధానికి సిద్ధమై సాంబుణ్ణి ఎదుర్కొన్నారు.

ఉ. అందఱు నొక్కపెట్ట దనుజాంతకనందనుఁ జుట్టు ముట్టి యం
దంద నిశాత సాయక చయంబుల ముంచి రథంబు నుగ్ర లీ
లం దునుమాడి చాపము చలంబునఁ ద్రుంచి హయాలిఁ జంపి సూ
తుం దెగటార్చి యంత విరథుం డగుడున్ వెసఁ జొచ్చి పట్టినన్. 568

* అందరూ ఒక్క మారుగా సాంబుణ్ణి ముట్టడించి పదునైన బాణాలను ప్రయోగించారు. అతడి రథాన్ని ధనుస్సునీ విరగగొట్టారు. గుర్రాలనూ, సూతుణ్ణి చంపి విరథుణ్ణి చేసి బంధించారు.

**తే. బాలకుఁడు చేయునది లేక పట్టువడియెఁ, గౌరవులు దమ మనములఁ గౌతుకంబు**
**లొలయఁ సాంబునిఁ గన్యకాయుక్తముగను, బురమునకుఁ దెచ్చి రతులవిభూతి మెఱసి. 569**

* బాలకుడైన సాంబుడు కౌరవులకు పట్టుబడ్డాడు. వారు సంతోషంతో గంతులు వేస్తూ సాంబుణ్ణి కన్యకాసహితంగా పట్టణానికి తీసుకుని వచ్చారు.

**వ. అంత ద్వారకానగరంబున. 570**

**ఉ. జాంబవతేయు వార్త యదుజాతులు నారదయోగిచే సమ**
**స్తంబును విన్నవా రగుచు సంగరకౌతుక ముప్పతిల్లఁ జి**
**త్తంబులఁ గౌరవాన్వయకదంబము నొక్కట నుక్కడంచు కో**
**పంబున నుగ్రసేనజనపాలు ననుజ్ఞ ననూన సైన్యముల్. 571**

* ఇక్కడ ద్వారకానగరంలో నారదమహర్షి వల్ల సాంబుడు పట్టుబడ్డాడనే వార్తను యాదవవీరులు విన్నారు. యుద్ధోత్సాహం అతిశయించగా కౌరవవంశాన్ని నాశంచేయడానికి సిద్ధమై మహారాజైన ఉగ్రసేనుడి అనుమతిని పొంది సర్వసైన్యసమేతంగా కదిలారు.

**తే. కూడి నడవంగఁ గని వారితోడ బలుఁడు, ధార్తరాష్ట్రులు మనకు నెంతయును డాసి**
**నట్టి బంధులు; వారిపై నిట్టి యలుక, నెత్తి చనుచుంట యిది నీతియే తలంప? 572**

* అప్పుడు బలరాముడు యాదవవీరులతో ఇలా అన్నాడు- కౌరవులు మనకు దగ్గర చుట్టాలు, వారి మీదికి యుద్ధానికి వెళ్ళడం నీతి కాదు.

**వ. అని వారల వారించి తత్క్షణంబ బంధు ప్రియుండైన బలరాముం డనలార్క సంకాశంబగు కాంచనరథం బెక్కి యనురక్తులైన భూసురులును, నుద్ధవాదులగు కులవృద్ధులును సేవింపం గరిపురంబునకుం జని తత్పురోపకంఠవనంబున సురభికుసుమ ఫలభరిత తరుచ్ఛాయా విరచిత చంద్రకాంత శిలాతలంబునందు వసియించి, మహితగ్రహ మధ్యగతుండైన పూర్ణచంద్రు ననుకరించి యుండె; నంతఁ గార్యబోధనంబు సేయుటకై కౌరవులకడకుఁ బ్రబుద్ధుండైన యుద్ధవునిం బనిచినం జని యతం డాంబికేయునకు ధనురాచార్యాపగాతనూభవ సుయోధనులకుం బ్రణమిల్లి వారిచేత నభినందితుండై యిట్లనియె. 573**

* బంధుప్రీతి గల బలరాముడు యాదవసైన్యాన్ని నిలువరించి బంగారుమయమైన రథాన్ని అధిరోహించి అనురాగయుక్తులైన విప్రులతోనూ, కులవృద్ధులతోనూ కలిసి హస్తినాపురానికి వెళ్ళాడు. అక్కడ పట్టణానికి సమీపంలో ఉన్న వనంలో సుగంధసుమాలతో కూడిన చెట్లనీడలో ఉన్న చంద్రకాంత శిలావేదికమీద, గ్రహాల నడుమ చంద్రుని లాగా ప్రకాశిస్తూ కూర్చున్నాడు. అనంతరం కర్తవ్యం బోధించటానికై

కౌరవుల దగ్గరకు ఉద్ధవుణ్ణి పంపించాడు. ఉద్ధవుడు కౌరవుల కొలువుకూటానికి వెళ్లి ధృతరాష్ట్ర భీష్మ ద్రోణ సుయోధనులకు నమస్కారం చేసి, వారి ప్రశంసలు అందుకొని వారితో ఇలా అన్నాడు.

సీ. 'భూరియశోధనులార! తాలాంకుండు చనుదెంచి నగరోపవనమునందు
నున్నవాఁ'డనిన వా రుత్సాహమున బలుఁ బొడగను వేడుక బుద్ధిఁ దోఁపఁ
దనరారు కానికల్ గొని చని యర్ఘ్యపాద్యాది సత్కృతులు నెయ్యమునఁ జేసి
ధేనువు నిచ్చి సమ్మానించి యందఱు నందంద వందనం బాచరించి

తే. యుచితభంగిని నచటఁ గూర్చున్న యెడను, 'గుశలమే మీకు? మాకును గుశల' మనుచుఁ
బలికి రాముఁడు కురునరపాలుఁ జూచి, యచటి జనములు వినఁగ నిట్లనియెఁ దెలియ. 574

∗ 'ఓ మహాశయులారా! బలరాముడు వచ్చి పట్టణానికి సమీపంలో ఉన్న ఉపవనంలో విడిదిచేశాడు.' ఉద్ధవుడు ఇలా చెప్పగానే కౌరవులు సంతోషంతో బయలుదేరి బలరాముడికి అర్ఘ్యపాద్యాదు లర్పించి కానుక లిచ్చి గౌరవించారు. బలరాముడు తనచుట్టూ కూర్చున్నవారి నందరిని కుశలప్రశ్నలతో సంభావించి, అందరూ వినేటట్లుగా దుర్యోధనునితో ఇలా అన్నాడు.

ఉ. 'మా నరనాథునాజ్ఞ నిజమస్తములన్ ధరియించి కౌరవుల్
మానుగఁ జేయు టొప్పగుఁ; గుమారకు నొక్కనిఁ బెక్కు యూథపుల్
పూనిన లావుమై నెదిరి పోర జయించుట మీఁది తప్పు; త
ప్పైనను గాచె బాంధవహితాత్మకుఁడై మనుజాధినాథుఁడున్. 575

∗ మా రాజైన ఉగ్రసేనుని ఆజ్ఞను మీరు మన్నించక తప్పదు. ఇంతమంది సేనాధిపతులు ఒక్కటై బాలకుణ్ణి ఒక్కణ్ణి బంధించటం తప్పు. ఐనా, మారాజు బంధువుల క్షేమం కోరి మీరు చేసిన తప్పును మన్నించాడు.

క. అను మాటలు విని కౌరవ, జననాయకుఁడాత్మ నలిగి 'చాలుఁ బురే? యే
మనఁ గలదు కాలగతి? చ, క్కనఁ గాలం దొడుగు పాదుకలు దల కెక్కెన్. 576

∗ బలరాముడి మాటలు దుర్యోధనునికి చాలా కోపం తెప్పించాయి. 'చాలు చాలు! కాలవైపరీత్యం! కాళ్ళకు తొడిగే చెప్పులు తలమీదికి ఎక్కాయి!'

ఆ. మనము బంధువరుస మన్నించు మన్ననఁ, గాదె రాజ్యభోగగరిమఁ బొదలి
వసుధఁ బేరు గలిగి వాసికి నెక్కుటఁ, దమకు ననుభవింపఁ దగని యట్టి. 577

∗ బంధువులు కదా అని గౌరవించటం చేతనే యాదవులు పేరు ప్రఖ్యాతులను గడించి తమకు యోగ్యంకాని ఛత్రచామరాలను ధరిస్తూ ఉన్నారు.

వ. సితచ్ఛత్ర చామర శంఖ కిరీట చిత్రశయ్యాసౌధ సింహాసనంబులు గైకొనుట మన మందేమేలంబునం గాదె? యిట్టిచో సరివారునుం బోలె నూరక గర్వించు యదుకులులతోడి సంబంధసఖ్యంబులు సాలుఁ;

**బాములకుఁ బాలు వోసి పెంచిన విషంబు దప్పునే? మమ్ముం దమ పంపుసేయు మనుట సిగ్గులేకుంటఁ గాదె! యదియునుంగాక దివ్యాస్త్ర కోవిదులైన గంగానందన గురు కృపాశ్వత్థామ కర్ణాది యోధవీరులకున్ లోఁబడ్డవానిని మహేంద్రునకైనను విడిపింపఁ వచ్చునే? యహహా! వృథాజల్పంబుల కేమిపని?' యని దుర్భాష లాడుచు దిగ్గున లేచి నిజమందిరంబునకుం జనియె; నప్పుడు హలాయుధుం డమ్మాటల కదిరిపడి. 578**

* పోనీలెమ్మని మనం ఉపేక్ష వహించడంచేత యాదవులు శంఖ కిరీట సింహాసనాది భోగాలను అనుభవిస్తూ ఉన్నారు. మనతో సమానుల్లాగా విర్రవీగే యాదవులతో స్నేహసంబంధాలు చాలు. పాములకు పాలుపోసి పెంచిన మాత్రం చేత విషం తగ్గుతుందా? తమమాట వినవలసిందిగా మమ్మ ఆజ్ఞాపించటం సిగ్గులేని తనం కాదా? అంతేకాకుండా భీష్మ ద్రోణ కర్ణాది యోధవర్గానికి చిక్కి లోబడిన వాణ్ణి విడిపించటం దేవేంద్రుని కైనా సాధ్యమా? నిరుపయోగమైన మాటలతో పని యేముంది? అని పరుషంగా మాట్లాడుతూ దిగ్గున లేచి తన సౌధానికి వెళ్ళాడు. దుర్యోధనుని పరుషవాక్కులకు బలరాముడికి చాలా ఆగ్రహం వచ్చింది.

**ఉ. కౌరవుఁ డాడి పోయిన యగౌరవభాషల కాత్మఁ గిన్క దై**
**వాఱఁగ నుల్ల సత్త్రపశ యభానుని కై వడి మండి చండ రో**
**షారుణితాంబకుం డగుచు యాదవవృద్ధులఁ జూచి పల్కెఁ 'బెం**
**పారిన రాజ్యవైభవ మదాంధుల మాటలు మీరు వింటిరే? 579**

* దుర్యోధనుడు పల్కిన గౌరవహీనమైన మాటలకు బలరాముని కళ్ళు కోపంతో ఎర్రబడ్డాయి. ప్రళయకాలంనాటి ప్రచండ భాస్కరునిలాగా మండిపడ్డాడు. తన సమీపంలో ఉన్న యాదవ వృద్ధులను చూచి ఇలా అన్నాడు; రాజ్యవైభవంవల్ల కలిగిన మదంతో కళ్ళు మూసుకుపోయిన దుర్యోధనుడి మాటలు విన్నారు. కదా!

**తే. శ్రీమదాంధులు సామంబుచేతఁ జక్కఁ, బడుదురే యెందు? బోయఁడు పసులఁ దోలు**
**పగిది నుగ్రభుజా విజృంభణ సమగ్ర, సుమహితాటోప మనిలోనఁ జూపకున్న. 580**

* బోయవాడు పశువులను తోలేవిధంగా యుద్ధరంగంలో భుజబల పరాక్రమం చూపకపోయినట్లయితే ఐశ్వర్యగర్వంతో గుడ్డివారైన కౌరవులు మంచిమాటలతో చక్కబడరు.

**క. కౌరవుల సమయఁజేయ ను, దారత యదువీరవరులు దామోదరుఁడున్**
**రా రా వల దని యచ్చట, వారించితిఁ గాదె బంధువత్సల యుక్తిన్. 581**

* కౌరవులను నాశనం చేయటానికి యాదవవీరులూ, శ్రీకృష్ణుడు వస్తూ ఉండగా రా నక్కరలేదని బంధుప్రీతితో నేను వారిని వారించాను కదా!

**వ. అదియునుం గాక. 582**

సీ. ఏ దేవు భృత్యులై యింద్రాది దిక్పాల వరులు భజింతురు వరుసతోడ
నే దేవు మందిరం బేపారు దేవతా తరుసభావిభవసుందరతఁ జెంది
యే దేవు పదయుగం బేప్రొద్దు సేవించు నఖిల జగన్మాతయైన లక్ష్మి
యే దేవు చారుసమిద్ధకళాంశ సంభవులము పద్మజభవులు నేను

తే. నట్టి దేవుండు దుష్టసంహారకుండు, హరి ముకుందుండు పంపుసేయంగ నొప్పు
నుగ్రసేనుని రాజ్యసమగ్రగరిమ, యంతయును దార యిచ్చిన దంట! తలఁప. 583

* అంతేకాదు. ఏ దేవునికి సేవకులై యింద్రాది దిక్పాలురు బారులుదీరి భజిస్తారో, ఏ దేవుని మందిరం కల్పవృక్షాది దేవతాతరువులతో అతిశయిస్తూ ఉంటుందో, ఏ దేవుని పాదపద్మాలను జగన్మాతయైన లక్ష్మీదేవి సేవిస్తూ ఉంటుందో, నేనూ బ్రహ్మ ఇద్దరమూ ఏ దేవుని అంశవల్ల జన్మించామో- అటువంటి దుష్ట సంహారకుడైన శ్రీకృష్ణుని ఆజ్ఞతో ఉగ్రసేనుని రాజ్యసంపద విలసిల్లుతూ ఉంది. దానిని ఈ కౌరవులు తామే ఇచ్చారట; విన్నారా!

చ. అదియును గాక యెవ్వని పదాంబుజ చారురజోవితాన మా
త్రిదివ నరాది దిక్పతి కిరీటములందు నలంకరించు; భూ
విదితపుఁ దీర్థముం గడు బవిత్రము సేయును; నట్టి కృష్ణుచేఁ
బొదలిన రాజ్యచిహ్నములఁ బొందఁగ రా దఁట యేమిచోద్యమో! 584

* అంతే కాకుండా ఎవని పాదపద్మపరాగం దేవతల, మానవుల, దిక్పాలుర కిరీటాలను అలంకరిస్తోందో, పవిత్రతీర్థాలను సైతం పునీతం చేస్తుందో, అలాంటి కృష్ణునిచేత ఇవ్వబడ్డ రాజ్యచిహ్నాలను ధరించటానికి మేము అర్హులం కాదట. ఇదేమి ఆశ్చర్యం!

క. తామఁట తలఁపం దల లఁట, యేమఁట పాదుకల మఁటఁ గణింపఁగ రాజ్య
శ్రీమదమున ని ట్లాడిన, యీ మనుజాధముని మాట కేమన వచ్చున్? 585

* తాము శిరస్సు లట, మేము చెప్పుల మట. రాజ్యమదంతో ఇలా వాగిన యీ నీచుణ్ణి గూర్చి యే మనాలి?

వ. అని సక్రోధమానసుండై యప్పుడు. 586

క. ధారుణి నిటమీఁదట ని, ష్కౌరవముగఁ జేయకున్నఁ గా దని యుగ్రా
కారుండై బలభద్రుఁడు, సీరము వెసఁబూన్చి లావుఁ జేవయు నెసఁగన్. 587

* ఇలా అంటూ బలరాముడు మహాక్రోధాన్ని ప్రదర్శించాడు 'ఈ భూమిమీద కౌరవవంశాన్నే లేకుండా చేయక తప్పదు. ఇంకో మార్గం లేదు' అని బలరాముడు ఆగ్రహోదగ్రస్వరూపంతో పరాక్రమం ప్రదర్శించుతూ తన నాగలిని ఎత్తి పట్టుకొన్నాడు.

వ. ఇట్లు పూని కౌరవరాజధానియైన కరినగరంబు కడతల హలాగ్రంబును జొనిపి య ప్పుటభేదన విస్తారంబగు గడ్డ భుజాగర్వ దుర్వారుండై పెకలించి తిగిచి గంగాప్రవాహంబునం గడఁద్రోయ

గమకించిన నప్పుడు మహాజలమధ్య విలోలంబగు నావ చందంబున నన్నగరంబు వడవడ వడంకుచు గోపుర వప్ర ప్రాకార సౌధాట్టాలక తోరణ ధ్వజ ద్వార కవాట కుడ్య వీథీ యుతంబుగా నొడ్డగెడవైనఁ బౌరజనంబులు పుడమి నడుగు లిడంగ రాక తడంబడుచు, నార్తులై కుయ్యిడుచుండి; రట్టియెడ న మ్మహోత్పాతంబులు గనుంగొని తాలాంకుండు గినుక వొడమి కావించిన యుపద్రవంబుగా నెఱింగి దానికిఁ బ్రతీకారంబు లేమిని గళవళంబున భయాకుల మానసులై పుత్ర మిత్ర కళత్ర బంధు భృత్య పౌరజన సమేతంబుగా భీష్మదుర్యోధనాది కౌరవులు వేగంబున నతని చరణంబుల శరణంబులుగాఁ దలంచి, సాంబునిఁ గన్యకాయుక్తంబుగా ననేక మణిమయ భూషణాంబర జాలంబుతోఁ గొనివచ్చి దండప్రణామంబు లాచరించి కరకమలంబులు మొగిడ్చి యిట్లనిరి. 588

* ఈ విధంగా బలరాముడు తన హలాన్ని పైకెత్తి కౌరవ రాజధాని అయిన హస్తినాపురం చిట్టచివరి భాగంలో నాగలిచివరి భాగాన్నిచొప్పించి ఆ పట్టణాన్ని మొత్తం పెకలించి గంగలో కలపటానికి ఉద్యుక్తుడైనాడు. ఆ సమయంలో హస్తినాపురం సముద్ర జలాల్లో తిరుగపడ్డ పడవలాగా అయింది. ఆ పట్టణం గోపురప్రాకారసౌధాలతో సహ ఒకవైపుకు ఒరిగింది. పౌరులు హాహాకారాలు చేశారు. ఈ మహోపద్రవానికి భయపడినవారై బలభద్రుని రౌద్రావేశం తగ్గించటానికి మరో మార్గంలేక భీష్మ దుర్యోధనాదు లందరూ పరుగెత్తుకొని వచ్చి బలరాముణ్ణి శరణు వేడారు. కన్యకతో సహ సాంబుణ్ణి సమర్పించారు. అనేక మణిమయ భూషణాదులు కానుక లిచ్చి కరకమలాలు మోడ్చి ఇలా ప్రార్థించారు.

క. 'రామ! సమంచితముక్తా, దామ! యశఃకామ! ఘనసుధాధామ!రుచి
స్తోమ! జయసీమ! జగదభి, రామ! గుణోద్దామ! నిఖిలరాజలలామా! 589

* బలరామా! జగదభిరామా! రాజలలామా! ముత్యాలహారం ధరించినవాడా! కీర్తి కాముకుడా! మనోహరమైన ఆకారం కలవాడా! మమ్ము రక్షించు. నీవు జయశీలివి. సుగుణశాలివి.

క. నీ మహిమ యెఱిఁగి పొగడఁగఁ, నే మెంతటివార? మఖిలనేతవు; త్రిజగత్
క్షేమంకరుఁడవు; సుమతివి, తామసులము మమ్ముఁ గావఁ దగు హలపాణీ! 590

* ఓ హలాయుధా! నీ మహిమ తెలిసి పొగడటానికి మే మెంతవారం? సర్వానికీ నాయకుడవు. ముజ్జగాలకూ క్షేమం కలిగించే వాడవు. బుద్ధిమంతుడవు. మేము అహంకారులం. మమ్ము కాపాడు.

క. భూచక్ర మెల్లఁ దాల్చిన, యా చక్రీశ్వరుఁడు దావకాంశుఁడు బలదే
వా! చక్రికి నగ్రజుఁడవు, నీచక్రియ లుడుపఁ జెల్లు నీకు జితారీ! 591

* ఈ సమస్త ప్రపంచాన్నీ భరించిన శ్రీకృష్ణుడు నీ అంశం. నీవు ఆ చక్రాయుధునికి అన్నవు. నీచకార్యాలకు పాల్పడిన మమ్ము రక్షించు.

క. రక్షింపుము రక్షింపు ము, పేక్షింపక నమిత నిఖిలబృందారక! ఘో
ర క్షణదాచరవిషనిట, లాక్ష! భయాతురుల మమ్ము నరయు మనంతా! 592

* సమస్త దేవతలచేతా నమస్కరింపబడే ఓ మహానుభావా! బలదేవా! మమ్మ ఉపేక్షించక రక్షించు. హరుడు హలాన్ని మ్రింగిన విధంగా క్రూరరాక్షసులను మ్రింగివేసిన అనంతుడవు నీవు. భయార్తులమైన మమ్మ రక్షించు.

**వ. మఱియును దేవా! యీ సచరాచరంబు జగంబుల నీ లీలావినోదంబులం జేసి దుష్టజన మర్దనంబును, శిష్టజన రక్షణంబునుం జేయుచు, జగదుత్పత్తి స్థితి లయహేతువైన నీకు నమస్కరింతు' మని వెండియు నిట్లనిరి. 593**

* ఈ సచరాచర ప్రపంచాన్నీ లీలావినోదంగా నడిపిస్తూ, దుష్టశిక్షణం, శిష్టరక్షణం చేస్తూ, సృష్టి స్థితి లయాదులకు కారణమైన దేవా! నీకు నమస్కరిస్తున్నాము.

**తే. 'అవ్యయుండవు; సర్వభూతాత్మకుఁడవు;, సర్వశక్తి ధరుండవు; శాశ్వతుఁడవు**
**విశ్వకరుఁడవు గురుఁడవు విమలమూర్తి, వైన నిన్ను నుతింప బ్రహ్మకును దరమె?' 594**

* నాశంలేని వాడవూ, సర్వప్రాణి స్వరూపుడవూ, సర్వశక్తులనూ ధరించినవాడవూ, శాశ్వతుడవూ, జగద్గురుడవూ, సృష్టికర్తవూ, నిర్మలమైన ఆకారం గలవాడవూ ఐన నిన్ను పొగడటం బ్రహ్మకు కూడా సాధ్యం కాదు.

**చ. అని వినుతించినం బ్రముదితాత్మకుఁడై హలపాణి వారలం**
**గనుఁగొని 'యోడ కోడకుఁడు కార్యగతిం దగి లిట్లు మీరు సే**
**సిన యవినీతిచేత నిటు చేసితి; నింక భయంబు దక్కి పొం'**
**డనిన సుయోధనుండు వినయంబున నల్లునిఁ గూఁతునుం దగన్. 595**

* ఈవిధంగా కౌరవులు స్తుతించగా బలరాముడు సంతోషించి 'మీరు చేసిన అవినీతివల్ల ఇలా చేశాను. భయపడవద్దు. వెళ్ళండి' అన్నారు. అప్పుడు దుర్యోధనుడు వినయంతో అల్లుణ్ణి, కూతురినీ సాగనంపాడు.

**క. అనుపుచు నరణము దాసీ, జనముల వేయింటి లక్షసైంధవములఁ దా**
**నినుమడి యేనుంగులఁ గాం, చన రథముల నాఱువేల సమ్మతి నిచ్చెన్. 596**

* దర్యోధనుడు కూతురికీ, అల్లుడికి అరణంగా వేయిమంది దాసీలనూ, లక్ష గుర్రాలనూ, రెండు లక్షల ఏనుగులనూ, ఆరువేల రథాలనూ ఆనందంగా ఇచ్చాడు.

**వ. ఇట్లిచ్చి యనిచిన భద్రుండు గొడుకునుం గోడలిం దోడ్కొనుచుఁ బరమానందంబు నొందుచు, నక్కడక్కడి జనంబులు పది వేల విధంబులం బొగడ, నిజపురంబున కరిగి యచ్చట యాదవులతోడఁ దాఁ గరిపురంబునకుం బోయిన విధంబును, వారలాడిన దురాలాపంబులును, దా నందులకై యొనర్చిన ప్రతీకారంబును నెఱింగించి సుఖంబుండె; వారణపురంబు నేఁడును దక్షిణం బెగసి యుత్తరభాగం బొకించుక గంగకై క్రుంగి బలభద్రుని మాహాత్మ్యంబుఁ దెలుపుచున్న' దని య మహాత్ముని భుజవీర్యం బవార్యంబని చెప్పి శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రున కిట్లనియె. 597**

* ఇలా దుర్యోధనుడు అల్లుణ్ణీ కూతురినీ సాగనంపగా బలరాముడు వారిని వెంటబెట్టుకొని ప్రజల ప్రణామాలు అందుకొంటూ ఆనందంగా ద్వారకానగరానికి వెళ్ళాడు. అక్కడ తన వారితో తాను హస్తినాపురానికి ఏ విధంగా వెళ్ళిందీ, దుర్యోధనాదులు ఏమి మాట్లాడిందీ, దానికి ప్రతీకారంగా తా నేమి చేసిందీ, వివరంగా చెప్పి వారిని సంతోషపరిచాడు. హస్తినాపురం ఈనాడు కూడా దక్షిణం వైపు లేచి, ఉత్తరం గంగానదివైపు కొంచెం క్రుంగి, బలరాముడి మాహాత్మ్యాన్ని చాటుతూ ఉంది- అని ఈ రీతిగా శుకమహర్షి బలరాముడి భుజబలం సామాన్యమైనది కాదని చెప్పి పరీక్షిత్తుతో ఇంకా యిలా అన్నాడు.

## -: షోడశసహస్ర స్త్రీ సంగతుండైన శ్రీకృష్ణుని మహిమ నారదుం డరయుట :-

చ. 'నరవర! యొక్కనాఁడు విని నారదసంయమి మాధవుండు దా
నరకునిఁ ద్రుంచి వాని భవనంబున నున్న పదాఱువేల సుం
దరులను నొక్కమాటు ప్రమదంబున నందఱ కన్ని రూపులై
పరిణయ మయ్యె' నా విని శుభస్థితిఁ దద్విభవంబుఁ జూడఁగన్. 598

* ఓ రాజేంద్రా! విను. కృష్ణుడు నరకాసురుణ్ణి చంపి వాని మందిరంలో ఉన్న పదారువేల అందగత్తెలనూ వరించి, ఒక్కమారుగా అందరికీ అన్ని రూపాలతో కనపడి వివాహం చేసుకొన్నాడనే వార్త నారదుడు విని, అతని వైభవాన్ని దర్శించాలనే కాంక్షతో ఒకనాడు ద్వారకకు వచ్చాడు.

వ. ఇట్లు దలంచి కృష్ణపాలితం బయిన ద్వారకానగరంబు డాయంజని ముందట. 599

సీ. శుక శారికా శిఖి పిక కూజితప్రసవాంచితోద్యాన వనౌఘములను
గలహంస సారస కైరవ కమల కహ్లార శోభిత కమలాకరములఁ
గలమాది సస్య సంకులవరేక్షుక్షేత్ర భూరి లసన్నదీ తీరములను
గిరిసాను పతిత నిర్ఝరకణ సందోహ సంతత హేమంత సమయములను

తే. గమలసంభవకాంచనకార రచిత, చిరతరైశ్వర్య నగరలక్ష్మీకరాబ్జ
ఘటిత నవరత్నమయ హేమకటక మనఁగ, సొబగు మీఱిన కోటయుఁ జూచె మౌని. 600

* నారదుడు ద్వారకలో ప్రవేశించాడు. చిలుకలూ, గోరువంకలూ, నెమళ్ళూ, కోయిలలూ ఆనందంతో కలకలారావాలు చేస్తూ ఉన్న ఉద్యానవనాలను చూచాడు. హంసలతోనూ, బెగ్గురు పక్షులతోనూ, పద్మాలతోనూ, కలువలతోనూ శోభిస్తూ ఉన్న సరోవరాలను సందర్శించాడు. వరిపంటలతో కలకలలాడే క్షేత్రాలతోనూ, చెరకు తోటలతోనూ కనువిందు చేసే నదీతీరాలను తిలకించాడు. కొండచరియలనుంచి ఎల్లప్పుడూ జల్లులుగా పడుతున్న సెలయేటి నీటి తుంపరలవల్ల సదా హేమంత ఋతువుగా అలరారుతున్న ప్రదేశాలనూ కనుగొన్నాడు. బ్రహ్మతో సమానులైన స్వర్ణకారులచేత తయారుచేయబడి, భోగభాగ్యాలతో తులతూగే నగరలక్ష్మి తనచేతికి ధరించిన నవరత్న ఖచితమైన బంగారు కంకణంలాగా ప్రకాశిస్తున్న కోటను వీక్షించాడు.

వ. మఱియును సముత్తుంగ మణిసౌధ గవాక్షరంధ్ర నిర్గత నీరంధ్రఘన సార చందనాగరు ధూపధూమపటల విలోకన సంజనితపయోధరాభ శంకాం గీకృత తాండవకేళీవిలోల పురకామినీ జనోపలాలిత నీలకంఠ సముదయంబును, జంద్రకాంత మణిస్ఫటికస్తంభ సంభృతమరకత పద్మరాగఘటిత నవరత్న కాంచన ప్రాసాదశిఖరాగ్ర విన్యస్త బహుసూర్య విభ్రమకృదంచిత శాతకుంభ కుంభనిచయంబును, సమస్త వస్తు విస్తార సమర్పిత వైశ్యాగారవీథీ వేదికాకలితంబును, మహితాతప నివారణ తరళవిచిత్ర కేతనాబద్ధ మయూరశింజినీ నినదపూరితాశాంతరిక్షంబును, సరోజనాభ పూతనా చేతనాపహారాది నూతన విజయసందేశలిఖిత స్వర్ణవర్ణావళీ విభాసిత గోపురమణి విటంకప్రదేశంబును, యాదవేంద్ర దర్శనోత్సవాహూయమాన సమాగత నానాదేశాధీశ భూరివారణదానజల ప్రభూతపంక నిరసనైకగతాగత జనసమ్మర్ద కరకంకణకషణ వికీర్యమాణరజః పుంజంబును; వినూత్న రత్నమయ మంగళ రత్నవల్లీ విరాజిత ప్రతిగృహప్రాంగణంబును, గుంకుమసలిలసిక్త విపణిమార్గంబును, వంది మాగధసంగీత మంగళారావ విలసితంబును, భేరీమృదంగకాహళ శంఖతూర్య రవాధరీకృత సాగర ఘోషంబునునై, యమరావతీ పురంబునుం బోలె వసుదేవనందననివాసంబై, యనల పుటభేదనంబునుం బోలెఁ గృష్ణమార్గ సంచారభూతంబై, సంయమనీనామ నగరంబునుం బోలె హరి తనూభవాభిరామంబై, నైరృతినిలయంబునుం బోలెఁ బుణ్యజనాకీర్ణంబై, వరుణనివాసంబునుం బోలె గోత్రరక్షణ భువన ప్రశస్తంబై, ప్రభంజన పట్టణంబునుం బోలె మహాబలసమృద్ధంబై, యలకాపురంబునుం బోలె ముకుంద వర శంఖమకరాంక కలితంబై, రజతాచలంబునుం బోలె నుగ్రసేనాధిపార్యాలంకృతంబయి, నిగమంబునుం బోలె వివిధవర్ణ క్రమవిధ్యుక్త సంచారంబయి, గ్రహమండలంబునుం బోలె గురుబుధ విరాజమిత్ర విరాజితంబయి, సంతత కల్యాణ వేదియుం బోలె వైవాహికోపేతంబయి, బలిదానవ కరతలంబునుంబోలె సంతతదానవారియుక్తంబయి, యొప్పు నప్పురంబు ప్రవేశించి, యందు విశ్వకర్మ నిర్మితంబైన యంతఃపురంబున నుండు షోడశసహస్ర హర్మ్యంబులందు. 601

* ఆ ద్వారకానగరంలో మిక్కిలి ఎత్తయిన మేడలున్నాయి. ఆ సౌధాల గవాక్షాలలో నుంచి అగరుధూపధూమాలు వెలువడు తున్నాయి. ఆ నల్లని పొగగుంపులను మేఘాలని భ్రమించి తాండవం చేస్తున్న నెమళ్ళను అచ్చటి కాంతామణులు ఎంతో అనురాగంతో లాలిస్తున్నారు. ఆ పట్టణంలో చంద్రకాంతమణులు చెక్కిన స్ఫటిక స్తంభాలతో కూడిన నవరత్నప్రాసాదాలున్నాయి. ఆ ప్రాసాద శిఖరాలపైన బంగారు కలశాలు అమర్చారు. ఆ కలశాలమీద ప్రసరించిన సూర్యకిరణాలు వేలకొలది సూర్యబింబాలను సృష్టిస్తున్నాయి. ఆ పట్టణంలో సమస్త వస్తువులతో నిండిన విపణివీథు లున్నాయి. ఆ పట్టణంలో ఆకాశాన్ని అంటుతూ ఎగురుతున్న చిత్ర విచిత్రమైన జెండా గుడ్డలు ఎండతగులకుండా అడ్డుపడుతున్నాయి. బాలగోపాలుడు చేసిన 'పూతనసంహారం' మొదలైన వీరగాథలు బంగారు అక్షరాలతో చెక్కిన ఫలకాలు గోపురాలపై విరాజిల్లుతున్నాయి.

నందనందనుని సందర్శనంకోసం విచ్చేసిన నానాదేశాల రాజులు కానుకలుగా తెచ్చిన ఏనుగుల మదధారలచే తడిసిన ప్రదేశాలను వచ్చేపొయ్యేవారి కరకంకణాల ఒరిపిడివల్ల రాలిపడిన బంగారుపొడులు పొడిపొడిగా మారుస్తున్నాయి.

ప్రతి ఇంటిముందూ కొంగ్రొత్త రత్నాలతో ముద్దు ముద్దుగా తీర్చిదిద్దిన ముత్యాలముగ్గులు అలరారుతున్నాయి, ఆ పట్టణం పన్నీరు చల్లిన వీథులతోనూ, వందిమాగధుల సంగీత మంగళారావాలతోనూ, సముద్రఘోషాన్ని సైతం క్రిందుపరచే భేరీమృదంగ కాహళాది తూర్యధ్వనులతోనూ నిండి ఉన్నది.

అష్టదిక్పాలుర పట్టణాలను తలపించే ఆ ద్వారకాపట్టణాన్ని నారదుడు ప్రవేశించి, అక్కడ విశ్వకర్మచేత నిర్మింపబడ్డ అంతఃపురంలోని పదహారువేల సౌధాలలోనూ శ్రీకృష్ణుణ్ణి చూచాడు.

**సీ. పటికంపుఁ గంబముల్ పవడంపుఁ బట్టెలు మరకతరచితముల్ మదురు లమర**
**వై డూర్యమణిగణవలభులఁ బద్మరాగంబుల మొగడుల కాంతు లొలయ**
**సజ్జాతివజ్ర లసజ్జాల రుచులతో భాసిల్లు నీలసోపానములును**
**గరుడపచ్చల విటంకములును ఘనరుచి వెలసిన శశికాంత వేదికలును**

**తే. వఱలు మౌక్తికఘటిత కవాటములును, బ్రవిమల స్వర్ణమయ సాలభంజికలును**
**మించు కలరవ మెసఁగఁ గ్రీడించు మిథున, లీల నొప్పు కపోతపాలికలుఁ గలిగి. 602**

* స్ఫటికపు కంబాలూ, పగడాల పట్టెలూ, మరకతమణుల కప్పులూ శోభిల్లగా, వైడూర్యాల ముంజూరులు, వజ్రాల కిటికీలూ కాంతులీనగా, పద్మరాగాల నడికొప్పులూ నీలాల సోపానాలు విలసిల్లగా, చంద్రకాంత వేదికలూ గరుడపచ్చల గువ్వగూండ్లూ ప్రకాశింపగా, ఆణిముత్యాలు కూర్చిన తలుపులూ, సువర్ణమయ సాలభంజికలూ, పావురాల జంటల కువకువలతో కూడిన గూళ్లూ కలిగిన ద్వారకానగరాన్ని నారదుడు దర్శించాడు.

**తే. చేటికానీకపద తులాకోటిమధుర, నినదభరితమై రుచిరమాణిక్య దీప**
**మాలికయుఁ గల్గి చూపట్టఁ గ్రాలు నొక్క, జలజలోచన నిజసౌధతలమునందు. 603**

**తే. కనక కంకణ ఝణఝణత్కార కలిత, చంద్రబింబాననా హస్తజలక ఘటిత**
**చామరోద్ధూత మారుత చలిత చికుర, పల్లవునిఁ గృష్ణు వల్లవీ పల్లవునిని. 604**

* చెలికత్తెల కాలిఅందెల సుందరనినాదాలతో నిండి మంజుల మణిదీప మాలికలతో వెలుగొందే ఒక అందకత్తె సౌధంలో బంగారు కంకణాలు గలగలలాడగా కంజాతలోచనలు వీస్తున్న వింజామరలు గాలికి కదులుతున్న ముంగురులు గల గోపికావల్లభుడైన నల్లనయ్యను నారదుడు చూచాడు.

**వ. మఱియు హాటకనిష్కంబు లఱ్ఱులందు వెలుగొందఁ గంచుకంబులు శిరోవేష్టనంబులుఁ గనక కుండలంబులు ధరించి, సంచరించు కంచుకులును, సమాన వయోరూపగుణ విలాసవిభ్రమ కలితలయిన విలాసినీ సహస్రంబులును గొలువం గొలువున్న య ప్పద్మలోచనుం గాంచన సింహాసనాసీనుం గాంచె; న ప్పుండరీకాక్షుండును నారదుం జూచి ప్రత్యుత్థానంబు సేసి యప్పుడు. 605**

* బంగారుపథకాలు మెడలలో ప్రకాశించగా కంచుకాలూ, తలపాగాలూ, కుండలాలూ ధరించి సంచరించే కంచుకిజనమూ, సమానమైన వయోరూపగుణాలతో విలసిల్లే వేలాది లీలావతులు సేవిస్తూ ఉండగా, బంగారు సింహాసనం మీద కొలువుతీరి కూర్చున్న గోపాల కృష్ణుణ్ణి ఆ మహర్షి అవలోకించాడు. తన్ను సమీపిస్తున్న నారద మునీంద్రుణ్ణి చూచి కృష్ణుడు ఎదురువచ్చాడు.

**క. మునివరు పాదాంబుజములు, దన చారుకిరీటమణి వితానము సోఁకన్**
**వినమితుఁడై నిజసింహా, సనమునఁ గూర్చుండఁబెట్టి సద్వినయమునన్. 606**

* శ్రీకృష్ణుడు తనకిరీటంలోని మణులసమూహం తాకేటట్లు మునిశ్రేష్ఠుడైన నారదుని పాదపద్మాలకు నమస్కారం చేసి తన సింహాసనం మీద కూర్చోబెట్టాడు.

**క. తన పాదకమలతీర్థం, బున లోకములం బవిత్రముగఁ జేయు పురా**
**తనమౌని లోకగురుఁ డ, మ్ముని పదతీర్థంబు మస్తమున ధరియించెన్. 607**

* తన చరణకమల తీర్థంచేత సర్వలోకాలనూ పవిత్రంచేసే ప్రాచీనమునీ, లోకగురుడూ ఐన శ్రీకృష్ణుడు నారదుని పాదతీర్థం తన తలపై చల్లుకున్నాడు.

**వ. ఇట్లు బ్రహ్మణ్యదేవుండును నరసఖుండు నై న నారాయణుం డశేష తీర్థోపమానంబయిన మునీంద్రపాద తీర్థంబు ధరించిన వాఁ డయి' సుధాసారంబులైన మితభాషణంబుల నారదున కిట్లనియె. 608**

* ఈ విధంగా దేవదేవుడూ, నరునికి చెలికాడూ అయిన నారాయణుడు సమస్త పుణ్యతీర్థాలకూ సమానమైన నారదమునీంద్రుని పాదజలాన్ని తలపై ధరించినవాడై అమృతం చిలికే పలుకులతో ఇలా అన్నాడు.

**క. 'ఏ పని పంచినఁ జేయుదుఁ, దాపసవర!' యనుడు నతఁడు 'దామోదర! చి**
**ద్రూపక! భవదవతార, వ్యాపారము దుష్టనిగ్రహార్థము గాదే! 609**

* 'ఓ తాపసవరేణ్యా! మీరు ఏ పని చేయవలసిందని ఆజ్ఞాపిస్తే ఆ పని చేస్తాను. సెలవీయండి'. ఇలా పలికిన కృష్ణునితో నారదుడు ఇలా అన్నాడు. 'స్వామీ! దామోదరా! మీరు అవతరించటం దుర్మార్గులను సంహరించటానికే కదా!'

**తే. అఖిలలోకైకపతివి దయార్ద్రమతివి, విశ్వసంరక్షకుండవు శాశ్వతుఁడవు**
**వెలయ నే పనియైనఁ గావింతు ననుట, యార్తబంధుండ విది నీకు నద్భుతంబె! 610**

* నీవు సమస్తలోకాలకూ యజమానివి. దయగలవాడవు. ప్రపంచాన్ని రక్షించేవాడవు. ఆర్తులకు బాంధవుడవైన నీవు ఏ పని అయినా చేస్తానని చెప్పడం ఆశ్చర్యం కాదు.

**తే. అబ్జసంభవ హరదేవతార్చనీయ, భూరిసంసార సాగరోత్తారణంబు**
**నవ్య యానంద మోక్షదాయకము నైన, నీ పదధ్యాన మాత్మలో నిలువ నీవె' 611**

* బ్రహ్మ, ఈశ్వరుడు మొదలైన దేవతలచేత పూజింపబడే ఓ స్వామీ! సంసారసాగరాన్ని దాటడానికి సాధనమైనదీ, మోక్షాన్ని ప్రసాదించేదీ ఐన నీ పదధ్యానం నా ఆత్మలో నిలిచేటట్లు అనుగ్రహించు.

**వ. అని యభ్యర్థించి య ద్దేవునివలనం బ్రసన్నత వడసి, తన్మందిరంబు వెడలి మునివరుం డ మ్మహాత్ముని యోగమాయాప్రభావంబు దెలియంగోరి, వేఱొక చంద్రబింబాననా గేహంబునకుం జని యందు నెత్తమాడుచున్న పురుషోత్తము నుద్ధవయుతుం గని యద్భుతంబు నొందుచు నతనిచేత సత్కృతుండై యచ్చోట వాసి చని. 612**

* ఈ విధంగా ప్రార్థించి నారదుడు శ్రీకృష్ణుని అనుగ్రహం పొంది ఆ మందిరంనుంచి వెలుపలికి వచ్చాడు. ఆ దేవర్షి వాసుదేవుని యోగమాయాప్రభావం తెలుసుకోదలచినవాడై వేరొక వాల్గంటి యింటికి వెళ్ళాడు. అచ్చట ఉద్ధవునితో కలిసి జూదమాడుతూ ఉన్న శ్రీకృష్ణుణ్ణి ఆలోకించి ఆశ్చర్యచకితుడైనాడు. అచ్చట కృష్ణునిచే పూజింపబడినవాడై ఆ భవనం వదలి వెళ్ళాడు.

**క. మునివరుఁడు కాంచె నొండొక, వనజాయతనేత్ర నిజనివాసంబున నం**
**దనయుతు జిష్ణు సహిష్ణున్, వినుత గుణాలంకరిష్ణు విష్ణున్ గృష్ణున్. 613**

* నారదుడు మరొక సుందరీమణి మందిరానికి వెళ్లాడు. అక్కడ నందనులతో కలిసి ఆనందిస్తున్న నందనందనుణ్ణి సందర్శించాడు.

**క. నారదుఁడట చని కనె నొక, వారిజముఖియింట నున్న వాని మురారిన్**
**హారిన్ దానవకుల సం, హారిన్ గమలామనోవిహారిన్ శౌరిన్. 614**

* నారదుడు వేరొక నారీమణి మందిరానికి వెళ్లి అక్కడ ఉన్న దానవాంతకుడైన కృష్ణుణ్ణి దర్శించాడు.

**వ. ఇట్లు కనుంగొనుచుం జనుచుండ నొక్క యెడ న మ్మునీంద్రునకు ముకుందుండు ప్రత్యుత్థానంబు చేసి 'మునీంద్రా! సంపూర్ణకాము లయిన మిమ్ము నపూర్ణకాములమైన మే మేమిటఁ బరితృప్తి నొందఁ జేయంగలవారము? భవదీయదర్శనంబున నిఖిలశోభనంబుల నందెదమని ప్రియపూర్వకంబుగాఁ బలికిన నా నందనందను మాటలకు నానందకందళిత హృదయార విందుండును, మందస్మిత సుందర వదనారవిందుండును నగుచు నారదుండు వెండియుఁ జని చని. 615**

* ఈ విధంగా వాసుదేవుని కనుగొంటూ వెళుతూ ఉన్న నారదుణ్ణి కృష్ణుడొక యింటిలో గౌరవించి 'మునీంద్రా! ఏ కోరికలూ లేని మిమ్ములను కోరికలు గల మేము ఏ విధంగా సంతృప్తి పరచగలం? మీ దర్శనంతో సమస్త శుభాలనూ పొందుతాము' అని ప్రీతిపూర్వకంగా పలికాడు. కృష్ణుని మాటలకు సంతోషించిన మనస్సు కలవాడై చిరునవ్వు నవ్వుతూ నారదుడు ముందుకు సాగిపోయాడు.

**క. అనఘాత్ముఁడు గనుఁగొనె నొక వనితామణి మందిరమున వనకేళీ సం**
**జనితానందుని ననిమిష, వినమిత చరణారుణారవిందు ముకుందున్. 616**

* పుణ్యాత్ముడైన నారదుడు ఒక వనిత ఇంటిలో జలకేళి సలుపుతూ ఆనందిస్తున్న సురవందిత చరణారవిందుడైన ముకుందుణ్ణి చూచాడు.

క. పరమేష్ఠిసుతుఁడు గనె నొక, తరుణీభవనంబునందుఁ దను దాన మనో౽౦
బురుహమునఁ దలఁచుచుండెడి, నరకాసుర దమనశూరు నందకుమారున్. 617

* నారదుడు మరొక తరుణీమణి యింటిలో తనలో తనను చూచుకొంటూ యోగనిష్ఠలో ఉన్న నరకాసురాంతకుడైన శ్రీకృష్ణుణ్ణి దర్శించాడు.

వ. మఱియుం జని చని. 618

* ఇలా చూస్తూ నారదుడు మరీ ముందుకు వెళ్ళాడు.

సీ. ఒకచోట నుచితసంధ్యోపాసనాసక్తు నొకచోటఁ బౌరాణికోక్తి కలితు
నొకచోటఁ బంచయజ్ఞోచితకర్ముని నొకచోట నమృతోపయోగలోలు
నొకచోట మజ్జనోద్యోగానుషక్తుని నొకచోట దివ్యభూషోజ్జ్వలాంగు
నొకచోట ధేనుదానోత్క లితాత్ముని నొకచోట నిజసుత ప్రకరయుక్తు

తే. నొక్క చోటను సంగీతయుక్త చిత్తు, నొక్కచోటను జలకేళియుతవిహారు
నొక్కచోటను సన్మంచకోపయుక్తు నొక్కచోటను బలభద్రయుక్తచరితు. 619

* ఒక గృహంలో సంధ్యావందనం చేస్తూ ఉన్న వాణ్ణీ, మరొక గృహంలో పురాణశ్రవణం చేస్తూ ఉన్న వాణ్ణీ, ఒక తావున పంచయజ్ఞాలు ఆచరిస్తున్న వాణ్ణీ, మరొకచోట యోగసమాధి నిమగ్నుడై ఉన్నవాణ్ణి, ఒకస్థలంలో స్నానార్థం సిద్ధమవుతూ ఉన్నవాణ్ణీ, ఇంకొకస్థలంలో ప్రశస్తభూషణాలతో ప్రకాశిస్తూ ఉన్నవాణ్ణీ, ఒక ప్రదేశంలో గోదానం చేయాలని కుతూహలపడుతున్న వాణ్ణీ, మరొక ప్రదేశంలో తనకుమారులతో ఆడుకుంటూ ఉన్నవాణ్ణీ, ఒకచోట సంగీతంపై ఆసక్తిని ప్రదర్శిస్తూ ఉన్నవాణ్ణీ, ఒకచోట జలకేళిలో మునిగి తేలుతున్న వాణ్ణీ, ఇంకొకచోట మంచం మీద కూర్చొన్న వాణ్ణీ, మరొకచోట బలరామ సహితుడై ఉన్నవాణ్ణీ- శ్రీకృష్ణపరమాత్మను నారదమహర్షి దర్శించాడు.

వ. మఱియును. 620

సీ. సకలార్థసంవేది యొక యింటిలోపలఁ జెలితోడ ముచ్చటల్ సెప్పుచుండు
విపులయశోనిధి వేఱొకయింటిలో సరసిజాననఁ గూడి సరసమాడుఁ
బుండరీకదళాక్షుఁడొండొకయింటిలోఁ దరుణికి హారవల్లరులు గ్రుచ్చుఁ
గరుణాపయోనిధి మఱియొక యింటిలోఁ జెలిఁ గూడి విడియము సేయుచుండు

ఆ. వికచకమలనయనుఁ డొకయింటిలో నవ్వు, బ్రవిమలాత్ముఁడొకటఁ బాడుచుండు
యోగిజనవిధేయుఁ డొకయింట సుఖగోష్ఠి సలుపు ననఘుఁడొకటఁ జెలఁగుచుండు. 621

* అంతేకాదు. శ్రీకృష్ణుడు ఒక ఇంటిలో తన ముద్దులసఖితో ముచ్చటించుతున్నాడు. మరో ఇంటిలో మరొక యువతితో సరసమాడుతున్నాడు. ఇంకో యింటిలో ఒక నారీలలామకు హారాలు కూరుస్తున్నాడు.

ఒక యింటిలో తన ప్రేయసితో కూడి తాంబూలం సేవిస్తున్నాడు. ఒక యింటిలో నవ్వుతున్నాడు. ఒక యింటిలో పాడుతున్నాడు. ఒక యింటిలో సుఖగోష్ఠి చేస్తున్నాడు. ఒక యింటిలో ఆనందిస్తున్నాడు. ఈ విధంగా అనేక రూపాలతో కనబడుతూ ఉన్న ఆ సకలార్థసంవేదిని, ఆ విపులయశోనిధిని, ఆ పుండరీకదళాక్షుని, ఆ కరుణాపయోనిధిని, ఆ వికచకమల నయనుని, ఆ విమలాత్ముని, ఆ యోగిజన విధేయుని, ఆ శ్రీకృష్ణభగవానుణ్ణి దర్శిస్తూ నారదుడు ముందుకు సాగిపోయాడు.

**వ. ఇట్లు సూచుచుం జని చని. 622**

**క. చతురానన నందనుఁ డం, చితమతిఁ జని కాంచె నొక్క చెలిగేహమునన్**
**గ్రతుకర్మాచరణుని నా, శ్రితభయహరణున్ సురేంద్రసేవితచరణున్. 623**

* ఇలా సాగిపోయి యజ్ఞకర్మల్ని చేసేవాడూ, ఆశ్రితుల భయాన్ని పోగొట్టేవాడూ, దేవేంద్రునిచేత పూజింపబడే పాదాలు కలవాడూ అయిన శ్రీకృష్ణుణ్ణి నారదుడు ఒక యువతి యింటిలో చూచాడు.

**క. వృత్రారిసుతునిఁ బరమ, పవిత్రుని నారదుఁడు గాంచె వేఱొక యింటం**
**బుత్త్రక పౌత్త్రక దుహితృ క, ళత్రసమేతుని ననంతు లక్షణవంతున్. 624**

* దేవేంద్రుని చేత పొగడబడేవాడూ; పరమపవిత్రుడూ; కొడకులూ, మనుమళ్లూ కూతుళ్లూ, భార్యలూ వీరందరితో కలిసి ఉన్నవాడూ అయిన నందతనయుణ్ణి నారదుడు మరో మందిరంలో దర్శించాడు.

**క. సుందరమగు నొకసుందరి, మందిరమునఁ బద్మభవకుమారుఁడు గాంచెన్**
**నందితనందున్ సుజనా, నందున్ గోవిందు నతసనందు ముకుందున్. 625**

* ఒక సుందరాంగి ఇంటిలో సజ్జనులచేత కీర్తించబడేవాడూ, సనక సనందనాదుల వందనాలు అందుకునేవాడూ అయిన గోవిందుణ్ణి నారదుడు చూచాడు.

**క. జలజభవసుతుఁడు గనె నొక, నలినాక్షినివాసమందు నతభద్రేభున్**
**జలదాభున్ గతలోభు, న్నలకాళిజితద్విరేఫు నంబుజనాభున్. 626**

* ఒక పద్మనేత్ర యింటిలో గజహంతకుడు, నీలమేఘశ్యాముడు, లోభరహితుడు, నల్లనిముంగురులు కలవాడు, పద్మనాభుడైన శ్రీకృష్ణుణ్ణి నారదుడు తిలకించాడు.

**మ. ఒకయింటం గజవాజిరోహకుఁడునై యొక్కింట భుంజానుఁడై**
**సకలాత్ముండు పరుండు షోడశసహస్ర స్త్రీనివాసంబులం**
**దొక బోటింటను దప్పకుండ నిజమాయోత్సాహుఁడై యుండ న**
**య్యకలంకున్ వరదున్ మహాపురుషు బ్రహ్మణ్యున్ నతాబ్జాసనున్. 627**

* ఒక యింటిలో ఏనుగులపై, గుఱ్ఱాలపై స్వారి చేస్తూ ఉన్న మురారిని చూచాడు. ఒక యింటిలో భోజనం చేస్తూ ఉన్న పురుషోత్తముణ్ణి కాంచాడు. ఒక యింటిలో నిద్రిస్తూ ఉన్న నీరజాక్షుణ్ణి విలోకించాడు.

ఇలా పదహారు వేల స్త్రీల నివాసాలలోనూ, ఏ స్త్రీ యిల్లు తప్పిపోకుండా తన మాయా ప్రభావంతో ఉన్న మహాపురుషుడైన శ్రీకృష్ణుణ్ణి నారదుడు దర్శించాడు.

**క. అస్తోకచరితు నమిత స, మస్తసుధాహారు వేదమస్తకతల వి**
**న్యస్తపదాంబుజయుగళు న, పాస్త్రశ్రితనిఖిల పాపుఁ బరము ననంతున్. 628**

* ఉదాత్తమైన చరిత్ర కలవాడూ, ఉపనిషత్తుల యందుంచబడిన పాదపద్మాలు కలవాడూ, సమస్త దేవతలకు ఆరాధ్యు డైనవాడూ, ఆశ్రితుల పాపాలను పోగొట్టేవాడూ, అనంతుడూ అయిన శ్రీకృష్ణుణ్ణి నారదుడు చూచాడు.

**ఆ. పరమభాగవతుఁడు పరమేష్ఠి తనయుండు, మనుజలీలఁ జెంది మహితసౌఖ్య**
**చిత్తుఁడైన యా హృషీకేశు యోగ మా, యాప్రభావమునకు నాత్మ నలరి. 629**

* మనుష్యభావంతో మహానందాన్ని అనుభవిస్తున్న శ్రీకృష్ణుని యోగమాయా ప్రభావాన్ని పరీక్షించి చూచి పరమభాగవతుడైన బ్రహ్మమానసపుత్రుడు నారదుడు చాలా సంతోషించాడు.

**క. మాయురె? హరిహరి వరద! య, మేయగుణా! యనుచు నాత్మ మెచ్చి మునీంద్రుం**
**డాయదు నాయకు సుజన వి, ధేయుని కిట్లనియె 'దేవ! త్రిజగములందున్. 630**

* 'ఆహాహా! హరి హరీ! సుప్రసన్నా! ఉన్నత గుణసంపన్నా!' అని మెచ్చుకొంటూ నారదుడు కృష్ణునితో ఇలా అన్నాడు.

**క. నీ మాయఁ దెలియువారలె, తామరసాసన సురేంద్రతాపసు లైనన్**
**ధీమంతులు నీభక్తిసు, ధా మాధుర్యమునఁ బొదలు ధన్యులు దక్కన్. 631**

* ఓ దేవా! ముల్లోకాల్లో బ్రహ్మేంద్రాది దేవతలూ, మహర్షులు కూడా నీ మాయను తెలుసుకోలేరు. నీ భక్తి అనే అమృతంలోని తీయదనాన్ని రుచిచూచిన పుణ్యాత్ములు మాత్రమే నీ తత్త్వాన్నీ తెలుసుకోగలరు.

**క. అని హర్షించుచు 'నిఁక నేఁ, బనవినియెద నిఖిలలోక పావనమును స**
**జ్జనహితమునైన నీకీ, ర్తన మఖిలజగంబులందుఁ దగ నెఱిఁగింతున్. 632**

* ఈ విధంగా పలికి నారదమహర్షి హర్షాతిశయంతో 'ఇక నేను సెలవు తీసుకుంటాను. పవిత్రమైనదీ, సజ్జనులకు హితమైనదీ అయిన నీ నామసంకీర్తనం సమస్తలోకాల్లోను ప్రకటిస్తాను' అని అన్నాడు.

**క. అని తద్వచనసుధాసే, చనమున ముదితాత్ముఁ డగుచు సంయమి చిత్తం**
**బునఁ దన్మూర్తిం దగ నిడు, కొని చనియెను హరినుతైక కోవిదుఁ డగుచున్. 633**

* ఇలా పలికి వాసుదేవుని వాగమృతధారలో మునిగిన వాడై సంతుష్టాంతరంగుడైన నారదుడు తన మనస్సులో మాధవుని మంగళమయ స్వరూపాన్ని నిలుపుకొని వెళ్ళిపోయాడు.

**క. ఈ పగిది లోకహితమతి, నా పరమేశ్వరుఁడు మానవాకృతిఁ ద్రిజగ**
**ద్దీపిత చారిత్రుఁడు బహు, రూపములం బొందె సుందరుల నరనాథా! 634**

* ఓ రాజా! ఈ విధంగా లోకానికి మేలు చేకూర్చాలనే మనస్సుతో ఆ శ్రీకృష్ణుడు మానవాకారాన్ని ధరించి ఆ సుందరాంగుల నందరినీ అనేక రూపాలతో ఆనందింపచేశాడు.

చ. అని హరి యిట్లు షోడశసహస్ర వధూమణులం బ్రియంబునన్
మనసిజకేళిఁ దేల్చిన యమానుషలీల సమగ్ర భక్తితో
వినినఁ బఠించినం గలుగు విష్ణుపదాంబుజ భక్తియున్ మహా
ధన పశు పుత్రమిత్ర వనితాముఖ సౌఖ్యములున్ నరేశ్వరా!' 635

* శ్రీకృష్ణుడు పదహారు వేల స్త్రీలను ఆదరించిన కథను విన్నా చదివినా విష్ణుదేవుని పాదాలపై భక్తి ప్రాప్తించటమే కాకుండా ధన, పశు, పుత్ర, మిత్ర, కళత్రాది సౌఖ్యాలు సైతం లభిస్తాయి.

వ. అని చెప్పి య ప్పారాశర్యనందనుం డభిమన్యు నందనున కిట్లనియె. 'నా నిశావసానంబునఁ బద్మబాంధవాగమనంబును గమలినీ లోకంబునకు మునుకలుగ నెఱింగించు చందంబునం గలహంస సారసరథాంగముఖ జలవిహంగంబుల రవంబులు సెలంగ నరుణోదయంబున మంగళపాఠకసంగీత మృదుమధుర గాన నినదంబును లలితమృదంగ వీణావేణునినాదంబును ఏతేర మేలుకని తనచిత్తంబునఁ జిదానందమయుం బరమాత్ము నవ్యయు నవికారు నద్వితీయు నజితు ననంతు నచ్యుతు నమేయు నాద్యు నాద్యంత విహీనుఁ బరమబ్రహ్మంబు నైన తన్నుం దా నొక్కింత చింతించి యనంతరంబ విరోధిరాజన్య నయన కల్హారంబులు ముకుళింప భక్తజన నయన కమలంబులు వికసింప నిరస్త నిఖిలదోషాంధకారుం డైన గోవిందుండు మొగిచిన లోచన సరోజంబులు వికసింపఁ జేయుచుఁ దల్పంబు డిగ్గి చనుదెంచి యంత. 636

* ఈ విధంగా చెప్పి శుకయోగి పరీక్షిత్తుతో మళ్ళా ఇలా అన్నాడు. పద్మాప్తుడైన సూర్యుని రాకను పద్మినీలతకు ముందుగా తెలుపుతున్న వేమో అన్నట్లు రాజహంసలు, సారసపక్షులు, చక్రవాకాలు చేస్తున్న కలధ్వనులనూ, మృదుమధురాలైన మంగళపాఠకుల సంగీతనాదాలనూ, మనోహరమైన మృదంగ వేణు వీణా గానరవాలనూ ఆలకించుతూ అరుణోదయ సమయాననే శ్రీకృష్ణుడు మేలుకొన్నాడు. పరబ్రహ్మస్వరూపమైన తన్ను తానే ధ్యానించుకుంటూ కన్నులు తెరచి శయ్యను దిగాడు. ఆయన కన్ను తెరవగానే పగవారి కనుగలువలు ముకుళించాయి. దురితాంధకారాలు దూరమైనాయి.

సీ. మలయజ కర్పూర మహిత వాసితహేమ కలశోదకంబుల జలకమాడి
నవ్యలసన్మృదు దివ్యవస్త్రంబులు వలనొప్ప రింగులు వాఱఁ గట్టి
మకరకుండలహార మంజీర కేయూర వలయాది భూషణావలులు దాల్చి
ఘనసార కస్తూరికా హరిచందన మిళితపంకము మేన నలర నలఁది

తే. మహితసౌరభ నవకుసుమములు దుఱిమి, పొసఁగ రూపైన శృంగార రస మనంగ
మూర్తిఁ గైకొన్న కరుణాసముద్ర మనఁగ, రమణ నొప్పుచు లలితదర్పణము చూచి. 637

* అనంతరం ఆ నందనందనుడు చందనకర్పూరాల పరిమళాలతో గుమగుమలాడే కాంచన కలశజలాలతో స్నానం చేశాడు. సన్నని మృదువైన దుస్తులు ధరించాడు. మకరకుండల హారకేయూరాది భూషణాలను అలంకరించుకున్నాడు. పచ్చకర్పూరం, కస్తూరి, మంచిగంధం కలిపిన మైపూతను స్వీకరించాడు. సువాసనలు వెదజల్లే సుమమాలికలు కైసేసి రూపం దాల్చిన శృంగారరస మనేటట్లుగా , ఆకారం ధరించిన అనురాగ సముద్రం అనేటట్లుగా అలరారుతున్న శ్రీకృష్ణుడు తన అందాన్ని అద్దంలో చూచుకున్నాడు.

**తే. కడఁగి సారథి తెచ్చిన కనకరథము, సాత్యకి హితప్రియోద్ధవ సహితుఁ డగుచు**
**నెక్కి నిజకాంతి దిక్కులఁ బిక్కటిల్లఁ, బూర్వగిరిఁ దోఁచు భానునిఁ బోలి వెలిఁగె.** 638

* సాత్యకితోనూ, మిత్రుడైన ఉద్ధవునితోనూ కలిసి సారథి తెచ్చిన బంగారురథాన్ని అధిరోహించినవాడై శ్రీకృష్ణుడు వెలుగులు వెదజల్లుతూ ప్రాగ్దిశలో ప్రకాశించే సూర్యునిలా శోభించాడు.

**సీ. అభినవనిజమూర్తి యంతఃపురాంగనా నయనాబ్జములకు నానంద మొసఁగ**
**సలలిత ముఖచంద్ర చంద్రికాతతి పౌరజనచకోరముల కుత్సవము సేయ**
**మహనీయకాంచన మణిమయభూషణ దీప్తులు దిక్కులఁ దేజరిల్ల**
**నల్ల నల్లన వచ్చి యరదంబు వెస డిగ్గి హల కులిశాంకుశ జలజ కలశ**

**తే. లలిత రేఖలు ధరణి నలంకరింప, నుద్ధవుని కరతల మూని యొయ్య నడచి**
**మహితగతి దేవతాసభామధ్యముననుఁ, రుచిర సింహాసనమునఁ గూర్చుండె నెలమి.** 639

* శ్రీకృష్ణుడు తన నవమోహనాకారం అంతఃపురస్త్రీల కన్నులకు ఆనందాన్ని అందింపగా అందాలు చిందే తన ముఖచంద్రుని వెన్నెల వెలుగులు పురజనుల నేత్రచకోరాలకు పండుగ చేయగా, తానలంకరించుకొన్న మణిమయాలైన ఆభరణాల కాంతులు నలు దిక్కుల ప్రసరింపగా, మెల్లమెల్లగా వచ్చి, రథం దిగి, హలకులిశాది రేఖలతో శుభంకరాలయిన తన పాదముద్రలు భూమిని అలంకరించగా ఉద్ధవుని చేతిని ఊతగా గ్రహించి గంభీరంగా నడుస్తూ మహాసభామధ్య మందున్న మణిమయ సింహాసనం మీద ఆసీనుడైనాడు.

**చ. అతివిభవంబునం దనరి యాత్మతనుద్యుతి తేజరిల్లఁగా**
**హితులు పురోహితుల్ వసుమతీశులు మిత్రులు బాంధవుల్ బుధుల్**
**సుతులును మాగధుల్ కవులు సూతులు మంత్రులు భృత్యులున్ శుభ**
**స్థితిఁ గొలువంగఁ నొప్పె నుడుసేవితుఁడైన సుధాంశుఁడో యనన్.** 640

* శ్రీకృష్ణుడు మహావైభవంతో తన శరీరకాంతులు నలుగడలా ప్రసరింపగా హితులూ, పురోహితులూ, రాజులూ, మిత్రులూ, చుట్టాలూ, పెద్దలూ, కుమారులూ, స్తుతిపాఠకులూ, కవులూ, మంత్రులూ, సేవకులూ అందరూ తన్ను సేవిస్తూ ఉండగా నక్షత్రాల నడుమ విరాజిల్లే చంద్రునిలా ప్రకాశించాడు.

**క. కరుణార్ద్రదృష్టిఁ బ్రజలం, బరిరక్షించుచు వివేకభావకళా చా**
**తురి మెఱసి యిష్టగోష్ఠిం, బరమానందమున రాజ్యభారకుఁ డగుచున్.** 641

* శ్రీకృష్ణుడు దయతో నిండిన చూపులతో ప్రజలను పరిపాలించుతూ విద్యావివేక విజ్ఞానచతురుడై ఆత్మీయులతో అభిభాషిస్తూ ఆనందంగా రాజ్యభారాన్ని వహించాడు.

**వ. ఇ వ్విధంబునం బ్రతిదివసంబును నుండు నవసరంబున నొక్క నాఁడపూర్వ దర్శనుండైన భూసురుం డొక్కరుండు సనుదెంచి సభా మధ్యంబునం గొలువున్న ముకుందునిం బొడగని దండప్రణామం బాచరించి వినయంబునఁ గరంబులు మొగిచి యిట్లనియె. 642**

* వాసుదేవుడు ఈ విధంగా తన నిత్యకార్యక్రమాన్ని కొనసాగిస్తూ ఉండగా ఒకనాడు క్రొత్తవాడైన బ్రాహ్మణ డొకడు వచ్చి సభామధ్యంలో కొలువుతీరి ఉన్న శ్రీకృష్ణుణ్ణి దర్శించి నమస్కారం చేసి వినయంతో చేతులు జోడించి యిలా అన్నాడు.

**క. కంజవిలోచన! దానవ, భంజన! యోగీంద్రవిమల భావలసద్భో**
**ధాంజన! దీప్తి నిదర్శన!, రంజితశుభమూర్తి! కృష్ణ! రాజీవాక్షా! 643**

* రాజీవలోచనా! రాక్షసభంజనా! యోగీశ్వరహృదయ రంజనా! తేజోనిధీ! దివ్యమంగళవిగ్రహా! అనుగ్రహించు.

**తే. అవధరింపు జరాసంధుఁ డతులబలుఁడు, దనకు మ్రొక్కని ధారుణీధవుల నెల్ల**
**వెదకి తెప్పించి యిరువదివేల నాఁకఁ, బెట్టినాఁడు గిరివ్రజపట్టణమున. 644**

* మిక్కిలి బలవంతుడైన జరాసంధుడు తనకు నమస్కరించని రాజుల నందరినీ వెదకి వెదకి తెప్పించి తన రాజధానియైన గిరివ్రజపురంలోని కారాగారాలలో బంధించాడు. అటువంటివారు ఇప్పటికి ఇరవైవేల వరకూ ఉన్నారు.

**తే. వారు పుత్తేర వచ్చినవాఁడ నేను, నరవరోత్తమ! నృపుల విన్నపము గాఁగ**
**విన్నవించెద నామాట వినిన మీఁద, ననఘ! నీ దయ! వీరి భాగ్యంబు కొలఁది. 645**

* ఓ పురుషోత్తమా! వారు పంపించగా నే నిపుడు వచ్చాను. వారి మాటగా నీ కిప్పుడు మనవిచేస్తున్నాను. ఆ పైన మీదయ, వారి అదృష్టం.

**వ. అని ధరాధిపుల విన్నపంబుగా నిట్లనియె. 646**

* ఇలా పలికి ఆబ్రాహ్మణుడు రాజుల విన్నపంగా కృష్ణునితో ఈ విధంగా అన్నాడు.

**ఉ. వారిజనాభ! భక్త జనవత్సల! దుష్టమదాసురేంద్ర సం**
**హార! సరోరుహాసనపురారి ముఖామరవంద్య పాద పం**
**కేరుహ! సర్వలోకపరికీర్తిత దివ్యమహాప్రభావ! సం**
**సారవిదూర! నందతనుజాత! రమాహృదయేశ! మాధవా! 647**

* కృష్ణా! నీవు దుష్టరాక్షస సంహారకుడవు! భక్తజన వత్సలుడవు! బ్రహ్మ, ఈశ్వరుడు, దేవేంద్రుడు మొదలైన దేవతలచేత నమస్కరింపబడే పాదపద్మాలు కలవాడవు! సమస్తలోకాలచేత పొగడబడుతున్న మహాప్రభావం కలిగినవాడవు! సంసారవిదూరా! నందకుమారా! లక్ష్మీనాథా! మాధవా! అవధరించు.

**ఆ. ఆర్తజనుల మమ్ము నరసి రక్షింపు మ, హాత్మ! భక్త జనభయాపహరణ!**
**నిన్ను మది నుతించి నీకు మ్రొక్కెదము నీ, చరణయుగము మాకు శరణ మనఘ! 648**

* ఓ మహాత్మా! ఆర్తజనులమైన మము కటాక్షించి రక్షించు. భక్తుల భయాన్ని పోగొట్టే నిన్ను మా మనస్సులలో ధ్యానించి నీకు నమస్కారం చేస్తున్నాము. నీ పాదాలే మాకు దిక్కు.

**క. బలియుర దండింపఁగ దు, ర్బలులను రక్షింప జగతిపై నిజలీలా**
**కలితుఁడవై యుగయుగమున, నలవడ నుదయింతు కాదె? యభవ!యనంతా! 649**

* ఓ అనంతా! బలవంతులైన దుర్మార్గులను శిక్షించటానికీ, బలహీనులైన సన్మార్గులను రక్షించటానికీ నీవు ప్రతియుగంలోనూ భూమి మీద అవతరిస్తూ ఉంటావు కదా!

**క. నీమదిఁ దోఁపని యర్థం, బీ మేదిని యందుఁ గలదె యీశ్వర! భక్త**
**స్తోమసురభూజ! త్రిజగత్, క్షేమంకర ! దీనరక్షసేయు మురారీ! 650**

* ఓ కృష్ణా! నీ మనస్సుకు తోచని అర్థం ఈ ప్రపంచంలో లేదు. ముల్లోకాలకూ క్షేమాన్ని కోరే భక్త జనమందారమా! దీనులైన మమ్ము కాపాడు.

**క. నీ పంపు సేయకుండఁగ, నా పద్మభవాదిసురులకైనను వశమే?**
**శ్రీపతి శరణాగతులం, జేపట్టి నిరోధ ముడుగఁ జేయుము కృష్ణా! 651**

* బ్రహ్మాది దేవతలకు సైతం నీ ఆజ్ఞ ఉల్లంఘించటం సాధ్యం కాదు. ఓ కృష్ణా! శరణాగతులమైన మమ్ము చేపట్టి మాకీ నిర్బంధాన్ని తొలగించు.

**క. అభవుఁడ వయ్యును జగతిం, బ్రభవించుట లీల గాక భవమందుటయే**
**ప్రభువులకుం బ్రభుఁడవు మము, సభయాత్ముల నరసి కావఁ జను నార్తిహరా! 652**

* దుఃఖనాశకుడా! నీవు పుట్టుక లేనివాడివి. ఐనా పుట్టావు. ఇదంతా నీ లీలావిలాసమే కదా! ప్రభువులకు ప్రభువైన నీవు భయపీడితులమైన మమ్ము రక్షించు.

**క. కదనమున నీ భుజావలి, కెదిరింపఁగ లేక పాఱఁ డే విక్రమ సం**
**పద సెడఁగ జరాసంధుఁడు, పదునెనిమిదిసార్లు ధరణిపాలురు నవ్వన్. 653**

* కదనరంగంలో నిన్నెదిరించలేక ఆ జరాసంధుడు రాజులంతా నవ్వుతూ ఉండగా పదునెనిమిదిసార్లు పారిపోయాడు కదా!

వ. ఇట్లు తనపడిన బన్నములం దలంపక సింహంబు సమద దంతావళంబుల నరికట్టి కావరించు చందంబున మమ్ముం జెఱపట్టి బాధించుచున్న య ప్పాపాత్ముని మర్దించి కారాగృహబద్ధుల మగు మా నిర్బంధంబులు వాపి, సుతదారమిత్ర వర్గంబులం గూర్చి యనన్య శరణ్యులమైన మమ్ము రక్షింపు' మని విన్నవించి రని బ్రాహ్మణుండు విన్నపంబు సేయు సమయంబున. 654

* అయినా వాడు తాను పడిన కష్టాలను నష్టాలను గుర్తుచేసుకోకుండా మదపుటేనుగులను సింహం అరికట్టి విర్రవీగునట్లుగా మమ్ములను చెరపట్టి మిడిసిపడుతున్నాడు. వాణ్ణి శిక్షించి చెరసాలలో మ్రగ్గుతున్న మా నిర్బంధాలను తొలగించు. మా భార్యాపుత్రులను కలుసుకొనేటట్లు చేసి, దిక్కులేని మమ్ములను కాపాడు- అని ఆ రాజులందరూ విన్నవించారని బ్రాహ్మణుడు మనవి చేస్తున్న సమయంలో విజ్ఞానవిశారదుడైన నారదుడు అచ్చటికి విచ్చేశాడు.

## -: నారదుండు శ్రీకృష్ణునితో ధర్మజు రాజసూయము నెరవేర్పుమని చెప్పట :-

సీ. శారదచంద్రికా సారంగరుచితోడ జడముడికెంపు చేఁజఱచి నవ్వ
శరదంబుదావృత సౌదామనీలతా శోభఁ గాంచనకటి సూత్ర మలర
లలితపూర్ణేందుమండల కలంకము గతి మృదుమృగాజినరుచి మించఁ జూపఁ
గల్పశాఖాగ్రసంగత పుష్పగుచ్ఛంబు లీలఁ గేలను నక్షమాల యమర

తే. భూరిపుణ్యనదీతోయపూరణమునఁ, దగు కమండలు వొక్క హస్తమునఁ దనర
వెల్ల జన్నిద మఱుత శోభిల్ల వచ్చె, నారదుండు వివేక విశారదుండు. 655

* శరచ్చంద్ర చంద్రికలాంటి శరీరకాంతులతో జడల కెంపుకాంతులు పంతమాడుతుండగా, శరత్కాలమేఘంపైన మెరపుతీగలాగా తెల్లనిదేహంపైన బంగారు మొలత్రాడు ప్రకాశింపగా, నిండుచంద్రునిలోని మచ్చలాగా నెమ్మేన జింకచర్మం విలసిల్లగా, కల్పవృక్షశాఖ యందున్న పుష్పగుచ్ఛాన్ని తలపిస్తూ చేతిలో జపమాల అలరారగా, పుణ్యనదీజలాలతో నిండిన కమండలం మరొక కరాన విరాజిల్లగా, తెల్లనిజందెం మెడలో మెరుస్తుండగా నారదుడు నందనందనుని కడకు వచ్చాడు.

క. చనుదెంచె నట్లు ముని నిజ, తనుకాంతుల నఖిలదిగ్వితానము వెలుఁగన్
వనజాప్తుఁబోలి య య్యదు, జనములు గృష్ణుండు లేచి సంప్రీతిమెయిన్. 656

* ఈ విధంగా నారదుడు తన దేహకాంతులతో దిక్కులను వెలిగిస్తూ దివినుండి దిగివచ్చిన సూర్యునిలా వచ్చాడు. కృష్ణుడూ, తక్కిన యాదవులూ సాదరంగా లేచి నిలబడ్డారు.

క. వినయమున మ్రొక్కి కనకా, సనమునఁ గూర్చుండఁబెట్టి సముచిత వివిధా
ర్చనములఁ దనిపి మురాంతకుఁ, డనియెన్ వినయంబు దోఁప న మ్మునితోడన్. 657

* శ్రీకృష్ణుడు నారదునికి వినయంగా నమస్కారం చేసి, బంగారుసింహాసనం మీద కూచోపెట్టి తగిన గౌరవ మర్యాదలతో పూజించి ఇలా అన్నాడు.

**తే. ఇప్పుడెందుండి వచ్చితి విందులకును?, నఖిలలోకైక సంచారి వగుటఁ జేసి**
**నీ యెఱుంగని యర్థంబు నిఖిలమందు, నరయ లేదంద్రు; మి మ్మొకఁ డడుగవలయు. 658**

* మునీంద్రా! ఎచ్చటనుండి ఇచ్చటికి విచ్చేశారు? సమస్త లోకాలూ సంచరించే మీకు తెలియని విషయమంటూ ఏదీ ఉండదు. మిమ్మలను ఒక సంగతి అడగాలి.

**తే. పాండునందను లిప్పు డేపగిది నెచట, నున్నవారలొ యెఱిఁగింపు మన్న మౌని**
**కరసరోజాతములు మోడ్చి కడఁకతోడఁ, బలికెఁ గమలాక్షుఁ జూచి సద్భక్తి మెఱసి. 659**

* అదేమంటే- పాండవు లిప్పుడు ఎక్కడ ఉన్నారో, ఎలా ఉన్నారో తెల్పండి అని శ్రీకృష్ణుడు పలుకగా నారదుడు చేతులు జోడించి భక్తితో ఇలా విన్నవించాడు.

**వ. దేవా! విశ్వనిర్మాణకర్తవై మాయివై సకల కార్యోత్పాదనాదిశక్తి యుక్తుండవై పావకుండు దారువులందు నంతర్హిత ప్రకాశుండై యున్న చందంబున వర్తించుచున్న నీదు దురత్యయంబయిన మాయాశతంబులఁ బెక్కు మాఱులు పొడగంటి నిదియు నాకు నద్భుతంబుగా; దదియునుం గాక నీ సంకల్పంబున జగంబుద్భవంబై భవత్పరతంత్రంబు నగు; నట్టి నీ కిష్టంబైన వస్తువు సాధుతరంబుగాఁ దెలియ నెవ్వండు సమర్థుం? డే పదార్థంబు ప్రమాణ మూలంబునం దోఁచు నదియును లోకవిచక్షణుండవైన నీదు రూపంబు; మఱియును ముక్తి మార్గంబు నెఱుంగక సంసారపరవశులైన జీవుల మాయాంధకారంబు నివర్తింపఁజేయ సమర్థంబగు; నీ దివ్యలీలావతారంబులం గలుగు కీర్తి యను ప్రదీపంబు ప్రజ్వలింపఁ జేసి కృపసేయు దట్టి నీకు నమస్కరించెద; నది గావున నీ ప్రపంచంబున నీ యెఱుంగని యర్థంబు గలదె? యని కృష్ణునకు నారదుం డిట్లనియె. 660**

* దేవా! నీవు ప్రపంచాన్ని సృష్టించేవాడవు. మాయా మయుడవై సర్వకార్యాలూ నిర్వర్తించే శక్తి సంపన్నుడవుకూడా నీవే! అరణికర్రలో అగ్ని అంతర్గర్భంగా ఉన్న రీతి నీవు ప్రవర్తిస్తుంటావు. గుర్తింప సాధ్యంకాని నీ అశేషమాయావిశేషాలను ఎన్నోమార్లు కనుగొన్నాను. నీ సంకల్పంతో ఈ ప్రపంచం పుట్టుతుంది. నీకు లోబడి ఉంటుంది. ఈ లోకంలో నీకిష్టమైన వస్తువేదో తెలుసుకోవటం ఎవరికీ సాధ్యం గాదు. ప్రమాణమూలంగా తోచే పదార్థాలన్నీ నీరూపాలే, ముక్తి సాధనరహస్యం తెలుసుకోలేక సంసారంలో పడి మయాంధకారంలో కొట్టుమిట్టాడుతున్న వారిని సముద్ధరించటానికి దివ్యలీలావతారాల కీర్తిదీపమైన నీ రూపం సమర్థం, అలాంటి నీకు నమస్కారం. ఈ ప్రపంచంలో నీకు తెలియనివిషయం లేదు అని నారదుడు తిరిగి యిలా అన్నాడు.

**సీ. 'అయినను వినిపింతు నవధరింపుము దేవ! పాండుతనూజుండు పారమేష్ఠ్య**
**కామానుమోదియై కావింప నున్నాఁడు రాజసూయమహాధ్వరంబు నిష్ఠ**
**తవణింప లోక విడంబనార్థము గాక, పరికింపఁ దన కాత్మబంధువుఁడవు**
**భక్తవత్సలుఁడవు పరమపూరుషుఁడవు యజ్ఞరక్షకుఁడవు యజ్ఞభోక్త**

**తే. వగు భగవత్సేవ చాలదే సుగతి వడయ?, నైన నీ మేనబావ ధర్మాత్మజుండు**
**అతని యజ్ఞంబు రక్షింప నంబుజాక్ష! వలయు విచ్చేయు మచటికి వలను మెఱసి.** 661

* ఓ కృష్ణా! ధర్మరాజు సామ్రాజ్యవాంఛతో రాజసూయయాగం చేయాలనే సంకల్పం కలిగి ఉన్నాడు. ఆలోచించి చూస్తే భక్తవత్సలుడవూ, పరమపురుషుడవూ, రక్షకుడవూ, యజ్ఞభోక్తవూ, ఫలప్రదాతవూ, ఆత్మ బంధుడవూ అయిన నీ సేవ చాలదా సమస్త సౌభాగ్యాలు పొందటానికి? అయినా అతడు యజ్ఞం చేయాలని అనుకోవడం లోకాన్ని అనుకరించటమే అవుతుంది. నీ మేనబావ ధర్మజుడు. ఆయన చేయబోయే యజ్ఞాన్ని రక్షించడానికి నీవు అక్కడికి రాక తప్పదు.

**క. నీ పేరు వినిన నొడివినఁ, బాపంబులు దూలిపోవు పద్మాక్ష; జగ**
**ద్దీపక! నీ దర్శనమున, నేపారవె భక్తజనుల కిహపరసుఖముల్.** 662

* ఓ పద్మాక్షా! నీ నామస్మరణం చేసినా, విన్నా పాపాలు తొలగిపోతాయి. విశ్వజ్యోతీ! నీ దర్శనమాత్రంతో భక్తజనులకు ఇహపరసౌఖ్యాలు సిద్ధిస్తాయి.

**మ. భవదీయోజ్జ్వలకీర్తి దిగ్వితతులన్ భాసిల్లు యుష్మత్పదో**
**ద్భవ నైర్మల్యజలంబు లుత్కలికఁ బాతాళంబునం బాఱు భో**
**గవతీ నామమునం దనర్చి ధరణిం గంగానదీపూరమై**
**దివి మందాకినియై జగత్త్రయమునం దీపించుఁ గాదే? హరీ!** 663

* ఓ కృష్ణా! నీకీర్తి దిగంతాలను ప్రకాశింపచేస్తుంది. నీ పాదాలనుండి ప్రభవించిన పవిత్రజలం పాతాళంలో భోగవతి అనే పేరుతోనూ, భూలోకంలో గంగానదీ రూపంతోనూ, స్వర్గంలో మందాకినీ నామం తోనూ ప్రవహిస్తూ ముల్లోకాల్లోనూ వెలుగుతుంటుంది.

**క. ఆ మఖవేళ సమస్త ధ, రామండలిఁ గల్గు మేటిరాజులు మౌని**
**స్తోమంబును భవదీయ మ, హామహిమముఁ జూచి సత్కృతార్థతఁ బొందన్.** 664

**క. కల’రని చెప్పిన న మ్మునిఁ, పలుకులకు ముదంబు నొంది పంకజనాభుం**
**డెలనవ్వు మొగమునకుఁ జెలు, వొలయఁగఁ బాటించి యుద్ధవున కిట్లనియెన్.** 665

* ధర్మజుడు కావించే యజ్ఞసందర్భంగా మహీమండలం మీద ఉన్న మహారాజులూ, మునీశ్వరులూ అందరూ నీ మహామహిమను చూచి ధన్యులౌతారు. ఇలా పలికిన నారదుని మాటలు విని శ్రీకృష్ణుడు సంతోషించి చిరునవ్వుతో ఉద్ధవుణ్ణి చూచి ఇలా అన్నాడు.

## -: శ్రీకృష్ణుఁ డుద్ధవుని యాలోచన చొప్పన ధర్మరాజు పాలికిఁ బోవుట :-

క. 'ఉద్ధవ! మహిత వివేక స, మిద్ధవచోవిభవ! కార్య మేగతి నడచున్
వృద్ధవరానుమతంబుగ, బోద్ధవ్యము గాఁగఁ జెప్పు పురుషనిధానా! 666

* వివేకంతో కూడిన వాక్చాతుర్యం గల ఉద్ధవా! పెద్దవారి బుద్ధి కెక్కునట్లుగా ఆలోచించి ప్రస్తుత కర్తవ్యం ఏమిటో వివరించు.

తే. అనఘచారిత్ర ! నీవు మా యక్షియుగము, వంటివాఁడవు మనకు నవశ్య మగుచుఁ
జేయఁ దగినట్టి కార్యంబుఁ జెప్పు నీవు, ఏమి పంచినఁ గావింతు నిద్ధచరిత!' 667

* ఓ పుణ్యాత్ముడా! నీవు మాకు కన్నులవంటి వాడవు. ఇప్పుడు మనకు తప్పనిసరిగా చేయ తగిన కార్యాన్ని వెల్లడించు, నీవు ఏ విధంగా చెప్పితే నేను ఆ విధంగా చేస్తాను.

వ. అని సర్వజ్ఞుండైన హరి యజ్ఞుండపోలెఁ దన్ను నడిగినఁ బురుషోత్తముని భాషణంబులకు మనంబున సంతసిల్లి, యతని పాదంబులు దన మనంబున నిడికొని, 'వృద్ధానుమతంబుగా నా యెఱింగిన తెఱంగు విన్నవించెద నవధరింపుము; దేవా! దేవముని చెప్పినట్లు భవదీయ భక్తుండైన యుధిష్ఠిరు యాగపాలనంబు సేయం గైకొనుట కార్యం; బదియునుం గాక నిఖిల దిగ్విజయ మూలంబగు రాజసూయ కృత్యంబునందు జరాసంధమర్దనంబును, నతనిచే బద్ధులైన రాజులం గారాగృహ విముక్తులం గావించుటయుం జేకూరు; నదియునుం గాక నాగాయుత సత్త్వుండును, శతాక్షౌహిణీ బలాన్వితుండును నగు మాగధుని వధియింప మన ప్రభంజననందనుండు గాని యొండొరులు సమర్థులుగా; రట్లగుట నతండు భూసురులేమి గోరిన, నయ్యర్థంబు వృథసేయక యిచ్చుం; గపట విప్రవేషంబునం జని యాజరాసంధుని నాహవభిక్ష వేఁడి, భవత్సన్నిధానంబున న ప్పవమానతనయుం డతని వధియించునట్టి కార్యంబు సేఁత బహుళార్థసాధనం బగు' నని పలికిన నారదుండును యాదవ జనంబులును సభ్యులునుం బొగడి; రంత. 668

* అని సర్వజ్ఞుడైన కృష్ణుడు అమాయకునిలా ఉద్ధవుణ్ణి ప్రశ్నించాడు. అందుకు ఉద్ధవుడు ఎంతో సంతోషించి. శ్రీకృష్ణుని పాదాలను మనసులో ధ్యానించుకొని ఇలా అన్నాడు. 'పెద్దలు సమ్మతించేటట్లు నాకు తెలిసిన విధానాన్ని వివరిస్తాను. దేవా! చిత్తగించండి. నారదుడు చెప్పినట్లుగా నీ భక్తుడైన ధర్మరాజు చేయబోయే యజ్ఞాన్ని రక్షించటం అవశ్యకర్తవ్యం. సమస్త దిక్కులనూ జయించటానికి మూలమైన రాజసూయయాగ సందర్భంలో జరాసంధుణ్ణి సంహరించటం, వానిచేత బంధించబడ్డ రాజులను చెరనుండి విముక్తులను కావించటం కూడా సిద్ధిస్తాయి. అంతేకాకుండా పదివేల ఏనుగుల బలం కలిగినవాడూ, నూరు అక్షౌహిణుల సైన్యంతో కూడినవాడూ అయిన జరాసంధుణ్ణి చంపటానికి మన భీమసేనుడు తప్ప మరింకెవరూ సమర్థులు కారు. బ్రాహ్మణులు ఏమికోరినా జరాసంధుడు కాదనకుండా యిస్తాడు. కాబట్టి కపట బ్రాహ్మణవేషంతో వెళ్లి ఆ జరాసంధుణ్ణి యుద్ధభిక్షను యాచించి మన భీమసేనుని ద్వారా వాణ్ణి చంపించటం జరిగితే సకల ప్రయోజనాలను సాధించినట్లవుతుంది' అని పలికిన ఉద్ధవుని మాటలు విని నారదుడూ, యాదవులూ అందరూ సంతోషించారు. ఉద్ధవుణ్ణి ఎంతో పొగడారు.

సీ. తరల విచిత్రక స్థగిత ప్రభావలిఁ దనరారు గరుడకేతనము వెలుఁగఁ
గాంచన చక్ర సంఘటిత ఘంటా ఘణ ఘణ నినాదముల దిక్కరులు బెదర
సలలిత మేఘపుష్పక వలాహక శైబ్య సుగ్రీవ తురగవిస్ఫురణ దనర
బాలసూర్యప్రభా భాసమానద్యుతి దిగ్వితానం బెల్ల దీటుకొనఁగఁ

తే. బ్రకటరుచి నొప్పు తేరు దారుకుఁడు దేర, నెక్కి వెడలెడు నపుడు పెంపెనయఁ జెలఁగె
శంఖ కాహళ పటహ నిస్సాణ డిండి, మాది రవములు భరితదిగంతములుగ. 669

* తళతళ కాంతులతో ప్రకాశించే గరుడధ్వజంతోనూ, దిగ్గజాలను సైతం బెగ్గడిల్లచేసే బంగారుచక్రాలకు కట్టిన గంటల గణగణ శబ్దాలతోనూ, వేగవంతాలయిన మేఘపుష్పం, వలాహకం, శైబ్యం, సుగ్రీవం అనే గుర్రాలతోనూ, ఉదయ సూర్యుని కాంతిని ధిక్కరించే దిగంతవిశ్రాంత కాంతులతోనూ, విలసిల్లే రథాన్ని దారుకుడు తెచ్చాడు. కృష్ణుడు ఆ రథాన్ని అధిరోహించి బయలు దేరాడు. ఆ సమయంలో శంఖ కాహళాది వాద్యాల శబ్దాలు నలుదెసలా నిండాయి.

క. మను జేశ్వరునకుఁ దాలాం, కునకును గురువృద్ధజనులకును జెప్పి ప్రియం
బున ననుపఁ గాంచన స్యం, దన సామజ వాజి భటకదంబము గొలువన్. 670

* ఉగ్రసేనుడికి, బలరాముడికి, గురువులకూ, పెద్దలైన వారందరికీ చెప్పి ఆదరంతో వారు తన్ను సాగనంపగా, చతురంగబల సమేతుడై శ్రీకృష్ణుడు ప్రయాణ మయ్యాడు.

తే. వంది మాగధ సూత కైవారరవము, వసుమతీ సురకోటి దీవనల మ్రోఁత
లనుగమింపంగ సతులు సౌధాగ్రశిఖర, సీమలందుండి ముత్యాల సేస లొలుక. 671

* వంధిమాగధుల పొగడ్తలూ, బ్రాహ్మణుల ఆశీర్వాదాలూ అతిశయించుతుండగా, పురస్త్రీలు మేడలమీద నుంచి ముత్యాల అక్షతలు చల్లుతుండగా శ్రీకృష్ణుడు ముందుకు సాగాడు.

క. లీలం జని కృష్ణుఁడు వా, హ్యాలిన్ నవకుసుమ ఫలభరానత శాఖా
లోల ఘనసారసాల ర, సాల వనస్థలములందుఁ జతురత విడిసెన్. 672

* ఆ విధంగా శ్రీకృష్ణుడు బయలుదేరి ఫలపుష్పభరితమైన తీయని మామిడి చెట్లూ, మద్దిచెట్లూ, మంచిగంధపుచెట్లూ కలిగిన ఉద్యానవనంలో విడిదిచేశాడు.

వ. అట్టి యెడ సరోజనాభు శుద్ధాంతంబున. 673

సీ. వికచమరంద నవీన సౌరభ లస న్మందార కుసుమదామములు దుఱిమి
చారు సుగంధ కస్తూరికా ఘనసార మిళిత చందనపంక మెలమి నలఁది
కనక కుండల రణత్కంకణ నూపుర ముద్రికా భూషణంబులు ధరించి
యంచిత ముక్తాఫలాంచల మృదుల దివ్యాంబరమ్ములు సెలువారఁ గట్టి

తే. యర్ధచంద్రుని నెకసక్కె మాడునట్టి, యలికఫలకలఁ దిలకము లలరఁ దీర్చి
పెంపు దీపింప నుడురాజ బింబముఖులు, నవచతుర్విధ శృంగార మవధరించి. 674

తే. జలజలోచను కడకు నుత్కలికతోడఁ, దనరు శిబికల నెక్కి నందనులుఁ దాముఁ
గనఁగ నేతేరఁ బ్రతిహారజనులు వేత్ర, కలితులై పౌరులను నెడగలుగ జడియ. 675

* ఆ సమయంలో కృష్ణుని అంతఃపురకాంతలు మకరందాలు చిందుతూ సుగంధాలు వెదజల్లే వికసించిన మందారపుష్పాలహారాలు ధరించి, పరిమళభరితమైన కస్తూరి పచ్చకర్పూరంతో మేళవించిన మంచిగంధం మై పూతలు పూసుకొని, కంకణాలూ కడియాలూ ఉంగరాలూ కుండలాలూ మొదలైన బంగారు ఆభరణాలు దాల్చి, అంచుల్లో ముత్యాలు చెక్కిన మెత్తని పట్టుచీరలు కట్టుకొని అరచందమామ వంటి అలికఫలకాన తిలకం పెట్టుకొని నానావిధాలైన అలంకారాలతో నళినలోచనుని సమీపానికి వచ్చారు. ఈ విధంగా అంతఃపురకాంతలు పల్లకీల నెక్కి తమ సంతానంతో రాగా, కావలివారు పౌరులను ప్రక్కలను ఒత్తిగించారు.

క. అసమాస్త్రుఁడు పులు గడిగిన, కుసుమాస్త్రములను హసించు కోమలతనువుల్
మిసమిస మెఱవఁగ వేశ్యా, విసరము దాసీజనంబు విభవ మెలర్పన్. 676

* పూవిల్తుని పులుగడిగిన పూలబాణాలవంటి మిసమిసలాడే మెత్తని మేనులతో ఆటవెలదులూ, దాసీసహస్రాలూ, గుర్రాలు, ఏనుగులు మొదలైన వాహనాలపై ఎక్కి రాగా.

ఆ. హరుల వేసడములఁ గరులను నెక్కి తో, నరుగుదేర బహువిధాయుధములు
దాల్చి సుభటకోటి దగిలి రా నంతఃపు, రాంగనలు సితాంబుజాక్షు కడకు. 677

* అనేక విధాలైన ఆయుధాలను ధరించిన భటులు తమ వెంట రాగా, అతఃపురసుందరులు గోవిందుని కడకు వచ్చారు.

వ. వచ్చి రంత. 678

క. నారదుని, మాధవుఁడు స, త్కారంబున వీడుకొలుప నతఁడును హృదయాం
భోరుహమునఁ గృష్ణునకును, వారక మ్రొక్కుచును వెస దివంబున కరిగెన్. 679

* అప్పుడు శ్రీకృష్ణుడు నారదుణ్ణి గౌరవించి సాగనంపాడు. ఆ మహర్షి మనస్సులో మాధవునకు మాటిమాటికి నమస్కారం చేస్తూ స్వర్గలోకం వైపు వెళ్ళిపోయాడు.

క. నరవరుల దూతయును ముర, హరుచే నభయ ప్రదాన మంది ధరిత్రీ
వరుల కడకేగి పద్మో, దరు వచనము సెప్పి సమ్మదంబునఁ దేల్చెన్. 680

* దూతగా వచ్చిన బ్రాహ్మణుడు కూడా కృష్ణునిచే అభయ ప్రదానం అందుకొని, రాజుల కడకేగి వాసుదేవుని వచనాలను వారికి వినిపించి వారిని సంతోషింపచేశాడు.

వ. అంతఁ గృష్ణుండు నిజకాంతాతనయ బంధు సుహృజ్జన సమేతుండై కదలి చనునెడ. 681

చ. కటపటరత్న కంబళ నికాయ కుటీరము లుల్లసిల్ల ను
త్కట పటుచామరధ్వజ పతాక కిరీట సితాతపత్ర వి
స్ఫుట ఘనహేతిదీధితి నభోమణిఁ గప్పఁగఁ దూర్యఘోషముల్
చటుల తిమింగి లోర్మిరవ సాగరఘోషము నాక్రమింపఁగన్. 682

* అనంతరం కృష్ణుడు తన భార్యాపుత్రులతో బంధుమిత్రులతో కలసి ఇంద్రప్రస్థ నగరానికి బయలు దేరాడు. ఆ సమయంలో మార్గమంతటా రత్నకంబళ్ళతో నిండిన పటకుటీరాలు వెలిశాయి వింజా మరలూ, విజయధ్వజాలూ విలసిల్లే కిరీటాల నిగనిగలూ, వెల్లగొడుగుల ధగధగలూ, ఆయుధాల తళతళలూ సూర్యుణ్ణి కప్పివేశాయి. భేరీకాహళాది వాద్యధ్వనులు సముద్రఘోషాన్ని అధిగమించాయి.

క. కరిహరిరథసుభట సము, త్కరములు సేవింప మురవిదారుఁడు గడచెన్
సరి దుపవన దుర్గ సరో, వర జనపద పురపుళింద వన గోష్ఠములన్. 683

* ఈ విధంగా మధుసూదనుడు రథ గజ తురంగ పదాతి సేనాసమూహాలు సేవిస్తూ ఉండగా నదులనూ, వనాలనూ, దుర్గాలనూ, జలాశయాలనూ, గ్రామాలనూ, పట్టణాలనూ, భిల్లపల్లెలనూ గోష్ఠాలనూ దాటి వెళ్ళాడు.

వ. ఇట్లు గడచి చనుచు నానర్తక సౌవీర మరుదేశంబులు దాటి ఇందుమతిని దర్శించి, దృషద్వతి నుత్తరించి, సరస్వతీనది దాఁటి మత్స్యవిషయంబులు లోనుగాఁ గడచి యింద్రప్రస్థ నగరంబు డాయం జని, తత్పురోపకంఠవనంబున విడిసిన. 684

* ఇలా కృష్ణుడు ప్రయాణం చేస్తూ సౌవీరాది దేశాలను అతిక్రమించి, ఇందుమతీనదిని దర్శించి, దృషద్వతీ సరస్వతీ నదులను దాటి, పాంచాల మత్స్యదేశాలను గడచి, ఇంద్రప్రస్థనగరాన్ని చేరి పట్టణానికి సమీపంలో ఉన్న ఉపవనంలో విడిది చేశాడు.

## -: పాండవులు శ్రీకృష్ణు నెదుర్కొని తోడ్కొనిపోవుట :-

క. హరిరాక యెఱిఁగి ధర్మజుఁ డఱలేని ముదంబుతోడ ననుజులు బంధుల్
గురుజన సచివ పురోహిత, పరిచారక కరి రథాశ్వ భటయుతుఁ డగుచున్. 685

* శ్రీకృష్ణుని ఆగమనం తెలుసుకొని ధర్మరాజు అంతులేని సంతోషంతో సోదరులూ, బంధువులూ, గురుజనులూ, మంత్రులూ, పురోహితులూ, సేవకులూ, చతురంగబలాలూ వెంటరాగా బయలు దేరాడు.

క. చిందములు మొరయ గాయక, బృందంబుల నుతులు సెవుల బెరయఁగ భక్తిన్
డెందము దగులఁగఁ బరమా, నందంబున హరి నెదుర్కొనం జనుదెంచెన్. 686

* శంఖాలు ధ్వనిస్తుండగా, గాయకుల పొగడ్తలు వీనుల విందు చేస్తూ ఉండగా ధర్మజుడు అతిశయించిన భక్తితో, అనురక్తితో కృష్ణునికి స్వాగతం చెప్పటానికి వచ్చాడు.

వ. ఇట్లు చనుదెంచి ధర్మనందనుండు సమాగతుండైన సరోజనాభునిం బెద్దతడవు గాఢాలింగనంబు చేసి రోమాంచకంచుకిత శరీరుండై యానందబాష్పధారాసిక్త కపోలుండై నిర్భరానంద కందళిత హృదయుండై బాహ్యంబు మఱచియుండె; నప్పుడు హరిని వాయునందన వాసవతనూభవులు గౌఁగిటం జేర్చి సమ్మదంబు నొందిరి; మాద్రేయులు దండప్రణామంబు లాచరించి; రంతఁ బుండరీకాక్షుండు విప్రవృద్ధజనంబులకు నమస్కారంబు చేసి, వారలు గావించు వివిధార్చనలం బరితుష్టుండై కేకయ సృంజయాది భూవిభుల మన్నించి సూత మాగధాదుల కనేక పదార్థంబు లొసంగి, చతురంగ బలసమేతుండై వివిధ మణితోరణాది విచిత్రాలంకృతంబు నతివైభవోతంబునైన పురంబు ప్రవేశించి రాజమార్గంబునం జనుచుండఁ బౌరకామిను లట్టి యెడ. 687

* ఇలా ధర్మరాజు వచ్చి శ్రీకృష్ణుడి దర్శించి గట్టిగా కౌగిలించుకొని, పులకితశరీరుడై ఆనందబాష్పాలు చెక్కిళ్ళను తడుపుతుండగా ఆ సంతోషపారవశ్యంతో ప్రపంచాన్నే మరచిపోయాడు. భీమార్జునులు వనమాలిని ఆలింగనం చేసుకొని ఆనందించారు. నకులసహదేవులు నళినానాభునికి నమస్కారం చేశారు. ఆ తర్వాత శ్రీకృష్ణుడు బ్రాహ్మణులకూ, పెద్దలకూ వందనం చేసి వారు కావించిన పూజలకు సంతోషించాడు. కేకయ సృంజయాది రాజులను మన్నించాడు. వందిమాగధులకు అనేక బహుమానా లిచ్చాడు. అనంతరం చతురంగ బలసమేతుడై మణితోరణాలతో అలంకృతమై అత్యంత వైభవోపేతమైన ఇంద్రప్రస్థ పట్టణంలోనికి ప్రవేశించాడు.

సీ. కొఱనెలపైఁ దోచు నిరులునాఁ జెలువొంది నొసలి పైఁ గురులు తుంపెసలు గునియ
హాటకమణిమయ తాటంకరోచులు గండభాగంబుల గంతులిడఁగ
స్ఫురిత విద్రుమనిభాధర బింబరుచితోడ దరహాసచంద్రిక సరసమాడ
నొండొంటితో రాయు నుత్తుంగ కుచకుంభములు మొగంబులకును బుటము లెగయ

తే. బడుగునడుములు వడఁకంగ నడుగు లిడఁగ, రవళిమెట్టెలు మణినూపురములు మొరయఁ
బొలుచు కచబంధములు భుజంబుల నటింపఁ, బయ్యెదలు వీడి యాడ సంభ్రమముతోడ. 688

వ. ఇట్లు కృష్ణసందర్శన కుతూహల పరస్పరాహూయమానలై గురుపతి సుత బంధు జనంబులు వారింప నతిక్రమించి సమున్నత ధర్మ హర్మ్య శిఖరాగ్రంబు లెక్కి కృష్ణుం జూచి తమలో నిట్లనిరి. 689

* ఆ సమయంలో పురస్త్రీలు పురుషోత్తముణ్ణి దర్శించటానికి మేడలపై గుమికూడారు. అర్ధచంద్రునిమీద మబ్బులు క్రమ్ముకొన్నాయా అన్నట్లు నెన్నుదుటిమీద ముంగురులు మూగుతున్నాయి. బంగారు కమ్మల కాంతులు చెక్కిళ్ళమీద గంతులు వేస్తున్నాయి. పవడపుకాంతిని తిరస్కరించే అధరకాంతితో చిరునవ్వు వెన్నెలలు సరసమాడుతున్నాయి. ఒకదాని నొకటి ఒరుసుకొనే ఉన్నతమైన స్తనాలు ఉత్సాహంతో పైకుబుకు తున్నాయి. సన్నని నడుములు వణకుతున్నాయి. నడచేటప్పుడు మెట్టెలూ, అందెలూ గల్లుగల్లున మ్రోగుతున్నాయి. జుట్టుముడులు వీడి భుజాలపై నాట్యంచేస్తూ వున్నాయి. పైటలు జారిపోతున్నాయి. ఈ విధంగా పౌరకాంతలు గబగబ నడుస్తూ శ్రీకృష్ణుణ్ణి చూడటానికి వచ్చారు.

పౌరకాంతలు కృష్ణుణ్ణి దర్శించాలనే కుతూహలంతో ఒకరి నొకరు పిలుచుకుంటూ పెద్దవారు వద్దంటున్నా వినకుండా ఎత్తైన మేడలమీది కెక్కి ముకుందుని సందర్శించి తమలో తాము ఇలా అనుకున్నారు.

సీ. విశ్వగర్భుండునా వెలయు వే ల్పిల యశోదానందులకుఁ బ్రియసూనుఁడయ్యె;
బ్రహ్మాది సురులకు భావింపఁగా రాని బ్రహ్మంబు గోపాలబాలుఁ డయ్యె;
వేదశాస్త్రంబులు వెదకి కానఁగలేని గట్టి వ్రేతల ఱోలఁ గట్టుపడియె;
దివిజుల కమృతంబు దవిలి యిచ్చిన భక్త సులభుండు నవనీత చోరుఁడయ్యె

తే. నెనయఁ గమలాపతికిఁ జిత్తమీని వేల్పు, గొల్లయిల్లాండ్ర యుల్లముల్ పల్లవింపఁ
జేసె నని కామినులు సౌధశిఖరములను, గూడి తమలోన ముచ్చటలాడి రధిప! 690

* ప్రపంచాన్నే కడుపులో ఉంచుకొన్న ఈ దేవుడు యశోదానందులకు ముద్దులతనయు డయ్యాడు. బ్రహ్మాదిదేవతలకు కూడా భావింప సాధ్యంకాని పరబ్రహ్మస్వరూపం గోపాలబాలు డయ్యాడు. వేదశాస్త్రాలు వెదకినా కనపడని ఘనుడు వ్రేపల్లెలో రోటికి కట్టుపడ్డాడు. వేల్పులకు అమృతం పంచి ఇచ్చిన భక్తసులభుడు వెన్న దొంగ అయ్యాడు. లక్ష్మీదేవికిసైతం మనసివ్వని దేవర గొల్ల పడుచుల హృదయాలను కొల్లగొన్నాడు' - అంటూ పురస్త్రీలు మేడలపై గుంపులుగూడి కృష్ణునిగూర్చి పరస్పరం ముచ్చటించుకొన్నారు.

వ. మఱియును. 691

సీ. గోపాలబాలురఁ గూడి యాడెడి వాఁడు వ్రేపల్లె లోపల నేపు రేఁగి
చల్ల లమ్మఁగఁ బోవు సతుల కొంగులు పట్టి మెఱుఁగుఁ బెక్కిళ్ళను మీటి మీటి
కలికియై ముద్దాడి గౌఁగిటఁ జేర్చిన పూఁబోఁడి కుచములు పుణికి పుణికి
పాయని యనురక్తి డాయఁ జీరిన యింతి యధరసుధారసం బాని యాని

తే. యురుసమాధిపరాష్టాంగ యోగయుక్తు, లైన యోగీశ్వరులు గాననట్టి జెట్టి
వల్లవీజన వన కల్పవల్లి యయ్యె, ననుచుఁ బొగడిరి కృష్ణు న య్యబ్జముఖులు. 692

* 'గోపాలబాలకులతో కలిసి గొల్లపల్లెలో ఆడుకొన్నాడు. చల్ల లమ్ముకోటానికి వెళ్ళే పల్లవపాణులతో సరసాలాడాడు. ముద్దు పెట్టుకోవాలని కౌగిట్లో చేర్చిన ముద్దుగుమ్మల రొమ్ములు స్పృశించాడు. ప్రేమతో దగ్గరకు రమ్మని పిల్చిన వధూమణుల అధరామృత పానం చేశాడు. సమాధినిష్ఠలో మునిగి అష్టాంగయోగంలో వున్న యోగీశ్వరులకు కూడా కన్పడని వేలుపు గొల్లకన్నెలపాలిటి కల్పవల్లి అయ్యాడు.'- అంటూ వాల్గంటులు కృష్ణుణ్ణి పరిపరివిధాల ప్రస్తుతించారు.

మ. అని యబ్బంగి సరోజలోచనలు సౌధాగ్రంబులందుండి య
వ్వనజాతాక్షుని దివ్యమూర్తిఁ దమభావం బందుఁ గీలించి సం

జనితానంద రసాబ్ధిమగ్న లగుచున్ సంప్రీతిఁ దద్భవ్య కీ
ర్తనలై చల్లిరి నవ్యలాజములు మందార ప్రసూనావలుల్. 693

* ఈ విధంగా పొగడుతూ ఆ పురకాంతలు మేడలమీద నిలుచుండి శ్రీకృష్ణుని దివ్యమంగళ విగ్రహాన్నే మనస్సులో నిలుపుకొని ఆనందంతో అతనిపై మందారపుష్పాలూ, లాజలూ చల్లారు.

వ. తదనంతరంబ శోభనపదార్థంబులు కొనివచ్చి ధరామర ధరావర వణి క్పుంగవులు దామోదరునకు కానుక లిచ్చిరి. పుణ్యాంగనా జనంబులు పసిండిపళ్లెరంబులఁ గర్పూర నీరాజనంబులు నివాళింప నంతఃపురంబు సొత్తెంచె; నంతం గుంతిభోజ నందనయుం గృష్ణునిం గని పర్యంకంబు డిగ్గి కౌఁగిలింప నా యదువల్లభుఁడు మేనత్తకుం బ్రణామం బాచరించెఁ; బాంచాలియు ముకుందునకు నభివందనం బొనరించి కుంతిపంపున గోవిందు భామినులగు రుక్మిణి మొదలగువారికి గంధాక్షత కుసుమ తాంబూలంబు లిడి లలిత దుకూల మణిభూషణంబులం బూజించె; యుధిష్ఠిరుండును గమల నయనుని వధూజనుల ననుగత బంధు మిత్ర పుత్ర సచివ పురోహిత పరిచారక సముదయంబుల నుచితంబులగు స్థలంబుల విడియింప నియమించి దినదినంబును నభినవంబులగు వివిధోపచారంబులు గావించుచుండె. 694

* ఆ తరువాత బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులు మంగళ పదార్థాలు కానుక లిస్తుండగా ముత్తైదువలు బంగరుపళ్ళెరాలతో కర్పూర హారతు లెత్తుతుండగా కృష్ణుడు అంతఃపురం ప్రవేశించాడు. కుంతీదేవి కృష్ణుణ్ణి చూచి పాన్పు దిగి కౌగిలించుకోగా కృష్ణుడామెకు వందనం చేశాడు. ద్రౌపది కూడ కృష్ణునికి నమస్కారం చేసి కుంతీ దేవి ఆజ్ఞప్రకారం కృష్ణుని భార్యలైన రుక్మిణి మున్నగువారికి గంధాక్షతలూ, పువ్వులూ, తాంబూలాలూ, పట్టుచీరలూ, మణిభూషణాలు ఇచ్చి పూజించింది. ధర్మరాజు కృష్ణుని అంతఃపురకాంతలకూ, ఆయన పరివారానికి వారి వారి యోగ్యతలకు అనుకూలమైన స్థలాల్లో విడుదులు ఏర్పాటు చేయించి సకల సౌకర్యాలూ సమకూర్చాడు.

క. హరియు యుధిష్ఠిరు సముచిత, పరిచర్యల కాత్మ నలరి పార్థుఁడు దానున్
సరస విహారక్రియలను, సురుచిరగతిఁ గొన్ని నెలలు సుఖముండె నృపా! 695

* ఓ రాజా! కృష్ణుడు కూడా ధర్మరాజు కావించిన సముచిత మర్యాదలకు సంతోషించి అర్జునునితో కలిసి సరస వినోద విహార కార్యక్రమాలతో కొన్ని నెలలు కాలం గడిపాడు.

వ. అంత 696

## -: ధర్మరాజు శ్రీకృష్ణు ననుమతంబున భీమాదుల దిగ్విజయమునకుఁ బంపుట :-

సీ. ధరణీశ! యొకనాఁడు ధర్మతనూజుండు ప్రవిమల నిజసభాభవనమందు
హితులు మిత్రులు పురోహితులును సుతులును మిత్రులు బంధువుల్ క్షత్రవరులుఁ
బరిచారకులు సూత పాఠక కవి బుధ వరులును మునులును వరుసఁ గొలువఁ
జిరలీల నవరత్న సింహాసనస్థుఁడై గొలువుండి వినతుఁడై నలిననాభు

తే. భువనరక్షణదక్షు నద్భుతచరిత్రు, యదుకులేశ్వరు మురదైత్యమదవిభేది
నాప్తు నయవేదిఁ జతురుపాయప్రవీణుఁ, జూచి యిట్లని పలికె నస్తోకచరిత! 697

* ఇలా ఉండగా ఓ రాజా! ఒకనాడు ధర్మరాజు తన సభాభవనంలో హితులూ, పురోహితులూ, పుత్రులూ, మిత్రులూ, సామంతులూ, చుట్టాలూ, సోదరులూ, స్తుతిపాఠకులూ, మునీశ్వరులూ పరివేష్టించి వుండగా నిండుకొలువుండి ఆత్మీయుడై, యదుకులేశ్వరుడై సామదాన భేద దండోపాయాలలో సమర్థుడై లోకరక్షకుడైన శ్రీకృష్ణునితో ఇలా అన్నాడు.

**తే. అనఘచారిత్ర! రాజసూయాధ్వరంబుఁ, నెమ్మిఁ గావించు వేడుక నెమ్మనమున**
**నెనయుచున్నది యది నిర్వహింప నీవ, కాక నా కాత్మబంధువుల్ గలరె యొరులు? 698**

* ఓ పుణ్యచరితా! రాజసూయ యాగం చేయాలని నా హృదయం ఉవ్విళ్ళూరుతూ వుంది. దాన్ని నిర్వహించడానికి నీవు తప్ప నాకు వేరే ఆత్మబంధువు లెవ రున్నారు?

**ఉ. ఎవ్వరు నీ పదాంబుజము లెప్పుడుఁ గొల్తురు భక్తి నిష్ఠులై**
**యెవ్వరు నిన్నుఁ బ్రేమ నుతియింతురు భూరివివేకశాలురై**
**య వ్విమలాత్ము లందుదు రుదంచితశోభన నిత్యసౌఖ్యముల్**
**నివ్వటిలంగఁ గృష్ణ! నిను నేర్చి భజించిన రిత్తవోవునే! 699**

* ఓ కృష్ణా! ఎవరు భక్తితో నీ పాదపద్మాలను ధ్యానిస్తారో, ఎవరు బుద్ధిమంతులై నిన్ను ప్రేమతో సన్నుతిస్తారో, వారు సదా సుఖసంతోషాలను పొందుతారు. నిన్ను చక్కగ తెలిసి పూజించటం వ్యర్థం కాదు గదా!

**వ. అనినఁ గృష్ణుండు ధర్మనందనున కిట్లనియె 700**

* ఆ మాటలు విని కృష్ణుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు.

**చ. నయగుణశాలి! పాండునృపనందన! నీ తలఁ పొప్పు నీ క్రతు**
**క్రియ మునిదేవతాపితృ సుకృత్యమునై నిఖిలోగ్రశాత్రవ**
**క్షయమును బాంధవ ప్రియము సంచితపుణ్యము నిత్యకీర్తియున్**
**జయము నొసంగు దీనిఁ గురుసత్తమ! వేగ యుపక్రమింపనే? 701**

* ఓ ధర్మరాజా! పాండురాజు కుమారుడవు! రాజనీతి విశారదుడవు! నీ ఆలోచన సమంజసంగా వుంది. ఈ రాజసూయప్రక్రియ మునులకూ, దేవతలకూ, పితృదేవతలకూ అభీష్టమయింది. ఇది సమస్త శత్రుక్షయాన్నీ, సకల బాంధవ ప్రియాన్నీ, సమధికమైన పుణ్యాన్నీ శాశ్వతమైన కీర్తినీ, విజయాన్నీ సిద్ధింప చేస్తుంది కాబట్టి వెంటనే యీ యాగాన్ని ప్రారంభించు.

**క. మనుచరిత! నీ సహోదరు, లనుపమ దివ్యాస్త్రవేదు లాహవభూమిం**
**జెనకిన వై రిన్నపాలురఁ, దునుమఁగఁ జాలుదురు శౌర్యదుర్దమ భంగిన్. 702**

* ఓ ధర్మరాజా! నీ తమ్ముళ్ళు సాటిలేని అస్త్రవిద్యా విశారదులు. యుద్ధభూమిలో తమ్మెదిరించిన శత్రురాజులను సంహరించటానికి తగిన సామర్థ్యం కలవారు.

క. గెలువుము విమతనృపాలుర, వెలయుము బుధవినుతమైన విశ్రుతకీర్తిన్
నిలుపుము నిఖిలధరా మం, డలిని భవచ్ఛాసనము దృఢంబుగఁ జెల్లన్. 703

* నీ శత్రురాజులను జయించు, శాశ్వతమైన యశస్సుతో ప్రకాశించు. సమస్త భూమండలంలో నీ శాసనం చెల్లేటట్లు స్థిరంగా స్థాపించు.

క. నీ పంచుకార్య మొరులం, జూపక యేఁ జేయ నిన్ను జుట్టన వ్రేలం
జూపఁగ వచ్చునె! సకల ధ, రాపతులకు నీకుఁ జేయరానిది గలదే!. 704

* నీవు ఆజ్ఞాపించిన కార్యాన్ని చేయటానికి నేను సిద్ధంగా ఉన్నాను. ఇక నిన్ను చూపటానికి ఈ లోకంలో రాజు లెవ్వరికీ సాధ్యం కాదు. నీకు అసాధ్యమైన కార్యంలేదు.

వ. కావున. 705

క. విమలమతి నిట్టి మఖ రా, జమునకుఁ దెప్పింపవలయు సంభారంబుల్
సమకూర్పుము; నీ యనుజుల, సమదగతిం బంపు నిఖిలశత్రుల గెల్వన్. 706

* ధర్మజా! యజ్ఞాలలో శ్రేష్ఠమైన ఈ రాజసూయ యాగానికి అవసరమైన సామగ్రిని సమకూర్చు. శత్రువులను జయించటానికి నీ సహోదరులను పంపించు.

క. అను మాటలు విని కుంతీ, తనయుఁడు మోదమునఁ బొంగి తామరసాక్షున్
వినుతించి శౌర్యకలితుల, ననుజుల దెసఁ జూచి పలికె హర్షముతోడన్. 707

* ఈ విధంగా పలికిన శ్రీకృష్ణుని మాటలు విని ధర్మరాజు ఎంతో సంతోషించి చక్రహస్తుని ప్రస్తుతించాడు. మహాపరాక్రమ వంతులైన సహోదరుల వైపు చూచి ఉత్సాహంతో ఇలా అన్నాడు.

క. సృంజయభూపాలకులును, గుంజర రథ వాజి సుభటకోటులు నినుఁ గొ
ల్వం జను మని సహదేవుని, నంజక పొమ్మనియె దక్షిణాశ జయింపన్. 708

* సహదేవా! 'నీవు సృంజయరాజులూ, చతురంగబలాలూ నిన్ను అనుసరించి రాగా దక్షిణదిక్కును జయించి రమ్ము' అని సహదేవుణ్ణి ఆజ్ఞాపించాడు.

క. ప్రకటచతుర్విధ సేనా, ప్రకరంబులు గొలువఁ బంచెఁ బడమటిదిశకున్
నకులున్ విదళిత రిపు భూ, ప కులున్ శౌర్యంబు మెఱసి పార్థివముఖ్యా! 709

* రథ గజ తురగ పదాతు లనబడే నాలుగు విధాల సైన్యంతో పడమటిదిక్కును జయించి రమ్మని నకులుణ్ణి పంపించాడు.

క. దుర్జనభంజను శౌర్యో, పార్జితవిజయప్రకాండు నాహవనిపుణు
న్నర్జునమహితయశోనిధి, నర్జును నుత్తరపు దిశకు ననిచె నరేంద్రా! 710

* దుర్మార్గుల్ని శిక్షించేవాడూ, పరాక్రమవంతుడూ, యుద్ధనిపుణుడూ, స్వచ్ఛమైన కీర్తి గలవాడూ అయిన అర్జునుణ్ణి ఉత్తరదిక్కును జయించటానికి ధర్మజుడు నియోగించాడు.

ఆ. మహితశౌర్యనిధులు మత్స్యకేకయ మద్ర, భూతలేంద్ర బలసమేతముగను
దర్పమొప్పఁ బంచెఁ దూర్పుదిక్కునకు ను, ద్దామనిహత వైరిధాము భీము. 711

* శౌర్యనిధులైన మత్స్య కేకయ మద్రరాజులతో కూడి తూర్పుదిక్కును జయించటానికి భీముణ్ణి యుధిష్ఠిరుడు పంపించాడు.

చ. పనిచిన వారలేగి ఘనబాహుపరాక్రమ విక్రమంబుల
న్ననుపమశౌర్యులైన చతురంతమహీశుల నోర్చి కప్పముల్
కనక వినూత్న రత్న తురగ ప్రముఖాఖిలవస్తు జాతముల్
గొని చనుదెంచి ధర్మజునకుం బ్రణమిల్లి యుదాత్త చిత్తులై., 712

* ఇలా ధర్మరాజు పంపించగా భీమార్జున నకుల సహదేవులు వెళ్ళి మహాపరాక్రమవంతు లయిన ఆయా దిక్కులలోని రాజులను జయించి వారిచేత కప్పాలు కట్టించుకొని బంగారం, మణులు, గుర్రాలు మొదలైన వస్తుసమూహాన్ని తీసుకొని వచ్చి ధర్మరాజున కర్పించి నమస్కారం చేశారు.

చ. తమతమ పోయి వచ్చిన విధంబుల భూపతులన్ జయించుటల్
క్రమముగఁ జెప్ప నందుల జరాతనయుం డరివెట్టఁ డయ్యె నం
చమరవరేణ్య నందనుఁ డహంకృతి దక్కఁగ విన్నవించినన్
యమసుతుఁ డూరకుండె వికలాత్మకుఁడై విని యంత గృష్ణుఁడున్. 713

* తాము వెళ్ళివచ్చిన విధమూ, రణరంగంలో రాజులను జయించిన పద్ధతీ భీమార్జునులు అన్నగారికి వివరించారు. అందులో జరాసంధుడు మాత్రం కప్పం కట్టలేదని అర్జునుడు చెప్పగా విని ధర్మరాజు వికలమైన మనస్సు కలవాడై మౌనం వహించాడు.

తే. ధర్మనందనుఁ జూచి యుత్కలికతోడఁ, బలికె మాగధుఁ బోరఁ జంపఁగ నుపాయ
మొకటి గల దది సెప్పెద నుద్ధవుండు, నాకుఁ జెప్పిన చందంబు నయచరిత్ర! 714

* ఈ సంగతి తెలుసుకొన్న శ్రీకృష్ణుడు ధర్మరాజుని చూచి 'ధర్మరాజా! జరాసంధుణ్ణి చంపే ఉపాయం ఒకటి ఉంది. దాన్ని ఉద్ధవుడు నాకు చెప్పాడు. దాన్ని చెబుతాను విను.

చ. విను మగధేశ్వరుం డెపుడు విప్రజనావళియందు భక్తియున్
వినయముఁ గల్గి యెద్దియును వేఁడినచో వృథసేయ కిచ్చుఁ గా
వున విజయుండునుం బవనపుత్రుఁడు నేనును బ్రాహ్మణాకృతిం
జని రణభిక్ష వేఁడిన వశంవదుఁడై యతఁడిచ్చుఁ గోరికల్. 715

* జరాసంధునికి బ్రాహ్మణులంటే భక్తివిశ్వాసాలు అధికం. వారేది అడిగినా లేదనకుండా తప్పక యిస్తాడు. అందుచేత నేనూ, భీముడూ, అర్జునుడు బ్రాహ్మణవేషాలతో వెళ్ళి వాణ్ణి యుద్ధ భిక్ష నర్థిస్తాము. అతడు తప్పకుండా మా కోరిక తీరుస్తాడు.

వ. అట్టియెడ. 716

## -: శ్రీకృష్ణ భీమార్జునులు జరాసంధుని వధింపఁ బోవుట :-

**తే. తవిలి యప్పుడు మల్లయుద్ధమున వానిఁ, బిలుకుమార్పింప వచ్చును భీముచేత!'**
**ననిన ధర్మజుఁ 'డదిలెస్స' యనిన విప్ర, వేషములు దాల్చి యరిగిరి విశదయశులు. 717**

* అప్పుడు మల్లయుద్ధంలో భీమునిచేత వాణ్ణి చంపించవచ్చు అని కృష్ణుడు చెప్పగానే ధర్మరాజు ఇది బాగుందని అంగీకరించాడు. అనంతరం కృష్ణార్జున భీమసేనులు ముగ్గురూ బ్రాహ్మణవేషాలతో బయలుదేరి వెళ్ళారు.

**వ. ఇట్లు కృష్ణభీమార్జునులు బ్రాహ్మణ వేషంబులు దాల్చి త్రేతాగ్నులుం బోలెఁ దమ శరీరతేజో విశేషంబులు వెలుంగ, నతిత్వరితగతిం జని గిరివ్రజంబు సొచ్చి యందు యతిథిపూజలు శ్రద్ధాగరిష్ఠ చిత్తుండై కావించుచున్న జరాసంధునిం గనుంగొని యిట్లనిరి. 718**

* ఈ విధంగా శ్రీ కృష్ణభీమార్జునులు బ్రాహ్మణవేషాలు ధరించి అహవనీయం, గార్హపత్యం, దక్షిణాగ్ని అనే త్రేతాగ్నుల్లాగా ప్రకాశిస్తూ గిరివ్రజానికి వెళ్ళి మిక్కిలి శ్రద్ధాభక్తులతో అతిథిసపర్యలు చేస్తూ వున్న జరాసంధుణ్ణి చూచి ఇలా అన్నారు.

**క. 'ధరణీశ! యతిథిపూజా, పరుఁడవు నీ వనుచు దిశలఁ బలుకఁగ విని మే**
**మరుదెంచితిమి మదీప్సిత, మఱ సేయక యిమ్ము సువ్రతాచారనిధీ! 719**

* ఓ మగధరాజా! అతిథిపూజ చేయటంలో అత్యంతం ఆసక్తి కలవాడవని దిగంతవిశ్రాంతమైన నీకీర్తి మేము విని నీ చెంతకు వచ్చాము. ఓ సదాచారసంపన్నా! మా కోరిక తప్పక తీర్చు.

**క. అతిథిజనంబుల భక్తిన్, సతతముఁ బూజించి యుచితసత్కారము లు**
**న్నతి నడపు సజ్జనులు శా, శ్వతకీర్తులు ధరణిఁ బడయఁజాలుదు రనఘా! 720**

* ఓ పుణ్యాత్ముడా! అతిథి జనాన్ని సదా భక్తితో పూజించి వారికి ఉచితసత్కారం చేసి సన్మార్గులు శాశ్వతకీర్తిని పొందుతారు.

**క. పరికింపఁగ దేహం బ, స్థిర మని నిజబుద్ధిఁ దలఁచి చిరతరకీర్తి**
**స్ఫురణం బ్రస్తుతి కెక్కని, పురుషుఁడు జీవన్మృతుండు భూరివివేకా! 721**

* ఓ వివేకవంతుడా! ఈ దేహం శాశ్వతం కాదని తలంచి శాశ్వతమైన యశస్సును సంపాదించాలనే ఆసక్తి కలిగి మహాదాతగా ప్రసిద్ధికెక్కని మనుష్యుని బ్రతుకు వ్యర్థం. వాడు జీవించి కూడా మరణించిన వానితో సమానం.

**క. ధారుణిలోన వదాన్యుల, కీ రాని పదార్థ మొక్కటేనిం గలదే**
**కోరినఁ దన మేయెముకలు, ధీరుండై యిచ్చె నని దధీచిని వినమే? 722**

* దాతలకు దానం చేయరాని వస్తువంటూ లేదు. దేవతలు వచ్చి తన శరీరంలో ఎముకలను కోరిన వెంటనే ఇచ్చిన దధీచిని గూర్చి మనం వినలేదా!

**క. అడిగిన వృథసేయక తన, యొడ లాఁకలిగొన్న యెఱుకు కోగిరముగ నే**
**ర్పడ నిచ్చి కీర్తిఁ గనె నని, పుడమిన్ మును వినమె యల కపోతము నన్ఘా! 723**

* ఆకలిగొన్న బోయవానికి అడిగిన వెంటనే కాదనకుండా తన శరీరాన్నే ఆహారంగా సమర్పించి కీర్తిని పొందిన పావురం కథ మనం వినలేదా?

**క. ఆ యింద్రాగ్నులు శ్యేనక, వాయస రూపములఁ దన్ను వలఁతిగ వేఁడన్**
**ధీయుతుఁడై మును శిబి తన, కాయము గోసిచ్చె నన జగంబుల వినమే! 724**

* ఆ ఇంద్రుడు డేగరూపాన్నీ, అగ్ని కాకిరూపాన్నీ ధరించి వచ్చి తన్ను ప్రార్థింపగా శిబిచక్రవర్తి తన దేహాన్నే కోసి యిచ్చాడని మనం విన్నాము కదా!

**ఆ. ధీరమతులు రంతిదేవ హరిశ్చంద్ర, బలులు నుంఛవృత్తి బ్రాహ్మణునిని**
**మున్ను సెప్ప వినమె? సన్నుతచరితులు, సన్న నైన నేఁడు నున్నవారు. 725**

* ధీరులైన రంతిదేవ, హరిశ్చంద్ర, బలిచక్రవర్తులూ, కళ్లాల్లో గింజలు ఏరుకొని తిని జీవించిన బ్రాహ్మణుడు, సక్తుప్రస్థుడూ- వీరిని గూర్చి చెప్పుకోటం పూర్వం మనం విన్నాం. పొగడతగిన చరిత్రలు గల ఆ మహనీయులు మరణించినప్పటికీన్నీ బ్రతికేవున్నారు.

**వ. అనిన విని జరాసంధుండు వారల రూపంబులును, మేఘ గంభీర భాషణంబులును, గుణకిణాంకంబులును మహాప్రభావంబులును జూచి తన మనంబున 'వీరలు బ్రాహ్మణ వేషధారులైన రాజేంద్రులు గానోపుదు; రని తలంచి 'యిమ్మహాత్ములు గోరిన పదార్థంబ కాదు; ప్రాణంబు లేనియు నిత్తు; నదియునుం గాక తొల్లి బలీంద్రుండు విప్రవ్యాజంబున నడిగిన విష్ణుదేవునకు నాత్మ పదభ్రష్టత్వం బెఱింగియు విచారింపక జగత్త్రయంబు నిచ్చి కీర్తిపరుండయ్యెఁ; క్షత్రబంధుం డనువాఁడు బ్రాహ్మణార్థంబు నిజప్రాణపరిత్యాగంబు సేసి నిర్మలంబగు యశంబు వడసె; నది గావున ననిత్యంబైన కాయంబు విచారణీయంబు గాదు; కీర్తి వడయుట లెస్స' యని తలంచి యుదారుండై కృష్ణార్జునభీములం గని యిట్లనియె. 726**

* ఈ విధంగా పలుకుతున్న మాటలు విని జరాసంధుడు వారి ఆకారాలనూ, గంభీరమైన వాక్కులనూ, అల్లెత్రాటివల్ల భుజాల మీద ఏర్పడ్డ కాయలగుర్తుల్నీ చూచి 'వీరు బ్రాహ్మణవేషం ధరించిన రాజశ్రేష్ఠులు కావచ్చు' నని మనస్సులో తలంచి ఈ మహాత్ములు కోరిన వస్తువునే కాదు ప్రాణాలయినా ఇస్తాను. అదీకాక పూర్వం బలిచక్రవర్తి బ్రాహ్మణనెపంతో యాచించిన విష్ణుదేవునికి, తనస్థానం చెడుతుందని

తెలిసికూడ ఏ మాత్రం లెక్కపెట్టకుండా ముల్లోకాలను దానం చేసి శాశ్వత యశస్సును సంపాందించాడు. క్షత్రబంధుడనే వాడు బ్రాహ్మణులకోసం తన ప్రాణాన్నే త్యాగం చేసి నిర్మలమైన కీర్తిని పొందాడు. అశాశ్వతమైన శరీరాన్ని గూర్చి ఆలోచించవలసిన అవసరం లేదు. కీర్తిని పొందటమే ఉచితం అని ఆలోచించినవాడై కృష్ణార్జునభీములతో ఇలా అన్నాడు.

**క. "భూరిగుణులార! మీ మది, కోరిక యెఱిఁగింపుఁ డేమి కోరిన నైనన్**
**ధీరత నొసఁగుటయే కా, దారయ నా శిరము ద్రుంచి యైనను నిత్తున్. 727**

* ఓ గుణవంతులారా! మీ మనస్సులోని కోరిక యేమిటో తెలపండి. మీరేమి కోరినా ధైర్యంతో ఇస్తాను. అంతేగాదు. చివరకు నా శరీరాన్నైనా ఖండించి యిస్తాను.

**ఉ. నావుడుఁ గృష్ణుఁ డమ్మగధనాథున కిట్లను 'భూవరేణ్య! నీ**
**భావము సూనృతవ్రతశుభస్థితిఁ జెందు టెఱుంగవచ్చె మా**
**కీవలె నాజిభిక్ష! యితఁడింద్ర తనూభవుఁ డే నుపేంద్రుఁడం**
**బావని యీతఁ' డిం దొకనిఁ బైకొని యెక్కటి పోరఁగాఁ దగున్ 728**

* జరాసంధుని మాటలు విని కృష్ణుడు ఇలా అన్నాడు. 'మహారాజా! నీ సత్యవ్రతనిష్ఠ మాకు అవగతమయింది. మేము యుద్ధభిక్ష కోరుతున్నాం. ఇతడు అర్జునుడు. నేను కృష్ణుణ్ణి, ఇతడు భీమసేనుడు. ఇందులో ఒక్కనితో నీవు యుద్ధం చేయవలసి ఉంది.

**చ. అన విని వాఁడు నవ్వి 'యహహా! విన వింతలు పుట్టె మున్ను న**
**న్ననిమొన నోర్వఁజాలక భయంబునఁ బాఱితి పెక్కుమార్లు; వం**
**చన మథురాపురిన్ విడిచి సాగరమధ్యమునందు డాఁగవే?**
**వనరుహనాభ! నీ బిరుదు వాఁడితనంబును నాకు వింతయే? 729**

* కృష్ణుని మాటలు విని జరాసంధుడు నవ్వి 'ఆహా! ఎంత ఆశ్చర్యం! నన్ను యుద్ధరంగంలో ఎదిరించలేక భయంతో చాలా పర్యాయాలు పరుగెత్తి పోయావు. మథురాపట్టణాన్ని వదలిపెట్టి సముద్రమధ్యంలో ఇల్లు కట్టుకొని దాగావు. ఓ కృష్ణా! నీ పరాక్రమం, నీ మగతనం నాకు క్రొత్తకాదు.

**క. ఇన్నేల సెప్ప? మాయలఁ, బన్ననఁబో విడువ గోపబాలక! బల సం**
**పన్నుని మాగధభూవరు, న న్నెఱుఁగవె తొల్లి నందనందన! పోరన్? 730**

* ఇన్ని మాటలు దేనికి? ఎన్ని మాయలు పన్నినా నిన్ను వదలను. నందనందనా! యుద్ధరంగంలో జరాసంధుడంటే ఏమిటో నీకు బాగా తెలుసు.

**ఉ. కాన రణోర్వి న న్నెదురఁ గష్టము గాన తలంగు; గోత్ర భి**
**త్సూనుఁడు భూరిబాహు బలదుర్దముఁ డయ్యును బిన్న; యీ మరు**
**త్సూనుఁడు మామకప్రకట దోర్బలశక్తికిఁ జూడఁ దుల్యుఁడౌ;**
**వీని నెదుర్తు నంచుఁ జెయివీచె జరాసుతుఁ డుగ్రమూర్తియై. 731**

* 'ఓ కృష్ణా! యుద్ధభూమిలో నన్ను ఎదిరించటం నీకు చాలా కష్టం. అర్జునుడు భుజబలశాలి అయినా చిన్నవాడు. ఈ భీముడు నా బాహుబలానికి సమానుడు. వీణ్ణి ఎదుర్కొంటాను.' అని జరాసంధుడు భయంకరాకారుడై భీముణ్ణి యుద్ధానికి చేయి వీచాడు.

క. కరువలిసుతునకు నొక భీ, కరగద నిప్పించి యొక్కగదఁ దనకేలన్
ధరియించి నలువురును గ్ర, చ్చఱఁ బురివెలి కేగి యచట సమతలభూమిన్. 732

* జరాసంధుడు భీమునికి ఒక గదను ఇప్పించి తా నొక గదను ధరించాడు. తరువాత పట్టణానికి వెలుపల సమతలమైన ప్రదేశానికి ఆ నలుగురూ చేరారు.

## -: శ్రీకృష్ణ సహాయుండగు భీముండు జరాసంధునితో యుద్ధము సేయుట :-

సీ. పర్వతద్వంద్వంబు పాథోధియుగళంబు మృగపతిద్వితయంబు వృషభయుగము
పావకద్వయము దంతావళయుగళంబు దలపడు వీఁక నుద్దండలీలఁ
గదిసి యన్యోన్య భీకర గదాహతుల నుగ్రంబుగ విస్ఫులింగములు సెదరఁ
గెరలుచు సవ్యదక్షిణ మండల భ్రమణములను సింహచంక్రమణములను

తే. గదిసి పాయుచు డాసి డగ్గఱచు మింటి, కెగసి క్రుంగుచుఁ గ్రుంగి వే యెగసి భూమి
పగుల నార్చి ఛటచ్ఛటోద్భటమహోగ్ర, ఘనగదా ఘట్టనధ్వని గగన మగల. 733

* భీమ జరాసంధు లిద్దరూ రెండు పర్వతాలూ, రెండు సముద్రాలూ, రెండు సింహాలూ, రెండు వృషభాలూ, రెండు అగ్నులూ, రెండు మత్తేభాలు తలపడిన విధంగా పరస్పరం ఎదిరించి భయంకరంగా యుద్ధం చేశారు. పై కెగురుతూ, వంగుతూ, త్రోసుకుంటూ, తన్నుకుంటూ, కుడి ఎడమలకు తిరుగుతూ, గదా ఘట్టనలతో నిప్పు రవ్వలు రాలగా విజృంభించి సింహనాదాలు చేస్తూ వారు ఘోర సంగ్రామం సాగించారు.

వ. పోరునంత. 734

మ. గద సారించి జరాతనూభవుఁడు హుంకార ప్రఘోషంబులం
జద లల్లాడఁగఁ బాదఘట్టనములన్ సర్వంసహా భాగముం
గదలన్ వాయుజు వ్రేసె; వ్రేయ నతఁ డుగ్రక్రోధ దీప్తాస్యుఁడై
యది తప్పించి విరోధిమస్తకము వ్రేయన్ వాఁడు వోఁదట్టుచున్. 735

* జరాసంధుడు గదను చేపట్టి హుంకారశబ్దంతో ఆకాశం అల్లాడేటట్లూ, పాదఘట్టనతో భూమండలం దద్దరిల్లేటట్లూ విజృంభించి భీముణ్ణి కొట్టాడు. దానికి భీముడు ఆగ్రహోదగ్రమైన ముఖం కలిగిన వాడై ఆ దెబ్బను తప్పించుకొని తిరిగి జరాసంధుని తలమీద మోదాడు.

చ. మడవక భీమసేనుఁడును మాగధరాజు గడంగి బెబ్బులుల్
విడివడు లీల నొండొరుల వీఁపులు మూఁపులునుం బ్రకోష్ఠముల్

నడితల లూరు జాను జఘన ప్రకరంబులు బిట్టు వ్రయ్యఁగాఁ
బిడుగులఁబోలు పెన్గదల బెట్టుగ వ్రేయుచుఁ బాయుచున్ వెసన్. 736

* ఈ విధంగా భీమ జరాసంధులు విజృంభించి పెద్దపులుల్లాగా ఒకరొకరి వీపులూ, మూపులూ, ముంజేతులూ, శిరస్సులూ, తొడలూ, మోకాళ్ళూ, నడుములూ బద్ద లయ్యేటట్లు గదలతో పరస్పరం మోదుకున్నారు.

లయవిభాతి!

బెడ గడరు పెన్గదలు పొడిపొడిగఁ దాఁకఁ బెను పిడుగు లవనిం దొరఁగ నుడుగణము రాలన్
మిడుఁగుఱులు పొరిఁ జదల నడర హరిదంతములు వడఁక జడధుల్ గలఁగ బుడమి చలియింపన్
వెడచఱువ మొత్తియును దడఁబడఁగ నత్తియును నెడమగుడు లాఁచి తిరుగుడు పడఁగ వ్రేయన్
వడవడ వడంకుచును సుడివడక డాసి చల ముడుగ కపు డొండొరుల వడి చెడక పోరన్. 737

* భీమ జరాసంధులు పెనుగదలు పెచ్చులు రేగగా పిడుగులు పడేటట్లూ, చుక్కలు రాలేటట్లూ, నిప్పురవ్వలు వ్యాపించేటట్లూ, దిక్కులు వడికేటట్లూ, సముద్రాలు అల్లకల్లోల మయ్యేటట్లూ, భూమి చలించేటట్లూ కొట్టుకుంటూ, నెట్టుకొంటూ ఒకరికొకరు తీసిపోకుండా యుద్ధం చేశారు.

వ. ఇ వ్విధంబునం బోరుచుండ నొండొరులు గదా దండంబులు దుమురులైనన్ బెండు వడక సమద దిగ్వేదండ శుండాదండ మండిత ప్రచండంబు లగు బాహు దండంబు లప్పగించి ముష్టియుద్ధంబునకు డగ్గఱి. 738

* అలా పోరాడుతుండగా వారి గదాదండాలు ఖండఖండాలు అయిపోయాయి. అప్పుడు భీమ జరాసంధు లిద్దరూ నిరుత్సాహ పడకుండా దిగ్గజాల తొండాలవంటి ప్రచండ బాహుదండాలు చాచి ముష్టి యుద్ధానికి తలపడ్డారు.

లయగ్రాహి!

కాల వెస డాచియును గీ లెడలఁ ద్రోచియును దాలుములు దూలఁ బెడకేల వడి వ్రేయన్
ఫాలములు గక్షములుఁ దాలువులు వక్షములు వ్రీలు నెముకల్ మెదడు నేలఁ దుమురై వే
రాల విపులక్షతవిలోలమగు నెత్తురులు జాలుగొని యోలిఁ బెనుఁగాలువలుగం బే
తాలమదభూతములు ఖేలనలఁ జేతులను దాళములు తట్టుచు సలీలగతి వాడన్. 739

* కాళ్ళతో కుమ్ముకొంటూ, కీళ్ళు విరగగొట్టుకొంటూ; నొసళ్లూ, ప్రక్కలూ, చెక్కిళ్లూ, రొమ్ములూ పగిలేటట్లు; ఎముకలు విరిగేటట్లు; నెత్తురు కాలువలు గట్టి ప్రవహించేటట్లు, బేతాళాది భూతాలు సంతోషంతో చప్పట్లు మ్రోగిస్తూ, కేరింతలు కొడుతూ వుండగా భీమజరాసంధు లిరువురూ యుద్ధం చేశారు.

ఉ. ప్రక్కలుఁ జెక్కులున్ మెడలుఁ బాణితలంబులచేఁ బగుల్చుచున్
ముక్కులు నక్కులుం జెవులు ముష్టిహతిన్ నలియంగ గ్రుద్దుచున్

డొక్కలుఁ బిక్కలున్ ఘనకఠోర పదాహతి నొంచుచున్ నెఱుల్
దక్కక స్రుక్క కొండొరులఁ దార్కొని పేర్కొని పోరి రుగ్రతన్. 740

* ప్రక్కలూ, చెక్కులూ, మెడలూ పగిలేటట్లు చేతులతో కొట్టుకొంటూ, ముక్కులు పగిలేటట్లు గ్రుద్దుకొంటూ, డొక్కల్లో పిక్కల్లో పొడుచుకొంటూ భీమ జరాసంధులు భయంకరంగా పోరాడారు.

ఉ. హుమ్మని మ్రోఁగుచుం బెలుచ హుంకృతు లిచ్చుచుఁ బాసి డాసి కో
కొమ్మనుచు న్నొడళ్ళగల గుల్లల తిత్తులుగాఁ బదంబులం
గ్రుమ్ముచు ముష్టి ఘట్టనల స్రుక్కుచు నూర్పులు సందడింపఁగా
సొమ్మలు వోవుచుం దెలియుచున్ మది ( జేవయుఁ లావుఁ జూపుచున్. 741

* భీమ జరాసంధు లిద్దరూ హుంకారాలు చేస్తూ వొకర్ని, వొకరు సమీపిస్తూ, తిరిగి దూరమవుతూ, శరీరాలు పగిలి గుల్లలయ్యే టట్లు కాళ్ళతో పొడుచుకుంటూ, పిడికిటి పోట్లతో నొప్పించుతూ, సోలుతూ, వాలుతూ, ఉచ్ఛ్వాసనిశ్వాసాలు అధికం కాగా రొప్పుతూ, రోజుతూ పరాక్రమాన్ని ప్రదర్శిస్తూ పోరాటం సాగించారు.

వ. ఇవ్విధంబున వజ్రివజ్రసన్నిభంబగు నితరేతర ముష్టిఘట్టనంబుల భిన్నాంగులై, రక్తసిక్త శరీరంబుల తోడం బుష్పితాశోకంబుల వీఁకను, జేగుఱుఁ గొండల చందంబునను జూపట్టి పోరుచుండఁ గృష్ణుండు జరాసంధుని జన్మమరణప్రకారంబు లాత్మ నెఱుంగుటం జేసి వాయుతనూభవున కలయికలేక లావును జేవయుఁ గలుగు నట్లుగాఁ దద్గాత్రంబునందు దన దివ్యతేజంబు నిలిపి యరినిరస నోపాయం బూహించి సమీరనందనుండు సూచుచుండ నొక్కశాఖాగ్రంబు రెండుగాఁ జీల్చివైచి వాని నట్ల చీరి చంపుమని సంజ్ఞగాఁ జూపిచెప్పిన నతండు నాకీలు దెలిసి యవక్రపరాక్రముండై మాగధుఁ బడఁ ద్రోచి వానిపదంబు పదంబునం ద్రొక్కి బాహు యుగళంబున రెండవపదంబుఁ గదలకుండం బట్టి మస్తకపర్యంతంబుఁ బెళ బెళమని చప్పు ళ్ళుప్పతిల్ల మత్తదంతావళంబు దాళవృక్షంబు సీరు చందంబు నఁ బాదజాను జంఘోరుకటి మధ్యోదరాంస కర్ణనయనంబులు వేఱువేఱు భాగంబులుగా వ్రయ్యలు వాపి యార్చినఁ బౌర జనంబులు గనుంగొని భయాకులులై హాహాకారంబులు సేసిరంత. 742

* ఈ విధంగా దేవేంద్రుని వజ్రాయుధంలాంటి పిడిగ్రుద్దుల వల్ల శరీరాలు పగిలి రక్తం కారుతుండగా పుష్పించిన అశోకవృక్షాల వలెనూ, ఎఱ్ఱని కొండలవలెనూ భీమ జరాసంధులు చూపట్టారు. అప్పుడు శ్రీకృష్ణుడు జరాసంధుని పుట్టుకనూ, చావునూ గూర్చి తెలిసినవాడు కాబట్టి భీమునికి అలసట కలుగకుండా తన దివ్యతేజాన్ని అతనిలో ప్రవేశపెట్టాడు.

తరువాత భీముడు చూస్తూ వుండగా శ్రీకృష్ణుడు ఒక చెట్టుకొమ్మను పట్టుకొని రెండుగా చీల్చి 'వీణ్ణి ఇలా చేసి చంపు' అని సూచన చేశాడు. అది గ్రహించిన భీముడు తత్క్షణం జరాసంధుణ్ణి క్రింద పడద్రోసి ఒకకాలిని తన కాలితో త్రొక్కి పట్టి రెండోకాలిని చేతులతో గట్టిగా పట్టుకొని పెళపెళ మనేశబ్దం పుట్టేటట్లు మదించిన యేనుగు తాటిచెట్టును చీల్చేవిధంగా వాణ్ణి తలవరకూ చీల్చి చంపేశాడు. ఆ భయంకర దృశ్యాన్ని చూచి పురజనులు భయంతో హాహాకారాలు చేశారు.

## -: కారాగృహవిముక్తులగు రాజులు శ్రీకృష్ణుని స్తుతించుట :-

క. అనిలజుని దేవపతి నం, దనుఁడును బద్మాక్షుఁడును నుదారత నాలిం
గనములు సేసి పరాక్రమ,మున కద్భుతమంది మోదమునఁ బొగడి రొగిన్. 743

* అర్జునుడూ, కృష్ణుడూ ఆనందంతో భీముణ్ణి కౌగిలించుకొని జరాసంధుణ్ణి చంపినందుకు అతని పరాక్రమాన్ని ప్రస్తుతించారు.

క. వనజాక్షుఁ డంత గరుణా, వననిధియును భక్త లోక వత్సలుఁడును గా
వున మాగధసుతు సహదే, వునిఁ బట్టము గట్టెఁ దన్నవోన్నతపదవిన్. 744

* శ్రీకృష్ణుడు దయామయుడూ, భక్తవత్సలుడూ కావడం వల్ల జరాసంధుని కుమారుడైన సహదేవుని మగధరాజ్య సింహాసనం మీద నిలిపి పట్టం గట్టాడు.

క. మగధాధినాథునకు ము, న్నగపడి చెఱసాలలను మహాదుఃఖములన్
నొగులుచుఁ దన పాదాంబుజ, యుగళము చింతించుచున్న యుర్వీశ్వరులన్. 745

* ఆ సమయంలో జరాసంధునికి లోబడి అతని చెరసాలల్లో దుఃఖంతో క్రుగ్గుతూ తన పాదాలనే ధ్యానిస్తూ వున్న రాజుల నందరినీ మరచిపోకుండా కృష్ణుడు విడిపించాడు.

వ. అ య్యవసరంబునఁ గృష్ణుండు దన దివ్యచిత్తంబున మఱవ నవధరింపక చెఱలు విడిపించిన వారలు పెద్దకాలంబు కారాగృహంబులం బెక్కుబాధలం బడి కృశీభూత శరీరు లగుటం జేసి రక్త మాంస శూన్యంబులై త్వగస్థిమాత్రావశిష్టంబులును, ధూళిధూసరంబులు నైన దేహంబులు గలిగి కేశపాశంబులు మాసి జటాబంధంబులైన శిరంబులతో మలినవస్త్రులై చనుదెంచి యప్పుడు. 746

* కృష్ణునిచేత కారాగారవిముక్తులైన రాజులందరూ చాలాకాలం చెరసాలల్లో బంధించబడి పెక్కుబాధలు పడటం చేత రక్తమాంసాలు లేక, చిక్కి శల్యమైనవారై, దుమ్ము కొట్టుకొన్న శరీరాలతో, జడలుకట్టిన తలలతో, మాసిన బట్టలతో వాసుదేవుని సమీపానికి వచ్చారు.

సీ. నవపద్మలోచను భవబంధమోచను భరితశుభాకారు దురిత దూరుఁ
గంగణకేయూరుఁ గాంచనమంజీరు వివిధశోభితభూషు విగత దోషుఁ
బన్నగాంతకవాహు భక్త మహోత్సాహు నతచంద్రజూటు నున్నతకిరీటు
హరినీలనిభకాయు వరపీతకౌశేయుఁ గటిసూత్రధారు జగద్విహారు

తే. హారవనమాలికా మహితోరువక్షు, శంఖచక్రగదాపద్మశార్ఙ్గహస్తు
లలిత శ్రీవత్సశోభితలక్షణాంగు, సుభగచారిత్రు దేవకీసుతునిఁ గాంచి. 747

* పద్మలోచనుడూ, భవబంధమోచనుడూ, మంగళాకారుడూ, దురితదూరుడూ, నానాలంకార సహితుడూ, దోషరహితుడూ, గరుడవాహనుడూ, భక్తులకు ఉత్సాహాన్నిచ్చేవాడూ, ఈశ్వరునిచేత

పొగడబడేవాడు, శ్రీవత్సశోభితుడూ, పవిత్రచరిత్రుడూ, దేవకీపుత్రుడూ అయిన కృష్ణుణ్ణి ఆ రాజు లందరూ దర్శించారు.

**చ. భరితముదాత్ములై విగతబంధనులై నిజమస్తముల్ మురా**
**సురరిపు పాదపద్మములు సోఁకఁగ జాఁగిలి మ్రొక్కి నమ్రులై**
**కరములు మోడ్చి యో పరమకారుణికోత్తమ! సజ్జనార్తి సం**
**హరణ వివేకశీల! మహితాశ్రితపోషణ! పాపశోషణా! 748**

**ఆ. వరద! పద్మనాభ! హరి! కృష్ణ! గోవింద, దాసదుఃఖనాశ! వాసుదేవ!**
**యవ్యయాప్రమేయ! యనిశంబుఁ గావింతు, మిందిరేశ! నీకు వందనములు 749**

* బంధవిముక్తులైన ఆ రాజులందరూ సంతోషంతో కృష్ణుని పాదాలపై పడి నమస్కారం చేసి 'ఓ దయామయా! సజ్జనుల దుఃఖాలను పోగొట్టేవాడా! ఆశ్రితరక్షకా! వరదా! వాసుదేవా! పద్మనాభా! శ్రీకృష్ణా! ముకుందా! గోవిందా! ఇందిరావల్లభా! నీకు వందనాలు సమర్పిస్తాము' అని స్తుతించారు.

**ఉ. ధీరవిచార! మమ్ము భవదీయ పదాశ్రయులన్ జరాసుతో**
**దారనిబంధనోగ్ర పరితాపము నీ కరుణావలోకనా**
**సారముచేత నార్చితివి; సజ్జనరక్షయు దుష్టశిక్షయు**
**న్నారయ నీకుఁ గార్యములు యాదవవంశ పయోధిచంద్రమా! 750**

* యాదవవంశమనే సముద్రానికి చంద్రునివంటి వాడవైన ఓ శ్రీకృష్ణా! నీ పాదాలను ఆశ్రయించిన మాకు జరాసంధుని బంధనం వల్ల కలిగిన పరితాపాన్ని నీ కరుణాకటాక్ష మనే జడి వానతో పోగొట్టావు. సజ్జనులను రక్షించటం, దుర్జనులను శిక్షించటం నీ కర్తవ్యాలు కదా!

**సీ. అవధరింపుము మాగధాధీశ్వరుఁడు మాకు బరమబంధుఁడు గాని పగయకాఁడు**
**ప్రకటిత రాజ్యవైభవ మదాంధీభూత చేతస్కులము మమ్ముఁ జెప్ప నేల?**
**కమనీయ జలతరంగముల కైవడి దీప శిఖవోలెఁ జూడ నస్థిరములైన**
**గురుసంపదలు నమ్మి పరసాధనక్రియాగమ మేది తద్బాధకంబు లగుచుఁ**

**తే. బరఁగ నన్యోన్య వైరానుబంధములను, బ్రజలఁ గారించుచును దుష్టభావచిత్తు**
**లగుచు నాసన్న మృత్యుభయంబు దక్కి, మత్తులై తిరుగుదురు దుర్మనుజు లంత. 751**

* ఓ శ్రీకృష్ణా! జరాసంధుడు మాకు బంధువే కాని పగవాడు కాడు, రాజ్యవైభవంవల్ల మదాంధులమైన మమ్ములను గూర్చి చెప్పటం దేనికి? నీటిఅలలలాగా, దీపశిఖలలాగా చంచలాలైన సిరిసంపదలు శాశ్వతాలని నమ్ముకొని పరానికి సంబంధించిన కార్యకలాపాలను పరిత్యజించి పరస్పరం విరోధాలను పెంచుకొంటూ ప్రజలను బాధిస్తూ మరణభయాన్ని మరచిపోయి పొగరుబోతులై ప్రవర్తిస్తారు.

చ. కడపటిచేఁత నైహికసుఖంబులుఁ గోల్పడి రిత్త కోర్కి వెం
బడిఁ బడి యెండమావులఁ బిపాసువులై సలిలాశ డాయుచుం
జెడు మనుజుల్ భవాబ్ధిదరిఁ జేరఁగలేక నశింతు; రట్టి యా
యిడుమలఁ బొందఁజాలము రమేశ! త్రిలోకశరణ్య! మాధవా! 752

* ఓ మాధవా! చివరకు ఐహికసుఖాలను పోగొట్టుకొని వ్యర్థమైన కోరికలతో, నీళ్ళనే భ్రమతో ఎండమావులను సమీపిస్తూ భ్రష్టులైపోయే మనుష్యులు సంసారసముద్రాన్ని దాటలేక నశించి పోతారు. అటువంటి కష్టాలను మేము అనుభవించలేము.

ఉ. వేదవధూశిరో మహితవీథులఁ జాల నలంకరించు మీ
పాదసరోజయుగ్మము శుభస్థితి మా హృదయంబులందు ని
త్యోదితభక్తిమైఁ దగిలియుండు నుపాయ మెఱుంగఁ బల్కు దా
మోదర! భక్త దుర్భవపయోనిధితారణ! సృష్టికారణా! 753

* దామోదరా! వేదాంతవీథుల్లో విహరించే నీ పాదపద్మాలు మా హృదయాల్లో ఎల్లప్పుడూ నిలిచివుండే ఉపాయాన్ని మాకు అనుగ్రహించు. నీవు సంసారసాగరాన్ని తరింపచేసేవాడవు. ఈ సమస్త సృష్టికీ కారణమైనవాడవు.

క. అని తను శరణము వేఁడిన, జననాథుల వలను సూచి సదమలభక్తా
వన చరితుఁడు పంకజ లో, చనుఁ డిట్లను వారితోడ సదయామతియై. 754

* ఈ విధంగా తన్ను శరణుగోరిన రాజులవైపు చూచి భక్తజనావనుడైన పద్మలోచనుడు దయతో కూడినవాడై ఇలా అన్నాడు.

చ. 'జనపతులార! మీ పలుకు సత్యము; రాజ్యమదాంధచిత్తులై
ఘనముగ విప్రులం బ్రజలఁ గాఱియఁ బెట్టుటఁ జేసి కాదె వే
న నహుష రావణార్జునులు నాశము నొందిరి; కాన ధర్మ పా
లనమునఁ గాక నిల్చునె? కులంబు బలంబుఁ జిరాయురున్నతుల్. 755

* ఓ రాజులారా! మీ మాట నిజం. రాజ్యమదంతో బ్రహ్మణులనూ, ప్రజలనూ బాధించటం చేతకదా వేనుడూ, నహుషుడూ, రావణుడూ, కార్తవీర్యార్జునుడూ నాశన మయ్యారు. కాబట్టి ధర్మాన్ని పరిపాలించడం వల్లనే కులం, బలం, ఆయుస్సు, ఔన్నత్యం నిలుస్తాయి.

వ. అది గావున మీ మనంబుల దేహం బనిత్యంబుగాఁ దెలిసి. 756

ఉ. మీరలు ధర్మముం దగవు మేరయుఁ దప్పక భూజనాళిఁ బెం
పారుచు సౌఖ్యసంపదల నందఁగఁ బ్రోచుచు భూరియజ్ఞముల్
గౌరవవృత్తి మత్పరముగా నొనరింపుచు మామకాంఘ్రి పం
కేరుహముల్ భజించుచు నకిల్బిషులై చరియింపుఁ డిమ్ములన్. 757

* కావున ఈ శరీరం శాశ్వతం కాదని గ్రహించండి. మీ ధర్మాన్నీ నీతిని న్యాయాన్నీ తప్పకుండా ప్రజలు సుఖసంతోషాలలో మునిగి తేలేటట్లు పరిపాలన సాగిస్తూ నన్నే ఉద్దేశించి యజ్ఞయాగాదులను నిర్వహిస్తూ, నా పాదాలనే భజిస్తూ, పాపరహితులై ప్రవర్తించండి.

**వ. అట్లయిన మీరలు బ్రహ్మసాయుజ్య ప్రాప్తు లయ్యెదరు; మదీయ పాదారవిందంబులందుఁ జలింపని భక్తియుఁ గలుగునని యానతిచ్చి యా రాజవరుల మంగళస్నానంబులు సేయించి వివిధమణి భూషణ మృదులాంబర మాల్యానులేపనంబు లొసంగి, భోజనతాంబూలాదులం బరితృప్తులం జేసి యున్నత రథాశ్వసామజాధిరూఢులం గావించి నిజరాజ్యంబులకుఁ బూజ్యులం చేసి యనిచిన. 758**

* 'ఆ విధంగా నడచుకుంటే మీరు మోక్షాన్ని పొందుతారు. నాపాదాలపై మీకు అచంచలమైన భక్తి సిద్ధిస్తుంది' అని పలికిన శ్రీ కృష్ణుడు ఆ రాజుల నందరినీ మంగళస్నానాలు చేయించి, మణి భూషణాలూ, మాల్య వస్త్ర గంధాలనూ వారికి బహూకరించి భోజన తాంబూలాదులతో సంతృప్తి పరచి, రథ గజ హయారూఢులను కావించి వారి వారి రాజ్యాలకు పంపించాడు.

**క. నరవరు లీ చందంబున, మురసంహరుచేత బంధమోక్షణులై సు**
**స్థిరహర్షంబులతో నిజ, పురములకుం జనిరి శుభవిభూతి తలిర్పన్. 759**

* ఈ రీతిగా ఆ రాజులందరూ కృష్ణునిచేత బంధవిముక్తులై ఎంతో సంతోషంతో ఎవరి రాజ్యాలకు వారు వెళ్ళారు.

**క. హరిమంగళగుణకీర్తన, నిరతముఁ గావించుచును వినిర్మల మతులై**
**గురుబంధుపుత్త్రజాయా, పరిజన మలరంగఁ గృష్ణుఁ బద్మదళాక్షున్. 760**

**వ. బహుప్రకారంబులం బొగడుచుఁ దమ తమ దేశంబులకుం జని. 761**

* శ్రీకృష్ణుని సద్గుణాలను సంకీర్తించుతూ నిర్మల హృదయులై తమ పుత్త్ర మిత్ర కళత్రాదులు సంతోషించగా ఆ రాజులందరూ తమ తమ రాజ్యాలకు వెళ్ళారు.

**క. నళినదళలోచనుఁడు దముఁ, దెలిపిన సద్ధర్మపద్ధతినిఁ దగవరులై**
**యిలఁ బరిపాలించుచు సుఖ, ముల నుండిరి మహితనిజ విభుత్వము లలరన్. 762**

* కృష్ణుడు ప్రబోధించిన ధర్మమార్గాన్ని తప్పక, న్యాయశీలురై ఆ రాజులందరూ తమ తమ రాజ్యాలను పరిపాలిస్తూ సుఖంగా వున్నారు.

**వ. ఇట్లు కృష్ణుండు జరాసంధవధంబును, రాజలోకంబునకు బంధ మోక్షణంబును గావించి, వాయునందన వాసవనందనులుం దానును జరాసంధతనయుండగు సహదేవుండు సేయు వివిధంబులగు పూజలు గైకొని, యతని నుండ నియమించి, యచ్చోటు గదలి కతిపయ ప్రయాణంబుల నింద్రప్రస్థ పురంబునకుం జనుదెంచి, తద్ద్వారప్రదేశంబున విజయశంఖంబులు పూరించినఁ బ్రతిపక్ష భయదంబును, బాంధవ ప్రమోదంబును నగు న మ్మహాఘోషంబు విని, పౌరజనంబులు జరాతనయు మరణంబు నిశ్చయించి సంతసిల్లిరి. వారిజాక్షుండును భీమసేన పార్థులతోఁ బురంబు ప్రవేశించి ధర్మనందనునకు వందనం**

బాచరించి, తమ పోయిన తెఱంగును, నచ్చట జరాసంధుని వధియించిన ప్రకారంబును సవిస్తరంబుగా నెఱింగించిన నతండు విస్మయ వికచలోచనంబుల నానందబాష్పంబులు గురియ, న మ్మాధవు మాహాత్మ్యంబునకుఁ దమయందలి భక్తి స్నేహ దయాది గుణంబులకుం బరితోషంబు నొందుచుఁ గృష్ణునిం జూచి యిట్లనియె. 763

* ఇలా శ్రీకృష్ణుడు జరాసంధుణ్ణి చంపించి, రాజులందరినీ తమతమ రాజ్యాలకు పంపించి, జరాసంధుని కుమారుడైన సహదేవుడు కావించిన పూజలను స్వీకరించి భీమార్జున సమేతుడై ఇంద్రప్రస్థపురం చేరాడు. పురద్వారంలో వారు విజయశంఖాలు పూరించారు. పురప్రజలంతా విజయసూచకాలైన ఆ శంఖ ధ్వనులు విని సంతోషించారు. కృష్ణుడు భీమార్జునసహితంగా ధర్మరాజును దర్శించి నమస్కారం చేసి తాము మగధకు వెళ్ళిన వృత్తాంతం, అచ్చట జరాసంధుణ్ణి సంహరించిన విధానం వివరంగా నివేదించాడు. ధర్మరాజు కన్నుల నుంచి ఆనందబాష్పాలు పొంగిపొరలుతుండగా కృష్ణునికి తమమీద గల స్నేహ వాత్సల్య కారుణ్యాది గుణాలకు సంతోషిస్తూ ఈ విధంగా అన్నాడు.

సీ. 'కమలాక్ష! సర్వలోకములకు గురుఁడవై తేజరిల్లెడు భవదీయమూర్తి
యంశాంశసంభవు లగు లోకపాలురు నీ యాజ్ఞఁ దలమోచి నిఖిలభువన
పరిపాల నిపుణులై భాసిల్లుచున్న వా రట్టి నీ కొక నృపునాజ్ఞ సేయు
టరయ నీమాయ గాకది నిక్కమే? యేక మై యద్వితీయమై యవ్యయంబు

తే. నైన నీ తేజమున కొక హాని గలదె?, చిన్మయాకార! నీ పాదసేవకులకు
నాత్మపరభేదబుద్ధి యెందైన నఁ గలదె? పుండరీకాక్ష! గోవింద! భువనరక్ష! 764

* ఓ గోవిందా! సర్వలోకాలకూ గురుడవైన నీ యంశం నుంచే దిక్పాలురు జన్మించి నీ ఆజ్ఞను శిరసా వహిస్తూ సమస్త లోకాల్నీ పరిపాలిస్తున్నారు. అటువంటి నీకు ఒక సామాన్యుడైన రాజన్యుని శిక్షించడం ఒక లెక్కలోనిది కాదు. ఇదంతా నీ మాయకాక మరేమిటి? పుండరీకాక్ష! భువనరక్షకా! చిన్మయుడవైన నీ తేజస్సుకు తిరుగులేదు. నీ పాదసేవకులకు భేదభావం ఏ మాత్రమూ కానరాదు.

## -: ధర్మరాజు చేసెడి రాజసూయమునందు శ్రీకృష్ణుండు శిశుపాలుని వధించుట :-

వ. అని గోవిందునిం బొగడి య ద్దేవు ననుమతంబునం గుంతీసుతాగ్రజుండు పరతత్త్వ విజ్ఞానులైన ధరణీసురులను ఋత్విజులంగా వరియించి. 765

* ఈ విధంగా ధర్మరాజు కృష్ణుణ్ణి ప్రస్తుతించి ఆ దామోదరుని ఆజ్ఞానుసారం వేదవిజ్ఞానధనులైన బ్రాహ్మణులను యజ్ఞకార్యనిర్వాహకులుగా స్వీకరించాడు.

సీ. సాత్యవతేయ కశ్యప భరద్వాజోపహూతి విశ్వామిత్ర వీతిహోత్ర
మైత్రేయ పైల సుమంతు మధుచ్ఛంద గౌతమ సుమతి భార్గవ వసిష్ఠ

వాసుదేవాకృతవ్రణ కణ్వ జైమిని ధౌమ్య పరాశరాథర్వకవషు
లసిత వైశంపాయ నాసురి భార్గవ క్రతు వీరసేన గర్గ త్రికవ్య

ఆ. ముఖ్యులైన పరమమునులను గృపుని గాం, గేయ కుంభ జాంబికేయ విదుర
కురుకుమార బంధు కులవృద్ధధారుణీ, సుర నరేంద్ర వైశ్య శూద్రనరుల. 766

* వేదవ్యాసుడు, కశ్యపుడు, భరద్వాజుడు మొదలైన మునీశ్వరులనూ, భీష్మ ద్రోణకృపాది గురువులనూ, ధృతరాష్ట్ర విదురాది కురువృద్ధులనూ, దుర్యోధనాది బంధుజనాన్నీ, సమస్త రాజులనూ, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్ర ముఖ్యులనూ ధర్మరాజు తన యజ్ఞానికి రప్పించాడు.

క. రప్పింప వారు హర్షము, లుప్పతిలఁగ నేఁగుదెంచి యుచితక్రియలం
దప్పక కనుఁగొనుచుండఁగ, నప్పుడు విధ్యుక్త నియతులై భూమిసురుల్. 767

* ధర్మరాజు ఆహ్వానించిన వారంతా సంతోషంతో వచ్చి ఉచిత కార్యక్రమాలను పర్యవేక్షిస్తుండగా బ్రాహ్మణశ్రేష్ఠులు శాస్త్ర ప్రకారం యజ్ఞం ప్రారంభించారు.

ఆ. కడఁగి సవనభూమిఁ గనకలాంగలముల, నర్థి దున్ని పాండవాగ్రజునకు
నచట దీక్షచేసి యంచితస్వర్ణ మ, యోపకరణముల నలోపముగను, 768

* యజ్ఞభూమిని బంగారు నాగళ్ళతో దున్నించి, సువర్ణమయమైన పరికరాలతో ఏ లోపం లేకుండా ధర్మరాజుకు యజ్ఞదీక్ష నిచ్చారు.

వ. ఇట్లు నియమంబున సముచిత క్రియాకలాపంబులు నడపుచుండి రప్పుడు. 769

* ఈ విధంగా బ్రాహ్మణులు నియమంతో ఉచిత కార్యకలాపాలు నడుపుతున్నారు.

క. సకలావనీశు లిచ్చిన, యకలంక సువర్ణరత్న హయధనవస్త్ర
ప్రకరంబులు మొదలగు కా, నుక లందుకొనన్ సుయోధనుని నియమించెన్. 770

* ధర్మరాజు సమస్త భూపతులూ తన కర్పించే ధన కనక వస్తు వాహనాదులైన కానుకలను స్వీకరించటానికి దుర్యోధనుణ్ణి నియమించాడు.

సీ. అర్థిజాతము గోరినట్టి వస్తువు లెల్లఁ దగఁ బంచి యిడఁగఁ రాధాతనూజు
సరసాన్న పానాది సకలపదార్థముల్ పాకముల్ సేయింపఁ బవనతనయుఁ
బంకజోదరు నొద్దఁ బాయక పరిచర్య దవిలి కావింప వాసవతనూజు
సవననిమిత్తంబు సంచితద్రవ్యంబు పెంపుతో వేగఁ దెప్పింప నకులు

తే. దేవగురు వృద్ధధాత్రీసురావలులను, నరసి పూజింప సహదేవు నఖిలజనులఁ
బొలుచు మృష్టాన్న తతులఁ దృప్తులను జేయ, ద్రౌపదిని నియమించెను ధర్మసుతుఁడు. 771

* యాచకులు అడిగిన వస్తువులను దానం చేయటానికి కర్ణుణ్ణీ, షడ్రసోపేత భోజనపదార్థాలను తయారుచేయించటానికి భీముణ్ణి, శ్రీకృష్ణునికి పరిచర్యలు చేయటానికి అర్జునుణ్ణీ, యజ్ఞానికి అవసరమైన సంభారాలను సమకూర్చటానికి నకులుణ్ణీ; దేవ బ్రాహ్మణులనూ, గురువులనూ, పెద్దలనూ పూజించటానికి సహదేవుణ్ణీ; యాగానికి విచ్చేసిన సమస్త ప్రజలూ మృష్టాన్నపానాలతో సంతుష్టు లయ్యేటట్టు చేయటానికి ద్రౌపదినీ ధర్మరాజు నియమించాడు.

**వ. అ య్యవసరంబున. 772**

**చ. హరి శిఖి దండపాణి నికషాత్మజ పాశి సమీర గుహ్య కే**
**శ్వర శశిమౌళి పంకరుహసంభవ చారణ సిద్ధ సాధ్య కి**
**న్నర గరుడోరగామరగణంబులు వచ్చి మఖంబుఁ జూచి య**
**చ్చెరువడి తొల్లి యెవ్వరును జేయు మఖంబులు నింత యొప్పునే? 773**

* అప్పుడు దేవేంద్రుడు మొదలైన దిక్పాలురూ, బ్రహ్మాది దేవతలూ, సిద్ధ సాధ్య కిన్నర కింపురుష విద్యాధరులూ ధర్మరాజు చేస్తున్న యజ్ఞాన్ని చూచి పూర్వం యే రాజుకూడా ఇంత గొప్పగా యజ్ఞం చేయలేదని మెచ్చుకున్నారు.

**క. అదిగాక యిందిరావిభు, పదములు సేవించునట్టి భాగ్యము గలుగం**
**దుదిఁ బడయరాని బహు సం, పద లెవ్వియుఁ గలవె? యనుచుఁ బ్రస్తుతి సేయన్. 774**

* అంతేకాకుండా 'శ్రీకృష్ణుని పాదరాజీవాలు పూజించే భాగ్యం కలిగిన వారికి పొందలేనిదంటూ ఏదీ వుండదు' అని బ్రహ్మాదులు ప్రస్తుతించారు.

**వ. అప్పుడు. 775**

**చ. అమరసమానులై తనరు యాజకవర్గము లోలి రాజ సూ**
**య మఖవిధాన మంత్రముల నగ్ని ముఖంబుగఁ జేసి ధర్మజుం**
**గ్రమమున వేలిపింపఁ గ్రతురాజసమాప్తి దినంబునన్ నృపో**
**త్తముఁడు గడంగి యాజక సదస్యగురుద్విజకోటిఁ బెంపునన్. 776**

* దేవతలతో సమానులైన ఋత్విజులు రాజసూయ యాగానికి అనువైన మంత్రాలతో హవ్య ద్రవ్యాలను ధర్మరాజుచేత వేలిపించి యాగాన్ని చేయించారు. యజ్ఞం పరిసమాప్తమైన చివరి దినం ధర్మరాజు ఋత్విజులనూ, సభాసదులనూ, పెద్దలనూ, బ్రాహ్మణులనూ పూజించాలని భావించాడు.

**వ. పూజించునప్పు డం దగ్రపూజార్హు లెవ్వ రని యడిగిన సదస్యులు దమకుఁ దోఁచిన విధంబులంబలుక వారి భాషణంబులు వారించి వివేకశీలుండును, జతుర వచనకోవిదుండును నగు సహ దేవుండు భగవంతుండును, యదుకుల సంభవుండును నైన శ్రీకృష్ణునిం జూపి 'యి మ్మహాత్ముని సంతుష్టుం జేసిన భువనంబు లన్నియుం బరితుష్టిం బొందు' నని చెప్పి ధర్మజుం జూచి యిట్లనియె. 777**

* ఈ విధంగా పూజించే సందర్భంలో అగ్రపూజకు అర్హుడెవడనే ప్రశ్న పుట్టింది. సభలో నున్నవారు తమకు తోచిన విధంగా తలకొకరీతిగా చెప్పారు. వారి మాటలను వారించి బుద్ధిమంతుడైన సహదేవుడు భగవంతుడైన కృష్ణుణ్ణి చూపించి 'ఈ మహాత్ముణ్ణి సంతుష్టుణ్ణి చేసిన సమస్త లోకాలూ సంతోషిస్తాయి' అని పలికి ధర్మరాజుతో ఇలా అన్నాడు.

**ఉ. కాలము దేశమున్ గ్రతువుఁ గర్మముఁ గర్తయు భోక్తయున్ జగ**
**జ్జాలము దైవమున్ గురువు సాంఖ్యము మంత్రము నగ్ని యాహుతుల్**
**వేళలు విప్రులున్ జననవృద్ధిలయంబుల హేతుభూతముల్**
**లీలలఁ దానయై తగ వెలింగెడు నెక్కటితేజ మీశుఁడున్.** 778

* కాలమూ, దేశమూ, యజ్ఞమూ, కర్మమూ, కర్తా, భోక్తా ప్రపంచమూ, దైవమూ, గురువూ, మంత్రమూ, అగ్ని, హవ్యద్రవ్యాలూ, సృష్టి స్థితి లయాలూ- సమస్తమూ తానేయై ప్రకాశించే ఏకైక దివ్యస్వరూపుడు ఈ కృష్ణపరమాత్మ డొకడే.

**చ. ఇతఁడె యితండు గన్ను లొకయించుక మోడ్చిన నీ చరాచర**
**స్థితభువనంబు లన్నియు నశించు నితం డవి విచ్చిచూచినన్**
**వితతములై జనించుఁ బ్రభవిష్ణుఁడు విష్ణుఁడు నైన యట్టి యీ**
**క్రతుఫలదుండుగా కొరుఁ డొకం డెటు లర్హుఁడు శిష్టపూజకున్?** 779

* పరమేశ్వరుడైన ఈ శ్రీకృష్ణుడు కన్నులు మూసుకున్నాడంటే ఈ చరాచరప్రపంచమంతా నశిస్తుంది. కన్నులు విప్పి చూస్తే ఈ లోకాలన్నీ జన్మిస్తాయి. సృష్టి స్థితి లయాలకు కారకుడైన ఈ పుణ్యపురుషుడు యజ్ఞఫలాన్ని ప్రసాదించే ప్రభువు విష్ణుస్వరూపుడు. సర్వసమర్థుడు. అగ్రపూజకు అర్హుడు ఇతడు గాకపోతే మరెవ్వరు?

**ఉ. ఈ పురుషోత్తమున్ జగదధీశు ననంతుని సర్వశక్తుఁ జి**
**ద్రూపకు నగ్రపూజఁ బరితోషితుఁ జేయ సమస్త లోకముల్**
**వే పరితుష్టిఁ బొందుఁ బృథివీవర! కావున నీవు కృష్ణునిన్**
**శ్రీపతిఁ బూజసేయు మెడసేయక మాటలు వేయు నేటికిన్?** 780

* ఓ రాజా! పురుషోత్తముడూ, లోకాధిపతీ, అనంతుడూ, సమస్త శక్తులు కలవాడూ, చిద్రూపుడూ అయిన శ్రీకృష్ణుణ్ణి ప్రప్రథమంగా పూజించి సంతోషింపచేస్తే సమస్తలోకాలూ సంతృప్తి పొందుతాయి

**క. అని సహదేవుఁడు పలికిన, విని యచ్చటి జనులు మనుజవిభులును ఋషులున్**
**మునుకొని మనములు మోదము, దనుకఁగ 'నిది లెస్స' యనిరి ధర్మజుఁడంతన్.** 781

* 'కాబట్టి నీవు ఆలస్యం చేయకుండా అన్యథా ఆలోచించ కుండా శ్రీకృష్ణుణ్ణి పూజించు' అని సహదేవుడు చెప్పగా అ సభలో నున్న ప్రజలూ, రాజులూ, ఋషులూ మొదలైన వారంతా సంతోషంతో 'ఇది సముచితం' అని అంగీకరించారు.

క. మునిజన మానస మధుకర, వనజాతములైన యట్టి వారిజదళ లో
చను పదయుగళప్రక్షా, ళన మొగిఁ గావించి తజ్జలంబులు భక్తిన్. 782

క. తానును గుంతియు ననుజులు, మానుగ ద్రుపదాత్మజయును మస్తకములఁ బెం
పూనిన నియతి ధరించి మ, హానందము బొంది రతిశయప్రీతిమెయిన్. 783

* అపుడు ధర్మరాజు మహామునుల మనస్సులనే మధుకరాలకు పద్మాల వంటివైన శ్రీకృష్ణుని పాదాలు భక్తితో కడిగాడు. తానూ, కుంతీ, భీమాదులూ, ద్రౌపదీ శ్రీకృష్ణుని పాదజలాన్ని ఆనందంతో తమ శిరస్సుల మీద చల్లుకొని ఎంతో సంతోషించారు.

క. చంచత్కాంచన రుచిరో, దంచితవస్త్రముల నూతనార్క ప్రభలన్
మించిన రత్నములం బూ, జించెన్ ధర్మజుఁడు కృష్ణు జిష్ణు సహిష్ణున్. 784

* బంగారు జలతారు వస్త్రాలతో బాలభాను కాంతులను మించిన కాంతులు గల రత్నాలతో ధర్మరాజు శ్రీకృష్ణుణ్ణి సమ్మానించాడు.

వ. ఇట్లు పూజించి యానందబాష్పజల బిందు సందోహకందళిత నయనారవిందంబులం గోవిందుని సుందరాకారంబు దర్శింపఁ జాలకుండె; నట్లు పూజితుండై తేజరిల్లు పుండరీకాక్షు నిరీక్షించి హస్తంబులు నిజమస్తకంబుల ధరించి వినుతులు సేయుచు, నఖిలజనంబులు జయజయ శబ్దంబు లిచ్చిరి; దేవతలు వివిధతూర్య ఘోషంబులతోడం బుష్పవర్షంబులు గురియించి; రయ్యవసరంబున
. 785

* ఈ విధంగా పురుషోత్తముణ్ణి పూజించిన ధర్మరాజు కనుల నిండా ఆనందబాష్పాలు పొంగిపొరలాయి. ఆయన గోవిందుని సుందరాకారాన్ని చూడలేకపోయాడు. ఇలా పూజించబడి ప్రకాశించే పుండరీకాక్షుణ్ణి చూచి సమస్త ప్రజలూ చేతులు జోడించి పరిపరివిధాల ప్రస్తుతించి జయజయధ్వానాలు చేశారు. దేవతలు వివిధవాద్యాలు మ్రోయిస్తూ పుష్పవర్షం కురిపించారు.

క. దమఘోషసుతుఁడు దద్విభ, వము సూచి సహింప కలుక వ్రేటిలఁగా బీ
రము డిగ్గి నిలిచి నిజ హ, స్తము లెత్తి మనోభయంబు దక్కినవాఁడై. 786

వ. అప్పు డప్పుండరీకాక్షుండు వినుచుండ సభాసదులం జూచి యిట్లనియె. 787

* అప్పుడు దమఘోషుని కుమారుడైన శిశుపాలుడు ఆ వైభవాన్ని చూచి ఓర్వలేకపోయాడు. అసూయతో ఆసనం దిగి నిలబడి నిర్భయంగా తన చేతులెత్తి శ్రీకృష్ణుడు వినేటట్లు సభాసదులతో ఇలా అన్నాడు.

క. 'చాలుఁ బురే యహహా! యీ, కాలము గడపంగ దురవగాహం బగు నీ
తేలా తప్పెను నేఁడీ, బాలకు వచనములచేతఁ బ్రాజ్ఞుల బుద్ధుల్? 788

* ఆహా! బాగు బాగు! ఈ కాలాన్ని గడపటం చాల కష్టంగా వుంది. ఈ పసివాని మాటలతో బుద్ధి మంతులైన పెద్దలబుద్ధులు నీతి మార్గం నుండి ఎందుకు తొలిగాయో ?

**వ. ఇట్లు దప్పిన తెఱం గెట్టనినఁ బాత్రా పాత్ర వివేకంబు సేయనేర్చిన విజ్ఞాననిపుణులు, నున్నతసత్త్వ గరిష్ఠులు, బహువిధ తపోవ్రత నియమశీలురు, ననల్పతేజులు, మహైశ్వర్యశక్తిధరులుఁ, బరతత్త్వవేదులు, నఖిలలోకపాలపూజితులు, విగతపాపులుఁ బరమయోగీంద్రులు నుండ వీరిం గైకొనక వివేకరహితులై గోపాలబాలునిం బూజ సేయుటకు నెట్లు సమ్మతించిరి; పురోడాశంబు సృగాలంబున కర్హంబగునే? యదియునుంగాక. 789**

* ఏమంటే- యోగ్యులనూ అయోగ్యులనూ నిర్ణయించగలిగిన నేర్పరులూ, గొప్పసత్త్వ గుణసంపన్నులూ, తపోనియమవంతులూ, అధికమైన తేజస్సు గలిగినవారూ, గొప్ప ఐశ్వర్యవంతులూ, పరబ్రహ్మస్వరూపం తెలిసిన జ్ఞానులూ, సమస్త లోకపాలురచేత పూజింపతగినవారూ, పాపరహితులూ, యోగీశ్వరులూ ఎందరో ఈ సభలో వున్నారు. వీరందరినీ లక్ష్య పెట్టకుండా బుద్ధిహీనుడైన ఒక గొల్లపిల్లవాణ్ణి పూజించటానికి ఎలా సమ్మతించారు? యజ్ఞం కొరకైన పురోడాశం నక్కకు ఎలా అర్హమవుతుంది?

**సీ. గురుదేవ శూన్యుండు కులగోత్ర రహితుండు దలిదండ్రు లెవ్వరో తడవఁ గాన
మప్పులఁ బొరలెడు నాదిమధ్యావసానంబులం దరయ మానంబు లేదు
బహురూపియై పెక్కుభంగుల వర్తించు వావి వర్తనములు వరుసలేవు
పరికింప విగతసంబంధుండు తలపోయ మా నిమిత్తంబున మాని సయ్యెఁ**

**తే. బరఁగ మున్ను యయాతిశాపమునఁ జేసి, వాసి కెక్కదు యాదవవంశమెల్ల
బ్రహ్మతేజంబు నెల్లఁ గోల్పడిన యితఁడు, బ్రహ్మఋషి సేవ్యుఁ డగునె గోపాలకుండు? 790**

* గురువులూ, దేవుడూ లేనివాడూ, కులం గోత్రం లేనివాడూ, తల్లిదండ్రు లెవరో తెలియనివాడూ, నీటి మీద శయనించేవాడూ, ఆదిమధ్యాంతాలు కానరానివాడూ, నటునిలాగా అనేక రూపాలతో పెక్కురీతుల ప్రవర్తించేవాడూ, వావివరుసలుగాని, సంబంధ బాంధవ్యాలుగాని లేనివాడూ ఐన ఈ కృష్ణుడు మా కారణంగా మాననీయు డయ్యాడు. యయాతిశాపంచేత ఈ యదువంశ ప్రసిద్ధి అణగారి పోయింది. బ్రహ్మతేజాన్ని కోల్పోయిన ఈ గోపాలకుడు బ్రహ్మర్షుల పూజకు ఎలా అర్హుడవుతాడు?

**క. జారుఁడు జన్మావధియును, జోరుఁడు ముప్పోకలాఁడు సుమహితపూజా
చారక్రియలకు నర్హుఁడె, వారక యితఁ డనుచు నశుభవాక్యస్ఫూర్తిన్. 791**

* జారుడూ, పుట్టుక మొదలు చోరుడూ, మూడు త్రోవల్లో నడచేవాడూ ఐన ఈ కృష్ణుడు పూజార్హుడు ఎలా అవుతాడు? అంటూ అమంగళకరమైన మాటలతో శిశుపాలుడు శ్రీకృష్ణుణ్ణి నిందించాడు.

**చ. అని తను దూఱనాడిన మురాంతకుఁ డా శిశుపాలు వాక్యముల్
విని మదిఁ జీరికిం గొనఁడు విశ్రుతఫేరవ రావ మాత్రుఁ గై**

కొనని మృగేంద్రురీతి మునికోటియు రాజులుఁ బద్మనాభు నా
డిన యవినీతి భాషలకు డెందమునం గడు వంత నొందుచున్. 792

* నక్క కూతలను లెక్కపెట్టని సింహంలాగా శ్రీకృష్ణుడు శిశుపాలుని దుర్భాషలను లక్ష్యపెట్టలేదు. కానీ సభలో వున్న ఋషులూ, రాజులూ మాత్రం శిశుపాలు డాడిన పరుషవాక్కులకు చాలా బాధపడ్డారు.

ఉ. వీనులు మూసికొంచు విన విస్మయ మంచు 'ముకుంద! మాధవా!
శ్రీనిధి! వీని నేగతికిఁ జేర్చెదొ' యంచు దురాత్ముఁ దిట్టుచు
న్నా నరనాథులున్ మునులు నచ్చట నిల్వక పోవఁ బాండు సం
తానము లప్రమేయ బలదర్ప మహోద్ధత రోషచిత్తులై. 793

* శిశుపాలుడు కృష్ణుణ్ణి నిందించిన దుర్భాషలను వినలేక మునులూ, రాజులూ చెవులు మూసుకొని ఆశ్చర్యపడుతూ 'ఓ కృష్ణా! వీణ్ణి ఏ విధంగా కడతేరుస్తావో' అంటూ శిశుపాలుణ్ణి నిందిస్తూ సభనుంచి నిష్క్రమించారు. పాండవులకు శిశుపాలునిమీద చాలా కోపం వచ్చింది.

వ. అప్పుడు కేకయ సృంజయభూపతులుం దామును వివిధాయుధపాణులై యదల్చి నిల్చిన వాఁడును బెఱుతివక యదల్చి పలుకయు వాలునుం గైకొని భుజాగర్వదుర్వారుండై గోవిందునిఁ దదనువర్తులైన వారలం గుపితుండై నిందింప న మ్ముకుందుం డాగ్రహంబున లేచి తన కట్టెదుర నెదిర్చియున్న శిశుపాలుని రూక్షేక్షణంబుల వీక్షించుచు, నా క్షణంబ తన్మస్తకంబు నిశితధారా కరాళంబైన చక్రంబున నవక్రపరాక్రముండై రుధిరంబు దొరఁగం దునుమ, న మ్మహాకలకలం బాకర్ణించి చైద్యబలంబులు దదీయపక్షచరులైన భూపతులును గనుకనిం బఱచి; ర య్యవసరంబున. 794

* ఆ సమయంలో కేకయ సృంజయ రాజులూ, పాండవులూ ఆయుధధారులై శిశుపాలుణ్ణి అదలించి నిలబడ్డారు. వాడు కూడా పాండవాదులను లక్ష్యపెట్టక డాలూ, కత్తీ పట్టుకొని భుజ బలగర్వంతో దురహంకారంతో కృష్ణుణ్ణీ, అతణ్ణి అనుసరించిన వారినీ నిందించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఆగ్రహంతో లేచి తనకు ఎదురుగా నిలబడి దెబ్బలాటకు సిద్ధంగా వున్న శిశుపాలుని తీవ్రంగా చూస్తూ వాడివీడని సుదర్శన చక్రంతో వాడిశిరస్సును తత్క్షణం ఖండించాడు, ఆ భయంకర కోలాహలాన్ని ఆలకించి ఆ దృశ్యాన్ని చూచి శిశుపాలుని సైన్యమూ, అతడిపక్షంలోని రాజులూ తత్తరపాటుతో పారిపోయారు.

క. మునివరులును జనపతులును, గనుఁగొని వెఱఁ గందఁ జైద్యు గాత్రమునందుం
డనుపమ తేజము వెలువడి, వనజోదరు దేహమందు వడిఁ జొచ్చె నృపా!' 795

* ఓ పరీక్షిన్మహారాజా! ఆ సమయంలో మునీశ్వరులూ, రాజులూ చూచి ఆశ్చర్యపడేటట్లుగా శిశుపాలుని దేహంనుంచి దేదీప్య మానమైన తేజస్సు వెలువడి కృష్ణుని శరీరంలో ప్రవేశించింది.

వ. అనిన మునివరునకు భూవరుం డిట్లనియె. 796

* అని చెప్పిన శుకయోగీంద్రునితో పరీక్షిన్మహారాజు ఇలా అన్నాడు.

క. 'కమలాక్షుని నిందించిన, దమఘోషతనూభవుండు దారుణ మల కూ
పమునుం బొందక యే క్రియ, సుమహితమతిఁ గృష్ణునందుఁ జొచ్చె మునీంద్రా! 797

* ఓ మునీంద్రా! శ్రీకృష్ణుణ్ణి నిందించిన శిశుపాలుడు భయంకర నరకకూపంలో పడకుండా భగవంతుడైన కృష్ణునిలో ఏ విధంగా ప్రవేశించాడో వివరించు,

వ. అనిన శుకయోగి రాజయోగి కిట్లనియె. 798

మ. మధుదైత్యాంతకుమీఁది మత్సరమునన్ మత్తిల్లి జన్మత్రయా
వధియే ప్రొద్దుఁ దదీయ రూపగుణ దివ్యధ్యానపారీణ ధీ
నిధి యౌటన్ శిశుపాల భూవిభుఁడు తా నిర్ధూత సర్వాఘుఁడై
విధిరుద్రాదుల కందరాని పదవిన్ వే పొందె నుర్వీశ్వరా! 799

* ఈ విధంగా ప్రశ్నించిన మహారాజుతో మహర్షి ఇలా అన్నాడు- 'ఓ రాజేంద్రా! మధుసూదనుని మీది మాత్సర్యంతో మదోన్మత్తుడై మూడు జన్మల నుండీ ముకుందుని నిందిస్తూ, ఎల్లప్పుడూ విష్ణుదేవుని రూప గుణాలను ధ్యానిస్తూ వుండడంవల్ల శిశుపాలుడు సమస్త పాపాలనుంచి విముక్తుడై బ్రహ్మ రుద్రాదులకు సైతం అందరాని పదవిని పొందాడు.

వ. అంత ధర్మనందనుండు ఋత్విగ్గణంబులను సదస్యులను బహు దక్షిణలం దనిపి వివిధార్చనలం
బూజించి యవభృథస్నానక్రియా పరితోషంబున. 800

* ఆ తర్వాత ధర్మరాజు యజ్ఞం చేయించిన ఋత్విజులనూ, యజ్ఞానికి విచ్చేసిన సదస్యులనూ అనేక దక్షిణలతో తృప్తి పొందించి, అనేక విధాలుగా పూజించి, యాగాంతంలో చేసే అవభృథస్నానానికి బయలుదేరాడు.

సీ. మురజ మృదంగ గోముఖ శంఖ డిండిమ పణవాదిరవము లంబరము నిండఁ
గవి సూత మాగధ గాయక వంది వై తాళిక వినుతు లందంద బెరయ
వితతమర్దళ వేణు వీణారవంబుల గతులకు నర్తకీగతులు సెలఁగఁ
దరళ విచిత్రక ధ్వజపతాకాంకిత స్యందన గజ వాజిచయము లెక్కి

తే. సుత సహోదర హిత పురోహితజనంబు, గటక కేయూర హార కంకణ కిరీట
వస్త్ర మాల్యానులేపనవ్రాతములను, విభవ మొప్పారఁ గై సేసి వెడల నంత. 801

* శంఖభేరీ మృదంగాది నానావిధధ్వనులు నింగినిండగా, వందిమాగధుల పొగడ్తలు అతిశయించగా, వేణు వీణారవాల కనుకూలంగా నాట్యకత్తెలు నృత్యం చేస్తుండగా, ధ్వజపతాకలతో కూడిన రథాలనీ, గుర్రాలనీ, ఏనుగుల్నీ అధిరోహించి ధర్మజుని కుమారులూ, సోదరులూ, మిత్రులూ, పురోహితులూ హార కేయూర కిరీటాది భూషణాలను చక్కగా అలంకరించుకొని ధర్మజుని అనుసరించారు.

వ. మఱియు యదు సృంజయ కాంభోజ కురు కేకయ కోసల భూపాల ముఖ్యులు చతుర్విధ సేనాసమేతులై ధరణి గంపింప వెన్నంటి నడతేర ఋత్విక్సదస్యులును సదస్యులును బ్రహ్మ ఘోషంబు లొలయ మున్నిడికొని శోభమానానూన ప్రభా భాసమాన సువర్ణమయ మాలికాదివ్య మణిహారంబులు గంఠంబునం దేజరిల్ల నున్నత జవాశ్వంబులం బూన్చిన పుష్పరథంబు గళత్రసమేతుండై యెక్కి యతిమనోహర విభవాభిరాముండై చనుదెంచు చుండె; నప్పుడు వారాంగనా జనంబులు తమ వారలం గూడికొని. 802

* అంతేకాకుండా యదు సృంజయ కాంభోజ కురుకేకయ కోసల దేశాల రాజులు చతురంగ బలాలతో వెంటరాగా, ఋత్విక్కులు, సదస్యులు వేదపారాయణం చేస్తూ ముందు నడుస్తుండగా, సువర్ణ మయమైన దివ్యమణిహారాలు దేదీప్యమానంగా కంఠంలో ప్రకాశించగా, మిక్కిలి వేగంగల గుర్రాలను పూన్చిన పుష్పరథాన్ని భార్యా సమేతంగా అధిరోహించి మహావైభవంతో ధర్మరాజు ప్రయాణం సాగించాడు.

సీ. కనకాద్రిసానుసంగత కేకినుల భాతిఁ గ్రొమ్ముళ్ళు వీఁపుల గునిసి యాడఁ
దరళ తాటంక ముక్తా ఫలాంశుద్యుతుల్ చెక్కుటద్దములతోఁ జెలిమిసేయఁ
బొలసి యదృశ్యమై పోని క్రొమ్మెఱుఁగుల గతులఁ గటాక్షదీధితులు దనర
మంచుపై నెగయ నుంకించు జక్కవ లనఁ జన్నులు జిలుఁగు కంచలల నఱుమ

తే. మహితకుచభార కంపితమధ్య లగుచు, నర్థి మొలనూళ్ళు మెఱయఁ బయ్యదలు జారఁ
గరసరోజాత కంకణ క్వణనములును, జరణనూపురఘోషముల్ సందడింప. 803

* అ సమయంలో మేరుపర్వతసానువుల్లోని నెమిళ్లలాగా జుట్టు ముడులు వీపులమీద నృత్యం చేస్తూ వుండగా, ముత్యాల కమ్మల కాంతులు చెక్కుటద్దాలతో స్నేహం చేయగా, చెరగిపోని మెరుపుతీగల్లాంటి కడగంటి చూపులు వెలుగులు వెదజల్లగా, మంచుమీద నుంచి ఎగరటానికి ప్రయత్నంచేసే జక్కవకవలలాగా స్తనాలు రవికలో నుంచి పైకి ఉబుకుతూ వుండగా, కుచభారంచేత చలిస్తూ వున్న నడుములు కలవారై, మొలనూళ్ళు మెరయగా, పైటలు జీరాడగా, చేతికంకణాల శబ్దాలూ, కాళ్ళకడియాల నవ్వడులూ సందడించు తుండగా, వేశ్యాంగనలు తమ తమ వారితో కలిసి నడచారు.

వ. మఱియు నయ్యిందువదన లందంద మందగమనంబునం జెందు ఘర్మజల బిందు సందోహ కందళిత మందహాస చంద్రికాసుందర వదనారవిందంబుల నిందిందిర రుచిర చికురబృందంబులు చిందఱ వందఱలై సందడిగొన, నమందానందహృదయలై, సువర్ణశృంగ సంగతంబులైన సంకుమద మలయజ ముఖ సురభితోయంబులు సముదాయంబులై తమతోయంబుల వారి పయిం జల్లుచుఁ జెందొవలఁ గెందలిరుల రచియించిన చిమ్మనగ్రోవులఁ దావులు గల పూఁదేనియలు నించి, వావులు దెలిపి, తేవలు మీఱఁ, గ్రేవలనుండి యిమ్ములం గని చిమ్ముచుఁ, మృగమదకుంకుమ పంకంబును గొంకక బింకముల జంకెన లొలయం బంకజ సన్నిభంబులగు మొగంబుల నేమఱించి చరుముచు నుల్లంబులు పల్లవింపఁ బెల్లడరి యందియలు గల్లుగల్లని మొరయఁ గ్రేళ్లు దాఁటుచుం జారు చంద్రికా సారఘనసారధూళి మిళిత రజనీపరాగంబు రాగంబు రంజిల్లం గరంబులం బుచ్చికొని శిరంబులం

**జల్లుచుఁ జిత్తంబుల నమ్మత్త కాశినుల వృత్తంబులగు కుచంబుల కెత్తు వత్తుమని బిత్తరించు పువ్వు గుత్తులం దత్తఱంబున వ్రేయుచుఁ బరిహసించుచు నన్యోన్యకర కిసలయ కనకకరండ భరితంబగు పన్నీటం జెంగావిజిలుఁగుఁ బుట్టంబులు దట్టంబుగాఁ దోఁగి మర్మంబులు బయలు పడిన నగ్గలంబు లగు సిగ్గులకు నొప్పిదంబులగు తమకనుతెప్ప లడ్డంబు సేయుచుఁ బురుషులుం దాము నా రామ లభిరామలీలారసోక్తు లెనయ నంతరంగంబుల సంతసంబునం బంతంబు లిచ్చుచు వసంతంబు లాడి రవ్వేళ నతుల విమానారూఢులైన యింద్రపురంధ్రీ జనంబులుం బోలె హాటకశిబిక లెక్కి, నిజచేటికా జనంబులు సేవింపఁ జనుదెంచు భూకాంతకాంతాజనంబులుం దమ సరసంబులకు నర్హంబులైన ధరణీపాల వధూలలామంబు లాదరించు చెలులపైఁ దమ సఖీజనంబులం బురికొల్పి చల్లించుచు భావగర్భితంబు లగువారి చతురసరసోక్తుల మందహాసచంద్రికలు ముఖకమల లీలావిలాసలక్ష్మిం బ్రోదిసేయం జని రవ్విధంబున నిజసామ్రాజ్య విభవంబు పూజ్యంబుగా నజాతశత్రుండు గంగా ప్రవాహంబున కరిగి యందు నిజ వధూయుక్తుండై శాస్త్రోక్త ప్రకారంబున నవభృథస్నానం బాచరించె; నా సమయంబున.** 804

* ఆ వేశ్యాంగనలు చిరునవ్వులు చిందే ముఖారవిందాలమీద చిందవందరగా తుమ్మెదలవంటి ముంగురులు పడుతుండగా చిమ్మన గ్రోవులతో పరిమళభరితమైన పన్నీరుజల్లులు ప్రక్కనున్న వారిమీద చల్లుతూ, కెందలిరాకులలో మకరందం నింపి వరసైన వారిపై చిమ్ముతూ, కస్తూరితో మిళితమైన కుంకుమ పంకాన్ని ప్రక్కనున్న వారి ముఖాలపై పట్టించుతూ, పూగుత్తులతో పరస్పరం సరదాగా కొట్టుకొంటూ, ఒకరితో వొకరు పరిహాసమాడుతూ వసంతా లాడుకొన్నారు. బంగారుపల్లకీల నెక్కి చెలికత్తెలు సేవింపగా వస్తున్న దేవకాంతల వంటి రాజకాంతలు తమ సరసాలకు యోగ్యురాండ్రైన రాచకాంత లాదరించే చెలికత్తెల మీదికి తమ చెలికత్తెలను పురికొల్పి వసంతాలు చల్లిస్తూ, నర్మగర్భసంభాషణలు కావిస్తూ, చిరునవ్వులను చిందిస్తూ ప్రయాణం సాగించారు. ఇలా మహాసామ్రాజ్యవైభవంతో ధర్మరాజు గంగానదికి వెళ్ళి అక్కడ తన భార్యతో కూడా శాస్త్రోక్తంగా అవభృథస్నానం చేశాడు.

**క. అనిమిషదుందుభి ఘన ని, స్వనములు వీతెంచెఁ బుష్పవర్షము గురిసెన్**
**మునిదేవపితృమహీసుర, వినుతుల రవ మెసఁగె నపుడు విమల చరిత్రా!** 805

* ఓ పుణ్యచరిత్రుడా! ఆ సమయంలో దేవదుందుభులు మారుమ్రోగాయి. పువ్వులవాన కురిసింది. మునులూ, దేవతలూ, పితృదేవతలూ, బ్రాహ్మణులూ ప్రస్తుతించారు.

**క. నరు లెట్టి పాపులైనను, గర మర్థిని నెద్ది సేసి గతకల్మషులై**
**చరియింతు రట్టి యవభృథ, మరుదుగఁ గావించి రెలమి నఖిలజనంబుల్.** 806

* మానవులు ఎంత పాపాత్ములైనా ఏ స్నానమయితే చేసి సమస్త పాపాలనుంచి విముక్తులౌతారో ఆ అవభృథస్నానం అచ్చటి ప్రజలందరూ చేశారు.

ఆ. అంత ధర్మతనయుఁ డభినవమృదుల దు, కూల సురభికుసుమమాలికాను
లేపనములు రత్న దీపిత భూషణా, వళులు దాల్చి వైభవమున నొప్పె. 807

* ధర్మరాజు మృదువైన నూతన వస్త్రాలు పరిమళ భరితమైన పూలమాలలు ధరించి, రత్నాభరణాలను అలంకరించుకొని అత్యంత వైభవంగా ప్రకాశించాడు.

వ. అంత నవభృథస్నానానంతరంబున మరలి చనుదెంచి, 808

* అవభృథ స్నానానంతరం ధర్మరాజు తిరిగి పట్టణానికి విచ్చేశాడు.

ఉ. పాండుతనూభవాగ్రజుఁడు పాండుయశోనిధి భాసమాన మా
ర్తాండనిభుండు యాజక సదస్య మహీసుర మిత్ర బంధు రా
ణ్మండలిఁ బూజ సేసి బుధ మాన్య చరిత్రుడు వారి కిచ్చె నొం
డొండ దుకూలరత్న కనకోజ్జ్వల భూషణ ముఖ్యవస్తువుల్. 809

* సూర్యతేజస్వీ, నిర్మల యశస్వీ అయి ధర్మరాజు యజ్ఞం చేయించిన వారినీ, యజ్ఞకార్యాన్ని పర్యవేక్షించిన వారినీ, బ్రాహ్మణులనూ, బంధుమిత్రులనూ, రాజులనూ పూజించి వారందరికీ పట్టువస్త్రాలనూ, రత్నఖచితాలైన సువర్ణభూషణాలనూ బహుమానంగా ఇచ్చాడు.

వ. అట్లు నారాయణ పరాయణులై దేవసమాన ప్రకాశ ప్రభావంబుల సకలనరనారీలోకంబు లనర్ఘ్యరత్నమయ భూషణ మాల్యానులేపనంబులు ధరించి పరమానంద భరితాత్ములై యొప్పియుండి; రంత. 810

* ఆ విధంగా ఇంద్రప్రస్థ నగరంలోని సమస్త ప్రజలూ మిక్కిలి విలువైన రత్నమయ భూషణాలను, గంధమాల్యాదులనూ ధరించి నారాయణపరాయణులై ఆనందంగా వున్నారు.

చ. సునిశితభక్తిఁ దన్మఖముఁ జూడఁగ వచ్చిన యట్టి దేవతా
ముని ధరణీ సుర ప్రకరభూవర విడ్జన శూద్రకోటి య
జ్జనవరచంద్రుచే నుచితసత్కృతులం బరితోషచిత్తులై
వినయముతోడ ధర్మజుని వీడ్కొని పోవుచుఁ బెక్కుభంగులన్. 811

* ధర్మరాజు చేసిన రాజసూయయాగాన్ని చూడటానికి వచ్చిన దేవతలూ, మునులూ, బ్రాహ్మణ క్షత్రియ వైశ్యశూద్రులూ, అందరున్నూ ఆయనచేత సముచితరీతిలో సత్కరించబడిన వారై సంతోషంతో సెలవు పుచ్చుకొని వెళ్ళిపోయారు.

చ. హరిచరణాంబుజాత యుగళార్చకుఁడై పెనుపొందు పాండు భూ
వరసుత రాజసూయ మఖవైభవమున్ నుతియించుచున్ సమా
దరమున నాత్మభూముల కుదారత నేఁగిరి ధర్మసూనుఁడున్
సరసిజనేత్రుఁ దా ననుపఁజాలక యుండు మటంచు వేఁడినన్. 812

* శ్రీకృష్ణుని భక్తుడైన ధర్మరాజు కావించిన రాజసూయ యాగవైభవాన్ని పొగడుతూ, యజ్ఞానికి విచ్చేసిన వారంతా తమ తమ స్థలాలకు వెళ్లారు. ధర్మరాజు శ్రీకృష్ణుణ్ణి పంపించటానికి ఇష్టపడక ఇంకా కొన్ని రోజులు వుండవలసిందిగా ప్రార్థించాడు.

**వ. ఇట్లు పాండవాగ్రజు ప్రార్థనం గైకొని దామోదరుండు సమస్త యాదవులను గుశస్థలికిఁ బోవం బనిచి కతిపయ పరిజనంబులుం దాసును నతనికిఁ బ్రియంబుగాఁ దన్నగరంబునఁ బ్రమోదంబున నుండె'నని చెప్పి మఱియు నిట్లనియె. 813**

* ధర్మరాజు ప్రార్థనను మన్నించి శ్రీకృష్ణుడు యాదవు లందరిని కుశస్థలికి పంపించి, తానుమాత్రం కొంత పరివారంతో ధర్మజునికి ప్రియంగా ఇంద్రప్రస్థ నగరంలోనే వున్నాడు అని చెప్పి శుకయోగి పరీక్షిత్తుతో మళ్ళీ ఈ విధంగా అన్నాడు.

**చ. 'జనవర! పాండుభూప తనుజాతుఁడు దుస్తరమౌ మనోరథా**
**బ్ధిని సరసీరుహాక్షుఁడను తెప్పకతంబున దాఁటి భూరి శో**
**భనయుతుఁడై మనోరుజయుఁ బాసి ముదాత్మకుఁడై వెలింగె న**
**వ్వనరుహనాభు దాసజన వర్యులకుం గలవే యసాధ్యముల్? 814**

* కృష్ణభక్తుడైన ధర్మరాజు రాజసూయం చేయాలనే మనోరథరూపమైన మహాసముద్రాన్ని కృష్ణుడనే ఓడ ద్వారా దాటి, మానసికవ్యథనుంచి దూరమై, గొప్ప ఐశ్వర్యంతో, సంతోషంతో ప్రకాశించాడు. రాజా! శ్రీకృష్ణుని భక్తులకు అసాధ్యమనేది లేదు కదా!

**వ. అట్టియెడ. 815**

**ఆ. రాజసూయ మఖవర ప్రభావమునకు, నఖిలజనులు మోదమంది రపుడు**
**కలుషమానసుండు కులపాంసనుఁడు సుయో, ధనుఁ డొకండు దక్క ధరణినాథ!' 816**

* ఓ రాజా! కల్మషమైన మనస్సు కలవాడూ, వంశదూషకుడూ ఐన దుర్యోధనుడు తప్ప తక్కిన సమస్త ప్రజలూ రాజసూయయాగ వైభవానికి సంతోషించారు.

**వ. అనిన విని శుకయోగీంద్రునకుఁ బరీక్షిన్నరేంద్రుం డిట్లనియె. 817**

* అని చెప్పగా విని పరీక్షిత్తు శుకమునీంద్రునితో ఇలా అన్నాడు.

**ఆ. 'అఖిల జనులకెల్ల నానంద జనకమై, యెనయు మఖము కురుకులేశ్వరునకుఁ**
**గర మసహ్యమైన కారణ మెయ్యది, యెఱుఁగఁ బలుకు నాకు నిద్ధచరిత!' 818**

* ఓ మహాత్మా1 సర్వజనులకూ సంతోషాన్ని కలిగించిన రాజసూయయాగం దుర్యోధనునికి ఎందుకని అసహ్యమైనదో నాకు వివరించు.

**చ. అనిన మునీంద్రుఁ డిట్లను ధరాధిపుతోఁ గురురాజు పాండు నం**
**దనులదెస న్ననేక దురితంబులు నిచ్చలుఁ జేయుచుండు నై**

నను నొకనాఁడు పంకరుహనాభ దయాపరిలబ్ధభూరి శో
భన జిత దేవదైత్య నరపాలక రాజ్యరమామహత్త్వమై. 819

చ. వెలయు ననూనసంపదల విశ్రుతకీర్తుల మిన్ను ముట్టఁ బెం
పలరిన పాండుభూవరసుతాగ్రజుఁ డంతిపురంబులోన ను
జ్జ్వలమణి భూషణాంశు రుచిజాలము బర్వఁ బయోజనాభు ను
త్కలిక భజించుచున్ ఘనసుఖస్థితి భూరిమనోహరాకృతిన్. 820

* అని ప్రశ్నించిన పరీక్షిత్తుతో శుకుడు ఇలా అన్నాడు. దుర్యోధనుడు పాండవుల కెప్పుడూ అపకారమే చేస్తూ ఉంటాడు. అయినా శ్రీకృష్ణుని దయచేత కలిగిన రాజ్యసంపదవల్ల ధర్మరాజుకు ఏ విధమైన అపాయమూ జరుగలేదు. ఐశ్వర్యంతోనూ, యశస్సుతోనూ, ప్రకాశిస్తూ వున్న ధర్మరాజు అంతఃపురంలో కృష్ణుణ్ణి సేవిస్తూ ఉన్నాడు.

వ. ఉండం గనుంగొని యదియునుంగాక యొక్కనాఁడు లలితాష్టమీ శశాంకబింబంబుల విడంబించుచు నింద్రనీలరుచి నిచయంబు నపహసించు కుటిలకుంతలంబులు నటనంబు సలుపం దనరు నిటల ఫలకంబులును, బుష్పచాపుచాపంబు రూపునేపుమాపు భ్రూయుగోపాంతంబులై సౌదామనీదామ రుచిస్తోమంబులై, కర్ణాంతసీమంబులై యంజనంబులతోడ రంజిల్లు నేత్రకంజంబులును, నవమల్లికా ముకుళ విభాసిత దంతమరీచికా నిచయోద్దీపిత మందహాస చంద్రికాధవళితంబులును ముకురోపమితం బులై కర్ణకుండల మణిమరీచి జాలంబులు బెరసి బహుప్రకారంబులఁ బర్వం బొలుచు కపోల పాలికలును, విలసిత గ్రైవేయక ముక్తాఫలహార నిచయంబుల కిమ్ముచూపక మిసమిసని పసగల మెఱుంగులు గిఱికొన మీటినం బగులు ననం బొగడం దగి మొగంబులకుం బుటంబు లెగయు నుత్తుంగపీన కుచభారంబుల వ్రేఁగు లాఁగ లేక తూఁగాడుచుం గరతల పరిమేయంబు లగు మధ్యభాగంబులును, ఘనజఘన మండలావతీర్ణకాంచన కాంచీకలాప కింకిణీకలకల నినాదోల్లసితం బులగు కటిప్రదేశం బులును, సల్లలితహల్లక పల్లవకాంతుల మొల్లంబులఁ గొల్లలు గొని యభిరామంబులై శోభిల్లు పదపాణి తలంబులును, నలసగతులం బదంబులం దనరు మణినూపురంబులు గోపురంబులం బ్రతిస్వనంబు లొలయ మొరయు నలరు చరణారవిందంబులును, రత్నవలయ కంకణాంగుళీయకాది వివిధ భూషణద్యుతి నిచయంబు లుష్ణమరీచికరనిచయంబుల ధిక్కరింప వెలుంగు కరకంజంబులును, మృగమదఘనసార హరిచందనాగరు కుంకుమ పంకంబుల భాసురంబులగు వాసనలు నాసారంధ్రం బులకు వెక్కసంబులై పొలయు సౌభాగ్యంబులు గలిగి చైతన్యంబు నొందిన మాణిక్యపు బొమ్మల విధంబున గగనమండలంబు నిర్గమించి, వసుధాతలంబున సంచరించు చంద్రరేఖల చెలువున శృంగార రసంబు మూర్తీభవించిన జగంబుల మోహపఱచు మోహినీ దేవతల చందంబున, విలసించు మాధవ వధూసహస్రంబుల సంగతిని సౌదామనీలతయునుం బోలె నొప్పుచుండెడు ద్రుపదరాజనందన విభవంబును రాజసూయ మహాధ్వరోత్సవంబునం జూచి చిత్తంబుత్తలపడ సుయోధనుండు సంతాపానలంబునం గ్రాఁగుచుండె; నంత నొక్క నాఁడు ధర్మనందనుఁడు నిర్మలం బగు సభాభవనంబునకుం జని. 821

* ఒకనాడు అందమైన అష్టమినాటి చంద్రబింబాలవంటి ఫాలభాగములతోనూ, ఇంద్రనీలమణులను పరిహసించు ముంగురులతోనూ, మన్మథుని ధనుస్సులవంటి కనుబొమ్మలతోనూ, ఆకర్ణాంతములై తళ తళ మెరుస్తున్న కాటుక కన్నులతోనూ, విరజాజి మొగ్గలవంటి పలుపరుసతోనూ, చిగురుపెదవుల చిరునవ్వు వెన్నెలలతోనూ, కర్ణకుండలాల కాంతులు జాలు వారు చక్కని చిక్కని చెక్కిళ్ళతోనూ, ముత్యాల హారములకు సైతం సందీయక మిసమిసలాడు ఉత్తుంగ పయోధరములతోనూ, నకనకలాడు సన్నని నెన్నడుములతోనూ, చిరుగజ్జెల సవ్వడులతోనూ కూడిన బంగారు యొడ్డాణములు ప్రకాశించు కటి ప్రదేశాలతోనూ, చిగురుటాకులవంటి అరచేతులతోనూ, ఘల్లుఘల్లున మ్రోగుచున్న కాలి అందియలతోనూ; రతనాల గాజులు, కంకణాలు, ఉంగరాలు కాంతులీను కరకమలములతోనూ, సుగంధాలు విరజిమ్ము కస్తూరి పచ్చ కర్పూరము మంచి గంధము మైపూతలతోనూ అలరారుతూ ప్రాణ సహితములైన మాణిక్యపుబొమ్మల చందాన, దివినుండి భువికి దిగివచ్చిన చంద్రరేఖ తీరున, శృంగారరసం మూర్తీభవించిన మోహినీ దేవతలవలె విరాజిల్లుతున్న మిక్కిలి సౌందర్యవతులైన శ్రీకృష్ణుసతుల నడుమ మెరుపుతీగెలా ప్రకాశిస్తూ వున్న ద్రౌపదీదేవి సౌభాగ్యాన్నీ, రాజసూయయాగ మహావైభవాన్నీ చూచి దుర్యోధనుడు అసూయతో లోలోపల బాధపడసాగాడు. ఇలా ఉండగా ఒకనాడు ధర్మరాజు నిండుకొలుపు తీర్చి కూర్చున్నాడు.

**సీ. సుత సహోదర పురోహిత బాంధవామాత్య పరిచార భటకోటి బలసి కొలువఁ**
**గలిత మాగధ మంజు గానంబుఁ బాఠక పఠన రవంబును బ్రమద మొసఁగఁ**
**గంకణ ఝణఝణత్కారంబు శోభిల్ల సరసిజాననలు చామరము లిడఁగ**
**మయ వినిర్మిత సభామధ్యంబునను భాసమాన సింహాసనాసీనుఁ డగుచు**

**తే. నమర గణములు గొలువఁ బెంపారు ననిమి, షేంద్రు కైవడి మెఱసి యుపేంద్రుఁ డలర**
**వరుసఁ గొలువున్న యత్తఱి దురభిమాని, క్రోధమాత్సర్యధనుఁడు సుయోధనుండు.** 822

* ధర్మరాజు తన సభాభవనంలో దేవతలు సేవిస్తుండగా ప్రకాశించే దేవేంద్రునిలాగా కొలువు తీరాడు. ధర్మజుని కుమారులూ, తమ్ముళ్ళూ, పురోహితులూ, బంధుమిత్రులూ, మంత్రులూ, సేవకులూ అతణ్ణి సేవిస్తున్నారు. వందిమాగధుల స్తోత్రాలు సంతోషాన్ని కలిగిస్తున్నాయి. కరకంకణాలు మ్రోగేటట్లు యువతులు వింజామరలు వీస్తున్నారు. మయసభామధ్యంలో నిర్మింపబడ్డ సింహాసనం మీద ఇలా కొలువు తీరి ఉన్న ధర్మజుని చూచి కృష్ణుడు సంతోషించాడు. ఆ సమయంలో దురభిమానియైన దుర్యోధను డచ్చటికి వచ్చాడు.

**ఉ. కాంచనరత్నభూషణ నికాయముఁ దాల్చి సముజ్జ్వల ప్రభో**
**దంచితమూర్తి నొప్పి ఫణిహారులు ముందటఁ గ్రందు వాయ వా**
**రించి సహోదరుల్ నృపవరేణ్యులు పార్శ్వములన్ భజింప నే**
**తెంచెను రాజసంబున యుధిష్ఠిరుపాలికి వైభవోన్నతిన్.** 823

* సువర్ణమయాలైన మణిభూషణాలు ధరించి రాజసం ఉట్టి పడే తేజస్సుతో చోపుదారులు ముందు నడుస్తూ జనాన్ని ఒత్తిగింపగా, తమ్ములూ రాజులూ ఇరువైపులా చేరి అనుసరించి సేవింపగా దుర్యోధనుడు ధర్మరాజు సమక్షానికి విచ్చేశాడు.

వ. అట్లు సనుదెంచి మయమాయా మోహితంబైన సభాస్థలంబునందు. 824

క. సలిలములు లేని తావున, వలువలు వెస నెగయఁ దిగిచి వారక తోయం
బులు గల చోటను జేలం, బులు దడియఁగఁ బడియె నిజవిభుత్వము దఱుఁగన్ 825

* ఇలా వచ్చి దుర్యోధనుడు మయసభామధ్యలో కాలు పెట్టాడు. మాయామయమైన ఆ మహాసభలో నీరులేని స్థలంలో కట్టుకొన్న దుస్తులు ఎగబట్టుకొనీ, నీరున్న స్థలంలో దుస్తులు తడుపు కొని దుర్యోధనుడు భ్రమకు లోనైనాడు.

క. ఆ విధమంతయుఁ గనుఁగొని, పావని నవ్వుటయు నచటి పార్థివులును గాం
తావలియును యమతనయుఁడు, వారిరిఁ జేసన్నఁ దమ్ము వారింపంగన్. 826

* ఆ విధంగా భ్రాంతికి లోనైన దుర్యోధనుణ్ణి చూచి భీమసేనుడు నవ్వాడు. ధర్మరాజు సైగచేసి వారిస్తూ వున్నా లెక్కచేయక కృష్ణుని ఆమోదంతో అక్కడున్న రాజులూ, స్త్రీజనమూ పెద్దగా పకపక నవ్వారు.

వ. దామోదరానుమోదితులయి మహారవంబుగాఁ బరిహాసంబులు చేసిన సుయోధనుండు లజ్జావనత వదనుండై కుపితమానసుం డగుచు నయ్యెడ నిలువక వెలువడి నిజపురంబున కరిగె; నయ్యవసరంబున ధీవిశాలురైన సభాసదులగు నచ్చటి జనంబుల కోలాహలంబు సంకులంబైన నజాతశత్రుండు చిత్తంబున విన్న నైయుండె; న ప్పుండరీకాక్షుండు భూభార నివారకారణుం డగుటం జేసి దుర్యోధను నపహాసంబునకుం గా దనం డయ్యె; నంత. 827

* మయసభలో తనకు జరిగిన ఘోరమైన అవమానానికి సిగ్గుపడి దురాగ్రహంతో దుర్యోధనుడు తన పట్టణానికి వెళ్ళాడు. ఆ సమయంలో సభాసదుల వేళాకోళంతో కూడిన కోలాహలాన్ని చూచి ధర్మ రాజు చిన్నబోయాడు. భూభారాన్ని నివారించటానికి అవతారం ధరించిన శ్రీకృష్ణుడు దుర్యోధనునికి జరిగిన అవమానాన్ని గమనిస్తూ మౌనం వహించాడు.

క. హరి ధర్మసుతుని వీడ్కొని, తరుణీ హిత బంధుజన కదంబము గొలువం
బరితోషమునఁ గుశస్థల, పురమునకుం జనియె మోదమున నరనాథా! 828

* ఓ రాజా! ఆ తరువాత కృష్ణుడు ధర్మరాజును వీడ్కొని సతీసుత బంధుజన సహితంగా కుశస్థలికి (ద్వారకకు) వెళ్లాడు.

చ. జనవరబంధమోక్షణముఁ జైద్యవధంబును బాండురాజ నం
దన మఖరక్షణంబును నుదారతఁ జేసిన యట్టి దేవకీ

**తనయు చరిత్ర భాసుర కథా పఠనాత్ములు గాంతు రిష్ట శో**
**భన బహుపుత్ర కీర్తులును భవ్యవివేకము విష్ణులోకమున్. 829**

* రాజులను బంధవిముక్తులను చేయటం, శిశుపాలుణ్ణి వధించటం, ధర్మజ్ఞుని యజ్ఞాన్ని రక్షించటం మొదలైన శ్రీకృష్ణుని విజయగాథలను చదివిన వారు సకల సౌభాగ్యాలనూ, మోక్షాన్నీ పొందుతారు.

**క. అని శుకయోగీంద్రుం డ, మ్మనుజేంద్రునిఁ జూచి పలికె మఱియును శ్రీకృ**
**ష్ణుని యద్భుత కర్మంబులు, వినిపింతుం జిత్తగింపు విమలచరిత్రా! 830**

* ఇలా పలికి శుకమహర్షి పరీక్షిత్తును చూచి నిర్మలమైన చరిత్రగల ఓ రాజా! శ్రీకృష్ణుని అద్భుత కార్యాలను ఇంకా వివరిస్తాను. ఆలకించుమని ఇలా చెప్పసాగాడు.

## -: సాల్వుండు శివప్రసాదంబున సౌభకవిమానంబు వడసి ద్వారకాపురిపై దండెత్తుట :-

**సీ. వసుధేశ! విను; మును వైదర్భి పరిణయ వేళ దుర్మద శిశుపాలభూమి**
**వరునకుఁ దోడ్పడ నరుదెంచి సైనికావలితోడఁ దొడరి దోర్బలము దూలి**
**హరిచేత నిర్జితులైన రాజులలోనఁ జైద్యుని చెలికాఁడు సాల్వభూమి**
**పతి జరాసంధాది పార్థివప్రకరంబు విన మత్సరానల విపులశిఖల**

**తే. ధాత్రి నిటమీఁద వీతయాదవము గాఁగఁ, గడఁగి సేయుదు నని దురాగ్రహముతోడఁ**
**బంతములు పల్కి యటఁ జని భరితనిష్ఠఁ, దపము కావింపఁ బూని సుస్థలమునందు. 831**

* ఓ రాజా! రుక్మిణీ పరిణయ సందర్భంలో శిశుపాలునికి సహాయంగా వచ్చి సైన్యంతో సహా కృష్ణుణ్ణి ఎదిరించి అతనిచేత చావుదెబ్బలు తిని పరాజితులయిన రాజులలో సాల్వుడనే రా జొకడున్నాడు. వాడు అసూయాగ్రస్తుడై మొండిపట్టుదలతో సమస్త యాదవులనూ నాశనం చేస్తానని జరాసంధాది రాజుల సమక్షంలో ప్రతిజ్ఞపట్టాడు. ఆ తర్వాత అతడు అత్యంత నిష్ఠతో ఒక ప్రశాంతప్రదేశంలో ఈశ్వరుణ్ణి గూర్చి తపస్సు చేయటానికి ఉపక్రమించాడు.

**క. ధృతి వదలక యుగ్రస్థితిఁ, బ్రతిదినమును బిడికెఁ డవనిరజ మశనముగా**
**నతినియమముతో నా పశు, పతి శంకరు ఫాలనయను భర్గు నుమేశున్. 832**

**క. చెదరని నిజభక్తిని ద, త్పదపద్మము లాత్మ నిలిపి పాయక యొక యేఁ**
**డుదితక్రియ భజియించిన, మదనారియు వాని భక్తి మహిమకు వశుఁడై. 833**

* ఆ సాల్వుడు ప్రతిదినం పిడికెడు దుమ్ముమాత్రం ఆహారంగా స్వీకరిస్తూ పట్టుదలతో పరమేశ్వరుణ్ణి గురించి భయంకరంగా తపస్సు చేశాడు. చెదరని భక్తితో ఈశ్వరుని పాదాలపై మనస్సు నిలిపి ఒక సంవత్సరం తపస్సు చేయగా వానిభక్తికి పరమేశ్వరుడు సంతోషించాడు.

క. బోరనఁ బ్రత్యక్షంబై, కోరినవర మేమి యైనఁ గొసరక యిత్తున్
వారక వేఁడు మ టన్నను, నా రాజతపోధనుండు హరునకుఁ బ్రీతిన్. 834

* ఈశ్వరుడు ప్రత్యక్షమై 'నీవు ఏ వరం కోరినా యిస్తాను. కోరుకొ'మ్మని సాల్వునితో అన్నాడు.

తే. వందనం బాచరించి యానందవికచ, వదనుఁడై నొస లంజలిఁ గదియఁ జేర్చి
శ్రితదయాకార! నన్ను రక్షించెదేని, నెఱుఁగ వినిపింతు వినుము మదీప్సితంబు. 835

* సాల్వుడు ఈశ్వరునికి నమస్కారం చేసి ఆనందంతో ఇలా అన్నాడు. 'ఓస్వామీ! నన్ను రక్షించేటట్లయితే నా కోరిక ఏమిటో మనవి చేస్తాను, చిత్తగించు.

తే. గరుడ గంధర్వ యక్ష రాక్షస సురేంద్ర, వరులచే సాధ్యపడక నా వలయు నెడల
నభ్రపథమునఁ దిరిగెడు నట్టి మహిత, వాహనము నాకు దయసేయు వరద! యీశ! 836

* ఓ ఈశ్వరా! గరుడ గంధర్వ యక్ష రాక్షస దేవతాదులకు సాధ్యం కానిదై నా కోరిక ప్రకారం అవసరమైనప్పుడు ఆకాశమార్గంలో సంచరించ గల వాహనాన్ని నాకు ప్రసాదించు.

వ. అని అభ్యర్థించినం బ్రసన్నుండై హరుండు వాని కోర్కి కనురూపంబైన పురంబు నిర్మింప మయుని నియోగించిన నతండును 'నట్ల చేసెద' నని కామగమనంబును నతి విస్తృతంబునుగా లోహంబున నిర్మించి సౌభకం బను నామం బిడి సాల్వున కిచ్చిన వాఁడును బరమానందంబునం బొంది తద్విమానారూఢుండై యాదవుల వలని పూర్వవైరంబుఁ దలంచి దర్పాంధచేతస్కుండై ద్వారకానగరంబుపైఁ జని నిజసేనాసమేతంబుగాఁ దత్పురంబు నిరోధించి. 837

* సాల్వుడు ఈ విధంగా ప్రార్థించగా ఈశ్వరుడు వాని కోరికకు తగిన పట్టణాన్ని నిర్మించి యిమ్మని మయుణ్ణి ఆదేశించాడు. అతడు 'చిత్త' మని కామగమనమూ, మిక్కిలి వెడల్పూ పొడవూ కలిగి లోహమయమైన ఒక పట్టణాన్ని నిర్మించి దానికి 'సౌభక' మనే పేరు పెట్టి సాల్వుని కిచ్చాడు. వాడు ఆనందంతో దానిని అధిరోహించి యాదవుల మీద తనకున్న పూర్వవిరోధాన్ని తలచి గర్వంతో కన్ను మిన్ను గానక నిజసేనాసమేతంగా ద్వారకపట్టణాన్ని ముట్టడించాడు.

సీ. సరిదుపవన సరోవరములు మాయించి బావులు గలఁచి కూపములు సెఱిచి
కోటలు వెస వీటతాటముల్ గావించి పరిఖలు పూడ్చి వప్రములు ద్రొబ్బి
యట్టళ్లు ధరఁ గూల్చి యంత్రముల్ దునుమాడి కాంచనధ్వజ పతాకములు నఱికి
భాసుర గోపుర ప్రాసాదహర్మ్యేందు శాలాంగణములు భస్మములు చేసి

తే. విమల కాంచనరత్నాది వివిధవస్తు, కోటినెల్లను నందంద కొల్లపుచ్చి
ప్రజలఁ జెఱపట్టి దొరలను భంగపెట్టి, తఱిమి యి బ్బంగిఁ బెక్కుబాధల నలంచి. 838

* ద్వారకానగరంలోని నదులనూ, ఉపవనాలనూ ధ్వంసం చేశాడు. సరస్సులు, బావులు పూడిపించాడు. కోటలను తలక్రిందులు చేశాడు. అగడ్తలను పాడుచేశాడు. కోటగోడలను పడగొట్టించాడు. ప్రాకారాలమీది

బురుజులను కూలదోయించాడు. యంత్రాలనీ, ధ్వజపతాకలనూ నరికించాడు. గోపురాలనీ, మిద్దెలనీ, మేడలనూ చంద్రశాలలనూ ఛిన్నాభిన్నం చేశాడు. పట్టణంలోని బంగారాన్నీ రత్నాలు మొదలైన సమస్తవస్తువులను కొల్లగొట్టాడు. ప్రజలను చెరపట్టాడు. అధికారులను అవమానించాడు. ఈ విధంగా సాల్వుడు ద్వారకలోని ప్రజలను పెక్కుబాధలకు గురిచేశాడు.

చ. మదమున నంతఁ బోవక విమానయుతంబుగ నభ్రవీథికిన్
గొదకొని యేపుమై నెగసి కొంకక శక్తి శిలామహీరుహ
ప్రదరము లోలిమైఁ గురిసి బంధురభూమిపరాగ శర్కరల్
వదలక చల్లుచున్ వలయవాయువుచే దిశ లావరించుచున్. 839

* అంతటితో వదలిపెట్టక విమానసహితంగా సాల్వుడు ఆకాశంలోకి ఎగిరి అచ్చటినుంచి దిమ్మలూ, చెట్లకొమ్మలూ, గులకరాళ్ళూ కురిపిస్తూ ద్వారకాపురవాసులను బాధించాడు. సుడిగాలులు ప్రయోగించి కల్లోలపరిచాడు.

వ. అట్టియెడ. 840

క. చటులపురత్రయదనుజో, త్కటదుష్కర బాధ్యమానధారుణి గతి న
ప్పుటభేదన మెంతయు వి, స్ఫుటపీడం జెంది వగల సుడివడుచుండన్. 841

* ఆ సమయంలో త్రిపురాసురులవల్ల బాధపడిన మహీమండలంలాగా ద్వారకానగరం సాల్వునిచేత మిక్కిలి ఇక్కట్లపాలై దుఃఖంతో కలతపడిపోయింది.

చ. కని భగవంతుఁడన్ రథిశిఖామణియున్నగు రౌక్మిణేయుఁ డ
జ్జనముల 'నోడ కుండుఁ' డని సంగరకౌతుక మొప్ప దివ్య సా
ధనములుఁ బూని సైనిక కదంబము గొల్వ ననూన మీన కే
తన రుచి గ్రాల నున్నతరథస్థితుఁడై వెడలెన్ రణోర్వికిన్. 842

* అది చూచి మహాయశస్వీ, రథికశ్రేష్ఠుడూ ఐన ప్రద్యుమ్నుడు ప్రజలను భయపడవద్దని చెప్పి, మహోత్సాహంతో అస్త్రశస్త్రాలను ధరించి, సైన్యసమూహం సేవిస్తూ వుండగా, మీనకేతనం ప్రకాశించగా, ఉన్నతమైన రథాన్ని ఎక్కి యుద్ధభూమికి బయలుదేరాడు.

వ. అ య్యవసరంబున. 843

చ. సమధిక బాహుశౌర్య జితచండ విరోధులు వెళ్లి రున్నత
క్షమ గద భానువింద శుక సాత్యకి సారణ చారుదేష్ణ సాం
బ మకరకేతనాత్మజ శ్వఫల్కతనూభవ తత్సహోదర
ప్రముఖ యదూత్తముల్ విమతభంజనులై కృతవర్మ మున్నుగన్. 844

* ఆ సమయంలో భుజబల పరాక్రమవంతులైన గదుడూ, భానువిందుడూ, శుకుడూ, సాత్యకీ, సారణుడూ, చారుదేష్ణుడూ, సాంబుడూ, అనిరుద్ధుడూ, అక్రూరుడూ, కృతవర్మ మొదలైన యాదవవీరు లందరూ యుద్ధభూమికి బయలుదేరారు.

క. వారణ వాజి స్యందన, వీరభటావలులు సనిరి విశ్వము వడఁకన్
ఘోరాకృతి వివిధాయుధ, భూరిద్యుతు లర్కబింబముం గబళింపన్. 845

* ప్రపంచం దద్దరిల్లుతుండగా, తాము ధరించిన అనేక విధాల ఆయుధాల కాంతులు సూర్యబింబాన్ని కప్పివేయగా, యాదవ వీరులు చతురంగ బలసమేతులై అరిభీకరమైన ఆకారాలతో రణరంగానికి బయలుదేరారు.

వ. చని యా గోవిందనందన స్యందనంబుం బలసందోహంబునుం దలకడచి, యదు సైన్యంబులు సాల్వబలంబులతోడం దార్కొని బెరయునప్పుడు దేవదానవ సంకుల సమరవిధంబునం దుములంబయ్యెఁ; న య్యెడ. 846

* ఈ విధంగా యాదవసైన్యం ప్రద్యుమ్నుని రథాన్ని దాటి ముందుకు పోయి సాల్వుని బలాలను ఎదిరించింది. అపు డా రెండు పక్షాల సైన్యాలకు జరిగిన సంకులసమరం దేవదానవ యుద్ధంలాగా చూపట్టింది.

మ. వితత జ్యాచయటంకృతుల్ మదజలావిర్భూతశుండాల ఘీం
కృతు లుద్యద్భటహుంకృతుల్ మహితభేరీభాంకృతుల్ భీషణో
ద్ధతనిస్సాణధణంకృతుల్ ప్రకటయోధవ్రాత సాహంకృతుల్
కుతలంబున్ దివి నిండ మ్రోసె రిపుసంక్షోభంబుగా భూవరా! 847

* ఓ రాజా! అల్లెత్రాళ్ల టంకారాలూ, మదగజాల ఘీంకారాలూ, భటుల హుంకారాలూ, భేరీభాంకారాలూ, వీరుల దురహంకారాలూ భూమ్యాకాశాలు నిండిపోయాయి.

మ. హరిరింఖారథనేమి సద్భటపద వ్యాఘట్టనోద్ధూత దు
స్తరధూళీపటల ప్రభూత నిబిడధ్వాంత ప్రవిధ్వంస కృ
త్కర శాతాసి గదాది హేతిరుచు లాకాశంబు నిండన్ వియ
చ్చర దృక్కుల్ మిఱుమిట్లు గొల్ప సమరోత్సాహంబు సంధిల్లఁగన్. 848

* గుర్రాల గిట్టలవల్లనూ, రథచక్రాలవల్లనూ, భటుల పాదఘట్టనలవల్లనూ, లేచినధూళి ఆకాశాన్ని చీకట్లతో నింపింది. ఆ చీకట్లను పోగొడుతూ సైన్యం చేతులలోని కత్తుల కాంతులు గగన సంచారుల చూపులకు మిరుమిట్లు గొలుపుతూ ఆకసం నిండా వ్యాపించాయి.

చ. తలకొని సైనికుల్ గవిసి తార్కొని పేర్కొని పాసి డాసి యం
కిలి గొన కెమ్ము లమ్ములఁ బగిల్చి నొగి ల్చతరేతరుల్ తలల్

నలియఁగ మొత్తి యొత్తి నయనంబుల నిప్పులు రాల లీల నొఁ
దలలు లలాటముల్ ఘనగదాహతి నొంచి కలంచి పోరఁగన్. 849

* యాదవ సాల్వసైన్యాలు పరస్పరం ఎదిరించి, పరస్పరం శరపరంపరలు కురిపించుతూ, మహాగదలతో తలలపై బాదుకొంటూ, క్రోధంతో కన్నులనుండి నిప్పురవ్వలు రాలగా భయంకరంగా పోరాడాయి.

వ. అ య్యవసరంబునం బ్రద్యుమ్నుండు గనుంగొని. 850

మ. అనయంబుం గలుషించి సౌభపతి మాయాకోట్లు చంచచ్ఛరా
సన నిర్ముక్త నిశాత దివ్యమహితాస్త్రశ్రేణిచేఁ దత్క్షణం
బున లీలాగతి నభ్రగుల్ మనములన్ భూషించ మాయించె న
వ్వనజాతాప్తుఁడు భూరి సంతమసమున్ వారించు చందంబునన్. 851

* ఆ సమయంలో అదంతా చూస్తున్న ప్రద్యుమ్నుడు వీరావేశంతో విజృంభించి సూర్యుడు తన కిరణాలతో కారుచీకట్లను పటాపంచలు చేసిన రీతిగా దివ్యాస్త్రాలతో సాల్వుడు పన్నిన మాయా జాలాన్ని ఛేదించాడు.

వ. మఱియును. 852

చ. అతిరథికోత్తముం డన నుదంచిత కాంచనపుంఖ పంచ విం
శతి విశిఖంబుల న్నతని సైనికపాలుని నొంచి యుగ్రుఁడై
శత శతకోటికోటినిభసాయకముల్ పరఁగించి సాల్వభూ
పతి కకుదంబు నొంచి లయభైరవుకైవడిఁ బేర్చి వెండియున్. 853

* అనంతరం అతిరథశ్రేష్ఠుడైన ప్రద్యుమ్నుడు వాడియైన ఇరవైఅయిదు బాణాలతో సాల్వుని సైన్యాధిపతిని నొప్పించి పిడుగుల్లాంటి బాణాలు అనేకం ప్రయోగించి సాల్వుని మూపు పగులగొట్టి లయ కాలభైరవునిలాగా విజృంభించాడు.

చ. పదిపది యమ్ములన్ మనుజపాలవరేణ్యుల నొంచి రోషముం
గదురఁగ మూఁడుమూఁడు శితకాండములన్ రథదంతి వాజులం
జదియఁగ నేసి యొక్కొక నిశాతశరంబున సైనికావలిన్
మదము లడంచి యిట్లతఁ డమానుషలీలఁ బరాక్రమించినన్. 854

* ప్రద్యుమ్నుడు పదిపది బాణాలు ప్రయోగించి సాల్వుని మిత్రులైన రాజశ్రేష్ఠులను నొప్పించాడు, మూడు మూడు బాణాలు ప్రయోగించి రథగజాశ్వాలను పడగొట్టాడు. ఒక్కొక్క బాణం ప్రయోగించి సైనికుల నందరినీ చిందర వందర చేశాడు. ఈ విధంగా ప్రద్యుమ్నుడు ఎదురులేని రీతిగా పరాక్రమించాడు.

క. దుర్మానవహరు నద్భుత, కర్మమునకు నుభయ సైనిక ప్రకరంబుల్
నిర్మలమతి నుతియించిరి, ధర్మాచలధైర్యు విగతభయుఁ బ్రద్యుమ్నున్. 855

* ధైర్యంలో మేరుపర్వతంతో సమానుడైన ప్రద్యుమ్నుని అద్భుత పరాక్రమాన్ని తిలకించి ఉభయసైన్యాలు ప్రస్తుతించాయి.

**వ. అ య్యవసరంబున. 856**

**ఉ. సాంబుని సాల్వభూవిభుఁడు సాయకజాలము లేసి నొంచినన్**
**జాంబవతీ తనూభవుఁడు చాపము సజ్యము సేసి డాసి సా**
**ల్వుం బదియేను తూపుల నవోన్నతవక్షము గాఁడ నేసి శా**
**తాంబకవింశతి న్నతని సౌభక మల్లలనాడ నేసినన్. 857**

* ఆ సమయంలో సాల్వుడు సాంబుని మీద బాణసమూహాన్ని ప్రయోగించి నొప్పించాడు. సాంబుడు ధనుస్సును ఎక్కుపెట్టి సాల్వుని వక్షాన్ని పదునైదు బాణాలతో కొట్టి వాడి బాణాలు ఇరవై ప్రయోగించి వాడి సౌభకవిమానాన్ని అల్లల్లాడేటట్లు చేశాడు.

**చ. గదుఁడు మహోగ్రవృత్తి నిజకార్ముక నిర్గతవిస్ఫురద్విధుం**
**తుద వదనాభబాణవితతుల్ పరఁగించి విరోధిమస్తముల్**
**గుదులుగ గ్రుచ్చి యెత్తుచు నకుంఠిత విక్రమకేళి లోలుఁడై**
**చదల సురల్ నుతింప రథిస త్తముఁ డొప్పె నరేంద్రచంద్రమా! 858**

* ఓ రాజేంద్రా! రథిక శ్రేష్ఠుడైన గదుడు రాహుముఖంలాంటి బాణాలను పరగించి శిరస్సులు ఛేదించి గుదులుగుదులుగా నేలకూలుస్తూ మొక్కవోని పరాక్రమంతో ఆకసంలో దేవతలు ప్రస్తుతించేటట్లు విజృంభించాడు.

**ఉ. సాత్యకి చండరోషమున సాల్వమహీవరు భూరిసౌభ సాం**
**గత్య చతుర్విధోగ్రబల గాఢతమఃపటలంబు భూసు రా**
**దిత్య మయూఖ పుంజరుచితీవ్రశరంబులఁ జూపి సైనిక**
**స్తుత్య పరాక్రమప్రకట దోర్బలుఁడై విలసిల్లె భూవరా! 859**

* ఓ రాజశ్రేష్ఠుడా! సాత్యకి మహారోషంతో చతురంగబల సహితమై యున్న సౌభకవిమానమనే చీకటిని సూర్యకిరణాలవంటి వాడియైన బాణాలను ప్రయోగించి పటాపంచలు కావించాడు. అతని పరాక్రమాన్ని సైనిక సమూహం బహువిధాల ప్రశంసించింది.

**ఉత్సాహము!**

**భానువిందుఁడుద్ధతిన్ విపక్షపక్షసైన్యదు**
**ర్మాన కాననానలోపమాన చండ సం**
**తాన మూన నేసి చూర్ణితంబు చేసెఁ జాప వి**
**ద్యా నిరూఢి దేవతావితాన మిచ్చ మెచ్చఁగాన్. 860**

* భానువిందుడు శత్రుసైన్యమనే అరణ్యాన్ని తీవ్రమైన దావానలం వంటి తన బాణసమూహంతో భస్మీపటలం చేశాడు. అతని ధనుర్విద్యాకౌశలాన్ని దేవతాసమూహం ప్రస్తుతించింది.

**ఉత్సాహము!**

**చారుదేష్ణుఁ డాగ్రహించి శత్రుభీషణోగ్ర దో**
**స్సారదర్ప మేర్పడన్ నిశాత బాణకోటిచే**
**దారుణ ప్రతాపసాల్వదండనాథ మండలిన్**
**మారి రేఁగినట్లు పిల్కుమార్చి పేర్చి యార్చినన్.** 861

* చారుదేష్ణుడు కోపంతో విజృంభించి వాడియైన బాణసమూహాన్ని ప్రయోగించి సాల్వుని దండనాథులను సంహరించి సింహనాదం చేశాడు.

**క. శుకుఁడాయోధన విజయోత్సుకమతి బాహాబలంబు సొప్పడ విశిఖ**
**ప్రకరంబులఁ దను శౌర్యా, ధికుఁ డన విద్వేషిబలతతిం బరిమార్చెన్.** 862

* శుకుడు యుద్ధవిజయకాంక్షతో చెలరేగి శరసమూహంతో సేనావ్యూహాన్ని నాశం చేశాడు.

**ఉ. సారణుఁ డేపుమైఁ గదిసి శాత్రవవీరులు సంచలింప దో**
**స్సార మెలర్పఁ గుంతశరశక్తి గదాక్షురికాది హేతులన్**
**వారక వాజిదంతి రథవర్గములం దునుమాడి కాల్వురన్**
**వీరముతోడఁ బంపె జమువీటికిఁ గాఁపుర ముగ్రమూర్తియై.** 863

* సారణుడు విజృభించి తన బాహుబలానికి శత్రువులు భయపడేటట్లుగా కుంతాలూ, బాణాలు, గదలూ, కత్తులూ మొదలైన ఆయుధాలతో సాల్వుని గుర్రాలనూ, ఏనుగులనూ, రథాలనూ ధ్వంసంచేసి సైనికులను చెల్లాచెదరు చేశాడు.

**క. అక్రూరుఁడు దదనుజులు న, వక్రపరాక్రమము మెఱసి వైరుల బాహా**
**విక్రమమున వధియించిరి, చక్ర ప్రాసాది వివిధ సాధనములచేన్.** 864

* అక్రూరుడూ, అతని తమ్ముళ్ళూ పరాక్రమంతో మెరసి చక్రాది వివిధ సాధనాల ప్రయోగంతో శత్రువులను వధించారు.

**మ. కృతవర్మ క్షితినాయకుండు విశిఖశ్రేణిం బ్రమత్తార్యధి**
**శ్రిత వర్మంబులఁ జించి మేనుల శతచ్ఛిద్రంబులం జేయ న**
**ద్భుతకర్మం బని సైనికుల్ వొగడ శత్రుల్ దూలుచో సంగర**
**క్షితి ధర్మంబుఁ దలంచి కాచె రథిక శ్రేష్ఠుండు భూమీశ్వరా!** 865

* ఓ రాజా! వీరవరుడైన కృతవర్మ శత్రువుల కవచాలు భేదించి వారి శరీరాలను ముక్కలు ముక్కలుగా నరికాడు. ఇది అద్భుతమైన కార్యమని శత్రువులు సైతం పొగిడారు. అతడు యుద్ధధర్మాన్ని అవలంబించి విరోధులు పారిపోతున్నా వారిని చంపకుండా వదలిపెట్టాడు.

**వ. అ య్యవసరంబున సాల్వుండు గోపోద్దీపిత మానసుండై యుండ మాయావిడంబకంబైన సౌభకం బప్పుడు . 866**

* అప్పుడు సాల్వుడికి చాలాకోపం వచ్చింది. అతడి సౌభక విమానం తన మాయా ప్రభావంతో విజృంభించింది.

**సీ. ఒకమాటు నభమునఁ బ్రకటంబుగాఁ దోఁచు, నొకమాటు ధరణిపై నొయ్య నిలుచు**
**నొకమాటు శైల మస్తకమున వర్తించు నొకపరిఁ జరియించు నుదధినడుమ**
**నొక్క తోయంబున నొక్కటియై యుండు నొక్కెడఁ గనుఁగొనఁ బెక్కు లగును**
**నొకమాటు సాలసంయుక్తమై పొడసూపు నొకతోయ మన్నియు నుడిగి తోఁచు**

**ఆ. నొక్కతేప కొఱవి యుడుగక త్రిప్పిన, గతి మహోగ్రవృత్తిఁ గానవచ్చు**
**మఱియుఁ బెక్కు గతుల నరివరుల్ గలఁగంగఁ, దిరిగె సౌభకంబు ధీవరేణ్య! 867**

* పరీక్షిన్మహారాజా! ఆ సౌభకవిమానం తన మాయాప్రభావంతో ఒకమారు ఆకాశంలో కనపడుతుంది. ఒకమారు భూమిమీద నిలుస్తుంది. ఒకమారు కొండశిఖరంమీద వర్తిస్తుంది. ఒకమారు సముద్ర మధ్యంలో విహరిస్తుంది. ఒక సమయంలో ఒక్కటిగానూ మరుక్షణంలో అనేక రూపాలతోనూ ప్రత్యక్షమవుతుంది. ఒకమారు చుట్టూ ప్రాకారంతో చూపట్టుతుంది. ఒకమారు ఏమీ లేకుండానే కన్పడుతుంది. ఒకమారు కొఱవి త్రిప్పినట్లుగా భయంకరంగా దర్శనమిస్తుంది. ఈరీతిగా ఆ విమానం శత్రువులు కలవరపడేటట్లు పెక్కు విధాలుగా తిరిగింది.

**వ. ఇ వ్విధంబున సౌభకంబు వర్తించుటం జేసి యదుసైన్యంబులచే దైన్యంబు నొందిన నిజసైన్యంబుల మరలం బురికొల్పి సాల్వుం డప్పుడు. 868**

* ఇలా సౌభకవిమానం విజృంభించే సరికి అంతకు ముందు యాదవసైన్యంవల్ల భీతిచెందిన తన సైన్యాన్ని సాల్వుడు మళ్లీ యుద్ధోన్ముఖం చేయగలిగాడు.

**క. స్ఫురదనలాభశరంబులు, పొరిఁ బొరిఁ బుంఖానుపుంఖములుగా నేయం**
**దెరలియు మరలియు మురిసియు, విరిసియుఁ బిఱుతివక పోరె వెస యదుబలముల్. 869**

* అప్పుడు సాల్వుడు యాదవసైన్యం మీద అగ్ని జ్వాలల్లాంటి బాణాలను ఎడతెగకుండా ప్రయోగించాడు. ఐనా ఆ సైన్యం చెదరక, బెదరక, వెనుకంజ వేయక ధైర్యంతో నిలిచి యుద్ధం చేసింది.

**క. అయ్యెడ మానము వదలక, డయ్యక మగపాడితో దృఢంబుగఁ బోరన్**
**దయ్య మెఱుంగును? నెక్కటి, కయ్యం బపుడయ్యెఁ బేరుగల యోధులకున్. 870**

* ఆ సమయంలో ఇరుపక్షాల యోధులూ అలసిపోకుండా పౌరుషంతో పోరాడారు. అప్పుడు పేరుమోసిన యోధులమధ్య ద్వంద్వయుద్ధం ప్రారంభ మయింది.

క. మును ప్రద్యుమ్న కుమారుని, ఘననిశితాస్త్రములచేతఁ గడు నొచ్చిన సా
ల్వుని మంతిరి ద్యుమనాముఁడు, సునిశిత గద చే నమర్చి సుమహితశక్తిన్. 871

* మునుపు ప్రద్యుమ్నుని బాణాలచేత నొచ్చిన సాల్వుని మంత్రి ద్యుముడనేవాడు గదను ధరించి ప్రద్యుమ్నుణ్ణి ఎదుర్కొన్నాడు.

చ. వెరవును లావుఁ జేవయును వీరముఁ బీరము గల్గి డాసి యా
సరసిజనాభనందను విశాలభుజాంతరముం బగిల్చినన్
విరవిరవోయి మేను నిడువెండ్రుక వెట్టఁగఁ జేతిఁ సాధనో
త్కరములు దేరిపై వదలి కన్నులు మూయుచు మూర్ఛనొందినన్. 872

* నేర్పరితనమూ, బలపరాక్రమాలు వెల్లడి కాగా ద్యుముడు గదతో ప్రద్యుమ్నుని వక్షం పగిలేటట్లు మోదాడు. ఆ దెబ్బతో అతడు మేను గగుర్పొడువగా చేతిలోని అస్త్ర శస్త్రాలను రథంమీద వదలి కనులు మూతలుపడి మూర్ఛపోయాడు.

ఆ. సమరధర్మ వేది సమధిక నయవాది, దారుకుని సుతుండు ధైర్యయుతుఁడు
రథముఁ దోలికొనుచు రణభూమి వెడలి వే, చనియె మూర్ఛదేఱె శంబరారి. 873

* యుద్ధధర్మం తెలిసినవాడూ, నీతిశాస్త్ర పారంగతుడూ, దారుకుని కుమారుడూ అయిన సారథి రథాన్ని మరలించి రణభూమినుండి ప్రక్కకు తోలుకొని పోయాడు. కొంచెం సేపటికి ప్రద్యుమ్నుడు మూర్ఛనుండి తేరుకొన్నాడు.

ఉ. సారథిఁ జూచి యిట్లనియె శాత్రవవీరులు సూచి నవ్వఁగాఁ
దేరు రణక్షితిన్ వెడలఁ దెచ్చితి తెచ్చితి దుర్యశంబు పం
కేరుహ నాభుఁడున్ హలియు గేలికొనన్ యదువంశసంభవుల్
బీరము దప్పి యిప్పగిదిఁ బెల్కుఱి పోవుదురే రణంబునన్. 874

* ప్రద్యుమ్నుడు సారథిని ఇలా మందలించాడు. 'కృష్ణుడూ, బలరాముడూ ఎగతాళి చేసేటట్లుగా, శత్రువులు నవ్వేటట్లుగా, రణభూమినుండి రథాన్ని తప్పించి అపకీర్తి తెచ్చావు. యదువంశంలో పుట్టిన వీరకుమారులు పరాక్రమహీనులై ఈ విధంగా యుద్ధరంగం నుంచి ఎప్పటికీ తొలగివెళ్ళరు.

వ. అనిన నతం డతని కిట్లనియె. 875

క. 'రథి రిపుచే నొచ్చిన సా, రథియును సారథియు నొవ్వ రథియును గావం
బృథుసమర ధర్మ; మిఁక న, వ్యథచిత్తుఁడ వగుచుఁ గడఁగు వై రుల గెలువన్'. 876

* అని పలుకుతున్న ప్రద్యుమ్నునికి సారథి ఇలా సమాధాన మిచ్చాడు. 'శత్రువులచేత రథికుడు నొచ్చినపుడు సారథీ, సారథి దెబ్బతిన్నప్పుడు రథికుడూ పరస్పరం రక్షించుకోవటం యుద్ధధర్మం. కాబట్టి నేను ఇలా చేశాను. నీవు బాధపడక విరోధులను నిరోధించటానికి ప్రయత్నించు.

వ. అనిన విని. 877

ఉ. సంచితభూరిబాహుబల శౌర్యుఁడు సారథిమాట కాత్మ మో
దించి యుదాత్త కాండ రుచిదీపితచాపముఁ దాల్చి మౌర్వి సా
రించి గుణధ్వనిన్ బృహదరిప్రకరంబుల భీతి ముంచి తో
లించె రథంబు మేదిని చలింపఁగ నా ద్యుముమీఁద నేర్పునన్. 878

* అపారబలసంపన్నుడైన ప్రద్యుమ్నుడు సారథి మాటలకు సంతోషించి ధనుష్టంకారంతో శత్రువులను భయభ్రాంతులను చేస్తూ, ద్యుమునిమీదికి తిరిగి రథాన్ని తోలించాడు.

వ. అట్లు డగ్గఱి. 879

చ. అరితను వష్టబాణముల నాగ్రహవృత్తిఁ బగిల్చి నాల్గిటం
దురగములన్ వధించి యొకతూపున సారథిఁ ద్రుంచి రెంటని
ష్ఠురతర కేతుచాపములు చూర్ణముచేసి యొకమ్మునన్ భయం
కరముగఁ ద్రుంచె నా ద్యుమునికంఠ మకుంఠిత విక్రమోద్ధతిన్. 880

* ప్రద్యుమ్నుడు ద్యుమ్ముణ్ణి సమీపించాడు. అవక్రపరాక్రమంతో ఎనిమిది బాణాలు ప్రయోగించి శత్రువు శరీరాన్ని పగులగొట్టాడు. నాల్గు బాణాలతో వాని గుర్రాలను కూల్చాడు. ఒక బాణంతో సారథిని సంహరించాడు. రెండు బాణాలతో వాని పతాకాన్నీ, ధనుస్సునూ నుగ్గునుగ్గు చేశాడు. చివరకు ప్రద్యుమ్నుడు ఒక పదునైనబాణంతో ద్యుముని కంఠాన్ని నరికాడు.

మ. కని సాంబ ప్రముఖాది యోధవరు లుత్కంఠాత్ములై మీన కే
తను నగ్గించి సువర్ణపుంఖ నిశితాస్త్ర శ్రేణి సంధించి సా
ల్వుని సైన్యావలి మస్తముల్ వెరవు లావున్ మీఱఁగా నొక్క యె
త్తున వే త్రుంచిరి తాటిపండ్లు ధరఁ దోడ్తో రాల్చు చందంబునన్. 881

* అది చూసి సాంబుడు మొదలైన యోధులు ప్రద్యుమ్నుణ్ణి ప్రస్తుతించి, పదునైన బాణసమూహంతో తాటిపండ్లను ధరణిమీద రాల్చిన విధంగా సాల్వసైనికుల శిరస్సులు ఛేదించారు.

వ. అట్టి యెడ. 882

స్రగ్ధర. కూలున్ గుఱ్ఱంబు! లేనుంగులు ధరఁ గెడయున్ గుప్పలై; నుగ్గునూచై
వ్రాలున్ దేరుల్; హతంబై వడిఁబడు సుభటవ్రాతముల్; శోణితంబుల్
గ్రోలున్, మాంసంబు నంజుం గొఱకు, నెముకలన్ గుంపులై సోలుచున్ బే
తాలక్రవ్యాదభూతోత్కరములు; జతలై తాళముల్ దట్టి యాడున్. 883

* ఆ సమయంలో యాదవులకూ, సాల్వుని సైన్యాలకూ జరిగిన ఆ భయంకర యుద్ధంలో గుర్రాలు కుప్పలుగా కుప్పలుగా కూలాయి. ఏనుగులు పుడమిమీద పడిపోయాయి. రథాలు పొడిపొడి అయ్యాయి భటులు నేల వ్రాలారు. బేతాళాలూ, పిశాచాలూ ఆనందంతో రక్తాన్ని త్రాగుతూ, మాంసం నంజుకొంటూ, ఎముకలు కొరుకుతూ చప్పట్లు చరుస్తూ పారవశ్యంతో నృత్యం చేశాయి.

**వ. మఱియు నొక్కయెడ. 884**

**సీ. ఖండిత శుండాల గండముల్ నక్రముల్; భూరితుండంబులు భుజగ సమితి;**
**పదతలంబులు గచ్ఛపంబులు; దంతముల్ శుక్తులు; గుంభనిర్ముక్తమౌక్తి**
**కములు రత్నములు; వాలములు జలూకముల్; మెడలు భేకంబులు; మెదడు రొంపి;**
**ప్రేవులు పవడంపుఁ దీవెలు; నరములు నాఁచు; మజ్జంబు ఫేనంబు; లస్థి**

**ఆ. సైకతములు; రక్తచయము తోయంబులు;, నొరగు నెడల నొరలు మొఱలు ఘన త**
**రంగరవముగా మతంగజాయోధన, స్థలము జలధిఁ బోల్పఁదగె నరేంద్ర! 885**

* ఓ రాజా! ఆ సంగ్రామరంగం సముద్రంలా మారింది. ఖండించబడిన ఏనుగుల గండస్థలాలే మొసళ్ళు. తొండాలే పాములు. ఆ యేనుగుల కాళ్ళు తాబేళ్ళు. దంతాలు ముత్యపు చిప్పలు. వాటి కుంభ స్థలాలనుంచి రాలిపడిన ముత్యాలు రత్నాలు. తోకలు జలగలు. మెడలు కప్పలు. మెదడు బురద. ప్రేగులు పగడపుతీగలు. నరాలు నాచుతీవలు. క్రొవ్వు నురుగు. ఎముకలు ఇసుక తిన్నెలు. రక్తము జలం. మరణించేటప్పుడు చేసే ఘీంకారాలు తరంగశబ్దాలు- ఇలా ఆ సమరభూమి సముద్రంతో పోల్చతగినట్లుగా విలసిల్లింది.

**వ. ఇ వ్విధంబున యదు సాల్వబలంబులు సలంబునఁ బరస్పర జయ కాంక్షలం దలపడి పోరు పూర్వ పశ్చిమ సముద్రంబుల వడువున నిరువది యేడు దినంబు లతిఘోరంబుగాఁ బోరునెడ నింద్రప్రస్థ పురంబునుండి ద్వారకానగరంబునకు నగధరుండు సనుదేర ముందటం గానవచ్చు దుర్నిమిత్తంబులం గనుంగొని కృష్ణుండు దారుకునిం జూచి యిట్లనియె. 886**

* ఈ విధంగా యదవబలాలూ, సాల్వుని సైన్యాలూ ఒకరిని ఒకరు జయించాలనే కోరికతో తూర్పు పడమర సముద్రాలు తలపడి పోరాడిన విధంగా ఇరవైయేడు దినాలు భయంకరంగా యుద్ధంచేశాయి. ఆ సమయంలో ఇంద్రప్రస్థనగరం నుంచి కృష్ణుడు ద్వారకకు వస్తూ మధ్యమార్గంలో కనపడ్డ చెడ్డ శకునాలను గమనించి సారథియైన దారుకునితో ఇలా అన్నాడు.

**శా. కంటే దారుక! దుర్నిమిత్తము లనేకంబుల్ మహాభీలముల్**
**మింటన్ మేదినిఁ దోఁచుచున్న యవి; నెమ్మిన్ ఖాండవప్రస్థ మే**
**నుంటం జైద్యహిత క్షితీశ్వరులు మాయోపాయులై మత్పురి**
**న్గెంటింపం జనుదేరఁ బోలుదురు; పోనీ తేరు వేగంబునన్. 887**

* 'దారుకా! చూశావా! అపశకునాలు ఆకాశంలోనూ, భూమిమీద కూడా మహాభయంకరంగా కన్పడుతున్నాయి. నేను ఇంద్రప్రస్థంలో ఉండటం గమనించి శిశిపాలుని హితులైన రాజులు నా పట్టణం మీద యుద్ధానికి తలపడినట్లు తోస్తున్నది. రథాన్ని వేగంగా పోనీ.

**వ. అని యతిత్వరితగతిం జనుదెంచి తత్పురంబు డగ్గఱి మహాబల పరాక్రమంబులం బ్రతిపక్ష బలంబులతోడం దలపడి పోరు యదు బలంబులును నభోవీథి నభేద్యమాయా విడంబనంబునం బ్రతివీరు లెంతకాలంబునకు నే యుపాయంబునను సాధింప నలవిగాని సౌభకవిమానంబునం దున్న సాల్వునిం గని తద్విమానంబు డాయం దన తేరు దోల సారథిని నియమించి కదియం జను మురాంతకుని వీక్షించి యదుసైనిక ప్రకరంబులు పరమానందంబునం బొందిరి; మృతప్రాయంబులై యున్న సైన్యంబులం గనుగొని సౌభకపతి విక్రమ క్రియాకలాపుం డగుచు నురవడించి. 888**

* ఇలా కృష్ణుడు పలుకగానే దారుకుడు మిక్కిలి వేగంతో రథం పోనిచ్చాడు. ద్వారకను సమీపించిన వాసుదేవుడు బలపరాక్రమాలతో శత్రుసైన్యాన్ని తలపడి యుద్ధంచేసే యాదవసైన్యాన్నీ, ఆకాశమార్గంలో మాయా ప్రభావంతో మోసంచేస్తూ యాదవవీరులకు భేదింప సాధ్యం కాకుండా వున్న సౌభకవిమానాన్నీ, అందులో వున్న సాల్వుణ్ణీ చూచాడు. వాని సమీపానికి రథాన్ని తోలించాడు. కృష్ణుణ్ణి వీక్షించిన యదుసైన్యాలు పరమానందం పొందాయి. చైతన్యం కోల్పోయి దైన్యంగా ఉన్న తన సైన్యాన్ని చూచి సాల్వుడు పరాక్రమించాడు.

**చ. మిడుఁగుఱు లెల్లెడం జెదర; మింటను మంటలు పర్వ; ఘంటికా**
**ఘణఘణ భూరినిస్వన నికాయమునన్ హరిదంతరాళముల్**
**వణఁక; మహోగ్రశక్తిఁ గొని వారక దారుకుమీఁద వైవ దా**
**రుణగతి నింగి నుండి నిజరోచులతోఁ బడు చుక్కకైవడిన్. 889**

* నిప్పురవ్వలు అంతటా చెదరిపడగా, ఆకసమంతా మంటలు వ్యాపించగా, గంటల శబ్దంచేత దిగంతాలు వణకగా, సాల్వుడు భయంకరమైన శక్తి అనే ఆయుధాన్ని కృష్ణుని రథసారథియైన దారుకునిమీద ప్రయోగించాడు.

**క. వడిఁ జనుదేరఁగఁ గని య, ప్పుడు నగధరుఁ డలతి లీల వోలెన్ దానిం**
**బొడిపొడియై ధరఁ దొరఁగఁగఁ, నడుమన వెసఁ ద్రుంచె నొక్క నారాచమునన్. 890**

* కాంతిమంతమైన నక్షత్రం నింగినుండి తెగిపడే విధంగా దూసుకువచ్చే ఆ శక్త్యాయుధాన్ని శ్రీకృష్ణుడు ఒక్కబాణంతో మధ్య మార్గంలోనే పొడిపొడి చేశాడు.

**చ. గురుభుజుఁ డంతఁ బోవక యకుంఠిత శూరత శత్రుసైన్యముల్**
**దెరలఁగ నుగ్రతం గొఱవిఁ ద్రిప్పిన కైవడి మింట దిర్దిరం**
**దిరుగుచు దుర్నిరీక్ష్యమగు దీపితసౌభము సాల్వుఁ జండ భా**
**స్కర కిరణాభషోడశ నిశాతశరంబులఁ గాఁడ నేసినన్. 891**

* వీరాధివీరుడైన కృష్ణుడు అంతటితో శాంతింపక, మొక్క వోని పరాక్రమంతో కొఱవి త్రిప్పినరీతిగా, ఆకాశంలో గిరగిర తిరుగుతూ దుర్నిరీక్ష్యంగా ఉన్న సౌభకాన్నీ, అందులోని సాల్వుణ్ణి మధ్యాహ్న సూర్య కిరణాలతో సమానమైన పదహారు పదునైనబాణాలను గుప్పించి నొప్పించాడు.

**చ.** కడు వడి నల్గి వాఁడు నిజకార్ముకమున్ జలదస్వనంబు కై
వడి మొరయించుచున్ వెడఁదవాతి శరంబులఁ బద్మలోచను
న్నెడమభుజంబు గాఁడ వడి సేసినఁ దెంపఱి చేతిశార్ఙ్గమున్
విడిచె రథంబుపై గగనవీథి సురల్ భయమంది చూడఁగన్. 892

* సాల్వుడు కోపంతో తన ధనుస్సును మేఘగర్జనం లాగా మ్రోగిస్తూ కృష్ణుని ఎడమభుజంలో దిగబడిపోయేటట్లు వాడియైన బాణాలు ప్రయోగించాడు. ఆ దెబ్బకు కృష్ణుడు శార్ఙ్గమనే పేరుగల తన ధనుస్సును రథంమీద జార విడిచాడు.

**క.** హాహా యని భూతావళి, హాహాకారములు సేయ నంతట దేఱ
న్నాహరిఁ గనుఁగొని యతఁ డు, త్సాహంబునఁ బలికె బాహు శౌర్యస్ఫూర్తిన్. 893

* భూతసమూహం హాహాకారాలు చేసింది. ఆ సమయంలో కృష్ణుణ్ణి చూచి బాహుబలశాలి సాల్వుడు ఉత్సాహంతో ఇలా అన్నాడు.

**చ.** 'నళినదళాక్ష! మత్సఖుఁడు నాఁదగు చైద్యుఁడు గోరినట్టి కో
మలి నవినీతివైఁ దగవుమాలి వరించితి; వంతఁ బోక దో
ర్బలమున ధర్మనందను సభాస్థలి నేమఱి యున్న వాని న
చ్చలమునఁ జంపి తట్టి కలుషంబున నేఁడు రణాంగణంబునన్. 894

**క.** తల చెడి పాఱక బాహా, బల మొప్పఁగ నాదు దృష్టిపథమున ధృతితో
నిలిచిన నిష్ఠుర విశిఖా, ర్చుల ముంచి మదీయసఖుని సూ డిటు దీర్తున్. 895

* ఓ కృష్ణా! నా మిత్రుడైన శిశుపాలుడు కాంక్షించిన కన్యకను నీవు నీతిహీనుడవై పరిగ్రహించావు. అది చాలక ధర్మజుని సభాస్థలంలో ఏమరుపాటుగా ఉన్న అతణ్ణి పగబట్టి చంపావు. అంతటి కలుషాత్ముడవైన యుద్ధరంగంలో పరుగెత్తిపోకుండా నా యెదుట ధైర్యంగా నిలబడ గలిగిన ట్లయితే నా మిత్రుణ్ణి చంపిన పాపానికి ప్రాయశ్చిత్తంగా నిన్ను నా కర్కశ శరాగ్నిజ్వాలలలో ముంచి పగతీర్చుకుంటాను.

**చ.** అనిన మురాంతకుండు దరహాసము మోమునఁ దొంగలింప సా
ల్వునిఁ గని 'యోరి! లావు బలుపుం గల పోటరివోలెఁ బ్రేలె దే
మనినను బాటు సన్నిహిత మౌట యెఱుంగవు మూఢచిత్త! వొ'
మ్మని గదఁ గేలఁ ద్రిప్పి యభియాతిని శత్రుని వ్రేసె నుద్ధతిన్. 896

* ఇలా పలికిన సాళ్వుని మాటలకు కృష్ణుడు చిరునవ్వు నవ్వి వాడితో 'మూర్ఖుడా! బలపరాక్రమాలు కలిగిన వీరునిలాగా వాగుతున్నావు' నీకు చావుమూడిన సంగతిని గుర్తించ లేకుండా ఉన్నావు అని పలికి తన గదాయుధాన్ని గిరగిర త్రిప్పి వానిమీద విసిరాడు.

వ. అట్లు వ్రేసిన. 897

క. పెనుమూర్ఛ నొంది వెస ము, క్కున వాతను నెత్తురొల్కఁ గొంతవడికి నా
య్యన తెలిసి నిలువరింపక, చనె వాఁడు నదృశ్యుఁ డగుచు సౌభముఁ దానున్. 898

* అప్పుడు శ్రీకృష్ణుని గదాఘాతంచేత సాల్వుని నోటినుంచీ ముక్కునుంచీ రక్తం స్రవిస్తూ వుండగా మూర్ఛపోయాడు. కొంతసేపటికి తిరిగీ తెలివితెచ్చుకొన్నవాడై వెనువెంటనే సౌభకవిమానంతో సహా వాడు అదృశ్య మయ్యాడు.

వ. అ య్యవసరంబున. 899

తే. గగనమందుండి యొకఁ డార్తుఁ డగుచు వచ్చి, నందనందను పాదారవిందములకు
వందనము సేసి యానకదుందుభిని మ, హోగ్రుఁడై పట్టితెచ్చె సాల్వుండు గడఁగి. 900

తే. దేవ! మీ కెఱిఁగింపఁగాఁ దివిరి యిటకు, దేవకీదేవి నన్నుఁ బుత్తెంచె' ననఁగ
విని సరోరుహనాభుఁడు ఘన విషాద, మగ్నుఁ డయ్యెను గురుమీఁది మమతఁ జేసి. 901

* ఆ సమయంలో ఆకసం నుంచి ఒకడు ఆర్తనాదం చేస్తూ కృష్ణుని దగ్గరకు వచ్చి 'అయ్యా ! సాల్వుడు మీ తండ్రియైన వసుదేవుణ్ణి బంధించి తెచ్చాడు. ఈ సంగతి నీకు చెప్పవలసిందిగా దేవకీదేవి నన్ను నీ కడకు పంపించింది' అని చెప్పాడు. అప్పుడు కృష్ణుడు ఆ మాటలు విని తండ్రిమీద ఉన్న మమకారం కారణంగా విషాదంలో మునిగిపోయాడు.

క. 'నర గంధర్వ సురాసుర, వరులకు నిర్జింపరాని వాఁడు బలుం డే
మఱ కరయ హీనబలుచేఁ, బరికింపఁగ నెట్లు పట్టువడు నొకొ, యనుచున్ 902

* దేవ రాక్షస మానవ గంధర్వాదులకు సైతం జయింప సాధ్యం కాని బలరాముడు జాగరూకతతో రక్షిస్తూ ఉండగా బలహీనుడైన ఈ సాల్వునిచేత వసుదేవుడు ఎలా పట్టుబడతాడు' అని శ్రీకృష్ణుడు భావించాడు.

వ. మఱియును. 903

క. భావంబు గలఁగ 'నాహా!, దైవకృతం బెవ్వరికిని దప్పింపఁగ రా
దే విధినైనను నని శో, కావిలమతిఁ బలుకుచున్న న త్తఱి వాఁడున్. 904

* ఇలా అనుకుంటూ మనస్సు వికలం కాగా 'దైవనిర్ణయాన్ని తప్పించటానికి ఎవరికీ సాధ్యం కాదు' అని కృష్ణుడు దుఃఖంతో బాధపడ్డాడు.

వ. తన మాయాబలంబునఁ గ్రమ్మఱం దోఁచి కృతక వసుదేవునిం గల్పించి యతనిం బంధించి కొనితెచ్చి 'పుండరీకాక్ష! నిరీక్షింపు భవజ్జనకుండు వీఁడె; యిప్పుడు నీవు గనుంగొన వీని తలఁ ద్రుంతు నింక నెవ్వనికింగా మనియెదు! కావం గల శక్తి గల దేనిం గావు' మని దురాలాపంబు లాడుచు మృత్యుజిహ్వాకరాళంబైన కరవాలంబు గేలం బూని జళిపించుచు న మ్మాయావసుదేవుని శిరంబు దునిమి తన్మస్తకంబు గొని వియద్వర్తియై చరియించు సౌభక విమానంబు సొచ్చె; నంత గోవిందుండు గొంతతడవు మనంబున ఘనంబగు శోకంబునం గుందుచుండి యాత్మసైనికులు దెలుపం దెలివొంది యది మయోదితంబైన సాల్వుని మాయోపాయంబని యెఱింగె; నంతం దనకు వసుదేవుండు పట్టువడె నని చెప్పిన దూతయు న మ్మాయాకళేబరంబును నా క్షణంబ విచిత్రంబుగా మాయంబై పోయె; ననంతరంబ. 905

* అంతలో సాల్వుడూ మళ్ళీ కన్పించి మాయావసుదేవుణ్ణి కల్పించి బంధించుకొనివచ్చి ' ఓ కృష్ణా! వీడే నీ తండ్రి, నీ కన్నుల ముందే వీని తల ఖండిస్తాను. శక్తి కలవాడవైతే రక్షించుకో' అని పరుషంగా పలుకుతూ భీకర కరవాలాన్ని జళిపించుతూ మాయావసుదేవుని శిరాన్ని ఖండించి, ఆ తలతోకూడా సౌభక విమానం లోనికి వెళ్లాడు. అది చూచి శ్రీకృష్ణుడు కొంతసేపు అత్యంత దుఃఖంలో మునిగి పోయాడు. అప్పుడు సైనికులు 'అది మయునిచేత కల్పించబడ్డ మాయ' అని కృష్ణుణ్ణి ప్రబోధించారు. అంతలో వసుదేవుడు పట్టుబడ్డాడని చెప్పిన దూతా, ఆ మాయాకళేబరం అదృశ్యమయ్యాయి.

క. మును లపుడు గొంద ఱచటికిఁ, జనుదెంచి విమోహియైన జలజదళాక్షుం
గనుఁగొని సమధికభక్తిన్, వినయంబునఁ బలికి రంత విష్ణున్ జిష్ణున్. 906

* ఆ సమయంలో కొందరు మునులు మాయామోహితుడైన కృష్ణుణ్ణి సమీపించి వినయంతో ఇలా పలికారు.

సీ. కమలాక్ష! సర్వలోకములందు సర్వ మానవులు సంసార నానావిధైక
దుఃఖాబ్ధిమగ్నులై తుదిఁ జేర నేరక వికలత్వమునఁ బొందు వేళ నిన్నుఁ
దలఁచి దుఃఖంబులఁ దరియింతు రట్టి సద్గుణ నిధివై దేవకోటికెల్లఁ
బట్టుగొమ్మై పరబ్రహ్మాఖ్యఁ బొగడొంది పరమయోగీశ్వర ప్రకరగూఢ

తే. పరచిదానంద దివ్యరూపమున వెలుఁగు, దనఘ! నీ వేడ? నీచ జన్మాత్మ జనిత
ఘనభయ స్నేహ మోహ శోకంబు లేడ?, ననుచు సంస్తుతి సేసి వా రరిగి రంత. 907

* 'ఓ పుండరీకాక్షా! పురుషోత్తమా! సమస్తలోకాల్లో సర్వ మానవులూ సంసార మనే దుఃఖ సముద్రంలో మునిగి గట్టు చేరలేక కొట్టుమిట్టాడుతున్న దశలో నిన్ను స్మరించి ఆ దుఃఖాలను పోగొట్టుకొంటారు. అలాంటి సద్గుణాలకు నిధివై దేవతాసమూహానికి ఆధార భూతుడవై పరబ్రహ్మస్వరూపుడవై పరమ యోగీశ్వరులకు కూడా అందనివాడవై చిదానంద రూపంతో వెలిగే నీ వెక్కడ? అజ్ఞాన సంజాతాలైన శోక మోహ భయాదు లెక్కడ? అవి నిన్ను అంట లేవు' - ఈ విధంగా ప్రస్తుతించి ఆ మునీశ్వరులు వెళ్ళిపోయారు.

చ. హరి దనమీఁద ఘోరానిశితాశుగజాలము లేయు సాల్వభూ
వరు వధియింపఁ గోరి బహువారిద నిర్గతభూరివృష్టి వి
స్ఫురణ ననూనతీవ్రశరపుంజములన్ గగనంబుఁ గప్పి క్ర
చ్ఛుఅ రిపుమౌళిరత్నమును జాపము వర్మముఁ ద్రుంచి వెండియున్. 908

* అప్పుడు శ్రీకృష్ణుడు పదునైన బాణాలను ప్రయోగించే సాల్వుణ్ణి చంపటానికి నిశ్చయించినవాడై వర్షధారలవంటి తీవ్రమైన బాణసమూహంతో ఆకాశాన్ని కప్పివేసి ప్రత్యర్థి కిరీటాన్నీ, ధనుస్సునూ కవచాన్నీ ఛేదించివేశాడు.

మ. వితత క్రోధముతోడఁ గృష్ణుఁడు జగద్విఖ్యాతశౌర్యక్రియో
ద్ధత శక్తిన్ వడిఁ ద్రిప్పి మింట మెఱుఁగుల్ దట్టంబుగాఁ బర్వ ను
గ్రతఁ జంచద్గద వైచి త్రుంచె వెసఁ జూర్ణంబై ధరన్ రాల నా
యత భూరిత్రిపురాభమున్ మహిత మాయాశోభమున్ సౌభమున్. 909

* మహాక్రోధంతో శ్రీకృష్ణుడు విశ్వవిఖ్యాతమైన వీరవిజృంభణంతో ఆకాశం నిండా మెరుగులు వ్యాపించేటట్లు గదాదండాన్ని విసరి త్రిపురాలవంటిదీ, మాయాసహితమైనదీ ఐన సాల్వుని సౌభక విమానాన్ని తుత్తుమురు చేశాడు.

వ. అట్లు కృష్ణుం డమ్మయనిర్మిత మాయావిమానంబు నిజగదాహతి నింతింతలు తునియలై సముద్రమధ్యంబునం దొరంగం జేసిన సాల్వుండు గోఱలు వెఱికిన భుజంగంబు భంగి గండడంగి విన్ననై విగతమాయాబలుం డయ్యును బొలివోవని బీరంబున వసుధా తలంబునకు డిగ్గి యాగ్రహంబున. 910

* ఆ విధంగా శ్రీకృష్ణుడు తన గదాఘాతంతో మయనిర్మితమైన మాయావిమానాన్ని ముక్కలు ముక్కలు చేసి సముద్రమధ్యంలో పడేటట్లు చేశాడు. అప్పుడు సాల్వుడు కోరలు పెరికిన క్రూరసర్పంలాగా దీనుడై శక్తిహీనుడై మాయాబలం నశించి కూడా అవక్రపరాక్రమంతో భూమికి దిగాడు.

క. కరమునఁ బవినిభ మగు భీ, కర గద ధరియించి కదియఁగాఁ జనుదేరన్
మురహరుఁ డుద్ధతి సాల్వుని, కరము గదాయుక్తముగను ఖండించె నృపా! 911

* ఓ రాజా! దేవేంద్రుని వజ్రాయుధంతో సమానమైన భయంకర గదను ధరించి సాల్వుడు కృష్ణుణ్ణి ఎదుర్కొన్నాడు. వెంటనే శ్రీకృష్ణుడు వాని చేతిని గదాసహితంగా ఖండించాడు.

క. అంతం బోవక కినుక న, నంతుఁడు విలయార్క మండలాయతరుచి దు
ర్దాంతంబగు చక్రంబు ని, తాంతంబుగఁ బూన్చి సాల్వధరణిపు మీఁదన్. 912

* అంతటితో ఆగకుండా శ్రీకృష్ణుడు ప్రళయకాల సూర్యమండల ప్రభల వెదజల్లే సుదర్శనచక్రాన్ని సాల్వునిమీద ప్రయోగించాడు.

క. గురుశక్తి నైచి వెస భా, సురకుండల మకుటరత్న శోభితమగు త
చ్ఛిరము వడిఁ ద్రుంచె నింద్రుఁడు, వరకులిశముచేత వృత్రు వధియించుక్రియన్. 913

* వజ్రాయుధం చేత ఇంద్రుడు వృత్రాసురుని చంపిన విధంగా చక్రాయుధంతో కృష్ణుడు మకరకుండల శోభితమైన సాల్వుని శిరాన్ని ఖండించివేశాడు.

## -: శ్రీ కృష్ణుండు దంతవక్త్రుని వధించుట :-

వ. ఇట్లు మాయావి యైన సాల్వుండును సౌభకంబును గృష్ణుచేతం బొలియుటఁ గొని నిజసఖులగు సాల్వ పౌండ్రక శిశుపాలురకుఁ బారలౌకికక్రియలు మైత్రిం గావించి దంతవక్త్రుం డతిభీషణాకారంబుతో నప్పుడు. 914

* ఈ విధంగా శ్రీకృష్ణుడు సాల్వుణ్ణి, సౌభక విమానాన్నీ ధ్వంసంచేయటం చూచి దంతవక్త్రుడు తనమిత్రులైన సాళ్వ పౌండ్రక వాసుదేవ శిశుపాలురకు ఉత్తరక్రియలు నిర్వర్తించి, మిక్కిలి భయంక రాకారంతో కృష్ణుని మీదకు తారసిల్లాడు.

చ. పెట పెటఁ బండ్లు గీఁటుచును బెట్టుగ మ్రోయుచుఁ గన్ను గ్రేవలం
జిటచిట విస్ఫులింగములు సింద మహోద్ధతపాదఘట్టనన్
నటనిటనై ధరిత్రి వడఁకాడ వడిన్ గద కేలఁ ద్రిప్పుచున్
మిటమిట మండు వేసవిని మించు దివాకరుఁ బోలి యుగ్రతన్. 915

* పండ్లు పటపట కొరుకుతూ, కన్నుల నుంచి నిప్పుకణాలు రాలుస్తూ, పాదఘట్టనంచేత భూమి వణకేటట్లు నడుస్తూ, గిరగిర గద త్రిప్పుతూ, ఎండాకాలపు మార్తాండ మండలంలాగా మండిపడుతూ దంత వక్త్రుడు కృష్ణుని మీదకు విజృంభించాడు.

చ. వడిఁ జనుదేరఁ జూచి యదువల్లభుఁ డుల్లము పల్లవింప న
ప్పుడు గదఁ గేలఁబూని రథమున్ రయమొప్పఁగ డిగ్గి యుగ్రతం
గడఁగి విరోధికి న్నెదురుగాఁ జన వాఁ డతినీచవర్తియై
యడరుచు నట్టహాసముఖుఁడై వలచే గదఁ ద్రిప్పుచున్ హరిన్. 916

* ఆ రీతిగా తనమీదికి వస్తున్న దంతవక్త్రుణ్ణి చూచి వికసించిన హృదయంతో కృష్ణుడు కూడా గదాహస్తుడై రథం దిగాడు. విరోధికి ఎదురుగా నడిచాడు. దంతవక్త్రుడు అట్టహాసంగా గదత్రిప్పుతూ కమలాక్షునితో ఇలా అన్నాడు.

వ. కనుంగొని పరిహాసోక్తులుగా నిట్లనియె. 'నీవు మదీయభాగ్యంబునం జేసి నేఁడు నా దృష్టి పథంబునకు గోచరుండ వైతివి. మిత్ర ద్రోహివైన నిన్ను మాతులేయుండవని మన్నింపక దేహంబు నందు వర్తించు నుగ్రవ్యాధి నౌషధాదిక్రియల నివర్తింపఁ జేయు చికిత్సకుని చందంబున బంధురూపశాత్రవుండవు

గావున నిన్ను దంభోళి సంరంభ గంభీరంబైన మదీయ గదాదండహతిం బరేతనివాసంబున కనిచి మున్ను నీచేత నిహతులైన నాదుసఖుల ఋణంబుఁ దీర్తు' నని దుర్భాష లాడుచు డగ్గఱి. 917

* ఓ కృష్ణా! నీవు నా భాగ్యవశంచేత ఈనాడు నా కంట పడ్డావు. బంధురూపంలో వున్న విరోధివి నీవు. శరీరంలో ప్రవేశించిన భయంకరవ్యాధిని గట్టిమందుతో పోగొట్టుకొనే వైద్యునిలాగా మిత్రద్రోహివైన నిన్ను మేనమామ కొడుకనే అభిమానం లేకుండా వజ్రాయుధం వంటి నా గదాదండంతో యమలోకానికి పంపిస్తాను. నిన్ను చంపి, నీవు చంపిన నా మిత్రుల ఋణాన్ని తీర్చుకొంటాను- అంటూ దంతవక్త్రుడు శ్రీకృష్ణుణ్ణి దుర్భాషలాడాడు.

చ. పెనుగదఁ బూన్చి కృష్ణుతల బెట్టుగ మొత్తిన నంకుశాహతిన్
గనలెడి గంధసింధురముకై వడి సింధురభంజనుఁడు పెం
పున పవిభాసమానగదఁ బూని మహోగ్రతఁ ద్రిప్పి దంత వ
క్త్రుని యురముం బగిల్చినఁ గుదుల్కొనుచున్ రుధిరంబు గ్రక్కుచున్. 918

* ఇలా అంటూనే దంతవక్త్రుడు తన గదాదండంతో కృష్ణుని తలమీద మోదాడు. అంకుశంపోటుతో ఆగ్రహించిన మదగజంలాగా కృష్ణుడు కోపించి వజ్రాయుధంలాంటి గదతో వాని వక్షఃస్థలాన్ని పగులగొట్టాడు. ఆ దెబ్బకు వాడు రక్తం క్రక్కుతూ నేలకూలాడు.

వ. తత్క్షణంబ పర్వతాకారంబగు దేహంబుతో నొఱలుచు నేలం గూలి కేశపాశంబులు సిక్కువడఁ దన్నుకొనుచుఁ బ్రాణంబులు విడిచె; నప్పుడు నిఖిల భూతంబులు నాశ్చర్యంబు వొందఁ దద్గాత్రంబున నుండి యొక్క సూక్ష్మ తేజంబు వెలువడి గోవిందుని దేహంబుఁ బ్రవేశించె! నయ్యవసరంబున సగ్రజుమరణంబు గనుంగొని కుపితుండై కనుఁగవల నిప్పు లుప్పతిల్ల విదూరథుండు గాలానల జ్వాలాభీలకరాళంబైన కరవాలంబును బలకయుం గేలం దాల్చి దామోదరు దెసకుఁ గవయుటయుం గనుంగొని. 919

* తత్క్షణం పర్వతం వంటి దేహంతో దంత వక్త్రుడు నేలబడి తన్నుకొంటూ ప్రాణాలు విడిచాడు. అప్పుడు సమస్త ప్రాణులూ ఆశ్చర్యపడేటట్లుగా వాని శరీరంలోంచి ఒక సూక్ష్మతేజం వెలువడి కృష్ణుని దేహంలో ప్రవేశించింది. ఆ సమయంలో అన్న మరణం చూచి విదూరథుడు అనేవాడు మహాకోపంతో ప్రళయకాలంనాటి అగ్నిజ్వాలవలె భయంకరమైన కరవాలాన్నీ డాలునూ ధరించి కృష్ణుని పైకి దూకాడు.

చ. జలరుహలోచనుండు నిజసాధనమై తనరారు చక్రమున్
వలనుగఁ బూన్చి వైవ నది వారక వాని శిరంబు ద్రుంచె న
బ్బలియుఁడు సౌభ సాల్వ శిశుపాల సహోదర తత్సహోద రా
వలుల వధించి తత్కులమువారి ననేకులఁ ద్రుంచె నీ గతిన్. 920

∗ కృష్ణుడు తన చక్రాయుధంచేత వాని శిరస్సు ఖండించాడు. ఈ విధంగా బలవంతుడైన శ్రీకృష్ణుడు సౌభకసాల్వుణ్ణీ, శిశుపాలుణ్ణీ, వాని తమ్ముణ్ణీ, వారి సోదరులనూ చంపి ఆ వంశంవారిని పెక్కు మందిని సంహరించాడు.

**వ. అ య్యవసరంబున. 921**

**క. నరమునియోగి సురాసుర, గరుడోరగ సిద్ధ సాధ్య గంధర్వ నభ
శ్చర కిన్నర కింపురుషులు, హరిమహిమ నుతించి రద్భుతానందములన్. 922**

∗ ఆ సమయంలో నరులూ, మునులూ, యోగులూ, దేవతలూ, రాక్షసులూ, గరుడులూ, ఉరగులూ, సిద్ధులూ, సాధ్యులూ, గంధర్వులూ, కిన్నరులూ, కింపురుషులూ మొదలైన వారంతా ఆశ్చర్యానందాలతో శ్రీకృష్ణుని ప్రభావాన్ని అభినందించారు.

**వ. మఱియు నప్పరోజనంబులు నృత్యంబులు సలుప, వేల్పులు కుసుమవర్షంబులు గురియ, దేవ తూర్యంబు లవార్యంబులై మొరయ, యదువృష్ణిప్రవరులు సేవింపఁ, బరమానందంబును బొంది నిజవిజ యాంకితంబులైన గీతంబుల వందిజనంబులు సంకీర్తనంబులు సేయ, నతి మనోహర విభవాభిరామంబును, నూతనాలంకారంబును నైన ద్వారకానగరంబు శుభముహూర్తంబునం బ్రవేశిం పం జనునెడ. 923**

∗ అప్సరసలు ఆనందంతో నృత్యం చేస్తుండగా, దేవతలు పుష్పవర్షం కురిపించుతుండగా, దేవదుందుభులు మ్రోగుతుండగా, యాదవవీరులు సేవించుతుండగా, వందిమాగధులు తన విజయగాథలను గానం చేస్తుండగా నందనందనుడు పరమానందంతో ఒక శుభముహూర్తంలో ద్వారకానగరం ప్రవేశించాడు.

**క. పురసతులు విరులు లాజలు, గురుసౌధాగ్రములనుండి కురియఁగ వికచాం
బురుహాక్షుం డంతఃపుర, వర మర్థిం జొచ్చె వైభవం బలరారన్. 924**

∗ ఆ సమయంలో పురస్త్రీలు మేడలమీద నుంచి శ్రీకృష్ణుని మీద పూలూ, అక్షతలూ కురిపించారు. కృష్ణుడు మహావైభవంతో అంతఃపుర ప్రవేశం చేశాడు.

**వ. అట్లు యోగీశ్వరేశ్వరుండును, షడ్గుణైశ్వర్య సంపన్నుండును, నిఖిల జగదీశ్వరుండును నైన పురుషోత్తముండు సుఖంబుండె నంత. 925**

∗ ఆ విధంగా యోగీశ్వరేశ్వరుడూ, షడ్గుణైశ్వర్య సంపన్నుడూ, సమస్తజగతికీ ప్రభువూ ఐన శ్రీకృష్ణుడు ద్వారకలో సుఖంగా వున్నాడు.

**క. కౌరవ పాండవ పృథు సమ, రారంభ మెఱింగి తీర్థయాత్ర నెపముగా
సీరాంకుఁ డుభయకులులకు, నారయ సముఁడగుటఁ జేసి యరిగె నరేంద్రా! 926**

∗ ఓ రాజా! బలరాముడు కౌరవ పాండవులకూ యుద్ధం ప్రారంభం కానున్నదని తెలుసుకొన్నవాడై ఇరుపక్షాలకూ కావలసిన వాడు కాబట్టి తీర్థయాత్ర నెపంతో ద్వారకనుంచి వెళ్ళిపోయాడు.

## -: బలరాముడు తీర్థయాత్రకుఁ జనుట :-

వ. అట్లు సని మొదలం బ్రభాసతీర్థంబున నవగాహంబు సేసి, యందు దేవర్షి పితృతర్పణంబులు సంప్రీతిం గావించి విమలతేజోధనులగు భూసురప్రవరులు దనతో నరుగుదేరం గదలి చని క్రమంబున సరస్వతియు బిందుసరోవరంబును వజ్రతీర్థంబును విశాలానదియు సరయువును యమునయు జాహ్నవీ తీర్థంబును గనుంగొనుచు నచట నచట నవగాహన దేవర్షి పితృతర్పణ బ్రాహ్మణ సంతర్పణంబులను భూసురయుక్తుండై నడపుచుం జని సకలలోక స్తుత్యంబును నిఖిలముని శరణ్యంబు నగు నైమిశారణ్యంబు సొచ్చి యందు దీర్ఘసత్త్రంబు నడపుచున్న మునిజనంబులం గనుంగొనిన వారును ప్రత్యుత్థానంబు సేసి రామునకు వినతులై యాసన పూజావిధానంబులు గావించిన నతండును బ్రముదిత మానసుం డగుచు సపరివారంబుగాఁ గూర్చున్న యెడ. 927

* బలరాము డావిధంగా తీర్థయాత్రలకు వెళ్ళి ప్రభాసతీర్థంలో స్నానంచేసి ప్రీతితో దేవర్షి పితృ తర్పణాలు వదిలాడు. విప్రశ్రేష్ఠులు వెంటరాగా అతడక్కడినుండి బయలుదేరాడు. క్రమముగా సరస్వతి, బిందుసరోవరం, వజ్రతీర్థం, విశాలానది, సరయువు, యమున, గంగ మున్నగు పుణ్యానదుల్లో స్నానం చేసి దేవర్షి పితృ గణాలకు తర్పణాలు సమర్పించాడు. బ్రాహ్మణులకు సంతర్పణలు చేశాడు. ఆ తరువాత బల రాముడు సమస్తలోకాలకు స్తుతిపాత్రమూ, సంయమీంద్రులకు నివాసస్థానమూ అయిన నైమిశారణ్యంలోకి ప్రవేశించాడు. అప్పు డక్కడ మునులు దీర్ఘ సత్రయాగం జరుపుతూ వున్నారు. వారంతా బలరామునకు ఎదురేగి వినయంతో స్వాగతం పలికి అతిథి మర్యాదలు చేశారు. బలరాముడు సంతసించి సపరివారంగా ఆసీనుడైనాడు.

క. ఆ నెఱిఁ దనుఁ గని ప్రత్యు, త్థాన నమస్కారవిధులు దగ నడపక పెం
పూనిన పీఠముపై నా, సీనుండగు సూతు శేముషీవిఖ్యాతున్. 928

* తక్కిన మునులలాగా తన కెదురుగా వచ్చి స్వాగత మిచ్చి అతిథి పూజలు చేయకుండా ఉన్నతాసనం మీద కూర్చున్న ప్రజ్ఞా సమేతుడైన సూతుణ్ణి బలరాముడు చూచాడు.

వ. కనుంగొని యతని సమీపంబున నున్న విప్రవరులం జూచి రాముండు రోషించి 'వీఁడు నన్నుఁ గని లేవకుండుటకు హేతు వెయ్యదియొకో? ఈ ప్రతిలోమజాతుండు మునిగణ సభాస్థలంబునఁ దానొక్క ముఖ్యుండపోలె దురభిమానంబున శక్తి మనుమని వలనం గొన్ని కథలు గాథలు గఱచి విద్వద్గణ్యుని విధంబున విఱ్ఱ వీఁగెడును; నీచాత్ముం డభ్యసించు విద్య లెల్లను మనంబున విచారించి చూచిన మదకారణంబులు గాని సత్త్వగుణ గరిష్ఠంబులు గావు, ధర్మసంరక్షణంబు సేయ నవతరించిన మాకు నిట్టి దుష్టమర్దనం బవశ్యకర్తవ్యం, బని తలఁచి హస్తంబున ధరించిన కుశాగ్రంబున నా సూతుని వధించిన నక్కడి మునీంద్రు లెల్ల హాహాకారంబుల తోడం దాలాంకునిఁ జూచి యిట్లనిరి.929

* సూతుని నిర్లక్ష్యవైఖరికి బలరాము డాగ్రహించాడు. అతడచ్చట ఉన్న ఋషులను చూచి ఇలా అన్నాడు. 'వీడు నన్ను చూచి లేవకపోవటానికి కారణం ఏమో? ఈ సూతుడు మహర్షులున్న సభలో తానే

పెద్దనని తలచి దురభిమానంతో ప్రవర్తించాడు. వ్యాసునివద్ద కొన్ని కథలూ, గాథలు నేర్చి విద్వాంసుడనని విర్రవీగుతున్నాడు. నీచు లభ్యసించే విద్య వారిలో మదాన్నే పెంచుతుంది. కాని సత్త్వగుణాన్ని పెంచదు. మేము ధర్మసంరక్షణకోసం పుట్టాము. ఇలాంటి దుష్టుల్ని శిక్షించడం మా కర్తవ్యం' అని పలికి తన చేతిలోని కుశాగ్రంతో సూతుణ్ణి వధించాడు. అది చూచి అక్కడి మునులందరూ హాహాకారాలు చేశారు. వారు బలరామునితో ఇలా అన్నారు.

**క. అనఘా! యితనికి బ్రహ్మా, సన మే మిచ్చుటను నీవు సనుదే నితఁ డా**
**సనము దిగఁడయ్యె నింతయు, మును నీమది నెఱుఁగ నర్థముం గలదె? హలీ! 930**

* మహాత్మా! ఇతనికి మేము బ్రహ్మాసనం ఇచ్చాము. అందుచేత నీవు వచ్చినప్పు డితడు లేవలేదు. ఇదంతా నీకు తెలియని విషయం కాదు. నీకు తెలియని ధర్మమంటూ వుందా?

**క. ఎఱిఁగెఱిఁగి బ్రహ్మహత్యా, దురితంబున నీమనంబు దూకొనెఁ బాపో**
**త్తరణ ప్రాయశ్చిత్తము, దొరఁకొని కావింపు మయ్య దుర్జనహరణా! 931**

* అయ్యా! తెలిసి తెలిసి బ్రహ్మహత్యా పాపానికి ఒడిగట్టావు. ఈ పాపం నిష్కృతి కావటానికి నీవు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.

**వ. అదియునుం గాక పరమపావనుండవైన నీవు ధర్మంబు దప్పిన నెవ్వరు మాన్పంగలరు? కావునఁ బ్రాయశ్చిత్తంబు గైకొని నడపకున్న ధర్మంబు నిలువ; దట్లు గావున దీనికిఁ బ్రతీకారంబు పుట్టింపు' మనిన నతండు వారలం గనుంగొని 'తామసంబున నిట్టి పాపంబు సేయంబడియె. దీనికి ముఖ్యపక్షంబునఁ బ్రతికృతి యెఱింగింపుండు, వీనికి నాయువును బహుసత్త్వంబును నొసంగిన మీ కిష్టం బగునే? నట్లు నాయోగమాయచేఁ గావింతు' నన నమ్మునులు నీ యస్త్ర మాహాత్మ్యంబునకు మృత్యువునకు మాకు నెవ్విధంబున వైకల్యంబు నొందకుండునట్లు గావింపు మనిన నతం డందఱం జూచి యప్పుడు. 932**

* పరమపవిత్రుడవైన నీవే ధర్మం తప్పితే మాన్పగలవా రెవరున్నారు? ప్రాయశ్చిత్తం చేసుకోకపోతే ధర్మానికి మనుగడ వుండదు గనుక నీ వా కార్యం తలపెట్టాలి- ఇలా పలుకుతున్న మహర్షుల మాటలు విని బలరాముడు వారితో 'తొందరపాటువల్ల ఇంతటి పాపం చేశాను. దీనికి ప్రాయశ్చిత్త మార్గం మీరే తెలపాలి. నా యోగమాయా ప్రభావంతో సూతుణ్ణి బ్రతికించి అతణ్ణి మహాశక్తి మంతునిగా చేయగలను. అది మీ కిష్టమేనా? అన్నాడు. 'నీఅస్త్రమాహాత్మ్యానికీ, మృత్యువుకూ, మాకూ ఏలాటి ఉపద్రవం కలుగకుండా నీ ఇష్టప్రకారం చేయవలసిం'దని ఋషులు బలరామునితో అన్నారు.

**క. ధాత్రీవర సమధిక చా, రిత్రుఁడు హలపాణి పలికె ధృతి 'నాత్మా వై**
**పుత్త్రక నామాసి' యను ప, విత్ర శ్రుతి వాక్యసరణి విశదం బగుటన్. 933**

* 'ఆత్మా వై పుత్ర నామాపి' తానే పుత్రరూపంలో తిరిగీ జన్మిస్తాడనే వేదవచనానికి తగినట్లు బలరాముడిలా అన్నాడు.

క. ఈ సూతసూనుఁడిపుడు మ, హోసత్త్వము నాయువును ననామయమును వి
ద్యా సామర్థ్యము గలిగి సు, ధీసత్తములార! యీక్షితిన్ విలసిల్లున్. 934

* ఓ మహర్షులారా! ఈ సూతపుత్రుడు ఆయువునూ, ఆత్మ శక్తినీ, రోగంలేని తనువునూ, విద్యాదక్షతనూ పొందినవాడై ఈ లోకంలో ప్రకాశిస్తాడు.

వ. అని సూతుం బునర్జీవితుంగాఁ జేసి మునులం జూచి యిట్లనియె. 935

* బలరాముడు ఈ విధంగా పలికి సూతుణ్ణి బ్రతికించి మునులతో మళ్ళీ ఇలా అన్నాడు.

తే. 'ఏ నెఱుంగక చేసిన యీ యవజ్ఞ, శాంతి వొంద నేయది యభీష్టంబు మీకు
దానిఁ గావింతు ననిన మోదంబు నొంది, పలికి ర త్తాపసులు హలపాణిఁ జూచి. 936

* నేను తెలియక చేసిన ఈ అపరాధం శాంతించేలాగు మీ కిష్టమైన కార్యం ఏదైనా చేస్తాను చెప్పండి- అని పలికిన బలరాముని మాటలకు ఋషులు పరమానందం చెంది అతణ్ణి చూచి ఇలా అన్నారు.

చ. 'హలధర! యిల్వలుండను సురారితనూజుఁడు పల్వలుండు నాఁ
గలఁ డొక దానవుండు బలగర్వమునం బ్రతిపర్వమందు న
చ్ఛలమున వచ్చి మా సవనశాలల మూత్ర సురాస్రపూయ వి
ట్పలలము లోలిమైఁ గురిసి పాడఱఁ జేయును యజ్ఞవాటముల్. 937

* బలరామా! ఇల్వలుడనే రాక్షసుని కొడుకు పల్వలుడు. వాడు బలగర్వితుడై పట్టుదలతో ప్రతి పర్వం నాడూ వచ్చి యజ్ఞశాలల్లో మలమూత్రాలనూ, చీమునెత్తురులనూ, మద్యమాంసాలనూ కురిపించి వాటిని పాడుచేస్తున్నాడు.

వ. కావున దుష్టదానవుం ద్రుంచుటయు మాకుం గరంబు సంతసంబగు; నంత మీఁద నీవు విమలచిత్తుండవై భారతవర్షంబునం గల తీర్థంబుల ద్వాదశమాసంబు లవగాహనంబు సేయు; మట్లయిన సర్వపాపనిష్కృతి యగునని పలుకునంతఁ బర్వసమాగమంబైన. 938

* కనుక దుర్మార్గుడైన ఆ రాక్షసుణ్ణి నీవు చంపితే మా కదే సంతోషదాయకం. నీ వా పని చేసిన తర్వాత పండ్రెండు మాసాలు నిర్మలమైన హృదయంతో భారతదేశంలో ఉన్న సకల పుణ్యతీర్థాలనూ సేవించి వాటిలో స్నానం చెయ్యి. అలా చేస్తే సమస్త పాపాలూ తొలగిపోతాయి. మును లిలా అంటుండగానే పర్వదినం రానేవచ్చింది.

సీ. మునులు యజ్ఞక్రియోన్ముఖు లౌటఁ గనుఁగొని పఱతెంచి యసుర తద్భవనములను
రక్త విణ్మూత్ర సురా మాంసజాలంబు నించి హేయంబు గావించి పెలుచఁ
బెంధూళి ఱాలును బెల్లలు నురలెడు చక్రానిలము వీఁచి చదల నపుడు
గాటుకకొండసంగతిఁ బొల్చు మేను తామ్ర శ్మశ్రు కేశ సమాజములును

తే. నవ్యచర్మాంబరము భూరినాసికయును, గఱకు మిడిగ్రుడ్లు నిప్పులు గ్రక్కు దృష్టి
వ్రేలు పెదవులు దీర్ఘకరాళ జిహ్వ, కయును ముడివడ్డబొమలును గలుగువాని. 939

* మునులు యాగానికి ఉపక్రమించటం పల్వలుడు చూశాడు. వెంటనే అక్కడికి వచ్చి మద్యమాంసాలనూ, మలమూత్రాలనూ కురిపించి నానాబీభత్సం చేశాడు. రాళ్ళతో, మట్టిగడ్డలతో ధూళితో నిండిన సుడిగాలులు వీచేలాగు చేశాడు. కాటుక కొండలాంటి శరీరమూ, ఎర్రనిగడ్డము, మీసాలూ కలిగి, పెద్దముక్కూ, మిడిగ్రుడ్లూ, నిప్పులు చిమ్మే చూపులూ, వ్రేలాడే పెదవులూ, పొడవైన నాలుకా కలిగి, ముడవడ్డ కనుబొమలతో భయంకరంగా ఆకాశంలో సంచరిస్తున్న పల్వలుణ్ణి బలరాముడు చూచాడు.

మహాస్రగ్ధర.

కనియెం దాలాంకుఁ డుద్యత్కట చటుల నట త్కాలదండాభ శూలున్
జనరక్తాసిక్తతాలున్ సమధిక సమరోత్సాహలోలుం గరో రా
శని తుల్యోదగ్ర దంష్ట్రా జనిత శిఖకణాచ్ఛాది తాశాంతరాళున్
హననవ్యాపార శీలు న్నతి దృఢఘనమస్తాస్థిమాలుం గరాళున్. 940

* ఆ రాక్షసుడిచేతిలో భయంకరమైన శూలం చలిస్తూ వుంది. అతని దౌడలు మానవుల రక్తంతో తడిసి వున్నాయి. ఆ దానవుని చిత్తంలో రణోత్సాహం అతిశయిస్తూ వుంది. వజ్రాయుధంలాంటి వాడి కోరలనుంచీ అగ్ని కణాలు వెలువడి దిక్కులనూ ఆకాశాన్నీ కప్పివేస్తున్నాయి. ప్రాణుల్ని చంపడమే వ్రతంగా ఆ దానవుడు తల కాయలనూ, ఎముకలనూ హారంగా కట్టి మెడలో వేసుకున్నాడు. అలాంటి భయంకరమైన రాక్షసుని బలరాముడు చూచాడు.

ఉ. వెండియుఁ గ్రొమ్మెఱుంగు లుడువీథి వెలుంగఁగ నుల్లసద్గదా
దండముఁ గేలఁ ద్రిప్పుచు నుదారత రా బలభద్రుఁ డాసురో
ద్దండ విఘాతులౌ ముసలదారుణలాంగలముల్ దలంప మా
ర్తాండనిభంబులై యెదురఁ దత్క్షణమాత్రన తోఁచినన్ వెసన్. 941

* గగనవీథిలో క్రొమ్మెరుగులను చిమ్ముకుంటూ, చేతిలోని గదను త్రిప్పుతూ, పల్వలుడు తనమీదకు రావటం చూచిన బలరాముడు రాక్షస సంహార సమర్థములైన రోకలినీ, నాగలిని స్మరించాడు. అవి తత్క్షణమే సూర్యసమాన తేజస్సుతో బలరాముని ఎదుట ప్రత్యక్ష మయ్యాయి.

వ. అట్లు సన్నిహితంబులైన తన కార్యసాధనంబు లగు నిజసాధనంబులు ధరియించి యప్పుడు.942

చ. గగనమునం జరించు సురకంటకు కంఠము చేఁతినాగటం
దగిలిచి రోఁక లెత్తి బెడిదం బడరన్ నడునెత్తి మొత్తినన్
బుగబుగ నెత్తు రొల్క నిల బోరగిలం బడె వజ్రధారచేఁ
దెగి ధరఁ గూలు భూరి జగతీధరముం బురుడింప బెట్టుగాన్. 943

* ఆ విధంగా సాక్షాత్కరించిన ఆయుధాలను అందుకొని బలరాముడు ఆకాశంలో సంచరిస్తున్న పల్వలుని కంఠాన్ని నాగలికి తగిలించి క్రిందకు లాగి రోకలితో వాని నడినెత్తిమీద బలంగా మొత్తాడు. ఆ దెబ్బకు ఇంద్రుని వజ్రాయుధం వ్రేటుకు విరిగి నేలమీద పడే పర్వతంలాగా పల్వలుడు బుగబుగ నెత్తురు కక్కుకుంటూ భూమిపై బోరగిలా పడ్డాడు.

**వ. అట్లు పల్వలుండు మడిసిన. 944**

**క. మునివరులు గామపాలుని, వినుతించిరి వేయువేల విధముల వృత్రుం**
**దునిమిన యింద్రుని నమరులు, వినుతించిన రీతి నపుడు విమలచరిత్రా! 945**

* పల్వలుడు ఈ విధంగా నేలకూలటం చూచి వృత్రాసురుని సంహరించిన దేవేంద్రుని దేవతలు వినుతించిన విధంగా మునులందరూ బలరాముణ్ణి స్తుతించారు.

**తే. అంత నభిషిక్తుఁ జేసి యత్యంత సురభి, మంజులామ్లాన కంజాత మాలికయును**
**నంచితాభరణములు దివ్యాంబరములు, నర్థి నిచ్చినఁ దాల్చి యా హలధరుండు. 946**

* మునులు బలరాముణ్ణి పవిత్ర తీర్థజలాలతో అభిషిక్తుణ్ణి గావించారు. సుగంధాలు విరజిమ్మే సుందర సుకుమార పద్మమాలికతో అలంకరించారు. చక్కని ఆభరణాలనూ, ప్రశస్తములైన వస్త్రాలనూ ప్రీతితో ఇచ్చారు. బలరాముడు వాటిని ధరించాడు.

**క. దేవేంద్రుఁ బోలి యొప్పెను, ధీవిలసితుఁ డగుచు మునితతిన్ వీడ్కొని తన్**
**సేవించుచుఁ గతిపయ వి, ప్రావలి సనుదేరఁ గౌశికాఖ్యంబునకున్. 947**

* అనంతరం ప్రతిభావంతుడైన బలరాముడు దేవేంద్రునిలా ప్రకాశిస్తూ మునులను వీడ్కొని బ్రాహ్మణులు కొందరు వెంటరాగా కౌశికి అనే నదిని సమీపించాడు.

**వ. చని యమ్మహానదిం గృతస్నానుండై యచ్చోటు వాసి సరయువునందుఁ గ్రుంకులిడి ప్రయాగ నవగాహనంబు సేసి, దేవర్షి పితృతర్పణంబు లాచరించి పులస్త్యాశ్రమంబు సొచ్చి గోమతిం దర్శించి గండకీనది నుత్తరించి విదళితభవపాశ యగు విపాశయందుఁ దోఁగి శోణనదంబున నాప్లావితుండై గయ నాడి గంగాసాగర సంగమంబు దర్శించి మహేంద్ర నగంబున కరిగి. 948**

* బలరాముడు కౌశికీనదిలో స్నానం చేశాడు. అక్కడనుంచీ బయలుదేరి సరయూనదిలో మునిగి, ప్రయాగలో కృతస్నాతుడై దేవర్షి తర్పణాలు ఆచరించాడు. ఆ తరువాత పులస్త్యాశ్రమం ప్రవేశించాడు. ఆ మీద గోమతిని దర్శించి గండకీనదిని దాటి పరమపావని అయిన విపాశలో స్నానం చేసి శోణనదిలోనూ, తర్వాత గయలోనూ స్నానమాడి, గంగా సాగరసంగమం దర్శించి, మహేంద్ర పర్వతం చేరుకున్నాడు.

**క. రాముఁడు గనుఁగొనె భార్గవ, రామున్ రజనీశ కుల ధరావరనగ సు**
**త్రామున్ సన్నుత సుగణ, స్తోముం గారుణ్యసీము సుజనలలామున్. 949**

* ఆ మహేంద్రగిరిపై క్షత్రియకులాన్ని మట్టు పెట్టినవాడూ, సంస్తుతింప దగిన సద్గుణాలు కలవాడూ, దయాశాలీ, సుజనమౌళీ అయిన పరశురాముణ్ణి బలరాముడు సందర్శించాడు.

ఆ. కని నమస్కరించి కౌతుకం బలరార, నతని వీడుకొని హలాయుధుండు
గొమరు మిగిలి సప్తగోదావరికి నేఁగి, యందుఁ దీర్థమాడి యచటు గదలి. 950

* బలరాముడు పరశురామునికి ప్రణామా లర్పించి అతనివద్ద సెలవు తీసుకొని సప్త గోదావరికి వెళ్లి అందులో స్నానం చేశాడు.

వ. వేణీ పంపా సరస్సులం జూచి భీమనది కేఁగి యందుఁ గుమార స్వామిని దర్శించి, శ్రీశైలంబునకుఁ జని, వేంకటాచలంబు దర్శించి, కామకోటి శక్తిని నిరీక్షించి, కాంచీపురంబుం గాంచి, కావేరికిం జని యమ్మహావాహిని నవగాహనంబు సేసి. 951

* సప్తగోదావరిని చూచిన తర్వాత బలరాముడు కృష్ణవేణీ, పంపానదులను తిలకించాడు. భీమానదినీ అచట వెలసిన కుమార స్వామినీ సందర్శించాడు. ఆ తరువాత శ్రీశైలం, తిరుమల, కాంచీపురం మొదలైన దివ్యక్షేత్రాలను చూచి కావేరిని చేరుకుని ఆ మహానదిలో స్నానం చేశాడు.

స్రగ్ధర.

సేవించెన్ రంగధామున్ శ్రితనివహ పయస్సింధు సంపూర్ణసోముం
గావేరీ మధ్యసీమున్ ఘనకలుష మహాకాలకూటోగ్ర భీమున్
దేవారి శ్రీవిరామున్ దివిజవినుత సందీపితానంత నామున్
ధీవిజ్ఞానాభిరాముం ద్రిభువన విలసద్దేవతా సార్వభౌమున్. 952

* ఆ కావేరీనదీ మధ్యంలో వేంచేసి ఉన్నవాడూ, ఆశ్రితులనే పాలసముద్రానికి పూర్ణచంద్రుని వంటివాడూ, కలుషాలను కబళించే వాడూ, రాక్షసుల సంపదలను హరించేవాడూ, అమరులు వినుతించే అనంతనామాలు కలవాడూ, సకల దేవతలకు అధినాథుడైన శ్రీరంగనాథుణ్ణి బలరాముడు సేవించాడు.

వ. అచ్చోటు వాసి వృషభాద్రి నెక్కి, హరిక్షేత్రంబు ద్రొక్కి, మధురాపురంబున కరిగి, సేతుబంధనంబు మెట్టి, యచటం బదివేల పాఁడి మొదవుల భూసురుల కిచ్చి, రామేశ్వరుం దర్శించి, తామ్రపర్ణికిం జని, మలయాచలం బెక్కి, యగస్త్యునిం గని నమస్కరించి, దక్షిణ సముద్రంబు దర్శించి, కన్యాఖ్య దుర్గాదేవి నుపాసించి, పంచాప్సరంబను తీర్థంబున నాప్లవనం బాచరించి, గోకర్ణంబున నిందు మౌళిని దర్శించి, ద్వీపవతి యైన కామదేవిని వీక్షించి, తాపిం బయోష్ణిని దర్శించి, నిర్విం ధ్యంబు గడచి, దండకావనంబున కరిగి, మాహిష్మతీ పురంబున వసియించి, మనుతీర్థం బాడి, క్రమ్మఱం బ్రభాసతీర్థంబునకు వచ్చి యచ్చటి బ్రాహ్మణ జనంబుల వలనఁ బాండవధార్తరాష్ట్రుల భండనంబునందు సకలరాజలోకంబు పరలోక గతు లగుటయు, వాయునందన సుయోధనులు గదాయుద్ధ సన్నద్ధులై యుండుటయు నెఱింగి వారల వారించు తలంపున నచటికిం జని. 953

* బలరాముడు శ్రీరంగనాథుణ్ణి దర్శించిన తరువాత వృషభాద్రి, మధుర, సేతబంధం దర్శించి అచ్చటి బ్రాహ్మణులకు పదివేలపాడి ఆవులను దానంచేసి, రామేశ్వరం మున్నగు ప్రసిద్ధక్షేత్రాలను చూచి, మలయాచలం ఎక్కి, అక్కడ అగస్త్యునికి మ్రొక్కి, కన్యాకుమారిని గాంచి, గోకర్ణ క్షేత్రంలో పరమేశ్వరుణ్ణి దర్శించి, నిర్వింధ్యను దాటి, దండకాటవిని గడచి, ప్రభాసతీర్థానికి వెళ్లాడు.

కౌరవ పాండవ సంగ్రామంలో సమస్తరాజులూ హతులయ్యారనీ, భీమదుర్యోధనులు గదాయుద్ధానికి సన్నద్ధులౌతున్నారనీ అచ్చటి బ్రాహ్మణులవల్ల తెలుసుకొని వారిని నివారించటానికి అచటికి వెళ్ళాడు.

**తే. ధర్మనందనుఁ దనకు వందనము సేయు, కృష్ణ నరు మాద్రిసుతుల వీక్షించి యేమి**
**పలుక కుగ్ర గదా దండపాణు లగుచుఁ, గ్రోధమునఁ బోరు భీమ దుర్యోధనులను. 954**

* బలరాముడు ధర్మరాజును చూచాడు. శ్రీకృష్ణ పార్థ నకుల సహదేవులు బలరామునికి భక్తితో నమస్కరించారు. అత డెవ్వరిని పలకరించక, భయంకరంగా గదాయుద్ధం చేసే భీమ దుర్యోధనుల దగ్గరకు సరాసరి వెళ్ళాడు.

**వ. చూచి వారల డాయంజని యిట్లనియె. 955**

**సీ. వీరపుంగవులార! వినుఁడు;మీలోపల భూరిభుజాసత్త్వమున నొకండు**
**ప్రకటితాభ్యాస సంపద్విశేషంబున నొక్కండు యధికుఁడై యుంటఁజేసి**
**సమబలు; లటు గాన చర్చింపఁగా నిందు, జయమొక్కనికి లేదు సమరమందుఁ;**
**గాన యూరక పోరఁగా నేల మీ కని వారింప నన్యోన్య వైరములను**

**తే. నడరి తొల్లింటి దుర్భాష లాత్మలందుఁ, దలఁచి తద్భాషణము లపథ్యములు గాఁగ**
**మొక్కలంబునఁ బోర నా ముష్టికా సు, రారి వీక్షించు వీరి శుభాశుభములు, 956**

* అలా వెళ్ళి బలరాము డా మేటి వీరులను చూచి వారితో 'మీలో ఒకడు భుజబలంలో అధికుడు. మరొకడు అభ్యాసనైపుణ్యంలో శ్రేష్ఠుడు, మీరిద్దరూ సమానులు. మీలో ఎవరూ ఎవరినీ గెలువలేరు. కాగా ఊరక యుద్ధానికి పూనుకోవడం దేనికి?' అని అన్నాడు. పాత పగలను మనస్సుల్లో ఉంచుకున్న భీమ దుర్యోధనులు బలరాముని హితవచనాలను ఆలకించలేదు. వారు పౌరుషంతో పోరాడటానికే నిశ్చయించారు. కానున్నది కాకమానదని బలరాము డక్కడనుంచి ద్వారక చేరుకున్నాడు.

**వ. ఎట్లు గావలయు నట్ల యయ్యెడుం గాక యని యచ్చోట నిలువక యుగ్రసేనాది బంధు ప్రకరంబులు పరితోషంబున నెదుర్కొన ద్వారకాపురంబు సొచ్చి యందుండి మగిడి నైమిశారణ్యంబునకుం జని యందుల మునిపుంగవు లనుమతింప నచ్చట నొక మఖంబు గావించి బహుదక్షిణ లొసంగి యంచితజ్ఞాన పరిపూర్ణు లగునట్లుగా వరం బిచ్చి రేవతియునుం దానును బంధుజ్ఞాతి యుతంబుగా నవభృథ స్నానం బాచరించి యనంతరంబ. 957**

* ఉగ్రసేనాది యాదవప్రముఖులు బలరామునికి స్వాగతం పలికారు. అత డక్కడ కొన్నాళ్లుండి మళ్ళీ నైమిశారణ్యానికి వెళ్లాడు. అక్కడ యజ్ఞం చేసి భూరిదక్షిణలతో బ్రాహ్మణులను సంతృప్తి పరచాడు. భార్య రేవతితోను, బంధువులతోనూ కలిసి అవభృథస్నానం చేశాడు.

**చ. విలసిత మాల్యచందన నవీన విభూషణ రత్న వస్త్రముల్**
**పొలుపుగఁ దాల్చి యంచిత విభూతిఁ దలిర్చెను బూర్ణచంద్రికా**
**కలిత సుధాంశురేఖ యెసకం బెసఁగన్ నిజబంధు లోచనో**
**త్పలచయ ముల్లసిల్లఁ బరిపాండుర చారు యశోవిలాసుఁడై.** 958

* బలరాముడు పుష్పహారాలను దాల్చి, చందనం పూసికొని వినూత్న వస్త్రాభరణాలను ధరించాడు. పున్నమనాటి చంద్రుని లాగున బలరాముడు పరిపూర్ణ యశోభిరాముడై బంధువుల నేత్రాలనే కలువలకు వికాసం కలిగించాడు.

**వ. ఇ వ్విధంబున ననంతుండు నప్రమేయుండును మాయామానుష విగ్రహుండు ననంఖ్యబలశాలియునైన**
**బలదేవుండతి వైభవంబున నిజపురంబు ప్రవేశించి సుఖం బుండె'నని చెప్పి యిట్లనియె .** 959

* ఈ విధంగా మహాబలశాలీ, మాయామానుషవేషధారీ ఐన బలరాముడు మిక్కిలి వైభవంతో ద్వారకకు వెళ్ళి అక్కడ సుఖంగా ఉన్నాడు.

## -: కుచేలో పాఖ్యానము :-

**క. హలధరుఁ డమర్త్య చరితుం, డలఘు భుజాబలుఁ డొనర్చు నద్భుత కర్మం**
**బులు పెక్కు నాల్గు మోములు, గల మేటియు లెక్క పెట్టఁ గలఁడె నరేంద్రా!** 960

* ఓ మహారాజా! హాలాయుధుడూ, భుజబల సంపన్నుడూ అయిన బలరాముని అద్భుతకార్యాలను పొగడటానికి నాలుగు ముఖాలు గల బ్రహ్మకైనా సాధ్యం కాదని శుకమహర్షి పరీక్షిత్తుతో అన్నాడు.

**చ. అనిన మునీంద్రుఁ గన్గొని ధరాధిపుఁడిట్లను పద్మపత్ర లో**
**చనుని యనంత వీర్యగుణ సంపద వేములు విన్న నైననుం**
**దనియదు చిత్త మచ్యుతకథావిభవం బొకమాటు వీనులన్**
**వినిన మనోజపుష్ప శరవిద్ధుఁడు నైన విరామ మొందునే?** 961

* పరీక్షిత్తు శుకమహర్షితో ఇలా అన్నాడు. అంబుజాక్షుని అనంత గుణసంపదలను గురించీ, పరాక్రమ ప్రాశస్త్యాలను గురించీ ఎన్నిమారులు విన్నా తనివితీరదు. ఒక్కసారి విష్ణుకథావైభవాన్ని వింటే చాలు. మదనబాణ పీడితుడైనవాడు కూడా మరీ మరీ వినకుండా ఉండలేడు.

**వ. అదియునుంగాక.** 962

**చ. హరి భజియించు హస్తములు హస్తము; లచ్యుతుఁ గోరి మ్రొక్కు త**
**చ్ఛిరము శిరంబు; చక్రధరుఁ జేరిన చిత్తము చిత్త; మిందిరా**

వరుఁ గను దృష్టి దృష్టి; మురవైరి నుతించిన వాణి వాణి; య
క్షరుకథ లాను కర్ణములు కర్ణములై విలసిల్లుఁబో భువిన్. 963

* మునీంద్రా! హరిని పూజించే చేతులే చేతులు. ఆయనకు నమస్కరించే శిరస్సే శిరస్సు. ఆ దేవుణ్ణి చూచే కన్నులే కన్నులు. ఆ స్వామిని పొగడే నోరే నోరు. మధువైరి కథలను వినే చెవులే చెవులు.

క. హరిపాదతీర్థ సేవా, పరుఁడై విలసిల్లునట్టి భాగవతుని వి
స్ఫురితాంగము లంగము; లా, పరమేశ్వరు నెఱుఁగ నాకుఁ బలుకు మునీంద్రా! 964

* ఓ మునీంద్రా! శ్రీహరి వెలసిన తీర్థాలను సేవించి ధన్యుడైన భాగవతుని అంగములే అంగములు. ఆ పరమాత్ముని తెలుసుకొనే మార్గం నాకు విశదీకరించి చెప్పాలని కోరుతున్నాను.

సీ. అనుడు వేదవ్యాసతనయుఁ డా యభిమన్యు తనయునిఁ జూచి యిట్లనియెఁ బ్రీతి
జనవర! గోవింద సఖుఁడు కుచేలుండు, నా నొప్పు విప్రుండు మానధనుఁడు
విజ్ఞాని రాగాది విరహితస్వాంతుండు శాంతుండు ధర్మవత్సలుఁడు ఘనుఁడు
విజితేంద్రియుఁడు బ్రహ్మవేత్త దారిద్ర్యంబు బాధింప నొరులఁ గార్పణ్యవృత్తి

తే. నడుగఁ బోవక తనకుఁ దా నబ్బినట్టి, కాసు పదివేల నిష్కములగాఁ దలంచి
యాత్మ మోదించి పుత్రదారాభిరక్ష, యొక విధంబున నడుపుచు నుండు నంత 965

* ఇలా పలుకుతున్న పరీక్షిత్తును చూచి శుకమహర్షి సంతోషంతో ఇలా అన్నాడు. ఓ మహారాజా! శ్రీకృష్ణుని బాల్య సఖుడు కుచేలుడు. ఆ బ్రాహ్మణోత్తముడు అభిమానధనుడు. విజ్ఞానవంతుడు. రాగద్వేషాలు లేనివాడు. పరమశాంతమూర్తి. ధర్మతత్పరుడు. జితేంద్రియుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. తన గృహంలో దారిద్ర్యం దారుణంగా తాండవిస్తున్నా ఎవరినీ దీనంగా యాచించి ఎరుగడు. తనంత తానుగా ప్రాప్తించిన కాసును కూడా పదివేలుగా భావించి ఏదో ఒక విధంగా భార్యాపుత్రులను పోషిస్తూ వచ్చాడు.

సీ. లలితపతివ్రతా తిలకంబు వంశాభిజాత్య తద్భార్య దుస్సహ దరిద్ర
పీడచేఁ గడు నొచ్చి పెదవులు దడుపుచు శిశువు లాఁకటి చిచ్చుచేఁ గృశించి
మల మల మాఁడుచు మానసం బెరియంగఁ 'బట్టెఁడోరెము మాకుఁబెట్టు' మనుచుఁ
బత్త్రభాజన ధృతపాణులై తనుఁ జేరి వేఁడిన వీనులు సూఁడినట్ల

ఆ. యైన నొకనాఁడు వగచి నిజాధినాథుఁ, జేరి యిట్లని పలికె'నో జీవితేశ!
తట్టుముట్టాడు నిట్టి పేదఱిక మిట్లు, నొంప దీని కుపాయ మూహింప వైతి. 966

* కుచేలుని భార్య మహాపతివ్రత. సద్వంశసంజాత. బిడ్డలు ఆకలిమంటచేత కృశించి ఎండిన పెదవులను నాలుకతో తడుపుకుంటూ చేతుల్లో ఆకులూ గిన్నెలూ పట్టుకొని తల్లివద్దకు వచ్చి పట్టెడన్నం పెట్టమని అడుగుతుంటే ఆమె భర్తతో 'ప్రాణేశ్వరా! ఇంట్లో పేదరికం తాండవిస్తూ ఉంది. దీన్ని గురించి మీ రాలోచించడం లేదు' అని శోకంతో అన్నది.

వ. అని మఱియు నిట్లనియె. 967

తే. బాలసఖుఁడైన యప్పద్మపత్త్ర నేత్రుఁ, గాన నేఁగి దారిద్ర్యాంధకార మగ్ను
లైన మము నుద్ధరింపుము; హరికృపా క, టాక్ష రవిదీప్తి వడసి మహాత్మ ! నీవు. 968

* ఆమె ఆత్మేశ్వరునితో ఇంకా ఇలా అన్నది-స్వామీ! శ్రీకృష్ణుడు మీకు బాల్యసఖుడు. ఆ మహానుభావుణ్ణి దర్శించండి. అతని కృపాకటాక్షం పొంది దారిద్ర్యంతో తల్లడిల్లుతున్న పిల్లలను ఉద్ధరించండి.

వ. మఱియును. 969

చ. వరదుఁడు సాధుభక్తజన వత్సలుఁ డార్తశరణ్యుఁ డిందిరా
వరుఁడు దయాపయోధి భగవంతుఁడు కృష్ణుఁడు దాఁ గుశస్థలీ
పురమున యాదవ ప్రకరముల్ భజియింపఁగ నున్నవాఁడు; నీ
వరిగిన నిన్నుఁ జూచి విభుఁ డప్పుడ యిచ్చు ననూన సంపదల్. 970

* జనార్దనుడు భక్తవత్సలుడు. ఆశ్రితులను రక్షించేవాడు. దయాసాగరుడు. ఆ మాధవుడు యాదవులు తన్ను సేవింపగా ద్వారకలో ఉన్నాడు గదా! ఒక్కసారి ఆ పరమాత్ముని దర్శించండి. ఆ స్వామి మిమ్మల్ని చూస్తే చాలు. వెంటనే మీకు అపారమైన సంపదలు అనుగ్రహిస్తాడు.

మ. కలలోనం దను మున్నెఱుంగని మహాకష్టాత్ముఁడై నట్టి దు
ర్బలుఁ డాపత్సమయంబునన్ నిజపదాబ్జాతంబు లుల్లంబులోఁ
దలఁప న్నంతన మెచ్చి యార్తిహరుఁడై తన్నైన నిచ్చున్; సుని
శ్చలభక్తిన్ భజియించు వారి కిడఁడే సంపద్విశేషోన్నతుల్? 971

* కలలో కూడా తన్నె న్నడూ స్మరించని కష్టాత్ముడు కూడా విపత్కర పరిస్థితిలో ఒక్కసారి ఆ భక్తజన మందారుని పాదారవిందాలను మనసారా స్మరిస్తే చాలు. అట్టి వానిని కూడా ఆభగవంతుడు కనికరిస్తాడు. అవసరమైతే తన్ను తానే అర్పించుకొంటాడు. అంతటి మహనీయుడు నిరంతరం భక్తితో తన్ను సేవించే వారికి సమస్త సంపదలు ఇయ్యకుండా ఉంటాడా?

క. అని చెప్పిన య మ్మానిని, సునయోక్తుల కలరి భూమిసురుఁ డా కృష్ణుం
గన నేఁగుట యిహపర సా, ధన మగు నని మదిఁ దలంచి తన సతితోడన్. 972

* ఇలా పలికిన ఇల్లాలి మాటలకు కుచేలుడు సంతోషించాడు. శ్రీకృష్ణుణ్ణి చూడటానికి వెళ్ళడం ఇహపరసాధన మని తలంచాడు.

తే. నీవు సెప్పిన యట్ల రాజీవనేత్రు, పాదపద్మంబు లాశ్రయింపంగఁ జనుట
పరమశోభన మా చక్రపాణి కిపుడు, గాను కేమైనఁ గొంపోవఁ గలదె మనకు? 973

* కుచేలుడు తన ఇల్లాలితో 'నీ వన్నట్లు శ్రీకృష్ణుణ్ణి ఆశ్రయించడం పరమ కల్యాణప్రదమే. అయినా ఆయన దగ్గరకు వెళ్ళేటప్పుడు ఆయనకు ఏదయినా కానుక తీసుకొనిపోవడం బాగుంటుంది కదా!' అన్నాడు.

తే. అనిన న య్యింతి యొఁగాక యనుచు విభుని, శిథిల వస్త్రంబు కొంగునఁ బృథుక తండు
లముల నొకకొన్ని ముడిచి నెయ్యమున ననుపఁ, జనియె గోవింద దర్శనోత్సాహి యగుచు. 974

* కుచేలుని భార్య భర్త అభిప్రాయంతో ఏకీభవించింది. అతని చినిగిన వస్త్రపు కొంగులో అటుకులు కొన్ని ముడివేసి ప్రేమతో ప్రయాణానికి సిద్ధం చేసింది. కుచేలుడు గోవింద దర్శనోత్సాహంతో బయలుదేరాడు.

వ. అట్లు సనుచుం దన మనంబున. 975

సీ. ద్వారకానగరంబు నే రీతిఁ జొత్తును? భాసురాంతఃపురవాసి యైన
య ప్పుండరీకాక్షు నఖిలేశు నెబ్బంగిఁ దర్శింపఁ గలనొ? తద్ద్వారపాలు
రెక్కడి విప్రుఁడ? విం దేల వచ్చెద?వని యడ్డ పెట్టిరే నపుడు వారి
కే మైనఁ బరిదాన మిచ్చి చొచ్చెద నన్న నూహింప నర్థశూన్యుండ నేను;

తే. నయిన నా భాగ్య; మతని దయార్ద్రదృష్టి, గాక తలపోయఁగా నొండు గలదె? యాతఁ
డేల నన్ను నుపేక్షించు? నేటిమాట?, లనుచు నా ద్వారకాపుర మతఁడు సొచ్చి. 976

* ద్వారకకు వెళ్తూ దారిలో కుచేలుడు తనలో ఇలా తల పోశాడు, 'ద్వారకలోనికి ఎలా వెళ్ళగలను? అత్యంత ప్రభావవంతమైన అంతఃపురంలో ఉన్న శ్రీకృష్ణుణ్ణి ఎలా చూడగలను? ఒక వేళ ద్వారపాలకులు 'నీ వెక్కడి బ్రాహ్మణుడవనీ, ఇక్కడి కెందుకు వచ్చావనీ' నన్ను అడ్డగిస్తే నే నేమి చేయగలను? వారికి ఏదయినా బహుమానం ఇద్దామన్నా నేను కటికదరిద్రుణ్ణి. ఇంతకూ నా అదృష్ట మెలా వుందో! అయినా ఆ కృష్ణుని అనుగ్రహమే అన్నిటికీ మూలం. ఆ స్వామి న న్నెందుకు ఉపేక్షిస్తాడు?'

వ. ఇట్లు ప్రవేశించి రాజమార్గంబునం జని చని కక్ష్యాంతరంబులు గడచి చని ముందట. 977

* ఇలా అనుకొంటూ కుచేలుడు రాజమార్గాన్ని బట్టి ముందుకు సాగిపోయాడు. కుచేలుడు అలా వెళ్ళి కొన్ని వీథులు గడచి అక్కడ

సీ. విశదమై యొప్పు షోడశసహస్రాంగనా కలితవిలాస సంగతిఁ దనర్చి
మహనీయ తపనీయ మణిమయగోపుర ప్రాసాద సౌధ హర్మ్యములు సూచి,
మనము బ్రహ్మానందమును బొందఁ గడు నుబ్బి సంతోషబాష్పముల్ జడిగొనంగఁ
బ్రకటమై విలసిల్లు నొక వధూమణి మందిరమున నింతులు చామరములు వీవఁ

తే. దనరు మృదుహంసతూలికా తల్పమందుఁ, దానుఁబ్రియయును బహు వినోదములఁ దనరి
మహితలావణ్యు మన్మథమన్మథుండు, ననఁగఁ జూపట్టు పుండరీకాయతాక్షు. 978

* వేలకొలది అంగనలతో ప్రకాశిస్తూ ఉన్న సుందర సమున్నత మణిమయ స్వర్ణసౌధాలను చూచి కుచేలుడు పరమానందం చెందాడు. అతని కళ్ళల్లో ఆనందబాష్పాలు జాలువారాయి. ఒకానొక వధూమణి మందిరంలో మగువలు వింజామరలు వీస్తుండగా హంస తూలికాతల్పం మీద సతీమణితో సరసాలాడుతున్న మన్మథ మన్మథుడైన మనోహర సౌందర్యమూర్తి శ్రీకృష్ణుణ్ణి దర్శించాడు.

**సీ. ఇందీవర శ్యాము, వందితసుత్రాముఁ గరుణాలవాలు, భాసుర కపోలుఁ**
**గౌస్తుభాలంకారుఁ, గామితమందారు సురచిరలావణ్యు, సుర శరణ్యు**
**హర్యక్షనిభమధ్యు, నఖిలలోకారాధ్యు ఘనచక్రహస్తు, జగత్ప్రశస్తు,**
**ఖగకులాధిపయానుఁ, గౌశేయపరిధానుఁ బన్నగశయను, నబ్జాతనయను,**

**తే. మకరకుండల సద్భూషు, మంజుభాషు, నిరుపమాకారు, దుగ్ధసాగరవిహారు,**
**భూరిగుణసాంద్రు, యదుకులాంభోధి చంద్రు, విష్ణు, రోచిష్ణు, జిష్ణు, సహిష్ణుఁ, గృష్ణు.** 979

* కోమలమైన నల్లకలువలవంటి శ్యామలవర్ణం కలవాడూ, దేవేంద్రునిచేత సైతం పొగడబడేవాడూ, దయకు నిలయ మైనవాడూ, ప్రకాశించే చెక్కిళ్లు కలవాడూ, కౌస్తుభాన్ని ధరించినవాడూ, అర్థులకు కల్పవృక్షం వంటివాడూ, సౌందర్యమూర్తీ, దేవతలకు దిక్కయినవాడూ, సింహమధ్యముడూ, సమస్త లోకాలచేతా పూజింపబడేవాడూ, చక్రాయుధుడూ, జగత్తులో పేరెన్నిక గన్నవాడూ, గరుడవాహనుడూ, పీతాంబరధారీ, ఆదిశేషునిపై శయనించేవాడూ, అరవిందాక్షుడూ, మకరకుండల భూషణుడూ, మధురభాషణుడూ, సాటిలేని మేటి సౌందర్యం కలవాడూ, పాలసముద్రంలో విహరించేవాడూ, సుగుణసాంద్రుడూ, యాదవకులమనే సాగరానికి చంద్రుడూ అయిన శ్రీకృష్ణుడు ఆయనకు కన్పించాడు.

**మ. కని డాయం జనునంతఁ గృష్ణుఁడు దళత్కంజాక్షుఁ డ ప్పేద వి**
**ప్రుని నశ్రాంత దరిద్రపీడితుఁ గృశీభూతాంగు జీర్ణాంబరున్**
**ఘనతృష్ణాతురచిత్తు హాస్యనిలయున్ ఖండోత్తరీయుం గుచే**
**లుని నల్లంతనె చూచి సంభ్రమ విలోలుండై దిగెం దల్పమున్.** 980

* కుచేలుడు కృష్ణుణ్ణి సమీపించాడు. నిరంతర దారిద్ర్య పీడితుడూ, కృశించిన అంగములు కలవాడూ, చినిగిన వస్త్రములను ధరించినవాడూ, ఆశాపూరితచిత్తుడూ, హాస్యానికి స్థానమైనవాడూ అయిన కుచేలుణ్ణి అల్లంతదూరంలో  చూడగానే కృష్ణుడు గబగబా పాన్పునుండి దిగాడు.

**క. కరమర్థి నెదురుగాఁ జని, పరిరంభణ మాచరించి, బంధుస్నేహ**
**స్ఫురణం దోడ్తెచ్చి, సమా, దరమునఁ గూర్పుండఁ బెట్టెఁదన తల్పమునన్.** 981

* శ్రీకృష్ణుడు ఆదరాభిమానాలతో కుచేలుని కెదురుగా వెళ్ళి అతణ్ణి కౌగిలించుకొన్నాడు. అనురాగం ఉట్టిపడేలాగు స్వాగతం పలికి ఆప్యాయంగా తోడ్కొనివచ్చి తన పాన్పుమీద కుచేలుని కూర్చుండ బెట్టాడు.

**తే. అట్లు గూర్చుండఁబెట్టి నెయ్యమునఁ గనక, కలశ సలిలంబుచేఁ గాళ్ళు గడిగి భక్తిఁ**
**దజ్జలంబులు దనదు మస్తమునఁ దాల్చి, లలిత మృగమద ఘనసార మిళిత మైన.** 982

* కుచేలుడు కూర్చున్న తరువాత శ్రీకృష్ణుడు బంగారు కలశంలోని నీళ్ళతో అతని పాదాలను కడిగాడు. ఆ జలాన్ని భక్తితో శిరస్సుమీద చల్లుకున్నాడు.

**తే. మలయజము మేన జొబ్బిల్ల నలఁది యంత, శ్రమము వాయంగఁ దాళవృంతమున విసరి**
**బంధురామోదకలిత ధూపంబు లొసఁగి, మించు మణిదీపముల నివాళించి మఱియు.** 983

* కస్తూరీ, పచ్చకప్పురమూ కలిపిన మంచిగంధం కుచేలుని శరీరానికి ప్రీతితో పూసి, అగరుధూపం వేసి మార్గాయాసం తీరేటట్లు స్వయంగా ఆప్తమిత్రునికి వీవన వీస్తూ మణిమయ దీపాలతో నివాళు లర్పించాడు.

**వ. సురభికుసుమ మాలికలు సిగముడిం దుఱిమి, కర్పూరమిళిత తాంబూలంబు నిడి, ధేనువు నొసంగి, సాదరంబుగా స్వాగతం బడిగిన నప్పు డవ్విప్రుండు మేనం బులకాంకురంబు లంకురింప నానందబాష్ప జలబిందు సందోహం బడర్చె; నట్టియెడం బద్మలోచనుండు మన్నించు నంగనామణి యగు రుక్మిణి కరకంకణ రవంబు లొలయం జామరలు వీవం దజ్జాత వాతంబున ఘర్మ సలిలంబు నివారించుచుండఁ జూచి శుద్ధాంత కాంతా నివహంబులు దమ మనంబుల నద్భుతం బంది యిట్లనిరి.** 984

* కుచేలుని సిగలో పూలదండలు ముడిచి కర్పూరతాంబూల మిచ్చి గోదానం చేసి ఆదరపూర్వకంగా స్వాగతం చెప్పాడు. కుచేలుని శరీరం పులకించింది. కన్నులనుంచి ఆనందాశ్రువులు స్రవించాయి. శ్రీకృష్ణుని పట్టపురాణి రుక్మిణి కరకంకణాలు ఘల్లుఘల్లు మనగా వింజామర వీచింది. ఆ చల్లనిగాలికి కుచేలుని మార్గాయాసం తీరింది. ఈ దృశ్యాన్ని అంతఃపురకాంతలు చూచి విస్మయంతో ఇలా అనుకున్నారు.

**ఉ. ఏమి తపంబు సేసెనొకొ! యీ ధరణీదివిజోత్తముండు తొల్**
**బామున ! యోగివిస్ఫుర దుపాస్యకుఁడై తనరారు నీ జగ**
**త్స్వామి రమాధినాథు నిజతల్పమునన్ వసియించి యున్నవాఁ;**
**డీ మహనీయమూర్తి కెనయే మునిపుంగవు లెంతవారలున్?** 985

* ఈ భూసురోత్తముడు మునుపటి జన్మలో ఎట్టి తపస్సు చేశాడో! యోగిజనవంద్యుడైన పంకజనాభుని పాన్పుమీద అధివసించాడు. ఎంతలేసి మునివర్యులు సైతం ఈ మహానుభావునికి సాటిరారు గదా!

**వ. అదియునుంగాక.** 986

**చ. తన మృదుతల్పమందు వనితామణి యైన రమాలలామ పొం**
**దును నెడఁగాఁ దలంపక యదుప్రవరుం డెదురేఁగి మోదముం**
**దనుకఁగఁ గౌఁగిలించి యుచితక్రియలం బరితుష్టుఁ జేయుచున్**
**వినయమునన్ భజించె; ధరణీసురుఁ డెంతటి భాగ్యవంతుఁడో ?** 987

* ఆహా! తన మృదుతల్పం మీద ఆసీనురాలై ఉన్న రుక్మిణీ దేవి ఏమనుకుంటుందో అనికూడా భావించకుండా కృష్ణుడు లేచి వెళ్ళి ఈ భూసురునికి స్వాగతం చెప్పాడు. ప్రేమతో అతణ్ణి కౌగిలించుకున్నాడు. సముచితంగా సత్కరించి ఎంతో వినయంతో పూజించాడు. ఇంతకూ ఈబ్రాహ్మణోత్తము డెంతటి అదృష్టవంతుడో కదా!

వ. అను నయ్యవసరంబున 988

క. మురసంహరుఁడు కుచేలుని, కరము గరంబునఁ దెమల్చి కడఁకన్ మన మా
గురుగృహమున వర్తించిన, చరితము లని కొన్ని నుడివి చతురత మఱియున్. 989

* అంతఃపుర కాంతలు ఇలా అనుకుంటూ ఉన్న సమయంలో కృష్ణుడు ప్రేమతో కుచేలుని చేతిని తన చేతిలోనికి తీసుకున్నాడు. తాము గురుకులవాసం చేసిన దినాల్లో జరిగిన విశేషాలను ప్రస్తావించి కృష్ణు డతనితో ఇలా అన్నాడు.

సీ. బ్రాహ్మణోత్తమ ! వేదపాఠనలబ్ధదక్షత గల చారువంశంబు వలనఁ
బరిణయం బైనట్టి భార్య సుశీలవర్తనములఁ దగ భవత్సదృశ యగునె?
తలఁప గృహ క్షేత్రధనదారపుత్త్రాదు లందు నీ చిత్తంబు సెందకుంట
తోఁచుచున్నది; యేను దుది లోకసంగ్రహార్థంబు కర్మాచరణంబు సేయు

తే. గతి, మనంబులఁ గామమోహితులు గాక, యర్థిమై యుక్తకర్మంబు లాచరించి
ప్రకృతిసంబంధములు వాసి భవ్యనిష్ఠ, దవిలి యుందురు కొంద ఱుత్తములు భువిని. 990

* భూసురోత్తమా! వేదాధ్యయనంలో దక్షులైన వారియింట పుట్టిన నీ భార్య సద్గుణాలతో నీకు తగినట్లు ప్రవర్తిస్తున్నదా? ఇంతకూ నీ మనస్సు గృహక్షేత్రాలమీద సతీసుతులమీద లగ్నమై ఉన్నట్లు కనిపించటం లేదు. లోకకల్యాణంకోసం నేను కర్మాచరణలో ప్రవర్తించినట్లు, కొంద రుత్తములు కామ మోహాలకు వశంకాకుండా తమ విధ్యుక్తధర్మాన్ని నిర్వహిస్తూ వుంటారు. అలాంటివారు ప్రకృతి సంబంధాల కతీతంగా వుంటూ కర్తవ్యనిష్ఠతో జీవిస్తారు.

వ. అని మఱియు నిట్లనియె. 991

క. ఎఱుఁగుదువె ? మనము గురు మం, దిరమున వసియించి యతఁడు దెలుపఁగ వరుసన్
ఎఱుఁగఁగ వలసిన యర్థము, లెఱిఁగి పరిజ్ఞానమహిమ నెఱుఁగుట లెల్లన్. 992

* అంటూ శ్రీకృష్ణుడు కుచేలునితో ఇంకా ఇలా పలికాడు. మనం గురుమందిరంలో నివసించిన దినాలలో ఆచార్యుడు బోధించగా మనం నేర్వవలసినది నేర్చి ప్రజ్ఞానిధులమైన సంగతి నీకు జ్ఞాపకం వుందా!

వ. అని మఱియు గురుప్రశంస సేయం దలంచి యిట్లనియె. 993

* ఈ విధంగా కుచేలుని ప్రశ్నించి కృష్ణుడు గురుప్రశంస చేయదలచి ఇలా అన్నాడు.

తే. తివిరి యజ్ఞానతిమిర ప్రదీప మగుచు, నవ్యయంబైన బ్రహ్మంబు ననుభవించు
భరితసత్త్వుండు సత్కర్మనిరతుఁ డతుల, భూసురశ్రేష్ఠుఁ డలఘుండు బుధనుతుండు. 994

* మన గురువు అజ్ఞానం అనే చీకటికి దీపంలాటి వాడు. బ్రహ్మానందానుభవంలో నిమగ్నమైన చిత్తం కలవాడు. సత్కర్మ పరాయణుడు. బ్రాహ్మణశ్రేష్ఠుడు. పుణ్యాత్ముడు.

వ. అ మ్మహాత్మునివలన సకల వర్ణాశ్రమంబుల వారికి నేను విజ్ఞాన ప్రదుండ నగు గురుండనై యుండియు గురుభజనంబు పరమ ధర్మం బని యాచరించితి; నది గావున. 995

* నిజానికి నేను విజ్ఞానప్రదాత అయిన గురువునై ఉండికూడ సకల వర్ణాశ్రమాల వారికి గురుసేవ శ్రేష్ఠమైన ధర్మమని బోధించడం కోసం అలా ఆచరించాను.

క. భూసురులకెల్ల ముఖ్యుఁడ, నై సకల కులాశ్రమంబులందును నెపుడున్
ధీసుజ్ఞానప్రదుఁడన, దేశికుఁడన నొప్పుచుందు ధృతి నెల్లెడలన్. 996

* నేనే బ్రాహ్మణులలో కెల్లా ముఖ్యుడనై సకల వర్ణాలకూ, ఆశ్రమాలకూ జ్ఞానప్రదాతనై ప్రకాశిస్తూ వుంటాను.

తే. అట్టి వర్ణాశ్రమంబులయందు నర్థ, కుశలు లగువారు నిఖిలైక గురుఁడ నైన
నాదు వాక్యంబుచే భవార్ణవము పెలుచ, దాఁటుదురు మత్పదాంబుజ ధ్యానపరులు. 997

* ఆ యా వర్ణాలకు చెందిన జ్ఞానులు సమస్త లోకాలకూ గురుడనైన నా పలుకులను ఆలకించి నా పాదపద్మాలను స్మరిస్తూ సంసారసాగరాన్ని తరిస్తారు.

వ. అదియునుం గాక సకల భూతాత్మకుండనైన యేను దపో వ్రత యజ్ఞ దాన శమ దమాదులచేత సంతసింపను; గురుజనంబులఁ బరమభక్తి సేవించువారలం బరిణమింతునని చెప్పి మఱియు మనము గురుమందిరమున నున్నయెడ నొక్కనాఁడు గురుపత్నీ నియుక్తులమై యింధనార్థం బడవికిం జనిన న య్యవసరంబున. 998

* సకల భూతాలలో ఆత్మగా ఉన్న నేను తపో దాన యజ్ఞాదులవల్ల సంతోషించను. భక్తితో గురువును సేవించే వారిని ప్రేమిస్తాను. ఈవిధంగా పలికి కృష్ణుడు కుచేలునితో ఇంకా ఇలా అన్నాడు. 'మనం గురు మందిరంలో ఉన్న దినాలలో ఒకనాడు గురుపత్ని ఆజ్ఞానుసారం కట్టెలు తేవడానికి అడవికి వెళ్ళాము గుర్తుంది కదూ!

సీ. ఘుమఘుమారావ సంకుల ఘోర జీమూత పటల సంఛన్నాభ్రభాగ మగుచుఁ
జటుల ఝంఝూనిలోత్కట సముద్ధూత నానావిధ జంతుసంతాన మగుచుఁ
జండ దిగ్వేదండ తుండ నిభాఖండ వారిధారాపూర్ణ వసుధ యగుచు
విద్యోతమానోగ్ర ఖద్యోత కిరణజి ద్విద్యుద్ద్యుతిచ్ఛటావిభవ మగుచు

తే. నడరి జడి గురియఁగ నినుఁ డస్త మింప, భూరినీరంధ్ర నిబిడాంధకార మేచి
సూచికాభేద్యమై వస్తుగోచరంబు గాని, యట్లుండ మనము న వ్వానఁ దడిసి. 999

* ఆ సమయంలో పెద్దగా ఉరుముతూ గగనమంతటా కారు మబ్బు లావరించాయి. సుడిగాలులు మహావేగంతో వీచి వన్యమృగాలను నిలువనీయకుండా చేశాయి. వర్షధారలు దిగ్గజాల తొండాలంత పరిమాణంతో భూమిపై పడ్డాయి. మెరుపులు మిరుమిట్లు గొలిపాయి. సూర్యు డస్తమించాడు. వర్షం ఆగలేదు.

చీకటి దట్టంగా అలముకుంది. కంటికి ఏ వస్తువూ కనబడటం లేదు. అలాంటి జడివానలో మనం తడిసి ముద్దయినాము.

**తే. బయలు గొందియుఁ బెను మిఱ్ఱుపల్లములును, రహిత సహితస్థలంబు లేర్పఱుపరాక**
**యున్న యత్తఱి మనము నొండొరుల చేతు, లూతఁగాఁ గొని నడచుచు నుండునంత. 1000**

* త్రోవలూ, డొంకలూ, పల్లాలూ కనపడనీయకుండా వాన నీరు కప్పివేసింది. మనం ఒకరి చేతిని ఇంకొకరు ఊతగా గ్రహించి ఆ అడవిలో నడిచాము.

**క. బిసబిస నెప్పుడు నుడుగక, విసరెడి వలిచేత వడఁకు విడువక మనముం**
**బస చెడి మార్గముఁ గానక, మసలితి మంతటను నంశుమంతుఁడు పొడిచెన్. 1001**

* తీవ్రంగా వీచే చలిగాలులకు మన శరీరాలు కంపించాయి. మనస్సులు వికాసాన్ని కోల్పోయాయి. మనం దిక్కూ, తెన్నూ తెలియక వనమంతా తిరిగాము. ఎట్టకేలకు సూర్యోదయమైంది.

**క. తెలతెలవాఱెడి వేళం, గలకల మని పలికెఁ బక్షిగణ మెల్లెడలన్**
**మిలమిలని ప్రొద్దుపొడుపున, ధళ ధళ మను మెఱుఁగు దిగ్వితానము నిండెన్. 1002**

* తెల్లవారింది. పక్షుల కలకలారావాలు అతిశయించాయి. నలుదిక్కుల్లో ఉదయకాంతులు నిండాయి.

**క. అప్పుడు సాందీపని మన, చొ ప్పరయుచు వచ్చి వానసోఁకునను వలిం**
**దెప్పిఱిలుటఁగని ఖేదం, బుప్పతిలం బలికె నకట ! యో వటులారా ! 1003**

* అప్పుడు మన గురువుగారైన సాందీపని మనలను వెదుక్కుంటూ వచ్చారు. వానలో తడిసి చలికి గజగజమని వణకుతున్న మనల్ని చూచి విచారంతో ఇలా అన్నారు.

**చ. కటకట! యిట్లు మా కొఱకుఁగాఁ జమదెంచి మహాటవిన్ సము**
**త్కటపరిపీడ నొందితిరి; గావున శిష్యులు ! మీ ఋణంబు నేఁ**
**గుట కిది కారణంబు సమకూరెడిఁ బో; యిట మీఁద మీకు వి**
**స్ఫుట ధన బంధు దార బహుపుత్ర విభూతి జయాయురున్నతుల్. 1004**

* నాయనలారా ! మా కోసం అడవికి వచ్చి చాలా బాధ పడ్డారు. శిష్యులుగా మీరు మీ ఋణం తీర్చుకున్నారు. మీ కిక ధన దార బహుపుత్ర సంపదలూ, దీర్ఘాయురున్నతులూ, విజయశ్రీలూ చేకూరగలవు.

**క. కని గారవించి యాయన, మనలం దోడ్కొనుచు నాత్మమందిరమునకుం**
**జనుదెంచుట లెల్లను నీ, మనమునఁ దలఁతే' యటంచు మఱియుం బలికెన్. 1005**

* ఇలా దీవించి సాందీపని వాత్సల్యంతో మనలను తన మందిరానికి తీసుకువెళ్ళాడు. ఇవన్నీ నీకు గుర్తున్నాయా? ఎప్పుడైనా అనుకుంటూ ఉంటావా?' అని కృష్ణుడు కుచేలునితో ఇంకా ఇలా అన్నాడు.

వ. 'అనఘ ! మన మధ్యయనంబు సేయుచు నన్యోన్య స్నేహ వాత్సల్యంబులం జేయు కృత్యంబులు మఱవవు గదా !' యని యవి యెల్లం దలంచి యాడు మాధవు మధురాలాపంబులు విని యతనిం గనుంగొని కుచేలుం డిట్లనియె: 1006

* మహాత్మా ! మనం చదువుకొన్న దినాలలో అన్యోన్య స్నేహ వాత్సల్యాలతో చేసిన పనులన్నీ నీవు మరవవు గదా ! ఈ విధంగా కృష్ణుడు తమ చిన్ననాటి ముచ్చటలను పేర్కొని పలికిన మధుర వచనాలను విని కుచేలుడు ఉప్పొంగిపోయాడు. అతడు కృష్ణునితో ఇలా అన్నాడు.

క. వనజోదర ! గురుమందిర, మున మనము వసించునాఁడు ముదమునఁ గావిం
పని పను లెవ్వియుఁ గలవే ?, విను మవి యట్లుండ నిమ్ము విమలచరిత్రా ! 1007

* దామోదరా! గురుమందిరంలో మనం వున్న కాలంలో సంతోషంతో చేయని పనులంటూ ఉన్నాయా? అది అలా ఉండనీ!

క. గురుమతిఁ దలఁపఁగఁ ద్రిజగ, ద్గురుఁడ వనం దగిన నీకు గురుఁ డనఁగా నొం
డొరుఁ డెవ్వ? డింతయును నీ, కరయంగ విడంబనంబ యగుఁ గాదె హరీ!' 1008

* నీవు ముల్లోకాలకు గురుడవు. నీకూ గురుడంటూ మరొక్క డున్నాడా! ఆలోచించి చూస్తే ఇవంతా నీ లీలలే గాని మరేమీ కాదు.

వ. అని సాభిప్రాయంబుగాఁ బలికిన పలుకులు విని సమస్త భావాభిజ్ఞుండైన పుండరీకాక్షుండు మందస్మిత వదనారవిందుం డగుచు నతనిం జూచి 'నీ విచ్చటికి వచ్చునప్పుడు నాయందుల భక్తింజేసి నాకు నుపాయనంబుగ నేమి పదార్థంబు దెచ్చితి? వప్పదార్థంబు లేశమాత్రంబైనఁ బదివేలుగా నంగీకరింతు; నట్లు గాక నీచవర్తనుండై మద్భక్తిం దగులని దుష్టాత్ముండు హేమాచల తుల్యంబైన పదార్థంబు నొసంగిన నది నా మనంబునకు సమ్మతంబు గాదు; కావున. 1009

* కుచేలుడు సాభిప్రాయంగా పలికిన పై మాటల్లోని ఆంతర్యాన్ని కృష్ణుడు గ్రహించాడు. గోవిందుడు మందస్మిత వదనార విందుడై కుచేలునితో 'నీ విక్కడికి వస్తూ భక్తితో నా కేమి బహుమానం తెచ్చావు? ఆ పదార్థం లేశమైనా పదివేలుగా స్వీకరిస్తాను. నాపై భక్తి లేని నీచుడు మేరుపర్వతమంత పదార్థం ఇచ్చినా అది నా కంగీకారం కాదు'.

క. దళమైనఁ బుష్పమైనను, ఫలమైనను సలిలమైనఁ బాయని భక్తిం
గొలిచిన జను లర్పించిన, నెలమిన్ రుచిరాన్నముగనె యేను భుజింతున్. 1010

* పత్రమైనా, పుష్పమైనా, జలమైనా, ఫలమెనా సరే నిశ్చల భక్తితో నాకు సమర్పిస్తే దాన్ని మధురాన్నంగా భావించి అరగిస్తాను అని కృష్ణుడన్నాడు.

క. అని పద్మోదరుఁ డాడిన, వినయోక్తుల కాత్మ నలరి విప్రుఁడు దాఁ దె
చ్చిన యడుకులు దగ నర్పిం, పను నేరక మోము వాంచి పలుకక యున్నన్. 1011

* దామోదరుని వినయపూరిత వాక్కులకు కుచేలుడు సంతోషించాడు. తాను తెచ్చిన అటుకులను అర్పించలేక తలవంచుకొని మౌనంగా ఉన్నాడు.

**వ. అ వ్విప్రుండు సనుదెంచిన కార్యంబు కృష్ణుండు దన దివ్యచిత్తంబున నెఱింగి 'యితండు పూర్వభవంబున నైశ్వర్యకాముండై నన్ను సేవింపండైన నిక్కుచేలుండు నిజకాంతా ముఖోల్లాసంబు కొఱకు నా యొద్దకుఁ జనుదెంచినవాఁ; డితనికి నింద్రాదులకుం బడయరాని బహువిధంబులైన సంపద్విశేషంబు లీ క్షణంబ యొడఁ గూర్పవలయు' నని తలంచి యతండు జీర్ణవస్త్రంబు కొంగున ముడిచి తెచ్చిన యడుకుల ముడియఁ గని 'యిది యేమి' యని యొయ్యన నమ్ముడియఁ దన కరకమలంబుల విడిచి యయ్యడుకులు కొన్ని పుచ్చుకొని 'యివియ సకల లోకంబులను, నన్నును బరితృప్తిం బొందింపఁజాలు' నని యప్పుడు. 1012**

* కుచేలుడు వచ్చిన కారణాన్ని కృష్ణుడు తెలుసుకున్నాడు. పూర్వజన్మలో ఇత డైశ్వర్యాన్ని కోరి నన్ను సేవించలేదు. ఇప్పుడు తన భార్య సంతోషంకోసం నా వద్దకు వచ్చాడు. కావున ఇంద్రాదులకు సైతం లభించని బహువిధాలైన సంపదల్ని ఈ క్షణమే ఇతనికి ఇవ్వాలని భగవంతుడు నిశ్చయించుకొన్నాడు. కుచేలుడు చినిగిన ఉత్తరీయంలో ముడివేసి తెచ్చిన అటుకుల ముడిని చూచి కృష్ణుడు 'ఇదేమిటి!' అని అడుగుతూ ముడిని విప్పి అటుకులు గుప్పెడు తీసుకొన్నాడు. 'నాకూ, సమస్తలోకాలకూ సంతృప్తి నివ్వడానికి ఇవి చాలు' నంటూ కృష్ణుడు ఆ అటుకుల్ని ఆరగించాడు.

**క. మురహరుఁడు పిడికెఁ డడుకులు, గర మొప్పఁగ నారగించి కౌతూహలియై**
**మఱియును బిడికెఁడు గొనఁ ద, త్కర మప్పుడు పట్టెఁ గమల కరకమలములన్. 1013**

* శ్రీకృష్ణుడు పిడికెడు అటుకుల్ని తిన్న తర్వాత మళ్ళీ ఇంకొక్క పిడికెడు తీసుకున్నాడు. అప్పుడు రుక్మిణీదేవి భర్త చేయి తన చేతులతో వారిస్తూ ఇలా అన్నది.

**క. 'సెం పొరఁగ నతనికి బహు, సంపద లందింప నివియ చాలును నిఁక భ**
**క్షింపఁగ వలవదు త్రిజగ, త్సంపత్కర ! దేవ దేవ ! సర్వాత్మ ! హరీ ! ' 1014**

* 'స్వామీ ! ఇతనికి సకల సంపదలను అందించడానికి ఇందాక మీరు తిన్న అటుకులే చాలు. ఇక భక్షించకండి' అని భర్తను వారించింది.

**వ. అని యిట్లు వారించె; న క్కుచేలుండును నా రాత్రి గోవిందు మందిరంబునఁ దనకు హృదయానందకరంబులగు వివిధ పదార్థంబు లనుభవించి, మృదుల శయ్యాతలంబున నిద్రించి తన మనంబునం దన్ను సమధిక స్వర్గభోగానుభవుంగాఁ దలంచుచు మఱునాఁ డరుణోదయంబున మేల్కని కాలోచిత కృత్యంబులు దీర్చి, యిందిరారమణుండు దన్నుఁ గొంత దవ్వనిపి యామంత్రితుం జేయఁ జనుచు నందనందన సందర్శనానంద లోలాత్ముండై తన మనంబున నిట్లనియె. 1015**

* కుచేలుడు నాటి రాత్రి కృష్ణుని మందిరంలో మధురములైన వివిధ పదార్థాలు ఆరగించాడు. మెత్తని పాన్పుమీద పవళించి తాను స్వర్గభోగాన్ని అనుభవిస్తున్నట్లు భావించాడు. మరునాడు తెల్లవారగానే అతడు కాలోచితకృత్యాలు నిర్వర్తించుకొని తన నగరానికి బయలుదేరాడు. కుచేలుడు వెళుతూ కృష్ణుని దర్శించిన ఆనందంతో నిండిన మనస్సుతో తనలో ఇలా అనుకున్నాడు.

**క. 'నా పుణ్య మరయ నెట్టిదొ, యా పుణ్యనిధిం బ్రశాంతు నచ్యుతు నఖిల**
**వ్యాపకు బ్రహ్మణ్యునిఁ జి, ద్రూపకుఁ బురుషోత్తమునిఁ బరుం గనుఁగొంటిన్. 1016**

* నా పుణ్యం ఎటువంటిదో కాని అనంతుడూ, అచ్యుతుడూ, అఖిలవ్యాపకుడూ, చిన్మయస్వరూపుడూ అయిన శ్రీకృష్ణపరమాత్మను దర్శించాను.

**సీ. పరికింపఁ గృపణస్వభావుండ నై నట్టి యే నేడ? నిఖిలావనీశ్వరి యగు**
**నిందిరాదేవికి నెనయంగ నిత్య నివాసుఁడై యొప్పు నవ్వాసుదేవుఁ**
**డేడ? న న్నర్థిమైఁ దోడఁబుట్టిన వాని కైవడిఁ గౌఁగిటఁ గదియఁ జేర్చి**
**దైవంబుగా నన్ను భావించి నిజతల్పమున నుంచి సత్క్రియల్ పూని నడపి**

**తే. చారు నిజవధూకర సరోజాత కలిత, చామరానిలమున గతశ్రమునిఁజేసి**
**శ్రీకుచాలిప్త చందనాంచితకరాబ్జ, తలములను నడ్గు లొత్తె వత్సలత మెఱసి. 1017**

* కుచేలుడు ఇంకా ఇలా భావించాడు. 'గర్భదరిద్రుడనైన నే నెక్కడ? లక్ష్మీనివాసస్థానమైన వాసుదేవు డెక్కడ? అచ్యుతుడు అనురాగంతో నన్ను తన తోడబుట్టినవానిగా తలంచి కౌగిట చేర్చాడు. దైవసమానంగా భావించి తన పాన్పు మీద కూర్చుండబెట్టుకొన్నాడు. నన్ను గొప్పగా సత్కరించాడు. ఆయన పట్టపుదేవి నాకు వింజామర వీచి నాశ్రమను పోగొట్టింది. శ్రీకృష్ణుడే సాక్షాత్తూ లక్ష్మీదేవిని లాలించే తన పాణిపల్లవాలతో ఆప్యాయంగా నా పాదా లొత్తాడు

**వ. కావున. 1018**

**ఉ. శ్రీనిధి యిట్లు నన్నుఁ బచరించి ఘనంబుగ విత్త మేమియు**
**న్నీని తెఱంగు గానఁబడె; నెన్న 'దరిద్రుఁడు సంపదంధుఁడై**
**కానక తన్నుఁ జేరఁ' డని కాక శ్రితార్తి హరుండు సత్కృపాం**
**భోనిధి సర్వవస్తు పరిపూర్ణునిఁగా ననుఁ జేయకుండునే ? 1019**

* శ్రీకృష్ణుడు న న్నారీతిగా సత్కరించాడు. బాగానే ఉంది కాని నాకు ధనమేమీ ఇవ్వాలని ఆయన అనుకోలేదు. దరిద్రుడు సంపన్నుడైతే గర్వాంధుడై తన్ను సేవించడని తలచాడు కాబోలు ! లేకపోతే ఆశ్రితజనుల ఆర్తిని బాపే అంబుజాక్షుడు, అపారకృపా సముద్రుడు నన్ను ఐశ్వర్యవంతునిగా చేయకుండా ఉంటాడా?

**వ. అని తన మనంబున వితర్కించుచు నిజపురంబునకుఁ జని చని ముందట. 1020**

* ఈ రీతిగా కుచేలుడు ఆలోచిస్తూ తననగరం చేరుకున్నాడు.

సీ. భానుచంద్ర ప్రభా భాసమాన స్వర్ణ చంద్రకాంతోపల సౌధములును
గలకంఠ శుక నీలకంఠ సముత్కంఠ మానిత కూజితోద్యానములును
ఫుల్లసితాంభోజ హల్లక కహ్లార కైరవోల్లసిత కాసారములును
మణిమయ కనక కంకణ ముఖాభరణ విభ్రాజిత దాసదాసీజనములుఁ

తే. గలిగి చెలువొందు సదనంబుఁ గాంచి విస్మ, యమును బొందుచు నెట్టి పుణ్యాత్ముఁ డుండు
నిలయ మొక్కొ ! యపూర్వమై నెగడె మహిత, వైభవోన్నత లక్ష్మీనివాస మగుచు. 1021

* కుచేలుడు తన యెదుట సూర్యచంద్రుల కాంతితో ప్రకాశించే పాలరాతి కట్టడాలూ, శుక పిక మయూరాలతోనిండిన చక్కని ఉద్యానవనాలూ, వికసించిన పలువన్నెల తామరలతో కలువలతో కనులపండువు చేస్తున్న సరోవరాలూ, మణికంకణాలూ, బహువిధాలైన భూషణాలు ధరించిన దాసదాసీజనమూ కలిగి వెలుగొందే మహోన్నత మందిరాన్ని చూచి ఆశ్చర్యపడ్డాడు. ఇది ఏ పుణ్యాత్ముని భవనమో? సిరిసంపదలకు నిలయమై అపూర్వమై ప్రకాశిస్తున్నదని కుచేలుడు భావించాడు.

వ. అని తలపోయుచున్న యవసరంబున. 1022

తే. దివిజ వనితలఁ బోలెడు తెఱవ లపుడు, డాయ నేతెంచి 'యిందువిచ్చేయుఁ' డనుచు
విమలసంగీత నృత్యవాద్యములు సెలఁగ, గరిమఁ దోడ్కొని చని రంతిపురమునకును. 1023

* ఇలా అనుకుంటున్న సమయంలో దేవకాంతలవంటి యువతులు కుచేలునివద్దకు వచ్చి 'లోపలికి దయచేయండి' అంటూ స్వాగతం పలికారు. సంగీత నృత్య వాద్యాలతో అతణ్ణి అంతఃపురానికి తోడ్కొని వెళ్ళారు.

వ. ఇట్లు సనుదేర నతని భార్యయైన సతీలలామంబు దన మనంబున నానందరసమగ్న యగుచు. 1024

* ఇలా వచ్చిన కుచేలుణ్ణి చూచి ఆయనభార్య చాలా సంతోషించింది.

సీ. తన విభురాక ముందటఁ గని మనమున హర్షించి వైభవం బలర మనుజ
కామినీరూపంబు గైకొన్న యిందిరా వనిత చందంబునఁ దనరుచున్న
కలకంఠి తన వాలుఁగన్నుల క్రేవల నానందబాష్పంబు లంకురింప
నతని పాదంబుల కాత్మలో మ్రొక్కి భావంబున నాలింగనంబు సేసె

తే. నా ధరాదేవుఁ డతుల దివ్యాంబరాభ, రణ విభూషితలై రతిరాజు సాయ
కముల గతి నొప్పు పరిచారికలు భజింప, లలిత సౌభాగ్య యగు నిజ లలనఁ జూచి. 1025

* ఆ యిల్లాలు వల్లభుడు వస్తున్నాడని తెలుసుకొని ఎంతో ఆనందంతో ఎదురు వచ్చింది. మానవరూపం ధరించిన మహాలక్ష్మి లాగా ఉన్న ఆమె కనుకొలకుల్లో ఆనందబాష్పాలు రాలుతుండగా, భర్త పాదాలకు నమస్కరించి మనస్సులో కౌగిలించుకొన్నది. దివ్యాంబరాలూ, ఆభరణాలు ధరించి మన్మథుని బాణాలలాగా ఉన్న పరిచారికల సేవలందుకొంటూ ఐశ్వర్యంతో తులదూగే తన భార్యను కుచేలుడు చూచాడు.

క. ఆ నారీరత్నంబును, దానును ననురాగరసము దళుకొత్తఁగ ని
త్యానందము నొందుచుఁ బెం, పూనిన హరిలబ్ధవైభవోన్నతి మెఱయన్. 1026

* ఆ సతీపతు లిద్దరూ అన్యోన్యానురాగంతో కృష్ణుని అను గ్రహంవల్ల కలిగిన ఐశ్వర్యానికి అపారమైన ఆనందాన్ని పొందారు.

సీ. కమనీయ పద్మరాగ స్తంభకంబులుఁ గొమరారు పటికంపుఁ గుడ్యములును
మరకత నవరత్నమయ కవాటంబులుఁ గీలిత హరి నీల జాలకములు
దీపిత చంద్రకాంతోపల వేదులు నంచిత వివిధ పదార్థములును
దగు హంసతూలికా తల్పంబులును హేమ లాలిత శయనస్థలములుఁ దనరు

తే. సమధికోత్తుంగ భద్రపీఠముల సిరులు, మానితోన్నత చతురంతయానములును
వలయు సద్వస్తు పరిపూర్ణ వాటికలును, గలిగి చెలువొందు మందిరం బెలమిఁ జొచ్చి. 1027

* పద్మరాగాలు తాపిన చిరుకంబాలతో స్ఫటిక శిలానిర్మిత కుడ్యాలతో, మరకత మణులు పొదిగిన ఇంద్రనీలాల గవాక్షాలతో, చంద్రకాంత శిలావేదికలతో అలరారి, బహువిధ పదార్థాలతో, హంసతూలికా తల్పాలతో, స్వర్ణమయ శయనమందిరాలతో, ముత్యాలపల్లకీలతో, రత్నాల గద్దెలతో ప్రకాశిస్తున్న భవనం లోనికి కుచేలుడు సతీసమేతంగా ప్రవేశించాడు.

వ. సుఖంబున నుండు నట్టియెడం దనకు మనోవికారంబులు వొడమకుండ వర్తించుచు, నిర్మలంబగు తన మనంబున నిట్లను; నింత కాలం బత్యంత దురంతంబగు దారిద్ర్యదుఃఖార్ణవంబున మునింగి యున్న నాకుం గడపటఁ గలిగిన విభవంబున నిప్పుడు. 1028

ఆ. ఎన్నఁ గ్రొత్తలైన యిట్టి సంపదలు నా, కబ్బుటెల్ల హరిదయావలోక
నమునఁ జేసి కాదె ! నళినాక్షుసన్నిధి, కర్థి నగుచు నేను నరుగుటయును. 1029

* కుచేలుడు ఆ దివ్యభవనంలో ఎలాంటి మనోవికారాలకూ లోను కాకుండా హాయిగా జీవిస్తూ 'ఇన్నాళ్ళూ దుర్భర దారిద్ర్య దుఃఖసాగరంలో తపించాను కదా! ఇప్పుడు క్రొత్తలైన ఈ సమస్త సంపదలూ హరి కృపాకటాక్షంవల్లనే నాకు ప్రాప్తించాయి.

క. నను నా వృత్తాంతంబును, దన మనమునఁ గనియు నేమి దడవక ననుఁ బొ
మ్మని యీ సంపద లెల్లను, నొనరఁగ నొడఁగూర్చి నన్ను నొడయనిఁ జేసెన్. 1030

* అర్థకాంక్షతో నేను జనార్దనుని వద్దకు వెళ్ళాను. ఆ మహానుభావుడు నా సంగతి తెలిసికూడా నన్నేమి అడగలేదు. నాకు వీడ్కోలిచ్చి పంపి తరువాత ఈ సకల సంపదలూ అనుగ్రహించాడు.

వ. అట్టి పురుషోత్తముండు భక్తినిష్ఠులైన సజ్జనులు లేశమాత్రంబగు పదార్థంబైన భక్తి పూర్వకంబుగా సమర్పించిన నది కోటిగుణితంబుగాఁ గైకొని మన్నించుటకు నిదియ దృష్టాంతంబు గాదె! మలిన

**దేహుండును, జీర్ణాంబరుండు నని చిత్తంబున హేయంబుగాఁ బాటింపక నా చేనున్న యడుకు లాదరంబున నారగించి నన్నుం గృతార్థునిం జేయుట యతని నిర్హేతుక దయయ కాదె! యట్టి కారుణ్య సాగరుండైన గోవిందుని చరణారవిందంబుల యందుల భక్తి ప్రతిభవంబునఁ గలుగుం గాక! యని యప్పుండరీకాక్షుని యందుల భక్తి తాత్పర్యంబునం దగిలి పత్నీసమేతుండై నిఖిల భోగంబులయందు నాసక్తిం బొరయక, రాగాది విరహితుండును నిర్వికారుండునునై యఖిలక్రియలందు ననంతుని యనంతధ్యాన సుధారసంబునం జొక్కుచు విగతబంధనుండై యపవర్గప్రాప్తి నొందె; మఱియును.1031**

* భక్తి తత్పరులైన సజ్జనులు సమర్పించిన పదార్థం లేశ మాత్రమే అయినా భగవంతుడు దానిని కొటానుకోట్లుగా భావించి స్వీకరించి భక్తులను అనుగ్రహిస్తా డనటానికి నా వృత్తాంతమే తార్కాణం. మాసిన నాశరీరాన్ని, చినిగిన బట్టల్నీ చూచి శ్రీకృష్ణుడు మనస్సులోనైనా ఏవగించుకోలేదు. నావద్దనున్న అటుకులను ప్రీతితో ఆరగించి నన్ను ధన్యుణ్ణి చేయడంలో అచ్యుతుని నిర్హేతుక వాత్సల్యం అభివ్యక్తమౌతూ ఉంది. అంతటి కరుణాసాగరుడైన గోవిందుని పాదారవిందాలమీద నాకు జన్మజన్మలకూ నిండైన భక్తి నెలకొని ఉండు గాక! ఈ రీతిగా తలపోసి హరిస్మరణం మరవకుండా కుచేలుడు తన ఇల్లాలితో కలిసి జీవించాడు. భోగాలపై ఆసక్తి లేకుండా రాగద్వేషాది ద్వంద్వాల కతీతుడై, నిర్వికారుడై, హరిభక్తి సుధారస వాహినిలో ఓలలాడుతూ భవబంధాలను బాసి ముక్తు డయ్యాడు.

**ఆ. దేవదేవుఁ డఖిలభావజ్ఞుఁ డాశ్రిత, వరదుఁ డైన హరికి ధరణి సురులు**
**దైవతములు గాన ధారుణీదివిజుల, కంటె దైవ మొకఁడు గలడె భువిని? 1032**

* దేవదేవుడైన వాసుదేవునికి తెలియని విషయం లేదు, భక్తవత్సలుడగు హరికి బ్రాహ్మణులు దైవసమానులు. భూలోకంలో వారికంటె వేరే దైవం లేదు.

**క. మురహరుఁ డిట్లు కుచేలుని, చరితార్థునిఁ జేసినట్టి చరితము విను స**
**త్పురుషుల కిహపరసుఖములు, హరిభక్తియు యశముఁ గలుగు నవనీనాథా! 1033**

* ఓ రాజా! శ్రీకృష్ణుడు కుచేలుణ్ణి కృతార్థుని చేసిన వృత్తాంతాన్ని విన్న వారికి ఇహపరసుఖాలూ, హరిభక్తీ, యశస్సూ కలుగుతాయని శుకమహర్షి పరీక్షిన్మహారాజుతో చెప్పాడు.

## -: శ్రీ కృష్ణుండు సకుటుంబముగా గ్రహణ స్నానమునకుఁ బోవుట :-

**వ. అనిన మఱియుం బరాశరపౌత్రున కర్జునపౌత్రుం డిట్లనియె. 1034**

* పరీక్షిత్తు శుకమహర్షితో ఇలా అన్నాడు.

**ఆ. దుష్ట శిక్షణంబు దురితసంహరణంబు, శిష్టరక్షణంబుఁ జేయఁ దలఁచి**
**భువిని మనుజుఁ డగుచుఁ బుట్టిన శ్రీ కృష్ణ, విమలచరిత మెల్ల విస్తరింపు. 1035**

* దుష్టుల్ని శిక్షించటానికి, శిష్టుల్ని రక్షించటానికి, పాపాన్ని నిర్మూలించటానికి మానవరూపంతో జన్మించిన కృష్ణుని చరిత్ర ఇంకా సవిస్తరంగా నాకు వివరించు.

**వ. అనిన శుకుం డిట్లనియె.** 1036

**సీ. ధరణీశ! బలుఁడును సరసిజోదరుఁడు నవోన్నతసుఖలీల నుండునంతఁ**
**జటులోగ్రకల్పాంత సమయమందును బోలె దృగసహ్యమై సముద్దీప్త మగుచు**
**రాజిల్లు సూర్యోపరాగంబు సనుదెంచు టెఱిఁగి భూజను లెల్ల వరుసఁ గదలి**
**మును జమదగ్ని రాముఁడు పూని ముయ్యేడు మాఱులు ఘనబలోదారుఁ డగుచు**

**తే. నిజభుజాదండ మండిత నిబిడ నిశిత, చటుల దంభోళిరుచిర భాస్వత్కుఠార**
**మహితధారా వినిర్భిన్న మనుజపాల, దేహనిర్ముక్త రుధిర ప్రవాహములను.** 1037

* అప్పుడు శుకుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు. 'మహారాజా! బలరామ కృష్ణులు ద్వారకలో సుఖంగా ఉన్న రోజుల్లో కల్పాంతకాలంలోవలె చూడశక్యంగాని విధంగా సూర్యగ్రహణం రానున్నదని తెలుసుకొన్నారు. ప్రజలందరూ తమవెంట రాగా వారు స్యమంతపంచకానికి వెళ్లారు. పరశురాముడు అవక్రవిక్రమాభి రాముడై ఇరవైయొక్కసారి రాజలోకంమీద దండెత్తి వజ్రాయుధం వంటి తన కఠోరకుఠారంతో వారి కుత్తుకలు తునిమాడు. ఆ సమయంలో-

**తే. ఏను మడువులు గావించె నెచటనేని, నట్టి పావనసుక్షేత్రమగు స్యమంత**
**పంచకంబున కపుడు సంభ్రమముతోడఁ, జనిరి బలకృష్ణులును సంతసం బెలర్ప.** 1038

* ప్రవహించిన మహీపతుల రక్తప్రవాహాన్ని పరశురాముడు ఐదుమడుగులు కావించాడు. అవి స్యమంతపంచకం అనే పేరుతో పవిత్రక్షేత్రంగా రూపొందాయి. శ్రీకృష్ణ బలరామాది యాదవులందరూ గ్రహణసందర్భంగా అక్కడికి చేరుకొన్నారు.

**వ. ఇట్లు నిష్కర్ములైన రామకృష్ణులు లోక ధర్మానుపాలన ప్రవర్తనులై ద్వారకా నగర రక్షణంబునకుం బ్రద్యుమ్న గద సాంబ సుచంద్ర శుక సారణానిరుద్ధ కృతవర్మాది యోధవరుల నియమించి తాము నక్రూర వసుదేవోగ్రసేనాది సకల యాదవులుం గాంతా సమేతులై స్రక్చంద నాభరణ వస్త్రాదులు ధరియించి, శోభనాకారంబులతోడం బుష్పక విమానంబు లనం బొలుచు నరదంబులను, మేఘంబుల ననుకరించు గజంబులను, మనోవేగంబులైన తురగంబుల నెక్కి వియచ్చరులం బురుడించు పురుషులు దమ్ముఁ సేవింపం జని యప్పుణ్య తీర్థంబుల నవగాహనంబు సేసి యుపవసించి యనంతరంబ.** 1039

* బలరామ కృష్ణులు లోకధర్మపాలనకు పూనుకొన్నవారై ప్రద్యుమ్న గదసాంబాది యాదవ యోధాగ్రేసరులను నగరరక్షణకై ద్వారకలో నిలిపి అక్రూర వసుదేవాదులు వెంటరాగా వారు సర్వాలంకార శోభితులై కాంతాసమేతంగా రథ గజ తురగాది సముచిత వాహనాలలో స్యమంతపంచకానికి వచ్చారు. ఆ పుణ్యతీర్థాల్లో స్నానం చేసి ఉపవాసం చేశారు.

క. భూసురవరులకు ననుపమ, వాసో౽లంకార ధేను వసురత్నధరి
త్రీ సుమహిత వస్తువు లు, ల్లాసంబున దాన మిచ్చి లాలితు లగుచున్. 1040

* బలరామ కృష్ణులు సువర్ణ రత్న గోదాన భూదానాలతో భూసురశ్రేష్ఠులను సంతృప్తి పరచారు.

క. పునరవగాహనములు పెం, పొనరం గావించి బంధుయుక్తముగా భో
జన కృత్యంబులు దీర్చి స, దనురాగము లుల్లసిల్ల నచ్చోటఁ దగన్. 1041

* స్యమంతపంచకంలో మళ్ళీమళ్ళీ పుణ్యస్నానాలు చేసి బల రామ వాసుదేవులు బంధువులతో కలిసి భోజనం చేశారు.

క. ఘనశాఖాకీర్ణములై, యినరశ్మలు దూఱనీక యెసకం బెసఁగన్
ననిచిన పొన్నల నీడల, ననిచిన వేడుకల నందనందన ముఖ్యుల్. 1042

* సూర్యకిరణాలుకూడ ప్రవేశించటానికి వీలులేనంత దట్టంగా పెరిగి చిగురించిన పొన్న చెట్లనీడలో బలదేవ వాసుదేవాదులు సమ్మోదంతో కూర్చున్నారు.

క. తనరిన పల్లవ రుచిరా, సనముల నాసీను లగుచు సత్సుఖగోష్ఠిం
బెనుపొందఁగ నట వసియిం, చినచోఁ దత్పుణ్యతీర్థ సేవారతులై. 1043

* శ్రీకృష్ణుడు మొదలైనవారు మెత్తని క్రొత్త చిగురుటాకుల మెత్తలపై కూర్చొని సరససల్లాపాలు చేస్తూ ప్రొద్దుపుచ్చారు.

వ. మున్న చనుదెంచి యున్న మత్స్యోశీనర కోసల విదర్భ కురు సృంజయ కాంభోజ కేకయ మద్రకుంత్యారట్ట కేరలాది భూపతులును, మఱియుం దక్కిన రాజవరులును, హితులును, నంద గోపాది గోపాలురును, గోపికాజనంబులును, ధర్మరాజానుగతులై వచ్చిన భీష్మ ద్రోణ ధృతరాష్ట్ర గంధారీ కుంతీ పాండవ తద్దార నివహ సంజయ విదుర కృప కుంతిభోజ విరాట భీష్మక నగ్నజిద్ద్రుపద శైబ్య ధృష్టకేతు కాశిరాజ దమఘోష విశాలాక్ష మైథిల యుధామన్యు సుశర్మలును, సపుత్రకుండైన బాహ్లికుండును మొదలుగా ననేకులు నుగ్రసేనాది యాదవ ప్రకరంబులం బూజలం దృప్తులం జేసిన వారునుం బ్రముదితాత్ములై; రయ్యెడ. 1044

* క్షత్రియప్రముఖు లనేకులు తీర్థసేవాభిలాషులై అంతకు మునుపే స్యమంతపంచకానికి వచ్చారు. ఆవచ్చిన వారిలో ఔశీనర మత్స్య కోసల విదర్భాది దేశాధీశ్వరులూ, నందగోపాది గోపాలకులూ ధర్మరాజుతో కలిసివచ్చిన భీష్మద్రోణ ధృతరాష్ట్ర సంజయ విదురాదులూ, ఇంకా మిగిలిన క్షత్రియశ్రేష్ఠులూ ఉన్నారు. వారందరూ ఉగ్రసేనాది యాదవముఖ్యులను పూజించారు. అందుకు వారంతా సంతోషించారు.

క. ఆ రాజులు గాంచిరి నిజ, నారీయుతు లగుచు నంగనాపరివారున్
ధీరున్ దానవకుల సం, హారున్ గోపీమనోవిహారు సుదారున్. 1045

* ఆ రాజులు తమ భార్యలతో కూడి ప్రియకాంతా సమేతుడై వున్న శ్రీకృష్ణుణ్ణి, ఆ దానవకుల సంహారుణ్ణి, ఆ గోపికామనోవిహారుణ్ణి సందర్శించారు.

**వ. కని య మ్మాధవ బలదేవులు సేయు సముచిత పూజావిధానంబులం బరితృప్తులై, య మ్ముకుందు సాన్నిధ్యంబు గలిగి, తదీయసంపద్విభవాభిరాములై విలసిల్లుచున్న యుగ్రసేనాది యదు వృష్ణి పుంగవులం జూచి, వారలతోడ నా రాజవరులు మాధవుండు విన నిట్లనిరి. 1046**

* బలరామ కృష్ణులు కూడా ఆ రాజశ్రేష్ఠులను సాదరంగా సత్కరించారు. వారికెంతో ఆనందం కలిగింది, శ్రీకృష్ణుని సన్నిధిలో అతని అనుగ్రహలబ్ధ వైభవంతో ప్రకాశిస్తున్న ఉగ్రసేనాది యాదవ ప్రముఖులను చూచి కృష్ణునికి వినబడే విధంగా వారిలా అన్నారు.

**మ. మన శాస్త్రంబులు వాక్కులున్ మనములున్ మాంగల్యముం బొంది పా**
**వనమై యెప్పుడి నే రమా విభుని భాస్వత్పాదపంకేజ సే**
**చన తోయంబుల నే మహాత్ముని పదాబ్జాతంబు లెందేని సోఁ**
**కినచో టెల్లను ముక్తి హేతు వగు, నీ కృష్ణుండె పో! చూడఁగన్. 1047**

* మన శాస్త్రాలూ, వాక్కులూ, మనస్సులూ ఏ పరంధాముని పాదపద్మ తీర్థంవల్ల పవిత్రము లౌతున్నాయో, ఏ మహాత్ముని పాదస్పర్శకు నోచుకొన్న ప్రదేశమంతా ముక్తి దాయక మౌతున్నదో అటు వంటి మహానుభావు డీ కృష్ణుడు.

**చ. సనక సనందనాది మునిసత్తము లంచిత యోగదృష్టిచేఁ**
**బనివడి యాత్మలన్ వెదకి పట్ట నగోచరమైన మూర్తి యి**
**ట్లనవరతంబు మాంస నయనాంచల గోచరుఁ డయ్యనట్టె! యే**
**మన నగు? వీరిపుణ్యమున కాదట నెట్టితపంబు సేసిరో? 1048**

* సనక సనందాది మహామునులు తమ యోగదృష్టితో ఆత్మ సాక్షాత్కారం చేసుకోదలచినా, గోచరం కాని మంగళమూర్తిని మీరు ఎల్లవేళలా కనులారా చూడగలుగుతున్నారు. వీరి పుణ్య మెంతటిదో గదా ! వీరు ఎంత తపస్సు చేశారో!

**మ. నిరయస్వర్గము లాత్మఁ గైకొనక తా నిర్వాణమూర్తైన యీ**
**హరిఁజూడన్, హరితోడఁబల్కు, హరిమే నంటన్, హరిం బాడఁగా**
**హరితో నేఁగ , సహాసనాస్తరణ శయ్యావాసులై యుండఁగన్**
**హరి బంధుత్వసఖిత్వముల్ గలుగు భాగ్యం బెట్లు సిద్ధించెనో? 1049**

* ఉగ్రసేనాది యాదవ పుంగవులు స్వర్గ నరకాలను గూర్చి విచారించకుండా ఈ కృష్ణుణ్ణి చూస్తూ, కృష్ణునితో మాట్లాడుతూ, కృష్ణుని శరీరాన్ని స్పృశిస్తూ, కృష్ణుని కొనియాడుతూ, కృష్ణునితో కలిసి ప్రయాణం

చేస్తూ, కలిసి కూర్చుంటూ, కలిసి శయనిస్తూ ఉన్నారు. కృష్ణునితో బంధుత్వ మిత్రత్వాలు కలిగే భాగ్యం వీరికెలా ప్రాప్తించిందో అని ఆ రాజశ్రేష్ఠులంతా ఆశ్చర్యపడ్డారు.

**తే. అనుచు యాదవ వృష్ణి భోజాంధకులును, హరిదయాలబ్ధ నిఖిలార్థు లగుచు నున్న**
**మనికిఁ దమ చిత్తములఁ బలుమాఱుఁ బొగడి, పరిణమించిరి; యంత న ప్పాండుమహిషి. 1050**

* కృష్ణుని దయవల్ల ప్రాప్తించిన సకల వైభవాలతో జీవిస్తున్న ఉగ్రసేనాది యదువృష్ణి పుంగవులను ఆ రాజు లందరూ మీది విధంగా అభినందించారు.

**వ. అప్పుడు. 1051**

**క. తన సుతులకు గాంధారీ, తనయుల గావించు సపకృతంబుల కాత్మన్**
**ఘనముగ నెరియుచు నచ్చటఁ, గనుఁగొనె వసుదేవు విగతకల్మషభావున్. 1052**

**వ. అట్లు గనుంగొని యతనితో నిట్లనియె. 1053**

* ఆ సమయంలో పాండురాజు పత్ని కుంతీదేవి తన కుమారులకు కౌరవులవల్ల కలిగిన అపకారాలను స్మరించుకొని మనస్సులో బాధపడుతూ తన అన్నగారైన వసుదేవునితో ఇలా అన్నది.

**క. ఓ యన్న ! పాండుతనయులు, నీ యల్లుం డ్రడవులందు నెఱి మృగములతోఁ**
**బాయని యిడుమలఁ బడఁ గరు, ణాయత్తుల రగుచు మీర లరయుఁగ వలదే ? 1054**

* అన్నయ్యా! పాండురాజు కుమారులూ, నీకు అల్లుళ్లూ అయిన పాండవులు కీకారణ్యాలలో భీకరమృగాల మధ్య పలుబాధలకు గురి అవుతున్నారు. వారిని మీరు దయార్ద్రహృదయంతో చూడాలి గదా?

**వ. అని బహుప్రకారంబుల సంతాపించుచు మఱియు నిట్లనియె. 1055**

* ఈ విధంగా కుంతీదేవి పరిపరివిధాలుగా పరితపించుతూ వసుదేవునితో ఇంకా ఇలా అన్నది.

**క. అతిబలవంతపు విధి దాఁ, 'బ్రతికూలంబైనఁ గలరె బంధువు?' లనుచున్**
**ధృతి గలఁగ బాష్పజలపూ, రితలోచన యగు సహోదరిం జూచి యనెన్. 1056**

* బలవత్తరమైన విధియే ప్రతికూల మైనప్పుడు ఇక బంధువు లంటూ ఎవరున్నారు అని కుంతి కంటతడిబెట్టి దుఃఖించగా వసుదేవు డామెతో ఇలా అన్నాడు.

**సీ. తల్లి! నీ కేల సంతాపింప మనమునఁ దలపఁక విధి నేల సొలసె? దింత**
**యఖిల నియామకుండగు నీశ్వరుఁడు మాయ యవనికాంతరుఁడైన యట్టి సూత్ర**
**ధారుని కై వడిఁ దగిలి నటింపఁగ మనుజులు కీలుబొమ్మలు దలంపఁ;**
**గావున విధిసేఁతఁ గడచి వర్తింపంగ, దేవతలకునై నఁ దీఱ; దట్లు**

**తే. క్రోధచిత్తుండు కంసుఁడు బాధవఱుప, నిలయములు దప్పి నే నడవులఁ జరింప**
**ఘనకృపానిధి యీ హరి గలుగఁబట్టి, కోరి మా కిండ్లు గ్రమ్మఱఁ జేరఁ గలిగె'. 1057**

* అమ్మా! నీవు చింతించడం దేనికి? విధిని నిందించడ మెందుకు? అన్నింటికీ కర్త ఈశ్వరుడు. అతడు మాయ అనే తెరవెనుక ఉన్న సూత్రధారివంటి వాడు. మానవు లతని చేతిలో కీలుబొమ్మలు కనుక విధి కెదురీదడానికి దేవతల కైనా సాధ్యం కాదు. పూర్వం దుర్మార్గుడైన కంసుడు మమ్ములను క్రూరంగా బాధించాడు. మేము మా నెలవులు వీడి అడవులపాలై నానా అవస్థలు పడ్డాము. కరుణా సింధువైన ఈ శ్రీకృష్ణుని అనుగ్రహంచేత మేము ఆపదలనుండి గట్టెక్కి ఇలా ఉన్నాము.

**వ. అని యూరడిలం బలుకు నవసరంబున. 1058**

* ఈ విధంగా వసుదేవుడు కుంతిని ఊరడించాడు.

**క. నందయశోదలు గోపక, బృందంబులు గోపికలును బిరిగొని పరమా**
**నందంబునఁ జనుదెంచిరి, మందరధరుఁ జూచువేడ్క మనములఁ బొడమన్. 1059**

* అప్పుడు నంద యశోదలు, గోపాలురూ, గోపికలూ తమ వెంటరాగా శ్రీకృష్ణుణ్ణి చూడటానికి పరమానందంతో నచ్చారు.

**వ. ఇట్లు సనుదెంచి. 1060**

**క. అతిచిరకాల సమాగతు, నతని నిరీక్షించి వృష్ణి యాదవ భోజ**
**ప్రతతులు నెదురేఁగి సము, న్నతితో నాలింగనములు నడపిరి వరునన్. 1061**

* ఈ విధంగా చాలాకాలం తరువాత వచ్చిన నందాదులకు యాదవప్రముఖులు ఎదురేగి ప్రేమతో పరామర్శించి స్వాగతం పలికారు.

**క. వసుదేవుఁడు వారికి సం, తసమునఁ గావించె సముచితక్రియ లంతన్**
**ముసలియు హరియును మ్రొక్కిరి, వెస నందయశోదలకును వినయం బెసఁగన్. 1062**

* వసుదేవుడు మహానందంతో వారికి సముచితమైన సత్కారం చేశాడు. బలరామ కృష్ణులు వినయసుందరులై నంద యశోదలకు నమస్కరించారు.

**వ. అట్లు నమస్కృతులు సేసి, యాలింగనంబులు గావించి, నయనారవిందంబుల నానందబాష్పంబులు దొరఁగ నఱ లేని స్నేహంబులు చిత్తంబుల నత్తమిల్ల నేమియుం బలుకకుండి; రంత న య్యశోదాదేవి రామకృష్ణుల నిజాంకపీఠంబుల నునిచి యక్కునం గదియం దిగిచి, చెక్కిలి ముద్దుగొని, శిరంబులు మూర్కొని, చిబుకంబులు పుడుకుచుఁ, బునఃపునరాలింగనంబులు గావించి, పరమానందంబునం బొందుచు నున్నంతఁ బదంపడి. 1063**

* బలరామ కృష్ణులు నంద యశోదలకు మ్రొక్కి కౌగిలించుకొని భక్త్యనురాగాలూ, కొఱతలేని స్నేహాలూ వెల్లుబికి కనులవెంట ఆనందబాష్పాలు పొంగిపారలగా మాటలు రాక మౌనంగా ఉన్నారు. యశోద బలరామకృష్ణులను ఒడిలో కూర్చుండబెట్టుకొన్నది. వారిని తన గుండెలకు హత్తుకొన్నది. కపోలాలు ముద్దాడింది. మూర్ధాఘ్రాణం చేసింది. చిబుకాలు నిమురుతూ పలుమార్లు కౌగిలించుకొని పరమానందం పొందింది.

**చ. స్థిరమతితోడ రోహిణియు దేవకియుం దగ నందగోప సుం**
**దరిఁ గని కౌఁగిలించికొని తత్కృతులెల్లఁ దలంచి యింతి! నీ**
**వరుఁడును నీవు బంధుజన వత్సలతన్ మును చేయు సత్కృతుల్**
**మఱవఁగ వచ్చునే ? తలఁప మా కిఁక నెన్నఁటికిం దలోదరీ! 1064**

* రోహిణీ, దేవకీ ఇద్దరూ యశోదాదేవిని ప్రేమతో కౌగిలించు కొన్నారు. ఆమె చేసిన సత్కార్యాలను స్మరించుకొని వా రామెతో 'అమ్మా! నీవూ నీ భర్తా ఎనలేని బంధుప్రీతితో పూర్వం చేసిన మంచి పను లెన్నటికైనా మరువగలమా!' అన్నారు.

**క. జననం బందుట మొదలుగ, ఘనమోహముతోడఁ బెంచుకతమునఁ దమకున్**
**జననీ జనకులు వీరని, మనమునఁ దలపోయలేరు మము నీ తనయుల్. 1065**

* పుట్టింది మొదలు మీరే బలరామ కృష్ణులను అపారమైన అనురాగంతో పెంచి పెద్దచేశారు. అందుకే నీ బిడ్డలైన వీళ్ళు ఇప్పటికీ మమ్ములను జననీ జనకులని భావింపలేకున్నారు.

**క. అంటిన ప్రేమను వీరిం, గంటికి ఱెప్పడ్డమైన గతిఁ బెంపఁగ మా**
**కంటెన్ నెన రౌటను మీ, యింటన్ వసియించి యుండి రిన్నిదినంబుల్. 1066**

* మీరు కంటికి రెప్పలాగా వీళ్లను పెంచారు. వీరిపై మా కంటే మీకే ప్రేమ ఎక్కువ. కనుకనే వీళ్లు మీయింట్లో యిన్నాళ్లూ సుఖంగా ఉన్నారు.

**వ. అని యిట్లు ప్రియాలాపంబులు పలుకుచుండు నవసరంబున గోపాలసుందరు లమందానంద కందళితహృదయ లయి హృదయేశ్వరుండైన గోవిందుఁడు చిరకాల సమాగతుం డగుటం జేసి, యతనిం జూచు తలంపు లుల్లంబుల వెల్లిగొనం జేరి. 1067**

* రోహిణీదేవీ, దేవకీదేవీ యశోదతో ఇలా సల్లాపం చేస్తూ ఉండగా, గోపకాంతలు రాకరాక వచ్చిన తమ ప్రాణేశ్వరుడైన శ్రీకృష్ణుణ్ణి చూడటానికి తహతహలాడుతూ ఆనందం పొంగిపొరలే హృదయాలతో అక్కడికి వచ్చారు.

**చ. నళినదళాక్షుఁ జూచి నయనంబులు మోడ్వఁగఁ జాల కాత్మలన్**
**వలచి తదీయమూర్తి విభవంబు దలంచుచుఁ గౌఁగిలించుచుం**
**బులకలు మేన జాదుకొనఁ బొల్తులు సొక్కిరి బ్రహ్మమున్ మనం**
**బునఁ గని చొక్కు యోగిజనముం బురుడింపఁగ మానవేశ్వరా! 1068**

* ఆ గోపికలు గోపాలుణ్ణి చూస్తున్నంతసేపూ, తమ కళ్ల రెప్పల్ని వాల్చలేకపోయారు. వారు శ్రీకృష్ణుని జగన్మోహన సౌందర్యవైభవాన్ని తలచుకుంటూ, తమ ఆత్మలలో అచ్యుతుని కౌగిలించుకొన్నారు. వారి తనువులు గగుర్పొడిచాయి. బ్రహ్మసాక్షాత్కారంవల్ల పరవసించే యోగులలాగా గోపస్త్రీలు పరవశించారు.

చ. పొలఁతుల భావ మాత్మఁ గని పుల్ల సరోరుహలోచనుండు వా
రల నపు డేకతంబునకు రమ్మని తోకొని పోయి యందు న
ర్మిలిఁ బరిరంభణంబు లొనరించి లసద్దరహాసచంద్రికా
కలిత కపోలుఁడై పలికెఁ గాంతల భక్తినితాంతచిత్తలన్. 1069

* శ్రీకృష్ణుడు గోపికల అభిలాషను తెలుసుకొన్నాడు. వారిని ఏకాంతప్రదేశానికి తోడ్కొని వెళ్ళి ప్రేమతో కౌగిలించుకొని భక్తిపరవశలైన వారితో చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నాడు.

చ. 'వనజదళాక్షులార! బలవద్రిపు వర్గములన్ జయింపఁగాఁ
జని తడ వయ్యెఁ; దీనికి భృశంబుగ మీ మది నల్గకుండుఁడీ!
యనయము దైవ మిట్లు సచరాచరజాలము నొక్కవేళఁ గూ
ర్చును నొకవేళఁ బాపును మరుద్ధతతూల తృణంబులం బలెన్. 1070

* ఓ వనజాక్షులారా! బలవంతులైన శత్రువులను జయించటానికి వెళ్ళాము. తిరిగి రావటానికి ఆలస్యమైంది. దీనికోసం మీ రింతగా అలుకపూనటం తగదు. గాలి కెగురగొట్టబడే గడ్డిపరకల్లాగా చరాచర ప్రపంచం దైవసంకల్పాన్నిబట్టి ఒక్కోసారి కలుస్తూ, ఒక్కోసారి విడిపోతూ వుంటుంది.

సీ. తరలాక్షులార! మద్భక్తి చేతనులకుఁ దనరు మోక్షానందదాయకంబు
జప తపో వ్రత దాన సత్కర్మముల ముక్తి కలుగంగ నేరదు కానఁ దలఁప
విధి శివ సనకాది విమలచిత్తంబులఁ బొడమిన భక్తి మీ బుద్ధులందు
జనియించె మీ పూర్వ సంచిత సౌభాగ్య మెట్టిదో యది తుదముట్టె నింక

తే. నటమటము గాదు మీకు నెన్నఁటికి నైనఁ, గలుగనేరవు నిరయసంగతములైనఁ
జన్మకర్మము లిటమీఁద మన్మనీష, సుమహిత ధ్యానలార! యో రమణులార! 1071

* నాపై భక్తి గలవారికి మోక్షం సులభసాధ్యమై ఆనందదాయక మౌతుంది. కేవలం జప తపో దానాది సత్కార్యాలవల్ల ముక్తి కలుగదు. శివ బ్రహ్మ సనక సనందాదుల హృదయాల్లో అంకురించని భక్తి మీలో మొలకెత్తింది. మీ పురాకృత సుకృతవిశేషం పరిపూర్ణంగా ఫలించింది. ఇక మీ కే కష్టాలూ ఉండవు. నరక హేతువులైన జన్మ కర్మలు మీకిక కలుగవు.

సీ. అఖిలభూతములకు ననయంబు నాది మధ్యాంతరాంతర్బహిర్వ్యాప్తి నైన
ఘటపటాదిక భూతకార్యంబులకు నుపాదానకారణములై తనరునట్టి
గగనానిలానలకక్షోణులను భూత పంచకం బైక్యత వడయుఁగాదె
లోకంబులందుఁ బంచీకరణవ్యవస్థలచేత నట్టి భూతముల రీతి

తే. గగనముఖభూత తత్కార్యకారణములఁ, దగిలి యాధార హేతుభూతంబ నైన
నాకుఁ బర మన్య మొక్కఁడెన్నంగ లేదు, విమలమతులార! మాటలు వేయు నేల ? 1072

* సర్వదశల్లోనూ, సమస్తభూతాల బహిరంతరాల్లోనూ నే నుంటాను. సకల ప్రాణుల కార్యకలాపాలకూ పృథివి జలం అగ్ని వాయువు ఆకాశం అనే పంచభూతాల సంబంధమే కారణం. అటువంటి పంచభూతాలకూ ఆధారం నేనే. సర్వమునకూ నేనే కర్తను. అట్టి నాకు స్వపర తారతమ్యాలు లేవు.

**తే. అనినఁ దెలినొంది వారు దేహాభిమాన, ములు సమస్తంబు విడిచి 'యో నలిననాభ!**
**నిఖిలజగదంతరాత్మ! మానిత చరిత్ర !, భక్తజన మందిరాంగణ పారిజాత! 1073**

**తే. ఘోరసంసార సాగరోత్తారణంబు, ధీయుత జ్ఞానయోగి హృద్ధ్యేయవస్తు**
**వగుచుఁ జెలువొందు నీ చరణాంబుజాత, యుగళమును మా మనంబులఁ దగుల నీవె' 1074**

* శ్రీకృష్ణుడు తన మాహాత్మ్యాన్ని విశదీకరించగా విని గోపికలు వివేకవతులై దేహాభిమానాలను విసర్జించారు. అచ్యుతుని అనంతగుణాలను వారు ప్రస్తుతించారు. ఓ పుండరీకాక్ష! సచ్చరిత్రా! భక్త మందారా! ఘోరమైన సంసారసముద్రాన్ని దాటడానికి ఆధారమై యోగిజన హృదయాలలో సుప్రతిష్ఠితమై తనరారు నీ పాదపద్మయుగళం మా మనస్సులలో నిరంతరం వెలుగొందు గాక ! అని గోపికలు శ్రీకృష్ణుణ్ణి ప్రార్థించారు.

**క. అని వేడినఁ గృష్ణుఁడు ముని, వినతుఁడు కరుణించి వల్లవీజనములు గో**
**రిన యట్ల యిచ్చెఁ గరుణా, వననిధి సద్భక్త లోకవత్సలుఁ డంతన్. 1075**

* కరుణాసింధువూ, భక్తవత్సలుడూ ఐన నందనందనుడు గోపికలు కోరిన వరా లిచ్చాడు.

**ఉ. ధర్మతనూభవుం గని పదంబులకున్ నతుఁడై సపర్యలన్**
**నిర్మలభక్తిమై నడపి 'నీవును దమ్ములు బంధుకోటి స**
**త్కర్మ చరిత్రులై తగు సుఖంబుల నొప్పుచు నున్న వారె' నా**
**నర్మిలిఁ బాండవాగ్రజుఁడు న మ్మధుసూదనుతోడ నిట్లనున్. 1076**

* తరువాత శ్రీకృష్ణుడు ధర్మరాజును సందర్శించి అతని పాదాలకు నమస్కరించి ధర్మరాజా! నీవూ, నీ తమ్ముళ్ళూ, బంధు జనాలూ సత్కర్మనిరతులై సుఖంగా ఉన్నారా అని అడిగాడు. ధర్మరాజు కృష్ణునితో ఇలా అన్నాడు.

**క. సరసిజనాభ ! భవత్పద, సరసీరుహ మాశ్రయించు జను లతిసౌఖ్య**
**స్ఫురణం బొలుపారుచు భువిఁ, జరియింపరె! భక్త పారిజాత ! మురారీ ! 1077**

* పద్మనాభా! నీవు భక్తులపాలిటి పారిజాతానివి. నీ పాదార విందాలను ఆశ్రయించిన వారు నిత్యసౌభాగ్యాలతో అత్యంతసంతుష్టులై ఉంటారు గదా!

**వ. అదియునుం గాక 1078**

**సీ. సుమహిత స్వప్న సుషుప్తి జాగరములన్ మూఁడవస్థలఁ బాసి వాఁడి మిగిలి**
**వెలి నుందు లో నుందు; విశ్వమై యుందువు;, విశ్వంబు నీయందు వెలుఁగుచుండు;**

భవదీయ మహిమచేఁ బాటిల్లు భువనంబు, లుదయించు నొక వేళ నుడిగి మడుఁగు;
సంచితాఖండితాజ్ఞానివై యొప్పుచు నవిహత యోగమాయాత్మఁ దనరి

తే. దురితదూరులు నిత్యముక్తులకుఁ జెంద, నలవియై పెంపు దీపింతు వంబుజాక్ష !
ఘనకృపాకర ! నఖిల వికారదూర!, నీకు మ్రొక్కెద సర్వలోకైకనాథ ! 1079

* అంతేకాదు. అచ్యుతా! జాగ్రత్ స్వప్న నిద్రావస్థలకు నీవు అతీతుడవు. సర్వవ్యాపివి. విశ్వమే నీవు. నీవే విశ్వం. ఈ విశ్వం నీ యందే నిలిచి ఉంటుంది. సృష్టిస్థితి లయాలు నీ సంకల్పాధీనాలు. నీవు అఖండజ్ఞాన స్వరూపుడవు. యోగమాయ నీకు లోబడి ఉంటుంది. పాపదూరులై నిత్యముక్తులైన యోగులకు నీవు గోచరిస్తావు. అట్టి నీకు నేను నమస్కరిస్తున్నాను. నీరజాక్షుడవూ, నిఖిలలోకాధినాథుడవూ, నిర్వికారుడవూ, నిరతిశయ కృపాసముద్రుడవూ అయిన నీకు నమస్కరిస్తున్నాను.

క. అని వినుతించిన నచ్చటి, జనపాలక బంధుమిత్ర సకలజనములున్
విని యనురాగిల్లిరి నె, మ్మనముల నానంద జలధిమగ్నులు నగుచున్. 1080

* ఈవిధంగా ధర్మరాజు శ్రీకృష్ణుణ్ణి ప్రస్తుతించగా విని అతని బంధువు లందరూ ఎంతో సంతోషించారు.

తే. అట్టి యొప్పగువేళ నెయ్యంబు మెఱసి, యొక్కచోటను సంతోషయుక్త లగుచు
దానవాంతక సతులును ద్రౌపదియును, గూడి తమలోన ముచ్చట లాడుచుండి. 1081

* ఆ సంతోషమయమైన సమయంలో అన్యోన్యస్నేహం అతిశయించగా శ్రీకృష్ణుని కాంతలూ, ద్రౌపదీ కలిసి సరససల్లాపాలలో మునిగితేలారు.

## -: లక్షణ యను శ్రీ కృష్ణుని యష్టమభార్య ద్రౌపదీ దేవికిఁ దన వివాహ వృత్తాంతంబు దెలుపుట :-

వ. అట్టియెడఁ గృష్ణ కథావిశేషంబులు పరితోషంబున నుగ్గడించుచుఁ బ్రసంగ వశంబున నా రుక్మిణీదేవి మొదలగు శ్రీకృష్ణు భార్యలం గనుంగొని పాంచాలి యిట్లనియె. 'మిమ్ముఁ బుండరీకాక్షుండు వివాహం బయిన తెఱంగులు వినిపింపుఁడన వారును దమ పరిణయంబుల తెఱంగులు మున్ను నే నీకుం జెప్పిన విధంబున వినిపించి; రందు సవిస్తరంబుగాఁ దెలియం బలుకని మద్రరాజకన్యకా వృత్తాంతం బా మానిని పాంచాలికిం జెప్పిన విధంబు విను మని శుకుండు పరీక్షిన్నరేంద్రున కిట్లనియె. 1082

* ద్రౌపదీదేవి శ్రీకృష్ణుని గాథలను ప్రస్తావించి సంతోషంతో రుక్మిణి మొదలైన అంతఃపురకాంతలతో 'మీకు జనార్దనునితో పరిణయమైన విధానాన్ని వెల్లడించండి'- అని కోరింది. ఓ పరీక్షిన్మహారాజా! ఒక్క లక్షణ తప్ప తక్కిన భార్య లందరూ తమతమ వివాహ వృత్తాంతాలను నేను నీకు మునుపు చెప్పిన విధంగా ద్రౌపదికి తెలిపారు. తరువాత మద్రదేశాధిపతి పుత్రి అయిన లక్షణ తాను కృష్ణుణ్ణి పరిణయమాడిన సన్నివేశాన్ని ద్రౌపదికి వివరిస్తూ ఇలా అన్నదని శుకమహర్షి పరీక్షిత్తుకు చెప్పసాగాడు.

సీ. పాంచాలితో మద్రపతిసుత యిట్లను సంగీతవిద్యా విశారదుండు
నారదుచేతి వీణాస్వనకలిత మై నట్టి గోవింద కథామృతంబు

దవిలి యేఁగ్రోలి చిత్తము దన్మయత్వంబు నొంది మోదించుచు నుండునంత
దుహితృవత్సలుఁడు మద్గురుఁడు దా నది విని సదుపాయ మొక్కటి మదిఁ దలంచి

తే. చదల నె బ్భంగి నైన గోచరము గాక, వారి మధ్యములో నభివ్యాప్తి దోఁచు
మత్స్యయంత్రంబు కల్పించి మనుజు లెంత, వారి కైనను దివ్వ మోవంగరాని. 1083

* మద్రరాజు పుత్రిక లక్షణ ద్రౌపదితో ఇలా అన్నది. పాంచాలరాజపుత్రీ! నేను నారద గానలోలుడైన గోవిందుని కథా సుధలు తనివితీరా గ్రోలి పరవశించేదాన్ని. నేనంటే నా తండ్రి కెంతో ప్రేమ. అతడు నా మనోభిప్రాయం తెలుసుకొని నా వివాహానికి ఒక ఉపాయం ఆలోచించాడు. ఆకాశంలో కంటికి కానరాని మత్స్య యంత్రాన్ని ఏర్పాటుచేసి క్రింద ఉన్న నీటిలో అది ప్రతిబింబించేలా చేశాడు.

తే. ధనువుఁ బవిచండ నిష్ఠురాస్త్రంబు నచట, సంచితంబై న గంధపుష్పాక్షతలను
బూజ గావించి యునిచి యే పురుషుఁడేని, నిద్ధబలమున నీ చాప మెక్కు వెట్టి. 1084

* ఎంతటి యోధులకైనా ఎక్కుపెట్టడానికి అసాధ్యమైన ధనువునూ, వజ్రసదృశమైన బాణాన్నీ అక్కడ ఉంచి గంధపుష్పాక్షతలతో పూజ కావించాడు.

క. ఈ సాయకంబు నారిం, బోసి వెసన్ మత్స్యయంత్రమున్ ధరఁగూలన్
వేసిన శౌర్యధురీణుఁడు, నాసుత వరియించు నని జనంబులు వినఁగన్. 1085

* 'ఈ వింటిని మోపెట్టి మత్స్యయంత్రాన్ని పడగొట్టిన వీరుణ్ణే నా పుత్రిక పరిణయ మాడుతుంది' అని మా తండ్రి ప్రకటించాడు.

క. చాటించిన న వ్వార్తకుఁ,బాటించిన సంభ్రమముల బాణాసన మౌ
ర్వీ టంకార మహారవ, పాటితశాత్రవులు బాహుబల సంపన్నుల్. 1086

క. సుందరతనులు దదుత్సవ, సందర్శనకుతుకు లమిత సైన్యులు భూభృ
న్నందను లేతెంచిరి జన, నందితయశు లగుచు మద్రనగరంబునకున్. 1087

* మా తండ్రి చాటింపును విలువిద్యలో ఆరితేరిన వీరులెందరో విన్నారు, సుందరాకారులైన ఆ రాజకుమారులు కుతూహలంతో మద్రనగరానికి వచ్చారు.

క. చనుదెంచిన వారికి మ, జ్జనకుఁడు వివిధార్చనములు సమ్మతిఁ గావిం
చిన నా బాహుబలాఢ్యులు, ధనువుం జేరంగ నరిగి ధైర్యస్ఫూర్తిన్. 1088

* వచ్చిన రాకుమారులను మా తండ్రి సంతోషంతో స్వాగతం పలికి సత్కరించాడు. బాహుబలసంపన్నులైన ఆ రాజపుత్రులు ధైర్యంతో ధనువును సమీపించారు.

వ. ఇట్లు డగ్గఱి యద్ధనువుం గనుంగొని. 1089

ఉ. కొందఱు పూనలేక చనఁ, గొందఱు పూని కదల్పలేక పోఁ,
గొంద ఱొకింత యెత్త, నొక కొందఱు మోపిడలేక దక్కఁగాఁ,
గొంద ఱొకింత యెక్కిడుచుఁ, గోరి నృపాలకు లిట్లు సిగ్గునుం
జెంది తలంగి పోవుచును 'సీ యిట కేఁగుట నీతి త' ప్పనన్. 1090

* అలా వచ్చిన వారిలో కొందరు ధనుస్సును సమీపించడానికే సంకోచించారు. మరికొందరు కొంతప్రయత్నించి కదలించ లేకపోయారు. వింటిని ఎలాగో మీదికెత్తినా దాని నెక్కు పెట్టలేక మరికొందరు విఫలు లయ్యారు. ఇంకా కొందరు ఇక్కడికి రావడమే తప్పయిందని తలచి సిగ్గుతో వెనుదిరిగి వెళ్ళిపోయారు.

వ. అట్టియెడ. 1091

క. భీముఁడు రాధేయుఁడు ను, ద్దామగతి న్నెక్కు ద్రోఁచి తగ నమ్మీనం
బేమఱక దిరుగుచుంటయుఁ, దా మేమియు నెఱుఁగలేక తలఁగిన పిదపన్. 1092

* ఆ సమయంలో భీముడూ, కర్ణుడూ మత్స్యయంత్రాన్ని పడగొట్టడానికి ధనుస్సు ఎక్కుపెట్టికూడా వేగంగా తిరుగుతున్న మత్స్యాన్ని గుర్తింపలేక తొలగిపోయారు.

క. అమరేంద్ర తనయుఁడ మ్మ, త్స్యము నేయ మపాయ మెఱిఁగి తగ నేసియు మీ
నము ద్రుంపలేక సిగ్గున, విముఖుండై చనియె నంత వికలుం డగుచున్. 1093

* అర్జునుడు మత్స్యయంత్రాన్ని భేదించే ఉపాయం తెలిసిన వాడే. అయినా ఆయన ఎందుకనో ఆ యంతాన్ని కొట్టలేక విఫలు డైనాడు.

వ. ఇట్లు సకల రాజకుమారులుం దమతమ ప్రయత్నంబులు విఫలంబులైన ముఖారవిందంబులు ముకుళించి దైన్యంబున విన్ననై చూచుచున్న యెడ. 1094

* ఇలా రాజకుమారు లందరూ తమ ప్రయత్నం ఫలించలేక పోగా దీనవదనులై మౌనంగా ఉండిపోయారు.

చ. సరసిజ పత్త్రలోచనుఁడు చాపము సజ్యము సేసి యుల్లస
చ్ఛర మరిఁబోసి కార్ముకవిశారదుఁడై యలవోక వోలె ఖే
చర మగు మీనముం దునిమె సత్వరతన్ సురసిద్ధ సాధ్య ఖే
చరజయశబ్ద మొప్పఁ బెలుచం గురిసెం దివిఁ బుష్పవర్షముల్. 1095

* అప్పుడు శ్రీకృష్ణుడు విల్లెక్కు పెట్టి, బాణం ప్రయోగించి అలవోకగా మత్స్యయంత్రాన్ని పడగొట్టాడు. దేవతలు జయ జయ ధ్వానాలు చేశారు. ఆకాశం నుండి శ్రీకృష్ణుని మీద పుష్పవర్షం కురిసింది.

వ. అ య్యవసరంబున నేనుం బరితుష్టాంతరంగనై పరమానందవికచ వదనారవింద నగుచు, నిందిందిర సన్నిభంబులగు చికురబృందంబులు విలసదలిక ఫలకంబునం దళుకు లొలుకు ఘర్మజల కణంబులం

**గరంగు మృగమద తిలకంపు టసలున మసలుకొనినం గరకిసలయంబున నోసరించుచు మిసమిస మను మెరుంగుగములు గిఱికొన నెఱిగౌను వడవడ వడంక నప్పుడు మందగమనంబున. 1096**

* అప్పుడు నాకు పరమానందం కలిగింది. ఒడలంతా చెమర్చింది. చెమటచేత తడిసి కరగిన నా అలికఫలకంమీద కస్తూరి తిలకంలో ముంగురులు చిక్కుకొన్నాయి. వాటిని నా మృదువైన చేతులతో చక్కచేస్తూ మందగమనంతో ముందుకు నడిచి వెళ్ళాను.

**చ. లలితపదాబ్జ నూపురకలధ్వనితో దరహాస చంద్రికా**
**కలిత కపోలపాలికలఁ గప్పు సువర్ణవినూత్న రత్న కుం**
**డల రుచు లొప్పఁ గంకణఝణంకృతు లింపెనలార రంగ భూ**
**తలమున కేగుదెంచి ముఖతామరసం బపుడెత్తి చూచుచున్. 1097**

* కాలిఅందెలు ఘల్లుఘల్లుమని మ్రోగగా, పెదవులపై మందహాసం చిందులాడగా చెక్కుటద్దాలపై బంగారుకుండలాల దీప్తులు జాలువారగా. మణికంకణాల మధురధ్వనులతో ఒయ్యారంగా రంగస్థలం మీదికి వెళ్ళి ముఖమెత్తి అటూ ఇటూ పరికించాను.

**చ. నరపతులం గనుంగొని మనంబున వారిఁ దృణీకరించి మ**
**త్కరజలజాత దివ్యమణి కాంచనమాలిక న మ్మురారి కం**
**ధరమున లీలమై నిడి పదంపడి నవ్య మధూకదామ మా**
**హరికబరిం దగిల్చితి నయంబునఁ గన్నుల లజ్జ దేఱఁగన్. 1098**

* రాజకుమారు లందరినీ తృణీకరించి నా చేతుల్లో ఉన్న కనక కమలహారాన్ని శ్రీకృష్ణుని మెడలో వేశాను. అలాగే ఇప్పపూల దండతో ఆయన వక్షాన్ని అలంకరించాను. ఆ సమయాన నా కళ్లల్లో సిగ్గు తొణికిస లాడింది.

**వ. అప్పుడు. 1099**

**చ. కొలఁదికి మీఱఁగా డమరు గోముఖ డిండిమ మడ్డు శంఖ కా**
**హళ మురళీ మృదంగ వణ వానక దుందుభిఢక్క కాంస్య మ**
**ర్దళ మురజారజాది వివిధధ్వను లేపున భూనభోంతరం**
**బులఁ జెలఁగెన్ నటీనటనముల్ దనరారె మనోహరాకృతిన్. 1100**

* ఆ శుభసమయంలో నానావిధాలైన మంగళవాద్యాలు దిక్కులు పిక్కటిల్లేలా మ్రోగాయి, నటీమణుల నృత్యాలు కన్నుల పండువు చేశాయి.

**వ. అంత. 1101**

**చ. అమరగణంబుఁ దోలి యురగారి సుధాకలశంబుఁ గొన్న చం**
**దమున సమస్తశత్రువసుధావర కోటిఁ దృణీకరించి య**

క్కమల విలోచనుండు ననుఁ గౌఁగిట నొప్పుఁగ జేర్చి సింహ చం
క్రమణ మెలర్పఁ గొంచుఁ జనెఁ గాంచనచారు రథంబుమీఁదికిన్. 1102

* అప్పుడు దేవతల సైన్యాన్ని పారద్రోలి గరుత్మంతుడు అమృతకలశాన్ని హరించినట్లు సమస్త శత్రురాజ సమూహాన్ని ధిక్కరించి శ్రీకృష్ణుడు నన్ను చేరదీసి కౌగిలించుకొని సింహగమనంతో తన కాంచనరథం మీదికి చేర్చాడు.

వ. అట్లు రథారోహణంబు సేసిన. 1103

చ. తురగచతుష్కమున్ విమతదుర్దమశూరతఁ బూన్చి దారుకుం
డరదము రొప్ప శత్రునికరాంధతమః పటల ప్రచండ భా
స్కరరుచి నొప్పునట్టి నిజకార్ముక యుక్తగుణ ప్రఘోష సం
భరిత దిగంతరుం డగుచుఁ బద్మదళాక్షుడు వోవుచుండఁగన్ ! 1104

* అ విధంగా మేము రథం ఎక్కిన అనంతరం సారథిఅయిన దారుకుడు నాలుగు గుర్రాలరథాన్ని ముందుకు నడిపాడు. అప్పుడు శత్రురాజు లనే కారుచీకట్లకు సూర్యకిరణ ప్రసారం వంటి తన ధనుష్టంకారం దిగంతాలలో ప్రతిధ్వనింపగా శ్రీకృష్ణుడు రథంమీద విరాజిల్లాడు.

వ. అట్టియెడ సకలరాజ లోకంబును గృష్ణుని విభవంబునకుం జూపోపక యసంఖ్యంబులగు మూఁ
కలు గట్టి య మ్మహాత్ముని మాహాత్మ్యంబు దెలియక దర్పాంధులై కడంగి 1105

* అప్పుడు రాజులందరూ శ్రీకృష్ణుని సౌభాగ్యవైభవాన్ని చూచి ఓర్వలేకపోయారు. శ్రీకృష్ణుని అసమాన తేజోవిశేషాలను తెలుసుకోలేక గర్వాంధులైన ఆ రాజు లందరూ గుంపులుకట్టి విజృంభించారు.

ఉ. భావభవ ప్రసూన శరబాధిత మానసులై సమస్త ధా
త్రీవరనందనుల్ బలువుఁ దెంపును బెంపును సొంపు నేర్పడన్
దేవకిరీటరత్న రుచిదీపిత పాదసరోజుఁడైన రా
జీవదళాక్షుఁ దాఁకిరి విశృంఖల వృత్తి నతిప్రయత్నులై. 1106

* మదనుని పూలతూపుల తాపాన్ని సైపలేక స్వయంవరానికి వచ్చిన ఆ రాజపుత్రు లందరూ కోపించి ధైర్య సాహస పరాక్రమాలతో ప్రకోపించి కృష్ణుణ్ణి ఎదిరించారు.

వ. అంత. 1107

చ. సరసిజలోచనుండు నిజశార్ఙ్గశరాసనముక్త హేమ పుం
ఖ రుచిర శాతసాయక నికాయములన్ రిపుకోటి నేసి సిం
ధురరిపు విక్రమ ప్రకట దోర్బలుఁడై విలసిల్లి యొత్తె దు
స్తర చలితాన్యసైన్యమును సజ్జనమాన్యముఁ బాంచజన్యమున్. 1108

* అప్పుడు సింహపరాక్రముడైన జనార్దనుడు తన ధనుస్సు నుండి వెలువడుతున్న వాడిబాణాలతో శత్రువులు భయభ్రాంతు లయ్యేటట్లు విజయశంఖం పూరించాడు.

**ఉ. ఆ తఱి భూరిబాహుబలులైన విరోధి నరేశ్వరుల్ మృగ**
**వ్రాతము లొక్కపెట్ట మృగరాజ కిశోరముపై నెదిర్చి న**
**ట్లాతురులై చతుర్విధ సమగ్ర బలంబులతోడఁ గూడి ని**
**ర్ధూత కళంకుఁడైన నవతోయజనేత్రునిఁ జుట్టు ముట్టినన్. 1109**

* ఆ తరుణంలో రాజు లందరూ చతురంగబలాలతో కూడి వన మృగాలు మృగేంద్రుని ఎదిరించిన రీతిగా శ్రీకృష్ణుణ్ణి చుట్టుముట్టారు.

**చ. అలిగి మురాంతకుండు కులిశాభశరంబుల నూత్నరత్న కుం**
**డలములతో శిరంబులు, రణన్మణినూపురరాజితోఁ బదం**
**బులుఁ, గటకాంగుళీయక విభూషణచాప శరాలితోడఁ జే**
**తులు, నిలఁగూలఁగా విజయదోహలియై తునుమాడె వెండియున్. 1110**

* అది చూచి కృష్ణునికి ఆగ్రహం అతిశయించింది, ఆయన వజ్రసదృశాలైన వాడిబాణాలను ప్రయోగించి శత్రురాజుల కర్ణ, కుండలాలతోపాటు వాళ్లశిరస్సులూ, నూపురాలతో పాటు పాదాలూ కంకణాలతో పాటు చేతులూ తెగి నేలపై కూలేటట్లు చేసి శత్రువులను నిర్మూలించాడు.

**క. హతశేషులు సాక్కాకుల, గతిఁ దూల నిశాతపవనకాండముల సము**
**ద్ధతి నేసి తోలి విజయో, న్నతుఁడై నిజనగరి కేగె నగధరుఁ డంతన్. 1111**

* చావు తప్పి బ్రతికినవారు ఎండుటాకుల్లాగా ఎగిరి నలు దిక్కులకూ పారిపోయేలా శ్రీకృష్ణుడు వాయవ్యాస్త్రాన్ని ప్రయోగించాడు. ఈ విధంగా విజయాన్ని వరించి జనార్దనుడు నన్ను తీసుకొని ద్వారక చేరుకున్నాడు.

**వ. అట్లు మహిత మంగళాలంకృతంబును, నతిమనోహర విభవాభిరామంబు నగు ద్వారకా నగరంబున కరుగుదెంచిన మజ్జనకుండును బ్రియంబునఁ దోడన చనుదెంచి. 1112**

* సాటిలేని వైభవంతో ప్రకాశిస్తూ రమణీయంగా అలంకరించబడిన ద్వారకా నగరానికి మాతోపాటు మా తండ్రిగారు కూడా వచ్చారు.

**చ. రణిత వినూత్న రత్న రుచిరస్ఫుట నూపుర హార కర్ణ భూ**
**షణ కటకాంగుళీయక లసత్పరిధాన కిరీట తల్ప వా**
**రణ రథవాజి హేతినికరంబులనుం బరిచారికాతతిన్**
**బ్రణుతగుణోత్తరుం డయిన పద్మదళాక్షున కిచ్చె నెమ్మితోన్. 1113**

* అలా ద్వారకకు వచ్చిన మా తండ్రి రకరకాలైన రత్నాభరణాలనూ, కిరీటాలనూ, హార నూపుర కేయూరాలనూ, పట్టు పాన్పులనూ, రథ గజ తురగాలనూ, ఖడ్గాది ఆయుధాలనూ, వేలాది పరిచారికలనూ శ్రీకృష్ణునికి బహుమానంగా ఇచ్చాడు.

**వ. ఇట్లు మహనీయతేజోనిధియైన మాధవు దయాపరిలబ్ధనిఖిల వస్తు విస్తారుం డయ్యును, నిజాధికార శుద్ధికొరకు మరలఁ గన్యారత్నంబును, వినూత్న రత్నవ్రాతంబును సమర్పించె; నని భూసుర విసరంబులు వినుతింప మా తండ్రియైన బృహత్సేనుండు నన్నును సమస్త వస్తువులను గృష్ణునకు సమర్పించి, క్రమంబున సకల యాదవులనుం బూజించి మరలి నిజపురంబునకుం జనియె' నని చెప్పినఁ గుంతియు గాంధారియుఁ గృష్ణయు, నఖిల నృపాల కాంతాజనంబులును, గోపికలుం దమతమ మనంబుల సర్వభూతాంతర్యామియు, లీలామానుష విగ్రహుండును నైన పుండరీకాక్ష చరణారవింద స్మరణానంద పరవశలై కృష్ణుం బ్రశంసించి రంత.** 1114

* మా నాన్నగారి కంతటి వైభవం శ్రీకృష్ణుని అనుగ్రహంవల్లనే ప్రాప్తించింది. అయినా తన అధికారానికి అనుగుణంగా కన్యారత్నంతోపాటు అమేయ రత్నభూషణాలను మా తండ్రి కృష్ణునికి సమర్పించాడు. భూసురోత్తములు ఆశీస్సుతో కొనియాడగా మా తండ్రియైన బృహత్సేనుడు యథోచితంగా యాదవ ప్రముఖులను పూజించి తన నగరానికి వెళ్ళాడు-అని ఈ విధంగా లక్షణ తన పరిణయ వృత్తాంతాన్ని ద్రౌపదికి తెలిపింది. అప్పుడు గాంధారీ, కుంతీ, ద్రౌపదీ, తక్కిన రాజపత్నులూ, గోపికలూ తమ తమ హృదయాలలో లీలామానుష రూపుడైన శ్రీకృష్ణుని పాదపద్మాలను స్మరించుకొని ఆనందంతో పరవశించారు. వాసుదేవుని ప్రస్తుతించారు.

## -: నారదాది మహర్షులు శ్రీకృష్ణు దర్శనంబు సేసికొని వసుదేవునిచేఁ గ్రతువు సేయించుట :-

**చ. బలవదరాతిమర్దనులఁ బాండురనీలనిభ ప్రభాంగులం**
**గలిత నిజాననాంబుజ వికాస జితాంచిత పూర్ణచంద్ర మం**
**డలులఁ బరేశులన్ నరవిడంబనులం గరుణాపయోధులన్**
**విలసదలంకరిష్ణుల నవీనసహిష్ణుల రామకృష్ణులన్.** 1115

* బలవంతులైన శత్రువుల్ని నిర్మూలించడంలో బలరామ కృష్ణులు సమర్థులు. వారు చక్కదనంలో సంపూర్ణచంద్రుణ్ణి మించిన వారు. లీలామానుషవిగ్రహులు. కరుణాసాగరులు. అలంకార ప్రియులు. బలరాముడు ధవళాంగుడు. కృష్ణుడు శ్యామసుందరుడు.

**వ. సందర్శించు తలంపుల నందఱుఁ దమ హృదయారవిందంబులఁ బ్రేమంబు సందడిగొన నప్పుడు.**

**ఉ. ధీరమతిన్ ద్విత త్రితక దేవల సాత్యవతేయ కణ్వులున్**
**నారద గౌతమ చ్యవన నాకుజ గార్గ్య వసిష్ఠ గాల వాం**

గీరస కశ్య పాసిత సుకీర్తి మృకండుజ కుంభసంభ వాం
గీరులు యాజ్ఞవల్క్య మృగశృంగముఖాఖిల తాపసోత్తముల్. 1117

* ఆ రామకృష్ణులను సందర్శించాలనే కుతూహలం పొంగులు వారే హృదయాలతో దేవలుడు, వ్యాసుడు, కణ్వుడు, నారదుడు, గౌతముడు, చ్యవనుడు, వాల్మీకి, గార్గ్యుడు, వసిష్ఠుడు, గాలవుడు, ఆంగీరసుడు, కశ్యపుడు, అసితుడు, మార్కండేయుడు, అగస్త్యుడు, యాజ్ఞవల్క్యుడు, ఋష్యశృంగుడు మొదలైన తాపసశ్రేష్ఠులు ద్వారకా నగరానికి వచ్చారు.

వ. చనుదెంచినం గృష్ణుండు వారలకుఁ బ్రత్యుత్థానంబు సేసి వందనంబు లాచరించి వివిధార్చనలు గావించి యిట్లనియె. 1118

* ఇలా వచ్చిన మునీశ్వరులకు శ్రీకృష్ణుడు ఎదురుగా వెళ్ళి నమస్కారం చేసి యథావిధిగా పూజించి వారితో ఇలా అన్నాడు.

సీ. 'సన్మునీశ్వరులార! జన్మభాక్కులమైన మాకు నిచ్చోట సమ్మతిని దేవ
నికరదుష్ప్రాపులు నిరుపమ యోగీంద్రు లైన మీ దర్శనం బబ్బెఁ గాదె
ధృతి మందభాగ్యు లింద్రియ పరతంత్రులు నైన మూఢాత్ముల కనఘులార !
భవదీయ దర్శన స్పర్శన చింతన పాదార్చనలు దుర్లభంబు లయ్యు
తే. నేఁడు మాకిట సులభమై నెగడెఁ గాదె !, జగతిపైఁ దీర్థభూతులు సాధుమతులు
మిమ్ము దర్శించుటయు చాలు నెమ్మితోడ, వేఱ తీర్థంబు లవనిపై వెదక నేల ? 1119

* ఓ మహామునీశ్వరులారా ! దేవతలకు సైతం లభించని మీ వంటి పరమయోగీంద్రుల దర్శనం మానవమాత్రులమైన మా కీ చోట లభించింది. దురదృష్టవంతులకూ, ఇంద్రియలోలురకూ, మూఢులకు మీవంటి పుణ్యాత్ముల దర్శనమూ, స్పర్శనమూ, చింతనమూ, పాదార్చనమూ లభించవు. అయినా మాకవి సులభంగా ప్రాప్తించాయి. ఈ లోకంలో సాధువులు పవిత్రమైన తీర్థంవంటి వారు. మిమ్ము దర్శించటమే చాలు. వేరే పుణ్యతీర్థాలు వెదకవలసిన అవసరం లేదు.

వ. అదియునుం గాక యుదక మయంబులైన తీర్థంబులును మృచ్ఛి లామయంబులైన దేవగణంబులును, దీర్ఘదేవతారూపంబులు గాకుండుట లే; దయిన నని చిరకాల సేవనార్చనలం గాని పావనంబు సేయవు; సత్పురుషులు దర్శనమాత్రంబునం బావనంబుసేయుదురని వెండియు. 1120

* అంతేకాకుండా నీళ్ళతో నిండిన తీర్థాలూ, మట్టిచేతా రాతి చేతా చేయబడిన దేవతాప్రతిమలూ వున్నాయి. అవికూడా పరమ పవిత్రాలే. అయినా వాటిని చాలాకాలం నియమపూర్వకంగా సేవించి పూజిస్తేనే ఫలితం చేకూరుతుంది. కానీ సత్పురుషుల దర్శన మాత్రంచేతనే ఫలం సంప్రాప్తమౌతుంది.

సీ. ఆదిత్య చంద్రాగ్ని మేదినీ తారాంబు మారుతాకాశ వాఙ్మనము లోలిఁ
బరికింపఁ దత్త దుపాసనంబులఁ బవిత్రములు సేయఁగ సమర్థములు గావు;
సకలార్థగోచరజ్ఞానంబు గల మహాత్మకులు దారు ముహూర్త మాత్రసేవఁ
జేసి పావనములు సేయుదు; రదియు న ట్లుండె ధాతుత్రయ యుక్తమైన

తే. కాయమం దాత్మబుద్ధియుఁ గామినీ కు, మారులందు స్వకీయాభిమానములును
దివిరి జలమునఁ దీర్థబుద్ధియును జేయు, నట్టి మూఢుండు పశుమార్గుఁ డనఁగఁ బరఁగు. 1121

* ఆలోచించి చూడగా సూర్యచంద్రులనూ, భూమినీ, నక్షత్రాలనూ, నీటినీ, గాలినీ, ఆకాశాన్నీ పూజించినప్పటికీ మనుష్యుణ్ణి పవిత్రం చేయటానికి అవి సామర్థ్యం కలవి కావు. సమస్తవిషయాలూ తెలిసిన విజ్ఞానులైన మహాత్ములు ముహూర్తమాత్రం సేవచేతనే మానవులను పవిత్రం చేస్తారు. అది అలా ఉండనీయండి. వాతపిత్త శ్లేష్మమయమైన శరీరాన్ని ఆత్మ అనుకోవడమూ, భార్యాపుత్రులు ఆత్మీయులని అభిమానించడమూ, సామాన్యజలాన్ని పుణ్యతీర్థమని భావించటమూ అజ్ఞానలక్షణాలు. అటువంటి మూర్ఖుడు పశుమార్గంలో ప్రవర్తించేవాడని చెప్పవచ్చు.

వ. అని యి వ్విధంబునం గృష్ణుం డాడిన సాభిప్రాయంబులగు వాక్యంబులు విని. య మ్మునీంద్రులు విభ్రాంతహృదయులై యూరకుండి, ముహూర్తమాత్రంబున కమ్మహాత్ము ననుగ్రహంబు వడసి, మందస్మితముఖులై, య ప్పుండరీకాక్షున కి ట్లనిరి; 'దేవా! నేమును దత్త్వవిదుత్తము లయిన బ్రహ్మరుద్రాదులును, భవదీయ మాయావిమోహితులమై యుందుము; నిగూఢంబయిన నీ యిచ్ఛచేత మమ్ము ననుగ్రహించితివి. భవదీయ చరిత్రంబులు విచిత్రంబు; లి మ్మేదిని యొక్కటి యయ్యును బహురూపంబులఁ గానంబడు విధంబున నీవును మొదలఁ గారణరూపంబున నేకం బయ్యును ననేక రూపంబులు గైకొని, జగదుత్పత్తి స్థితి లయంబులకు హేతుభూతంబునా నద్భుతకర్మంబులం దగిలి, లీలావతారంబులు గైకొని, దుష్టజన నిగ్రహంబును, శిష్టజన రక్షణంబును గావించుచుందు; వదియునుం గాక వర్ణాశ్రమధర్మంబు లంగీకరించి, పురుషరూపంబున వేదమార్గంబు విదితంబు సేసిన బ్రహ్మరూపివి; తపస్స్వాధ్యాయ నియమంబులచేత నీ హృదయంబు పరిశుద్ధంబు; గావున బ్రహ్మస్వరూపంబులైన వేదంబులందు వ్యక్తావ్యక్త స్వరూపంబు లేర్పడఁగా నుందువు; కావున బ్రాహ్మణ కులంబునెల్ల బ్రహ్మకులాగ్రణివై రక్షించిన మహానుభావుండవు; మాయాజవనికాంతరితుండవైన నిన్నును నీ భూపాలవర్గంబును, నేమును దర్శింపంగంటిమి; మా జన్మ విద్యా తపో మహిమలు సఫలంబు లయ్యె; నీకు నమస్కరించెద' మని బహువిధంబులఁ గృష్ణు నభినందించి, యమ్మురాంతకుచేత నామంత్రణంబులు వడసి తమ తమ నివాసంబులకుం బోవం దలంచు నవసరంబున. 1122

* ఈ విధంగా కృష్ణుడు పలికిన అభిప్రాయ గర్భితాలైన మాటలను విని ఆ మునీశ్వరులు విస్మయంతో కూడినవారై క్షణకాలం మౌనం వహించి వెంటనే శ్రీకృష్ణుని అనుగ్రహం పొంది, చిరునవ్వు ముఖాలతో ఆ పుండరీకాక్షుణ్ణి చూచి ఇలా అన్నారు. 'దేవా! మేమున్నూ, ఉత్తమతత్త్వవేత్తలైన బ్రహ్మరుద్రాదులున్నూ నీ మాయకు లోబడి ఉన్నాము. నిగూఢమైన నీ అభీష్టంచేత మమ్మనుగ్రహించావు. నీ చరిత్రం మిక్కిలి

విచిత్రం. ఈ భూమి ఒక్కటే అయ్యీ, అనేక రూపాలతో కనబడే విధంగా నీ వొక్కడివే అయినా అనేకరూపాలతో సృష్టిస్థితి లయాలు అనే అద్భుతకార్యాన్ని చేపట్టి లీలావతారాలు ఎత్తి, దుష్టజన శిక్షణం శిష్టజన రక్షణం చేస్తూ ఉంటావు. అంతేగాక వర్ణాశ్రమధర్మాలను అంగీకరించి విరాట్పురుషరూపంతో వేదమార్గాన్ని స్పష్టం చేసిన బ్రహ్మస్వరూపుడవు. తపస్స్వాధ్యాయ నియమాలచేత నీ హృదయం పరిశుద్ధం. అందుకనే బ్రహ్మస్వరూపాలైన వేదాల్లో వ్యక్తావ్యక్తమైన ఆకారంతో ఉంటున్నావు. కనుకనే బ్రాహ్మణకులాన్ని రక్షించిన బ్రహ్మణ్యమూర్తివి. మహానుభావుడవు. మాయ అనే తెరచాటున ఉన్న నిన్ను ఈ రాజలోకమూ, మేమూ దర్శింప గలిగాము. మా జన్మమూ, మా విద్యా, మా తపోమహిమా సార్థకమయ్యాయి. నీకు నమస్కరిస్తున్నాము' అని మునీంద్రులు అనేకవిధాలుగా కృష్ణుణ్ణి ప్రశంసించి ఆయనచే వీడ్కోలు పొందినవారై తమ తమ నివాసాలకు వెళ్ళాలని ప్రయాణమైనారు.

**సీ. ఆ మ్మునీశ్వరులకు నానకదుందుభి యతిభక్తి వందనం బాచరించి**
**'తాపసోత్తములార ! ధర్మతత్త్వజ్ఞులు మన్నించి వినుఁడు నా విన్నపంబు**
**సత్కర్మ వితతిచే సంచితకర్మచయంబు వాపెడు నుపాయంబు నాకు**
**ఘన దయామతిఁ జెప్పుఁ' డనిన నమ్మునివరుల్ భూవరుల్ విన వసుదేవుఁ జూచి**

**తే. యెలమిఁ బలికిరి నిఖిల యజ్ఞేశుఁడైన, కమలలోచనుఁ గూర్చి యాగములు సేయు**
**కర్మమునఁ బాయు నెట్టి దుష్కర్మమైన; నిదియె ధర్మంబు గాఁగ నీ మదిఁ దలంపు.** 1123

∗ అప్పుడు వసుదేవుడు అక్కడకు వచ్చి ఆ మహర్షులకు నమస్కారం చేశాడు. 'మునిశ్రేష్ఠులారా! ధర్మతత్త్వజ్ఞులైన మీరు క్షమించి నా మనవి ఆలకించండి. సత్కర్మలద్వారా పూర్వజన్మ కర్మలను పోగొట్టుకొనే ఉపాయం నాకు దయతో తెలియజెప్పండి' అని ప్రార్థించాడు. అప్పు డా మునీశ్వరులు రాజు లందరూ వింటుండగా వసుదేవునితో ఇలా అన్నారు. 'ఈ శ్రీకృష్ణుడు సమస్తయజ్ఞాలకూ అధీశ్వరుడు. ఈ పుండరీకాక్షుణ్ణి గురించి చేసే యాగంవల్ల ఎలాంటి దుష్కర్మమైనా తొలగిపోతుంది. దీన్నే ధర్మంగా భావించు.'

**వ. అదియునుం గాక.** 1124

**క. దేవర్షి పితృఋణంబులు, భూవర ! మఖవేదపాఠపుత్త్రులచేతన్**
**వావిరి నీఁగని పురుషుఁడు, పోవు నధోలోకమునకుఁ బుణ్యచ్యుతుఁడై.** 1125

∗ అదీగాక వసుదేవా! యజ్ఞాలచేత దేవతల ఋణాన్నీ, వేదాధ్యయనంచేత ఋషిఋణాన్నీ, పుత్త్రుని మూలకంగా పితృఋణాన్ని తీర్చలేని మానవుడు పుణ్యాలకు దూరమై అధోలోకానికి పోతాడు.

**వ. అట్లగుటం జేసి నీవును.** 1126

**క. వరతనయాధ్యయనంబులఁ, దరియించితి ఋణయుగంబు; దడయక ధరణీ**
**వరదేవ ఋణము సవనా, చరణుఁడవై యీఁగు టొప్పు సమ్మతితోడన్.** 1127

∗ అందువల్ల నీవు నీ పుత్రుని మూలంగా పితృఋణాన్ని తీర్చుకొన్నావు. ఇక యజ్ఞం చేసి దేవఋణాన్ని తీర్చుకోవటం యుక్తం.

క. అనవుడు న వ్వసుదేవుఁడు, మునివరులకు ననియె వినయమున మీరలు సె
ప్పిన యట్ల మఖము సేసెద, దినకరనిభులార! మీరు దీర్పఁగ వలయున్. 1128

* ఈ విధంగా మహర్షులు పలుకగా వసుదేవుడు వారితో 'తేజోనిధులైన ఓ మహర్షులారా ! మీ రుపదేశించిన ప్రకారం యాగం చేస్తాను. దానిని మీరే ఋత్విజులై జరిపించాలి' అని వినయంతో వారికి మనవి చేశాడు.

వ. అని యభ్యర్థించి యమ్మునీంద్రుల యాజకులం గా వరించి,యప్పుణ్యతీర్థోపాంతంబున మహేంద్రామిత వైభవంబున, నష్టాదశ భార్యాసమేతుండై, దీక్షఁ గైకొని య మ్మహాధ్వరంబు వేదోపదిష్ట విధిం బరిసమాప్తించి ఋత్విజ్నికాయంబుల బహుదక్షిణలం దనిపి, భార్యాసమేతుండై యవ భృథస్నానం బాచరించి, వివిధరత్నమణి మయభూషణ విచిత్రాంబర సురభి సుమాను లేపనంబులు ధరించి, నిఖిలభూదేవ మునిబంధు రాజలోకంబుల నుచిత సత్కారంబులఁ బ్రీతులం గావించిన వారును గృష్ణానుమతి నాత్మనివాసంబులకుం జని; రందు. 1129

* వసుదేవుడు ఆ మునీంద్రులను ఋత్విక్కులుగా వరించి స్యమంతపంచకతీర్థం సమీపంలో దేవేంద్రుణ్ణి మించిన వైభవంతో భార్యాసమేతంగా యాగదీక్షను గైకొన్నాడు. ఆ యజ్ఞాన్ని శాస్త్ర ప్రకారం పూర్తి చేశాడు. ఋత్విక్కులను అనేక దక్షిణలతో సంతృప్తి పరిచాడు. భార్యాసమేతంగా అవభృథస్నానం చేశాడు. తరువాత వివిధ మణిమయ భూషణాలనూ, నూతన వస్త్రాలనూ, పరిమళభరితమైన పూదండలనూ, మనోహరమైన మైపూతలను స్వీకరించినవాడై బ్రాహ్మణులనూ, మునులనూ, బంధువులనూ, రాజసమూహాన్ని సముచిత సత్కారాలతో సంతోషింప చేశాడు. వారున్నూ కృష్ణుని అనుమతి తీసుకొని తమ తమ నివాసాలకు వెళ్ళారు.

ఉ. ఆ తఱి నుగ్రసేన వసుధాధిప పంకజనాభ ముష్టికా
రాతులు దమ్ము నర్థి మధురప్రియభాషల నివ్వ వేఁడినం
గౌతుక మాత్మ నివ్వటిలఁగా వసియించిరి గోపగోపికా
వ్రాతముతోడ నచ్చట ధరావర ! నందయశోద లిమ్ములన్. 1130

* అప్పుడు ఉగ్రసేన వసుదేవులూ, బలరామ కృష్ణులూ బలవంతంచేసి ప్రార్థింపగా, వారి ప్రార్థనను పురస్కరించుకొని నందుడూ, యశోదా, గోపగోపికలతో సహా కొన్నాళ్ళపాటు అక్కడే ఉన్నారు.

క. హరినయముల హరిప్రియముల, హరిమధురాలాపములను హరికథల మనో
హరలీలఁ దగిలి నందుఁడు, నిరుపమగతి నచట మూఁడునెల లుండె నృపా! 1131

* శ్రీకృష్ణుని మర్యాదనూ, మంచితనాన్నీ, మాటల మాధుర్యాన్నీ, మనోహరమైన లీలావిలాసాలనూ ఆలోకిస్తూ నందుడు తన వారితో కూడా మూడునెలలు అక్కడనే ఉండిపోయాడు.

చ. జలరుహలోచనాది యదుసత్తము లందఱు నన్నిభంగులం
గలితవిభూషణాంబర నికాయము లిచ్చి బహూకరించి వీ
డ్కొలిపిన నందముఖ్యులు ముకుందపదాబ్జ మరందపాన స
ల్లలిత నిజాత్మ షట్పదములన్ మరలించుచు నెట్టకేలకున్. 1132

* తరువాత బలరామ కృష్ణులూ, తక్కిన యాదవ ప్రముఖులూ నందునికీ అతని పరివారానికీ తగిన ఆభరణాలనూ, వస్త్రాలనూ బహూకరించి వీడ్కో లిచ్చారు. ముకుంద చరణారవింద మకరంద పానంతో మత్తిల్లిన చిత్తాలనే తుమ్మెదలను బలవంతంగా మరలించుకొని నందుడు మొదలైనవారు ప్రయాణం సాగించారు.

వ. చని చని. 1133

ఆ. మరలి మరలి 'కృష్ణ ! మాధవ ! గోవింద !, పద్మనాభ ! భక్త పారిజాత !
దేవదేవ ! యనుచుఁ దివిరి చూచుచు మధు, రాభిముఖులు నగుచు నరిగి రంత. 1134

* నందుడూ, అతని అనుచరులూ 'కృష్ణ', 'మాధవ', 'గోవింద', 'పద్మనాభ', అనుకుంటూ శ్రీకృష్ణనామాలు జపిస్తూ, మాటిమాటికీ వెనుదిరిగి చూస్తూ, పోలేక పోలేక మధురానగరంవైపు సాగిపోయారు.

క. క్రమమున నచ్చటఁబ్రావృ, ట్సమయం బగుటయును బంధుజన యాదవ వ
ర్గము లోలిఁ గొలువ సురగణ, నమితులు బలకృష్ణు లాత్మనగరంబునకున్. 1135

* స్యమంతపంచకంలో వర్షాకాలం రాగానే బలరామాదులు సపరివారంగా ద్వారకానగరం చేరు కున్నారు.

వ. వచ్చి సుఖంబుండు నంత. 1136

## -: శ్రీకృష్ణ బలభద్రులు మృతులైన తమ సహోదరులఁ దెచ్చి దేవకిదేవికిఁ గనఁబఱచుట :-

సీ. అవనీశ ! యొక్కనాఁ డానకదుందుభి భార్య పద్మాక్షుండు బలుఁడుఁ దొల్లి
శరధిలోఁ జొచ్చిన గురుతనూభవునిని మరలంగఁ దెచ్చిన మహిమ లెల్ల
జనములు దమలోన సన్నుతుల్ సేయంగ విని తన సుతులు దుర్వృత్తుఁడైన
కంసుచే నిహతులై కాలుని పురి నున్న వారి నందఱఁ జూడఁ గోరి కృష్ణ

తే. బలులకడ కేగి కన్నుల బాష్పకణము, లొలుక నో రామ ! రామ ! నిత్యోన్నతాత్మ !
పరమపావనమూర్తి ! యో మురవిభేది !, యిందిరానాథ ! యోగీశ్వరేశ ! కృష్ణ ! 1137

* అందరూ ద్వారకలో ఆనందంగా కాలం గడుపుతున్న సమయంలో పూర్వం బలరామ కృష్ణులు సముద్రంలో పడిపోయిన తమ గురుపుత్రుణ్ణి మళ్ళీ తెచ్చి యిచ్చిన విషయాన్ని ప్రజలు కథలుగా చెప్పుకుంటూ ఉండగా వసుదేవుని భార్య దేవకి విన్నది. కంసునిచేత వధించబడి యమసదనంలో ఉన్న తన బిడ్డలను

చూడాలని ఆమె మనస్సు ఉవ్విళ్ళూరింది. ఆమె బలరామ కృష్ణుల వద్దకు వెళ్ళి కన్నీరు కారుస్తూ వారిని పలువిధాలుగా ప్రస్తుతించింది.

**క. మురకంస చైద్య పౌండ్రక, నరక జరాతనయ యవన నరనాయకులన్**
**దురితాత్ములఁ బొరిగొని భూ, భర ముడిపిన యట్టి మేటిబలులు దలంపన్.** 1138

∗ పాపాత్ములైన మురు, కంస, శిశుపాల, పౌండ్రక, నరక జరాసంధ కాలయవనాది రాజులను సంహరించి భూభారాన్ని బాపిన బలవంతులు మీరే కదా' అని దేవకి బలరామ కృష్ణులను ప్రశంసించింది.

**ఆ. జనన వృద్ధి విలయ సంగతి నిఖిలంబుఁ, బొందఁ జేయు పరమపురుషులార !**
**మీకు లీల లౌట మీ రని నమ్మిన, దాన నేను వినుఁ డుదారులార!'** 1139

∗ సృష్టి స్థితి లయాలు జరిపే పరమపురుషులు మీరు. అవన్నీ మీ లీలావిలాసాలని మిమ్ము నమ్మిన దాన్ని నేను అని ఆమె శోకంతో వారికి విన్నవించుతూ కన్నీరు నించింది.

**వ. అని యనేక విధంబుల వినుతించుచు నిట్లనియె; 'మీరలు మహానుభావులరు; మీరు తొల్లి యనేకకాలంబు సనినక్రిందట మృతుండై, దండధరు మందిరంబున నున్న గురుకుమారుని మీ మహాప్రభావంబులు లోకంబులఁ బరిపూర్ణంబులై ప్రకాశింప; న క్కాలునిచెంత నుండి మగుడం దెచ్చి గురుదక్షిణగా నొసంగితి; రి వ్విధంబునం గంసునిచేత హతులైన మత్పుత్రుల నందఱ మరలం దెచ్చి నా మనంబున నున్న దుఃఖంబు నివారింపవలయు' నని దేవకీదేవి ప్రార్థించినం దమతల్లి యాడిన మృదుమధురవాక్యంబు లత్యాదరంబున నాదరించి, యప్పుడు బలకృష్ణులు దమ యోగమాయా మహత్త్వంబున సుతలంబునకుం జని; రట్టి యెడ.** 1140

∗ బలరామ కృష్ణులను ఇలా ప్రస్తుతిస్తూ దేవకీదేవి వారితో ఇలా అన్నది. మీరు పూర్వం మృతుడై యమలోకంలో ఉన్న గురుపుత్రుణ్ణి తెచ్చి గురుదక్షిణగా సమర్పించిన మహాత్ములు. మీ ప్రభావాన్ని లోకులు వేనోళ్ల కొనియాడారు. మహానుభావులారా ! అలాగే కంసుడు సంహరించిన నాబిడ్డలను తెచ్చి నా శోకాన్ని నివారించండి'. ఇలా ప్రార్థించగా బలరామ కృష్ణులు తమ తల్లి పలికిన పలుకులు ఆలకించి తమ మాయాప్రభావంతో సుతలలోకానికి వెళ్లారు.

**మ. కనియెన్ దానవుఁ డింద్రసేనుఁడు దళత్కంజాక్షులన్ దక్షులన్**
**ఘనసారాంబుదవర్ణులన్ నిఖిలలోకైక ప్రభాపూర్ణులన్**
**దనరారన్ హలచక్రపాణులను భక్తత్రాణులన్ నిత్య శో**
**భన వర్ధిష్ణుల రామకృష్ణుల జయభ్రాజిష్ణులన్ జిష్ణులన్.** 1141

∗ సుతలలోక నివాసియైన బలిచక్రవర్తి వికసించిన పద్మాల వంటి కన్నులు గలవారినీ, భక్తులను రక్షించేవారినీ, పచ్చకర్పూరం వంటి ఆకారం గలిగి హలధరుడైన బలరాముణ్ణీ, నీలమేఘశ్యాముడై చక్రధరుడైన కృష్ణుణ్ణీ చూశాడు.

చ. కని హితకోటితో నెదురుగాఁ జనుదెంచి మనోనురాగ సం
జనిత కుతూహలుం డగుచుఁ జాఁగిలి మ్రొక్కి సమగ్ర కాంచనా
సనముల నుంచి తచ్చరణసారససేచన సర్వలోక పా
వన సలిలంబు లౌదల ధ్రువంబుగఁ దాల్చి సుభక్తి యుక్తుఁడై. 1142

* బలిచక్రవర్తి తన ఆప్తులతో బలరామ కృష్ణుల కెదురు వచ్చి వారికి స్వాగతం పలికి అత్యంతానురాగంతో వారికి పాదాభివందనం చేశాడు. వారిని సువర్ణపీఠాలపై అధివసింపజేసి వారి పాదాలు కడిగి ఆ జలాన్ని భక్తితో శిరంమీద చల్లుకొన్నాడు.

సీ. సురభి కాలాగరు హరిచందనై లాది ధూపంబు లా విశ్వరూపకులకుఁ
గాంచనపాత్ర సంగతరత్న కర్పూర దీపంబు లా జగద్దీపకులకుఁ
బాయసాపూపాన్న పక్వఫలాది నై వేద్యంబు లా వేదవేద్యులకును
దనరు వినూత్నరత్న ప్రభాభాసి తాభరణంబు లా దైత్యహరణులకును

తే. మిలమిలని మంచుతోఁ బొలుపలరు బహు వి, ధాంబరంబులు నీలపీతాంబరులకు
సలలిత కుసుమమాలికా మలయజాను, లేపనంబులు భూరినిర్లేపులకును. 1143

* బలిదానవేంద్రుడు విశ్వరూపులైన బలరామ కృష్ణులను సుగంధధూపాలతోనూ, భువనదీపకులైన వారిని కర్పూరదీపాలతోనూ, వేదవేద్యులైన వారికి పండ్లూ పాయసమూ మొదలైన నైవేద్యాలతోనూ, జగదాభరణులైన వారికి, వినూత్న రత్నాభరణాలతోనూ, నీలాంబర పీతాంబరులను పలుచని అంబరాలతోనూ అర్చించాడు.

వ. సమర్పించి య ప్పుండరీకాక్షుని చరణారవిందంబు లొత్తుచు నానందబాష్పపూరంబు తోరంబుగా రోమాంచ కంచుకిత శరీరుం డగుచుం దన గరకమలంబులు ఫాలభాగంబునం గదియించి యిట్లని స్తుతియించె. 1144

* తరువాత శ్రీకృష్ణుని పాదకమలాలను ఒత్తుతూ, అనంద బాష్పాలు స్రవిస్తుండగా, శరీరం పులకించగా చేతులు జోడించి భగవంతుడైన శ్రీకృష్ణుణ్ణి ఇలా ప్రస్తుతించాడు.

ఉ. ధీయుతుఁడై 'నమో భగవతే హరయే పరమాత్మనే ముకుం
దాయ సమస్తభక్తవరదాయ నమః పురుషోత్తమాయ కృ
ష్ణాయ మునీంద్రవంద్యచరణాయ సురారిహరాయ సాంఖ్యయో
గాయ వినీల భాస్వదలకాయ రథాంగధరాయ వేధసే,'. 1145

* పరమాత్మా ! ముకుందా ! భక్తవరదా ! పురుషోత్తమా ! మునీంద్రవంద్యచరణా ! రాక్షసప్రాణహరణా! చక్రధరా ! అని బలిచక్రవర్తి కృష్ణుణ్ణి స్తుతించాడు.

వ. అని యభినందించి యిట్లనియె. 1146

ఉ. రాజస తామసాత్ములకు రాదుగదా నినుఁ గాన నవ్య పం
కేజ దళాయతాక్ష ! మునిగేయ పవిత్రచరిత్ర ! విస్ఫుర
ద్రాజకళాధరాజ సురరాజ ముఖామర మౌళిరత్న వి
భ్రాజితపాదపీఠ ! భవబంధ విమోచన ! పద్మలోచనా ! 1147

* ఇలా ప్రార్థించి శ్రీకృష్ణునితో ఈ విధంగా అన్నాడు. 'అంబుజాక్షా ! రాజస తామస గుణాలు కల వారు నిన్ను చూడలేరు. పరమశివ బ్రహ్మేంద్రాది దేవతలు నీ పాదపద్మాలకు భక్తితో నమస్కరిస్తారు. భవబంధపాశాల్ని త్రెంచువాడవు నీవే కదా ! నీ చరిత్రము పరమపవిత్రము.

మ. మది నూహింపఁగ యోగివర్యులు భవన్మాయా లతాబద్ధులై
యిద మిత్థ' మ్మన లేరు తామసులమై యేపారు మాబోఁటి దు
ర్మదు లేరీతి నెఱుంగఁజాలుదురు ? సమ్యగ్జ్ఞానధీయుక్తి నీ
పదముల్ సేరెడి త్రోవఁ జూపి భవకూపంబుం దరింపింపవే ! 1148

* మహాయోగులు సైతం నీ మాయలకు వశులై నీవిట్టివాడ వనీ, నీ రూప మిట్టిదనీ తెలుసుకోలేరు. కాగా మావంటి తామసులూ దుర్మదులూ ని న్నెలా తెలుకోగలరు? పరిపూర్ణప్రజ్ఞామతితో నీ పాదాలు చేరు కొనే మార్గం చూపి సంసారకూపం నుంచి మ మ్ముద్ధరించు.

ఉ. వైరముచేతఁ జేదినృపవర్గముఁ, గామముచేత గోపికల్,
మీఱినభక్తి నాశ్రితులు మిమ్ము నహర్నిశమున్ మనంబులం
దారఁగనీక రూపగుణతత్పరులై మిముఁ బొందు కై వడిన్
భూరివివేక సత్త్వగుణముల్ గల దేవత లంద నేర్తురే ! 1149

* వైరంతో శిశుపాలాది రాజులూ, కామంచేత గోపికలూ, భక్తితో ఆశ్రితులూ నిన్ను నిరంతరం చింతిస్తుంటారు. వారు నీ రూప గుణాలను స్మరించుకొంటూ నిన్ను చేరుకొనే విధంగా మహాజ్ఞాను లైన దేవతలు సైతం నిన్ను అందుకోలేరు.

క. కాన భవత్పద పద్మ, ధ్యానంబునఁ గాని శాస్త్రతత్త్వంబులచేఁ
గానరు శ్రుతిసంవేద్యం, బైన భవత్పదముఁ జిన్మయాకార ! హరీ ! 1150

* ఓ కృష్ణా! నీపాదారవిందాలను నిరంతరం ధ్యానించడం వల్లనే వేదవేద్యుడవైన నిన్ను చేరుకోగలరు గాని శాస్త్రాలు వల్లెవేయటంవల్ల కాదు.

వ. దేవా ! యే నరుండైన నేమి శ్రద్ధాగరిష్ఠచిత్తుండై మిమ్ముసేవించు నట్టి మహాత్ముండు విధిచోదితం బయిన ప్రమాణంబువలన విముక్తుండై వర్తించు; నట్లు గావున యోగీశ్వరుండవైన నీ వీశితవ్యు లమైన మమ్ము నిష్పాపులం జేయు మని నుతించి మఱియు నిట్లనియె. 1151

* దేవా! ఎవడైనా సరే శ్రద్ధాతిశయంతో నిన్ను సేవిస్తే చాలు. వాడు సంసారబంధాల నుంచి విముక్తు డౌతాడు. కనుక యోగీశ్వరులకు ఈశ్వరుడవైన నీవు పాలించదగిన వారమైన మమ్మ పాపరహితులను కావించు అని నుతించి ఇంకా ఇలా అన్నాడు.

**మత్తకోకిలము:**

**'కంటి గంటి భవాబ్ధి దాఁటఁగఁ గంటి ముక్తినిధానముం**
**గంటి నీ కరుణావలోకముఁ గంటి బాపము వీడ ము**
**క్కంటి తామరచూలియుం బొడఁ గాన నట్టి మహాత్మ ! నా**
**యింటికిం జనుదెంచి తీశ్వర ! యేఁ గృతార్థతఁ బొందితిన్. 1152**

* సంసారసాగరాన్ని దాటగలిగాను. ముక్తిసాధనాన్ని చూడగలిగాను. నీ కరుణాదృష్టికి పాత్రుడ నయ్యాను. నా పాపం అంతరించింది. శివ బ్రహ్మలకు సైతం కానరాని మహాత్మా ! నీవు నా మందిరానికి విచ్చేశావు. నేను ధన్యుణ్ణయ్యాను.

**వ. దేవా ! యేను భవద్దాసుండ ! నేది పంచినం జేయుదు; నిచ్చటికి మీరలు విజయంబు చేసిన కార్యం బానతీయ వలయు' నని కరంబులు మొగిచి, విన్నవించినం బుండరీకాక్షుం డతని వాక్యంబులకు సంతసిల్లి యిట్లనియె. 1153**

* స్వామీ ! నేను నీ దాసుణ్ణి. నీ ఆజ్ఞకు బద్ధుణ్ణి. మీరిక్కడికి వచ్చిన పని ఏమిటో తెలపండి అని బలిచక్రవర్తి చేతులు ముకుళించి భక్తితో విన్నవించాడు. కృష్ణుడు సంతోషించి దానవేంద్రునితో ఇలా అన్నాడు.

**సీ. 'బలిదైత్య ! విను మున్ను ప్రథమయుగంబున నా మరీచికి భార్యయైన వర్ష**
**యను నింతివలన నందను లార్వు రుద్భవ మైరి వా రొక్కనాఁ డబ్జభవుఁడు**
**తనపుత్త్రిపై మోహమునఁ గూడి రతికేళి యొనరింప వీరు నవ్వుటయుఁ గ్రోధ**
**మంది 'యాసురయోనియందుఁ బుట్టుం' డని ఘనశాప మిచ్చె న వ్వనజజుండు.**

**తే. త న్నిమిత్తమునను వారు దగిలి హేమ, కశిపునకుఁ బుట్టి రంత నాకౌకసులకు**
**నొదవ వీరలఁ దెచ్చి య య్యోగమాయ, యడరి దేవకిగర్భమునందుఁ జొనుప. 1154**

* బలిదైత్యేంద్రా ! పూర్వం అదియుగంలో మరీచి భార్య యైన వర్ష అనే స్త్రీకి ఆర్గురు తనయులు పుట్టారు. ఒకనాడు బ్రహ్మ తన పుత్రికనే కామించి శృంగారక్రీడకు ఉపక్రమించటం చూచి వారు పరిహసించారు. బ్రహ్మ ఆగ్రహించి రాక్షసులుగా జన్మించండని వారిని శపించాడు. శాపఫలితంగా వారు హిరణ్యకశిపునికి కొడుకులై పుట్టారు. తరువాత దేవతల హితంకోరి యోగమాయ వారిని దేవకి గర్భంలోనికి ప్రవేశింపజేసింది.

**క. దొరఁకొని కంసుఁడు దోడ్తోఁ, బొరిగొనెఁ దత్పుత్త్రశోకమునఁ దన చిత్తం**
**బెరియఁగ దేవకి వారల, దరిసింపఁగఁ గోరి పనుపఁ దగ నసురేంద్రా ! 1155**

* దేవకీదేవి వారిని ప్రసవించినంతనే నృశంసుడై కంసుడు ఆ శిశువులను చంపివేశాడు. ఇప్పుడు మా అమ్మఅయిన దేవకీదేవి పుత్రశోకంతో కుమిలిపోతూ వారిని చూడాలని కోరింది. ఆమె పంపగా మేము ఇచ్చటికి వచ్చాము.

క. వచ్చితిమి వారిఁ గ్రమ్మఱఁ దెచ్చెద మని తల్లి కోర్కిఁ దీర్పఁగ నిపు డే
మిచ్చటికిని నీకడఁ బొర, పొచ్చెము లేకున్నవారె పో వీ రనఘా ! 1156

* ఓ పుణ్యాత్మా ! ఆమె కోరిక తీరుస్తామని మాట ఇచ్చాము. ఇప్పుడు ఇక్కడ నీదగ్గర సుఖంగా ఉన్న వీరే ఆమె పుత్రులు.

క. వీరలఁ దోకొని యిపుడే, ధారుణికి న్నేగి జనని తాపము వాపన్
వీరలు నంతట శాపముఁ, దీఱి మదీయ ప్రసాదధీయుతు లగుచున్. 1157

* వీరిని తోడ్కొనిపోయి భూలోకంలో ఉన్న మాతల్లిశోకాన్ని పోగొడ్తాము. అంతటితో వీరూ శాపవిముక్తు లౌతారు.

క. పొలుపుగ సుగతిం బొందఁగఁ, గల' రని హరి యానతిచ్చి కరుణాన్వితుఁడై
బలిచే ననుమతిఁ గొని వా, రలఁ దోకొని వచ్చె ని ద్ధరామండలికిన్. 1158

* తరువాత నా అనుగ్రహంవల్ల వీరికి సుగతి ప్రాప్తిస్తుంది. ఈ విధంగా పలికి కరుణామయుడైన కృష్ణుడు బలిచక్రవర్తి అనుమతితో దేవకీతనయులను తోడ్కొని భూలోకానికి వచ్చాడు.

వ. అట్లు వారలం దోడితెచ్చి తల్లి కిట్లనియె. 1159

క. 'కనుఁగొనుము వీరె నీ నం, దను' లని జనయిత్రికడ ముదంబున వారి
న్ననిచిన న ద్దేవకియును, ఘనపుత్ర స్నేహ మోహకలితాత్మకయై. 1160

* అలా ఆ శిశువులను తీసుకొని వచ్చి అమ్మా ! ఇరుగో వీరే నీ బిడ్డలు ! చూడుమని బలరామ కృష్ణులు దేవకీదేవితో పలికారు. ఆమెలో పుత్రవాత్సల్యం పొంగి పొరలింది.

క. చన్నులు దిగ్గనఁ జేపఁగఁ, గన్నుల నానందబాష్పకణములు దొరఁగఁ
గ్రన్నన కౌఁగిట నిడి నను, గన్నన్నలు వచ్చి రనుచుఁ గౌతుక మొప్పన్. 1161

* ఆ మాతృమూర్తి చన్నులు చేపగా కన్నుల్లో ఆనందాశ్రువులు స్రవించగా వారిని కౌగిలించికొని 'నాకన్న బిడ్డలు వచ్చారా' అని లాలించింది.

వ. అట్లు కౌఁగిటం జేర్చి నిజాంకపీఠంబున నునిచి, శిరంబులు మూర్కొని, చిబుకంబులు పుణుకుచుం బ్రేమాతిశయమున మేనం బులక లొలయం జన్నిచ్చిన, వారును వైష్ణవ మాయామోహితులై స్తన్యపానంబు సేయుచు భగవంతుడయిన రథాంగపాణి యంగసంగంబున విగతకల్మషులై విధిశాపసాగరంబు హరిదయాకటాక్షంబను నావచేతం దరించి నిజస్వరూపంబులు ధరించి, కృష్ణునకుఁ దలిదండ్రులకు వందనం బాచరించి గగనపథంబున నిజస్థానంబున కరిగి రంత దేవకీదేవి తన మనంబున. 1162

* దేవకీదేవి తన చిన్నారి తనయులను ఆలింగనం చేసుకొని ఒడిలో కూర్చోబెట్టుకొంది. వారి శిరస్సులు ఆఘ్రాణించి, ప్రేమతో వారికి చన్నిచ్చింది. వారు వైష్ణవప్రభావంచేత మాయావశులై తల్లి పాలు త్రాగారు. శ్రీకృష్ణుని స్పర్శవల్ల బ్రహ్మశాప మనే సాగరాన్ని భగవంతుని దయ అనే పడవ సహాయంతో దాటి స్వస్వరూపాలు ధరించి తమ తమ స్థానాలు చేరుకున్నారు.

**క. చచ్చిన బాలురఁ గ్రమ్మఱఁ, దెచ్చుట గడుఁ జిత్ర మనుచు దేవకి మదిలో**
**నచ్చెరువడి 'యిది యంతయు, నచ్చపు హరిమాయ గాక !' యని తలఁచె నృపా ! 1163**

* ఓ రాజా ! మరణించిన పుత్రులను మళ్ళీ తేవడం చిత్రమని దేవకి ఆశ్చర్యపడి 'ఇదంతా శ్రీకృష్ణుని మాయామహత్త్వమే' అని భావించింది.

**క. పరమాత్ముఁ డఖిల జగదీ, శ్వరుఁ డగు కృష్ణుండు సేయు సత్కృత్యంబుల్**
**పరికింప నెన్నఁ బెక్కులు, ధరణీవర !' యనిన రాజు తా ముని కనియెన్. 1164**

* ఓ రాజా ! పరమాత్ముడూ, సమస్త లోకాధినాథుడూ అయిన శ్రీకృష్ణుని సత్కార్యాలు ఇంకా ఎన్నో ఉన్నాయి - అని శుకమహర్షి తెలుపగా ఆయనతో పరీక్షిత్తు ఇలా అన్నాడు.

## -: సుభద్రా పరిణయము :-

**సీ. మునినాథ! పార్థుండు వనజనాభుని సహోదరి సుభద్రను నే విధమునఁ బెండ్లి**
**యయ్యెను నా విధం బంతయు నాకును దెలియంగ నెఱిఁగింపు ధీవిశాల !**
**యనవుడు నా వ్యాసతనయుఁ డాతనిఁ జూచి 'వినవయ్య ! నృప ! దేవవిభుని సుతుఁడు**
**మును తీర్థయాత్రా సముత్సుకుండై చని రమణఁ బ్రభాసతీర్థమున నుండి**

**తే. యా తలోదరితోడి నెయ్యంబు కలిమిఁ, జూడఁ గోరుచు రాముఁడు సుందరాంగిఁ**
**గౌరవేంద్రున కీ సమకట్టె ననుచుఁ, దనకు నెఱుఁగ రా నా పురందరసుతుండు. 1165**

* ఓ మునీంద్రా ! అర్జునుడు శ్రీకృష్ణుని చెల్లెలు సుభద్రను పరిణయమాడిన విధం నాకు సవిస్తరంగా తెలపండి. ఇలా అడిగిన పరీక్షిత్తుకు శుకమహర్షి సుభద్రా పరిణయ వృత్తాంతాన్ని ఇలా వివరించాడు. "ఓ మహారాజా! అర్జునుడు పూర్వం తీర్థయాత్రలకై బయలుదేరి ప్రభాసతీర్థం చేరుకున్నాడు. సుభద్రమీద తనకున్న ప్రేమాతిశయంవల్ల ఆమెను చూడాలని అతని మనస్సు తహతహలాడింది. బలరాముడు సుభద్రను దుర్యోధనున కిచ్చి వివాహం చేయాలనుకుంటున్న విషయంకూడా అర్జునుడు విన్నాడు.

**వ. అట్లు సుభద్రా దర్శనోత్సాహంబు దన మనంబున సందడిగొనం, ద్రిదండివేషంబు ధరియించి, ద్వారకాపురంబునకుం జనుదెంచి, య ప్పౌరజనంబులు భక్తిస్నేహంబుల ననిశంబుఁ బూజింపం దన మనోరథసిద్ధి యగు నంతకుం గనిపెట్టుకొని, వానకాలంబు సనునంతకు న ప్పట్టణంబున నుండు సమయంబున. 1166**

* సుభద్రను చూడాలనే ఉబలాటం అర్జునునికి మిక్కుటమైంది. అతడు సన్న్యాసివేషం ధరించి ద్వారకలో ప్రవేశించాడు. అక్కడి పౌరులు తన్ను సేవిస్తుండగా తన సంకల్పం సఫలం చేసుకోటం కోసం వర్షాకాలం దాటిపోయేంత వరకూ ఆ పట్టణంలోనే కనిపెట్టు కొని ఉన్నాడు.

**క. రాముఁడు తత్కపటాకృతిఁ, దా మదిఁ దెలియంగలేక దగ నొకనాఁ డా**
**భూమీవర తాపసుఁ బో, రామిఁ గని యాత్మమందిరమునకుఁ దెచ్చెన్. 1167**

* అర్జునుడు ద్వారకలోనే ఉన్నాడు. కాని బలరామునికి అర్జునుని కపటవేషం తెలియదు. అతడు అర్జునుణ్ణి సత్యమైన సన్న్యాసిగా భావించి తన మందిరానికి తోడ్కొని వచ్చాడు.

**ఆ. తెచ్చి భిక్షసేయ దేవేంద్ర తనయుండు, గుడుచుచుండి యచటఁ గోరి మెలఁగు**
**నసమబాణు మోహనాస్త్రంబు కై వడి, వీరమోహి నన విహారలీల. 1168**

* బలరాముడు భక్తితో కపటసన్న్యాసియైన అర్జునునికి భిక్ష సమర్పించటంకోసం ఆహ్వానించి అర్చించాడు. ఆ మాయా తాపసి అక్కడే ఆరగిస్తూ ఉన్నాడు. అర్జునుని సమక్షంలో మన్మథుని సమ్మోహనాస్త్రం లాగున సుభద్ర విహరిస్తున్నది.

**వ. అట్లు సుభద్ర విహరించుచున్న సమయంబున. 1169**

**చ. జలరుహపత్త్రనేత్రు ననుసంభవ చారువధూలలామ స**
**ల్లలిత విహార విభ్రమ విలాసము లాత్మకు విందు సేయ న**
**బ్బలరిపు నందనుండు గని భావజ సాయక బాధ్యమాన వి**
**హ్వలహృదయాబ్జుఁడై నిలిపె నత్తరుణీమణియందుఁ జిత్తమున్. 1170**

* ఈ విధంగా తన సమీపంలో సంచరించుతున్న శ్రీకృష్ణుని చెల్లెలైన సుభద్ర సుందర సుకుమార వయో రూప విలాసాలు తన చిత్తానికి హత్తుకోగా అర్జునుడు మన్మథబాణాలకు గురియై ఆ తలోదరిమీద తన హృదయాన్ని లగ్నం చేశాడు.

**ఉ. ఆ తరుణీశిరోమణియు నర్జును నర్జునచారుకీర్తి వి**
**ఖ్యాతుని నింద్రనందను నకల్మషమానసుఁ గామినీ మనో**
**జాతునిఁ జూచి పుష్పశర సాయక జర్జరితాంతరంగయై**
**భీతిలి యుండె సిగ్గు మురిపెంబును మోహముఁ దేఱు చూపులన్. 1171**

* విశాల యశోవిరాజితుడూ, విమలహృదయుడూ, మానినీ మనోహరుడూ అయిన అర్జునుణ్ణి చూచి సుభద్ర ప్రణయభార పరతంత్ర అయింది. తనలో సిగ్గూ, మురిపెమూ, మోహమూ ఎక్కువ కాగా ఆ తరుణీమణి మరుని శరపరంపరకు లోనై కలవరపడింది.

**వ. అట్లా నృపసత్తమ మత్తకాశిను లొండొరుల చిత్తంబులు చిత్తజాయత్తంబులై కోర్కులు దత్తరింపం దాల్మిలు వీడ సిగ్గునం జిట్టు ముట్టాడుచున్నయంత నొక్కనాఁడు దేవతా మహోత్సవ నిమిత్తం**

**బత్తలోదరి పురంబు వెలుపలికి నరుగుదెంచిన నర్జునుండు గృష్ణ దేవకీ వసుదేవుల యనుమతంబు వడసి తోడనం దానును చని యప్పుడు. 1172**

* ఈ విధంగా సుభద్రార్జునులు పరస్పరం ప్రగాఢంగా ప్రేమించుకున్నారు. అంతకంతకూ వారిలో అభిలాషలు అధికమైనాయి. అనురాగాలు అతిశయించాయి. ఆపుకోలేని హృదయాలతో క్రిందుమీదవుతున్నారు. ఇలా ఉండగా ఒకనాడు దేవతామహోత్సవానికి సుభద్ర నగరం వెలుపలికి వచ్చింది. అర్జునుడు కృష్ణుని అంగీకారంతో దేవకీ వసుదేవుల అనుమతితో సుభద్రను అనుసరించాడు.

**సీ. సాంద్రశరచ్చంద్ర చంద్రికా స్ఫూర్తిచే రాజిల్లు పూర్ణిమారజనివోలెఁ**
**బూర్ణేందు బింబావతీర్ణమై యిలమీఁద, భాసిల్లు హరిణ డింభంబుఁబోలె**
**సులలిత మేఘమండలమును నెడఁబాసి వసుధఁ గ్రుమ్మరు తటిద్వల్లి వోలె**
**మాణిక్య రచిత సన్మహిత చైతన్యంబు వొందిన పుత్తడిబొమ్మవోలె**

**తే. లలిత విభ్రమ రుచి కళాలక్షణములఁ, బొసఁగ రూపైన శృంగారరసముఁబోలె**
**నర్థిఁ జరియించుచున్న పద్మాయతాక్షిఁ, బ్రకటసద్గుణభద్ర సుభద్రఁ జూచి. 1173**

* శరత్కాలంలో పండువెన్నెలతో నిండి ఉన్న పున్నమరాత్రి లాగా, నిండుచంద్రమండలం నుంచి నేలకు దిగివచ్చిన లేడిపిల్ల చందాన, మేఘమండలాన్ని వదలి మేదిని మీద విహరించే మెఱపు తీగ విధంగా నవరత్నదీప్తులతో నూతనచైతన్యం సంతరించుకొన్న బంగారు బొమ్మవలె, హావభావ విలాసాలతో రూపుదాల్చిన శృంగార రసం మాదిరిగా విహరిస్తున్న సుభద్రను అర్జునుడు చూచాడు.

**వ. అప్పుడు డాయం జని యరదంబుపై నిడుకొని పోవుచుండం గనుంగొని యదుబలంబులు మదంబున నంటం దాఁకిన, నప్పు డయ్యాఖండల నందనుండు ప్రచండగాండీవ కోదండ నిర్ముక్త కాండంబులం దూలించి, యఖండ బాహుదండ విజయప్రకాండుండై ఖాండవప్రస్థ పురంబున కరిగె; నట బలభద్రుం డవ్వార్త విని విలయ సమయ సమీర సఖునికైవడిం బటురోష భీషణాకారుండై క్రోధించినం గని కృష్ణుం డాదిగాఁ గల బంధుజనంబు లతని చరణంబులకుం బ్రణమిల్లి మృదుమధుర భాషణంబుల ననునయించి యొడంబడునట్లుగా నాడిన నతండును సంతుష్టుం డయి మనంబునఁ గలంకదేఱె యప్పుడు. 1174**

* చూచిన వెంటనే అర్జునుడు సుభద్రను సమీపించి ఆమెను రథంమీద కూర్చుండబెట్టుకొని తీసుకుపో సాగాడు. అది చూచి యదువీరులు అతణ్ణి ఎదుర్కొన్నారు. అర్జునుడు తన గాండీవాన్ని ఎక్కుపెట్టి నిశిత శరపరంపరలతో వారిని నిగ్రహించి ఇంద్రప్రస్థానికి చేరుకున్నాడు. బలరాముని కీ వార్త తెలిసింది. ప్రళయకాల వీతిహోత్రునిలా ఆగ్రహోదగ్రుడై మండిపడ్డాడు. శ్రీకృష్ణుడు మొదలైన ఆత్మబంధువు లాతని పాదాలకు నమస్కరించి మృదుమధుర వచనాలతో అనునయించి సుభద్రార్జునుల పరిణయానికి అంగీకరించే లాగు చేశారు. బలరాముడు కోపం మానుకొని ప్రసన్నుడైనాడు.

క. కరులం దేరుల నుత్తమ, హరులన్ మణి హేమభూషణాంబరభృత్యో
త్కర దాసికాజనంబుల, నరణంబుగ నిచ్చి పంపె ననుజకుఁ బ్రీతిన్. 1175

* ఏనుగులనూ, రథాలనూ, మేలుజాతి అశ్వాలనూ, రత్నఖచితాలైన బంగారు ఆభరణాలనూ, దాస దాసీజనాన్నీ అరణంగా బలరాముడు సుభద్రకు పంపాడు.

వ. ఇట్లు కృష్ణున కభిమతంబుగా నర్జున సుభద్రల కరణం బిచ్చి పంపెనని చెప్పి శుకయోగీంద్రుండు మఱియు నిట్లనియె. 1176

* ఈ విధంగా బలరాముడు శ్రీకృష్ణుని అభిలాష కనుగుణంగా సుభద్రార్జునులకు అరణం ఇచ్చి పంపాడని శుకమహర్షి పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు.

## -: శ్రీకృష్ణుండు ఋషిసమేతుండయి మిథిలానగరమునకుఁ బోవుట :-

సీ. నరనాథ ! విను భువన ప్రసిద్ధంబుగ దీపించునట్టి విదేహదేశ
మందు భూకాంతకు నాననదర్పణం బనఁ దనర్చిన మిథి లను పురమునఁ
గలఁడు శ్రీహరిపాదకంజాత భక్తుండు గళితరాగాది వికారుఁ డమల
చరితుఁ డక్రోధుండు శాంతుండు నిగమార్థ కోవిదుం డగు శ్రుతదేవుఁ డనెడి

తే. భూసురోత్తముఁ డొకఁ డనిచ్చా సమాగ, తంబు తుషమైన హేమ శైలంబు గాఁగఁ
దలఁచి పరితోష మందుచుఁ దగ గృహస్థ, ధర్మమున నుండె సముచితకర్ముఁ డగుచు. 1177

* ఓ మహారాజా ! లోకప్రసిద్ధమైన విదేహదేశంలో భూదేవి ముఖానికి తళుకుటద్దంవంటి మిథిలానగరం ఉంది. ఆనగరంలో శ్రుత దేవుడనే భూసురు డుండేవాడు. అతడు హరిభక్తుడు. రాగాది వికారాలు లేనివాడు. నిర్మలచరిత్ర కలవాడు. కోపమంటే ఏమిటో తెలియనివాడు. శాంతస్వభావుడు. వేదార్థాలు తెలిసినవాడు. అతడు తనంత తానుగా ప్రాప్తించింది లేశమైనా దాన్ని మేరుపర్వతమంతగా భావించి సంతృప్తి చెందేవాడు, శ్రుతదేవుడు నిత్యమూ విధ్యుక్త కర్మలను నిర్వహిస్తూ గృహస్థధర్మాన్ని పాలిస్తూ ఉండేవాడు.

ఉ. ఆ పురి నేలువాఁడు బహుళాశ్వుఁడు నా నుతి కెక్కినట్టి ధా
త్రీపతి యా ధరామరునిరీతిని నిష్కలుషాంతరంగుఁడై
యే పనులందు ధర్మగతి నేమఱఁ కర్థిఁ జరించుచుండె ల
క్ష్మీపతి వారిపైఁ గరుణఁ జేసి ప్రసన్న ముఖాంబుజాతుఁడై. 1178

* బహుళాశ్వుడనే నామాంతరం గల జనకుడు ఆ నగరానికి రాజు. అతడు శ్రుతదేవునిలాగ నిర్మలాంతరంగుడై, ఏ పని చేసినా ధర్మాన్ని విస్మరించకుండా జీవిస్తూ వచ్చాడు. శ్రీకృష్ణునికి వారిద్దరి మీద అనుగ్రహం కలిగింది.

వ. అట్లు కృష్ణుండు వారల జూచువేడ్క నిజ స్యందనారూఢుండై, నారద వామదేవాత్రి కృష్ణరా మాసి తారుణ దివిజగురు కణ్వ మైత్రేయచ్యవనులును, నేనును మొదలైన మును లనుగమింపం జనుచుఁ

**దత్తద్దేశ నివాసులగు నానర్తక ధన్వ కురు జాంగల వంగ మత్స్య పాంచాల కుంతి మధు కేకయ కోసలాది భూవరులు, వివిధ వస్తుప్రచయంబులు గానిక లిచ్చి సేవింప, గ్రహమధ్యగతుండై దీపించు సూర్యునిం బోలి, య ప్పుండరీకాక్షుండు మందస్మిత సుందరవదనారవిందుం డగుచు వారలం గరుణార్ద్రదృష్టిం జూచి, యోగక్షేమంబు లరసి, సాదర భాషణంబుల నాదరించుచుఁ, గతిపయ ప్రయాణంబులం జని చని విదేహనగరంబు డాయం జనుటయు, నా బహుళాశ్వుండు న మ్మాధవు రాక విని మనంబున హర్షించుచు వివిధ పదార్థంబులు గానికలుగాఁ గొని, తానును శ్రుతదేవుండును నెదురుగాఁ జనుదెంచి యప్పుడు. 1179**

* బహుళాశ్వ శ్రుతదేవులను చూడాలన్న ఉత్సాహంతో శ్రీకృష్ణుడు రథాన్ని అధిరోహించి ద్వారకనుంచి మిథిలానగరానికి బయలుదేరాడు. అతని వెంట వాసుదేవ, అత్రి, కృష్ణరామ, అసిత, అరుణ, బృహస్పతి, కణ్వ, మైత్రేయ, చ్యవనులూ మరి కొందరు మునులూ వెళ్ళారు. వారిలో నేనూ ఉన్నాను. మార్గంలో ఆనర్త కురు, ధన్వ, జాంగల, వంగ మత్స్య, పాంచాల, కుంతి,మధు, కేకయ, కోసలాది ప్రభువులు కృష్ణునికి నానా విధాలైన కానుకలిచ్చి సేవించారు. గ్రహాలనడుమ ప్రకాశించే సూర్యునిలాగ కృష్ణుడు మందహాసం చేస్తూ వారందరిపై కరుణార్ద్రదృష్టులను ప్రసరింపజేస్తూ వారి క్షేమాన్ని తెలుసుకొన్నాడు. వారితో ఆప్యాయంగా మాట్లాడాడు. ఆ తర్వాత కొన్నాళ్ళు ప్రయాణం చేసి విదేహనగరాన్ని సమీపించాడు. శ్రీకృష్ణుడు వస్తున్నాడని తెలుసుకొని బహుళాశ్వుడు చాలా ఆనందించాడు. వివిధ పదార్థాలను తీసుకొని అతడు శ్రుతదేవునితోపాటు శ్రీకృష్ణుని కెదురుగా వెళ్లాడు.

**ఉ. ఆ మునికోటికిన్ వినయ మారఁగ వందన మాచరించి, యా
తామరసాభలోచనుఁ డుదారచరిత్రుఁడు పాపగోత్ర సు
త్రాముఁడు భక్తలోకశుభదాయకుఁడైన రమేశు సద్గుణ
స్తోముని పాదపద్మములు సోఁకఁగ మ్రొక్కి వినమ్రులై తగన్. 1180**

* వా రిద్దరూ వచ్చిన మునీంద్రు లందరికి వినయంతో నమస్కరించారు. పద్మాక్షుడూ, ఉదార చరిత్రుడూ, పాపాలనే పర్వతాలకు ఇంద్రునివంటివాడూ, భక్తులకు శుభాలను కలిగించేవాడూ, సద్గుణాలకు నిలయుడూ అయిన శ్రీకృష్ణుని పాదపద్మాలకు వినమ్రులై ప్రణామాలు చేశారు.

**చ. కరములు మోడ్చి యో పరమకారుణికోత్తమ! నీవు నీ మునీ
శ్వరులును మద్గృహంబునకు వచ్చి మముం గృప సేసి యిచ్చటం
గర మనురక్తిఁ బూజనలు గైకొనుఁడంచు నుతించి వేఁడ నా
హరి మనమందు వారివినయంబుల కెంతొ ప్రమోదమందుచున్. 1181**

* బహుళాశ్వ కృతదేవులు చేతులు జోడించి కృష్ణుణ్ణి చూచి ‘ఓ దయాసాగరా ! నీవూ, ఈ మునీశ్వరులూ మా గృహానికి వచ్చి మమ్ము అనుగ్రహించాలి. మా పూజలు మీరు స్వీకరించాలి’ అని ప్రార్థించారు. వారి వినయస్వభావానికి శ్రీకృష్ణుడు చాలా సంతోషించాడు.

చ. తిరముగ వారియిష్టములు దీర్పఁదలంచి మురాసురారి యొం
డొరుల కెఱుంగకుండ మునియూథముఁ దానును నేఁగె వారి మం
దిరముల కేకకాలమున ధీరత నా ధరణీవరుండు వా
రిరుహ దళాయతాక్షు మునిబృందములం గనకాసనంబులన్. 1182

* కృష్ణుడు వారి అభీష్టాన్ని నెరవేర్చాలనుకొన్నాడు. ఒకే సమయంలో ఒకరికి తెలియకుండా మరొ కరి ఇంటికి కృష్ణుడు మునులతో పాటు వెళ్లాడు. బహుళాశ్వుడు కృష్ణుణ్ణి మునిసమూహాన్ని కనకా సనాలపై కూర్చుండబెట్టాడు.

సీ. కూర్చుండ నియమించి కొమరారు కాంచన కలధౌత కలశోదకములచేతఁ
బాదముల్ గడిగి తత్పావన జలములు దానును సతియు బాంధవజనంబుఁ
గర మర్థి నిజమస్తకంబుల ధరియించి వివిధార్చనములు సద్విధి నొనర్చి
మణిభూషణాంబర మాల్యానులేపన రాజిత ధూప నీరాజనములు

తే. భక్తిఁ గావించి పరిమృష్ట బహు విధాన్న పాయసాపూప పరిపక్వఫలము లోలి
నారగింపఁగఁ జేసి కర్పూరమిళిత లలిత తాంబూలములు నెయ్య మలర నొసఁగె. 1183

* బహుళాశ్వుడు బంగారు, వెండి కలశాలలోని జలాలతో వారి పాదాలను కడిగాడు. ఆ పవిత్రతీర్థాన్ని తానూ, తన భార్యా, బంధువులూ భక్తితో తమ శిరస్సులమీద చల్లుకొన్నారు. బహుళాశ్వుడు వారిని శాస్త్రోక్తం గా పూజించాడు. మణిభూషణాలూ, వస్త్రాలూ, హారాలూ, సుగంధలేపనాలూ వారికి సమర్పించాడు.భక్తి తో హారతు లిచ్చాడు. తరువాత షడ్రసోపేతంగా భోజనం పెట్టి, మధుర ఫలాలను అర్పించి పచ్చ కర్పూరంతో కూడిన తాంబూలాన్ని ప్రేమతో ఇచ్చాడు.

వ. ఇట్లు సమర్పించి యనంతరంబ య మ్మిథిలేశ్వరుండైన జనకుండు వరమానందంబును బొంది.1184

చ. హరిపదపద్మ యుగ్మము నిజాంకతలంబునఁ జేర్చి యొత్తుచుం
బురుషవరేణ్య ! యీ నిఖిలభూతగణావలి యాత్మలందు సు
స్థిరమతిఁ గర్మసాక్షివి సుధీవర! నీ పదబుక్తకోటితో
నరయ నుమాధినాథ చతురాస్యులుఁ బోల రటందు వెప్పుడున్. 1185

* ఈవిధంగా కృష్ణుణ్ణి గౌరవించి మిథిలానాథుడైన ఆ జనక చక్రవర్తి కృష్ణుని పాదాలను తన ఒడిలో ఉంచుకొని మెత్తగా ఒత్తుతూ అతనితో ఇలా అన్నాడు. 'పురుషోత్తమా! సమస్త ప్రాణుల ఆత్మల్లో కర్మసాక్షివై నీ వున్నావు. పరమశివ చతుర్ముఖు లయినా నీ భక్తులకు సాటిరారని నీవంటూ వుంటావు.

వ. అట్టి లోకవిదితం బయిన భవద్వాక్యంబు నిక్కంబుగా భవదీయ పాదారవిందంబులందు నొకానొకవేళ లేశమాత్రధ్యానంబు గల నా గృహంబున కకించనుండని చిత్తంబునం దలంపక భక్తవత్సలుండ వగుటంజేసి విజయం చేసితివి; భవత్పాదపంకేరుహ ధ్యానసేవారతిం దగిలిన మహాత్ములు

**త్వద్ధ్యానంబు వదలం జాలుదురే? నిరంతరంబును శాంతచిత్తులై నిష్కించనులై యోగీంద్రులై నీ వలనం గోరిక గలవారలకు నిన్నైన నిత్తువు గదా! యని వెండియు నిట్లనియె. 1186**

* అట్టి నీ మాట సార్థకమయ్యేలాగా నీ పాదపద్మాలమీద ఏదో రవంత భక్తి గల నన్ను దరిద్రుడని అనుకోకుండా నా యింటికి వచ్చావు. నీ భక్తవాత్సల్యాని కిది నిదర్శనం. నీ పాదసేవలో ఆనందించే మహాత్ములు దాన్ని వదలలేరు. ఎప్పుడూ శాంతస్వభావులై నిష్కాములై నిన్ను నీయందు భక్తిగల యోగిశ్రేష్ఠులకు నిన్ను నీవే సమర్పించుకొంటావు'. ఈ విధంగా పలికి బహుళాశ్వుడు మరీ ఇలా అన్నాడు.

**తే. కృష్ణ ! పరమాత్మ ! యదుకుల క్షీరవార్ధి, పూర్ణచంద్రమ ! దేవకీపుత్ర! సుజన**
**వినుత ! నారాయణాచ్యుత ! వేద వేద్య !, భక్తజనపోషపరితోష ! పరమపురుష ! 1187**

* కృష్ణా ! పరమపురుషా ! యదుకుల క్షీరవారాశి పూర్ణచంద్రా ! దేవకీనందనా ! అచ్యుతా ! నారాయణా ! వేదవేద్యా ! భక్త జనవత్సలుడవైన నీకు ప్రణామం.

**ఉ. శ్రీ పురుషోత్తమాఖ్య ! యదుసింహకిశోరక ! భక్తలోక ర**
**క్షా పరతంత్ర ! నీవు మునిసంఘముఁ గొన్నిదినంబు లుండవే**
**నీ పదపద్మ రేణువులు నెమ్మి మదీయగృహంబు సోఁకినం**
**దాపసవంద్య ! యే నిపుడ ధన్యుఁడ నయ్యెదఁ గాదె మాధవా ! 1188**

* ఓ పురుషోత్తమా ! నందకిశోరా ! భక్తరక్షణ పరాయణా! నీవూ ఈ మునిసమూహమూ కొన్నాళ్ళిక్కడే ఉండాలి. నీపాదధూళి నా మందిరంలో సోకితే చాలు. నేను ధన్యుణ్ణవుతాను.

**వ. అని యభ్యర్థించినం బ్రసన్నుండై య ప్పుండరీకాక్షుండు నిమికుల ప్రదీపకుండైన జనక చక్రవర్తిం గరుణించి, య మ్మిథిలా నగరంబునం బౌరజనంబులకు నున్నత శోభనంబులు గావించుచుం గొన్నిదినంబు లుండె నంత. 1189**

* బహుళాశ్వుడీ రీతిగా ప్రార్థించగా శ్రీకృష్ణుడు నిమికులావతంసుడైన ఆ జనకుని భక్తికి ప్రసన్నుడై మిథిలానగరంలో ప్రజల కానందాన్ని కలిగిస్తూ కొన్నా ళ్ళున్నాడు.

**మ. శ్రుతదేవుండును మోదియై మునిజనస్తోమంబుతో నిందిరా**
**పతిఁ దోకొంచు నిజాలయంబునకు నొప్ప న్నేగి యచ్చోట స**
**మ్మతి దర్భాస్తరణంబుల న్నునిచి సమ్యగ్జ్ఞానపారీణుఁడై**
**సతియుం దానుఁ బదాబ్జముల్ గడిగి చంచద్భక్తిఁ దత్తోయముల్. 1190**

* ఇదేవిధంగా శ్రుతదేవుడుకూడ పరమానందంతో కృష్ణుణ్ణీ, మునులనూ తన ఇంటికి తోడ్కొని వెళ్లాడు. వారికి దర్భాసనా లిచ్చి అతడూ, అతనిభార్యా వారి పాదపద్మాలను కడిగారు.

చ. శిరములఁ దాల్చి నవ్యతులసీదళ దామ కుశ ప్రసూన వి
స్ఫుర దరవింద మాలికలఁ బూజ లొనర్చి గృహాంధకూప సం
చరణుఁడ నైన నాకడకుఁ జక్రి దనంతనె వచ్చునట్టి సు
స్థిరమతి నే తపంబు మును సేసితినో ? యని సంతసించుచున్. 1191

* ఆ జలాన్ని వారు తమ శిరస్సులమీద జల్లుకొన్నారు. తులసిమాలలనూ, తామరపూలహారాలనూ వారికి సమర్పించి పూజించి 'ఈ ఇల్లనే చీకటినూతిలో పడి కొట్టుకొంటున్న నా వద్దకు కృష్ణుడు తానుగా రావటానికి నే నెట్టి తపస్సు చేశానో !' అని ఎంతో సంతోషించాడు.

తే. మఱియుఁ దత్పాదతీర్థంబు మందిరమునఁ, గలయఁ జిలికించి సంప్రీతి గడలు కొనఁగఁ
బత్ర ఫలపుష్పతోయముల్ భక్తి నొసఁగి, హరిమురాంతకమూర్తి నిజాత్మ నిలిపి. 1192

* శ్రీకృష్ణ పాదతీర్థాన్ని శ్రుతదేవుడు తన గృహం నలుమూలలా చల్లాడు. అతడు మిక్కిలిభక్తితో కృష్ణుణ్ణి తన చిత్తంలో నిలుపుకొని ఆ స్వామికి పత్ర పుష్ప ఫల జలాలను సమర్పించి అర్చించాడు.

తే. మానితంబుగ విశ్వనిదానమూర్తి, యైన కృష్ణుండు దనయింట నారగించెఁ
దన మనోరథసిద్ధియుఁ దనకు నబ్బె, ననుచుఁ బైపుట్ట మల్లార్చి యాడుచుండె. 1193

* 'విశ్వానికే మూలకారణమైన శ్రీకృష్ణుడు నా ఇంట్లో భోజనం చేశాడు. నా కోరిక ఫలించింది' అనుకొంటూ శ్రుతదేవుడు సాటిలేని ఆనందాన్ని పొంది తన ఉత్తరీయాన్ని ఆడిస్తూ చిందులు త్రొక్కాడు.

చ. తరుణియుఁ దానుఁ బుత్రులుఁ బదంపడి కృష్ణు భజించుచుండ త
చ్చరణము లంకపీఠమునఁ జాఁచిన మెల్లన యొత్తుచున్ రమా
వరుఁ గని పల్కె భక్తజనవత్సల! మామకభాగ్య మెట్టిదో
హర చతురాస్యులు న్నెఱుఁగ నట్టి నినుం గనుగొంటి నెమ్మితోన్. 1194

* శ్రుతదేవుడూ, అతని భార్యాపుత్రులూ కృష్ణుణ్ణి స్తుతించారు. అనంతరం కృష్ణుని పాదాలను బడిలో చేర్చుకొని ఒత్తుతూ శ్రుతదేవుడు ఇలా అన్నాడు. 'భక్తవత్సలా! నా భాగ్య మెట్టిదో కాని శివ చతుర్ముఖులు చూడలేని నిన్ను చూడగలిగాను.

క. ముని యోగిమానస స్ఫుట, వనజంబుల నెల్లప్రొద్దు వర్తించు భవ
ద్ఘనదివ్యమూర్తి నా లోఁ, చనగోచర మయ్యెఁగాదె ! సర్వాత్మ ! హరీ ! 1195

* ఓ సర్వాంతర్యామీ! స్వామీ ! మునీంద్రుల యోగిశ్రేష్ఠుల హృదయపద్మాలలో నిరంతరం నివసించే నీ దివ్యమంగళ రూపం నా కనులకు గోచరమైంది.

వ. దేవా! నీ సచ్చరితంబులు గర్ణరసాయనంబులుగా నాకర్ణించుచు, నీకుం బూజ లొనర్చుచు, నీ చరణారవిందంబులకు వందనంబులు సేయుచు, నీ దివ్యనామ సంకీర్తనంబులు సేయుచుం దమ

**శరీరంబులు భవదధీనంబులుగా మెలంగు నిర్మలబోధాత్ము లగువారి చిత్తంబు లను దర్పణంబులం గానంబడుచుందువు; కర్మవిక్షిప్త చిత్తులైన వారి హృదయంబుల నుండియు, దూరగుండ వగుదు; వని మఱియు నిట్లనియె.** **1196**

* దేవా ! వాసుదేవా ! నీ దివ్యగాథలను చెవుల పండువుగా వింటూ, నీకు పూజలు చేస్తూ, నీ పాద పద్మాలకు నమస్కారం ఆచరిస్తూ, నీ దివ్యనామం జపిస్తూ తమ శరీరాలు నీ అధీనాలని భావించే సుజ్ఞానుల హృదయాలనే అద్దాలలో నీవు కనిపిస్తుంటావు, కర్మపరతంత్రులైన వారి హృదయాలకు దూరమౌతావు' అని శ్రుతదేవుడు ఇంకా ఇలా అన్నాడు.

**సీ. నీకు మ్రొక్కెదఁ గృష్ణ ! నిగమాంత సంవేద్య ! లోకరక్షక ! భక్తలోక వరద !**
**నీపాదసేవనానిరతుని నన్ను నే పనిఁ బంపె దాన తిమ్మనినఁ గృష్ణుఁ**
**డెలనవ్వు మోమునఁ జెలువొంద నా విప్రు కర మాత్మకరమునఁ గదియఁ జేర్చి**
**పాటించి యతనితోఁ బలికెఁ దపశ్శక్తి వఱలిన య మ్మునివర్యు లెపుడుఁ**

**తే. దమ పదాంబుజరేణు వితానములను, దవిలి లోకంబులను బవిత్రంబు సేయు**
**వారు నను(గూడి యెప్పుడు వలయునెడల, కరుగుదెంతురు నీ భాగ్య గరిమ నిటకు.** **1197**

* కృష్ణా! నీకు నమస్కరిస్తున్నాను. వేదవేద్యా ! లోక రక్షకా ! భక్తవరదా ! నీ పాదసేవలో నిరంతరం సంచరించే నన్ను ఏ పని చేయమంటావో ఆజ్ఞాపించు - ఇలా పలుకుతున్న శ్రుతదేవుని మాటలు విని గోవిందుడు మందహాసం చేస్తూ అతని చేతిని తన చేతిలోనికి తీసికొని 'ఓ భూసురోత్తమా ! తపోధనులైన ఈ మునిశ్రేష్ఠులు తమ పాదధూళితో లోకాన్ని పవిత్రం చేస్తారు. వారు నాతో పాటు తాము కోరిన చోటికి వస్తుంటారు. ఈ అదృష్టం పండి ఈనాడు నావెంట నీ ఇంటికి విచ్చేశారు.

**వ. చనుదెంచిరి; పుణ్యస్థలంబులును విప్రులును దేవతలును సంస్పర్శన దర్శనార్చనంబులం బ్రాణులను సమస్త కిల్బిషంబులం బాయం జేయుదు; రదియునుం గాక బ్రాహ్మణుండు జనన మాత్రంబున జీవకోటియందు ఘనుండై యుండు, జపతపోధ్యానాధ్యయనాధ్యాత్మములం జతురుండై మత్కళాశ్రయుం డయ్యేనేని నతండుత్తముండై వెలుంగు; నతనిం జెప్ప నేల? యని వెండియు నిట్లనియె.** **1198**

* పుణ్యస్థలాలూ, బ్రాహ్మణులూ, దేవతలూ స్పర్శన, దర్శన అర్చనలవల్ల ప్రాణుల సమస్తపాపాలనూ నిర్మూలిస్తారు. బ్రహ్మణుడు పుట్టుకతోనే సమస్తప్రాణులలో గొప్పవా డౌతాడు. అతడు జప తపో ధ్యాన అధ్యయనాదులందు పరిపూర్ణుడై ప్రకాశిస్తాడు అని పలికి కృష్ణుడు ఇంకా ఇలా అన్నాడు.

**క. నా మది విప్రులపైఁ గల, ప్రేమము నా తనువునందుఁ బెట్టని కతనవ్**
**భూమీసురు లర్చ్యులు; నీ, వీ మునులం బూజ సేయు మిద్ధచరిత్రా!** **1199**

* ఓ పుణ్యాత్మా! నా మనస్సులో భూసురులమీద ఉన్న ప్రేమ నా శరీరంమీదకూడ లేదు. కనుక నీ వీ మునులను పూజించు.

క. ఇదియే నా కిష్టము ననుఁ, బదివేలవిధంబు లొలయ భజియించుటగా
మది కిం పగు నటు గావున, వదలని భక్తిన్ భజింపు వసుధామరులన్! 1200

* నా కిష్టమైనది కూడా అదే. బ్రాహ్మణులను పూజించితే నన్ను పదివేలుగా పూజించినట్లు భావించి సంతోషిస్తాను. కనుక సుస్థిరమైన భక్తితో భూసురులను పూజించు.

క. అని సర్వలోక విభుఁ డగు, వనజోదరుఁ డానతిచ్చు వాక్యంబుల జా
డన భూమీసురుఁ డమ్మని, జనులకు సద్భక్తిఁ బూజ సలిపెన్ వరుసన్. 1201

* సమస్త లోకాలకూ అధీశుడైన శ్రీకృష్ణుని అనుజ్ఞప్రకారం శ్రుతదేవుడు అత్యంతభక్తితో ఆ మునీశ్వరులను పూజించాడు.

చ. ఎనయఁగఁ గృష్ణుఁడంత మిథిలేశ్వరభూసురులం గృపావలో
కన మొలయ న్ననూనసుభగస్థితిఁ బొందఁగఁ జేసి వారి వీ
డ్కొని రథ మెక్కి దివ్యమునికోటియుఁ దాను వచ్చెఁ గ్రమ్మఱన్
జనవర! మోక్షదం బగు కుశస్థలికిం బ్రమదాంతరంగుఁడై! 1202

* ఈ విధంగా శ్రీకృష్ణుడు బహుళాశ్వ శ్రుతదేవులను కరుణతో కటాక్షించి వారికి శుభాల ప్రసాదించి వారి దగ్గర సెలవు తీసుకొని తేరెక్కి మునులతోపాటు మోక్షదాయకమైన ద్వారకను చేరుకున్నాడు.

## -: శ్రుతిగీతలు :-

వ. అని చెప్పిన బాదరాయణికి నభిమన్యు నందనుం డిట్లనియె; మునీంద్రా! ఘటపటాదివస్తు జాతంబు భంగి నిర్దేశింప నర్హంబు గాక, సత్త్వాదిగుణ శూన్యంబైన బ్రహ్మంబునందు సత్త్వాది గుణగోచరంబులైన వేదంబు లేక్రమంబునం బ్రవర్తించు, నట్టి చందంబు నా కెఱిఁగింపు మనిన భూవరునకు మునివరుం డిట్లనియె; 'సకల చేతనా చేతనాంతర్యామియైన సర్వేశ్వరుండు సర్వశబ్ద వాచ్యుండు గావున సకల జంతు నివహంబులందు బుద్ధీంద్రియ మనః ప్రాణ శరీరంబులను సృజియించి; చేతనవర్గంబునకు జ్ఞాన ప్రదుండగుం గావున సకల నిగమసమూహంబులును దత్స్వరూపగుణ వైభవ ప్రతిపాదకంబులు గావున ముఖ్యంబై ప్రవర్తించు; శ్రుతిస్తోత్రం బుపనిషత్తుల్యంబు; ననేక పూర్వఋషి పరంపరా యాతంబును నైన దీనిని శ్రద్ధాయుక్తుండై యెవ్వం డనుసంధించు, నతనికి మోక్షంబు సులభంబు; దీనికి నారాయణాఖ్యాతంబగు నొక్క యుపాఖ్యానంబు గలదు; వినిపింతు, వినుము; భగ వత్ప్రియుం డైన నారదుం డొక్కనాఁడు నారాయణాశ్రమంబునకుం జని ఋషి గణసమేతుండైన నారాయణఋషిం గనుంగొని నీవు న న్నడిగినట్ల యమ్మహాత్ముని నడిగిన నతండు ము న్నీ యర్థంబు శ్వేతద్వీప వాసులైన సనకసనందనాది దివ్యయోగీంద్రులు ప్రశ్న సలిపిన, వారలకు సనందనుండు చెప్పిన ప్రకారంబు నీ కెఱింగించెద' నని చెప్పం దొడంగె; శయానుండైన రాజశ్రేష్ఠునిఁ దత్పరాక్రమ దక్షతాది చిహ్నంబులను నుతియించు వందిజనంబుల చందంబున జగదవసాన సమయంబున ననేక శక్తియుతుండై యోగనిద్రా వశుండైన సర్వేశ్వరుని వేదంబులు స్తోత్రంబు సేయు విధంబు నారాయణుండు నారదునకుం జెప్పిన తెఱుంగు విను మని యిట్లనియె. 1203

* శుకమహర్షి పై రీతిగా చెప్పగా పరీక్షిత్తు ఆయనను ఘట పటాదులలాగా నిర్దేశించటానికి వీలుగాకుండా సత్త్వాది గుణశూన్యమైన బ్రహ్మంతో సత్త్వాది గుణాలకు లోబడిన వేదాలు ప్రవర్తించే విధానాన్ని చెప్పవలసిందని కోరాడు. అందులకు శుకయోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునకు ఇలా వివరించాడు - సర్వాంతర్యామియైన భగవంతుడు సమస్త చేతనవర్గానికీ జ్ఞానాన్ని ప్రసాదించేవాడు కనుక వేదాదులు ఆ పరమేశ్వరుని స్వరూప గుణ వైభవాలను స్తుతిస్తూ ఉంటాయి. అలాంటి శ్రుతిస్తోత్రం ఉపనిషత్తులతో సమానమైంది. దీన్ని శ్రద్ధాపూర్వకంగా అనుసంధించే వారికి మోక్షం సులభ మవుతుంది. పానుపుమీద పడుకుని ఉన్న రాజేంద్రుని పరాక్రమ సామర్థ్యాలను వందిమాగధులు కొనియాడే విధంగా కల్పాంత సమయంలో అనేక శక్తులతో కూడుకొని యోగనిద్రలో ఉన్న సర్వేశ్వరుణ్ణి వేదాలు స్తోత్రం చేసే పద్ధతి ఎలాంటిదో పూర్వం సనందనుడనే ముని శ్వేతద్వీపవాసులైన మునులకు విశదీకరించాడు. దాన్ని నారాయణ ముని తన వద్దకు విచ్చేసిన నారదునికి చెప్పాడు. ఆ విషయాన్ని వివరిస్తానని శుకుడు పరీక్షిన్నరేంద్రునకు ఇలా చెప్పసాగాడు.

సీ. **'జయ జయ హరి ! దేవ ! సకలజంతువులకు జ్ఞానప్రదుండవు గాన వారి**
**వలన దోషంబులు గలిగిన సుగుణ సంతానంబుగాఁ గొని జ్ఞానశక్తి**
**ముఖ్యషడ్గుణ పరిపూర్ణతఁ జేసి మా యాత్మవిశిష్టుండ వగుచుఁ గార్య**
**కారణాత్మకుఁడవై కడఁగి చరించుచు నున్న నీయందుఁ బయోరుహాక్ష !**

తే. **తివిరి యామ్నాయములు ప్రవర్తించుఁ గాన ప్రకట త్రిగుణాత్మకంబైన ప్రకృతితోడి**
**యోగ మింతయు మాన్పవే ! యోగిమాన, సాంబుజాత మధువ్రత !' యని నుతించి.** 1204

* ఓ విష్ణుదేవా ! నీకు జయమగు గాక! నీవు సకల జీవులకూ జ్ఞానాన్ని ప్రసాదించేవాడివి. ఆయా ప్రాణుల్లో ఆత్మరూపంతో నీ వుంటావు. కార్యకారణాత్మకుడవై వర్తిస్తావు. నీలోనే సకల వేదాలు ప్రవర్తిస్తాయి. సత్త్వ రజస్తమో గుణాలతో కూడిన ప్రకృతితో మా కున్న బంధాన్ని ఛేదించు.

వ. **అదియునుం గాక.** 1205

సీ. **పరమవిజ్ఞాన సంపన్నులైనట్టి యోగీంద్రులు మహితనిస్తంద్రలీలఁ**
**బరిదృశ్యమానమై భాసిల్లు ని మ్మహీపర్వత ముఖర ప్రపంచ మెల్లఁ**
**బరఁగ బ్రహ్మస్వరూపము గాఁగఁ దెలియుదు రెలమి నీవును జగద్విలయవేళ**
**నవశిష్టుఁడవు గాన ననఘ ! నీయందు నీ విపుల విశ్వోదయవిలయము లగు**

తే. **ఘట శరావాదు లగు మృద్వికారములు మృ, దాత్మకంబైన యట్లు పద్మాయతాక్ష !**
**తవిలి కారణరూపంబుఁ దాల్చి లీలఁ, గడఁగు నీయందు బుద్ధి వాక్కర్మములను.** 1206

* అంతే గాక విజ్ఞానసంపన్నులైన పరమయోగీశ్వరులు భూమీ, పర్వతాలు మొదలైన వాటితో కూడి ఉన్న ఈ ప్రపంచాన్ని బ్రహ్మస్వరూపంగానే భావిస్తారు. నీవు కూడా ప్రళయకాలంలో ఒక్కడవే మిగిలిఉంటావు.

కుండలూ, మూకుళ్లూ మొదలైన వవన్నీ మట్టితో ఏర్పడి మృత్తికారూపాలైనట్లే ఈ విశ్వంయొక్క పుట్టుకా, నాశమూ రెండున్నూ నీవల్లనే జరుగుతాయి. ఓ కమలాక్షా ! ఈ సమస్త విశ్వానికి నీవే కారణభూతుడవు.

**క. అలవడఁ జేయుచు నుందురు, బలకొని యిలఁ బెట్టఁబడిన పదవిన్యాసం**
**బులు పతనకారణముగా, నలవున సేవించుచును గృతార్థులు నగుచున్. 1207**

* విజ్ఞానసంపన్నులైన వారు మనోవాక్కాయ కర్మలను నీ యందే లగ్నంచేసి జన్మమెత్తడాన్ని పతనానికి కారణంగా గ్రహించి త్రికరణశుద్ధిగా నిన్నే సేవిస్తూ కృతార్థులవుతారు.

**క. లీలం బ్రాకృతపూరుష, కాలాదిక నిఖిలమగు జగంబుల కెల్లన్**
**మాలిన్య నివారక మగు, నీ లలితకథాసుధాబ్ధినిం గ్రుంకి తగన్. 1208**

* ప్రాకృతపురుషులకు నిలయమై కాలస్వరూపమైన ఈ ప్రపంచంలోని నిఖిల పాపాలనూ నివారించే సామర్థ్యం కల నీ మనోహర కథామృతసముద్రంలో మునిగి ధన్యులౌతారు.

**చ. భరిత నిదాఘ తప్తుఁడగు పాంథుఁడు శీతలవారిఁ గ్రుంకి దు**
**ష్కరమగు తాపముం దొఱఁగు కైవడి సంసరణోగ్రతాపమున్**
**వెరవునఁ బాయుచుండుదురు నిన్ను భజించు మహాత్మకుల్ జరా**
**మరణ మనోగుణంబులఁ గ్రమంబునఁ బాయుట సెప్ప నేటికిన్ ? 1209**

* తీవ్రమైన వేసవి ఎండచేత బాధపడే బాటసారి చన్నీళ్ళ స్నానంచేసి తన పరితాపాన్ని పోగొట్టుకొనే విధంగా నిన్ను పూజించే మహాత్ములు సంసార మనే దుర్భరతాపాన్ని నేర్పుతో తొలగించుకుంటారు. ఇక ముసలితనమూ, మరణమూ అనే వాటిని క్రమంగా పోగొట్టుకొంటారని ప్రత్యేకంగా చెప్పటం దేనికి?

**వ. అదియునుం గాక. 1210**

**సీ. అనయంబు దేహి నిత్యానిత్య సద్విలక్షణమునఁ బంచకోశ వ్యవస్థ**
**నభివృద్ధిఁ బొరయుచు నందులోపల నున్న ప్రాణాన్నబుద్ధివిజ్ఞానమయము**
**లను చతుష్కోశంబు లవ్వల వెలుఁగొందు నానందమయుఁ డీవు గాన దేవ !**
**సురుచిర స్వప్రకాశుండవు నీ పరిగ్రహము గల్గుటం జేసి కాదె ప్రకృతి**

**తే. మహదహంకార పంచతన్మాత్ర గగన, పవన తేజో ఽంబుభూ భూతపంచకాది**
**కలిత తత్త్వముల్ బ్రహ్మాండకార్య కరణ, మందు నెపుడు సమర్థంబు లగుటఁ జూడ. 1211**

* ప్రాణులు శాశ్వతమూ, అశాశ్వతమూ అనే లక్షణాలతో కూడి ప్రాణ, అన్న, బుద్ధి, విజ్ఞాన, ఆనంద మయాలనే పంచకోశాల వల్ల అభివృద్ధిపొందుతూ ఉంటాయి. ఈ పంచకోశాలలో చివరిదైన ఆనందమయ కోశానికి సంబంధించిన నీవు స్వయంప్రకాశుడవై వెలుగొందుతుంటావు. నీ అధీనంలో ఉన్నందువల్లనే కదా ఈప్రకృతీ, మహత్తూ, అహంకారమూ, పంచతన్మాత్రలైన శబ్ద స్పర్శ రూప రసగంధాలూ, పంచభూతాలైన

భూమి, నీరు, అగ్ని, వాయువు ఆకాశం మొదలైనవన్నీ ఈ సమస్త సృష్టిస్థితి లయకార్యాలను సర్వసమర్థంగా నిర్వహిస్తున్నాయి.

క. కోరి శరీరులు భవదను, సారంబున నిహపరైక సౌఖ్యంబులఁ బెం
పారఁగ నందుచు నుందురు, ధీరజనోత్తము లనంగ దివిజారిహరా ! 1212

* ఓ రాక్షససంహారీ ! శరీరధారులైనవారు నిన్ను భజిస్తూ ఇహపరసౌఖ్యాలను పొంది ధీరు లని పేరెన్నిక గంటారు.

ఆ. నిన్ను ననుసరింప నేరని కుజనులు, పవనపూర్ణ చర్మభస్త్రి సమితి
యోజఁ జేయుచుందు రుచ్ఛ్వసనంబులు, బలసి యాత్మదేహభజను లగుచు. 1213

* ఆ విధంగా నిన్ను సేవించలేని దుష్టమానవులు గాలితో నిండిన తోలుతిత్తిలాంటి శరీరంమీద మమకారంతో ఉచ్ఛ్వాస నిశ్వాసాలు నింపుకొంటూ ఆ దేహాన్నే ఆత్మ అనే భావంతో భజిస్తూ ఉంటారు.

సీ. దేవ! కొందఱు సూక్ష్మదృక్కులై నట్టి మహాత్మకు లుదరస్థుఁడైన వహ్ని
గా మదిఁ దలఁతురు కైకొని మఱికొంద, ఱారుణు లనుపేర నమరు ఋషులు
లీల సుషుమ్నానాడీ మార్గగతుఁడవై, హృత్ప్రదేశమునఁ జరించుచున్న
రుచి దహరాకాశ రూపిగా భావింతు, రట్టి హృత్పద్మంబునందు వెడలి

తే. వితతమూర్ధన్య నాడికాగతుల నోలి, బ్రహ్మరంధ్రంబుఁ బ్రాపించి పరమపురుష !
సుమహితానందమయ పరంజ్యోతిరూపి, వైన నినుఁ బొంది మఱి పుట్ట రవనియందు. 1214

* దేవదేవా ! సూక్ష్మదర్శనులైన మహితాత్ములు నిన్ను గర్భంలో ఉన్న అగ్నిగా భావిస్తారు. అరుణు లనబడే ఋషీశ్వరులు సుషుమ్నా నాడీమార్గంలో సంచరిస్తూ హృదయప్రదేశంలో సంచరించే సూక్ష్మాకారరూపం కలవాణ్ణిగా నిన్ను గ్రహిస్తారు. ఆ విధమైన హృదయపద్మం నుంచి వెలువడి మూర్ధన్యనాడిద్వారా బ్రహ్మరంధ్రం చేరుకుని ఆనందమయ పరంజ్యోతి స్వరూపుడవైన నిన్ను చేరి మునులు ముక్తు లౌతారు. మళ్ళీ వారికి జన్మమంటూ ఉండదు.

వ. మఱియు వివిధకాష్ఠాంతర్గతుం డయిన వాయుసఖుండు తద్గత దోషంబునం బొరయక నిత్యశుద్ధుఁ డై తరతమభావంబున వర్తించు చందంబున స్వసంకల్పకృతంబు లయిన విచిత్రశరీరంబులయందు నంతర్యామివై ప్రవేశించి తత్తద్విచిత్రయోనిగతంబైన హేయంబులం బొరయక సకలాత్మసమంబై బ్రహ్మంబయిన నిన్ను నైహికాముష్మిక ఫలసంగమంబు లేక విగతరజో గుణంబులం దగిలి కొందఱు భజియించుచుండుదు; రదియునుం గాక దేవా! భవదీయ సంకల్పాధీనంబు లయిన శరీరంబులం బ్రవేశించియున్న జీవసమూహంబు నీకు శేషభూతం బని తెలిసి కొందఱు భవనివారకంబయిన శ్రీమత్త్వచ్చరణారవిందంబులు సేవించి కృతార్థు లగుదురు; మఱియును. 1215

* మహాత్మా ! నీవు నీ సంకల్పానికి అనుగుణంగా విచిత్ర శరీరాలలో అంతర్యామిగా ఉంటావు. అయినా ఆ యా శరీరుల పాపాలు నీకు సోకవు. అటువంటి సర్వాంతర్యామివై సాక్షాత్తు పరబ్రహ్మమైన నిన్ను నిష్కాములై ఫలాపేక్ష లేక రజోగుణాన్ని వదలిన కొందరు మహాత్ములు సేవిస్తూ ఉంటారు. తమ తమ ప్రాణదేహాలు నీ అధీనాలని తెలిసినవారు భగవంతుడవైన నీ పాదపద్మాలను ధ్యానించి భవరోగాలకు దూరులౌతారు.

సీ. 'అనఘ ! దుర్గమమైన యాత్మతత్త్వంబు ప్రవర్తించుకొఱకు దివ్యంబులైన
యంచిత రామకృష్ణాద్యవతారముల్ భజియించియున్న నీ భవ్యచరిత
మను సుధాంభోనిధి నవగాహనము సేసి విశ్రాంతచిత్తులై వెలయుచుండి
మోక్షంబు బుద్ధి నపేక్షింప నొల్లరు మఱియుఁ గొందఱు భవచ్చరణపంక

ఆ. జములఁ దగిలి పుణ్యతము లైన హంసల, వడువు నొంది భాగవతజనముల
నొనరువారు ప్రకట యోగిజనప్రాప్య, మైన ముక్తిఁ గోర రాత్మలందు. 1216

* పుణ్యాత్మా! తెలుసుకోవటానికి అసాధ్యమైన నీ ఆత్మ తత్త్వం వ్యక్త మయ్యేటట్లు రామకృష్ణాది అవతారాలు ధరిస్తావు. అటువంటి నీ దివ్యచరిత్ర అనే అమృతసాగరంలో స్నానమాడినవారు మోక్షాన్నికూడా కోరరు. నీ పాదపద్మాలనే ధ్యానిస్తూ పరమ హంసల్లా ప్రవర్తించే భాగవత శిఖామణులు కొందరు ముక్తిని గూర్చి ఆలోచించరు.

ఉ. కొందఱు నీ శరీరము లకుంఠితభక్తి భవద్వశంబులై
చెందఁగ నీ పదాబ్జములు సేరి భజించుచుఁ దత్సుఖాత్ములై
యుందురు కొంద ఱీ తనువు లోలి ధరించి భవత్పదాబ్జముల్
పొందుగఁ గొల్వలేక నిలఁ బుట్టుచుఁ జచ్చుచు నుందు రవ్యయా! 1217

* సమస్తప్రాణుల కధీశ్వరుడవు నీవే యని తెలిసిన కొందరు నీ చరణారవిందాలను సదా సేవిస్తూ పరమానందం చెందుతారు. మరి కొందరు నీ పాదపద్మాలను భజింపలేక ఈ లోకంలో పుడుతూ చస్తూ ఉంటారు.

చ. యమ నియమాది యోగమహితాత్మకులైన మునీంద్రులున్ విరో
ధమునఁ దలంచు చైద్యవసుధావర ముఖ్యనృపుల్ ఫణీంద్ర భో
గము లన నొప్పు బాహువులు గల్గిన నిన్ను భజించు గోపికల్
క్రమమున నేమునున్ సరియ కామె భవత్కృప కంబుజోదరా! 1218

* జితేంద్రియులూ, పరమశాంతమూర్తులూ అయిన యోగులు, శత్రుభావంతో నిన్ను తలపోసే శిశుపాలాది రాజన్యులూ, నిన్ను భక్తితో ఆరాధించే గోపికలూ, మేమూ నీ కృపకు సమానంగా పాత్రుల మవటంలో సందేహం లేదు.

మ. అరవిందాక్ష! భవత్స్వరూప మిలఁ బ్రత్యక్షంబునం గాన నె
వ్వరికిం బోలదు శాస్త్రగోచరుఁడవై వర్తింతు వీ సృష్టి ముం
దర సద్రూపుఁడవైన నీ వలననే ధాత్ర్యాద్యమర్త్యుల్ జనిం
చిరి ని న్నంతకు మున్నెఱుంగఁగలమే చింతింప నే మచ్యుతా! 1219

* అంబుజాక్ష! నీ అసలైన స్వరూపాన్ని ప్రత్యక్షంగా చూడటం ఎవరికీ సాధ్యం కాదు. నీవు శాస్త్రగోచరుడవు. ఈ సృష్టికి పూర్వం వెలుగొందుతున్న పరమాత్మ స్వరూపుడవైన నీ వల్లనే బ్రహ్మాది దేవతలు ప్రభవించారు. అటువంటి నీ సచ్చిదానంద స్వరూపాన్ని మేము తెలుసుకోలేము.

వ. అట్టి నిన్నుం బరమాణు కారణవాదులైన కణ్వ గౌతమాదులును, బ్రకృతికారణవాదు లయిన సాంఖ్యులును, దేహాత్మవాదు లయిన బౌద్ధులును, వివిధంబులైన కుతర్కంబులచేతం బరస్పరావ్యాహతంబులైన మతంబులు దమ తమ కుతర్కవాదంబుల సమర్థించుచు నిన్నుం దెలియలేరు; మహాభాగ్యవంతు లయిన యోగీంద్రులకు నీవు ప్రత్యక్షంబైన నివి యన్నియు నసత్యంబులని కానవచ్చు. వెండియుఁ గొందఱు సచరాచర వస్తుజాతంబులకు నంతర్యామివై సర్వంబు నీవ యగుటం దెలియలేక నిత్యం బనియు, ననిత్యం బనియు విపరీతబుద్ధిం దెలియుదురు. గాని భవదీయ దివ్య తత్త్వంబు నిక్కంబుగఁ దెలియజాలరు; కొందఱు జగచ్ఛరీరుండవు గాన జగద్రూపకుండవైన నిన్నుం గటక మకుట కర్ణికాది వివిధ భూషణభేదంబులం గనకంబు నిజస్వరూపంబు విడువక వర్తించు చందంబున జగద్వికారానుగతుండ వయ్యును నిఖిల హేయప్రత్యనీక కల్యాణ గుణాత్మకుండవై యుందువని యాత్మవిదులయిన వారు దెలియుదు; రదియునుం గాక. 1220

* ఈ సృష్టికి పరమాణువులే కారణమని భావించే కణ్వ గౌతమాదులూ, ప్రకృతి కారణమని వాదించే సాంఖ్యులూ, దేహాత్మ వాదులైన బౌద్ధులూ, తమ తమ కుతర్కాలతో కొట్టుమిట్టులాడుతూ నిన్ను తెలుసుకోలేరు. నిన్ను సాక్షాత్కరించుకొన్న పరమయోగులకు ఈ సృష్టిలో నీవు తప్ప తక్కిన సమస్త పదార్థాలూ అసత్యా లనిపిస్తాయి, చరాచర ప్రపంచంలో అన్నిటా ఉన్న నిన్ను సక్రమంగా తెలుసుకోలేక కొందరు నిత్యానిత్య వాదాలతో, విపరీత బుద్ధులతో ఆలోచిస్తూ ఉంటారే కాని నీ నిజస్వరూపాన్ని తెలుసుకోలేరు. కటక కంకణ కిరీటాది నానావిధ భూషణాలలో సువర్ణం తన స్వరూపాన్ని విడువక వర్తించునట్లు నీవు సర్వంలో వర్తిస్తావు. నీవు విశ్వాత్మకుడ వయినా సమస్త కల్మషాలకు అతీతుడవు. శుభరూపుడవు. కల్యాణ గుణాత్మకుడవు. అట్టి నిన్ను ఆత్మతత్త్వం తెలిసినవారే తెలుసుకోగలరు.

మ. వనజాతాక్ష ! భవత్పదాబ్జయుగ సేవాసక్తులై నట్టి య
జ్జనముల్ మృత్యుశిరంబుఁ దన్ని ఘనసంసారాంబుధిన్ దాఁటి పా
వనులై లోకములుం బవిత్రములుగా వర్తించుచున్ నిత్య శో
భనమై యొప్పెడి ముక్తిఁ బొందుదురు శుంభద్వైభవోపేతులై. 1221

* దేవా! నీ పాదసేవలో నిరంతరం నిమగ్నులైనవారు మృత్యువును జయించి మహాసముద్రాన్ని తరించి జననమరణ పరంపరలకు గురికాక పవిత్రులై, లోకాలను పవిత్రంచేస్తూ ముక్తికి యోగ్యులై ప్రకాశిస్తారు.

**మ. మిము సద్భక్తి భజింపనొల్ల కిల దుర్మేధం బ్రవర్తించు నీ**
**చ మతివ్రాతము నేర్పునం బసులఁ బాశశ్రేణి బంధించు చం**
**దమునం బెక్కగు నామరూపములచేతన్ వారి బంధించి దు**
**ర్గమ సంసారపయోధిఁ ద్రోతువు దళత్కంజాత పత్రేక్షణా! 1222**

* మహాత్మా ! నిను భక్తితో సేవించకుండా దుర్మదాంధులై ప్రవర్తించే వారిని పశువులను బంధించినట్లు నామ రూపాలతో బంధించి సంసారసాగరంలో పడదోస్తావు.

**వ. దేవా! కర్మమూలంబులయిన పాణిపాదంబులు లేనివాఁడ వయ్యును స్వతంత్రుఁడవు గావున బ్రహ్మాదులు భవత్పరతంత్రులై యుండుదురు; స్థిర చర రూపంబులు గల చేతనకోటికి నీవు సర్వవిధ నియంతవు; గావున నీ కృపావలోకనంబుగల వారికి మోక్షంబు కరస్థితం బై యుండు; భవత్కృపావ లోకనంబు లేని దుష్టాత్ములు దుర్గతిం గూలుదు; రట్టి జీవులు దేవ తిర్య ఙ్మనుష్య స్థావరాది శరీరంబులు సొచ్చి యణురూపులై యుందు; రందును నీ వంతరాత్మ వగుచు నుందువు; మఱియును. 1223**

* నిర్వికారుడవై స్వతంత్రుడవైన నీకు బ్రహ్మాదులు వశులై వుంటారు. ఈ చరాచర ప్రపంచానికి నీ వధీశ్వరుడవు. కనుక నీ కృపకు పాత్రులైన వారికి మోక్షం కరతలామలక మౌతుంది. నీ దయకు పాత్రులుకాని దుష్టాత్ములు దుర్గతిపాలై బహువిధ శరీరధారులై అణురూపంగా ఉంటారు. అలాంటి వారిలోను అంతరాత్మవై నీ వుంటావు.

**క. మదిఁ దలపోయఁగ జల బు, ద్బుదములు ధరఁ బుట్టి పొలియు పోలిక గల యీ**
**త్రిదశాది దేహములలో, వదలక వర్తించు నాత్మవర్గము నోలిన్. 1224**

**ఆ. ప్రళయవేళ నీవు భరియింతు వంతకుఁ, గారణంబ వగుటఁ గమలనాభ !**
**భక్తపారిజాత ! భవ భూరి తిమిర ది, నేశ ! దుష్టదైత్యనాశ ! కృష్ణ ! 1225**

* నీళ్లల్లో బుడగలు పుట్టి నశించిపోయే విధంగా ఆత్మ సముహం దేవతాదుల దేహాల్లో ప్రవర్తిస్తూ ఉంటుంది. అటువంటి శరీరాల్లో అంతరాత్మవై నీవు వర్తించి ప్రళయసమయంలో వాటిని నీలో లీనంచేసుకుంటావు. కృష్ణా! నీవు భక్తుల పాలిటి పారిజాతానివి. భవబంధాలను దూరంచేసే వాడివి. దుష్ట శిక్షకుడవు.

**చ. అనఘ ! జితేంద్రియస్ఫురణు లయ్యును జంచలమైన మానసం**
**బను తురగంబు బోధమహితాత్మ వివేకపు నూలిత్రాట న**
**ల్లనఁ గుదియంగఁ బట్టను దలంచుచు ముక్తి కుపాయలాభ మే**
**యనువును లేమికిన్ వగల నందెడు నాత్మలువో తలంపఁగన్. 1226**

* మహానుభావా! జితేంద్రియులైనవారు కూడా మనస్సును నిగ్రహించుకోలేక ముక్తి పొందే ఉపాయం తెలియక విచారగ్రస్తు లౌతారు.

చ. గురు పదపంకజాతములు గొల్వని వారలువో మహాబ్ధి ని
స్తరణకుఁ గర్ణధారరహితంబగు నావను సంగ్రహించు బే
హారి గతి భూరి దుస్తర భవాంబుధిలోన మునుంగుచుందు రం
బురుహదళాక్ష ! నీవు పరిపూర్ణుఁడవై తనరారఁగా నొగిన్. 1227

* గురు పాదపద్మాల్ని సేవించనివారు జననమరణ పరంపర లనే సముద్రంలో మునిగిపోతారు. వారు నావికుడు లేని నావలో ప్రయాణించే వ్యాపారులవంటి వారు.

తే. పుత్ర దార గృహ క్షేత్ర భూరివిషయ, ఘన సుఖాసక్తుఁ డగుచు నే మనుజుఁ డేని
నర్థిఁ జరియించు వాఁడు భవాబ్ధిలోనఁ, జెంది యె న్నాళ్ళకును దరిఁజేర లేఁడు. 1228

* నిరంతరం సతీసుతుల మీదా, గృహ క్షేత్రాదుల మీదా అనురక్తిని పెంచుకొన్నవాడు ఈ సంసారసాగరం నుంచి ఎన్నటికీ గట్టెక్కలేడు.

సీ. జగతిపై బహుతీర్థ సదనంబు లనఁ గల్గి పుణ్యానువర్తన స్ఫురితు లగుచుఁ
బాటించి నీ యందు బద్ధమత్సరములు లేక భక్తామరానోకహంబ
వగు భవత్పాదాబ్జయుగళంబు సేవించి భవపాశముల నెల్లఁ బాఱఁదోలి
సమమతులై యదృచ్ఛాలాభ తుష మేరు సమముగాఁ గై కొని సాధు లగుచుఁ

తే. బాదతీర్థంబు గల మహాభాగవత జ, నోత్తమోత్తము లైనట్టి యోగివరుల
వార కెప్పుడు సేవించువాఁడు వొందుఁ, బ్రవిమలానందమయ మోక్షపదము మఱియు. 1229

* భాగవతోత్తములు తీర్థసములు. వారు పుణ్యావర్తనులు భక్తులపాలిటి కల్పవృక్షమైన నిన్ను నిరంతరం వారు సేవిస్తుంటారు. భవబంధాలనుంచి విముక్తులై, సమచిత్తులై సంతుష్టమనస్కులైన అట్టి పరమభాగవతులను భజించేవాడు ఆనందమయమైన మోక్షసామ్రాజ్య పదవికి యోగ్యు డౌతాడు.

వ. సత్తైన ప్రకృతివలన నుత్పన్నంబైన యీ జగత్తు సత్తు గావలయు; నది యెట్లనినం గనకోత్పన్నంబులైన భూషణంబులు కనకమయంబు లయి కానంబడు చందంబున నని సాంఖ్యుండు పలికిన విని యద్వైతవాది యిట్లను; నెయ్యది యుత్పన్నంబుగా దది సత్తును గా; దను వ్యతిరేకవ్యాప్తి నియమంబు నిత్యసత్యం బైన బ్రహ్మంబునందుఁ దర్కహతం బగుం గావునం బ్రపంచంబు మిథ్యయని నిరూపించిన నా ప్రపంచంబు బ్రహ్మవిశేషణంబై కార్య కారణావస్థలు గలిగియున్న యంతమాత్రంబున మిథ్య గా నేర; దా ప్రపంచంబునకుఁ గార్యకారణావస్థలు నిత్యంబులు గావున నవస్థాద్వయ యుక్తంబయిన ప్రపంచంబు నిత్యం బనిన వెండియు నద్వైతి యిట్లను; బహుగ్రంథ ప్రతిపాదితం బయిన జగన్మిథ్యాత్వంబు లేమి యెట్లనిన నదియునుం గర్మవశులైన జడుల న విద్యా ప్రతిపాదకంబైన కుతర్కసమేతంబైన భారతి యంధపరంపరా వ్యవహారంబునం జేసి భ్రమియింపఁ జేయుఁ;

గారణావస్థలయందును బ్రహ్మ విశేషణంబైన సూక్ష్మరూపంబునం బ్రపంచంబు సత్తై యుండు; సత్యంబు బాధాయోగ్యంబు గావున నీకు శేషంబయి యుండుఁ గావున నీవు దేహగతుండైన దేహియందు నంతర్యామి వయ్యుం గర్మఫలంబులం బొరయక గర్మఫలభోక్తయైన జీవునకు సాక్షిభూతంబవై యుందు; వట్టి నిన్ను నజ్ఞులైన మానవులు నిజ కంఠలగ్నంబయిన కంఠికామణి నిత్యసన్నిహితంబై వెలుంగుచుండినను గానక వర్తించు తెఱంగునఁ దమ హృదయపద్మ మధ్యంబున ననంతతేజో విరాజమానుండవై ప్రకాశించు నిన్నుం దెలియలేరు. సకల బ్రహ్మాండ నాయకుండవైన నీయందు శ్రుతులు ముఖ్యవృత్తిం బ్రవర్తించునని శ్రుత్యధిదేవతలు నారాయణు నభినందించిన తెఱంగున సనందనుండు మహర్షుల కెఱింగించిన ప్రకారం బని నారాయణర్షి నారదునకుం జెప్పిన న మ్మహాత్ముండు మజ్జనకుండైన వేదవ్యాస మునీంద్రునకు నువన్యసించె; న య్యర్థంబు నతండు నాకుం జెప్పిన విధంబున నీకుం జెప్పితి. నీ యుపాఖ్యానంబు సకల వేదశాస్త్ర పురాణేతిహాససారం; బుపనిషత్తుల్యంబు; దీనిం బఠించువారును వినువారును విగతకల్మషు'లై యిహపరసౌఖ్యంబుల నొంది వర్తింతు; రని చెప్పిన శుకయోగీంద్రునకు రాజేంద్రుం డిట్లనియె. 1230

* సమస్త శరీరధారులలో అంతర్యామివై ఉండే నిన్ను కర్మ ఫలాలు సోకవు. కర్మఫలభోక్త అయిన జీవునకు సాక్షీభూతుడవై ఉంటావు. అజ్ఞానులైనవారు తన కంఠమందు ప్రకాశించే రత్నాన్ని చూడలేని విధంగా తమ హృదయపద్మాల్లో మహాతేజంతో ప్రకాశించే నిన్ను తెలుసుకోలేరు. సకల బ్రహ్మాండానికి నాయకుడవైన నీలో వేదాలు వర్తిస్తూ ఉంటాయి. ఈ విధంగా సనందనుడు మహర్షులకు తెలిపాడు. దానిని నారాయణముని నారదునికి చెప్పాడు. నారదుడు నా తండ్రి అయిన వేదవ్యాసునికి వివరించాడు. ఆ మహాత్ముడు నాకు చెప్పిన విధంగా దానిని నేను సవిస్తరంగా నీకు చెప్పాను. ఈ నారాయణోపాఖ్యానం సకల వేదశాస్త్రపురాణసారం. ఉపనిషత్తులకు సమానం. దీన్ని పఠించినా, విన్నా పాపాలు నశించిపోతాయి. ఇహ పరసౌఖ్యాలు కలుగుతాయని శుకుడు చెప్పగా పరీక్షిత్తు ఇలా అన్నాడు.

### -: పరీక్షిత్తునకు శుకయోగి విష్ణు సేవా ప్రాశస్త్యంబు సెప్పుట :-

మ. మునినాథోత్తమ! దేవమానవులలో ముక్కంటి సేవించు వా
రనయంబున్ బహువస్తుసంపదల సౌఖ్యానందులై యుండ న
వ్వనజాతాక్షు రమామనోవిభుని శశ్వద్భక్తి సేవించు స
న్మునివర్యుల్ గడుఁ బేద లౌటకుఁ గతంబున్ నా కెఱింగింపవే. 1231

* ఓ మునీంద్రా! శివుని సేవించే దేవమానవులు సుఖసంపదలతో జీవిస్తారు. విష్ణువును సేవించే మునీశ్వరులు నిరుపేదలుగా జన్మిస్తారు. దీనికి హేతువేమిటో వివరించవలసిందిగా కోరుతున్నాను.

సీ. నావుడు శుకయోగి నరనాథుఁ గనుఁగొని విను మెఱింగింతుఁ దద్విధము దెలియ
ఘనశ క్తిసహితుండు కాలకంధరుఁడు దా వినుతగుణ త్రయాన్వితుఁడు గాన

రాగాదియుక్తమై రాజిల్లుసంపద లాతనిఁ గొలుచువా రందుచుందు;
రచ్యుతుఁ బరము ననంతు గుణాతీతుఁ బురుషోత్తముని నాదిపురుషు ననఘు

తే. నర్థి భజియించువారు రాగాది రహితు, లగుచు దీపింతు రెంతయు ననఘచరిత!
ధర్మనందనుఁ డశ్వమేధంబు సేసి, పిదప సాత్త్విక కథనముల్ ప్రీతితోడ. 1232

ఉ. నారదసంయమీంద్రు వలనన్ వినుచుండి యనంతరంబ పం
కేరుహనాభుఁ జూచి యడిగెం దగ నిప్పుడు నీవు నన్ను నిం
డారిన భక్తిమై నడిగినట్ల యతండును మందహాస వి
స్ఫార కపోలుఁడై పలికెఁ బాండుతనూభవుతోడఁ జెచ్చెరన్. 1233

* శుకమహర్షి పరీక్షిత్తుతో ఇలా అన్నాడు. శివుడు మహాశక్తి సంపన్నుడు. సత్త్వ రజ స్తమో గుణాలతో కూడుకొన్నవాడు. కనుక పరమశివుని సేవించేవారు ఐశ్వర్యవంతు లౌతారు. శ్రీహరి త్రిగుణాతీతుడు. అతణ్ణి కొలిచే వారు కూడా రాగరహితులే. వారు సంపదలను కోరరు. ధర్మరాజు రాజసూయయాగం చేసిన తర్వాత నారదాది మహర్షులవల్ల ఎన్నో పుణ్యకథలు విన్నాడు. అతడు నన్ను నీవడిగిన ప్రశ్ననే కృష్ణుణ్ణి అడిగాడు. అందులకు మందహాససుందర వదనారవిందుడై కృష్ణు డిలా సమాధానం చెప్పాడు.

సీ. వసుమతీనాథ! యెవ్వనిమీఁద నా కను గ్రహ బుద్ధి వొడము నా ఘనుని విత్త
మంతయుఁ గ్రమమున నపహరించిన వాఁడు ధనహీనుఁడగుచు సంతాప మంద
విడుతురు బంధు ల వ్విధమున నొందిలి యై చేయునది లేక యఖిలకార్య
భారంబు లుడిగి మద్భక్తులతో మైత్రి నెఱపుచు విజ్ఞాననిరతుఁ డగుచుఁ

తే. బిదప వాఁడవ్యయానందపదము నాత్మ, నెఱిఁగి సారూప్యసంప్రాప్తి నెలమి నొందుఁ
గాన మత్సేవ మిగుల దుష్కర మటంచు, వదలి భజియింతు రితరదేవతల నెపుడు. 1234

* మహారాజా! ఎవనిపై నా కనుగ్రహం కలుగుతుందో ఆ ఉత్తముని సమస్త సంపదలనూ నేను హరిస్తాను. అతడు ధనహీనుడై శోకిస్తాడు. బంధువు లతణ్ణి వదలివేస్తారు. అతడు నిస్సహాయుడై అన్నిటినీ త్యజించి నా భక్తులతో స్నేహం చేస్తాడు. క్రమంగా విజ్ఞానాన్ని పొంది తుదకు అవ్యయానందచిత్తుడై వైకుంఠప్రాప్తికి అర్హుడౌతాడు. కనుక నన్ను సేవించటం చాల కష్టమని తలచి కొందరు దేవతలను ఆరాధిస్తారు.

క. సేవింప వారు దమకుం, గావించిన శోభనములు గని నిజములుగా
భావించి వారి మఱతురు, భావములఁ గృతఘ్నువృత్తిపని తమ పనిగన్. 1235

* అలా ఆరాధించి ఆ దేవతలవల్ల ప్రాప్తించిన ఐశ్వర్యాలను నిజమని తలచి వారు కృతఘ్నులై తమ శుభాలకు కారకులయిన ఆ దేవతలనే మరచిపోతారు.

క. మెలఁగుచు నుందురు దీనికిఁ, గలదొక యితిహాస మిపుడు గై కొని నీకుం
దెలియఁగఁ జెప్పెద దానవ, యలవడు నీ వడుగు ప్రశ్న కగు నుత్తరమున్. 1236

* దీనికి తార్కాణంగా ఒక కథ వుంది. దానిని చెబుతాను. నీ వడిగిన ప్రశ్నకు సమాధానం ఆ కథలోనే ఉంటుంది.

## -: శివద్రోహంబు సేయంబూనిన వృకాసురుండు విష్ణుమాయచే మడియుట :-

క. శకుని యను దైత్యు తనయుఁడు, వృకుఁడనువాఁ డొకఁడు దుర్వివేకుఁడు సుజన
ప్రకరముల నలఁపఁ దెరువున, నొకనాఁ డొదిగుండి దివ్యయోగిం గడఁకన్. 1237

* వృకాసురుడు శకుని అనే రాక్షసుని కొడుకు. వాడు దుర్మార్గుడై సుజనులను బాధించేవాడు. ఒకనా డా రాక్షసుడు నారదమహర్షిని చూచాడు.

వ. కనుంగొని. 1238

క. కరములు ముకుళించి 'మునీ, శ్వర ! నారద ! లలితధీవిశారద ! నన్నున్
గరుణించి యాన తీ శుభ, కరు లగు హరిహరహిరణ్య గర్భులలోనన్ 1239

ఆ. కడఁగి కొలువ శీఘ్రకాలంబులోనన, యిష్టమైన వరము లిచ్చునట్టి
దైవ మెవ్వఁ డనిన దానవుఁ గనుఁగొని, మునివరుండు పలికె ముదముతోడ. 1240

* అలా చూచి వృకాసురుడు నారదమహర్షికి నమస్కారం చేసి ఇలా అడిగాడు. 'మునీశ్వరా! నీవు అన్నీ తెలిసిన బుద్ధిమంతుడవు. త్రిమూర్తుల్లో ఎవరు తమ్ము సేవించే భక్తులకు శీఘ్రంగా వరాలిస్తారు? నామీది దయతో ఈ సంగతి నాకు చెప్పు'. వృకాసురుని ప్రశ్నకు నారదుడు ఇలా సమాధానం చెప్పాడు.

వ. వినుము; దుర్గుణసుగుణంబులలో నొక్కటి యెచ్చటం గలుగు నచ్చట నా క్షణంబ కోప ప్రసాదఫలంబులు సూపువాఁ డమ్ముప్పుర యందు ఫాలలోచనుఁ డివ్విధంబుఁ దెలిసినవారై బాణాసుర దశకంధరులు సమగ్ర భక్తియుక్తులై సేవించి యసమానసామ్రాజ్య వైభవంబుల నొంది ప్రసిద్ధులై; రట్లుగాన నీవు న మ్మహాత్ముని సేవింపు; మతనివలన నభిమతఫలంబులు వేగంబ ప్రాప్తం బయ్యెడి'నని చెప్పిన నతం డా క్షణంబ. 1241

* దుర్గుణాలు కలవారిమీద ఆగ్రహమూ, సుగుణవంతుల మీద అనుగ్రహమూ వెనువెంటనే చూపే దైవం త్రిమూర్తుల్లో ఒక్క పరమశివుడే. ఈ సంగతి తెలిసిన బాణాసుర రావణాసురాది దానవులు పరమశివుణ్ణి భక్తితో సేవించి సామ్రాజ్యవైభవాలను పొందారు. కనుక నీవూ శివుణ్ణి భక్తితో పూజించు. నీ అభిమతం ఈడేరుతుంది' అన్నాడు.

సీ. దీపించు కేదార తీర్థంబునకు నేగి యతిసాహసాత్మకుం డగుచు నియతి
లోకముల్ వెఱఁగంద నా కాలకంధరు వరదుని నంబికావరునిఁ గూర్చి

తన మేనికండ లుద్దండుఁడై ఖండించి యగ్ని కాహుతులుగా నలర వేల్చి
దర్పకారాతి ప్రత్యక్షంబు గాకున్న జడియక సప్తవాసరమునందుఁ

తే. బూని తత్తీర్థమునఁ గృతస్నానుఁ డగుచు, వెడలి మృత్యువుకోఱనా వెలయునట్టి
గండ్రగొడ్డంటఁ దన మస్తకంబు దునుము, కొనఁగఁ బూనిన న య్యగ్నికుండమునను. 1242

* వృకాసురుడు ఆ క్షణమే బయలుదేరి కేదారతీర్థానికి వెళ్ళాడు. అక్కడ మహేశ్వరుణ్ణి గురించి ఘోరతపస్సు చేశాడు. తన శరీరంలోని మాంసాన్ని ముక్కలు ముక్కలుగా ఖండించి అగ్నికి ఆహుతి కావించాడు. అప్పటికీ పరమశివుడు ప్రత్యక్షం కాలేదు. వృకాసురుడు పట్టువీడక కేదారతీర్థంలో స్నానంచేసి మృత్యుదేవత కోరవలె భయంకరమైన గండ్రగొడ్డలితో తన శిరస్సు ఖండించి అగ్నికుండంలో వేయడానికి సాహసించాడు.

క. అరుదుగ వెలువడి రుద్రుఁడు, గరుణ దలిర్పంగ వానికర మాత్మకరాం
బురుహమునఁ బట్టి 'తెగువకుఁ, జొరవలవదు; మెచ్చు వచ్చె సుమహిత చరితా! 1243

* పరమశివుడు తక్షణమే ప్రత్యక్షమై వృకాసురుని చేతిని పట్టుకొని 'సాహసించవద్దు. నీ తపస్సుకు మెచ్చుకున్నాను' అని వాణ్ణి వారించాడు.

క. నీమదిఁ బొడమిన కోరిక, లేమైనను వేఁడు మిపుడ యిచ్చెద' ననినం
దా మనమున సంతసపడి, యా మనుజాశనుఁడు హరుపదాంబుజములకున్. 1244

* 'నీ మనస్సులో ఎట్టి కోరికలున్నా వెంటనే నెరవేరుస్తాను. అడుగు' మని శివుడు వృకాసురునితో అన్నాడు.

తే. వందనం బాచరించి 'యో యిందుమకుట!, ఫాలలోచన! వరద! మత్పాణితలము
నేను నెవ్వని తలమీఁద నిడిన వాఁడు, మస్తకము నూఱువ్రయ్యలై మడియ నీవె!' 1245

* దానవుడు పరమశివుని పాదాలకు నమస్కరించి 'స్వామీ! నా హస్తాన్ని ఎవని శిరస్సుమీద ఉంచుతానో వాని తల నూరు ముక్కలై పోవాలి. నేను కోరే వరమదే. అనుగ్రహించు' అని ప్రార్థించాడు.

క. అని వేఁడిన న మ్మాటలు, విని మదనారాతి నవ్వి విబుధాహితు కో
రిన వరముఁ దడయ కిచ్చిన, దనుజుఁడు తద్వర పరీక్షఁ దాఁ జేయుటకున్. 1246

* ఆ రాక్షసుని ప్రార్థన విని శివుడు చిరునవ్వు నవ్వుతూ అతడు కోరిన వరమిచ్చాడు. దుర్మార్గుడైన ఆ రాక్షసుడు పార్వతీపతి తనకు అనుగ్రహించిన వరాన్ని పరీక్షించా లనుకొన్నాడు. వరగర్వంతో వాడు అహంకరించి ముందుకు వచ్చాడు.

వ. ఆ క్షణంబు వరదాన గర్వంబున నుద్వృత్తుండై కడంగి. 1247

క. ఆ హరుమస్తకమునఁ గడు, సాహసమునఁ జేయి వెట్ట జడియక కదియ
'న్నోహో! తన మెచ్చులు దన, కాహా! పై వచ్చె' ననుచు నభవుఁడు భీతిన్. 1248

* పరమశివుని తలమీదనే తన హస్తం ఉంచడానికి ఆ రాక్షసుడు తెగించాడు. వాని తపస్సును మెచ్చుకోవటమే ఆపాయం తెచ్చి పెట్టిందని శివుడ భయపడి పరుగెత్తాడు.

క. దనుజుఁడు దన వెనువెంటం, జనుదే ముల్లోకములను సంత్రాసముఁ గై
కొని పాఱ, సురలు మనములఁ, దనికిరి దానికిని బ్రతివిధానము లేమిన్. 1249

* వృకాసురుడు శివుని తరుముకుంటూ వెళ్ళాడు. ముల్లోకాలూ భీతిల్లాయి. మునులూ, దేవతలూ భయకంపితులై కర్తవ్యం తెలియక తల్లడిల్లిపోయారు.

వ. అట్లు చని చని. 1250

సీ. నిరుపమానందమై నిఖిల లోకములకు నవలయై యమృతపదాఖ్యఁ దనరి
దినకర చంద్ర దీధితులకుఁ జొరరాక సలలిత సహజ తేజమున వెలుఁగు
సమధికంబగు శుద్ధసత్త్వ గరిష్ఠమై కరమొప్ప యోగీంద్రగమ్య మగుచు
హరిపదధ్యాన పరాయణులైన తద్దాసుల కలరు నివాస మగుచుఁ

తే. బ్రవిమలానంత తేజోవిరాజమాన, దివ్యమణి హేమకలిత సందీప్త భవ్య
సౌధమండపతోరణ స్తంభవిపుల, గోపురాది భాసురము వైకుంఠపురము. 1251

* శివుడు అలా వెళ్ళివెళ్ళి వైకుంఠాన్ని చూచాడు. ఆ వైకుంఠపురం నిరుపమానంద నిలయం. నిఖిలలోకాలకూ అవతల సూర్యచంద్ర కిరణాలు సైతం ప్రవేశించటానికి వీలులేని విధంగా యోగులకూ, భాగవత శ్రేష్ఠులకూ నివాసస్థలంగా అది ప్రకాశిస్తూ ఉంది.

వ. కనుంగొని యమ్మహాస్థానంబు డాయం జనుటయు, నప్పుండరీకాక్షుం డఖండవైభవంబునం గుండలీశ్వర భోగతల్పంబునం బరమానంద కందళిత హృదయారవిందుండై యిందిరానయన చకోరకంబుల నిజమందహాస సాంద్ర చంద్రికావితతిం దేల్చుచు, నార్తభక్త జనరక్షణంబు పనిగా మెలంగుచు, వివిధ వినోదంబులం దగిలి యుండియు, ఫాలలోచనుం డద్దనుజ పాలునకుం దలంపక యిచ్చిన వరంబు దన తలమీఁద వచ్చినం గలంగి చనుదెంచుట తన దివ్యచిత్తంబున నెఱింగి, య క్కాలకంధరుని యవస్థ నివారింపం దలంచి య య్యిందిరాదేవితోడి వినోదంబు సాలించి యప్పుడు. 1252

* పరమశివుడు వైకుంఠం ప్రవేశించాడు. ఆ సమయంలో శ్రీమన్నారాయణుడు ఆదిశేషునిపై పవళించి మందహాసం చేస్తూ లక్ష్మీదేవిని అలరిస్తున్నాడు. పరమేశ్వరుడు దాన మిచ్చి ఆపదల పాలైన విషయాన్ని విష్ణువు తనచిత్తంలో తెలుసుకొన్నాడు. పరమశివునికి వాటిల్లిన ఉపద్రవాన్ని పోగొట్టటానికి హరి నిశ్చయించుకొన్నాడు.

సీ. తాపింఛరుచితోడఁ దప్తరించెడు మేనుఁ బసిఁడిముంజియుఁ దగు పట్టుగొడుగు
ధవళాంశురుచి జన్నిదంబును దిన్నని దండంబుఁ జేతఁ గమండలువును
బసుపుగోఁచియుఁ జిన్ని పెట్టెవర్ధనమును రాజితంబైన మృగాజినంబుఁ
దూలాడు సిగయును వ్రేలుమాఱట గోఁచి వేలిమి బొట్టును వ్రేళ్ళ దర్భ

తే. దనర సందీప్త హవ్య వాహన సమాన, కాంతిఁ జెలువొంది యద్భుత క్రమ మెలర్పఁ
జతురగతి నప్డు వటుక వేషంబు దాల్చి, వచ్చి యా నీచ దానవ వరునిఁ జేరి. 1253

* విష్ణువు వటు వేషం ధరించాడు. బంగారు మొలత్రాటితో పట్టు గొడుగుతో, నల్లని నెమ్మేనిపై తెల్లని జందెపు పోగుతో, దండ కమండలాలతో, పసుపువన్నె గోచితో, పట్టెవర్ధనంతో, జింక చర్మంతో అచ్చమైన బ్రహ్మచారి అయి ముచ్చటగా దానవుణ్ణి సమీపించాడు.

వ. కైతవంబున నతనికి నమస్కరించి మృదుమధుర భాషణంబుల ననునయించుచు న య్యసురవరున కిట్లను; ని వ్విధంబున మార్గ పరిశ్రాంతుండవై యింత దూరంబేల చనుదెంచితి? సకల సౌఖ్యకారణంబైన యీ శరీరంబు నిరర్థకంబు సేసి వృథాయాసంబున దుఃఖపఱుపం దగునే? యి య్యెడం గొంత తడవు విశ్రమింపు; మీ ప్రయాసంబునకుఁ గతం బెయ్యది? కపటహృదయుండవు గాక నీ యధ్యవసాయం బెఱింగింపం దగునేని నెఱింగింపు'మని మృదుమధురంబుగాఁ బలికిన న మ్మహాత్ముని సుధారసతుల్యంబు లయిన వాక్యంబులు విని సంతసిల్లి, య ప్పిశితాశనుండు దన పూనినకార్యం బతని కెఱింగించిన.1254

* వృకాసురుని చూచి విష్ణువు కపటనమస్కారం చేశాడు. మృదుభాషణాలతో రాక్షసుని ఊరడిస్తూ 'ఇలా అలసిపోయి ఎందు కింతదూరం వచ్చావు? అన్ని సుఖాలకూ మూలమైన ఈ శరీరాన్ని ఊరక ఇలా హింసించడం దేనికి? ఇక్కడ కొంతసేవు విశ్రాంతి తీసుకో. ఇంతకూ నీ ప్రయాసకు కారణమేమిటి? అని వాణ్ణి ప్రశ్నించాడు. వృకాసురుడు వటువు తీయని మాటలకు సంతోషించి తాను తలపెట్టిన కార్యాన్ని గురించి చెప్పాడు.

చ. హరి దరహాస మొప్పఁ బిశితాశనుఁ గన్గొని పల్కెఁ దానవే
శ్వర! మును దక్షుశాపమునఁ జాలఁ బిశాచప తౌట సూనృత
స్ఫురణము మాని సంతతము బొంకుచు నుండు పురారిమాట నీ
వరయక వెంట నేఁగఁ దగ దాతని చేఁతలు మాకు వింతలే? 1255

* శ్రీహరి మందహాసం చేస్తూ వానితో 'మునుపు దక్షుని శాపంవల్ల పిశాచాల కధిపతియైన పరమశివుడు అసత్యభాషణు డయ్యాడు. ఆయనగారి చేష్టలు మాకేమీ క్రొత్తకాదు. శివుని మాటలు నీవు ఏ మాత్రమూ నమ్మరాదు' అని అన్నాడు.

ఆ. నిజము పలికెనేని నెఱిఁ దన తలమీఁద, నీ కరంబు మోపనీక తలఁగి
వచ్చునోటు! నితనివలనఁ బ్రత్యయమునఁ, దగుల నేమి గలదు దనుజవర్య! 1256

* పరమేశ్వరుడు సత్యభాషణుడే అయితే నీ చేయి అతని శిరస్సుకు తగులనీయకుండా భయంతో ఎందుకు పారిపోతాడు? ఇంతకూ శివుని విషయంలో నమ్మదగిన దే మున్నది? అని ఇంకా ఇలా అన్నాడు.

**ఆ. అశుచి యగుచు నతని నంటఁగఁ బని గాదు, కాలుఁ జేయిఁ గడిగి కడఁక వార్చి**
**యతనివెంట వేడ్క నరుగుదువే నీవు, నవల నంటఁ దగును నసురనాథ! 1257**

**మ. అతి దుశ్శంకలు మాని పొమ్మనిన దైత్యారాతి మాయా విమో**
**హితుఁడై విస్మృతి నొంది తామసముచే నేపారి వాఁ డాత్మ పా**
**ణి తలంబున్ దననెత్తి మోపికొని తా నేలన్ వెసన్ గూలె వి**
**శ్రుతదంభోళిహతిన్ వడిం బడు మహా క్షోణీధరంబో యనన్. 1258**

* అదీగాక అసురేంద్రా! నీవు అశుచివై మహేశుణ్ణి తాకడం తగదు. కనుక కాళ్ళూ చేతులూ కడుగుకొని, నీరు పుక్కిలించి శివుణ్ణి వెంబడించు. అతణ్ణి స్పృశించు. నీ సందేహం తీర్చుకో! అనవసరంగా లేనిపోని శంకలు పెట్టుకోకు- అంటూ విష్ణువు ఆ రాక్షసుని హెచ్చరించాడు. వృకాసురుడు విష్ణుమాయవల్ల తన్ను తాను మరచి తామసియై తనచేతిని తన నెత్తిమీదే ఉంచుకున్నాడు. అతని తల తునాతునకలైంది. తుదకు వృకాసురుడు వజ్రాయుధం దెబ్బకు కూలిన పర్వతంలా భూమిపై పడ్డాడు.

**వ. అట్లు దన తల నూఱువ్రయ్యలై నేలం గూలిన యసురం గని యప్పుడు. 1259**

**క. సుర లసురాంతకు మీఁదన్, వరమందార ప్రసూనవర్షము లోలిం**
**గురిసిరి తుములంబై దివి, మొరసెన్ సురదుందుభి ప్రముఖతూర్యంబుల్. 1260**

* ఈ విధంగా తల నూరుముక్కలై నేలగూలిన రాక్షసుణ్ణి చూచి దేవతలు శ్రీమన్నారాయణునిమీద పూలవర్షం కురిపించారు. స్వర్గంలో దేవదుందుభులు మ్రోగాయి.

**క. పాడిరి గంధర్వోత్తము, లాడిరి దివి నప్సరసలు నన్యోన్యములై**
**కూడిరి గ్రహములు భయముల, వీడిరి మునికోటు లంత విమలచరిత్రా! 1261**

* గంధర్వులు పాటలు పాడారు. దేవకాంతలు సంతోషంతో నాట్యం చేశారు. గ్రహాలన్నీ ఏకమయ్యాయి. మునులభీతి తొలగి పోయింది.

**క. మురహరుఁ డెల నవ్వొలయఁగఁ, బురహరుఁ దగఁ జూచి పలికె భూతేశ్వర! యీ**
**నరభోజనుండు నీ కి, త్తఱి నెగ్గొనరింపఁ దలఁచి తానే పొలిసెన్. 1262**

* హరి చిరునవ్వుతో పరమశివుణ్ణి చూచి 'మహేశా! ఈ దానవుడు నీ కపకారం తలపెట్టి తానే కూలిపోయా'డని చెప్పాడు.

**వ. అది యట్టిద కాదె! యిజ్జగంబున నధికుండయిన వానికి నపకారంబు గావించిన మానవునకు శుభంబు గలుగునే? యదియునుంగాక జగద్గురుండ వగు నీ కవజ్ఞ దలంచు కష్టాత్ముండు వొలియుటం జెప్పనేల? యిట్టి దుష్టచిత్తుల కిట్టి వరంబు లిచ్చుట కర్జంబు గాదని య ప్పురాంతకు**

**వీడ్కొలిపిన, నతండు మురాంతకు ననేక విధంబుల నభినందించి నిజమందిరంబునకుం జనియె నని చెప్పి యిట్లనియె. 1263**

* విష్ణువు ఇంకా అన్నాడు- సకల లోకాధీశునికి కీడు చేసినవాడు చావక తప్పదు. ఇలాంటి దుర్మార్గులకు అలాంటి వరాలివ్వడం తగదు. ఈ రీతిగా పలికి విష్ణువు పరమశివునికి వీడ్కోలిచ్చాడు. శివుడు అచ్యుతుణ్ణి అనేక విధాలుగా అభినందిస్తూ నిజ నివాసానికి వెళ్ళిపోయాడు.

**క. మానవనాయక! యీ యా, ఖ్యానముఁ జదివినను వినిన ఘనపుణ్యులు ని**
**త్యానంద సౌఖ్యములఁ బెం, పూనుదు రటమీఁద ముక్తి నొందుదు రెలమిన్! 1264**

* శుకమహర్షి పరీక్షిత్తుతో 'మహారాజా! ఈ ఉపాఖ్యానం విన్న పుణ్యాత్ములు నిత్యం సుఖసంతోషాలతో జీవిస్తూ తుదకు ముక్తులౌతారు'- అని అన్నాడు.

**వ. అని చెప్పి శుకయోగీంద్రుండు పరీక్షిన్నరేంద్రున కిట్లనియె. 1265**

**క. జననాయక! యింకఁ బురా, తనవృత్తం బొకటి నీకుఁ దగ నెఱిఁగింతున్.**
**వినుము తపోమహిమలఁ జెం, దిన మునిజనములు సరస్వతీనది పొంతన్. 1266**

* శుకయోగీంద్రుడు పరీక్షిన్నరేంద్రునితో ఇంకా ఇలా అన్నాడు. మహారాజా! నీకొక పురాతనగాథ చెబుతాను- పూర్వం తపోధనులైన మును లెందరో సరస్వతీ నదీతీరంలో ఉండేవారు.

## -: భృగుమహర్షి త్రిమూర్తుల ప్రాశస్త్యంబు శోధించుటకుఁ బోవుట :-

**క. వితతక్రియ లొప్పఁగ స, త్క్రతువుల నొనరించు చచటఁ గైగొని లక్ష్మీ**
**పతిభవ పితామహులలో, నతులితముగ నెవ్వ రధికు లని తమలోనన్. 1267**

* వారు పలుయాగాలను వైభవోపేతంగా చేయసాగారు. ఆ తరుణంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్లో ఎవరధికులన్న చర్చ వారి మధ్యవచ్చింది.

**వ. ఇట్లు దలపోసి తన్మమహత్త్వం బంతయుం దెలిసి రమ్మని భృగుమహాముని న మ్ముువ్వురు వేల్పులకడకుం బంపిన న త్తాపసోత్తముండు సని చని ముందట. 1268**

* వా రెటూ నిర్ణయించలేక త్రిమూర్తుల మాహాత్మ్యాలను తెలుసుకొని రావలసిందని భృగుమహర్షిని పంపారు.

**క. జలరుహసంజాత సభా, స్థలమున కొగి నేఁగి యతని సత్త్వగుణంబుం**
**దెలియుటకై నుతివందన, ములు సేయకయున్న నజుఁడు ముసముస యనుచున్. 1269**

* భృగుమహర్షి బ్రహ్మకొలువులోకి ప్రవేశించి అతని సత్త్వగుణ సంపదను పరీక్షించాలనుకొన్నాడు. బ్రహ్మను స్తుతించకుండా ఆ మహర్షి మౌనంగా నిలబడ్డాడు. బ్రహ్మ అతణ్ణి చూచి రుసరుస లాడాడు.

క. మనమునఁ గలఁగుచు భృగుఁ దన, తనుజాతుం డనుచు బుద్ధిఁ దలఁచినవాఁడై
ఘనరోషస్ఫురితాగ్నిని, ననయము శాంతోదకముల నల్లన నార్చెన్. 1270

* బ్రహ్మ మనసులో కలతపడ్డాడు. భృగువు తన పుత్రుడన్న భావంతో చతుర్ముఖుడు తన రోషాన్ని ఎలాగో చల్లార్చుకున్నాడు.

చ. మహిత తపోధనుండు మునిమండనుఁ డయ్యెడఁ బాసి వెండియు
న్నహిపతి భూషుఁ గాన రజతాద్రికి నేగిన న గ్గిరీంద్రుపైఁ
దుహినమయూఖ శేఖరుఁడు దుర్గయుఁ దానును విశ్రమించుచున్
ద్రుహిణ తనూభవుండు సనుదెంచుట కాత్మఁ బ్రమోద మందుచున్. 1271

* భృగుమహర్షి బ్రహ్మసభనుండి నిష్క్రమించి ఈశ్వరుని దగ్గరకు వెళ్లాడు. అప్పుడు పార్వతీ పరమేశ్వరులు భృగువు రాకకు సంతోషించారు.

క. కనుఁగొని భ్రాతృ స్నేహం, బునఁ గౌఁగిటఁ జేర్చు ననుచు ముక్కంటి రయం
బున నెదురేగిన ముని రు, ద్రుని యందలి సత్త్వగుణ మెఱుంగుట కొఱకై. 1272

వ. అతనిం గైకొనక యూరకుండిన. 1273

* సోదర వాత్సల్యంతో భృగువు తన్ను కౌగిలించుకో గలడన్న ఉద్దేశంతో పరమశివుడు అతని కెదురుగా వెళ్ళాడు. కాని శివుని సత్త్వగుణం పరీక్షించాలనే ఉద్దేశంతో భృగువు ఊరకే నిలబడ్డాడు.

ఉ. ఆ నిటలాంబకుండు గమలాసన నందనుఁ జూచి భూరి కా
లానల రోషవేష భయదాకృతిఁ దాల్చి పటుస్ఫులింగ సం
తానము లొల్క శూలమునఁ దాపసముఖ్యు నురంబు వ్రేయఁగాఁ
బూనినఁ బార్వతీరమణి బోరన నడ్డము వచ్చి చెచ్చెరన్; 1274

* పరమశివుడు బ్రహ్మపుత్రుడైన భృగువును చూచి ఆగ్రహోదగ్రు డయ్యాడు. తన త్రిశూలంతో ఆ తాపసిగుండెపై పొడవటానికి ప్రయత్నించాడు. కాని పార్వతి అడ్డువచ్చింది.

క. తన విభుపాదములకు వం, దనముం గావించి సముచిత ప్రియముల న
య్యనలాక్షుని కోపము మా, న్పిన నమ్మునినాథుఁ డచట నిలువక చనియెన్. 1275

* పార్వతీదేవి పతిపాదాలమీద పడి సముచిత వచనాలతో అతని కోపం మాన్పింది. భృగు వక్కడనుంచి వెళ్ళిపోయాడు.

సీ. పొలుపొందు వైకుంఠపురమున కర్థితోఁ జని యందు సమధికైశ్వర్య మొప్పఁ
గమలాంక పర్యంకగతుఁడై సుఖించు న క్కౌస్తుభ భూషు వక్షస్స్థలంబుఁ
దన పాదమున బిట్టు దన్నెఁ దన్నినఁ బాన్పు డిగి వచ్చి మునిఁ జూచి నగధరుండు
పదముల కెఱఁగి యో పరమ తపోధన! యీగతి నీ వచ్చు టెఱుఁగ లేక

**తే. యున్న నా తప్పు మన్నించి నన్నుఁ గరుణఁ, జూచి యీ దివ్య మణిమయస్ఫూర్తిఁ దనరు**
**రుచిర సింహాసనమునఁ గూర్చుండు దివ్య, తాపసోత్తమ! యభయ ప్రదాననిపుణ! 1276**

* తర్వాత భృగుముని వైకుంఠానికి వెళ్ళాడు. అప్పుడు విష్ణువు లక్ష్మి ఒడిలో తల పెట్టుకొని పవళించి ఉన్నాడు. భృగువు తన పాదంతో విష్ణువు యొక్క వక్షాన్ని తన్నాడు. నారాయణుడు నిర్వికారంగా పాన్పునుండి దిగివచ్చి మహర్షితో 'తపోధనా! నీ రాకను గురించి తెలియక నేను చేసిన అపరాధాన్ని మన్నించు. నన్ను కరుణించు. ఈ మణిమయసింహాసనం అలంకరించు' అని అన్నాడు.

**క. అలఘుపవిత్ర! భవత్పద, జలములు నను నస్మదీయ జఠరస్థ జగం**
**బుల లోకపాలురను బొలు, పలరఁగఁ బుణ్యులను జేయు ననఘ చరిత్రా! 1277**

**వ. మునీంద్రా! భవదీయ పాదాబ్జహతి మద్భుజాంతరంబునకు భూషణం బయ్యె; భవదాగమనంబు మాఁబోటివారికి శుభావహం బగుం గాదె; యేను ధన్యుండ నైతి నని మృదుమధురాలాపంబుల ననునయించిన న మ్మునివరుండు లక్ష్మీనాథు సంభాషణంబులకుఁ జిత్తంబునం బరమానందంబు నొంది, య మ్ముకుందు ననంత కల్యాణ గుణనిధి నభినందించి యానందబాష్పధారాసిక్త కపోలుం డగుచుఁ దద్భక్తి పారవశ్యంబున నొండు పలుకనేరక యతని చేత నామంత్రణంబు వడసి మరలి సరస్వతీ తీరంబున నున్న మునుల సన్నిధికిం జనుదెంచి వారలం గనుంగొని. 1278**

* మహానుభావా! నీ పాదజలం నన్నే కాదు. నాతో ఉన్న సమస్త విశ్వాన్నీ, లోకపాలకులనూ పవిత్రం చేయగలదు. పవిత్ర చరిత్రా! నీ పాదతాడనం నా వక్షానికి అలంకారమైంది. నీ రాక మాకు శుభదాయకం. నేను ధన్యుణ్ణయ్యాను- అని మధురంగా మాట్లాడాడు. భృగుమహర్షి నారాయణుని మధురోక్తులకు మురిసి పోయాడు. హరిని పలువిధాల స్తుతించి ఆనందపారవశ్యంతో వీడ్కోలు గైకొని వెళ్ళి మునులను కలుసుకొన్నాడు.

**సీ. మునినాయకులతోడఁ దన పోయి వచ్చిన తెఱఁగును దనమది దృష్టమైన**
**మూఁడుమూర్తుల విధంబును నెఱింగించిన వినివారు మనముల విస్మయంబు**
**నంది చిత్తంబున సందేహమును బాసి చిన్మయాకారుండు శ్రీసతీశుఁ**
**డనుపముఁ డనవద్యుఁ డఖిల కల్యాణగుణాకరుఁ డాదిమధ్యాంతరహితుఁ**

**తే. డై తనర్చిన పుండరీకాక్షుఁ డొకఁడ, కాక గణుతింప దైవ మొక్కరుఁడు వేఱ**
**కలఁడె యనుబుద్ధి విజ్ఞాన కలితు లగుచు, హరిపదాబ్జాతయుగళంబు నర్థిఁ గొలిచి. 1279**

* వారికి త్రిమూర్తుల స్వభావాలను భృగుమహర్షి సవిస్తరంగా తెలిపాడు. మునులు విస్మయం చెందారు. 'అఖిల కల్యాణ గుణాకరుడైన నారాయణు డొక్కడే పరమదైవం' అని నిర్ణయించి ఆ మునులు హరిపాదారవింద ధ్యానరతు లయ్యారు.

**వ. అట్లు సేవించి యవ్యయానందం బయిన వైకుంఠధామంబు నొంది; రని చెప్పి వెండియు నిట్లనియె.**

* ఆ మునులు విష్ణుమూర్తిని భక్తితో సేవించి వైకుంఠప్రాప్తిని పొందారు- అని చెప్పి శుకమహర్షి పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు.

## -: శ్రీకృష్ణుండు మృతులైన విప్రసుతులఁ దెచ్చుట :-

సీ. నరనాథ! యొకనాఁడు నలినాయతాక్షుండు వొలుచు కుశస్థలీపురమునందు
సుఖముండ నొక్క భూసురవర్యు భార్యకుఁ బుత్త్రుండు జన్మించి పుట్టినపుడ
మృతుఁడైన ఘనశోకవితతిచేఁ గ్రాఁగుచు, నా డింభకునిఁ గొంచు నవనిసురుఁడు
సనుదెంచి పెలుచ రాజద్వారమునఁ బెట్టి కన్నుల బాష్పాంబుకణము లొలుక

తే. బాపురే! విధి నను దుఃఖ పఱుపఁ దగునె?, యనుచు దూఱుచుఁ దనుఁ దిట్టుకొనుచు వగల
డెంద మందంద యెరియ నాక్రందనంబు, సేయుచును వచ్చి యా విప్రశేఖరుండు. 1281

* మహారాజా! శ్రీకృష్ణుడు కుశస్థలిలో సుఖంగా ఉంటున్న రోజుల్లో ఒక బ్రాహ్మణుని భార్యకు పుత్త్రుండు పుట్టి పుట్టగానే చనిపోయాడు. ఆ బ్రాహ్మణుడు శోకంతో మృతబాలుణ్ణి ఎత్తుకొని కృష్ణుని వద్దకు వచ్చాడు. కన్నీళ్ళు నింపుకొని ఆ బ్రాహ్మణుడు బాలుని శవాన్ని రాజద్వారం వద్ద ఉంచి విధిని నిందిస్తూ, తన్ను దాను తిట్టుకొంటూ గుండె బ్రద్ద లయ్యేటట్లు దుఃఖింపసాగాడు.

సీ. అధికశోకంబున నలమటఁ బొందుచు నచ్చటి జనులతో ననియెఁ బెలుచ
బ్రాహ్మణ విద్వేషపరుఁ డయి తగ శాస్త్ర పద్ధతి నడవక పాపవర్తి
యై క్షత్రబంధువుఁ డగు వాని దురితంబు చేత మత్పుత్త్రుండు జాతమైన
యప్పుడ మృతుఁ డయ్యె నక్కట! హింసకు రోయక యెప్పు డన్యాయకారి

తే. యగుచు విషయానుగతచిత్తుఁడైన యట్టి, రాజు దేశంబు ప్రజలు నిరాశు లగుచు
దుఃఖములఁ జాలవనటఁ బొందుదు రటంచు, నేడ్చుచును నట నిల్వక యేగె నపుడు. 1282

* దుర్భరశోకంతో కుమిలిపోతూ ఆ బ్రాహ్మణుడు అచటి ప్రజల్తో 'బ్రాహ్మణ ద్వేషియై శాస్త్రాచారాన్ని పాటించకుండా పాపాత్ముడైన రాజు చేసిన పాపం వల్ల నా కుమారుడు పుట్టగానే చచ్చిపోయాడు. హింసను ఏవగించుకోకుండా, న్యాయానికి దూరుడై ఇంద్రియ లోలుడైన రాజు పాలించే దేశంలో ప్రజలు నిరాశతో దుఃఖాలవల్ల మిక్కిలి కష్టాలను పొందుతారు- అని ఏడుస్తూ అక్కడ నిలువకుండా వెళ్ళి పోయాడు.

వ. ఇవ్విధంబున మఱియు దన సుతులు మృతు లయినపుడెల్ల వారలం గొనివచ్చి యవ్విప్రుండు రాజు మొగసాలంబెట్టి రోదనంబు సేయుచు, నెప్పటియట్ల కొన్ని గాథలు సదివి పోపుచుండె; నివ్విధంబున నెనమండ్రు సుతులు మృతులైన పిదపం దొమ్మిదవ సుతుండును మృతుండైనవానినెత్తి కొని వచ్చి యెప్పటి విధంబునఁ బలవరించుచున్న యా బ్రాహ్మణునిం గని యర్జునుం డిట్లనియె.1283

* ఈ విధంగా తనకు పుట్టిన బిడ్డలు చనిపోగా వారిని కూడా తెచ్చి రాజమందిర ద్వారం దగ్గర పెట్టి ఏడుస్తూ ఆ బ్రాహ్మణుడు మునుపటిలాగే కొన్ని కథలు చదవి పోతూ ఉండేవాడు. అతని కిలా ఎన మండుగురు కొడుకులు పుట్టి చనిపోయారు. తొమ్మిదవ కొడుకుకూడా పుట్టగానే చనిపోగా వాని శవాన్ని తెచ్చి ఆక్రందిస్తున్న బ్రాహ్మణుణ్ణి చూచి అర్జును డిలా అన్నాడు.

క. ఈ పగిది నీవు వగలన్, వాపోవఁగఁ జూచి యకట! వారింపంగా
నోపిన విలుకాఁ డొక్కం, డీ పురి లేఁడయ్యె నయ్య! యిది పాప మగున్. 1284

* అయ్యా! నీవు దుఃఖిస్తుంటే చూచి ఈ అన్యాయాన్ని వారించే సమర్థుడైన విలుకాడు ఒక్కడైన ఈ పట్టణంలో లేడా ఇది మహాపాపం.

సీ. పుత్త్రులఁ గోల్పోయి భూరిశోకంబున వనటఁ బొందుచు విప్రవరులు సాల
నే రాజురాజ్యమందేని వసించుదు రారాజుఁ దలపోయ నవనిమీఁద
నటునిఁగా నాత్మ నెన్నం దగు; నీపుత్త్రు నే బ్రతికించెద నిపుడ పూని
యటు సేయనైతినే, ననలంబు సొచ్చెద నని భూసురుఁడు వెఱఁగందఁ బలుక

తే. నతఁడు విని యీ వెడఁగుమాట లాడఁ దగునె?, భూరివిక్రమశాలి రాముండు మేటి
బలుఁడు హరియును శౌర్యసంపన్ను లనఁగఁ,దనరు ప్రద్యుమ్నుఁ డతని నందనుఁడు మఱియు. 1285

తే. వినుతబలు లైన యాదవ వీరవరులుఁ, గలుగ వారలచేఁ గాని కార్యమీవు
చక్కఁబెట్టుట యెట్లు? నీచనెడు త్రోవఁ, బొమ్ము నావుడు న య్యింద్రపుత్త్రుఁ డపుడు 1286

* కన్నబిడ్డల్ని పోగొట్టుకొని దుర్భరశోకంతో పరితపించే బ్రాహ్మణులు ఈ లోకంలో అధికంగా ఎవని రాజ్యంలో వుంటారో ఆ రాజు కేవలం వేషగాడు మాత్రమే. నీ కుమారుణ్ణి నేను బ్రతికిస్తాను. అలా చేయకపోతే నేను అగ్నిలో ప్రవేశిస్తాను. ఈ విధంగా అర్జునుడు బ్రాహ్మణు డాశ్చర్యపడేలాగా అన్నాడు. ఆ మాటలను విని బ్రాహ్మణుడు 'అయ్యా! ఇలాంటి అనుచితపు మాటలు పలకటం దేనికి? పరాక్రమోపేతులూ, బలశాలురూ అయిన బలరామ కృష్ణులున్నారు. ప్రద్యుమ్నాదు లున్నారు. ప్రశంసించదగిన బలం కలిగిన యాదవ వీరులున్నారు. వారిచేత గానిపనిని చక్కబెట్టడం నీకు ఎలా సాధ్యమౌతుంది. నీ దారిని నీవు వెళ్ళు అన్నాడు.

క. మనమున దురహంకారము, ఘనముగఁ బొడముటయు, నపుడు కవ్వడి విప్రుం
గనుఁగొని యచ్చటిజనములు, వినఁగా నిట్లనియె రోషవిహ్వలమతియై. 1287

* బ్రాహ్మణుని మాటలకు అర్జునుడి మనస్సులో దురహంకారం పెచ్చరిల్లింది. అతడు విప్రుణ్ణి చూచి అక్కడ జనాలు వినేటట్లు రోషంతో ఇలా అన్నాడు.

మ. బలుఁడం గాను; మురాసురాంతకుఁడఁ గాఁ; బ్రద్యుమ్నుఁడం గాను; నేఁ
దెలియం దత్తనయుండఁగా నని విరోధివ్రాతమున్ భీషణో
జ్జ్వల గాండీవ ధనుర్విముక్త నిశితాస్త్ర శ్రేణిచేఁ బీన్గు పెం
టలు గావించు పరాక్రమ ప్రకటచండ స్ఫూర్తి నేఁ బార్థుఁడన్. 1288

* నేను బలరాముణ్ణి కాను, కృష్ణుణ్ణి కాను. ప్రద్యుమ్నుణ్ణి కాను, అతని కొడుకైన అనిరుద్ధుణ్ణి కాను. మరి నే నెవ్వరింటావా? యుద్ధంలో గాండీవం నుంటి వెలువడే వాడిబాణాలతో శత్రుసమూహాన్ని చించి చెండాడే మహాపరాక్రమం కలిగిన అర్జునుణ్ణి .

వ. అదియునుంగాక. 1289

చ. బలిమిఁ బురాంతకుం దొడరి బాహువిజృంభణ మొప్ప నెక్కటిం
దలపడి పోరినట్టి రణధైర్యుని నన్ను నెఱుంగ వక్కటా!
పెలుకుఱ మృత్యుదేవతను బింక మడంచి భవత్తనూజుల
న్నలవుఁ జలంబుఁ జూపి కొనియాడఁగ నిప్పుడ తెచ్చి యిచ్చెదన్. 1290

* అందేకాదు. ఆ పరమ శివుణ్ణే భుజ బలంతో ఎదిరించి పోరాడిన నన్ను నీ వెరుగవా? మృత్యుదేవత పొగరు అణచి నా భుజ బలాన్నీ, పంతాన్నీ చూపించి నీ బిడ్డలను ఇప్పుడే తెచ్చి ఇస్తాను.

వ. అని నమ్మం బలికిన యర్జును ప్రతిజ్ఞకు భూసురుండు మనంబున నూరడిల్లి యతని నభినందించుచు నిజమందిరంబునకు జని కొన్ని దినంబు లుండునంత భార్యకుం బ్రసూతివేదనా సమయం బయినం జనుదెంచి విన్నచ్చుం గని తద్విధం బెఱింగించిన న య్యింద్రనందనుం డప్పుడు. 1291

* పార్థుడిలా నమ్మకంగా పలికాడు. బ్రాహ్మణునికి నమ్మకం కలిగింది. అతడు అర్జునుణ్ణి కొనియాడుతూ ఇంటికి వెళ్ళాడు. కొన్ని దినాలు గడిచాయి. అతని భార్యకు మళ్ళీ ప్రసవ వేదన ప్రారంభమైంది. భూసురుడు వెంటనే వచ్చి అర్జునుని కీ విషయం చెప్పాడు.

చ. లలిత విశిష్ట సంచిత జలంబుల నాచమనంబు సేసి, సు
స్థలమున నిల్చి రుద్రునకు సమ్మతి మ్రొక్కి మహాస్త్రవేది ని
ర్మల శుభమంత్ర దేవతల మానసమందుఁ దలంచి గాండివం
బలవడ నెక్కు ద్రోచి బిగియం గదియించి నిషంగ యుగ్మమున్. 1292

* అర్జునుడు పవిత్రజలాలతో ఆచమనం చేశాడు. పరిశుద్ధ ప్రదేశంలో నిలిచి శివునికి నమస్కరించాడు. శుభప్రదాతలైన మంత్ర దేవతలను మనస్సులో తలచుకొని గాండీవాన్ని ఎక్కుపెట్టి పట్టుకున్నాడు. అమ్ములపొదులు రెంటినీ కట్టుకొన్నాడు.

వ. ఇ వ్విధంబునఁ గట్టాయితంబై యప్పుడు. 1293

సీ. భూసురు వెంట నిమ్ముల నేగి సూతికా భవనంబు చుట్టును బాణవితతి
నరికట్టి దిక్కులు నాకాశపథము ధ రాతలం బెల్ల నీరంధ్రముగను
శరపంజరముఁ గట్టి శౌర్యంబు దీపింపఁ గడు నప్రమత్తుఁడై కాచియున్న
యెడ న మ్మహీసురు నింతికిఁ బుత్త్రుండు జనియించె; నప్పుడచ్చటి జనంబు

తే. పోయెఁ బోయెఁ గదే యని బొబ్బ లిడఁగ, బొంది తోడన యాకాశమునకు మాయఁ
జెందె నప్పుడు దుఃఖంబు నొంది భూమి, సురుఁడు విలపించుచును మురహరుని కడకు. 1294

* అర్జునుడు బ్రాహ్మణునివెంట వెళ్ళి ప్రసవమందిరాన్ని దట్టమైన బాణాలతో కప్పివేశాడు. మిక్కిలి జాగరూకతతో ప్రసూతిగృహానికి కావలికాస్తూ ఉన్నాడు. అప్పు డా బ్రాహ్మణుని భార్యకు మగ బిడ్డ పుట్టాడు. అప్పుడే అక్కడ చేరిన జనం పోయాడు, పోయాడు అని ఆర్తనాదాలు చేశారు. పుట్టిన బిడ్డ శరీరంతో ఆకాశంలోనికి అదృశ్యమై పోయాడు, బ్రాహ్మణుడు విలపిస్తూ కృష్ణునివద్దకు వచ్చాడు.

వ. అప్పుడు సని. 1295

క. ముందట నిల్చి ముకుంద! స, నందన మునివినుత; నందనందన! పరమా
నంద? శరదిందు చందన, కుంద యశస్సాంద్ర! కృష్ణ! గోవింద! హరీ! 1296

* అలా వెళ్ళి బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని సమక్షంలో నిలబడి ముకుందా! నందనందనా! సనందన మునివందితా! శరత్కాలపు చంద్రుని లాంటి సత్కీర్తి కలవాడా! అని పలువిధాలుగా స్తుతించాడు.

వ. అవధరింపుము. దేవా! యర్జునుం డనెడి పౌరుషవిహీనుం డాడిన వృథాజల్పంబులు నమ్మి పుత్త్రుం గోలువడి బేలనైన నన్ను నేమందు? నిఖిల విశ్వోత్పత్తి స్థితి లయంబులకుఁ బ్రధాన హేతుభూతుండ వయిన నీవు సమర్థుండ వయ్యు, వారింపం జాలక చూచుచుండ, నొక్క మనుష్యమాత్రుండు దీర్పం జాలెడువాఁడు గలఁడె? యని వెండియు. 1297

* మహాత్మా! నా విన్నపాన్ని ఆలకించు, పౌరుషహీనుడైన పార్థుని డాంబిక వచనాలను నమ్మి అమాయకుణ్ణై కొడుకును పోగొట్టుకొన్న నన్ను నేను ఏమని నిందించుకోవాలి. సమస్త విశ్వసృష్టి స్థితి లయాలకూ మూలకారకుడవైన నీవు సమర్థుడివే అయినా వారించలేక ఊరకున్నావు. మానవమాత్రు డీ మహాకార్యం నెరవేర్చ గలడా?

క. ఎక్కడి పాండుతనూభవుఁ?, డెక్కడి విలుకాఁడు? వీని కెక్కడి సత్త్వం?
బెక్కడి గాండీవము? దన, కెక్కడి దివ్యాస్త్ర సమితి? యే మనవచ్చున్? 1298

* అని ఇంకా ఇలా అన్నాడు. 'పాండుతనయు డొక విలుకాడా! వాని మాట యథార్థమా! అతని దొక గాండీవమా! అతనికి దివ్యాస్త్రాలంటూ ఉన్నాయా! ఏమని చెప్పాలి.

క. అని తను నోడక నిందిం, చిన విని య య్యర్జునుండు చిడిముడిపడుచుం
దనవిద్యమహిమ పెంపునఁ, జనియెన్ వెస దండపాణి సదనంబునకున్. 1299

* ఈ విధంగా తన్నాభూసురుడు నిందిస్తూ ఉండగా అర్జునుడు కోపించి తన విద్యాప్రభావంతో వెంటనే బయలుదేరి యముని మందిరానికి వెళ్లాడు.

క. చని యందు ధారుణీసుర, తనయులు లేకుంటఁ దెలిసి తడయక యింద్రా
గ్ని నిరృతి వరుణ సమీరణ, ధనదేశానాలయములు దగఁ బరికించెన్. 1300

* అక్కడ బ్రాహ్మణపుత్రులు లేకపోగా పార్థుడు మరీ ఇంద్ర అగ్ని, నిర్ఋతి, వరుణ, వాయు, కుబేర ఈశానుల మందిరాలకు వెళ్ళి వెదికాడు.

వ. వెండియు. 1301

చ. నర సుర యక్ష కింపురుష నాగ నిశాచర సిద్ధ సాధ్య ఖే
చర విహగేంద్ర గుహ్యక పిశాచ నివాసములందు రోసి భూ
సురసుతు లేగినట్టి గతి సొప్పడకుండుటఁ జూచి క్రమ్మఱన్
ధరణికి నేగుదెంచి బెడిదంబుగ నగ్ని సొరంగఁ బూనినన్. 1302

* అనంతరం దేవ యక్ష కింపురుష నాగ రాక్షస సిద్ధ సాధ్య ఖేచరాదుల ఇళ్ళకు వెళ్ళి బ్రాహ్మణుని పుత్రులకోసం అన్వేషించాడు. కాని వారి జాడ అక్కడ ఎక్కడా కనిపించలేదు. చివరకు మళ్ళీ భూలోకానికి వచ్చి ప్రతిజ్ఞానుసారం పట్టుదలతో అగ్ని ప్రవేశం చేయటానికి సిద్ధమైనాడు.

వ. అ వ్విధంబంతయు నెఱింగి య మ్మురాంతకుండు ' విప్రనందనుల నీకుం జూపెద' నని యనలంబు సొరకుండ నతని నివారించి యప్పుడు. 1303

* శ్రీకృష్ణు డీ సంగతి తెలుసుకొని బ్రాహ్మణ పుత్రులను నీకు చూపెద నని అర్జునుణ్ణి మంటల్లో దూకకుండా వారించాడు.

ఉ. సుందరదివ్యరత్నరుచి శోభితమై తనరారు కాంచన
స్యందన మంబుజాప్తుఁ డుదయాచల మెక్కు విధంబు దోఁపఁ బౌ
రందరి దాను నెక్కి తను రశ్ములు దిగ్వితతిన్ వెలుంగ గో
విందుఁ డుదారలీలఁ జనె విప్రతనూజ గవేషణార్థియై. 1304

* దివ్యరత్నకాంతుల్తో ప్రకాశిస్తున్న సుందరరథాన్ని సూర్యుడు ఉదయపర్వతాన్ని ఎక్కినట్లు శ్రీకృష్ణుడు అర్జునునితో కూడి అధిరోహించాడు. తన శరీరకాంతులు దిక్కుల వెలుంగుతూ ఉండగా శ్రీకృష్ణుడు బ్రాహ్మణకుమారులను వెదకడానికి బయలుదేరాడు.

చ. చని పురగోష్ఠ దుర్గ వన జానపదాచల పక్కణ ప్రభూ
త నదనదీ సరోవర యుతక్షితి నంతయు దాఁటి సప్త వా
రినిధుల దీవులం గులగిరి ప్రకరంబుల నుత్తరించి మే
రు నగము నాక్రమించుచు మరుద్గతితో రథ మేగ న త్తఱిన్. 1305

* పట్టణాలతో, పల్లెలతో, దుర్గాలతో, అరణ్యాలతో, పర్వతాలతో, నదీ నద సరోవరాలతో నిండిన భూమినీ, సప్త సముద్రాలను దాటి మేరుపర్వతాన్ని అతిక్రమించి కృష్ణుని రథం మహావేగంతో ముందుకు సాగిపోయింది.

చ. మసలక భూరిసంతమస మండలముం దరియంగఁ జొచ్చి సా
హసమునఁ బోవఁ బోవఁగ భయంకరమై మది గోచరింపమిన్
వసమఱి మోఁకరిల్లి రథవాజులు మార్గము దప్పి నిల్చినన్
బిసరుహపత్రలోచనుఁ డభేద్యతమః పటలంబు వాపఁగన్. 1306

* శ్రీకృష్ణార్జునులు దట్టమైన చీకటి మండలాన్ని సమీపించారు. వారు సహనంతో ముందుకు వెళ్ళుతూ ఉంటే, చీకటి మరింత భయంకరంగా తోచింది. కళ్ళ కేదీ కనిపించలేదు. గుర్రాలు శక్తి కోల్పోయి దారి తప్పి నిలబడిపోయాయి. శ్రీకృష్ణుడు అసాధ్యమైన ఆ చీకటిని రూపుమాపడానికి ప్రయత్నించాడు.

సీ. బాలభాను ప్రభా భాసమానద్యుతిఁ గరమొప్పు నిజ రథాంగంబుఁ బనుప
న మ్మహాస్త్రం బేగి చిమ్మచీఁకటి నెల్ల నఱిముఱి నందంద నఱికి వైచి
యగ్రభాగంబున నతులిత గతి నేగ నా మార్గమున నిజస్యందనంబు
గడువడిఁ దోలి యా కడిఁది తమోభూమిఁ గడవ ముందఱకడఁ గాన రాక

తే. మిక్కుటంబుగ దృష్టి మిర్మిట్లు గొనఁగఁ, జదల వెలుఁగొందు దివ్యతేజంబుఁ జూచి
మొనసి గాండీవి కన్నులు మూసికొనుచు, నాత్మ భయమంది కొంతద వ్వరిగి యరిగి. 1307

* బాలసూర్యుని కాంతికి సమానమైన కాంతితో వెలిగే తన చక్రాయుధాన్ని కృష్ణుడు ప్రయోగించాడు. అది విజృంభించి చిమ్మచీకటిని దూసుకుంటూ పై భాగం నుంచీ ముందుకు దూసుకొని పోయింది. కృష్ణార్జునులు చక్రాయుధం వెళ్ళే మార్గాన్నిబట్టి అతి వేగంగా రథాన్ని నడిపించుకొంటూ వెళ్ళి చీకటిని దాటారు. అప్పుడు తమ ముందు కన్నులు మిరుమిట్లు కొలిపే మహాతేజం కనిపించింది. దాన్ని చూచి అర్జునుడు కళ్ళు మూసుకొన్నాడు. అతనికి భయం కలిగింది. ఆ స్థితిలో కొంతదూరం వెళ్ళాడు.

తే. కడఁగి దుర్వార మారుతోత్కట విధూత, చటుల సర్వంకషోర్మి భీషణ గభీర
వారిపూరంబు సొచ్చి తన్నీరమధ్య, భాగమునఁ గోటిసూర్యప్రభలు వెలుంగ. 1308

* తర్వాత మహావాయువేగంవల్ల చెలరేగే కెరటాలలో ఉన్న గంభీర జలరాశిని కృష్ణార్జునులు ప్రవేశించారు. ఆ నీటి నడిమి భాగంలో కోటి సూర్యుల కాంతులు జాలు వారుతున్నాయి.

వ. అది మఱియును జారు దివ్యమణి సహస్రస్తంభాభిరామంబును, నాలంబిత కమనీయ నూత్న రత్న మాలికాలంకృతంబును, భాను శశిమయూఖాగమ్యంబును, ననంత తేజోవిరాజితంబును, బునరా వృత్తి రహిత మార్గంబును, నిత్యైశ్వర్య దాయకంబును, నవ్యయంబును, నత్యున్నతంబును, ననూన విభవంబును, బరమ యోగీంద్రగమ్యంబును, బరమభాగవత నివాసంబునునై యొప్పు దివ్య ధామంబునందు. 1309

* అటువంటి తేజోమయమైన జలరాశిమధ్యంలో వేలకొలది మనోహరమైన మణిస్తంభాలతో, వ్రేలాడుతున్న రమణీయ రత్నహారాలతో అలంకృతమై, అనంత తేజోవిరాజితమై, సూర్య చంద్ర కిరణాలకు ప్రవేశింపరానిదై, జన్మరాహిత్యానికి మార్గమై, నిత్యైశ్వర్య దాయకమై, అవ్యయమై, మహోన్నతమై, అనల్పవైభవాల

కాకరమై, పరమయోగీంద్రులకు ప్రవేశయోగ్యమై, పరమ భాగవతులకు నివాస స్థానమై ప్రకాశించే ఒకానొక దివ్యభవనం గోచరించింది.

సీ. సాంద్రశరచ్చంద్ర చంద్రికా కర్పూర నీహార హారాభ దేహ మమర
నిందింది రేందీవ రేంద్ర నీలద్యుతిఁ గర మొప్పు మేచక కంఠ సమితి
యరుణాంశుబింబ భాసుర పద్మరాగ వి న్యస్త సహస్రోరు మస్తకములు
వివృతాననోద్గత విషధూమరేఖల లీలఁ జూపట్టిన నాలుకలును

తే. గలిత సాయంతన జ్వల జ్జ్వలన కుండ,ముల విడంబించు వేఁడి చూపులును గలిగి
భూరి కలధౌత గిరినిభాకార మమరఁ, బరఁగు భోగీంద్రభోగతల్పంబునందు. 1310

వ. సుఖాసీనుండై యున్నవాని డాయం జని యప్పుడు. 1311

* అటువంటి దివ్యభవనంలో శరత్కాలపు నిండుచంద్రుని పండువెన్నెలతో, కర్పూరంతో, మంచుతో సమానమైన తెల్లని దేహమూ, తుమ్మెదల్లాగా, నల్లకలువల్లాగా, ఇంద్రనీలమణుల్లాగా నల్లనైన కంఠ సమూహాలూ, ఉదయకాలం సూర్యునిలాగా ప్రకాశించే పద్మరాగ మణులతో కూడిన పడగలూ, తెరచుకొన్న నోళ్ళనుంచి వెలువడే విషధూమరేఖలవంటి నాలుకలూ కలిగి వాడి అయిన వేడిచూపులతో వెండి కొండలాగా ఉన్న ఆదిశేషుడు వారికి కన్పించాడు. ఆ ఆదిశేషుని పాన్పుమీద సుఖంగా ఆసీనుడై ఉన్న తేజోమూర్తిని శ్రీకృష్ణార్జునులు దగ్గరగా దర్శించారు.

సీ. సజల నీలాంబుద శ్యామాయమానాంగు నాశ్రితావన ముదితాంతరంగు
సనకాది యోగిహృద్వనజ మదాళీంద్రు ముఖపద్మ రుచిజిత పూర్ణ చంద్రుఁ
గమనీయ నిఖిల జగద్ధితచారిత్రు బ్రత్యూషసంఫుల్ల పద్మ నేత్రు
నిందిరా హృదయార విందారుణోల్లాసు శ్రీకర పీత కౌశేయవాసు

తే. హార కుండల కటక కేయూర మకుట, కంక ణాంగద మణిముద్రికా వినూత్న
రత్ననూపుర కాంచీ విరాజమాను, భవమహార్ణవశోషు సద్భక్తపోషు. 1312

* నీలమేఘశ్యాముడూ, ఆశ్రితజన రక్షకుడూ, సనకాది మునీంద్రుల హృదయపద్మాలలో నివసించేవాడూ, తన ముఖకాంతితో చంద్రుణ్ణి గెలిచినవాడూ, విశ్వవిఖ్యాత చరిత్రుడూ, ప్రాతఃకాల పద్మ పత్రాలవంటి నేత్రాలు కలవాడూ, లక్ష్మీమనోహరుడూ, పీతాంబర ధరుడూ, హార కేయూర కటక కంకణ కిరీటభూషణుడూ, భవసాగర శోషణుడూ, భక్తజన పోషణుడూ అయిన మహావిష్ణువును వారు చూచారు.

వ. మఱియు సునందాది పరిజన సంతత సేవితు, నానందకందళిత హృదయారవిందు, నరవిందవాసినీ వసుంధరాసుందరీ సమేతు, నారదయోగీంద్ర సంకీర్తనానందితు, నవ్యయు, ననఘు, ననంతు, నప్రమేయు, నజితు, నవికారు, నాదిమధ్యాంత రహితు, భవలయాతీతుఁ, గరుణాసుధాసముద్రు, నచ్యుతు, మహానుభావుఁ బరమపురుషుఁ, బురుషోత్తము, నిఖిలజగదుత్పత్తి స్థితిలయకారణుఁ,

జిదచిదీశ్వరు, నష్టభుజుఁ, గౌస్తుభశ్రీవత్సవక్షు, శంఖచంక్ర గదా పద్మ శార్ఙ్గాది దివ్యసాధను, సర్వశక్తిసేవితుఁ బరమేష్ఠిజనకు నారాయణుం గనుంగొని దండ ప్రణామంబులు సేసి కరకమలంబులు మొగిచి భక్తి పూర్వకంబుగా నభినందించిన, న య్యాది దేవుండును వారలం గరుణావలోకనంబులు నిగుడ నవలోకించి, దరహాసపూరంబు దోరంబుగా సాదరంబుగ నిట్లనియె. 1313

* సునందాదులచే సేవింపబడేవాడూ, నిత్యానంద కందళిత హృదయుడూ, శ్రీదేవితో భూదేవితో కూడినవాడూ, నారద గాన లోలుడూ, కరుణాసముద్రుడూ, అష్టభుజుడూ, కౌస్తుభాలంకారుడూ అయిన ఆ శ్రీమన్నారాయణునికి శ్రీకృష్ణార్జునులు భక్తితో సాష్టాంగ నమస్కారం చేసి చేతులు జోడించి సంస్తుతించారు. ఆ ఆదిదేవుడు వారిని దయతో చూచి మందహాసం చేసి సాదరంగా ఇలా అన్నాడు.

క. ధరణికి వ్రేఁ గగు దైత్యులఁ, బొరిబొరి వధియించి ధర్మమున్ నిలుపుటకై
ధర జనియించితి రిరువురు, నరనారాయణు లనంగ నా యంశమునన్. 1314

* ధరణికి భారమైన దైత్యులను వధించి ధర్మాన్ని రక్షించడానికి మీరిద్దరూ నా అంశతో నరనారాయణులుగా జన్మించారు.

క. ఆరూఢనియతితోఁ బెం, పారిన మిము ని మ్మునీంద్రు లర్థిం జూడం
గోరిన మీ వచ్చుటకై, ధారుణిసురసుతుల నిటకుఁ దగఁ దేవలసెన్. 1315

* మహానిష్ఠతో ఉన్నతులైన మిమ్ములను చూడాలని మునీశ్వరులు కోరారు. అందుకొరకు మీ రిక్కడకు రావాలనే ఉద్దేశంతో ఆ బ్రాహ్మణుని కుమారులను ఇక్కడికి తెప్పించవలసి వచ్చింది.

క. అని యా డింభకులను దో, కొని పొండని యిచ్చి నీడుకొలిపిన వారల్
వినతు లయి పెక్కు విధముల, వినుతించుచు నచటు వాసి విప్రుని సుతులన్. 1316

* ఈ బాలకులను మీరు తీసుకొని వెళ్ళండి- అని పలికి ఆ బాలకుల నిచ్చి విష్ణువు వారికి వీడ్కోలు చెప్పాడు. శ్రీకృష్ణార్జునులు వినయంతో భగవంతుణ్ణి పలు విధాలుగా స్తుతిస్తూ అక్కడనుండి బయలుదేరారు.

వ. తోడ్కొని సంప్రాప్త మనోరథు లయి య బ్బాలకులఁ దత్తద్వయో రూపంబులతోడఁ దెచ్చి యాబ్రాహ్మణునకు సమర్పించిన నతండు సంతుష్టాంతరంగుం డయ్యెఁ; న య్యవసరంబున.1317

* సంప్రాప్తమనోరథులైన వారు ఆ బ్రాహ్మణ కుమారులను వెంటబెట్టుకొని వారి వారి వయసులకు తగిన ఆకారాలతో ఆ బ్రాహ్మణునికి సమర్పించారు. ఆ బిడ్డలను చూచిన ఆ విప్రున కెంతో ఆనందం కలిగింది.

చ. అనిమిషనాథనందనుఁ డహర్పతితేజుఁడు గృష్ణుతోడఁ దాఁ
జని యచటం గనుంగొనిన సర్వశరణ్యునిఁ బుండరీక నే
త్రుని నిజధామవైభవసమృద్ధికిఁ దన్మహానీయమూర్తికిన్
మనమున మోదమంది పలుమాఱును సన్నుతిఁ జేసె భూవరా! 1318

* ఇంద్రుని తనయుడూ, సూర్యసమ తేజస్వీ అయిన అర్జునుడు కృష్ణునితో వెళ్ళి అచట చూచిన లోకశరణ్యుడైన నారాయణుని సౌధవైభవానికీ, ఆ స్వామి సుందరాకారానికి మనస్సులో ఆనందించి పలుమార్లు ప్రస్తుతించాడు.

తే. వారిజాక్షుని భక్తమందారు ననఘుఁ, గృష్ణు నఖిలేశుఁ గేశవు జిష్ణుఁ బరము
వినుతి సేయుచుఁ దత్పాదవనజములకు, వందనము లాచరించి యానంద మొందె. 1319

* అర్జునుడు కృష్ణుణ్ణి పలువిధాలుగా స్తుతించి ఆయన పాద పద్మాలకు ప్రణామాలు చేసి పరమానందభరితు డైనాడు.

వ. అంత. 1320

మ. హరి సర్వేశుఁ డనంతుఁ డాద్యుఁ డభవుం డామ్నాయసంవేది భూ
సుర ముఖ్యప్రజలన్ సమస్త ధనవస్తుశ్రేణి నొప్పారఁగాఁ
బరిరక్షించుచు ధర్మమున్ నిలుపుచుం బాపాత్ములం ద్రుంచుచుం
బరమోత్సాహ మెలర్ప భూరిశుభ విభ్రాజిష్ణుఁడై ద్వారకన్. 1321

* అనంతుడూ వేద వేద్యుడూ అయిన కృష్ణుడు బ్రాహ్మణు లాదిగా గల సమస్త ప్రజలనూ, సకల ధన వస్తు సంపన్నులను చేసి సంరక్షిస్తూ, దుర్మార్గులనూ, సంహరిస్తూ, ధర్మాన్ని సంస్థాపించుతూ ద్వారకలో శుభసంతోషాలతో ప్రకాశించాడు.

క. జనవినుతముగాఁ బెక్కు, స, వనములు దనుఁదాన కూర్చి వైదిక యుక్తిం
బొనరించుచు ననురాగము, మనమునఁ దళుకొత్త దైత్యమర్దనుఁ డెలమిన్. 1322

* ప్రజలు మెచ్చుకొనేటట్లు శ్రీకృష్ణుడు శాస్త్రోక్తంగా పలు యజ్ఞాలను పరమోత్సాహంతో జరిపించాడు.

వ. అట్లు కృష్ణుండు ద్వారకానగరంబునఁ బూజ్యంబగు రాజ్యంబు సేయుచుఁ బురందర విభవంబున నిరవొంది కనక మణిమయ విమాన మండప గోపుర ప్రాసాద సౌధ చంద్రశాలాంగణాది వివిధ భవనంబులందును రంగ దుత్తుంగ తరంగ డోలా విలోల కలహంస చక్రవాక కారండవ సారస క్రౌంచముఖ జలవిహంగ విలస దుచ్చలిత గరుదనిల దరదమల కమల కుముద కహ్లార సందోహ నిష్యంద మకరంద రసపాన మదవ దిందిందిరకుల కల గాయక ఝంకార నినదంబులును, నిరంతర వసంతసమయ సముచిత పల్లవిత కోరకిత బాలరసాలజాల లాలిత కిసలయ విసర ఖాదన జాత కుతూహలాయమాన కషాయకంఠ కలకంఠ కలరవ మృదంగ ఘోషంబులును, నిశిత నిజచంచూపుట నిర్దళిత సకలజన నయనానంద సుందరనందిత మాకంద పరిపక్వ ఫల రంధ్ర విగళిత మధుర రసాస్వాదన ముదిత రాజకీర శారికా నికర మృదు మధురవచన రచనా వశ కృత్యంబులును నమరఁ, బురపురంధ్రీ జన పీన పయోధర మండల విలిప్త లలిత కుంకుమ పంక సంకుల సౌగంధ్యానుబంధ బంధురగంధానుమోదితుండును, జందనాచల సాను దేశ సంజాత మంజుల మాధవీలతానికుంజ మంజుల కింజల్క రంజిత నివాసవిసర విహరమాణ

శబరికా కబరికా పరిపూర్ణ సురభి కుసుమ మాలికా పరిమళ వహుండును, గళిందకన్యకా కల్లోల సందోహ పరిస్పంద కందళిత మందగమ నుండును నగు మందానిల విదూషకునిచేఁ బోషితాభ్యాసిత లాలిత లగు నేలాలతా వితాన నటుల నటనంబుల విరాజితంబులగు కాసారతీర భాసురోద్యానంబులందును, జారు ఘనసార పటీర బాలరసాల సాల నీప తాపింఛ జంబూ జంబీర నింబ కదంబ ప్రముఖ ముఖ్యశాఖీ శాఖాకీర్ణ శీతలచ్ఛాయా విరచిత విమల చంద్రకాంతోపల వేదికాస్థలంబు లందును, నుదంచిత పింఛవిభాసిత బాలనీలకంఠ కేకారవాకులీకృతకృతక మహీధరంబులందును, లలితమణివాలుకానేక పులిన తలంబులందును, గప్పురంపుం దిప్పలను, గురువేరు చప్పరంబులను, విరచిత దారు యంత్ర నిబద్ధ కలశ నిర్యత్పయోధారాశీకర పరంపరా సంపాదిత నిరంతర హేమంతసమయ ప్రదేశంబు లందును, నిందిరారమణుండు షోడశ సహస్ర వధూయుక్తుండై యందఱ కన్ని రూపులై లలితసౌదామినీ లతాసమేత నీలనీరదంబుల విడంబించుచుఁ గరేణుకా కలిత దిగ్గజంబునోజ రాజిల్లుచు, సలిలకేళీవిహారంబులు మొదలుగా ననేక లీలా వినోదంబులు సలుపుచు, నంతఃపురంబునఁ గొలువున్న యవసరంబున వివిధ వేణు వీణాది వాద్య వినోదంబులను, మంజుల గానంబులను, గవి గాయక సూత వందిమాగధ జనసంకీర్త నంబులను, నటనటీజన నాట్యంబులను, విదూషకపరిహాసోక్తులను, సరససల్లాప మృదుమధుర భాషణంబులను బ్రొద్దుపుచ్చుచు నానందరసాబ్ధి నోలలాడుచుండె; నంత. 1323

* శ్రీకృష్ణుడు ద్వారకానగరంలో దేవేంద్రవైభవంతో రాజ్యం ఏలుతూ ఉన్నాడు. ఆ నగరంలో బంగారు మయమైన భవనాలున్నాయి. అచ్చట మకరందాన్ని త్రాగి మత్తిల్లిన తుమ్మెదల ఝుంకారాలు మారు మ్రోగుతున్నాయి. బాలరసాల పల్లవాలను తిని కుతూహలంతో కూసే కోయిలల కమ్మని కూజితాలు విని పిస్తున్నాయి. మామిడిపళ్ల రసాన్ని త్రాగి ఆనందంతో పలికే చిలుకల గోరువంకల పలుకులు వీనులవిందు చేస్తున్నాయి. అలాంటి సుందరవీథులలో నివసించుతూ శ్రీకృష్ణుడు ద్వారకా నగరంలోని మానినీమణులు తమ పక్షోజాలకు అలదుకొన్న కుంకుమసౌరభాన్ని మోసుకొస్తున్న మలయమారుతాలకు ఆమోదిస్తున్నాడు. మలయపర్వత ప్రాంతంలో శబరకాంతల కురుల్లో తురుముకున్న పూలదండల పరిమళాలకు ఆనందిస్తున్నాడు. గాలికి కదలాడే ఏలకితీగలున్న సరోవరతీరాలలోని ఉద్యానవనాలలో పచ్చని చెట్ల నీడలలో అమర్చిన చంద్రకాంత శిలావేదికలమీదా, పురులు విప్పి నాట్యం చేసే నెమిళ్ళ కేకారావాలలో నిండిన క్రీడాపర్వతాలలో, ఇసుకతిన్నెలలో, కర్పూరపు తిప్పలలో, కురువేరు మంటపాలలో, దారుయంత్రాలలోని కలశాల నుండి స్రవించే జలధారలతో చల్లనైన ప్రదేశాలలో, కృష్ణుడు పదహారు వేల సుందరీమణులతో విహరిస్తున్నాడు. అతడందరికీ అన్ని రూపాల్లో కనిపిస్తూ మెరుపుతీగెలతో కూడిన మేఘసమూహంలా విరాజిల్లాడు. వారితో జలక్రీడలు మొదలైన పలువిధాలైన వినోదాలలో తేలియాడుతూ ఉన్నాడు. అతడంతఃపురంలో ఉన్నప్పుడు వేణువీణావాద్యాలను వింటూ, మధురగానాలను ఆలకిస్తూ, నటీనటుల నాట్యాన్ని తిలకిస్తూ, కవి గాయక వందిమాగధుల కీర్తనలను ఆకర్ణించుతూ ప్రొద్దుపుచ్చుతూ ఆనందరసప్రవాహంలో ఓలలాడుతూ ఉన్నాడు.

మ. అరవిందాక్ష పదాంబుజాత యుగళ ధ్యానానురాగక్రియా
సరసాలాప విలోకనానుగత చంచత్సౌఖ్య కేళీరతిం

దరుణుల్ నూఱు(బదాఱువేలు మహితోత్సాహంబునం జొక్కి త
త్పరలై యొండు దలంప కుండిరి సవిభ్రాంతాత్మలై భూవరా! 1324

* శ్రీకృష్ణుని పాదపద్మాలను భక్తితో ధ్యానిస్తూ, అతనితో సరస సల్లాపాలు సాగిస్తూ, ఆ దివ్యమంగళరూపాన్ని దర్శిస్తూ పదహారువేలమంది సుందరీమణులు పరవశించి మరి దేన్ని గురించి అనుకోకుండా ఉన్నారు.

వ. అదియునుం గాక. 1325

మ. హరినామాంకితమైన గీత మొకమా టాలించి మూఢాత్ములున్
విరతిం బొందఁగఁజాలి యుందురఁట? యా విశ్వాత్మ నీక్షించుచున్
బరిరంభించుచు, నంటుచున్, నగుచు సంభాషించుచు న్నుండు సుం
దరు లానందనిమగ్న లౌట కిలఁ జోద్యం బేమి? భూవల్లభా! 1326

* మూఢాత్ములైనా ఒక్కసారి హరినామ సంకీర్తనం వింటే ముక్తిని పొందుతారు. కాగా ఆ మహనీయుణ్ణి చూస్తూ, అతణ్ణి కౌగిలిస్తూ, అతనితో నవ్వుతూ, అతనితో సంభాషిస్తూ ఆ అంగనలు ఆనంద పరవశలు కావడంలో ఆశ్చర్యం ఏముంది?

వ. అని చెప్పి మఱియు నిట్లనియె. 1327

ఉ. వారక కృష్ణుఁ డిప్పగిది వైదికవృత్తి గృహస్థ ధర్మ మే
పారఁగ బూని ధర్మమును నర్థముఁ గామము నందఁ జూపుచుం
గోరిక మీఱ సజ్జనులకుం గతి దాన యనంగ నొప్పి సం
సారిగతిన్ మెలంగె నృపసత్తమ! లోకవిడంబనార్థమై. 1328

* అని పలికి శుకమహర్షి ఇంకా ఇలా అన్నాడు. పరీక్షిన్మహారాజా! శ్రీకృష్ణు డీ విధంగా వేదోక్తమైన పద్ధతిలో గృహస్థ ధర్మాన్ని స్వీకరించి ధర్మార్థ కామాదులను సాధిస్తూ, ఉత్తములకు తానే దిక్కుగా ఉంటూ లోకం తన్ననుసరించటానికి తానూ ఒక సంసారిలా నటించాడు.

సీ. హరి యిట్లు గృహమేధి యగుచు శతోత్తర షోడశసాహస్ర సుందరులను
మును నీకు నెఱుఁగఁ జెప్పినరీతి నందఱ కన్ని రూపములు దా నర్థిఁ దాల్చి,
కైకొని యొక్కొక్క కామినీ మణియందు రమణ నమోఘ వీర్యమునఁ జేసి
పదురేసి కొడుకులం బడసె రుక్మిణ్యాది పట్టమహిషుల కుద్భవులు నైన

తే. నందనులలోన ధరణి నెన్నంగ బాహు, బలపరాక్రమ విజయ సంపద్విశేష
మానితాత్ములు పదునెనమండ్రు; వారి నెఱుఁగ వినిపింతు వినుము రాజేంద్ర చంద్ర! 1329

* శ్రీకృష్ణు డీ విధంగా గృహస్థుడై పదహారువేల సుందరాంగులను అందరకూ అన్ని రూపాలు ధరించి ఏలుకొన్నాడు. వారిలోఒక్కొక్కరికి పదిమందిబిడ్డలు పుట్టారు. రుక్మిణిమొదలైన పట్టమహిషులకు పుట్టిన

పుత్రులలో పదునెనిమిది మంది బాహుబల పరాక్రమ వైభవాలతో ప్రసిద్ధు లయ్యారు. వారి పేర్లను కూడా చెబుతానని శుకుడు పరీక్షిత్తుతో ఇలా అన్నాడు.

**వ. అని మఱియు నిట్లను; వారలు ప్రద్యుమ్నానిరుద్ధ దీప్తిమద్భాను సాంబ మిత్ర బృహద్భాను మిత్రవింద వృకారుణ పుష్కర దేవబాహు శ్రుతదేవ సునందన చిత్రబాహు వరూధ కవి న్యగ్రోధ నామంబులం బ్రసిద్ధులైరి; వెండియుఁద్రివక్రయందు సంభవించిన యువశ్లోకుం డనువాఁడు దన జనకుండైన కృష్ణ పాదారవింద సేవారతుం డగుచు నారదయోగీంద్రునకు శిష్యుండై యఖండిత దివ్యజ్ఞాన బోధాత్మకుం డగుచు, స్త్రీ శూద్ర దాసజన సంస్కారకంబై స్మరణమాత్రంబున ముక్తి సంభవించునట్టి సాత్త్వత తంత్రం బను వైష్ణవస్మృతిం గల్పించె; నిట్లు మధుసూదననందనులు బహుప్రజలును, నధికాయురున్నతులును, ననల్ప వీర్యవంతులును, బ్రహ్మణ్యులునై విఖ్యాతిం బొందిరి. వారిని లెక్కవెట్టఁ బదివేల వత్సరంబులకైనం దీఱదు, మున్ను నీ కెఱింగించినట్లు తత్కుమారులకు విద్యా విశేషంబుల నియమించు గురుజనంబులు మూఁడు కోట్లు నెనుబదెనిమిది వేల నూర్గు రనం గల్గియుందు; ర క్కుమారుల లెక్కింప నెవ్వరికి శక్యం? బదియునుం గాక యొక్క విశేషంబు సెప్పెద విను మని యిట్లనియె.1330**

* రుక్మిణి మొదలైన అంతఃపురకాంతలకు ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, దీప్తిమంతుడు, భానుడు, సాంబుడు, బృహద్భానుడు, మధుడు, మిత్రవిందుడు, వృకుడు, అరుణుడు, పుష్కరుడు, దేవబాహుడు, శ్రుతదేవుడు, సునందుడు, చిత్ర బాహువు, వరూధుడు, కవి, న్యగ్రోధుడు అనేవారు జన్మించి ప్రసిద్ధులయ్యారు. త్రివక్ర యను స్త్రీకి కృష్ణునివల్ల పుట్టిన ఉపశ్లోకు డనేవాడు కృష్ణభక్తుడై నారదునికి శిష్యుడై సాత్వతతంత్రమనే వైష్ణవస్మృతి గ్రంథాన్ని రచించాడు. స్త్రీలకూ, శూద్రులకూ, దాస జనానికి ఈ గ్రంథం ముక్తి మార్గాన్ని తెలుపుతుంది. ఈ విధంగా కృష్ణుని తనయులు అసంఖ్యాకులై ఆయురారోగ్యాలతో, మహాబలంతో ప్రకాశించారు. వారందరినీ లెక్క పెట్టడానికి పదివేల సంవత్సరాలైన చాలవు. వారి గురువులే మూడు కోట్ల ఎనభై ఎనిమిదివేల నూరుమంది ఉన్నారు. ఇక కృష్ణుని సంతతి లెక్కించటానికి ఎవరికి సాధ్యమవుతుంది? శుకు డీ రీతిగా చెప్పి మరొక విశేషం చెబుతానని మళ్ళీ ఇలా అన్నాడు.

**క. నరవర! దేవాసుర సం, గరమున మున నిహతు లైన క్రవ్యాద సము**
**త్కరము నరేశ్వరులై ద్వా, పరమున జనియించి ప్రజల బాధలఁ బఱుపన్. 1331**

**క. హరి తద్వధార్థమై ని, ర్జరులను యదుకులమునందు జనియింపింపం**
**ధర నూటొక్కకులంబై, పరఁగిరి; వారిని గణింప బ్రహ్మకు వశమే? 1332**

* మహారాజా! దేవ దానవ సంగ్రామంలో మరణించిన రాక్షసులందురూ ద్వాపరయుగంలో రాజులుగా పుట్టి ప్రజలను బాధలకు గురిచేశారు. ఆ రాక్షసులను చంపడంకోసం విష్ణుమూర్తి దేవతలను యదుకులంలో జన్మించేలాగా చేశాడు. అందుచేత యాదవులు నూటొక్కకులాలుగా ఏర్పడ్డారు. వారిని లెక్కపెట్టడానికి బ్రహ్మకు కూడా సాధ్యం కాదు.

వ. అట్టి యన్వయంబునందు మాధవునకు రుక్మిణీదేవి యందుఁ బితృసముండును, సమగ్ర భుజావిజృంభణుండునునై ప్రద్యుమ్నుండు జనియించె; నతనికి రుక్మికూఁతురగు శుభాంగి వలన ననిరుద్ధుం డుదయించె; నతనికి మౌసలావశిష్టుండైన వజ్రుండు సంభవించె; నతనికిఁ బ్రతిబాహుండు పుట్టె; వానికి సుబాహుండు జన్మించె; నతనికి నుగ్రసేనుండు ప్రభవించె; నతనికి శ్రుతసేనుండు గలిగె; నిట్లు యదువృష్ణిభోజాంధక వంశంబులు పరమ పవిత్రంబులై పుండరీకాక్షు ని రీక్షణ శయ్యాసనానుగత సరసాలాపస్నానాశన క్రీడావినోదంబుల ననిశంబునుం జెందుచు, సర్వదేవతార్థంబు సమస్తంబైన క్రతువు లొనరింపుచుఁ బరమానంద కందళిత చిత్తులై యుండి రని చెప్పి వెండియు.1333

* అలాంటి వంశంలో కృష్ణునికి రుక్మిణివల్ల ప్రద్యుమ్నుడు పుట్టాడు. అతడన్నిటా తండ్రివంటి వాడు. మహాభుజబలం కలవాడు. అతని భార్య రుక్మి కూతురు శుభాంగి. ఆమెకు అనిరుద్ధుడు జన్మించాడు. వానికి వ్రజుడు పుట్టాడు. వానికి ప్రతిబాహు డుదయించాడు. ప్రతిబాహుని పుత్త్రుడు సుబాహుడు. వానికి ఉగ్రసేనుడు జన్మించాడు. ఈ విధంగా యదు వృష్ణి భోజాంధక వంశాలు పవిత్రా లయ్యాయి. కృష్ణునితో సహవాసం చేస్తూ దేవతల ప్రీతికోసం అనేక యాగాలు చేస్తూ యాదవులు పరమానందం పొందారు.

మ. పరమోత్సాహముతోడ మాధవుఁడు శుంభల్లీలఁ బూరించు న
మ్మురళీగానము వీనులం జిలికినన్ మోదించి గోపాల సుం
దరు లేలెంతు రరణ్యభూములకుఁ; దద్దాస్యంబు గావించి య
క్కరుణావార్ధి భజింపకుందురె బుధుల్ కౌరవ్యవంశాగ్రణీ! 1334

* ఓ రాజా! మహోత్సాహంతో కృష్ణుడు మురళిని మ్రోగిస్తే ఆ గానం విని కృష్ణుణ్ణి సేవించాలనే కాంక్షతో సుందరగోపస్త్రీలు పరమానందంతో బృందావనప్రాంతాలకు పరుగెత్తుకొని వస్తారు. ప్రాజ్ఞులైనవారు ఆ కరుణామూర్తిని పూజించకుండా ఉండగలరా?

వ. మతి నెవ్వాని యమంగళఘ్న మగు నామం బర్థిఁ జింతించినన్
నుతి గావించిన విన్న మానవులు ధన్యుల్; భూరిసంసార దు
ష్కృతులం ద్రోతురు; కాలచక్ర మహితాస్త్రుం డట్టి యా కృష్ణుఁ డీ
క్షితిభారం బుడుగంగఁ జేయు టిది యే చిత్రంబు? భూవల్లభా! 1335

* మహారాజా! అశుభాన్ని తొలగించే శ్రీకృష్ణుని నామాన్ని చింతించేవారూ, వినేవారు ధన్యాత్ములు, వారు సంసారపరమైన కష్టాలనుంచి విముక్తు లౌతారు. కాలచక్రమనే ఆయుధాన్ని ధరించిన శ్రీకృష్ణుడు ఈ లోకభారాన్ని పోగొట్టడంలో విచిత్ర మేముంది?

వ. ఇ వ్విధంబున గోపికాజన మనోజాతుండైన కృష్ణుండు లీలామానుష నిగ్రహుండై నిజరాజధాని యైన ద్వారకాపురంబున నమానుష విభవంబు లగు సౌఖ్యంబులం బొదలుచుండె నని చెప్పి మఱియు నిట్లనియె. 1336

* ఈ విధంగా గోపికామన్మథుడైన శ్రీకృష్ణుడు లీలామానుష రూపుడై తన రాజధానియైన ద్వారకలో అతిలోకసుఖభోగాల ననుభవిస్తూ ఉన్నాడని చెప్పి శుకమహర్షి పరీక్షిత్తుతో ఇంకా ఇలా అన్నాడు.

**మ. మనుజేంద్రోత్తమః యేను నీకుఁ ద్రిజగన్మాంగల్యమై యొప్పఁ జె**
**ప్పిన యీ కృష్ణకథాసుధారసము సంప్రీతాత్ములై భక్తిఁ గ్రో**
**లిన పుణ్యాత్ములు గాంతు రిందు సుఖముల్; నిర్ధూతసర్వాఘులై**
**యనయంబుం దుదిఁ గాంతు రచ్యుతపదం బైనట్టి కైవల్యమున్. 1337**

* ఓ మహారాజా! ముల్లోకాలకూ శుభదాయకమైన కృష్ణకథాసుధారసాన్ని భక్తితో పానంచేసిన పుణ్యాత్ములు ఈ లోకంలో సుఖాలను పొందుతారు. వారి సమస్త పాపాలూ తొలగిపోతాయి. తుదకు వారు శాశ్వతమైన మోక్షాన్ని చూరగొంటారు.

**క. అని యిట్లు బాదరాయణి, మనమున రాగిల్ల నాభిమన్యునకుం జె**
**ప్పిన విధమున సూతుఁడు ముని, జనుల కెఱింగింప వారు సమ్మతితోడన్. 1338**

* ఈ రీతిగా శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు చెప్పిన ప్రకారంగా సూతుడు శౌనకాది మహామునులకు తెలిపాడు. వారెంతో సంతోషించారు.

**క. సూతుని బహువిధముల సం, ప్రీతునిఁ గావించి మహిమఁ బెంపారుచు వి**
**ఖ్యాతికి నెక్కిన కృష్ణక, థాతత్పరులైరి బుద్ధిఁ దఱుఁగని భక్తిన్. 1339**

* ఆ మునులు సూతుణ్ణి సత్కరించి అతనికి సంతోషం కలిగించారు. వారందరికీ కృష్ణుని గాథలపై ఆసక్తీ, భక్తీ పెరిగింది.

**చ. సరసి జపత్రనేత్ర! రఘుసత్తమ! దుష్టమదాసురేంద్ర సం**
**హరణ! దయాపయోధి! జనకాత్మభవానన పద్మమిత్ర! భా**
**స్కర కులవార్ధిచంద్ర! మిహికావసుధాధరసూతిసన్నుత**
**స్ఫురితచరిత్ర! భక్త జనపోషణ భూషణ! పాపశోషణా! 1340**

* పద్మపత్రాలవంటి నేత్రాలు కలవాడా! రఘూత్తమా! అసురసంహారా! దయాసాగరా! సీతాముఖ కమలానికి సూర్యుని వంటివాడా! ఇనకుల మనే సాగరానికి సంపూర్ణ చంద్రుడైనవాడా! పార్వతీదేవిచే స్తుతింపబడే సుచరిత్ర కలవాడా! భక్తజనాన్ని పోషించడమే అలంకారంగా కలవాడా! పాపహరణా!

**క. మారీచభూరిమాయా, నీరంధ్రమహాంధకార నీరేజహితా!**
**క్ష్మారమణవినుత పాదాం, భోరుహ! మహితావతార! పుణ్యవిచారా! 1341**

* మారీచు డనే రాక్షసునిచేత కల్పించబడ్డ మాయ అనే దట్టమయిన అంధకారానికి సూర్యుడైన వాడా! రాజులచే వినుతింపబడే పాదపద్మాలు కలవాడా! ప్రశస్తమైన అవతారాలు దాల్చిన వాడా! పుణ్యాత్ముడా!

**మాలిని. శరధి మదవిరామా! సర్వలోకాభిరామా!**
**సురరిపువిషభీమా! సుందరీలోకకామా!**

ధరణీవరలలామా! తాపసస్తోత్రసీమా!
సురచిరగుణధామా! సూర్యవంశాబ్ధిసోమా! 1342

* సముద్రుని గర్వాన్ని అణచినవాడా ! సర్వలోకాలకూ సుందరు డైనవాడా ! రాక్షసులకు పరమభయంకరు డైనవాడా! స్త్రీలకు మన్మథునివంటివాడా ! రాజుల్లో శ్రేష్ఠుడైనవాడా ! మునీంద్రులచేత కీర్తింపబడేవాడా ! సుగుణాల కాలవాలమైనవాడా ! సూర్యవంశమనే సముద్రానికి చంద్రునివంటివాడా !

గద్యము. ఇది శ్రీ పరమేశ్వర కరుణాకలిత కవితా విచిత్ర కేసనమంత్రి పుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రణీతంబైన శ్రీమహాభాగవతం బను మహాపురాణంబునందుఁ బ్రద్యుమ్ను జన్మంబును, శంబరోద్యోగంబును, సత్రాజిత్తునకు సూర్యుండు స్యమంతకమణి నిచ్చుటయుఁ దన్నిమిత్తంబునం బ్రసేనుని సింహంబు వధియించుటయు, దాని జాంబవంతుండు దునిమి మాణిక్యంబు గొనిపోవుటయు. గోవిందుండు ప్రసేనుని దునిమి మణిఁ గొనిపోయె నని సత్రాజిత్తు కృష్ణునందు నింద నారోపించుటయుఁ, గృష్ణుండు దన్నిమిత్తంబున జాంబవంతునిం దొడరి మణియుక్తంబుగా జాంబవతిం గొనివచ్చి వివాహం బగుటయు, సత్రాజిత్తునకు మణి నిచ్చుటయు, సత్యభామా పరిణయంబును, బాండవులు లాక్షా గృహంబున దగ్ధు లైరని విని వాసుదేవుండు బలభద్ర సహితుండయి హస్తినాపురంబున కరుగుటయు, నక్రూరకృతవర్మల యనుమతంబున శతధన్వుండు సత్రాజిత్తుఁ జంపి మణిఁ గొనిపోవుటయుఁ, దదర్థం బా సత్యభామ కరినగరంబున కేగి కృష్ణునకు విన్నవించిన నతండు మరలి చనుదెంచి శతధన్వుం ద్రుంచుటయు, బలభద్రుండు మిథిలానగరంబునకుం జనుటయు, నందు దుర్యోధనుండు రాముని వలన గదావిద్య నభ్యసించుటయుఁ, గృష్ణుండు సత్రాజిత్తునకుం బరలోక క్రియలు నడపుటయు, స్యమంతకమణిం దాఁచినవాఁడయి యక్రూరుండు భయంబున ద్వారకానగరంబు విడిచి పోయిన నతని లేమి ననావృష్టి యైనం గృష్ణుం డక్రూరుని మరల రప్పించుటయు, దామోదరుం డింద్రప్రస్థపురంబున కరుగుటయు, నందర్జున సమేతుండయి మృగయా వినోదార్థం బరణ్యంబునకుం జని, కాళిందిం గొనివచ్చుటయు, ఖాండవ దహనంబును, నగ్నిపురుషుం డర్జునునకు నక్షయతూణీర గాండీవ కవచరథరథ్యంబుల నిచ్చుటయు, మయుండు ధర్మరాజునకు సభ గావించి యిచ్చుటయు, నగధరుండు మరలి నిజ నగరంబున కరుగుదెంచి కాళిందిని వివాహం బగుటయు, మిత్రవిందా నాగ్నజితీ భద్రా మద్రరాజకన్యలం గ్రమంబునఁ గరగ్రహణం బగుటయు, నరకాసుర యుద్ధంబును, దద్గృహంబున నున్న రాజకన్యకలం బదాఱువేలం దెచ్చుటయు, స్వర్గ గమనంబును, నదితికిం గుండలంబు లిచ్చుటయుఁ, బారిజాతాపహరణంబును, బదాఱువేల రాజకన్యలం బరిణయం బగుటయు, రుక్మిణీదేవి విప్రలంభంబును, రుక్మిణీస్తోత్రంబును, గృష్ణకుమారోత్పత్తియుఁ, దద్గురుజన సంఖ్యయుఁ, బ్రద్యుమ్ను వివాహంబును, ననిరుద్ధు జన్మంబును, దద్వివాహార్థంబు కుండిన నగరంబునకుం జనుటయు, రుక్మిబలభద్రుల జూదంబును, రుక్మి వధయు, నుషాకన్య యనిరుద్ధుని స్వప్నంబునం గని మోహించుటయుఁ, దన్నిమిత్తంబునఁ, జిత్రరేఖ సకలదేశ రాజులఁ బటంబున లిఖించిచూపి యనిరుద్ధునిఁ దెచ్చుటయు, బాణాసుర యుద్ధంబును, నృగోపాఖ్యానంబును, బలభద్రుని ఘోషయాత్రయుఁ, గాళింది భేదనంబును, గృష్ణుండు పౌండ్రకవాసుదేవ కాశీరాజుల వధించుటయుఁ,

గాశీరాజ పుత్రుండయిన సుదక్షిణుం డభిచారహోమంబు గావించి కృత్యం బడసి కృష్ణపాలికిం బుత్తెంచిన సుదర్శనంబుచేతఁ గృత్యను సుదక్షిణ సహితంబుగాఁ గాశీపురంబును భస్మంబు సేయుటయు, బలరాముండు రైవత నగంబునందు ద్వివిదుండను వనచరుని వధియించుటయు, సాంబుండు దుర్యోధను కూఁతురగు లక్షణ నెత్తి కొని వచ్చినఁ గౌరవు లతనిం గొనిపోయి చెఱఁబెట్టుటయుఁ, దద్వృత్తాంతం బంతయు నారదువలన విని బలభద్రుండు నాగ నగరంబునకుఁ జనుటయుఁ, గౌరవులాడిన యగౌరవ వచనంబులకు బలరాముండు కోపించి హస్తినాపురంబును గంగం బడఁద్రోయ గమకించుటయుఁ, గౌరవులు భయంబున నంగనాయుక్తంబుగా సాంబుని దెచ్చి యిచ్చుటయు, బలభద్రుండు ద్వారకానగరంబునకు వచ్చుటయు, నారదుండు హరి పదాఱువేల కన్యకల నొకముహూర్తంబున నందఱ కన్ని రూపులై వివాహం బయ్యెనని విని తత్ప్రభావంబు దెలియంగోరి యరుగుదెంచుటయుఁ, దన్మాహాత్మ్యంబు సూచి మరలి చనుటయు, జరాసంధునిచేత బద్ధులైన రాజులు కృష్ణపాలికి దూతం బుత్తెంచుటయు, నారదాగమనంబును, బాండవుల ప్రశంసయును, నుద్ధవ కార్యబోధంబును, నింద్రప్రస్థాగమనంబును, ధర్మరాజు సేయు రాజసూయారంభంబును, దిగ్విజయంబును, జరాసంధ వధయును, రాజ బంధమోక్షణంబును, రాజసూయంబు నెఱవేర్చుటయును, శిశుపాలవధయును, నవభృథంబును, రాజసూయ వైభవదర్శనా సహమాన మానసుండయి సుయోధనుండు మయనిర్మిత సభామధ్యంబునం గట్టిన పుట్టంబులు దడియం ద్రెళ్ళుటయుఁ, దన్నిమిత్తపరిభవంబు నొంది రారాజు నిజపురి కరుగుటయుఁ, గృష్ణుండు ధర్మరాజ ప్రార్థితుం డయి యాదవుల నిలిపి కొన్ని నెలలు ఖాండవప్రస్థంబున వసియించుటయు, సాళ్వుండు దపంబు సేసి హరుని మెప్పించి సౌంభకాఖ్యంబగు విమానంబు వడసి నిజసైన్య సమేతుండై ద్వారకానగరంబు నిరోధించుటయు, యాదవసాళ్వయుద్ధంబును, గృష్ణుండు మరలి చనుదెంచి సాల్వుం బరి మార్చుటయును, దంతవక్త్రవధయును, విదూరథ మరణంబును, గృష్ణుండు యాదవబల సమేతుండై క్రమ్మఱ నిజపురంబునకుం జనుటయును, గౌరవ పాండవులకు యుద్ధం బగునని బలదేవుండు తీర్థయాత్ర సనుటయు, నందు జాహ్నవీ ప్రముఖనదులం గృతస్నానుం డయి నైమిశారణ్యంబునకుం జనుటయు, నచ్చటి మునులు పూజింపం బూజితుండయి తత్సమీపంబున నున్నతాసనంబున నుండి సూతుండు దన్నుం గని లేవకున్న నలిగి రాముండు గుశాగ్రంబున నతని వధించుటయు, బ్రహ్మహత్యా దోషంబు గలిగెనని మునులు వలికిన సూతుం బునర్జీవితుం జేయుటయు, న మ్మునులకుం బ్రియంబుగాఁ గామపాలుం డిల్వల సుతుండగు పల్వలుం బరిమార్చుటయు, వారిచేత ననుమతుండయి హలధరుండు దత్సమీపతీర్థంబుల స్నాతుండయి గంగాసాగర సంగమంబునకుం జనుటయు, మహేంద్ర నగప్రవేశంబును, బరశురామ దర్శనంబును, సప్తగోదావరిం గ్రుంకుటయు, మఱియు మధ్యదేశంబునం గల తీర్థంబు లాడి శ్రీశైల వేంకటాచలంబులు దర్శించుటయు, వృషభాద్రి హరిక్షేత్ర సేతుబంధ రామేశ్వరములం గని తామ్రపర్ణీతీర్థంబు లాడుటయు, గోదానంబు లొనరించి మలయగిరియందు నగస్త్యునిం గనుటయు, సముద్ర కన్యా దుర్గాదేవుల నుపాసించుటయు, నందు బ్రాహ్మణజనంబు వలనం బాండవ ధార్తరాష్ట్ర భండనంబున సకల రాజలోకంబును మృతి నొందిరని వినుటయు, వాయునందన సుయోధనులు గదా యుద్ధసన్నద్ధు లగుట విని వారిని వారించుటకై, రౌహిణేయుండందుల

కరుగుటయు, నచట వారిచేతం బూజితుండయి వారి నివారింపలేక మగిడి ద్వారక కరుగుటయుఁ, గొన్ని వాసరంబులకు మరల నైమిశారణ్యంబునకుం బోయి యచట యజ్ఞంబు సేసి రేవతియుం దానును నవభృథం బాడి నిజపురంబున కేతెంచుటయుఁ, గుచేలోపాఖ్యానంబును, సూర్యోపరాగంబునం గృష్ణుఁ డు రామునితోఁజేరి పురరక్షణంబునకుఁ బ్రద్యుమ్నాది కుమారుల నిలిపి షోడశ సహస్రాంగనా పరివృతుండయి యక్రూర వసుదేవోగ్ర సేనాది యాదవ వీరులు దోడరా స్యమంతపంచక తీర్థంబున కరిగి కృతస్నానుండయి వసియించి యుండుటయుఁ, బాండవకౌరవాది సకల రాజలోకంబును దత్తీర్థంబునకు వచ్చుటయుఁ, గుంతీదేవి దుఃఖంబును, నందయశోదా సహితులైన గోపగోపికా జనంబులు చనుదెంచుటయుఁ, గుశలప్రశ్నాది సంభాషణంబులును, మద్ర కన్యా ద్రౌపదీ సంభాషణంబును, దదనంతరంబ సకల రాజలోకంబును స్యమంతపంచకతీర్థంబున స్నాతులై రామకృష్ణాదియాదవ వీరుల నామంత్రణంబు చేసి నిజదేశంబులకుఁ బోవుటయుం, గృష్ణుని దర్శించుటకు మునీంద్రు లేతెంచుటయు, వారి యనుమతిని వసుదేవుండు యాగంబు నెరవేర్చుటయు, నందయశోదాది గోపికానివహంబుల నిజపురంబున కనిచి యుగ్రసేనాది యాదవ వీరులుం దానును మాధవుండు నిజపురప్రవేశంబు సేయుటయుఁ, దొల్లి కంసునిచేత హతులై బలిపురంబున నున్న దేవకీదేవి సుతుల రామకృష్ణులు యోగమాయా బలంబునఁ దెచ్చి యామె కిచ్చుటయు, నర్జునుండు సుభద్రను వివాహం బగుటయుఁ, గృష్ణుండు మిథిలానగరంబున కరుగుటయు, శ్రుతదేవజనకుల చరిత్రంబును, వారలతో బ్రాహ్మణ ప్రశంస సేయుటయు, శ్రుతిగీతలును, గృష్ణుండు మఱలి తన పురంబున కరుగుదెంచుటయు హరి హర బ్రహ్మల తారతమ్య చరిత్రంబును, గుశస్థలినుండు బ్రాహ్మణుని చరిత్రంబును, నతనితనయులు పరలోకంబునకుం బోయినఁ గృష్ణార్జునులు తమ యోగబలంబున వారిం దెచ్చి య విప్రున కిచ్చుటయుఁ గృష్ణుం డర్జునుని వీడ్కొని ద్వారక కరుగుటయు, నందు మాధవుండయ్యె ప్రదేశంబుల సకల భార్యా పరివృతుండయి విహరించుటయు, యాదవ వృష్ణి భోజాంధకవంశ చరిత్రంబును నను కథలు గల దశమస్కంధంబు నందు నుత్తరభాగము. 1343

* కేసనమంత్రి పుత్త్రుడూ, సహజ పాండిత్యుడూ, పరమేశ్వరునివల్ల ప్రాప్తించిన కవిత్వరచనా పాటవం కలవాడూ అయిన పోతన దశమస్కంధం ఉత్తరభాగంలో ప్రద్యుమ్నుడు పుట్టింది మొదలుకొని శ్రీకృష్ణుడు ద్వారకలో సుఖంగా రాజ్యాన్ని పరిపాలిస్తూ ఉన్నా డనేంతవరకూ గల కథాభాగాలను క్రమంగా చెప్పడం జరిగింది.

**శ్రీ కృష్ణార్పణమస్తు**

# పోతన భాగవతము

## ఐదవ సంపుటము

### పదునొకండవ స్కంధము

# ప్రవేశిక

ఏకాదశ స్కంధంలో విశ్వామిత్రాది ఋషుల శాపవృత్తాంతం, నిమినవయోగీంద్ర సంవాదం, బ్రహ్మాదుల సంప్రార్థనం, కృష్ణోద్ధవ సంవాదం, అవధూతోపాఖ్యానం, యదుకుల వినాశనం, శ్రీకృష్ణావతారం సమాప్తి అనే ఘట్టాలు ఉన్నాయి.

దశమ స్కంధంలోని ఘట్టాలన్నీ పోతనగారు రచించగా ఏకాదశ ద్వాదశ స్కంధాలు పోతన్నగారి ప్రియశిష్యుడు వెలిగందల నారయ రచించాడు.

నిమిచక్రవర్తి యజ్ఞ మంటపానికి కవి, హవి, అంతరీక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, ద్రుమిళుడు, చమసుడు, కరభాజనుడు అనే తొమ్మిది మంది యోగీంద్రులు వస్తారు. నిమిచక్రవర్తి ఆ తొమ్మిది మందినీ తొమ్మిది ప్రశ్నలు అడుగుతాడు. అందుకు వారు సముచితమైన సమాధానాలు చెబుతారు. ఆ ప్రశ్నలివి. 1. భక్తులకు శుభప్రదమైనది ఏది? 2. భాగవతుల స్వభావ మెటువంటిది? 3. భగవంతుని మాయాస్వరూపం ఎటువంటిది? 4. భగవన్మాయనుండి విడివడే ఉపాయం ఏమిటి? 5. బ్రహ్మస్వరూప మెటువంటిది? 6. నైష్కర్మ్యము అంటే ఏమిటి? 7. భగవంతుని అవతారములు ఏమిటి? వాటి గుణములు ఏమిటి? 8. భగవద్విముఖులైన జీవుల గతి ఏమిటి? 9. భగవంతుడు ఏ యుగంలో ఏ నామంతో ఏ రూపంతో పూజింపడతాడు?

శ్రీకృష్ణోద్ధవ సంవాదంలో శ్రీకృష్ణుడు అనేక విధములైన ఉపదేశాలు చేస్తాడు. అవి ఉద్ధవగీతలు అని ప్రసిద్ధి గాంచాయి. వాటిలో అవధూత యదు సంవాదము పేర్కొనదగింది. యయాతి నందనుడైన యదు మహారాజు ఒకానొక అవధూతను సందర్శిస్తాడు. ఆయన ఆ విధంగా ధార్మిక జీవనం గడపటానికి కారణం అడుగుతాడు. అప్పుడు అవధూత తాను ఇరవైనలుగురు గురువుల వద్ద నానా విధములైన ఉపదేశాలను గ్రహించి ఈ విధంగా అవధూత జీవనం గడుపుతున్నానని ప్రత్యుత్తర మిస్తాడు. ఆ ఉపదేశాలు ఇలా ఉంటాయి.

1.భూమి నుండి క్షమాగుణాన్నీ పరోపకార ప్రవృత్తినీ నేర్చుకున్నాడు. 2. వాయువు నుండి ప్రాణవృత్తితో సంతుష్టి చెందటం తెలుసుకున్నాడు. 3. ఆకాశం నుండి పరమాత్మ సర్వవ్యాపి అని నేర్చుకున్నాడు. 4. జలం నుండి నిర్మలత్వం, పావనత్వం గ్రహించాడు. 5. అగ్ని నుండి సర్వభక్షకత్వం నేర్చుకున్నాడు. 6. చంద్రుని నుండి శరీరం యొక్క క్షయవృద్ధులు గ్రహించాడు. 7. సూర్యుని నుండి వస్తు స్పర్శ ఉన్నప్పటికీ ఆసక్తి లేకుండటం నేర్చుకున్నాడు. 8. పావురం నుండి ఆలుబిడ్డల యందు అత్యాసక్తి వల్ల కలిగే పరిణామాన్ని తెలుసుకున్నాడు. 9.అజగరం నుండి యదృచ్ఛా లబ్ధమైన వస్తువుతో సంతృప్తి చెందటం నేర్చుకున్నాడు. 10. సముద్రం నుండి ప్రసాద గాంభీర్యాలూ, సుఖదుఃఖాల యందు సమానత్వం నేర్చుకున్నాడు. 11. శలభం (మిడుత) నుండి రూపంపై ఆసక్తివల్ల కలిగే నష్టం తెలుసుకున్నాడు. 12. తేనెటీగ నుండి కూడబెట్టటం వల్ల కలిగే ఫలితం గ్రహించాడు. 13. ఏనుగు నుండి స్పర్శసుఖం వల్ల వచ్చే అనర్థాన్ని ఆకళించు కున్నాడు. 14. తుమ్మెదవల్ల సారగ్రహణాన్ని గ్రహించాడు. 15. లేడివల్ల గానాసక్తిచే కలిగే అనర్థాన్ని గ్రహించాడు. 16. చేపనుండి జిహ్వాచాపల్యం వల్ల కలిగే నష్టాన్ని అర్థం చేసుకున్నాడు. 17. పింగళ అనే వేశ్య నుండి నిరంతర నిరీక్షణం వల్ల సంభవించే నైరాశ్యాన్ని తెలుసుకున్నాడు. 18. చెకుముకి పిట్టవల్ల విషయవిరక్తిని నేర్చుకున్నాడు. 19. బాలుని నుండి నిరంతర నిశ్చింతను నేర్చుకున్నాడు. 20. కుమారి నుండి సాంగత్య త్యాగాన్ని గ్రహించాడు. 21. శర నిర్మాత నుండి ఏకాగ్రతను గ్రహించాడు. 22. సర్పం నుండి ఒంటరితనాన్ని సర్వత్ర సంచారాన్నీ అభ్యసించాడు. 23. భ్రమర కీటకం నుండి ఎదుటి వస్తువుల సారూప్యాన్ని పొందటం గ్రహించాడు. 24. సాలెపురుగు నుండి భగవంతుని సృష్టి, లయము గ్రహించాడు.

ఈ విధంగా ఇరవై నలుగురు గురువుల నుండి తాను పొందిన ఉపదేశాన్నీ గ్రహించిన విశేషాలనూ, అవధూత యదు మహారాజుకు బోధిస్తాడు.

విశ్వామిత్ర, వసిష్ఠ నారదాది మహామునులంతా ద్వారకా నగరానికి వచ్చి శ్రీకృష్ణుణ్ణి సందర్శించి ఇలా అంటున్నారు.

**తరణంబులు భవజలధికి; హరణంబులు దురితలతల; కాగమముల కా**
**భరణంబు; లార్తజనులకు, శరణంబులు నీదు దివ్య చరణంబు లిలన్.** **11-15**

అచ్చంగా గురువుగారైన పోతన్నగారి శైలిలో నడచిన పద్యమిది. "సుజ్ఞానం'' అంటే ఏమిటో ఎంత సంక్షిప్త సుందరంగా సెలవిచ్చారో నారయ్యగారు!

**కరణత్రయంబు చేతను, నరు డే కర్మంబు సేయు నయ్యై వేళన్**
**"హరి కర్పణ" మని పలుకుట, పరువడి సుజ్ఞానమండ్రు పరమమునీంద్రుల్. 11-42**

నరుడు నారాయణుణ్ణి చేరాలంటే ఏమి చేయాలో ఈ సీస పద్యంలో చెప్పబడింది. గమనించండి-

**సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు వీనుల కింపుగా విన(గ వలయు**
**హర్షంబు తోడుత హరినామ కథనంబు పాటల నాటుల( బర(గ వలయు**
**నారాయణుని దివ్య నామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్నవలయు**
**కంజాక్షు లీలలు కాంతారముల నైన భక్తి యుక్తంబుగా పాడవలయు**

**వెఱ్ఱి మాడ్కిని లీలతో విశ్వమయుని, నొడువుచును లోకబాహ్యత నొందవలయు**
**నింతయును విష్ణుమయమని యెఱుగవలయు, భేద మొనరింప వలవదు మేదినీశ! 11-44**

ఎవరికీ ఖేదం కలిగించకుండా అంతా విష్ణుమయం అన్న భావం కలిగితే ఇంక కావలసిందేముంది?

నిరంతరం నారయ్యగారికి కనిపించే నారాయణమూర్తి రూపం ఈ నాణ్యమైన పద్యంలో ఎంత ముగ్ధ మనోహరంగా ఉన్నదో చిత్తగించండి.

**నగుమొగమున్ సుమధ్యమును నల్లని మేనును లచ్చి కాట ప**
**ట్టగు నురమున్ మహాభుజము లంచిత కుండల కర్ణముల్ మదే**
**భగతియు నీలవేణియు(, గృపారసదృష్టియు( గల్గు వెన్ను( డి**
**మ్ముగ పొడసూపుగాత కనుమూసిన యప్పుడు విచ్చినప్పుడున్. 11-124**

ప్రాజ్ఞులూ, అభిజ్ఞులూ, రసజ్ఞులూ ఐన భాగవత పాఠక మహోదయులందరికీ అభివందనాలు. ఈ సంపుటంతో పోతన భాగవతం సంపూర్ణ మయింది. మందార మకరంద మాధుర్యమయమూ, నిర్మల మందాకినీ వీచికా విలసితమూ, బాలరసాలసాల నవపల్లవ కోమలమూ, భక్తిరస ప్రపూర్ణమూ అయిన పోతన భాగవతాన్ని ప్రతిపద్యభావార్థ సహితంగా సర్వాంగసుందరంగా ప్రకటింపవలెనన్న తిరుమల తిరుపతి దేవస్థానములవారి సత్ సంకల్పం సమగ్రంగా నెరవేరింది. ఈ పుణ్యకార్యంలో నాకున్నూ కొంత అవకాశం కల్పించిన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.వి.యస్. ప్రసాద్, ఐ.ఏ.యస్., గారికీ, డాక్టర్ రావుల సూర్య నారాయణమూర్తి పి.ఆర్.ఓ., గారికీ. ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు. ఎం.ఏ., గారికీ నా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు.

ఇందలి ఏకాదశస్కంధానికి హృద్యమైన గద్యానువాదం చేసినవారు శ్రీ ప్రసాదరాయ కులపతిగారు. వీరు మహాకవులు. మహా విద్వాంసులు. సంస్కృతాంధ్రములలో సరసమైన కృతులు రచించిన వారు. గుంటూరు హిందూ కళాశాలలో ఆంధ్రశాఖాధ్యక్షులుగా ఉన్నారు. వీరి అనువాదము ప్రసన్న మధురము. "ఆంధ్ర భాగవత విమర్శ'' అనే పరిశోధన గ్రంథం రచించి డాక్టరేట్ పట్టం అందుకున్నారు.

ఈ సంపుటాన్ని ముచ్చటగా ముద్రించి యిచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ ఎం. విజయ కుమార్ రెడ్డి గారికీ, వారి సిబ్బందికీ నా శుభాకాంక్షలు. సహస్రాక్షులై ప్రూపులు సరిదిద్దిన మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యుల వారికీ, శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి ఎం.ఎ., గారికి నా ధన్యవాదాలు. నిర్దుష్టంగా ప్రెస్ కాపీని సిద్ధంచేసి యిచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, ఎం.ఎ., ఎం. ఫిల్., కు నా విజయాశీస్సులు.

**గుంటూరు** **భవదీయుడు**
**15-6-1991** **కరుణశ్రీ**

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# పోతన భాగవతము

## (సరళ గద్యానువాద సహితము)

## పదునొకండవ స్కంధము

### పరీక్షిన్మహారాజు శుకయోగీంద్రు నడిగెడు ప్రశ్న

శ్రీ సీతాపతి! లంకే
శాసురసంహారచతుర! శాశ్వత! నుత వా
ణీసత్యధిభూభవవృ
త్రాసురరిపుదేవజాల! రామనృపాలా! 1

* శ్రీ జానకీవల్లభా! రావణుని చంపుటలో చతురుడా! శాశ్వతుడా! బ్రహ్మేశ్వరేంద్రాది దేవతా సమూహముచే పొగడబడినవాడా! రామనరపాలా! అవధరించు!

వ. మహనీయగుణగరిష్ఠులగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యాన వైఖరీ సమేతుండైన సూతుం డిట్లనియె; నట్లు ప్రాయోపవిష్టుం డైన పరీక్షిన్నరేంద్రుం గని శుకయోగీంద్రుం 'డయ్యా! జన్మ కర్మవ్యాధి విమోచనంబునకుఁ గారణంబగు దివ్యౌషధంబు గావున శ్రీమన్నారాయణ కథామృతంబుఁ గ్రోలు' మని యిట్లనియె. 2

* ఉత్తమ గుణాలు గలవారిలో శ్రేష్ఠులైన ఆ మునులతో అన్ని పురాణాలనూ వివరంగా చెప్పు నేర్పుగల సూతు డీ విధంగా అన్నాడు. "ఆ విధంగా ప్రాయోపవేశం చేసి ఉన్న పరీక్షిన్మహారాజును చూచి శుక యోగీంద్రుడు "అయ్యా! పుట్టుక, కర్మ, రోగం - వీటినుండి విముక్తి కలగటానికి కారణమైన దివ్యౌషధము శ్రీమన్నారాయణ చరితామృతం. ఆ అమృతాన్ని త్రాగవలసింది" - అని ఇంకా యిలా అన్నాడు.

మ. బలవత్సైన్యముతోడఁ గృష్ణుఁడు మహాబాహా బలోపేతుఁడై
కలనన్ రాక్షసవీరవర్యుల వడిన్ ఖండించి, భూభార ము
జ్జ్వలమై యుండఁగ ద్యూత కేళికతనం జావంగఁ గౌరవ్య స
ద్బలముం బాండవ సైన్యము న్నడఁచె భూభాగంబు గంపింపఁగన్. 3

* బలవంతమైన సైన్యంతో గొప్పభుజబలం గలవాడై కృష్ణుడు యుద్ధంలో రాక్షసవీరులను వేగంగా ఖండించాడు. భూభారం ఇంకా ఎక్కువగా ఉండటంచేత ద్యూతక్రీడ కారణంగా భూమి అదిరేలా కౌరవ పాండవ యుద్ధం జరిపించి ఉభయ సైన్యాలనూ హతమార్చాడు.

వ. అంత. 4

క. మునివరులు సంతసిల్లిరి, యనయము నందాదులకును హర్షం బయ్యెం;
దన నిజభక్తులు యాదవ, ఘనవీరసమూహ మపుడు గడు నొప్పెసఁగెన్. 5

* అప్పుడు హరిభక్తులూ, మహావీరులూ అయిన యాదవులు యుద్ధంలో నశింపక మిక్కిలి వృద్ధిచెందుతుండటం చూచి మునివరులు, నందుడు మొదలైనవారు చాలా సంతోషం పొందారు.

మ. విదితుండై సకలామరుల్ గొలువ నుర్వీభారమున్ మాన్పి, దు
ర్మద సంయుక్త వసుంధరాధిపతులన్ మర్దించి, కంసాదులం
దుదిముట్టన్ వధియించి, కృష్ణుఁ డతిసంతుష్టాత్ముఁడై యున్నచో
యదుసైన్యంబులు భూమి మోవఁగ నసహ్యం బయ్యె నత్యుగ్రమై. 6

* దేవతలంతా కొలుస్తుండగా ప్రశస్తి నందినవాడై, దుర్మదాంధులైన రాజులను మర్దించి, కంసుడు మొదలైన వారిని సంహరించి, భూమికి బరువును తగ్గించి కృష్ణుడు మిక్కిలి సంతుష్టితో ఉండగా యదు సైన్యాలు విజృంభించి భూమి మోయలేని స్థితి వచ్చింది.

సీ. ఈ రీతి శ్రీకృష్ణుఁ డేపారఁ బూతనా శకట తృణావర్త సాల్వ వత్స
చాణూర ముష్టిక ధేను ప్రలంబక దైత్యౌఘ శిశుపాల దంతవక్త్ర
కంస పౌండ్రాదిక ఖండనం బొనరించి యటమీఁదఁ గురుబలం బణఁచి మఱియు
ధర్మజు నభిషిక్తుఁ దనరఁగాఁ జేసిన నతఁడు భూపాలనం బమరఁజూచి

తే. భక్తులగు యాదవేంద్రులఁ బరఁగఁజూచి, యన్యపరిభవ మెఱుఁగ రీ యదువు లనుచు
వీరిఁ బరిమార్ప నేఁ దక్క వేఱొకండు, దైవ మిఁక లేదు త్రిభువనాంతరమునందు. 7

* శ్రీకృష్ణుడు - పూతన, శకటాసురుడు, తృణావర్తుడు, వత్సాసురుడు, ధేనుకాసురుడు, ప్రలంబాసురుడు మొదలైన రాక్షసులనూ; చాణూరముష్టికులనూ; కంస, సాల్వ, పౌండ్రక, శిశుపాల, దంతవక్త్రులనూ సంహరించి, ఆపైన కురుబలాన్ని అణచివేసి, ధర్మరాజును చక్రవర్తిగా అభిషేకించాడు. ధర్మజుడు భూపాలనం చేస్తున్నాడు. అప్పుడు శ్రీకృష్ణుడు “తన భక్తులైన యాదవులు ఇతరులవల్ల అవమానం ఎరుగరు. వీరిని సంహరించడానికి నేను తప్ప వేరే దైవం మూడులోకాలలోను లేడు'' - అని భావించాడు.

వ. అని వితర్కించి జగదీశ్వరుం ‘డత్యున్నత వేణుకాననంబు వాయు వశంబున నొరసికొన ననలం బుద్భవంబయి దహించు చందంబున యదుబలంబుల కన్యోన్య వైరానుబంధంబులు గల్పించి హతం బొన ర్చెద’ నని విప్రశాపంబు మూలకారణంబుగాఁ దలంచి యదుబలంబుల నడంచెనని పలికిన మునివరునకు రాజేంద్రుం డిట్లనియె. 8

* ఇలా తర్కించి లోకనాయకుడైన వాసుదేవుడు చాలా ఎత్తైన వెదురుకాన గాలికి ఒరుసుకొని పుట్టిన నిప్పుతో తనకుతానే కాలిపోయే విధంగా యదుబలాలకు పరస్పర విరోధాన్ని కల్పించి నాశనం

చేయాలని నిశ్చయించాడు. దానికి బ్రాహ్మణశాపం మూలకారణంగా తలచాడు. అనుకున్న ప్రకారంగా యాదవనాశనం కలిగించాడని పలికిన శుకునితో పరీక్షిత్తు ఇలా అన్నాడు.

క. 'హరిపాదకమల సేవా, పరులగు యాదవుల కెట్లు బ్రాహ్మణశాప
స్ఫురణంబు సంభవించెనొ, యరయఁగ సంయమివరేణ్య! యానతి యీవే ! 9

* మహానుభావా! కృష్ణుని చరణపద్మాలను ఎప్పుడు సేవిస్తూ ఉండే యాదవులకు బ్రాహ్మణశాపం ఎలా కలిగిందో ఆనతీయండి.

క. అనిన జనపాలునకు ని, ట్లని సంయమికులవరేణ్యుఁ డతి మోదముతో
విను మని చెప్పఁగఁ దొడఁగెను, ఘనతర గంభీర వాక్ప్రకాశస్ఫురణన్. 10

* ఇలా అడిగిన రాజునకు సంయమిశ్రేష్ఠుడైన శుకుడు ఘనతరములూ, గంభీరములూ అయిన వాక్కులతో చెప్పటం మొదలు పెట్టాడు.

## -: విశ్వామిత్ర వసిష్ఠ నారదాది మహర్షులు శ్రీకృష్ణ సందర్శనంబునకు వచ్చుట :-

వ. నిరుపమసుందరం బయిన శరీరంబు ధరియించి సమస్తకర్మ తత్పరుండై పరమేశ్వరుండు యదువుల నడంగింపఁ దలఁచు సమయంబున జటావల్కల కమండలుధారులును, రుద్రాక్షభూతిభూషణ ముద్రా ముద్రితులును, కృష్ణాజినాంబరులును నగు విశ్వామిత్రాసిత దుర్వాసోభృగ్వంగిరఃకశ్యప వామదేవవాలఖిల్యాత్రి వసిష్ఠ నారదాది మునివరులు స్వేచ్ఛావిహారంబున ద్వారకానగరంబున కరుదెంచి యందు. 11

* సాటిలేని అందమైన తనువు దాల్చి అన్ని కర్మలయందూ ఆసక్తి గలవాడై పరమేశ్వరుడైన కృష్ణుడు యాదవుల నణచివేయాలని సంకల్పించిన సమయాన జటావల్కలాలూ, కమండలువులూ ధరించి, నల్లజింకతోలూ, రుద్రాక్షలూ, విభూతి అలంకరించిన శరీరాలతో విశ్వామిత్రుడు, అసితుడు, దుర్వాసుడు, భృగువు, అంగరసుడు, కశ్యపుడు, వామదేవుడు, వాలఖిల్యులు, అత్రి, వసిష్ఠుడు, నారదుడు మొదలైన మునిశ్రేష్ఠులు స్వేచ్ఛావిహారం చేస్తూ ద్వారకా నగరానికి వచ్చారు.

సీ. ఘనుని శ్రీకృష్ణునిఁ గౌస్తుభాభరణునిఁ గర్ణకుండలయుగ్మ ఘనకపోలుఁ
బుండరీకాక్షు సంభోధరశ్యామునిఁ గలితనానారత్న ఘన కిరీటు
నాజానుబాహు నిరర్గళాయుధహస్తు శ్రీకరపీతకౌశేయవాసు
రుక్మిణీనయన సరోజ దివాకరు బ్రహ్మాదిసుర సేవ్యపాదపద్ము

తే. దుష్టనిగ్రహ శిష్టసంతోషకరణుఁ,గోటిమన్మథలావణ్యకోమలాంగు
నార్తజన రక్షణైక విఖ్యాత చరితుఁ, గనిరి కరుణా సముద్రుని ఘనులు మునులు. 12

* గొప్పవాడూ, కౌస్తుభమణి ఆభరణముగా దాల్చినవాడూ, కుండలాల కాంతులతో ప్రకాశించే చెంపలుగలవాడూ, తెల్లదామరలవంటి కన్నులు గలవాడూ, మేఘంవలె నల్లనివాడూ, అనేక రత్నాలు పొదిగిన

మకుటం దాల్చినవాడూ, ఆజానుబాహుడూ, చేతులలో చక్రాది ఆయుధాలు ధరించినవాడూ, శ్రీకరమైన పచ్చనిపట్టువస్త్రం కట్టుకొన్నవాడూ, రుక్మిణీదేవి నయనపద్మాలకు సూర్యునివంటి వాడూ, బ్రహ్మ మొదలైన దేవతలచేత సేవింపదగిన చరణకమలాలు గలవాడూ, దుష్టులను శిక్షించి శిష్టులకు సంతోషం కలిగించేవాడూ, కోటిమంది మన్మథుల లావణ్యం పుణికిపుచ్చుకొన్న కోమలమైన శరీరం గలవాడూ, ఆర్తులైన జనులను రక్షించటంలో ప్రసిద్ధమైన చరిత్ర గలవాడూ, దయకు సముద్రం వంటివాడూ - అయిన శ్రీకృష్ణుణ్ణి ఆ ఘనులైన మునులు అవలోకించారు.

**క. వచ్చిన మునిసంఘములకు, విచ్చలవిడి నర్ఘ్యపాద్యవిధు లొనరింపన్**
**మెచ్చగు కనకాసనముల నచ్చుగఁ గూర్చుండి వనరుహాక్షునితోడన్.** 13

* వచ్చిన మునులకు అర్ఘ్యం, పాద్యం మొదలైన మర్యాదలు చేసిన అనంతరం వారు మేలిమి బంగారపు టాసనాలమీద కూర్చుండి పద్మ నేత్రుడైన కృష్ణునితో ఇలా అన్నారు.

**క. జనములు నిను సేవింపని, దినములు వ్యర్థంబు లగుచుఁ దిరుగుచు నుండుం**
**దనువులు నిలుకడ గావఁట, వనములలో నున్ననైన వనరుహనాభా!** 14

* పద్మనాభా! జనులు నిన్ను సేవించని రోజులు వృథాగా జరిగిపోతుంటాయి. అడవులలో నున్నా శరీరాలకు నిలుకడలేదు.

**క. తరణంబులు భవజలధికి, హరణంబులు దురిత లతల కాగమముల కా**
**భరణంబు లార్తజనులకు, శరణంబులు, నీదు దివ్యచరణంబు లిలన్.** 15

* నీ దివ్యచరణాలు భవసముద్రం దాటించే తెప్పల వంటివి. పాపాలనే తీగలను హరించేవి. ఆగమములకు అలంకారా లైనవి. ఆర్తులైన వారికి శరణా లైనవి.

**మత్త. ఒక్క వేళను సూక్ష్మరూపము నొందు దీ వణుమాత్రమై**
**యొక్క వేళను స్థూలరూపము నొందు దంతయు నీవయై**
**పెక్కురూపులు దాల్తు నీ దగుపెంపు మాకు నుతింపఁగా**
**నక్కజం బగుచున్న దేమన? నంబుజాక్ష! రమాపతీ!** 16

* పద్మలోచనా! రమావల్లభా! ఒకమాటు చాలా చిన్న అణువంతరూపం పొందుతావు. ఒకప్పుడు పెద్ద ఆకృతి ధరిస్తావు. అంతా నీవై అనేకరూపాలు ధరిస్తున్న నీ మహిమ స్తోత్రం చేయటానికి మాకు అలవి గాక ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది.

**క. శ్రీనాయక! నీ నామము, నానాభవరోగకర్మనాశమునకు వి**
**న్నాణం బగు నౌషధ మిది, కానరు దుష్టాత్ము లకట కంజదళాక్షా!** 17

* లక్ష్మీపతీ! పద్మలోచనా! నీ నామం అనేక జన్మలనూ, కర్మలనూ, రోగాలనూ నశింపజేసే విన్నాణమైన మందు. దుష్టాత్ములు దీనిని తెలుసుకోలేకున్నారు.

వ. అని యనేకవిధంబులం బ్రస్తుతించిన మునివరులం గరుణాకటాక్ష వీక్షణంబుల నిరీక్షించి, పుండరీకాక్షుం డిట్లనియె; 'మదీయధ్యాన నామస్మరణంబులు భవరోగ హరణంబులును, బ్రహ్మరుద్రాదిక శరణంబులును, మంగళకరణంబులును నగు' ననియును, 'నా రూపంబులైన మేదినీసురుల పరితాపంబులఁ బరిహరించు పురుషుల నైశ్వర్యసమేతులంగాఁ జేయుదు' ననియును, యోగీశ్వరేశ్వరుం డయిన యీశ్వరుం డానతిచ్చి యనంతరంబ 'మీర లిచ్చటికి వచ్చిన ప్రయోజనం బేమి?' యనిన వారలు 'భవదీయ పాదారవింద సందర్శనార్థంబు కంటె మిక్కిలి విశేషం బొండెద్ది?' యని వాసుదేవ వదన చంద్రామృతంబు నిజనేత్ర చకోరంబులం గ్రోలి యథేచ్ఛా విహారులై ద్వారకానగరంబున కనతిదూరంబున నుండు పిండారకంబను నొక్క పుణ్యతీర్థంబున కరిగి; రంత. 18

* ఇలా ఎన్నో విధాల స్తోత్రం చేసిన మునివరులను దయగల కడకంటిచూపులతో చూచి కృష్ణుడిలా అన్నాడు "నా ధ్యానం, నా నామస్మరణం పునర్జన్మనూ వ్యాధులనూ, హరిస్తుంది. బ్రహ్మ, రుద్రుడు మొదలైన వారికి శరణమైనది. మంగళమును కలిగించేది. నా రూపాలైన బ్రాహ్మణుల బాధలను తొలగించేవారికి ఐశ్వర్యం కలిగిస్తాను'' అని యోగీశ్వరేశ్వరుడైన ఈశ్వరు డానతిచ్చి "మీ రిక్కడికి ఎందుకు వచ్చారు?'' అని అడిగాడు. అందుకు వారు "మీ పాదపద్మాలను దర్శించటం కంటే వేరే విశేష మేముంటుంది?'' అని వాసుదేవుని ముఖచంద్రామృతాన్ని తమ కను లనే చకోరాలతో త్రావి తమ యిష్టానుసారం విహరించే వారై ద్వారకకు పెద్దదూరంగాని "పిండారక'' మనే పుణ్యతీర్థానికి వెళ్ళారు.

క. దర్పించి యాదవులు తమ, నేర్పునఁ గొమరారు సాంబు నెలఁతుకరూపం
బేర్పడ శృంగారించియుఁ, గర్పూర సుగంధిపోల్కిఁ గావించి యొగిన్. 19

* ఆ సమయంలో యాదవబాలకులు కొందరు పొగరెక్కి తమ నేర్పుతో సాంబునకు అందమైన ఆడువేషం వేసి కప్పురపు తావిగల కలికిగా తీర్చిదిద్దారు.

ఉ. మూఁకలు గూడి యాదవులు ముందటఁ బెట్టుక యార్చి నవ్వుచుం
బోకలఁ బోవుచున్ మునిసమూహము కొయ్యన సాఁగి మ్రొక్కుచుం
'బ్రాకటమైన యీ సుదతిభారపు గర్భమునందుఁ బుత్త్రుఁడో
యేకతమందు బాలికయొ యేర్పడఁజెప్పుఁ' డటన్న నుగ్రులై. 20

* యాదవ బాలురు గుంపులు గుంపులుగా చేరి ఆడుతూ, త్రుళ్ళుతూ, నవ్వుతూ, కేరింతలు కొడుతూ సాంబుని ఆడువేషంతో ముందుంచుకొని వెళ్ళారు. మునిసమూహానికి సాగిలబడి మ్రొక్కారు. "ఎత్తుగా కనబడుతున్న బరువైన గర్భంగల యీ అమ్మాయి కడుపులో మగపిల్లవా డున్నాడా? ఆడపిల్ల ఉందా? చెప్పండి'' అని ఆ మునులను అడిగారు. ఆ మాటలకు మునులకు బాగా కోపం విచ్చింది.

క. యదుడింభకులను గనుఁగొని, 'మదయుతులై వచ్చి' రనుచు మదిలో రోషం
బొదవఁ గనుఁగొనల నిప్పులు, సెదరఁగ 'హాస్యంబు సనునె చేయఁగ' ననుచున్. 21

క. 'వాలాయము యదుకుల ని, ర్మూలకరం బైనయట్టి ముసలం బొక టీ
బాలిక కుదయించును బొం, డాలస్యము లే' దటంచు నటఁ బల్కుటయున్. 22

* యాదవ బాలురను జూచి వీళ్లు మదంతో మైమరచి వచ్చారని మనస్సులలో భావించిన మునులు కనుల చివరల నిప్పులు చెదరగా "హాస్యం చేస్తారా! నిశ్చయంగా యదువంశాన్ని నాశనం చేసే రోకలి ఒకటి యీ బాలికకు పుడుతుంది. ఆలస్యం లేదు. ఇక పొండి!"అని పలికారు.

వ. మదోద్రేకులైన యాదవబాలకులు మునిశాపభీతులై వడవడ వడంకుచు సాంబకుక్షినిబద్ధ చేల గ్రంథివిమోచనంబు సేయు సమయంబున ముసలం బొక్కటి భూతలపతితం బయిన విస్మయంబు నొంది దానిం గొని చని దేవకీనందను సన్నిధానంబునం బెట్టి యెఱింగించిన నతం డాత్మకల్పిత మాయారూపం బగుట యెఱింగియు, నెఱుంగని తెఱంగున వారలం జూచి యిట్లనియె. 23

* మత్తుతో ఉద్రేకించిన యాదవ బాలురు మునుల శాపం విని భయబడి వడవడ వణకుతూ సాంబుని పొట్టచుట్టూ చుట్టిన చీరముడి విప్పుతుంటే ఆ చీర లోపలనుంచి ఇనుప రోకలి ఒకటి నేలమీద పడింది. వారు ఆశ్చర్యపడి దానిని తీసుకెళ్ళి కృష్ణుని సన్నిధిలో పెట్టి జరిగిందంతా చెప్పారు. అదంతా తన మాయచేత జరిగిందని తెలిసి కూడా తెలియని వాడిలాగా వాళ్ళను చూచి వాసుదేవుడు ఇలా అన్నాడు.

ర. 'మది సెడి కన్నులు గానక, మదయుతులై మునులఁ గల్లమాటలఁ జెనయం
గదిసి కులక్షయకారణ, విదితం బగు శాప మొందు వెఱ్ఱులుఁ గలరే? 24

* "మీ బుద్ధి చెడిపోయింది. మీకు కండ్లు కనబడటం లేదు. పొగరెక్కి తప్పుడు మాటలతో ఆ మహామునులకు కోపం తెప్పించారు. ఈ విధంగా కులక్షయానికి మూలమైన శాపాన్ని పొందే వెఱ్ఱివాళ్లు ఎక్కడైనా ఉంటారా?

క. ధరణీసురశాపమునకు, హరిహరబ్రహ్మాదులైన నడ్డము గలరే?
నరు లనఁగ నెంత వారలు, గర మరుదుగఁ బూర్వజన్మకర్మముఁ ద్రోవన్? 25

* బ్రాహ్మణ శాపాన్ని విష్ణువు, శివుడు, బ్రహ్మ మొదలైన వారైనా అడ్డుకోలేరే? ఇక మనుషులెంత? పూర్వ జన్మ కర్మ ఫలాన్ని తొలగించటం ఎవరికీ సాధ్యం కాదు గదా!

వ. అది గావున యతి నిందాపరత్వంబున యదువంశనాశం బగు; సందియంబు లే' దని పరమేశ్వరుండు వారలం జూచి 'సముద్రతీరంబున నొక్క మహాపర్వతం బున్నది; యందు నుండు నత్యుచ్ఛ్రయ విశాలభీషణం బగు పాషాణంబున మీ భుజాబలంబుచేత నీ ముసలంబు దివిచి దీని చూర్ణంబు సింధు కబంధంబులఁ గలిపి రండు; పొండ' ని జగద్విభుండైన కృష్ణుం డాన తిచ్చిన, వారు నట్లచేసి తత్కీలితం బయిన లోహఖండంబును సరకుగొనక సాగరంబునఁ బడవైచిన నొక్క ఝషంబు గ్రసించిన, దాని నొక్క లుబ్ధకుండు జాలమార్గంబునఁ బట్టికొని, తదుదర గతంబయిన లోహఖండంబు దెచ్చి బాణాగ్రంబున ముల్కిగా నొనర్చె' నని తత్కథా వృత్తాంతంబు సెప్పిన బాదరాయణిం గనుంగొని రాజేంద్రుం డిట్లనియె.26

* యతులను నిందించటంవల్ల యదువంశం నాశనం కాక తప్పదు. సందేహం లేదు. ఇలా పలికి వాసుదేవుడు వాళ్లను చూచి "సముద్రం ఒడ్డున ఒక పెద్ద కొండ ఉన్నది. అక్కడ ఎత్తుగా ఉండే భయంకరమైన పెద్ద బండమీద మీ భుజబలంతో ఈ ఇనుప రోకలిని బాగా రాచి పొడిచేసి ఆ పొడిని సముద్రపు నీళ్ళలో కలిపిరండి. పొండి!"అన్నాడు.

లోకనాయకుడైన కృష్ణుడు ఇలా ఆనతీయగా వాళ్ళు అలాచేసి పొడి చేయగా మిగిలిన కీలకమైన లోహపుముక్కను లెక్కించక సముద్రంలో పడవేశారు. దాన్ని ఒక చేప మ్రింగింది. దాన్ని ఒక బోయవాడు వలవేసి పట్టుకొని దాని కడుపులో ఉన్న ఇనుపముక్కను తన బాణం చివర ములికిగా చేసుకున్నాడు అని ఆ కథా విషయమంతా చెప్పిన శుకమహర్షిని చూచి పరీక్షిన్మహారాజు ఇలా అన్నాడు.

**క. చిత్తం బే క్రియ నిలుచుం? , జిత్తజగురు పాదపద్మ సేవ సదా య**
**త్యుత్తమ మని వసుదేవుఁడు, చిత్తముఁ దగ నిల్పి యెట్లు సెందె మునీంద్రా! 27**

* మునీంద్రా! మనస్సు ఎలా నిశ్చలంగా నిలుస్తుంది? మనోజజనకుడైన విష్ణువు చరణకమలములను సేవించటం మిక్కిలి ఉత్తమ మైనదని నమ్మి వసుదేవుడు ఏ విధంగా తన చిత్తాన్ని ఈశ్వరాయత్తం చేశాడు?

**వ. అని యడిగిన రాజునకు శుకుం డిట్లనియె. 28**

* ఇలా అడిగిన మహారాజుతో శుకమహర్షి ఈ విధంగా అన్నాడు.

## -: వసుదేవునకు నారదుండు పురాతనంబగు విదేహర్షభ సంవాదంబుఁ దెలుపుట :-

**క. వినుము నృపాలక! సెప్పెద, ఘనమై విలసిల్లు పూర్వకథ గల దదియున్**
**మును ద్వారక కేతెంచియు, నొనరఁగ నారదుఁడు గృష్ణు నొయ్యనఁ గాంచెన్. 29**

* రాజా! దీనికి ఒక పెద్ద పూర్వగాథ ఉన్నది. ఒకప్పుడు నారదుడు ద్వారకకు వచ్చి ముకుందుణ్ణి సందర్శించాడు.

**వ. అట్లు దేవముని కృష్ణసందర్శనార్థం బరుగుదెంచి తద్గృహాభ్యంతరమున కరిగిన, వసుదేవుం డ మ్మునీంద్రుని నర్ఘ్యపాద్యాదివిధులం బూజించి, కనకాసనాసీనుం గావించి, యుచిత కథావినోదంబులం బ్రొద్దు పుచ్చుచు నిట్లనియె; 'ఏ నరుండు నారాయణ చరణ సరసీరుహ భజనపరాయణత్వంబు నిరంతరంబు నొందం; డట్టివానికి మృత్యువు సన్నిహితంబై యుండు; నీ దర్శనంబునం గృతార్థుండ నైతి; నచ్యుతానంత గోవింద నామస్మరణైకాగ్ర చిత్తులైన మీవంటి పుణ్యపురుషుల సమాగమంబున లోకులు సుఖాశ్రయులయి యుండుదురు; దేవతాభజనంబు సేయువారిని గీర్వాణులు ననుగ్రహింతు; రట్లు సజ్జనులును దీనవత్సలులు నగువారలు పూజనాది క్రియలచే నా దేవతలను భక్తి సేయుదురు; కావున శ్రీ మహాభాగవత కథాసమూహంబులఁ గల ధర్మంబు లడిగెద; నే యే ధర్మంబులు శ్రవణ సుఖంబులుగా వినిన దండధర కింకర తాడనంబులం బడక, ముకుంద చరణారవింద వందనాభిలాషులయి పరమపదప్రాప్తు లగుదు; రా ధర్మంబు లానతిమ్ము;తొల్లి గోవిందునిం బుత్రుఁగాఁ గోరి ముక్తి మార్గం బెఱుంగలేక దేవతామాయం జేసి చిక్కి**

**చిత్తవ్యసనాంధ కారంబగు సంసారంబునం దగులువడి యున్నవాఁడ; హరికథామృతంబు వెల్లిగొల్పు; మట్లయిన సుఖంబు గలుగు ననిన వసుదేవ కృతప్రశ్నుండైన నారదుండు వాసుదేవకథా ప్రసంగ సల్లాపహర్ష సమేతుండై సంతసం బంద నిట్లనియె.** 30

* అలా దేవముని కృష్ణుని చూట్టానికి వచ్చి ఇంటిలోకి వెళ్ళగా వసుదేవుడు ఆ మునీంద్రుణ్ణి అర్ఘ్యం, పాద్యం మొదలైన వానితో యథా విధిగా పూజించి బంగారపు ఆసనం మీద కూర్చుండ బెట్టి సముచిత కథా వినోదాలతో ప్రొద్దు పుచ్చుతూ ఇలా అన్నాడు - "మునీంద్రా! ఎవడు నిరంతరం నారాయణ పాదపద్మాలను భజించడో వానికి చావు సమీపంలోనే ఉంటుంది. నీ దర్శనం వల్ల కృతార్థుడ నైనాను. అచ్యుత, అనంత, గోవింద - మొదలైన నామాలను స్మరించుతూ ఏకాగ్రమైన చిత్తంగల మీవంటి సుకృతాత్ముల రాకవల్ల లోకులు సుఖాశ్రయులై ఉంటారు. దేవతలను భజించే వారిని వేల్పులు అనుగ్రహిస్తారు. అటువంటి సజ్జనులూ దీనవత్సలులూ - పూజ మొదలైన సత్కార్యాలతో దేవతల యందు భక్తి చూపిస్తూ ఉంటారు. కనుక శ్రీమహాభాగవతంలోని కథలలో ఉన్న ధర్మా లడుగుతాను.

ఏ యే ధర్మాలను వీనులవిందుగా వింటే యమభటులచేత దెబ్బలు తినకుండా ముకుందుని పాదపద్మాలకు నమస్కరించే కోరిక కలవారై పరమపదాన్ని పొందుతారో, ఆ ధర్మాలను ఆనతీయండి. పూర్వము గోవిందుణ్ణి కుమారునిగా కోరినప్పటికీ మోక్షమార్గం తెలియలేక దైవమాయలో చిక్కి వ్యసనాల చీకటితో నిండిన సంసారంలో చిక్కుకొని ఉన్నాను. హరికథ సుధారసాన్ని ప్రవహింపచెయ్యండి. అట్లైతే నాకు సుఖం కలుగుతుంది" - అని వసుదేవుడు ప్రార్థించగా నారదుడు వాసుదేవుని కథల ప్రస్తావన వచ్చినందుకు ఎంతో సంతోషించి ఇలా అన్నాడు.

**క. 'నను నీవు సేయు ప్రశ్నము, జనసన్నుత! వేదశాస్త్రసారాంశంబై**
**ఘనమగు హరిగుణ కథనము, విను మని, వినిపింపఁదొడఁగె వేడ్క దలిర్పన్.** 31

* సచ్చరిత్రా! నీవు వేసిన ప్రశ్న వేదశాస్త్రముల సారాంశమైనది, ఘనమైనది. అటువంటి శ్రీహరిగుణ కథనాన్ని వినవలసింది అని వేడుక చిగురించగా వినిపించటం మొదలు పెట్టాడు.

**క. అతిపాపకర్ము లైనను, సతతము నారాయణాఖ్యశబ్దము మదిలో**
**వితతంబుగఁ బఠియించిన, చతురులఁ గొనియాడఁ గమలసంభవు వశమే?** 32

* ఎంతటి పాపం చేసిన వారైనా సరే నారాయణుని నామాన్ని మనస్సులో ఎల్లప్పుడూ స్మరించే వాళ్ళు ధన్యులు. అటువంటి వారిని కొనియాడటం బ్రహ్మకు కూడా తరం కాదు.

**వ. అట్లు గావునఁ బరమేశ్వరభక్తి జనకంబై కైవల్యపద ప్రాప్తికరంబయి యొప్పుచున్న విదేహార్షభ సంవాదంబు నాఁ బరఁగు నొక్క పురాతన పుణ్యకథావిశేషం బెఱింగించెద, సావధాన మనస్కుండవై యాకర్ణింపు' మని యిట్లనియె.** 33

* అందుకని పరమేశ్వరునిమీద భక్తిని కలిగించేదీ, మోక్షాన్ని పొందింప జేసేదీ అయిన "విదేహ ఋషభ సంవాద" మనే ప్రసిద్ధమైన ఒక పురాతన పుణ్యకథను చెపుతాను. ఏకాగ్రమైన మనస్సుతో విను.

తే. 'వినుము స్వాయంభువుండను మనువునకును, రమణ నుదయించెనఁట ప్రియవ్రతుఁ డనంగఁ
దనయు; డాతని కాగ్నీధ్రుఁ డనఁగ సుతుఁడు, జాతుఁ డయ్యెను భువనవిఖ్యాతుఁ డగుచు. 34

* స్వాయంభువుడనే మనువుకు ప్రియవ్రతుడనే కుమారు డుదయించాడు. అతనికి పుట్టిన ఆగ్నీధ్రుడనే కొడుకు లోకప్రసిద్ధుడైనాడు.

వ. ఆ యాగ్నీధ్రునకు నాభి యను ప్రాజ్ఞుండగు తనూభవుం డుదయించి బలిచక్రవర్తితో మైత్రింజేసి ధారుణీభారంబు పూని యాజ్ఞాపరిపాలనంబున నహితరాజన్య రాజ్యంబులు స్వవశంబులు గావించుకొని యుండె; నంతట నాభికి సత్పుత్రుం డయిన ఋషభుండు పుట్టె; నతండు హరిదాసుండై సుతశతకంబుఁ బడసె; నందగ్రజుం డయిన భరతుం డను మహానుభావుండు నారాయణ పరాయణుండై యిహ లోకసుఖంబులం బరిహరించి, ఘోర తపం బాచరించి జన్మత్రితయంబున నిర్వాణసుఖ పారవశ్యంబున సకలబంధ విముక్తుండై వాసుదేవపదంబు నొందె; నాతనిపేర నతం డేలిన భూఖండంబు భారతవర్షం బను వ్యవహారంబున నెగడి జగంబులఁ బ్రసిద్ధం బయ్యె; మఱియు నందుఁ దొమ్మండ్రు కుమారులు బలపరాక్రమ ప్రభావరూప సంపన్నులయి నవఖండంబులకు నధిష్ఠాత లైరి; వెండియు వారలలో నెనుబది యొక్కండ్రు కుమారులు నిత్య కర్మానుష్ఠాన పరతంత్రులై విప్రత్వం బంగీకరించి; రందుఁ గొందఱు శేషించిన వారలు కవిహర్యంతరిక్ష ప్రబుద్ధపిప్పలాయ నావిర్హోత్ర ద్రమిళ చమస కరభాజను లనం బరఁగు తొమ్మం డ్రూర్ధ్వరేతస్కులయి బ్రహ్మవిద్యావిశారదు లగుచు, జగత్త్రయంబును బరమాత్మ స్వరూపంబుగాఁ దెలియుచు ముక్తులై యవ్యాహతగమను లగుచు, సురసిద్ధసాధ్య యక్షగంధర్వ కిన్నరకింపురుష నాగలోకంబు లందు స్వేచ్ఛావిహారంబు సేయుచు నొక్కనాఁడు. 35

* ఆ ఆగ్నీధ్రుడికి "నాభి" అనే కుమారుడు జన్మించాడు. ప్రాజ్ఞుడైన అతడు బలిచక్రవర్తితో స్నేహం చేసి భూభారాన్ని వహించి ప్రజలను పాలించాడు. తన ఆజ్ఞాబలంచేత శత్రురాజుల రాజ్యాలన్నీ వశంచేసుకొన్నాడు. ఆ "నాభి" కి సత్పుత్రుడైన ఋషభుడు పుట్టాడు. హరిభక్తుడైన ఋషభుడు వందమంది కొడుకులను కన్నాడు. అందులో పెద్దవాడు "భరతు" డనే మహానుభావుడు నారాయణభక్తుడై ఈ లోకపు సుఖాలను వదలి భయంకరమైన తపస్సు చేసి మూడు జన్మలలో సకల బంధాలనుండి విముక్తి చెంది నిర్వాణ సుఖపారవశ్యంతో పరమ పదాన్ని అందుకోగలిగాడు. భరతుడు పాలించిన భూఖండానికి భరతవర్ష మనే పేరు జగత్ప్రసిద్ధంగా వచ్చింది.

మళ్ళీ వారిలో తొమ్మిదిమంది కుమారులు బలం, పరాక్రమం, ప్రభావం, రూపసంపద కలిగినవారై తొమ్మిది ఖండాలకు సంస్థాపకు లైనారు. ఇంకా వాళ్ళలో ఎనభైఒక్కమంది కుమారులు నిత్యకర్మలందూ, అనుష్ఠానములందూ ఆసక్తి కలవారై బ్రాహ్మణత్వాన్ని అంగీకరించారు.

మిగిలినవారు కవి, హరి, అంతరిక్షుడు, ప్రబుద్ధుడు, పిప్పలాయనుడు, ఆవిర్హోత్రుడు, ద్రమిళుడు, చమసుడు, కరభాజనుడు అనే పేర్లు గల తొమ్మిది మందీ ఊర్ధ్వరేతస్కులై, బ్రహ్మవిద్యావిశారదులై

మూడు లోకాలు పరమాత్మయొక్క స్వరూపంగా తెలుసుకుంటూ ముక్తులై అడ్డులేని గమనాలతో సురలయొక్క, సిద్ధులయొక్క, యక్షులయొక్క, గంధర్వులయొక్క, కిన్నరులయొక్క, కింపురుషులయొక్క, నాగులయొక్క లోకాలందు తమ యిష్టప్రకారము విహరింప సాగారు.

క. జగదేకనాథు గుణములు, మిగులఁగ సంస్మరణతోడ మీఱిన భక్తిం
బగలును రాత్రియు సంధ్యలుఁ, దగిలి జితేంద్రియులు నైన తపసులు ధాత్రిన్. 36

క. ఊహింపఁ బుణ్యుఁ డైన వి, దేహుని యజ్ఞాంతమందు నేతెంచినచో
గేహము వెడలి యెదుర్కొని, మోహవివర్జితులఁ బుణ్యమునిసంఘములన్. 37

తే. అర్ఘ్యపాద్యాదివిధులను నర్థితోడఁ, బూజ గావించి వారలఁ బొలుపు మిగుల
నుచితపీఠంబులందును నునిచి యెలమి, నవమునిశ్రేష్ఠులను భూమినాయకుండు. 38

* ప్రపంచము లన్నింటికీ ఒకే ఒక ప్రభువైన శ్రీహరి గుణగణాలను ఎక్కువగా తలచుకుంటూ అతిశయించిన భక్తితో పగలూ రాత్రీ సాయంకాలమూ ఆ భగవంతునియందే ఆసక్తి గలిగి జితేంద్రియులైన ఆ తపస్వులు భూలోకంలో పుణ్యాత్ముడైన విదేహుడు చేస్తున్న యజ్ఞం ముగింపుకు వచ్చిన సమయాన అక్కడికి విచ్చేశారు. విదేహరాజు లోపలి నుంచి వచ్చి మహానుభావులయిన ఆ పుణ్యమునులకు ఎదురువెళ్లి అర్ఘ్యం పాద్యం మొదలైన శాస్త్రవిధులతో ప్రార్థనా పూర్వకంగా పూజించి ఆ తొమ్మిదిమంది మునులనూ సముచిత పీఠాలపై కూర్చుండ బెట్టాడు.

క. వారల కిట్లను 'మీరలు, గారవమున విష్ణుమూర్తిఁ గైకొనిన మహా
భూరి తపోధనవర్యులు, సారవిహీనంబు లైన సంసారములన్. 39

క. ఏ రీతిఁ గడప నేర్తురు?, క్రూరులు బహుదుఃఖరోగకుత్సిత బుద్ధుల్
నీరసులు నరులు గావున, నారయ సుజ్ఞానబుద్ధి నానతి యీరే? 40

* అలా ఆసీనులైన వారితో విదేహరాజు ఇలా అన్నాడు. మీరు విష్ణుమూర్తిని ఎంతో భక్తిశ్రద్ధలతో భజించే గొప్ప తపోనిధులు. సారంలేని ఈ సంసారసాగరాన్ని దాటటానికి అల్పబుద్ధులూ నీరసులూ అయిన మానవులకు ఏదైనా మార్గం ఉందా? ఉంటే అదేదో ఆలోచించి ఆనతీయండి.

వ. మఱియు సకలజంతుసంతానంబుకంటె మానుషాకారంబు నొందుట దుర్లభం; బంతకంటె నారాయణ చరణ యుగళ స్మరణ పరాయణు లగుట దుష్కరంబు; గావున నాత్యంతికంబగు క్షేమం బడుగ వలసెఁ; బరమేశ్వరుండు ప్రపత్తి నిష్ఠులకు సారూప్యం బెట్లొసంగు నత్తెఱం గానతిం' డనిన విని విదేహభూపాలునకు హరికథామృత పానాతిపరవశులైన మునిసమాజంబునందుఁ గవి యను మహానుభావుం డిట్లని చెప్పం దొడంగె; 'నరిషడ్వర్గంబునందు నీషణత్రయంబుచేతం దగులువడి మాత్సర్యయుక్త చిత్తుం డగునట్టివాని కెవ్విధంబున నచ్యుత పాదారవింద భజనంబు సంభవించు? విశ్వంబును నాత్మయు వేఱుగా భావించు వానికి భీరుత్వం బెట్లులే? దవిద్యాంధకార

**మగ్నులకు హరిచింతనం బెట్లు సిద్ధించు? నట్టి నరుండు తొంటికళేబరంబు విడిచి పరతత్త్వం బెబ్భంగిం జేరు? ముకుళీకృత నేత్రుండయిన నరుండు మార్గభ్రమణంబునఁ దొట్రుపాటు పడి చను చందంబున విజ్ఞానవిమల హృదయభక్తి భావనావశంబు లేకున్నఁ బరమపదంబు వీరి కెవ్విధంబునం గలుగు? నని యడిగితివి; గావునఁ జెప్పెద; సావధానుండవై యాకర్ణింపుము. 41**

* అంతేకాదు అన్నివిధాలైన జంతువుల జన్మలకంటే మనుష్య జన్మ శ్రేష్ఠం. అది ప్రాప్తించటం చాలా కష్టం. అందులోనూ శ్రీమన్నారాయణుని చరణయుగళ స్మరణంమీద ఆసక్తి గలగటం మరీ కష్టం. అందువల్ల శాశ్వతమైన క్షేమాన్ని గూర్చి అడుగవలసి వచ్చింది. ప్రపత్తియందు నిష్ఠగల భక్తులకు పరమేశ్వరుడు సారూప్యం ఎలా ఇస్తాడు? ఈ సంగతి ఆనతీయండి- అని అడిగిన విదేహరాజుతో శ్రీహరికథలనే త్రాగి పరవశులైన ఆ మునిసమాజంలోనుంచి "కవి" అనే మహానుభావుడు ఈ విధంగా చెప్పటం మొదలుపెట్టాడు.

కామక్రోధలోభ మోహమదమాత్సర్యాలు ఆరింటిని అరిషడ్వర్గ మంటారు. దారేషణ, ధనేషణ, పుత్రేషణ అనేవి ఈ షణత్రయం. వీటిలో చిక్కుకొని మాత్సర్యంతో కూడిన మనస్సు గల మానవుడికి మాధవుని పాదపద్మాలను భజించే భాగ్యం ఎలా ప్రాప్తిస్తుంది?

విశ్వమూ, ఆత్మా వేరుగా భావించే వాడికి భయం ఎలా లేకుండా పోతుంది?

అజ్ఞానమనే చీకటిలో మునిగినవారికి హరిచింతనం ఎలా సిద్ధిస్తుంది?

అటువంటి నరుడు మొదటి శరీరాన్ని త్యజించి పరతత్త్వాన్ని ఏ విధంగా చేరుతాడు?

కండ్లు మూసుకొని నడిచే మనిషి దోవలో తొట్రుపాటు పడే విధంగా విజ్ఞానశుద్ధమైన హృదయంలో భక్తిభావన లేకపోతే పరమపదం ఎలా సిద్ధిస్తుంది? అని అడిగావు. నీ ప్రశ్నలకు సమాధానాలు చెపుతాను; శ్రద్ధతో విను

**క. కరణత్రయంబు చేతను, నరుఁ డే కర్మంబు సేయు నయ్యైవేళన్**
**హరి కర్పణ మని పలుకుట, పరువడి సుజ్ఞాన మండ్రు పరమమునీంద్రుల్. 42**

* మనస్సుతో, వాక్కుతో, కాయంతో చేసే ప్రతికర్మా "కృష్ణార్పణ" మని పలకటమే సుజ్ఞానమని పరమమునులు అంటారు.

**వ. జ్ఞానాజ్ఞానంబులందు సంకలితుండైన స్మృతివిపర్యయంబు నొందు; నట్లు గావున గురుదేవతాత్మకుం డయి, బుద్ధిమంతుండైన మర్త్యుండు శ్రీ వల్లభు నుత్తమోత్తమునిఁగాఁ జిత్తంబునఁ జేర్చి సేవింపవలయు; స్వప్న మనోరథేచ్ఛాద్యవస్థలయందు సర్వసంకల్పనాశం బగుటంజేసి, వానిఁ గుదియం బట్టి నిరంతర హరిధ్యానపరుండైన వానికిఁ గైవల్యంబు సులభముగఁ గరతలామలకంబై యుండు. 43**

* జ్ఞానాజ్ఞానాలలో కలత చెందుతుంటే స్మృతి వ్యత్యస్త మవుతుంది. కాబట్టి గురువునే దేవునిగా నమ్మి బుద్ధిమంతుడైన నరుడు ఉత్తమోత్తముడైన పురుషోత్తముణ్ణి చిత్తంలో చేర్చి సేవించాలి. మానవుడు

కోరిక లనే కలలలో తేలిపోతుంటాడు. దాని వల్ల ఏ పూనికా గట్టిగా నిలవదు. కనుక వాటిని కుదించుకొని ఎప్పుడూ శ్రీహరిని ధ్యానిస్తూ ఉండేవాడికి కైవల్యం చేతిలో ఉసిరికకాయలాగా సులభంగా ప్రాప్తిస్తుంది.

**సీ. సంతతంబును గృష్ణ సంకీర్తనంబులు వీనుల కింపుగ వినఁగవలయు**
**హర్షంబుతోడుత హరినామకథనంబు పాటలఁ నాటలఁ బరఁగ వలయు**
**నారాయణుని దివ్యనామాక్షరంబులు హృద్వీథి సతతంబు నెన్న వలయుఁ**
**గంజాక్షులీలలు కాంతారముల నైన భక్తి యుక్తంబుగాఁ బాడ వలయు**

**తే. వెఱ్ఱిమాడ్కిని లీలతో విశ్వమయుని, నొడువుచును లోక బాహ్యత నొందవలయు**
**నింతయును విష్ణుమయ మని యెఱుఁగ వలయు, భేద మొనరింప వలవదు మేదినీశ! 44**

* ఓ భూనాయకా! ఎప్పుడూ శ్రీకృష్ణ సంకీర్తనలు వీనులవిందుగా వినాలి. హరినామకథనాన్ని సంతోషంతో ఆడుతూ పాడుతూ చెయ్యాలి. నారాయణుని దివ్యమైన నామాక్షరాలను హృదయంలో ఎప్పుడూ స్మరిస్తూ ఉండాలి. పద్మలోచనుని లీలలను అడవులలో చరిస్తున్నా భక్తియుక్తంగా పాడాలి. వెర్రివానిలాగా విశ్వమయుణ్ణి కీర్తిస్తూ లోకానికి అంటీఅంటకుండా ఉండాలి. ఈ సృష్టి అంతా విష్ణుమయమని తెలుసుకోవాలి. భేదబుద్ధి ఏ మాత్రమూ పనికిరాదు.

**వ. అనిన విదేహభూపాలుడు 'భాగవతధర్మం బెద్ది? యే ప్రకారంబునం బ్రవర్తించు? వారల చిహ్నంబు లెవ్వి? యంతయు నెఱింగింప మీర యర్హులరనిన నందులో హరి యను మహాత్ముం డిట్లనియె.45**

* "కవి" చెప్పిన పలుకులు విన్న విదేహరాజు భాగవతధర్మమేది? అది ఏ ప్రకారంగా ప్రవర్తిస్తుంది? భాగవతుల గుర్తులేమిటి? అంతా తెలియజెప్పటానికి మీరే తగినవారు - అనగా వారిలో "హరి" అనే మహాముని ఇలా అన్నాడు.

**తే. సర్వభూతమయుండైన సరసిజాక్షుఁ డతండె తన యాత్మయం దుండు ననెడువాఁడు**
**శంఖచక్రధరుం డంచుఁ జనెడువాఁడు, భక్తిభావాభిరతుఁడు నో భాగవతుఁడు. 46**

* సర్వభూతమయుడైన పద్మలోచనుడు శంఖం చక్రం దాల్చి తన ఆత్మలో ఉన్నాడనే విశ్వాసం కలిగి ఆ హరియందు భక్తీ ఆసక్తీ గలవాడు భాగవతుడు.

**క. 'వర్ణాశ్రమధర్మంబుల, నిర్ణయకర్మములఁ జెడక నిఖిలజగత్సం**
**పూర్ణుఁడు హరి' యను నాతఁడె, వర్ణింపఁగ భాగవతుఁడు వసుధాధీశా! 47**

* రాజా! చతుర్వర్ణాలూ, చతురాశ్రమాలూ, వాటి ధర్మాలూ, కర్మలూ- వీటిలో మునిగిపోక భక్తి మార్గాన్ని ఆశ్రయించి "శ్రీహరి సమస్త జగత్తునా నిండియున్నవాడు" అన్నవాడే భగవంతుడు.

**వ. ఇట్లు సర్వసంగపరిత్యక్తుండై నిఖిలాంతరాత్ముండై పరమేశ్వరు డరుణగభస్తి కిరణ సహస్రంబుల లోకత్రయంబుం బావనంబు సేయు చందంబునం దన చరణారవింద రజఃపుంజంబుచేతం బవిత్రంబు సేయుచు, సురాసుర జేగీయమాన సేవ్యంబైన జనార్దన పాదారవిందంబులకు వందనా భిలాషుఁడై భక్తియు లవమాత్రంబునుం జలింపనీక సుధాకరోదయంబున దివాకరజనిత తాప**

నివారణం బయిన భంగి నారాయణాంఘ్రి నఖమణిచంద్రికా నిరస్త హృదయతాపుండై యాత్మీయభక్తి రశనానుబంధ బంధురంబైన వాసుదేవ చరణసరోరుహ ధ్యానానంద పరవశుం డగు నతండు భాగవతప్రధానుం' డని యెఱింగించిన విని విదేహుం డిట్లనియె. 48

* ఈ విధంగా అన్ని బంధాలను త్రెంపుకొని అన్నింటిలో ఉన్న పరమాత్మను గుర్తించిన వాడై మహాప్రభువైన సూర్యుడు తన సహస్ర కిరణాలచేత మూడు లోకాలను పావనం చేస్తున్న విధంగా తన అడుగు దమ్ముల దుమ్ముచేత జగత్త్రయాన్నీ పవిత్రం చేస్తూ దేవదానవులను కూడా సేవింపదగిన జనార్దనుని చరణారవిందాలకు నమస్కరించాలనే అభిలాష గలిగి, భక్తి రవ్వంత కూడా చలింపనీయక, చంద్రుడుదయించటం వల్ల ఎండబాధ పోయినట్లు నారాయణుని చరణనఖకాంతుల వెన్నెలలచే హృదయతాపం పోగొట్టుకుని భక్తి అనే బంధాలతో వాసుదేవుని చరణపద్మాలను బంధించుకొని ధ్యానానందంలో పరవశించేవాడు ఉత్తమ భాగవతుడు అని పలుకగా విదేహు డిలా అన్నాడు.

క. గజరాజవరదు గుణములు, త్రిజగత్పావనము లగుటఁ దేటపడంగా
సుజనమనోరంజకముగ, విజితేంద్రియ! వినఁగ నాకు వేడుక పుట్టెన్. 49

* మహాత్ములారా! గజేంద్రుని కాపాడి వరము లిచ్చిన శ్రీహరి గుణాలు మూడు లోకాలకు పరమ పవిత్రాలు. అటువంటి గుణవిశేషాలను మనోరంజకంగా వినాలని నాకు వేడుక పుట్టింది.

వ. అనిన విని యంతరిక్షుం డను ఋషి శ్రేష్ఠుం డిట్లనియె. 50

* ఈ విధంగా పలికిన విదేహరాజు పలుకులు విని "అంతరిక్షు" డనే గొప్ప ఋషి ఈ విధంగా అన్నాడు.

క. పరమబ్రహ్మ మనంగాఁ, బరతత్త్వ మనంగఁ బరమపద మనఁగను నీ
శ్వరుఁ డనఁ గృష్ణుఁ డన జగ, ద్భరితుఁడు నారాయణుండు దా వెలుఁగొందున్. 51

* పరబ్రహ్మమనీ, పరతత్త్వమనీ, పరమపదమనీ, పరమేశ్వరుడనీ, శ్రీకృష్ణుడనీ వేరు వేరు పేర్లతో శ్రీమన్నారాయణుడే ప్రపంచమంతా నిండి ప్రకాశిస్తూ ఉంటాడు.

వ. అవ్యక్త నిర్గుణ పరబ్రహ్మంబునందుఁ దనకు విపర్యయంబుగా జననం బయిన జ్ఞానంబె విష్ణుమాయ యనంబడుఁ; బరమేశ్వరుఁ డట్టి మాయచేత జగంబు నిర్మించి నిశ్చింతుండై యుండు; నింద్రియార్థ భ్రమణంబు సేసెడు దుర్మతులకు సుషుప్త్యాద్యవస్థలు వరుసన కలుగుటంజేసి పరమేశ్వరునిం బొందరామియను నాలుగవ యవస్థయుఁ గలుగు; స్వప్నంబునందు గ్రాహ్యగ్రాహక గ్రహణంబులను త్రివిధభేదంబు గలిగియుండు, నీ చందంబున నవిద్యాంధకార సంవృతం బై మూఁడు విధంబులఁ బర్యవసించు మనోరథంబు స్వప్నావస్థయం దణంగిన క్రియఁ ద్రివిధం బగు మాయయు నాత్మయందు లీనంబగుఁ; బరమేశ్వరుండు మొదలం బృథివ్యాది మహాభూతమయం బయిన సృష్టిని గలుగఁజేసి యందుఁ బంచభూతాత్మకం బయిన యాత్మ కేకాదశేంద్రియంబులచేత భేదంబు పుట్టించుచు, గుణంబుల చేత గుణంబు లంగీకరించుచు, నాత్మ యందుఁ బ్రద్యోతితగుణంబుల వలన గుణానుభవంబుఁ జేయుచు నున్నవాఁడై, సృష్టి నాత్మీయంబుగాఁ భావించు; దేహి కర్మమూలంబున నైమిత్తిక కర్మంబుల

నాచరించుచుఁ దత్ఫలం బంగీకరించి దుఃఖైకవశుండై వర్తించుఁ; బెక్కు దుఃఖంబులం బడిన యా దేహి కర్మఫలప్రాప్తుం డగుచు భూత సంప్లవపర్యంతంబు పరవశుండై జన్మమరణంబులం బొరలుచుండు; నంత్యకాలం బాసన్నం బయిన ద్రవ్యగుణస్వరూపం బగు జగంబు ననాదినిధనం బగు కాలంబు ప్రకృతిం బొందించు; నటమీఁద శతవర్షంబులు వర్షంబు లేమిచేత నత్యుగ్రలోక లోచనుతేజంబున సకలలోకంబులు దహింపఁ బడు; నంత నధోలోకంబుననుండి సంకర్షణ ముఖజనితానలం బూర్ధ్వ శిఖాజాలంబుల వాయు సహాయంబై దిక్కులయం దెల్లఁ బ్రవర్తించు; నటమీఁద సంవర్తక వలాహక గణంబులు నూఱు హాయనంబులు సలిలధారాపాతంబుగా వర్షంబు గురియు; నందు విరాడ్రూపంబు లీనం బగు; నంత నీశ్వరుం డింధనాగ్ని చందంబున నవ్యక్తంబుఁ బ్రవేశించు; తదనంతరంబ ధరణీమండలంబు వాయుహృతగంధంబై కబంధరూపంబుఁ దాల్చు; నా జలంబు హృతరసంబై తేజో రూపంబు నొందు; నా తేజంబు తమోనిరస్తంబై వాయువం దడంగు; నా గంధవహుండు స్పర్శవిరహితుండయి యాకాశంబునందు సంక్రమించు; నా విష్ణుపదంబును విగత శబ్దగుణంబు గలదియై యాత్మయం దడంగు; నింద్రియంబులును మనంబును బుద్ధియు వికారంబులతోడ నహంకారంబుఁ బ్రవేశించు; నా యహంకారంబును స్వగుణయుక్తంబై పరమాత్మునిం జేరు; నిట్లు త్రివర్ణాత్మకయై సర్గస్థితి లయకారిణి యగు మాయ యిట్టిది యని తత్స్వరూప మాహాత్మ్యంబులు వివరించిన నరపాలుం డిట్లనియె. 52

* అవ్యక్తమైన నిర్గుణ పరబ్రహ్మంనుంచి తనకు వ్యత్యాసంగా పుట్టిన జ్ఞానాన్నే "విష్ణుమాయ" అంటారు. అటువంటి మాయచేత ప్రపంచాన్ని నిర్మించి భగవంతుడు ఏ చింతా లేకుండా ఉంటాడు. ఇంద్రియాల కోసం తిరిగే చెడుబుద్ధి గలవారికి నిద్ర, స్వప్నం , మెలకువ అని మూడు అవస్థలతో పాటు పరమేశ్వరుని పొందలేక పోవటమనే నాలుగో అవస్థ కూడా కలుగుతుంది. కలలో గ్రహింపదగినదీ, గ్రహించేవాడూ, గ్రహించటం అనే మూడు భేదాలుంటవి. ఈ విధంగా అవిద్య అనే చీకటిచే చుట్టుకోబడి మూడు విధాలయ్యే కోరిక స్వప్నంలో అణగిన విధంగా మూడు విధాలైన మాయ కూడా ఆత్మలో విలీన మవుతుంది.

పరమేశ్వరుడు మొదట పృథివి, అప్పు, తేజస్సు, వాయువు, ఆకాశం అనే పంచభూతాలతో నిండిన సృష్టిని కలిగించి అందులో పంచభూతాత్మకమైన ఆత్మకు పదకొండు ఇంద్రియములతో భేదం పుట్టిస్తూ, గుణాలచేత గుణాలను అంగీకరిస్తూ, ఆత్మయందు వ్యక్తమైన గుణాలవల్ల గుణాలను అనుభవిస్తూ ఉన్నవాడై సృష్టిని తనదిగా భావిస్తాడు. శరీరధారి పూర్వకర్మమూలంగా నైమిత్తికాలైన కర్మలు చేస్తూ వాటి ఫలితాన్ని అంగీకరించి దుఃఖానికే వశుడై వర్తిస్తుంటాడు. అనేక దుఃఖాలలో మునిగిన ఆ దేహి కర్మ ఫలాన్ని పొందుతూ ప్రపంచానికి జల ప్రళయం వచ్చిందాకా స్వేచ్ఛను కోల్పోయి చావు పుట్టుకలలో పడి పొరలు తుంటాడు. కల్పాంత సమయంలో ద్రవ్య గుణాల స్వరూపమైన జగత్తును ఆద్యంతాలు లేని కాలం ప్రకృతిని పొందిస్తుంది.

ఆపైన నూరేండ్లు వానలు లేక భయంకరమైన ఎండల వల్ల అన్ని లోకాలు తగలబడుతవి, ఆ తర్వాత క్రింది లోకంనుంచి ఆదిశేషుని ముఖంనుంచి ఆవిర్భవించిన అగ్ని జ్వాలలు వాయుసహాయంతో లేచి దిక్కు లంతటా వ్యాపించుతాయి. ఆ పైన సంవర్తకాలనే మేఘాలు నూరేండ్లు ధారాపాతంగా వర్షం కురుస్తాయి. దానిలో విరాడ్రూపం విలీనమవుతుంది. అప్పు డీశ్వరుడు కట్టెలలో అగ్నివలె అవ్యక్తాన్ని ప్రవేశిస్తాడు.

అనంతరం భూమండలం తన గంధగుణాన్ని గోల్పోయి జలరూపాన్ని ధరిస్తుంది. ఆ జలం రసాన్ని గోల్పోయి తేజోరూపాన్ని పొందుతుంది. ఆ తేజస్సు అంధకార నిరస్తమై రూపంపోయి వాయువులో అణగుతుంది. ఆ వాయువు స్పర్శను పోగొట్టుకొని ఆకాశమందు సంక్రమిస్తుంది. ఆ ఆకాశం శబ్దగుణాన్ని పోగొట్టుకొని ఆత్మయందు అణగిపోతుంది. ఇంద్రియాలూ, మనస్సూ, బుద్ధీ- వికారాలతో అహంకారాన్ని ప్రవేశిస్తవి, ఆ అహంకారం తన గుణములతో కలసి పరమాత్మను చేరుతుంది. ఈ విధంగా మూడు వర్ణాలు గలిగి సృష్టి, స్థితి, లయాలకు కారణమైన మాయ యిటువంటిది- అని దాని స్వరూపమూ, మాహాత్మ్యమూ వివరించగా విని విదేహరాజిలా అన్నాడు.

ఉ. 'జ్ఞానవిహీనులైన నరసంఘముఁ గానఁగరాని మాయఁ దా
లోన నడంచి యెట్లు హరిలోకముఁ జెందుదు రంతయుం దగన్
భూనుత! సత్యవాక్యగుణభూషణ! యిక్కథ వేడ్కతోడుతన్
బూనికఁ జెప్పు మన్నను ప్రబుద్ధుఁడు నిట్లను గారవంబునన్. 53

* అజ్ఞానులైన మానవులు కనరాని మాయను లోన అణచివేసి ఏ విధంగా వైకుంఠాన్ని చేరగలుగుతారు? మీరు జగన్నుతులు! సత్య గుణభూషణులు! పై విషయాన్ని దయతో సెలవీయండి అనగా "ప్రబుద్ధుడు" అనేముని ఆదరపూర్వకంగా ఇలా అన్నాడు.

వ. సూర్యోదయాస్తమయంబులం బ్రతిదినంబు నాయువు క్షీణంబు నొంద, దేహకళత్రమిత్ర భ్రాతృమమత్వ పాశబద్ధులై విడివడు నుపాయంబు గానక సంసారాంధకారమగ్ను లయి గతాగత కాలంబుల నెఱుంగక దివాంధంబులగు జంతు జాలంబుల భంగి జన్మజరారోగ విపత్తి మరణంబు లందియు, శరీరంబ మే లనుచుఁ బ్రమోద మోహమదిరాపానమత్తులై విషయాసక్తతం జిక్కి తమ్ముఁ దా రెఱుంగక యుండి విరక్తి మార్గంబు దెలియక వర్తించు మూఢులగు జనంబుల పొంతలఁ బోవక కేవలనారాయణ భక్తి భావంబు గల సద్గురుం బ్రతిదినంబును భజియించి; సాత్త్వికంబు, భూత దయయును, హరికథామృతపానంబును, బ్రహ్మచర్యవ్రతంబును, విషయంబుల మనంబు సేరకుండుటయు, సాధు సంగంబును, సజ్జన మైత్రియు, వినయసంపత్తియు, శుచిత్వంబును, తపంబును, క్షమయు, మౌన వ్రతంబును, వేదశాస్త్రాధ్యయన తదర్థానుష్ఠానంబులును, నహింసయు, సుఖదుఃఖాది ద్వంద్వ సహిష్ణుతయు, నీశ్వరుని సర్వగతునింగా భావించుటయు, ముముక్షుత్వంబును, జనసంగ వర్జనంబును, వల్కలాది ధారణంబును, యదృచ్ఛాలాభ సంతుష్టియు, వేదాంతశాస్త్రార్థ జిజ్ఞాసయును, దేవతాంతర నిందావర్జనంబును, గరణత్రయశిక్షణంబును, సత్యవాక్యతయు, శమదమాది గుణవిశిష్టత్వంబును, గృహారామక్షేత్ర కళత్ర పుత్ర విత్తాదుల హరి కర్పణంబు సేయుటయు, నితర దర్శన వర్జనంబు సేయుటయును భాగవతోత్తమధర్మంబు లని చెప్పి యిట్లనియె. 54

* సూర్యుడు ఉదయించటం, అస్తమించటంతో ప్రతిదినమూ మానవుల ఆయువు క్షీణిస్తుంటుంది శరీరంపైనా, భార్యపైనా స్నేహితులపైనా, సోదరులపైనా "నాది, నా వారు" అనే మమకారంతో కట్టువడి

ఆ బంధం నుంచి విడివడే ఉపాయం కనబడక సంసారమనే చీకటిలో మునిగి, భూత భవిష్యత్తులు తెలియక, గుడ్లగూబలలాగా మానవులు పుట్టుక, ముసలితనం, రోగాలు, ఆపదలూ, చావూ పొందుతూ కూడా శరీరమే మేలనుకుంటూ ఉంటారు. మోహాన్ని కలిగించే మద్యపానంతో మత్తులై, ఇంద్రియవిషయాసక్తులై తమ్మ్ము తాము తెలుసుకోలేక, విరక్తిమార్గం తెలియక నడయాడుతుంటారు. అటువంటి మూఢులైన మనుష్యుల సమీపానికి పోకుండా కేవలం నారాయణుని పైన భక్తిభావం గల సద్గురువును నిత్యమూ భజించి ఉత్తమమైన భాగవతధర్మాలను అనుష్ఠించాలి. ఆ ధర్మాలు ఏవంటే-

1 సత్త్వగుణము గలిగి ఉండటం 2 భూతదయ 3 హరికథామృతపానం 4 బ్రహ్మచర్యవ్రతం 5 ఇంద్రియసుఖాలందు మనస్సును చేరనీయకుండటం 6 సాధుసంగమం 7 సజ్జనులతో స్నేహం 8 వినయ సంపద 9 శుచిగా ఉండటం 10 తపస్సు 11 క్షమ 12 మౌనవ్రతం 13 వేదశాస్త్రాలను చదవటం, వాటి అర్థాన్ని అనుష్ఠించటం 14 అహింస 15 సుఖాన్ని గానీ, దుఃఖాన్ని గానీ సహించటం 16 ఈశ్వరుడు అంతటా ఉన్నట్లు భావించటం 17 మోక్షం పొందాలనే కోరిక 18 కుజనుల సంగతిని వదలటం 19వల్కలాలు మొదలైనవి కట్టటం 20 తనంతట లభించిన దానితో సంతుష్టి చెందటం 21 వేదాంతశాస్త్రాల అర్థాలను తెలుసుకోవాలనే కుతూహలం 22 ఇతర దేవతలను నిందించకుండా ఉండటం 23 త్రికరణ శుద్ధి 24 సత్యమే పలకటం 25 శమం, దమం మొదలైన గుణ విశేషాలు 26 ఇల్లు, తోటలు, పొలాలు, భార్య, సంతానం, ధనం మొదలైన వాటిని పరమేశ్వరార్పణంగా భావించటం 27 భక్తులు కాని వారిని ఆశ్రయించకుండా ఉండటం.

**క. 'హరిదాసుల మిత్రత్వము, మురరిపుకథ లెన్నికొనుచు మోదముతోడన్**
**భరితాశ్రు పులకితుండై, పురుషుఁడు హరిమాయ గెల్చు భూపవరేణ్యా!'** 55

* హరి భక్తులతో స్నేహం చేస్తూ హరిలీలలను తలచుకుంటూ, కన్నులలో ఆనందబాష్పాలు నిండగా, ఒళ్ళు పులకిత మవుతుండగా మానవుడు హరిమాయను గెలుస్తాడు మహారాజా!

**వ. అనిన రాజేంద్రుండు వారల కిట్లనియె. 'భాగవతులారా! సకల లోకనాయకుం డగు నారాయణుం డనంబరఁగిన పరమాత్ముని ప్రభావంబు వినవలతు; నానతిం డనినఁ బిప్పలాయనుం డిట్లనియె.**

* అనగా ఆ విదేహచక్రవర్తి వాళ్ళతో ఇలా అన్నాడు. "భాగవతులారా! అన్ని లోకాలకు ప్రభువై నారాయణు డనే నామంతో అలరారే పరమాత్ముని ప్రభావాన్ని వినాలనుకొంటున్నాను. ఆనతీయండీ" అంటే పిప్పలాయనుడనే మునీంద్రుడు ఇలా అన్నాడు.

**సీ. నరవర! విను జగన్నాథుని చారిత్ర మెఱిఁగింతు నీమది కింపు మిగుల**
**లసదుద్భవస్థితిలయకారణం బయి దేహేంద్రియాదులఁ దిరము గాఁగఁ**
**జొనుపు నెప్పుడు పరం జ్యోతిస్స్వరూపంబు జ్వాలల ననలుండుఁ జనని పగిది**
**నింద్రియంబులు నాత్మ నెనయవు శబ్దంబు పొరయక సుషిరంబుఁ బొందు సత్య**

తే. మనఁగ సత్త్వరజస్త మోమయగుణంబు, మహదహంకారరూపమై మహిమ వెలయు
చేతనత్వంబు గలదేని జీవ మందు, రిదియ సదసత్స్వరూపమై యెన్నఁబడును. 57

* రాజా! విను. నీకింపు కలిగే విధంగా లోకేశ్వరుని చరిత్ర చెబుతాను. సృష్టి స్థితిలయాలకు కారణమైన పరంజ్యోతిస్స్వరూపం దేహేంద్రియాలలో స్థిరంగా ప్రవేశిస్తుంది. మంటలు అగ్నిలోపల ప్రవేశింపలేనట్లు ఇంద్రియాలు ఆత్మను ఆక్రమించలేవు. నాదం పిల్లన గ్రోవిని లోగొనలేదు గదా! సత్త్వము, రజస్సు, తమస్సు అనే గుణత్రయం మహదహంకారరూపమై చైతన్యంతో కలిస్తే జీవమంటారు. ఇదే సత్తు అసత్తు- స్వరూపంగా ఎన్నబడుతుంది.

వ. దీనికిం బెక్కైనది పరమాత్మగా నెఱింగి కమలసంభవాదులు నుతియింతు; రిట్టి పరమాత్మ స్థావరజంగమంబుల నధిష్ఠించి వృద్ధి క్షయంబులం బొందక నిమిత్తమాత్రంబునం దరులతాదులందు జీవంబు లేక తదంతరస్థుండై వర్తించు; నంత సర్వేంద్రియావృతం బైన యాకారంబు నష్టంబైన మనంబునుం బాసి శ్రుతివిరహితుండై తిరుగుచుండు; నిర్మల జ్ఞానదృష్టి గలవానికి భానుప్రభాజాలంబు దోఁచిన క్రియను, సుజ్ఞానవంతుండు హరిభక్తి చేత గుణకర్మార్థంబులైన చిత్తదోషంబులు భంజించి భగవత్పదనంబు 'సేరు' ననిన విని రా జిట్లనియె. 58

* ఇందుకు అతీతమైన దాన్ని పరమాత్మగా తెలుసుకొని బ్రహ్మమొదలైనవారు స్తుతిస్తారు. ఇటువంటి పరమాత్మ స్థావరజంగమాలను అధిష్ఠించి వృద్ధిక్షయాలు పొందక, నిమిత్తమాత్రంగా చెట్లు, తీగలు మొదలైన వాని లోపల వర్తిస్తుంటాడు. సర్వేంద్రియాలచే ఆవరించబడిన ఆకారము పోగా మనస్సును వదలి శ్రుతి విరహితుడై తిరుగుతుంటాడు. నిర్మలమైన జ్ఞానదృష్టి గలవాడు సూర్యుని కాంతి సమూహాన్ని దర్శించినట్లు సుజ్ఞాని ఐనవాడు హరిభక్తిచేత గుణకర్మార్థములైన చిత్తదోషాలను నశింపజేసి ఈశ్వరుని చేరుకోగలుగుతాడు- అంటే విని విదేహరాజిలా అన్నాడు.

క. 'పురుషుం డేయే కర్మము, పరువడిఁ గావించి పుణ్యపరుఁడై మనుఁ? దా
దురితములుఁ దొరఁగి మురరిపు, చరణయుగం బెట్లు 'సేరు? సన్మునివర్యా!' 59

* ఋషిశేఖరా! పురుషుడు ఏ యే కర్మలను ఆచరించితే పుణ్యపరుడై పాపాలను పోగొట్టుకొని మురవైరి అడుగుజంటను చేరుకోగలుగుతాడో సెలవీయండి.

వ. అనిన విని యం దావిర్హోత్రుం డి ట్లనియెఁ; 'గర్మాకర్మ వికర్మ ప్రతిపాదకంబు లగు శ్రుతివాదంబులు లౌకికవర్ణితంబు; లట్టి యామ్నాయంబులు సర్వేశ్వర స్వరూపంబులు గాన విద్వాంసులు నెఱుంగ లే; రవి కర్మాచారంబు లనంబడు; మోక్షంబు కొఱకు నారాయణ భజనంబు పరమపావనంబు; వేదోక్తంబుల నాచరింపక ఫలంబులకు వాంఛ 'సేయువార లనేక జన్మాంతరంబులం బడయుదురు; మోక్షంబు నపేక్షించువాఁడు విధి చోదిత మార్గంబున హరిం బూజింపవలయు; నట్టి పూజాప్రకారం బెట్లనినఁ, బవిత్రగాత్రుం డయి జనార్దను సన్నిధిం బూతచిత్తుండై, షోడశోపచారంబులఁ జక్రధరు నారాధించి, గంధపుష్ప ధూపదీప నైవేద్యంబులు సమర్పించి, సాష్టాంగదండ ప్రణామంబు లాచరించి,

**భక్తిభావనా విశేషుండగు నతండు హరిం జేరు' నని చెప్పిన విని విదేహుం డిట్లనియె; 'నీశ్వరుం డే యే కర్మంబుల నాచరించె, నంతయు నెఱింగింపు' మనినఁ ద్రమిళుం డిట్లనియె. 60**

* అంటే విని "ఆవిర్హోత్రు"డనే ముని విదేహప్రభువుతో ఇట్లన్నాడు. 'కర్మ, అకర్మ వికర్మ- వీటిని ప్రతిపాదించే శ్రుతి వాదాలు లౌకికులు చెప్పినవి గాదు. అటువంటి వేదాలు సర్వేశుని స్వరూపాలు. వాటిని పండితులు కూడా తెలుసుకోలేరు. అవి కర్మాచారాలు అనబడుతవి. మోక్షంకోసం నారాయణభజనం అన్నింటికంటె పవిత్రమైనది. వేదం చెప్పినట్లు చేయక ఫలాలు కోరేవారు ఎన్నో జన్మ లెత్తుతారు. మోక్షాన్ని కోరేవాడు శాస్త్రం చెప్పిన విధంగా హరిని పూజించాలి. ఆ పూజావిధానం ఎటువంటిదంటే- పరిశుద్ధమైన దేహంతో భగవంతుని సన్నిధిలో పవిత్రచిత్తుడై ప్రవర్తించాలి. షోడశోపచారాలతో చక్రధరుని ఆరాధించాలి. గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం- అర్పించి సాష్టాంగదండ ప్రణామాలు చేసి భక్తి భావంతో నిండిన మనస్సు గల వాడు పరమాత్మను జేరుతాడు'- అని చెప్పిన విని విదేహు డిలా అన్నాడు. "ఈశ్వరు డేయే లీలలు ఆచరించాడు అంతా తెలుపవలసింది" అనగా "ద్రమిళు" డనే మునివర్యు డిలా అన్నాడు.

**క. తారల నెన్నఁగ వచ్చును;, భూరేణుల లెక్కవెట్టఁ బోలును ధాత్రిన్;**
**నారాయణగుణకథనము, లారయ వర్ణింపలేరు హరబ్రహ్మాదుల్. 61**

* రాజా! ఆకాశంలోని చుక్కలను లెక్కబెట్టవచ్చు, భూమిపై గల మట్టిరేణువులను కూడా లెక్కబెట్టవచ్చును. కాని నారాయణు గుణ విశేషాలను మాత్రం శివుడు, బ్రహ్మ మొదలైనవారూ కూడ వర్ణించలేరు.

**వ. అట్లు గావున నాత్మసృష్టంబైన పంచభూతనికరంబును పురంబొనరించి, యందు నిజాంశంబునం బ్రవేశించి, సగుణనిష్ఠుండై నారాయణాభిధానంబు గల ఋషీశ్వరుండగు పరమేశ్వరుండు వెలుఁగొందె; నతని దశేంద్రియంబులచేఁ బాలితంబులైన దేహంబులు ధరించి, జగద్రక్షకత్వ సంహారకత్వాది గుణంబులు గలుగుటం జేసి గుణనిష్ఠుండయి రజస్సత్త్వ తమో గుణంబుల బ్రహ్మవిష్ణురుద్రమూర్తు లనంబరఁగి, త్రిగుణాత్మకుం డనంబడు నారాయణాఖ్యుని చరిత్రం బెఱింగించెద; నాకర్ణింపుము.62**

* భగవంతుడు తాను సృష్టించిన పంచభూతసమూహాన్ని పురంగా జేసి దానిలో తన అంశతో ప్రవేశించి సగుణనిష్ఠుడై నారాయణుడను పేరుగల ఋషీశ్వరుడుగా ప్రకాశించాడు. ఆయన పది యింద్రియాలతో నిర్మితాలైన శరీరాలను దాల్చి జగత్తును సృష్టించటం, రక్షించటం, సంహరించటం మొదలైన కార్యాలు చేయటం వల్ల రజస్సత్త్వతమో గుణాలతో బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు అనే పేర్లతో ఒప్పుతుంటాడు. త్రిగుణాత్మకు డనబడే ఆ నారాయణుని చరిత్ర చెపుతాను. విను.

**క. ధర్ముండు దక్షపుత్రిక, నిర్మలమతిఁ బెండ్లియాడి నెఱిఁ బుత్త్రుని స**
**త్కర్ముని నారాయణ ఋషి, నర్మిలిఁ గనె నతఁడు బదరికాశ్రమమందున్. 63**

* బదరికాశ్రమమందు ధర్ముడు దక్షపుత్రికను పెండ్లాడాడు. ఆ దంపతులకు సత్కర్ముడూ పరిశుద్ధుడూ అయిన నారాయణ ఋషి జన్మించాడు.

తే. అట్టి నారాయణాహ్వయుండైన మౌని, బదరికాశ్రమమందు నపారనిష్ఠఁ
దపముఁ గావింప బలభేది దలఁకి మదిని, మీనకేతను దివిజకామినులఁ బనిచె. 64

* ఆ నారాయణ ముని బదరికాశ్రమంలో అపారమైన నిష్ఠతో తపస్సు చేయసాగాడు. ఆయన తపస్సుకు ఇంద్రుడు భయపడి తపోభంగం నిమిత్తం మన్మథునీ, అప్సరసలనూ పంపించాడు.

వ. వారు నారాయణాశ్రమంబునకు నతని తపోవిఘ్నంబు సేయ వచ్చు నప్పు డవ్వనంబు సాల రసాల బిల్వ కదళీ ఖర్జూర జంబు జంబీర చందన పున్నాగ మందారాది వివిధ వృక్ష నిబిడంబును, పుష్పఫల భరిత శాఖావనమ్ర తరులతా బృందంబును, మాధవీ కుంజమంజరీ పుంజ మకరంద పానమత్త మధుకర నికర ఝుంకారరవ ముఖరిత హరిదంతరంబును, గనక కమల కహ్లార విలసత్సరో విహరమాణ చక్రవాక బక క్రౌంచ మరాళదంపతీ మండల మండితంబును, మృణాళ భోజనాసక్త సారసచయ చంచూపుట విపాటిత కమలముకుళ కేసర విసర వితత ప్రశస్త సరోవరంబునునై వెలయు నవ్వనంబున నిందువదన లందంద మందగమనంబులం జెందు ఘర్మజలబిందు బృందంబులు నఖాంతంబుల నోసరింపుచు డాయం జను నప్పుడు. 65

* అతని తపస్సును భగ్నం చేయటానికి వారు నారాయణాశ్రమానికి వచ్చారు. ఆ తపోవనం మామిడి, మద్ది, మారేడు, అరటి, ఖర్జూరం, నేరేడు, నిమ్మ, చందనం, సురపొన్న, మందారం మొదలైన అనేక వృక్షాలతో నిండిఉన్నది. పూలతో, పండ్లతో క్రిందికి వంగిన కొమ్మలతో కూడి ఉన్నది. గురివెంద పొదల పూలగుత్తుల మకరందం త్రాగి, మదించిన తుమ్మెదలు చేసే ఝుంకారాలతో ప్రతిధ్వనిస్తూ ఉన్నది. బంగారు పద్మాలతో కలువలతో ప్రకాశించే సరస్సులలో జంటలుగా విహరిస్తున్న జక్కవలూ, కొంగలూ, క్రౌంచములూ, హంసలూ- వీనితో అలరారుతూ ఉన్నది. తామర తూళ్ళను తినుటయం దాసక్తి కలిగిన సారసపక్షుల ముక్కులచే చీల్చబడిన తామర మొగ్గలలోని కేసరాలతో భాసించే సరోవరాలు కలిగి ఉన్నది. అటువంటి తపోవనంలో ఆ చంద్రముఖులు నెమ్మదిగా నడుస్తూ చెమట బిందువులను కొనగోళ్లతో చిమ్ముకుంటూ నారాయణమహర్షిని సమీపించారు.

చ. మదనుని బాణజాలముల మగ్నతఁ బొందక ధైర్యవంతుఁ డై
ముదితల వాఁడిచూపులకు మోహము నొందక నిశ్చలాత్ముఁడై
హృదయమునందు నచ్యుతు రమేశు ననంతు జగన్నివాసునిన్
వదలక భక్తి నిల్పుకొని వారికి నిట్లనె మౌని పెంపునన్. 66

* ఆ సమయంలో నారాయణఋషి మన్మథుని బాణ సముదాయాలలో మునుగలేదు; ధైర్యము విడువలేదు. ఆ కాంతల పదునైన చూపులకు మోహము నొందలేదు. ఏ మాత్రమూ చలించక తన హృదయంలో అచ్యుతుడూ, అనంతుడూ జగన్నివాసుడూ అయిన రమేశుణ్ణి నిశ్చల భక్తితో నిలుపుకొని వారితో ఇట్లా అన్నాడు.

క. 'జంభారిపంపునను మీ, రంభోరుహవదనలార! యరుదెంచితి; రా
శుంభ ద్విహారవాంఛా, రంభంబునఁ దిరుగుఁ' డనిన లజ్జించి వెసన్. 67

* పద్మముఖులారా! ఇంద్రుడు పంపగా మీరు వచ్చారు. ఇక్కడ విహరించాలనే కోరిక ఉంటే మీ ఇష్టం వచ్చినట్లు తిరగండి- అనేటప్పటికి వాళ్ళంతా సిగ్గుపడి ఆ మహర్షితో ఇలా అన్నారు.

సీ. 'దేవమునీంద్ర! నీ దివ్యచారిత్రంబు నెఱిఁగి సన్నుతిసేయ నెవ్వఁ డోపుఁ?
బుత్త్ర మిత్ర కళత్ర భోగాదులను మాని తపము గావించు సద్ధర్ములకును
విఘ్నముల్ సెందునే? విశ్వేశుఁ గొల్చిన యతనికి నంతరాయంబు గలదె?
కామంబుఁ గ్రోధంబుఁ గల తపస్వితపంబు పల్వలోదకములభంగిఁ గాదె?

తే. నిన్ను వర్ణింప నలవియే? నిర్మలాత్మ!, రమణ లోఁగొను మా యపరాధ' మనుచు
సన్నుతించిన నతఁడు ప్రసన్నుఁ డగుచుఁ, దనదు సామర్థ్య మెఱిఁగింపఁ దలఁచి యపుడు. 68

* దేవమునీంద్రా! నీ దివ్యమైన చరిత్ర తెలుసుకొని స్తుతించటానికి ఎవరికి సాధ్యమవుతుంది? కుమారులు మిత్రులు భార్యలు మొదలైన భోగాలను వదలి తపస్సు చేసే సద్ధర్మపరులకు విఘ్నాలు కలుగుతాయా? జగదీశ్వరుణ్ణి కొలిచే వారికి ఆటంకాలు ఉంటాయా? కామం, క్రోధం గలిగిన తపస్వియొక్క తపస్సు బురదగుంటలోని నీటి వంటిదికదా! నిర్మలాత్ముడా! నిన్ను వర్ణింప మా తరమా? మా తప్పులు క్షమించు- అని సన్నుతింపగా నారాయణమహర్షి ప్రసన్నుడై తన సామర్థ్యాన్ని తెలియజెయ్యాలనుకొన్నాడు.

వ. అ మ్మునీశ్వరుండు పరమాశ్చర్యనిధానంబుగా నిజతనూరుహంబుల వలనంద్రికోటి కన్యకా నివహంబుల నుద్భవింపం జేసిన, గంధర్వ విబుధకామినీ సముదయంబులు పరమాద్భుత భయంబులు మనంబులం బొడమ సన్నుతించి, య వ్విలాసినీసమూహంబులో నూర్వశి యను దానిం గొని చని, పాకశాసను సభాసదనంబునం బెట్టి తద్వృత్తాంతం బంతయు విన్నవించిన నాశ్చర్యయుక్త హృదయుం డయి సునాసీరుం డూరకుండె; నట్టి నారాయణ మునీశ్వరుచరిత్రంబు వినువారలు పరమ కల్యాణగుణవంతు లగుదురని చెప్పిన. 69

* ఆ మునీశ్వరుడు అంతా ఆశ్చర్యపడేటట్లు తన రోమకూపాల నుంచి మూడు కోట్ల కన్యకా సముదాయాన్ని పుట్టించాడు. అది చూచి దేవకాంతామణులు మిక్కిలి ఆశ్చర్యంతో, భయంతో ఆ మహర్షిని స్తుతించారు. ఆ అందగత్తెలలో నుండి ఊర్వశి అనే ఒక సుందరాంగిని తీసుకొని వెళ్లి ఇంద్రునితో ఆ విషయమంతా విన్నవించారు. అదంతా విన్న ఇంద్రుడు మునిశక్తికి వెరగుపడి మిన్నకున్నాడు. అటువంటి నారాయణమునీశ్వరుని చరిత్ర వినేవాళ్ళు మిక్కిలి కల్యాణ గుణసంపన్నులు అవుతారు.

తే. ఋషభునకు నాత్మయోగ మీ రీతిఁ జెప్పి;, నచ్యుతుఁడు భూమిభారము నడఁప నంత
సారిది నవతారములు దాల్చి సొంపు మీఱ, రాత్రిచరులను జంపె నీరసముతోడ. 70

* ఋషభునకు ఆత్మ యోగాన్ని ఈ విధంగా ఉపదేశించిన శ్రీమహావిష్ణువు భూభారాన్ని అణచివేయటానికి ఎన్నో అవతారాలెత్తి పట్టుదలతో దుర్మార్గులయిన రాక్షసులను సంహరించాడు.

వ. అట్టి పరమేశ్వరుని లీలాగృహీతంబు లగు మత్స్యకూర్మవరాహ నారసింహ వామన రామ రఘురామ రామ బుద్ధ కల్క్యాద్యవతారంబు లనేకంబులు గలవు; వాని నెఱిఁగి నుతియింప శేషభాషాపతుల కైన నలవి గాదు; మఱియును. 71

* అటువంటి పరమేశ్వరుడు లీలావిలాసంగా గ్రహించిన మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రఘురామ, బలరామ, బుద్ధ, కల్కి- ఇత్యాది అవతారా లెన్నో ఉన్నాయి. వాటిని తెలిసి నుతించటం నలువకైనా, వేనోళ్ళ చిలువకైనా అలవికాదు- అని పలికి శ్రీహరిని ఇలా స్తుతించాడు-

**సర్వలఘుసీసము**

**నవ వికచ సరసిరుహ నయనయుగ! నిజచరణ గగనచరనది జనిత! నిగమనినుత!**
**జలధిసుత కుచకలశ లలిత మృగమద రుచిర పరిమళిత నిజహృదయ! ధరణిభరణ!**
**ద్రుహిణముఖ సురనికర విహిత నుతికలితగుణ కటిఘటిత రుచిరతర కనకవసన!**
**భుజగరిపు వరగమన! రజతగిరిపతివినుత! సతతజపరత! నియమసరణి చరిత!**

**తే. తిమికమఠకిటినృహరిముదితబలి నిహి, త పద పరశుధర దశవదన విదళన!**
**మురదమన కలికలుష సుముదపహరణ!, కరివరద! మునినరసుర గరుడవినుత!** 72

* క్రొత్తగా వికసించిన పద్మములవంటి కన్నుల జంట కలవాడా! పాదములందు ఆకాశగంగను పుట్టించినవాడా! వేదములచేత పొగడబడినవాడా! లక్ష్మీదేవియొక్క కలశములవంటి వక్షోజాలందు అలరెడి కస్తూరిచే పరిమళించే హృదయం కలవాడా! భూమిని మోసినవాడా! బ్రహ్మ మొదలైన దేవతాసమూహాల సంస్తుతులతో కూడినవాడా! నడుమునందు బంగారుచేలము ధరించినవాడా! గరుత్మంతుడు వాహనంగా కలవాడా! కైలాసేశ్వరునిచే నుతించబడినవాడా! నిరంతర జపము చేయువారియందు ఆసక్తి కలవాడా! నియమబద్ధమైన చరిత్ర కలవాడా! మత్స్య, కూర్మ, వరాహ, నారసింహ, వామన, పరశురామ, రామ, కృష్ణ, కల్కి అవతారములను దాల్చిన వాడా! గజేంద్ర వరదా! మునులు నరులు సురలు గరుడులు మొదలగు వారిచే పొగడబడిన వాడా!

**వ. ఇ వ్విధంబునం బ్రవర్తిల్లిన శ్రీమన్నారాయణమూర్తి లీలావిలాసంబు లనంతంబులు గలవు; మనోవాక్కాయ కర్మంబుల హరిపూజనంబు సేయక, విపరీతగతులం దిరుగుచుండు జడుల కెవ్విధంబు గతి గలుగు? ననిన నప్పు డప్పుడమితేఁ డప్పరమపురుషుం జూచి యట్టి జడులు ముక్తి నొందు నుపాయం బెట్టు లంతయు నెఱింగింపుఁ' డనినఁ జమసుం డిట్లనియె.** 73

* ఇలా నారాయణస్తుతి చేసి ఇలా అన్నాడు- ఈ విధంగా ప్రవర్తిల్లిన శ్రీమన్నారాయణమూర్తి లీలావిలాసములు అనంతంగా ఉన్నవి. మనోవాక్కాయకర్మలా హరిపూజ సేయక విపరీత గతులతో తిరుగుతూ ఉండే మూఢులకు ఏ విధంగా గతి కలుగుతుంది? అని ముని అనగా ఆ మహారాజు ఆ పరమపురుషులను చూచి "అటువంటి మూర్ఖులు ముక్తి పొందే ఉపాయం తెలియజేయండి" అనగా వారిలో "చమసు" డనే ముని విదేహునితో ఇలా అన్నాడు.

**సీ. హరిముఖ బాహూరు వరపదాబ్జములందు వరుసఁ జతుర్వర్ణ వర్గసమితి**
**జనియించె;నందులో సతులును శూద్రులు హరిఁదలంతురు; కలిహాయనముల**

వేదశాస్త్ర పురాణ విఖ్యాతులై కర్మ కర్తలై విప్రులు గర్వ మెసఁగి
హరిభక్తి పరులను హాస్యంబు సేయుచు నిరయంబు నొందుట నిజము గాదె?

తే. మృదుల పక్వాన్న భోజనములను మాని, జీవహింసకుఁ జనువానిఁ జెందు నఘము;
హరి నుతింపక స్త్రీలోలుఁ డైనవాఁడు, నరక వాసుండు నగుచుండు ననవరతము. 74

* విష్ణువు యొక్క ముఖం బాహువులు, తొడలు, పదములు- వీటి యందు వరుసగా నాలుగు వర్ణాలు పుట్టినవి. అందులో స్త్రీలు, శూద్రులు, హరిని తలుస్తారు. కలికాలంలో విప్రులు వేదశాస్త్ర పురాణాలందు ప్రసిద్ధులై కర్మలు చేస్తూ గర్వంతో హరిభక్తులను హాస్యం చేస్తారు. వారు నరకానికి పోవటం నిజం! స్వచ్ఛమైన పక్వాన్నం భుజించుట మాని మాంసాహారియై జీవహంసకు పాల్పడే వాడిని పాపం చెందుతుంది. హరిని నుతింపక స్త్రీలోలు డైనవాడు ఎప్పుడూ నరకంలోనే వసిస్తాడు.

వ. అట్లు గావున గృహ క్షేత్ర పుత్ర కళత్ర ధన ధాన్యాదులందు మోహితుం డయి 'ముక్తి మార్గంబు లప్రత్యక్షంబు' లని నిందించువాఁడును, హరిభక్తి విరహితుండును, దుర్గతిం గూలుదు రని మునివరుం డానతిచ్చిన విదేహుం డిట్లనియె. 75

* అలా కాబట్టి ఇండ్లు, పొలాలు, సంతానం, భార్య, ధనం, ధాన్యం- వీటి మీది వ్యామోహంతో "మోక్షం కంటికి కనబడేదికాదు కనుక లే" దని నిందించే వారూ, హరిభక్తి లేనివారూ దుర్గతిలో కూలుతారు- అని మునివరు డానతీయగా విదేహు డిలా అన్నాడు.

ఆ. ఏ యుగంబునందు నే రీతి వర్తించు?, నెట్టి రూపువాఁడు? నె వ్విధమున
మును నుతింపఁబడెను మునిదేవగణముచే, విష్ణుఁ డవ్యయుండు విశ్వవిభుఁడు?" 76

* అవ్యయుడూ, జగన్నాథుడూ- అయిన విష్ణువు ఏ యుగంలో ఏ రీతిగా ఉన్నాడు? ఏ రూపం ధరించాడు? ఏ విధంగా మునులచే, దేవతలచే నుతించబడినాడు?

వ. అనిన విని యందుఁ గరభాజనుం డిట్లనియె; 'ననేకావతారంబులు నానారూపంబులును బహువిధ వర్ణంబులునుం గలిగి, రాక్షసులను సంహరించి, దుష్టజన నిగ్రహంబును శిష్టజన పరిపాలనంబును జేయుచుఁ గృతయుగంబున శుక్లవర్ణుండై చతుర్బాహుండై జటావల్కల కృష్ణాజినోత్తరీయ జపమాలికా దండ కమండలు ధరుండయి హరి నిర్మలతపోధ్యానానుష్ఠాన గరిష్ఠులైన పురుష శ్రేష్ఠులచేత హంసుండు సువర్ణుండు వైకుంఠుండు ధర్ముం డమలుండు యోగేశ్వరుం డీశ్వరుండు పురుషుం డవ్యక్తుండు పరమాత్ముం డను దివ్యనామంబులం బ్రసిద్ధి వహించి గణుతింపంబడుఁ; ద్రేతాయుగంబున రక్తవర్ణుండయి బాహుచతుష్క మేఖలాత్రయ విశిష్టుండయి హిరణ్య కేశుండును, వేద త్రయస్వరూపుండును, స్రుక్ స్రువాద్యుపలక్షణ శోభితుండునయి విష్ణుయజ్ఞ పృశ్నిగర్భ సర్వదేవోరుక్రమ వృషాకపి జయంతోరుగాయాఖ్యల బ్రహ్మవాదులచేత నుతియింపంబడు; ద్వాపరంబున శ్యామల దేహుండును పీతాంబరధరుండును బాహుద్వయోపశోభితుండును దివ్యాయుధ ధరుండును శ్రీవత్సకౌస్తుభ వనమాలికా విరాజమానుండును మహారాజోపలక్షణుండునై జనార్దన వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్నానిరుద్ధ నారాయణ విశ్వరూప

సర్వభూతాత్మకాది నామంబుల వెలసి, మూర్ధాభిషిక్తులచేత సన్నుతింపంబడు. కలియుగంబునఁ గృష్ణవర్ణుండును గృష్ణనామకుండునునై భక్త సంరక్షణార్థంబు పుండరీకాక్షుండు యజ్ఞ సంకీర్తనంబులచేతం బ్రస్తుతింపంబడు; హరి రామ నారాయణ నృసింహ కంసారి నలినోదరాది బహువిధనామంబులచే బ్రహ్మవాదులైన మునీంద్రులు నుతియింపుదురు; మఱియును. 77

* అని అడుగగా వారిలో "కరభాజను"డనే ముని విదేహ రాజుతో ఇలా అన్నాడు-

ఎన్నో అవతారాలూ, చాలా రూపాలూ, పలు వర్ణాలు ధరించి రాక్షసులను సంహరించి, దుష్టశిక్షణం, శిష్టరక్షణం కావించే శ్రీమహావిష్ణువు కృతయుగంలో తెల్లని రంగు గలిగి, నాలుగు చేతులు గలిగి ఉంటాడు. జడలు, నారచీరలు, జింకచర్మం, జపమాలిక, దండం, కమండలువు దాల్చి, నిర్మలమైన తపస్సూ, ధ్యానమూ, అనుష్ఠానమూ గల మునిశ్రేష్ఠులచేత హంసుడు, సువర్ణుడు, వైకుంఠుడు, ధర్ముడు, అమలుడు, యోగీశ్వరుడు, ఈశ్వరుడూ, పురుషుడు, అవ్యక్తుడు, పరమాత్ముడు అనే దివ్యమైన నామములతో ప్రశంసింపబడుతూ ప్రసిద్ధి జెందుతాడు.

త్రేతాయుగంలో ఎర్రని రంగు గలిగి, నాలుగు చేతులూ, మూడు మేఖలలూ ధరించి బంగరురంగు జుట్టూ గలిగి, మూడు వేదాల ఆకృతి ధరించి; స్రుక్కు, స్రువము మొదలైన ఉపలక్షణాలతో శోభిల్లుతూ; విష్ణువు, యజ్ఞుడు, పృశ్నిగర్భుడు, సర్వదేవుడు, ఉరుక్రముడు, వృషాకపి, జయంతుడు, ఉరుగాయుడు అనే పేర్లతో బ్రహ్మవాదులచే నుతింపబడుతాడు.

ద్వాపరయుగంలో నీలవర్ణం గలిగి పసుపుపచ్చని గుడ్డలు దాల్చి, రెండు చేతులతో, దివ్యమైన ఆయుధాలు పట్టుకొని శ్రీవత్సం, కౌస్తుభం, వనమాలిక- వీనితో ప్రకాశిస్తూ మహారాజ లక్షణాలు గలిగి జనార్దనుడు, వాసుదేవుడు, సంకర్షణుడు, ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, నారాయణుడు, విశ్వరూపుడు, సర్వభూతాత్మకుడు మొదలైన పేర్లతో వెలసి, చక్రవర్తులచేత సన్నుతించబడుతాడు. కలియుగంలో నల్లనిరంగు గలిగి కృష్ణుడను పేరు గలిగి భక్తులను రక్షించటానికి పుండరీకాక్షుడు యజ్ఞములందు కీర్తించబడుతాడు. అప్పుడు ఆయనను హరి, రాముడు, నారాయణుడు, నృసింహుడు, కంసారి, నళినోదరుడు మొదలైన పలు పేర్లతో బ్రహ్మవాదులైన మునీంద్రులు స్తుతిస్తుంటారు.

తే. ద్రవిడ దేశంబునందులఁ దామ్రపర్ణి, సహ్యజాకృత మాలాది సకలనదుల
కెవ్వఁ డేనియు భక్తితో నేఁగి యచటఁ, బొదలి తర్పణ మొగిఁ జేయఁ బుణ్య మొదవు. 78

* ద్రవిడ దేశంలో తామ్రపర్ణి, కావేరి మొదలైన నదులకు వెళ్ళి భక్తితో స్నానం చేసి తర్పణం చేస్తే మానవులకు పుణ్యం కలుగుతుంది.

వ. ఇ వ్విధంబునఁ బ్రశంసింపఁదగిన కావేర్యాదిమహానదీ పావన జలస్నాన పాన దానంబులను, విష్ణుధ్యానకథా సుధారసానుభవంబుల నిరూఢులగు భాగవతోత్తములు గలిగి రేనిం జెడని పదంబునుం బొందుదు రని ఋషభకుమారుల భగవత్ప్రతిబింబంబు లయిన పరమపురుషులుం బోలె విదేహజనపాలునకు నిశ్శ్రేయః పద ప్రాప్తి కరంబులైన భగవద్భక్తి ధర్మంబు లుపదేశించి యంతర్ధానంబు నొందిరి;

**మిథిలేశ్వరుండును జ్ఞానయోగం బంగీకరించి నిర్వాణపదంబు నొందె; నీ యుపాఖ్యానంబు వ్రాసినఁ బఠించిన వినిన నాయు రారోగ్యైశ్వర్యములు గలిగి పుత్త్ర పౌత్త్రవంతులై సకలకలి కల్మష రహితులై విష్ణులోక నివాసు లగుదు'రని నారదుండు వసుదేవునకుం జెప్పి మఱియును. 79**

* ఈ విధంగా ప్రశంసించదగిన కావేరిమొదలైన మహానదుల పావనజలాలలో స్నానం చేయటంలోనూ, దానాలు చేయటంలోనూ, విష్ణువును ధ్యానించుటంలోనూ, హరికథల అమృతరసానుభవంలోనూ నిష్ణాతులైన భాగవతోత్తములు చెడని పరమపదాన్ని పొందుతారని ఋషభకుమారులు భగవంతుని ప్రతిబింబాలయిన పరమపురుషులవలె విదేహనరపతికి మోక్షపదం పొందే భగవద్భక్తి ధర్మాలను ఉపదేశించి అంతర్ధానమైనారు. మిథిలాపతి, జ్ఞానయోగాన్ని అంగీకరించి నిర్వాణపదాన్ని పొందాడు. ఈ ఉపాఖ్యానాన్ని వ్రాసినా, చదివినా, విన్నా ఆయువూ, ఆరోగ్యమూ, ఐశ్వర్యమూ గలిగి, పుత్రపౌత్రాభివృద్ధి గలిగి, సమస్తమైన కలి కల్మషాలు నశించి విష్ణులోకంలో నివసిస్తారు అని నారదుడు వసుదేవునితో ఇంకా ఇలా అన్నాడు.

**సీ. 'కమలాక్షపదభక్తి కథనముల్ వసుదేవ! విని యఘంబులఁ బాసి వెలసి తీవు**
**భువనప్రసిద్ధిగాఁ బొలుపొందు సత్కీర్తి కైవల్యలక్ష్మియుఁ గలుగు మీఁద**
**నారాయణుండు నీ నందనుం డను మోహ మెడలించి విష్ణుగా నెఱిఁగి కొలువు**
**మతఁడు నీ తనయుఁడై యవతరించుటఁ జేసి సిద్ధించె దేహ సంశుద్ధి నీకు**

**తే. సరసల్లాప సౌహార్ద సౌష్ఠవమునఁ, బావనం బైతి శిశుపాల పౌండ్ర నరక**
**ముర జరాసంధ యవనులు ముదముతోడ, వాసుదేవునిఁ జెందిరి వైరు లయ్యు. 80**

* వసుదేవా! కమలలోచనుని కథలు విన్నావు. కనుక నీ పాపాలు తొలగిపోయాయి. లోకంలో నీ యశస్సు ప్రఖ్యాత మౌతుంది. అనంతరం నీకు కైవల్యం సిద్ధించుతుంది. నారాయణుడు నీ కుమారుడనే మోహాన్ని విడిచిపెట్టి విష్ణువుగా భావించి సేవించు. అతడు నీ కొడుకై అవతరించటంచేత నీవు పరిశుద్ధుడవైనావు. అతనితో సరససల్లాపాలు జరుపుతూ చక్కని అనురాగం పెంచుకోవటం వల్ల నీవు పవిత్రుడవైనావు. శిశుపాలుడూ, పౌండ్రకుడూ, నరకుడూ, మురుడూ, జరాసంధుడూ, కాలయవనుడూ వసుదేవునితో వైరం వహించి గూడా ముక్తిని పొందగలిగారు.

**క. దుష్టజన నిగ్రహంబును, శిష్టప్రతిపాలనంబు సేయన్ హరి దా**
**సృష్టి నవతార మొందెను, స్రష్టృముఖానేక దివిజసంఘము వొగడన్. 81**

* దుష్టజనులను శిక్షించటానికీ, శిష్టజనులను రక్షించటానికి బ్రహ్మ మొదలైన దేవతలు ప్రార్థించగా శ్రీహరి భూమిమీద అవతారం ధరించాడు.

**వ. అట్లు గావున లోకరక్షణార్థంబు గృష్ణుం డవతారంబు నొందె' నని హరిభక్తిపరంబు లగు నుపాఖ్యానంబులు నారదుం డుపన్యసించిన విని విస్మితచిత్తులై దేవకీవసుదేవులు గృష్ణుని పరమాత్మునిగా విచారించి'రని శుకుండు రాజునకుం జెప్పిన నతండు మునీంద్రా! యదువుల నేప్రకారంబున హరి హరియించె? సపరివారులగు బ్రహ్మ రుద్రేంద్ర దిక్పాలక మునీంద్రులు ద్వారకా**

**నగర ప్రవేశం బెట్లు సేసిరి? యే మయ్యె? మఱియుఁ బరమేశ్వర కథామృతంబు వీను లలరం జవిగొనియు నింకం దనివి సనదు; భక్త రక్షకుండగు హరిచారిత్రం బేరీతిఁ జాగెఁ దర్వాతి వృత్తాంతం బంతయు నెఱింగింపు మనిన శుకుం డిట్లనియె. 82**

* ఈ విధంగా లోకాలను రక్షించటం కోసమే భగవంతుడు కృష్ణుడుగా అవతరించాడు- అని హరిభక్తి పరాలైన ఉపాఖ్యానాలను నారదుడు చెప్పగా విని దేవకీవసుదేవులు ఆశ్చర్యచకిత మానసులై శ్రీకృష్ణుని పరమాత్మునిగా భావించారు అని శుకుడు పరీక్షిత్తుకు చెప్పగా అతడు 'మునీంద్రా! భూభారాన్ని తగ్గించటంకోసం ఏ విధంగా కృష్ణుడు యాదవులను తుదముట్టించాడు? బ్రహ్మ, రుద్రుడు, ఇంద్రుడు మొదలైన దేవతలూ, ఋషీశ్వరులూ తమ పరివారాలతో ద్వారకానగరాన్ని ఎలా ప్రవేశించారు? అనంతరం ఏమయింది? వివరంగా చెప్పండి! పరమేశ్వరుని అమృతం వంటి కథలను చెవులారా ఎంత విన్నా తృప్తి కలగటం లేదు. భక్త రక్షకుడైన శ్రీహరిచరిత్ర ఏ విధంగా కొనసాగింది? ఈ వృత్తాంతమంతా ఎరిగించ'మంటే రాజుతో శుకుడిలా అన్నాడు.

## -: బ్రహ్మాది దేవతలు శ్రీకృష్ణుని వైకుంఠమునకుఁ బిలువ వచ్చుట :-

**క. సుర గరుడ ఖచర విద్యా, ధర హర పరమేష్ఠిముఖ సుధాశనులు మునుల్**
**సరసిజనయనునిఁ గనుఁగొన, నరుదెంచిరి ద్వారపతికి నతి మోదమునన్. 83**

* రాజా! విను సురలు, గరుడులు, విద్యాధరులు, రుద్రుడు, బ్రహ్మ మొదలైన దేవతలూ, మునులూ పద్మాక్షుని చూడటానికి సంతోషంతో ద్వారవతికి వచ్చారు.

**క. కని పరమేశుని యాదవ, వనశోభిత పారిజాతు వనరుహనేత్రున్**
**జనకామిత ఫలదాయకు, వినుతించిరి దివిజు లపుడు వేదోక్తములన్. 84**

* యాదవవంశ మనే ఉద్యానవనంలో ప్రకాశించే పారిజాతంవంటి వాడూ, పరమేశ్వరుడూ, జనులు కోరిన ఫలాలిచ్చేవాడూ అయిన పద్మాక్షుని దేవతలు వేదసూక్తాలతో వినుతించారు.

**తే. అఖిలలోకేశ! సర్వేశ! యభవ! నీవు, నుదయ మందుట భూభార ముడుపుకొఱకుఁ**
**బంచవింశోత్తర శతాబ్దపరిమితంబు, నయ్యె విచ్చేయు వైకుంఠ హర్మ్యమునకు. 85**

* సర్వలోకాధినాథా! సర్వేశ్వరా! పుట్టుక లేనివాడవై కూడా భూభారం తగ్గించటంకోసం నీవు పుట్టావు. నీవు జన్మించి ఇప్పటికి నూట ఇరవై అయిదు సంవత్సరాలు గడిచాయి. ఇక వైకుంఠభవనానికి వేంచేయి.

**వ. అనినఁ గమలభవ భవ ముఖ నిఖిల సురగణంబుల వచనంబు లియ్యకొని కృష్ణుండు వారితోడ 'యాదవుల కన్యోన్య వైరానుబంధంబులు గల్పించి వారల హతంబు గావించి భూభారం బడంచి యిదె వచ్చెదం బొం' డని చెప్పి వీడ్కొలిపినఁ గమలాసనాది బృందారకులు నిజస్థానంబులకుం జని రంత.86**

* ఈ విధంగా ప్రార్థించిన బ్రహ్మ, రుద్రుడు మొదలైన సమస్త దేవతాసమూహాల ప్రార్థన అంగీకరించి శ్రీకృష్ణుడు వాళ్ళతో "యాదవులకు పరస్పరం శత్రుత్వాన్ని కల్పించి వారిని రూపుమాపి భూభారం తగ్గించి

వేసి యిదే వస్తాను. మీరు పొండి''- అని చెప్పి వాళ్లందరినీ వీడ్కొలిపాడు. బ్రహ్మాది దేవతలు తమ తమ స్థానాలకు వెళ్ళారు.

## కృష్ణుండు దుర్నిమిత్తములం గని యాదవుల నెల్ల ద్వారకనుండి ప్రభాస తీర్థమునకుఁ బంపుట

సీ. కాక ఘూకంబులు గనకసౌధములలోఁ బగలు వాపోయెడి బహువిధముల
నశ్వవాలములందు ననల ముద్భవ మయ్యె నన్నంబు మొలిచె మహాద్భుతముగ
శుకశారికలు రాత్రి సొగసె విస్వరముల జంతువు వేఱొక్క జంతువుఁ గనె
నొగిఁ బౌరగృహముల నుల్కలు నుదయించె బెరసెఁ గావిరి రవిబింబ మపుడు.

తే. గాన నుత్పాతములు సాలఁ గానఁ బడియె, నరయ నిందుండ వలవదు యదువులార!
తడయ కిపుడ ప్రభాసతీర్థమున కరుగుఁ, డనుచు శ్రీకృష్ణుఁ డెంతయు నానతిచ్చె. 87

* అనంతరం శ్రీకృష్ణుడు యాదవు లందరినీ ఇలా హెచ్చరించాడు- 'ఓ యాదవులారా! కాకులూ, గుడ్లగూబలూ బంగారు మేడలలో పగలు అనేక విధాలుగా ఏడుస్తున్నవి. గుర్రపుతోకలయందు మంటలు పుడుతున్నవి. చిలుకలూ, గోరువంకలూ రాత్రిపూట వికృత స్వరాలతో అరుస్తున్నవి. ఒక జంతువు మరొకజాతి జంతువును కంటున్నది. నివాస గృహాలలో పుట్టగొడుగులు పుడుతున్నవి. సూర్యబింబాన్ని కావిరి కమ్ముకుంటున్నది. ఈ విధంగా చాలా ఉత్పాతాలు కనిపిస్తున్నవి. కనుక ఇక్కడ ఉండవద్దు. యాదవులారా! మీరంతా ఆలస్యం చెయ్యకుండా ప్రభాసతీర్థానికి వెళ్ళండి'- అని కృష్ణు డానతిచ్చాడు.

క. నారాయణు వచనముల క, పారంబగు సమ్మదమున బలములతోడన్
దార సుత మిత్ర యుతులై, వారణ హయ సమితితోడ వడి నేఁగి రొగిన్. 88

* నారాయణుని మాటలు ఆలకించి యాదవు లందరూ భార్యలతో, బిడ్డలతో, మిత్రులతో కలసి ఏనుగులనూ, గుర్రాలనూ, సైన్యాలనూ తీసుకొని వేగంగా ప్రభాసతీర్థానికి వెళ్ళారు.

వ. అంత. 89

క. జ్ఞానమున నుద్ధవుఁడు దన, మానసమున నెఱిఁగి 'శ్రీరమాధిప! హరి! యో
దీనజన కల్పభూజ! సు, ధీనాయక! మాకు నీవె దిక్కని పొగడెన్. 90

* అప్పుడు జ్ఞానవంతుడైన ఉద్ధవుడు తన మనస్సులో ఈ విషయమంతా తెలుసుకొని "లక్ష్మీవల్లభా! శ్రీహరీ! దీనజనులకు కల్పవృక్షం వంటి వాడవూ బుద్ధిమంతులలో శ్రేష్ఠుడవూ అయిన నీవే మాకు ది'' క్కని స్తుతించాడు.

## -: కృష్ణుం డుద్ధవునకుఁ బరమార్థోపదేశము సేయుట :-

వ. ఇట్లు నుతియించి 'దేవా! నీవు యదుక్షయంబు గావించి చనిన నే మేవిధంబున నిర్వహింతుము? నీ సహచరులమై జరిపిన మజ్జన భోజన శయనాసనాది కృత్యంబులు మఱవ వచ్చునే?' యని యుద్ధవుం డాడిన వాసుదేవుం డిట్లనియె; 'బ్రహ్మాదిదేవతా ప్రార్థనంబునం జేసి ధాత్రీభారంబు నివారించితి; నింక ద్వారకా నగరంబు నేఁటికి సప్తమ దివసంబున సముద్రుండు ముంపంగలవాఁడు; యదుక్షయంబునుం గాఁగల యది; యంతటం గలియుగంబునుం బ్రాప్తంబయ్యెడి, నందు మానవులు ధర్మవిరహితులు, నాచారహీనులు, నన్యాయ పరులును, నతిరోషులు, మందమతులు, నల్పతరాయువులు, బహు రోగపీడితులు, నిష్ఫలారంభులు, నాస్తికులునై యొండొరుల మెచ్చక యుందురు; గావున నీవు సుహృద్బాంధవ స్నేహంబు వర్జించి, యింద్రియసౌఖ్యంబులం బొరయక క్షోణీతలంబునం గల పుణ్యతీర్థంబుల నవగాహనంబు సేయుచు, మానస వాగక్షి శ్రోత్ర ఘ్రాణేంద్రియ గృహ్యమాణంబగు వస్తుజాతం బెల్ల నశ్వరంబుగా నెఱుంగుము; పురుషుండు నానార్థ కామంబుల నంగీకరించి నిజగుణదోషంబుల మోహితుండై యుండుం; గావున హస్తిపకుండు గంధనాగంబుల బంధించు చందంబున నింద్రియంబులను, మనోవికారంబులను నిగ్రహించి యీషణత్రయంబును వర్జించి, మోదఖేదంబుల సముండవుగా వర్తించుచు, నీ జగం బంతయు నాత్మాధిష్ఠితంబుగా నెఱింగి, మాయాదు లాత్మతత్త్వాధీనంబులుగాఁ దెలియుచు, జ్ఞానవిజ్ఞాన యుక్తుండవై యాత్మానుభవ సంతుష్టుండవై, విశ్వంబును నన్నుఁగా భావించి, వర్తింప వలయు'నని వాసుదేవుం డానతిచ్చిన నుద్ధవుండు భక్తిభయ వినయంబులం గరంబులు మొగిడ్చి 'మహాత్మా! సన్న్యస్త లక్షణంబు దుష్కరంబు; పామరులగు వార లాచరింపలేరు; నీ మాయచేత భ్రాంతులైన సాంసారికులు భవాబ్ధిం గడచి యెట్లు ముక్తి వడయుదురు? భృత్యుండనైన నామీఁది యనుగ్రహంబునం జేసి యానతిమ్ము; బ్రహ్మాది దేవతా సముదయంబును, బాహ్యవస్తువుల భ్రాంతులై పర్యటనంబు సేయుదురు; నీ భక్తులైన పరమ భాగవతు లమ్మాయాని రసనంబును సేయుదురు; గృహిణీ గృహస్థుల కైన, యతులకైన నిత్యంబును నీ నామస్మరణంబు మోక్షసామ్రాజ్యపదంబు; గావునఁ బరమేశ్వరా! నీదు చరణంబుల శరణంబు నొందెద; గృపారసంబు నాపై నిగిడింపు' మని ప్రియసేవకుండైన యుద్ధవుండు పలికిన నతనికిఁ గంసమర్దనుం డిట్లనియెఁ; 'బురుషున కాత్మకు నాత్మయె గురువని యెఱుంగుము! కుపథంబులం జనక, సన్మార్గవర్తివై పరమంబైన మన్నివాసంబునకుం జనుము. సర్వమూలశక్తి సంపన్నుండనైన నన్ను సాంఖ్య యోగపరులు నిరంతర భావంబులందుఁ బురుషభావంబు గావించి తలంచుచుందురు! మఱియు నేక ద్వి త్రి చతుష్పాద బహుపాదాపాదంబులునై యుండు జీవజాలంబులోన ద్విపాదంబులు గల మనుష్యులు మేలు; వారలలోన నిరంతరధ్యానగరిష్ఠులైన యోగీంద్రు లుత్తములు; వారలలో సందేహపరులచే నగ్రాహ్యుండగు నన్ను సత్త్వగుణ గ్రాహ్యునిఁగా నెఱింగి నిజచేతఃపంకజంబునందు జీవాత్మ పరమాత్మల నేకంబుగాఁ జేసి శంఖచక్రగదాఖడ్గ శార్ఙ్గ కౌమోదకీ కౌస్తుభాభరణయుక్తుంగా నెఱుంగుచు నుండువారలు పరమయోగీంద్రు లనియు, బరమజ్ఞాను లనియునుం జెప్పి మఱియు "నవధూత యదు సంవాదం" బను పురాతనేతిహాసంబు గలదుఁ జెప్పెద నాకర్ణింపుము. 91

* ఈ విధంగా స్తుతించి "దేవా! నీవు యాదవజాతిని నాశనం చేసి వెళ్ళిపోతే మేము ఏ విధంగా జీవితాలు నిర్వహించగలము? నీకు సహచరులమై నీతో కలిసి చేసిన స్నాన, పాన, భోజన, శయన, ఆసనాదులను ఎలా మరచిపోగలము?" అని ఉద్ధవుడు పలికితే వాసుదేవు డిలా అన్నాడు. "బ్రహ్మ మొదలైన దేవతల ప్రార్థన ప్రకారం భూభారాన్ని తొలగించాను. ఇక నేటికి ఏడోరోజు సముద్రుడు ద్వారకానగరాన్ని ముంచివేస్తాడు. యాదవజాతి నాశనం అవుతుంది. అంతట కలియుగం వస్తుంది.

"అప్పుడు మానవులు ధర్మం వదలినవారూ, ఆచారం లేనివారూ, అన్యాయపరులూ, మిక్కిలి రోషం గలవారూ, మందమతులూ, తక్కువ ఆయువు గలవారూ, బహురోగాలచేత పీడించబడతూ ఉండే వారూ, ఫలించని ఆరంభం కలవారూ, నాస్తికులూ అయి ఒకళ్ళనొకళ్ళు మెచ్చుకోకుండా ఉంటారు. కాబట్టి నీవు స్నేహితులు, చుట్టాలు మొదలయిన వాళ్ళ అనుబంధాలు వర్జించు. ఇంద్రియ సౌఖ్యాలలో మునిగిపోకు. భూతలంమీది పుణ్యతీర్థాలలో స్నానం చెయ్యి. పంచేంద్రియాలచే గ్రహింపదగు వస్తుసముదాయమంతా నశించేది అని తెలుసుకో.

పురుషుడు అనేకాలైన సంపదలను సంపాదించి కామాలకు అవకాశ మిచ్చి తన గుణదోషాలతో మోహితుడై ఉంటాడు. కాబట్టి మావటివాడు మదగజాన్ని కట్టివేసిన విధంగా ఇంద్రియాలనూ, మనోవికారాలనూ నిగ్రహించి భార్యా పుత్రులందూ, ధనమునందూ ఆసక్తి వదలి, సుఖమునందూ కష్టమునందూ సమంగా వర్తించు. ఈ ప్రపంచమంతా పరమాత్మచే అధిష్ఠించబడినదిగా తెలుసుకో. మాయ ఆత్మకు వశమైనదిగా గ్రహించు. జ్ఞాన విజ్ఞానవంతుడై ఆత్మానుభవంతో సంతుష్టి పొంది విశ్వాన్ని నన్నుగా భావించి ప్రవర్తించు" అని వాసుదేవుడు ఆన తిచ్చాడు.

ఉద్ధవుడు భక్తితో, భయంతో, వినయంతో చేతులు జోడించి "మహాత్మా! సన్న్యాస జీవితం చాలా కష్టం. పామరులైన వాళ్ళు ఆచరించలేరు. నీ మాయచేత భ్రాంతులైన వారు ఈ సంసార సముద్రాన్ని ఎలా తరిస్తారు? ఎలా మోక్షాన్ని పొందుతారు? సేవకుడనైన నామీది దయతో సెలవియ్యాలి. బ్రహ్మ మొదలైన దేవతల సమూహం కూడా బాహ్యవస్తువులందు భ్రాంతులై తిరుగుతుంటారు. నీ భక్తులైన పరమభాగవతులు మాత్రమే ఆ మాయను నిరసించ గలుగుతారు. ఇల్లాండ్రకైనా, గృహస్థులకైనా, యతులకైనా ఎప్పుడూ నీ నామస్మరణే మోక్షసామ్రాజ్యాన్ని అందిస్తుంది. కాబట్టి పరమేశ్వరా! నీ అడుగులను శరణు వేడుతున్నాను. నా మీద దయారసాన్ని ప్రసరింప చెయ్యి" అని ప్రియసేవకుడైన ఉద్ధవుడు పలికాడు. అప్పుడు అతనితో కృష్ణుడిట్లా అన్నాడు.

ఆత్మకు ఆత్మే గురువు. చెడు మార్గాలలో ప్రవేశింపక మంచి మార్గంలో వర్తిస్తూ పరమమైన నా నివాసానికి చేరుకో! సమస్తానికీ మూలమైన నన్ను సాంఖ్యయోగులు ఎప్పుడూ పరమపురుషభావంతో భావిస్తూ ఉంటారు. అదీకాక ఒకటి, రెండు, మూడు, నాలుగు కాళ్ళు కలవీ, అసలు కాళ్ళు లేనివీ ఐన జీవజాలంలో రెండు కాళ్ళు గల మనుష్యులు ఉత్తములు, వాళ్ళలో నిరంతర ధ్యానగరిష్ఠులైన యోగీశ్వరులు

ఉత్తములు. వాళ్ళలో సంశయగ్రస్తు లైనవారు నన్ను గ్రహింపలేరు. నేను సత్త్వగుణగ్రాహ్యుడను. ఈ విషయం తెలుసుకొని తమ మనఃపద్మాలలో జీవాత్మ పరమాత్మలను ఒకటిచేసి శంఖం, చక్రం, గద, ఖడ్గం, శార్ఙ్గం, కౌమోదకి, కౌస్తుభం- వీనితో కూడిన వానిగా నన్ను భావించుకొనేవారు పరమయోగీంద్రులు, పరమజ్ఞానులు అని చెప్పి ఇంకా "అవధూత-యదుసంవాద" మనే ప్రాచీనమైన ఇతిహాస మొకటి ఉన్నది. చెపుతాను విను అని శ్రీకృష్ణుడు ఉద్ధవునికి ఇలా చెప్పసాగాడు.

## -: అవధూత- యదుసంవాదము :-

**ఉ. పంకజనాభుఁ డుద్ధవునిపైఁ గల కూర్మిని జెప్పె నొప్ప నెం**
**దంకిలి లేక యన్ని దిశలందుఁ జరించుచు నిత్యతృప్తుఁడై**
**శంకరవేషధారి యొక సంయమి యా యదురాజుఁ జేర 'నే**
**వంకను నుండి వచ్చి' తని వానికి నిట్లనె నర్థి నేర్పడన్. 92**

* పద్మనాభుడు ఉద్ధవుని మీద గల కూరిమితో ఇలా చెప్పాడు. 'ఒక రోజు యదురాజు దగ్గరకు ఎక్కడనుండో ఒక యోగి వచ్చాడు. అతడు అడ్డులేక అన్ని దిక్కులా తిరిగేవాడు. ఎప్పుడూ సంతృప్తితో ఉంటాడు. శంకరవేషాన్ని ధరించి ఉన్నాడు. యదురాజు ఆ యోగికి మర్యాద చేసి "స్వామీ! ఎక్కడనుండి వచ్చారు?" అని ఆసక్తితో అడుగగా అతడిలా అన్నాడు.

**క. అవధూత వల్కె నంతటఁ, 'బ్రవిమల విజ్ఞాన నిపుణ భవ్యులు గురువుల్**
**దవిలిన నిరువది నలువురు, నవనిన్ విజ్ఞాని నైతి' నని పల్కుటయున్. 93**

* యదుమహారాజా! "నిర్మలమైన విజ్ఞానంలో నిపుణులైన భవ్యులు ఇరవైనలుగురు నాకు గురువులైనారు. వారి వల్ల నేను విజ్ఞానినైనాను" అన్నాడు.

**వ. అంత యదుప్రవరుండు 'దేహి లోభమోహాదుల వర్జించి జనార్దనుని నే విధంబునం జేరవచ్చు?**
**నెఱింగింపు' మనిన నతం డిట్లనియె. 94**

* అంతట రాజు 'శరీరధారి ఐనవాడు లోభం మోహం మొదలైన వానిని వదలి ఏ విధంగా విష్ణువును చేరవచ్చు? ఎరిగించవలసింది' అంటే అవధూత ఇలా అన్నాడు.

**సీ. పరధన పరదార పరదూషణాదులఁ బరవస్తు చింత దాఁ బరిహరించి**
**ముదిమిచే రోగము లుదయింప కటమున్న తనువు చంచలతను దగులకుండ**
**బుద్ధిసంచలతచేఁ బొదలక యట మున్న శ్లేష్మంబు గళమునఁ జేరకుండ**
**శక్తియుక్తుల మది సన్నగిల్లక మున్న భక్తి భావనచేతఁ బ్రౌఢుఁ డగుచు**

**తే. దైత్యభంజను దివ్యపాదారవింద, భజన నిజభక్తి భావనఁ బ్రాజ్ఞుఁ డగుచు**
**నవ్యయానందమును బొందు ననుదినంబు, నతఁడు కర్మవిముక్తుఁడౌ ననఘచరిత! 95**

* సచ్చరిత్రా! విను. పరధనాలనూ పరకాంతులనూ కోరకుండా ఇతరుల వస్తువులను అపహరించే ఆలోచన చేయకుండా, ఇతరులను నిందించకుండా, ముసలితనం పైనబడి రోగాలు పుట్టకముందే, శరీరం కంపించకముందే, బుద్ధి చంచలస్థితిని పొందకముందే, గొంతులో శ్లేష్మము చేరకముందే, శక్తి యుక్తులు సన్నగిల్లకముందే, దృఢమైన భక్తి భావనతో దానవాంతకుని దివ్యమైన చరణపద్మాలను భజిస్తూ యుక్తాయుక్తాలు తెలిసినవాడై, అవ్యయమైన ఆనందాన్ని అనుదినమూ పొందుతూ ఉండేవాడు భవబంధ విముక్తుడై మోక్షాన్ని పొందుతాడు.

**ఉ. దారలయందు, బుత్త్రధన ధాన్యములందు ననేక భంగులం**
**గూరిమి సేయు మర్త్యుఁ డతిఘోర వియోగజ దుఃఖ మగ్నుఁడై**
**నేరుపు దక్కి, చిక్కువడి నీతి వివేక విహీనుఁడై మనో**
**భారముతోఁ గపోతపతి భంగి నిజంబుగ బోవు నష్టమై.** 96

* భార్యా పుత్ర ధన ధాన్యాదులయందు అనేక విధముల మమకారమును పెంచుకొను మనుష్యుడు మిక్కిలి భయంకరమైన వియోగముతో కల్గిన దుఃఖముతో కూడినవాడై తెలివిని పోగొట్టుకొన్నవాడై, చిక్కువడి నీతి వివేకము లేనివాడై మిక్కిలి మానసిక భారముతో మగపావురమువలె సత్యముగ మరణము నొందును.

**వ. ఇందుల కొక్క యితిహాసంబు గలదు; మహారణ్యంబున నొక్క కపోతంబు దారసమేతంగా నొక్క నికేతనంబు నిర్మించి యన్యోన్య మోహాతిరేకంబునఁ గొంతకాలంబునకు సంతానసమృద్ధి గలదియై యపరిమితంబు లయిన పిల్లలు దిరుగాడుచుండఁ గొన్ని మాసంబులు భోగానుభవంబునం బొరలు చుండఁ గాలవశంబున నొక్క లుబ్ధకుం డురు లొడ్డిన నందు దారాపత్యంబులు దగులువడిన ధైర్యంబు వదలి మోహాతిరేకంబునం గపోతంబు కళత్ర పుత్త్ర స్నేహంబునం దాను నందుఁ జొచ్చి యధిక చింతాభరంబునం గృశీభూతం బయ్యెఁ; గావున నతితీవ్రం బయిన మోహంబు గొఱగా దట్లుగాన నిరంతర హరిధ్యానపరుండై భూమి పవన గగన జల కృపీటభవ సోమ సూర్య కపోత తిలిప్స జలధి శలభ ద్విరేఫ గజ మధుమక్షికా హరిణ పాఠీన పింగళా కురర డింభక కుమారికా శరకృ త్సర్ప లూతా సుపేశకృ త్సముదయంబులు మొదలుగాఁ గలవాని గుణగణంబు లెఱింగికొని యోగీంద్రులు మెలంగుదు; రనిన.** 97

* దీనికో ఇతిహాసమున్నది విను. ఒక పెద్ద అడవిలో ఒక పావురం భార్యతో కలిసి తన నివాసాన్ని ఏర్పరచుకున్నది. ఆ పక్షిదంపతులు ఒకరి మీద ఒకరు చాలా మోహంతో ఉంటూ ఉండగా కొంతకాలానికి వాటికి సమృద్ధిగా సంతానం కలిగింది. పిల్లలన్నీ అటూఇటూ తిరుగుతూ ఉంటే ఆ సంతోషంతో, ఆ భోగానుభవంతో కొన్ని నెలలు గడిచాయి. ఇలా ఉండగా ఒకనాడు కాలవశాన ఒక బోయవాడు వచ్చి వలవేశాడు. ఆ వలలో ఆడపావురమూ, పిల్లలూ తగుల్కొన్నాయి. మగపావురం ధైర్యం వదలి మోహంతో భార్యమీదా, బిడ్డలమీదా స్నేహంతో తాను కూడా ఆ వలలో ప్రవేశించి విచారంతో కృశించి నశించి పోయింది. కాబట్టి దేనియందూ మిక్కిలి ఎక్కువైన మోహం మేలు కాదు.

కనుక యోగీంద్రులైనవారు ఎప్పుడూ హరిధ్యానంపై ఆసక్తి కలిగి భూమి, గాలి, ఆకాశం, నీరు, అగ్ని, చంద్రుడు, సూర్యుడు. పావురం, కొండచిలువ, సముద్రం, మిడుత, తుమ్మెద, ఏనుగు, తేనెటీగ, లేడి, తాబేలు, ముంగిస, లకుముకిపిట్ట, బాలుడు, కుమారిక, బాణాలు చేసేవాడు, పాము, సాలీడూ, కందిరీగ మొదలైన వాని గుణ గణాలు తెలిసికొని మెలగుతుంటారు.

క. 'ఇవి తెలియవలయు నాకును, బ్రవిమలమతి వీనిఁ దెలియఁ బలుకు' మనంగాఁ
గ్రమమున వినుమని కృష్ణుఁడు, సవినయుఁడగు నుద్ధవునికిఁ జయ్యనఁ జెప్పెన్. 98

* అని శ్రీకృష్ణుడు చెప్పగా "ఇవి ఏమిటో తెలుసుకోవాలని ఉన్నది. నిర్మల మతితో వీనిని గురించి తెలియ జెప్పవలసింది" అని ఉద్ధవుడు అడిగాడు. అప్పుడు వినయ వినమ్రుడైన ఉద్ధవునితో కృష్ణుడు ఇలా చెప్పసాగాడు.

వ. ఇ వ్విధంబున భూమివలన స్థైరణయు, గంధవహునివలన బంధురంబగు పరోపకారంబును, విష్ణుపదంబువలనఁ గాలసృష్ట గుణసాంగత్యంబు లేమియు, నుదకంబు వలన నిత్యశుచిత్వంబును, నసిత పథుని వలన నిర్మలత్వంబును, నిశాకరప్రభాకరులవలన నధికాల్పసమత్వ జీవ గ్రహణ మోక్షణంబులును, గపోతంబుల వలనఁ గళత్రపుత్రస్నేహంబును, నజగరంబు వలన స్వేచ్ఛావిహార సమాగతాహారంబును, వననిధివలన నుత్సాహరోషంబులును, శలభంబువలన శక్త్యనుకూల కర్మాచరణంబును, భృంగంబువలన సారమాత్రగ్రహణ విశేషంబును, స్తంబేరమంబువలనం గాంతా వైముఖ్యంబును, సరఘువలన సంగ్రహ గుణంబును, హరిణంబువలనం జింతాపరత్వంబును, జలచరంబు వలన జిహ్వాచాపల్యంబును, బింగళవలన యథాలాభసంతుష్టియుఁ, గురరంబువలన మోహపరిత్యాగంబును, డింభకువలన విచారపరిత్యాగంబును, గుమారికవలన సంగత్యాగంబును, శరకారునివలనం దదేకనిష్ఠయు, దందశూకంబువలనం బర గృహవాసంబును, నూర్ణనాభివలన సంసారపరిత్యాగంబును, గణుందురు వలన లక్ష్యగత జ్ఞానంబు విడువకుండుటయు ననం గల వీని గుణంబు లెఱింగి మఱియుఁ గామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యంబులను నరిషడ్వర్గంబుల జయించి, జరామరణ విరహితంబుగా వాయువశంబు సేసి, గాత్రపవిత్రత్వంబు కొఱకు షట్కర్మనిరతుండయి, పురనగర గ్రామంబులు పరిత్యజించి పర్వతారణ్యంబుల సంచరించుచు, శరీర ధారణార్థంబు నియతస్వల్పభోజనుండై, ఖేదమోదంబులు సరియకా భావించి లోభమోహంబులు వర్జించి, నిర్జితేంద్రియుండయి నన్నె కాని యొం డెఱుంగక యాత్మ నిష్ఠచేఁ బవిత్రాంతః కరణుండైన యోగి నాయందుఁ గలయుం గావున. 99

* భూమివల్ల సహనమూ, వాయువువల్ల పరోపకారమూ, ఆకాశమువల్ల కాలముచే సృష్టించబడిన గుణాలతో సాంగత్యం లేకపోవటమూ, నీటివల్ల ఎప్పుడు శుచిగా ఉండటమూ, అగ్నివల్ల నిర్మలంగా ఉండటమూ, చంద్ర సూర్యుల వలన సర్వసమత్వమూ, పావురం వలన భార్యయందూ బిడ్డలయందూ స్నేహత్యాగమూ, కొండచిలువ వలన ఇష్టప్రకారం తిరుగుతూ అందిన ఆహారాన్ని మాత్రమే స్వీకరించటమూ, సముద్రం వలన ఉత్సాహరోషములూ, మిడుతవలన శక్తికి తగిన పనిచేయటమూ, తుమ్మెదవలన సారమును మాత్రమే గ్రహించటమూ, ఏనుగు వలన స్త్రీ వైముఖ్యమూ, తేనెటీగవలన సంగ్రహణమూ, లేడివలన

విచారపరత్వమూ, తాబేలు వలన జిహ్వాచాపల్యమూ, ముంగిసవలన దొరికిన దానితో తృప్తి పడటమూ, లకుముకి పిట్టవలన మోహత్యాగమూ, బాలునివలన నిత్యసంతోషమూ, కుమారివలన సంగమ విసర్జనమూ, బాణాలు చేసే వానివలన ఏకాగ్రత, పాము వలన ఇతరుల ఇండ్ల యందు నివసించటమూ, సాలె పురుగువలన సంసారబంధాలలో చిక్కుపడకుండటమూ, కందిరీగ వలన లక్ష్యజ్ఞానమూ నేర్చుకోవాలి.

ఈ గుణాలు గ్రహించి కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యం అనే ఆరుగురు శత్రువులనూ జయించి, ముసలితనం రాకుండా చావు లేకుండా, వాయువును వశం చేసుకొని, శరీరము పవిత్రంగా ఉండటానికై యజనం, యాజనం, అధ్యయనం, అధ్యాపనం, దానం, ప్రతిగ్రహం అనే వాని మీద ఆసక్తి గలవాడై పట్టణాలనూ, గ్రామాలనూ, నగరాలనూ వదలి కొండలయందూ, అడవుల యందూ తిరుగుతూ దేహం నిలవటానికి కావలసిన కొద్దిపాటి ఆహారం తీసుకుంటూ, సంతోషం దుఃఖం రెంటినీ సమానంగా భావిస్తూ, లోభాన్ని, మోహాన్ని వదలి, ఇంద్రియాలను జయించి, నన్నే తప్ప మరొకటి ఎరుగక ఆత్మనిష్ఠతో పవిత్రమైన అంతఃకరణం కలిగిన యోగి నన్ను చేరగలుగుతాడు; నాయందే కలుస్తాడు.

**క. మోహితుఁడై వసుకాంక్షా, వాహినిలోఁ జిక్కి క్రూరవశుఁడౌ మనుజుం**
**డూహాపోహ లెఱుంగక, దేహము నలఁగంగఁ జేయు దీనత నెపుడున్.** 100

* మోహానికి వశుడై ధనవాంఛ అనే ప్రవాహంలో చిక్కుకొని క్రూరమైన భావాలకు లొంగిపోయే మనుష్యుడు ఊహాపోహలు తెలియక, దీనుడై శరీరాన్ని శిథిలం చేసుకొంటాడు.

**వ. ఇందులకుఁ బురాతన వృత్తాంతంబు గలదు; సావధాన చిత్తుండవై వినుము. మిథిలానగరంబునఁ బింగళ యను గణికారత్నంబు గలదు. దానివలనం గొంత పరిజ్ఞానంబుఁ గంటి? వ దెట్లనిన వ మ్మానిని ధనకాంక్షం జేసి యాత్మసఖుని మొఱంగి ధనం బిచ్చువానిం జేకొని నిజనికేతనాభ్యంతరంబునకుం గొని చని రాత్రి నిద్రలేకుండుచుఁ బుటభేదన విపణిమార్గంబులఁ బర్యటనంబు సలుపుచు నిద్రాలస్యభావంబున జడనుపడి, యర్థాపేక్షం దగిలి తిరిగి యలసి, యాత్మ సుఖంబు సేయు నతండె భర్తయని చింతించి నారాయణు నిట్లు చింతింప నతనికైవల్యంబు సేరవచ్చునని విచారించి, నిజశయనస్థా నాదికంబు వర్జించి వేగిరంబ వాసుదేవ చరణారవింద వందనాభిలాషిణియై దేహంబు విద్యుత్ప్రకారంబని చింతించి పరమతత్త్వంబు నందుఁ జిత్తంబు గీలుకొలిపి ముక్తురా లయ్యెనని యెఱింగించి.** 101

* దీనికొక ప్రాచీన కథ వుంది. శ్రద్ధతో విను. మిథిలానగరంలో "పింగళ" అనే ఉత్తమురాలైన వేశ్య ఉన్నది. దానివల్ల కొంత పరిజ్ఞానాన్ని పొందాను. అదెలా అంటే ఆ కాంత డబ్బుమీద ఆశతో తన ప్రియుణ్ణి మోసపుచ్చి ధనమిచ్చే వాణ్ణి మరొక విటుణ్ణి మరిగింది. వాణ్ణి తన ఇంటిలోపలకు తీసుకొనివెళ్ళింది. వాడితో రాత్రిళ్ళు నిద్ర లేకుండా ఊళ్ళో వీథుల్లో విహరించింది. నిద్ర లేక పోవటంవల్ల బాగా నీరసపడింది. ధనకాంక్షతో తిరిగి తిరిగి అలసిపోయింది. చిట్టచివరకు ఆత్మసుఖం కలిగించే వాడే భర్త అని ఆలోచించింది. నారాయణునే ఇలా చింతిస్తే కైవల్యాన్ని చెందవచ్చు గదా అని విచారించింది. తన శయనాగారాన్నీ, సమస్తసంపదలనూ

త్యజించింది. వాసుదేవుని పాదపద్మాలకు నమస్కరించి తరించాలనీ అభిలాష కలిగినదై శరీరం మెరుపు లాంటిదని నిశ్చయించి, పరతత్త్వం పైన మనస్సును లగ్నంచేసి ముక్తురాలైంది.

క. దేహము నిత్యముగా దని, మోహముఁ దెగఁగోసి సిద్ధమునివర్తనుఁడై
గేహము వెలువడి నరుఁ డు, త్సాహమునం జెందు ముక్తిసంపద ననఘా! 102

* పాపరహితుడా! దేహం శాశ్వతమైనది కాదని, మోహాన్ని తెగకోసి సిద్ధులు, మునులు చరించే మార్గాన్ని అనుసరించి ఇల్లు వెడలిన మనుష్యుడు మోక్షలక్ష్మిని పొందుతాడు.

వ. మఱియు నొక్కవిశేషం బయిన పురాతన పుణ్యకథ వినుము; కనకావతీ పురంబున నొక్కధరామరుని కన్యకారత్నంబు గల; దవ్వధూతిలకంబు రత్నసమేతంబులగు కంకణంబులు ధరియించి బంధుజనంబులకుఁ బరమాహ్లాదంబుగా నన్నంబు గావించుట కొఱకు శాలితండులంబులు దంచునప్పుడు ముసలగ్రహణభారంబునఁ గంకణంబు లతిరావంబుగా మ్రోయుచుండ న ప్పరమపతివ్రత యందులకు నసహ్యాపడి యన్నియు దులిచి యొక్కటి నిలిపె; నట్లు గావునఁ దత్త్వఱపడక భగవదాయత్తంబైన యేకచిత్తంబునం బ్రసన్నచిత్తులై నరులు ముక్తు లగుదురు; గావున నవిద్యావిద్యలు నా మాయగా విచారించి, కేవలపశుమార్గులు కాక షడ్గుణైశ్వర్య సంపన్నులైన యోగీశ్వరుల పగిది సుఖంబు గోరక యుండువారలు ముక్తు లగుదురు; సర్వంబును విష్ణుమాయగాఁ దెలియు' మని యుద్ధవునికిం జెప్పిన నతండు 'దేవా! నీ రూపం బేలాగునం గానవచ్చు' ననిన నతం డిట్లనియె. 'భక్తిభావన పరాయణుండై కృపారస తత్పరుండై మితభాషణుండై బొంకక కర్మంబులు మదర్పణంబుగాఁ జేసిన యతండు భాగవతుఁ డనం బరఁగు; మత్కథలును మజ్జన్మకర్మంబులును వినుచు మత్సేవకు లైన భాగవతులం జూచి తన గృహంబునకుం గొనిపోయి, మజ్జన పూజన భోజన శయనాసనాదికంబులఁ బరితుష్టులం జేసిన యతండైనను భాగవతుం డనఁబడు; నిట్లెంతకాలంబు జీవించు, నంతకాలంబును నడపు నతండు మద్రూపంబున వైకుంఠనిలయంబు నొందు; నదియునుంగాక గంధపుష్ప ధూపదీప నైవేద్యంబుల లక్ష్మీసమేతుండనై, శంఖ చక్ర గదాశార్ఙ్గాది యుక్తుఁడనైన నన్ను శుక సనకాది యోగీంద్రులును, నంబరీష విభీషణ రుక్మాంగదులు మొదలుగాఁ గల భాగవతులును, శాస్త్రాచారచోదితులు గాక భక్తి భావనా విశేంబున నేమఱక నిత్యంబును జింతనాయత్తులై యెఱింగిరి; మధురాపురంబునకు హలాయుధ సమేతుండనై యే నరుగుచో, గోపిక లోపికలు లేక భక్తియోగంబునఁ జింతించి ముక్తలై; రిది భక్తియోగప్రకారం' బని యుద్ధవునికిం జెప్పిన. 103

* ఇంకా ఒక విశేషమైన పురాతన పుణ్యకథ చెపుతాను; విను: కనకావతీ పురంలో ఒక బ్రాహ్మణ కన్యకారత్నం ఉన్నది. ఆ వధూమణి తన చేతులకు రత్నాలు పొదిగిన కంకణాలు ధరించి ఉండేది. ఒకనాడు వాళ్ల ఇంటికి చుట్టాలు వచ్చారు. ఇంట్లో బియ్యం లేవు. వడ్లు దంచి బియ్యంచేసి అన్నం వండిపెట్టాలి. బంధువులకు తెలియకుండా ఇంటిలోపల ఆమె రోకలితో వడ్లు దంచుతూ ఉంటే ఆ కంకణాలు గల్లుగల్లుమని పెద్ద చప్పుడు చేయసాగాయి. అందు కా పరమపతివ్రత చప్పుడు కాకుండా చేతికి ఒక్క గాజు మాత్రమే ఉంచి మిగతావన్నీ ఊడతీసి అవతలపెట్టి తనపని నెరవేర్చుకుంది.

అలాగే తత్తర పడక భగవంతునికి అర్పించిన ఏకాగ్రమైన చిత్తంతో ప్రసన్నమనస్కులై మనుషులు ముక్తులవుతారు. కనుక అవిద్య, విద్య రెండూ నా మాయగా తెలుసుకొని కేవలం పశుమార్గాలు కాకుండా ఐశ్వర్యం, వీర్యం, యశస్సు, జ్ఞానం, సిరి, వైరాగ్యం అనే షడ్గుణాలు గలిగిన యోగీశ్వరుల లాగా సుఖాన్ని కోరక ఉండేవాళ్ళు ముక్తులవుతారు. సర్వం విష్ణుమాయగా తెలుసుకో, అని ఉద్ధవునకు ఉపదేశించాడు. అప్పుడు అతడు "దేవా! నీ రూపాన్ని ఎలా చూడవచ్చు" అని అడిగాడు.

అందుకు కృష్ణుడు ఇలా అన్నాడు- ఉద్ధవా! భక్తిభావనయందు ఆసక్తుడై దయారసము కలిగి, మితభాషణుడై, అబద్ధమాడక సమస్త కర్మలూ మదర్పణంగా చేసేవాడు భాగవతు డనబడతాడు. నా కథలు, నా జననం, నా లీలా విలాసాలూ వింటూ నా సేవకులైన భాగవతులను తిలకించి తమ ఇంటికి తీసుకొని వెళ్ళి పూజించి; స్నాన, భోజన, శయనాసనాదులతో వారిని సంతృప్తి పరచిన వాడు కూడా భాగవతు డనబడుతాడు. ఇలా ఎంత కాలం జీవిస్తాడో అంతకాలమూ ఇదే విధంగా ఉండేవాడు నా రూపంతో వైకుంఠంలో ఉంటాడు.

అదీకాక శుకుడు, సనకుడు మొదలైన యోగీంద్రులూ; అంబరీషుడు, విభీషణుడు, రుక్మాంగదుడు మొదలైన భాగవతులూ శాస్త్రంతో, ఆచారంతో సంబంధం లేకుండా ఎప్పుడూ విశేషించిన భక్తితో ఏమరుపాటు రాకుండా శంఖ చక్రగదాధరుడనై లక్ష్మీసహితుడైన నన్ను గంధం, పుష్పం, ధూపం, దీపం, నైవేద్యం మొదలైనవి సమర్పిస్తూ, ధ్యానిస్తూ తెలుసుకొన్నారు. మధురాపురానికి బలరామునితో కలసి నేను వెళ్లుతుంటే నా విరహాన్ని భరించలేని గోపికలు భక్తియోగంతో నన్నే చింతించి ముక్తి పొందారు. ఇది భక్తియోగ ప్రకారం- అని ఉద్ధవునకు శ్రీకృష్ణుడు చెప్పాడు.

క. **'ధ్యానం బేక్రియ నిలుచును?, ధ్యానం బే రీతిఁ దగు? నుదాత్తచరిత్రా!**
**ధ్యానప్రకార మంత య, నూనంబుగఁ జెప్పుమయ్య యుర్వీరమణా!'** 104

* అప్పుడు శ్రీకృష్ణునితో ఉద్ధవుడు ఇలా అన్నాడు- ఓ ఉదాత్త చరిత్రా! ఉర్వీకళత్రా! ధ్యానం ఎలా నిలుస్తుంది? ఎలా ఉంటే ధ్యానం అవుతుంది? దాని విషయమంతా వివరంగా నాకు తెలియచెయ్యి.

వ. **అని యడిగిన న య్యాదవేంద్రుం డి ట్లని పలుకం దొడంగె; 'దారుమధ్యభాగంబున ననలంబు సూక్ష్మరూపంబున వర్తించు చందంబున నందంబై సకలశరీరులయందు నచ్ఛేద్యుండు, నదాహ్యుండు, నశోష్యుండు నైన జీవుండు వసించి యుండు' ననిన హరికి నుద్ధవుం డిట్లనియె; 'సనకసనందనాది యోగీంద్రులకు యోగమార్గం బే రీతి నానతిచ్చితి, నది యే విధం? బానతీయనే' యని యభ్యర్థించిన నతం డిట్లనియె; 'వారలుచతుర్ముఖు నడిగిన నతండు, 'నేనును దెలియనేర' ననిన వారలు విస్మయం బందు చుండ నే నా సమయంబున హంసస్వరూపుండనై వారల కెఱింగించిన తెఱంగు వినుము;**

**పంచేంద్రియంబులకు దృష్టం బయిన పదార్థం బనిత్యంబు;నిత్యదృష్టి బ్రహ్మం బని తెలియవలయు; దేహి కర్మార్జిత దేహుండై సంసారమమతలు నిరసించి,నిశ్చలజ్ఞాన యుక్తుండై మత్పదప్రాప్తుం డగు; స్వప్న లబ్ధపదార్థంబు నిజంబు గాని క్రియఁ గర్మానుభవ పర్యంతంబు కళేబరంబు వర్తించు నని**

సాంఖ్యయోగంబున సనకాదుల కెఱింగించిన విని, బ్రహ్మ మొదలైన దేవత లెఱింగిరి; వారి వలన భూలోకంబునఁ బ్రసిద్ధం బయ్యెఁ; నది గావున నీవును నెఱింగికొని, పుణ్యాశ్రమంబులకుం జను; మస్మదీయభక్తి యుక్తుండును, హరిపరాయణుండు నైన యతని చరణరజః పుంజంబు తన శరీరంబు సోఁక జేయు నతండును, ముద్రాధారణపరులకును హరి దివ్యనామంబులు ధరియించు వారలకు నన్నోదకంబుల నిడు నతండును, వాసుదేవభక్తులం గని హర్షించు నతండును, భాగవతుఁ'డని చెప్పి మఱియు 'సర్వసంగ పరిత్యాగంబు సేసి, యొండెఱుంగక నన్నే తలంచు మానవునకు భుక్తి ముక్తి ప్రదాయకుండనై యుండుదు' నని యానతిచ్చిన నుద్ధవుండు 'ధ్యానమార్గం బే రీతి? యానతీయ వలయు' ననిన హరి యిట్లనియె;

ఏకాంతమానసులై హస్తాబ్జంబు లూరుద్వయంబున సంధించి, నాసాగ్రంబున వీక్షణంబు నిలిపి, ప్రాణాయామంబున నన్ను హృదయగతుంగాఁ దలంచి, యష్టాదశ ధారణాయోగ సిద్ధు లెఱింగి, యం దణిమాదులు ప్రధానసిద్ధులుగాఁ దెలిసి, యింద్రియంబుల బంధించి, మనం బాత్మయందుఁ జేర్చి, యాత్మ నాత్మతోఁ గీలించిన బ్రహ్మ పదంబుఁ బొందు. భాగవతశ్రేష్ఠు లితరధర్మంబులు మాని నన్నుం గాంతురు; తొల్లి పాండునందనుఁడగు నర్జునుండు యుద్ధరంగంబున విషాదంబు నొంది యిట్లు యడిగిన నతనికి నేఁ జెప్పిన తెఱం గెఱింగించెదఁ;

జరాచరభూతం బయిన జగం బంతయు మదాకారంబుగా భావించి, భూతంబులందు నాధార భూతంబును, సూక్ష్మంబు లందు జీవుండును, దుర్జయంబులందు మనంబును, దేవతలందుఁ బద్మగర్భుండును, వసువులందు హవ్యవాహుండును, నాదిత్యులందు విష్ణువును, రుద్రులందు నీలలోహితుండును, బ్రహ్మలందు భృగువును, ఋషులందు నారదుండును, ధేనువులందుఁ గామధేనువును, సిద్ధులయందుఁ గపిలుండును, దైత్యులయందుఁ బ్రహ్లాదుండును, గ్రహంబులందుఁ గళానిధియును, గజంబులయం దైరావతంబును, హయంబులయం దుచ్చైశ్శ్రవంబును, నాగంబులందు వాసుకియును, మృగంబులందుఁ గేసరియు, నాశ్రమంబు లందు గృహస్థాశ్రమంబును, వర్ణంబులయం దోంకారంబును, నదులందు గంగయు, సాగరంబులయందు దుగ్ధసాగరంబును, నాయుధంబులందుఁ గార్ముకంబును, గిరులందు మేరువును, వృక్షంబుల యం దశ్వత్థంబును, నోషధులయందు యవలును, యజ్ఞంబుల యందు బ్రహ్మయజ్ఞంబును, వ్రతంబులం దహింసయు, యోగంబులం దాత్మయోగంబును, స్త్రీలయందు శతరూపయు, భాషణంబులయందు సత్యభాషణంబును, ఋతువులందు వసంతాగమంబును, మాసంబులలో మార్గశీర్షంబును, నక్షత్రంబులలో నభిజిత్తును, యుగంబులందుఁ గృతయుగంబును, భగవదాకారంబులందు వాసుదేవుండును, యక్షులలోఁ గుబేరుండును, వానరులం దాంజనేయుండును, రత్నంబులందుఁ బద్మరాగంబును, దానంబులలో నన్నదానంబును, దిథులయం దేకాదశియు, నరులయందు వైష్ణవుండై భాగవతప్రవర్తనం బ్రవర్తించువాఁడును - నివి యన్నియు మద్విభూతులుగా నెఱుంగు'మని కృష్ణుం డుద్ధవునకు నుపన్యసించిన వెండియు నతండి ట్లనియె. 105

* అలా అడిగిన ఉద్ధవునకు యాదవేశ్వరుడైన శ్రీకృష్ణుడు ఇలా చెప్పడం మొదలుపెట్టాడు- ప్రాని మధ్యభాగంలో అగ్ని సూక్ష్మరూపంలో ఉండే విధంగా అన్ని శరీరాలలోనూ అచ్ఛేద్యుడూ, అదాహ్యుడూ, అశోష్యుడూ అయిన జీవుడు నివసిస్తూ ఉంటాడు,' అనగా హరితో ఉద్ధవుడు ఇలా అన్నాడు. 'సనకుడు, సనందుడు మొదలైన యోగీంద్రులకు యోగమార్గం ఏ విధంగా బోధించారు? ఆ మార్గం ఎలాంటిది? నాకు ఆనతీయవలసింది' అని అభ్యర్థిస్తే శ్రీకృష్ణు డిలా అన్నాడు. 'వారు మొదట ఈ విషయం బ్రహ్మను అడిగారు. అతడు నాక్కూడా తెలియదు అన్నాడు. అపుడు వాళ్ళు ఆశ్చర్యపడుతుంటే నేను ఆ సమయంలో హంసరూపం ధరించి వాళ్ళకు చెప్పాను. అది విను.

పంచేంద్రియాలకు కనిపించే పదార్థమంతా అనిత్యం; నిత్యమైనది బ్రహ్మం మాత్రమే. పూర్వకర్మలచేత లభించిన శరీరం కలవాడైన దేహి సంసారమందు మమకారాన్ని వదలి నిశ్చలమైన జ్ఞానం పొంది నా స్థానాన్ని ప్రాపిస్తాడు. కలలో దొరకిన పదార్థం నిజం కానట్లుగా కర్మానుభవం అయిన దాకా శరీరం ఉంటుంది అని సాంఖ్య యోగాన్ని సనకాదులకు తెలిపితే విని బ్రహ్మ మొదలైన దేవతలు తెలుసుకొన్నారు. అది వారివల్ల భూలోకంలో ప్రసిద్ధమైనది. కాబట్టి నీవు తెలుసుకొని పుణ్యాశ్రమాలకు వెళ్ళు. నా యందు భక్తి కలవాడూ, ఆసక్తి కలవాడూ అయిన వాని పాదపరాగం తన శరీరానికి సోకించు కుండే వాడూ, శంఖమూ, చక్రమూ మొదలైన ముద్రలను ధరించేవాడూ, హరిదివ్యనామాలు ధరించేవారికి అన్నమూ నీళ్ళూ ఇచ్చేవాడూ, వాసుదేవ భక్తులను చూచి సంతోషించేవాడూ- భాగవతుడు. అన్ని సంగాలనూ వదలి వేరెరుగక నన్నే తలచే మానవునకు భుక్తినీ ముక్తినీ ఇస్తాను- అని ఆనతీయగా ఉద్ధవుడు ధ్యానమార్గ స్వరూపాన్ని ఆనతీయవలసింది - అని మళ్ళీ ప్రార్థిస్తే శ్రీహరి ఇలా అన్నాడు-

ఒంటరిగా కూర్చొని తొడలమీద చేతులను సంధించి నాసాగ్రమునందు చూపు నిలిపి ప్రాణాయామంతో నన్ను హృదయంలో ఉన్నవానినిగా భావించి పదునెనిమిది విధాలైన ధారణా యోగసిద్ధులను తెలిసికొని అందు "అణిమ" మొదలైనవి ప్రధాన సిద్ధులుగా గ్రహించి ఇంద్రియాలను బంధించి మనస్సును ఆత్మయందు చేర్చి, ఆత్మను ఆత్మతో లగ్నం చేసి బ్రహ్మ పదాన్ని పొందే భాగవతశ్రేష్ఠులు ఇతర విషయాలు మాని నన్ను పొందుతారు.

ఇంతకు ముందు పాండుకుమారుడైన అర్జునుడు రణరంగంలో విషాదం పొంది ఇలానే అడిగితే అతనికి చెప్పినది నీకూ చెపుతాను విను. చరాచరాత్మకం అయిన ఈ ప్రపంచమంతా నా ఆకారంగా భావించి భూతాలలో ఆధారభూతము, సూక్ష్మములందు జీవుడు, దుర్జయమైన వాటిలో మనస్సు, దేవతలలో బ్రహ్మ, వసువులందు అగ్ని, ఆదిత్యులలో విష్ణువు, రుద్రులందు నీలలోహితుడు, బ్రహ్మలందు భృగువు, ఋషులందు నారదుడు, ధేనువులందు కామధేనువు, సిద్ధులలో కపిలుడు, దైత్యులలో ప్రహ్లాదుడు, గ్రహాలలో చంద్రుడు, ఏనుగులలో ఐరావతము, గుర్రము లందు ఉచ్చైశ్రవము, నాగములలో వాసుకి, మృగములలో సింహము, ఆశ్రమములందు గృహస్థాశ్రమము, వర్ణములందు ఓంకారము, నదులలో గంగ, సముద్రములలో పాలసముద్రము; ఆయుధములలో ధనుస్సు, కొండలలో మేరువు, చెట్లలో అశ్వత్థము, ఓషధులలో యవలు,

యజ్ఞములలో బ్రహ్మయజ్ఞము, వ్రతములలో అహింస, యోగములలో ఆత్మయోగము, స్త్రీలయందు శతరూప, పలుకులందు సత్యము, ఋతువులందు వసంతము, మాసములలో మార్గశిరము, నక్షత్రములలో అభిజిత్తు, యుగములలో కృతయుగము, భగవదాకారములలో వాసుదేవుడు, యక్షులలో కుబేరుడు, వానరులలో ఆంజనేయుడు, రత్నములందు పద్మరాగము, దానములలో అన్నదానము, తిథులయందు ఏకాదశి, నరులలో వైష్ణవ భాగవతుడు- ఇవి అన్నీ నా విభూతులుగా తెలుసుకో" అని కృష్ణుడు ఉద్ధవునకు ఉపన్యసించగా మళ్ళీ ఉద్ధవు డిలా అడిగాడు.

**క. "వర్ణాశ్రమధర్మంబులు, నిర్ణయముగ నానతిమ్ము నీరజనాభా!**
**కర్ణరసాయనముగ నవి, వర్ణింపుము, వినెద నేఁడు వనరుహనేత్రా!' 106**

* పద్మనాభా! పద్మలోచనా! వర్ణములూ, ఆశ్రమములూ, వాని ధర్మములూ నిర్ణయించి చెవులకింపుగా చెప్పు వింటాను.

**వ. అనినం గృష్ణుండు నాలుగు వర్ణంబుల యుత్పత్తియు నాలు గాశ్రమంబుల కిట్టిట్టి వర్తంబు లన్నియును, నాలుగు వేదంబులం జెప్పిన ధర్మంబులును, బ్రవృత్తి నివృత్తి హేతువులగు పురాణేతిహాస శాస్త్రంబులును, వైరాగ్య విజ్ఞానంబులును నివి మొదలుగాఁ గల వన్నియు నెఱింగించి, "సర్వధర్మాన్పరిత్యజ్య మా మేకం శరణం వ్రజ" యను నుపనిషత్తుల్యంబగు గీతావచన ప్రకారంబున నెవ్వఁడేని నా యందు మతి గలిగి వర్తించువాఁడు నే నని పలుకంబడుఁ; బెక్కు విధంబుల వాదంబు లేల? యని యెందును దగులువడక నామీఁదఁ దలంపు గలిగి వర్తింపు' మనిన నుద్ధవుం డిట్లనియె. 107**

* అని ఉద్ధవుడు అడుగగా కృష్ణుడు నాలుగు వర్ణాల పుట్టుకా, నాలుగాశ్రమాలకు తగిన పద్ధతులూ, నాలుగు వేదాలలో చెప్పిన ధర్మాలూ, ప్రవృత్తి, నివృత్తి హేతువులయిన పురాణములూ, ఇతిహాసములూ, శాస్త్రములూ, వైరాగ్య విజ్ఞానములూ, మొదలైనవన్నీ తెలిపాడు. "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ"- ధర్మంబు లన్నింటినీ విడిచి నన్నొక్కనినే శరణు పొందు - అనే ఉపనిషత్తులతో సమానమయిన గీతావచనం ప్రకారం ఎవడు నాయందు మనస్సు గలిగి ప్రవర్తిస్తాడో వాడు నేనని పలుకబడుతాడు. పలువిధాలైన వాదా లెందుకు? ఎందునూ మనస్సు లగ్నం చేసుకోక నామీదనే తలపు గలిగి నడుచుకో అనగా ఉద్ధవుడిలా అన్నాడు.

**క. 'తెలియనివి కొన్ని సెప్పితి;, తెలియంగల వెల్ల నింకఁ దెలుపుము కృష్ణా!**
**వల నెఱిఁగి మెలఁగ వలయును, నలినాసనజనక! భక్తనతపదయుగళా!' 108**

* బ్రహ్మదేవుని కన్నతండ్రివీ, భక్తులచే నమస్కరింపబడే పాదద్వయం గలవాడవైన కృష్ణా! తెలియనివి కొన్ని చెప్పావు. ఇంకా తెలియవలసినవి ఉంటే తెలుపు. తెలుసుకొని కృతార్థుడ నవుతాను.

**వ. అని యుద్ధవుం డడగినం బ్రబుద్ధమనస్కుం డయిన పుండరీకాక్షుండు 'నీ ప్రశ్నంబులు దుర్లభంబు లయినను వినుము; నియమశమ దమాదులు దపంబును సుఖదుఃఖంబులు స్వర్గనరకంబులు ననం బరఁగినవి యెవ్వి, దరిద్రుం డెట్టివాఁ డీశ్వరుం డెవ్వం, డని నీవు న న్నడిగిన యర్థంబు లెల్ల వేఱు వేఱ వివరించెద;**

మౌనవ్రతబ్రహ్మచర్య క్షమాజపతపంబులును, నతిథిసత్కారంబును, బరహితంబును జౌర్యాదిరహితత్వంబును ననునివి మొదలైనవి నియమంబు లనందగు; నింద్రియనిగ్రహంబును, శత్రుమిత్ర సమత్వంబును శమం బనం బరఁగు; మూఢజనులకు జ్ఞానోపదేశంబును, గామ్యత్యాగంబును, సమదర్శనంబును, వైష్ణవ సమూహంబులతోడి భక్తియుఁ, బ్రాణాయామంబును, జిత్తశుద్ధియు ననునివి కలిమి విద్య యనంబడు; శమదమాది గుణరహితుండును, మద్భక్తి విరహితుండును నగుట యవిద్య యనందగుఁ; జిత్తశుద్ధి గలిగి నిత్యతృప్తుండౌట దమం; బిట్టినియమాది గుణ సహితత్వంబును మద్భక్తి యుక్తియు ననునదియే సుఖంబు; నన్నెఱుంగలేక తమోగుణంబునం బరఁగుటయె దుఃఖం బనంబడు; బంధుగురు జనంబులయెడ భేదబుద్ధి నొంది, శరీరంబు నిజగృహంబుగా భావించినవాఁడె దరిద్రుం; డింద్రియ నిరసనుండును, గుణ సంగవిరక్తుండు నైనవాఁడె యీశ్వరుండు;

నాయందుఁ దలంపు నిలిపి, కర్మయోగంబునందును, భక్తి యోగంబునందును వాత్సల్యంబు గలిగి జనకాదులు కైవల్యంబుఁ జెందిరి; భక్తియోగంబునం జేసి బలిప్రహ్లాద ముచుకుందాదులు పరమ పదప్రాప్తులై; రది గావున నిది యెఱింగి నిరంతర భక్తి యోగం బధికంబుగా నీ మనంబున నిలుపుము; మృణ్మయం బైన ఘటంబున జలంబులు జాలుగొను తెఱంగున దినదినంబునకు నాయువు క్షయంబై మృత్యువు సన్నిహితంబై వచ్చుఁ గావున నిది యెఱింగి నిరంతరంబును న న్నేమఱక తలంచుచుండు నతండు నాకుం బ్రియుండు. 109

* ఇలా ఉద్ధవు డడిగితే జ్ఞానాత్మకుడైన కృష్ణుడు చెప్పసాగాడు- ఉద్ధవా! నీ ప్రశ్నలు అసామాన్యాలు. అయినా విను. నియమములూ, శమమూ, దమమూ మొదలైనవి ఏవి? తప మనగా నేమి? సుఖ దుఃఖాలూ, స్వర్గ నరకాలూ, ఏవి? దరిద్రు డెట్టివాడు? ఈశ్వరుడంటే ఎవరు? అని నీవు నన్నడిగిన విషయాలన్నీ వేరు వేరుగా వివరిస్తాను.

మౌనవ్రతమూ, బ్రహ్మచర్యమూ, ఓర్పూ, జపమూ, తపమూ, అతిథులను సత్కరించటమూ, పరహితమూ, దొంగతనము మొదలైనవి లేకుండుట- ఇటువంటివి నియమాలు అనబడతాయి. ఇంద్రియాలను వశంలో ఉంచుకోటం, శత్రువులందూ, మిత్రులందూ సమంగా ఉండటం "శమ" మని చెప్పబడుతుంది. మూఢులకు జ్ఞానాన్ని ఉపదేశించటం, కోరికలను వదలటం, సమదర్శనం, వైష్ణవభక్తి, ప్రాణాయామం, మనోనిర్మలత్వం "విద్య" అనబడుతుంది. శమదమాది గుణాలు లేకపోవటం, నాయందు భక్తి లేకపోవటం "అవిద్య" అనబడుతుంది. చిత్తశుద్ధి గలిగి ఎప్పుడూ తృప్తుడుగా ఉండటం "దమ" మని చెప్పబడుతుంది. ఇటువంటి నియమాలూ, గుణాలూ కలిగి, నాయందు భక్తి కలిగి ఉండటమే "సుఖము". నన్ను తెలుసుకోలేక తమోగుణముతో ఉండటమే "దుఃఖము". బంధువులందూ, గురువులందూ భేదబుద్ధి పొంది శరీరాన్ని తనయిల్లుగా భావించినవాడే "దరిద్రుడు". ఇంద్రియాలను జయించి, గుణసంగములందు విరక్తుడైనవాడే "ఈశ్వరుడు".

నాయందు మనస్సు నిలిపి, కర్మయోగమందూ, భక్తియోగమందూ అభిమానం కలిగినవారై, జనకుడు మొదలైన వాళ్ళు మోక్షాన్ని పొందారు. భక్తియోగం సాధించి బలి, ప్రహ్లాదుడు, ముచుకుందుడు మొదలైనవారు

పరమపదాన్ని పొందారు. కనుక ఈ విషయాన్ని తెలుసుకొని ఎప్పుడూ భక్తియోగాన్ని ఎక్కువగా నీ మనస్సులో నిలుపుకో! మట్టికుండకు చిల్లి పడితే నీళ్ళు కారిపోయిన విధంగా దినదినమూ ఆయువు తరిగిపోతూ చావు దగ్గర పడుతూఉంటుంది. కాబట్టి ఇది యెరిగి ఎప్పుడూ ఏమరక నన్ను స్మరిస్తూ ఉండేవాడు. నాకు ప్రియుడు.

**క. 'గర్భమునఁ బరిజ్ఞానము, నిర్భరమై యుండు జీవునికిఁ దుది నతఁ డా**
**విర్భూతుఁ డైనఁ జెడు నం, తర్భావం బైన బోధ మంతయు ననఘా! 110**

* ఉద్ధవా! గర్భంలో ఉన్నప్పుడు జీవునికి నిండుగా జ్ఞానం ఉంటుంది. కడుపులో నుంచి భూమి మీదపడగానే ఆ జ్ఞానమంతా పోతుంది.

**వ. అట్లు గావున జనుండు బాల్య కైశోర కౌమార వయోవిశేషంబుల వెనుక నైననుం, బెద్దయైన వెనుకనైనను, న న్నెఱింగెనేనిఁ గృతకృత్యుండగుఁ, సంపద్గర్వాంధుండైన నంధకారకూపంబునం బడు; వానిం దరిద్రునింగాఁ జేసిన జ్ఞానియై యస్మత్పాదారవింద వందనాభి లాషియై ముక్తుండగు; నట్లు గావున దేహాభిమానంబు వర్జించి యైహికాముష్మిక సుఖంబులఁ గోరక మనంబు గుదియించి యే ప్రొద్దు నన్నుఁ దలంచు వాఁడు వైకుంఠపద ప్రాప్తుండగు; నేను నతని విడువంజాలక వెనువెంట నరుగుదు; నారదాది మునులు భక్తి భావంబునం జేసి నా రూపంబై' రని యుద్ధవునకుం జెప్పిన నతండు మఱియు నిట్లనియె. 111**

* కాబట్టి మానవుడు పసివాడుగా గానీ, పిల్లవాడుగా గానీ, యువకుడుగా గానీ, పెద్దవాడైన తరువాత గానీ నన్ను తెలుసుకుంటే కృతార్థు డవుతాడు. సంపదలున్న వన్న గర్వంతో గ్రుడ్డియైనవాడు చీకటి బావిలో పడుతాడు. అటువంటి వాడిని దరిద్రునిగా జేస్తే జ్ఞానియై నా పాద పద్మాలకు నమస్కరించాలనే అభిలాష కలిగి మోక్షం పొందుతాడు. కనుక శరీరమునందు అభిమానాన్ని వదలి ఈ లోకానికీ, పరలోకానికి చెందిన సుఖాలను కోరక మనస్సును నిగ్రహించి యెల్లవేళలా నన్ను స్మరించే వాడు వైకుంఠపదాన్ని పొందుతాడు. నేనూ అతనిని విడచి పెట్టలేక వాని వెనువెంటనే వెళ్ళుతుంటాను. నారదుడు మొదలైన మునులు భక్తిభావం వల్ల నా సారూప్యం పొందారు- అని శ్రీకృష్ణుడు ఉద్ధవునికి చెప్పగా అతడింకా ఇలా అన్నాడు.

**క. అయ్యా! దేవ! జనార్దన!, నెయ్యంబున సృష్టికర్త నేర్పరియై తా**
**నొయ్యన నడపును నెవ్వఁడు, సయ్యన నెఱిఁగింపవయ్య! సర్వజ్ఞనిధీ!' 112**

* దేవదేవా! వాసుదేవా! జనార్దనా! నీవు సర్వజ్ఞుడవు! సృష్టి కర్తను ఎవడు నేర్పుతో నడుపుతాడో? ఆనతీయవలసింది.

**వ. అనుటయు హరి యుద్ధవునకుం జెప్పె; 'నట్లు మత్ప్రేరితంబులై మహదాది గుణంబులు గూడి యండంబై యుద్భవించె; నా యండంబువలన నే నుద్భవించితి; నంత నా నాభివివరంబున బ్రహ్మ యుదయించె; సాగరారణ్య నదీనద సంఘంబులు మొదలుగాఁ గల జగన్నిర్మాణంబు లతని వలనం గల్పించితి;**

నంత శతానందులకు శతాబ్దంబులు పరిపూర్ణంబైన ధాత్రి గంధంబునం దడంగు; నాగంధం బుదకంబునం గలయు; నా యుదకంబు రసంబున లీనం బగు; నా రసంబు తేజోరూపం బగు; నా తేజంబు రూపంబున సంక్రమించు; నా రూపంబు వాయువందుం గలయు; వాయువు స్పర్శగుణ సంగ్రాహ్యం బైన స్పర్శగుణం బాకాశంబున లయంబగు; నా యాకాశంబు శబ్దతన్మాత్రచే గ్రసియింపఁబడిన నింద్రియంబులు మనోవైకారిక గుణంబులం గూడి యీశ్వరునిం బొంది, యీశ్వరరూపంబు దాల్చు;

నేను రజస్సత్త్వ తమోగుణ సమేతుండనై త్రిమూర్తులు వహించి, జగదుత్పత్తి స్థితిలయ కారణుండనై వర్తిల్లుదుఁ; గావున నీ రహస్యంబు నీకు నుపదేశించితిఁ, బరమ పావనుండవుఁ బరమ భక్తి యుక్తుండవుగ' మ్మని చెప్పె; నంత. 113

* అనగా హరి ఉద్ధవునితో ఇలా అన్నాడు- ఆ విధంగా నా చేత ప్రేరేపించబడి మహత్తు మొదలైన గుణాలు అన్నీ కలసి ఒక అండంగా ఏర్పడ్డాయి. ఆ అండం నుంచి నేను పుట్టాను. అంత నా నాభి రంధ్రంలోనుంచి బ్రహ్మపుట్టాడు. సముద్రాలు, అరణ్యాలు, నదులు, నదములు, మొదలైన ప్రపంచమంతా అతనిచేత నేనే నిర్మింపజేశాను. ఆ బ్రహ్మకు నూరేండ్లు నిండిన తర్వాత భూమి గంధంలో అణగిపోతుంది. గంధం నీటిలో కలుస్తుంది. ఆ నీరు రసములో లీన మవుతుంది. ఆ రసం తేజస్సు యొక్క రూపాన్ని ధరిస్తుంది. ఆ తేజస్సు రూపమునందు సంక్రమిస్తుంది. ఆ రూపం వాయువులో కలుస్తుంది. ఆ వాయువు స్పర్శగా మారుతుంది. ఆ స్పర్శ గుణం ఆకాశంలో లయమవుతుంది. ఆ ఆకాశం శబ్ద తన్మాత్రచే గ్రహింప బడుతుంది. ఇంద్రియాలు మనోవికార గుణాలతో కూడి ఈశ్వరునిలో లీనమై యీశ్వరరూపాన్ని ధరిస్తవి.

నేను రజస్సు, సత్త్వము, తమస్సు అనే మూడు గుణాలతోకూడి మూడు మూర్తులు ధరించి సృష్టియొక్క పుట్టుకకూ, ఉనికికీ, నాశనానికీ కారణుడనై వర్తిస్తాను, ఈ రహస్యాన్ని నీకు ఉపదేశించాను. పరమపావనుడవైనావు. పరమ భక్తియుక్తుడవు కావలసింది- కృష్ణుని పలుకులు విని ఉద్ధవుడిలా ప్రశ్నించాడు-

ఆ. 'రూపు లేని నీకు రూఢిగా యోగులు, రూపు నిల్పి నిన్ను రుచిరభక్తిఁ
గొల్చి యుంద్రు; వారికోర్కుల నిచ్చెద, వేమిలాగు? నాకు నెఱుఁగఁబలుకు. 114

* రూపం లేని నీకు యోగులు రూఢిగా ఒక ఆకారాన్ని నిలిపి స్థిరమైన భక్తితో నిన్ను కొలుస్తూ ఉంటారు. నీవు వారి కోరిక లెలా తీరుస్తావు? నాకు తెలియజేయవలసినది.

వ. అని యుద్ధవుం డడిగిన నారాయణుం డిట్లనియె; 'నేను సర్వవర్ణంబులకు సమంబైన పూజాప్రకారం బెఱింగించెద; నాచారంబునంజేసి యొకటిఁ బాషాణమృణ్మయదారువులం గల్పించి, నాదరూపంబుగా నిల్పికొని కొందఱు పూజింతురు; కాంస్యత్రపురజతకాంచన ప్రతిమావిశేషంబు లుత్తమంబు; లిట్లు నా ప్రతిమా రూపంబు లందు మద్భావం బుంచి కొల్చినవారికి నేఁ బ్రసన్నుండ నగుదు; నీ లోకంబున మనుష్యులకు ధ్యానంబు నిలువనేరదు; గావునం బ్రతిమావిశేషంబు లనేకంబులు గలవు; వానియందు సౌందర్యసారంబులు మనోహరంబులు నైన రూపంబుల మనఃప్రసన్నుండనై నే నుండుదుఁ; గావున దుగ్ధార్ణవశాయిఁగా భావించి ధౌతాంబరాభరణ మాల్యానులేపనంబులను, దివ్యాన్నపానంబులను, షోడశోక్త

ప్రకారంబుల రాజోపచారంబులను, బాహ్య పూజావిధానంబుల నాచరించి మత్సంకల్పితంబులైన పదార్థంబులు సమర్పించి, నిత్యంబును నాభ్యంతర పూజావిధానంబులం బరితుష్టునిం జేసి; దివ్యాంబరాభరణ మాల్యశోభితుండును, శంఖచక్ర కిరీటాద్యలంకార భూషితుండును, దివ్యమంగళ విగ్రహుండునుగాఁ దలంచి ధ్యానపరవశుండైన యతండు నాయందుఁ గలయు; నుద్ధవా! నీ వీ ప్రకారంబు గరిష్ఠనిష్ఠాతిశయంబున యోగనిష్ఠుండవై, బదరికాశ్రమంబు సేరి మత్కథితంబైన సాంఖ్యయోగం బంతరంగంబున నిల్పుకొని, కలియుగావసాన పర్యంతంబు వర్తింపు' మని యప్పమేశ్వరుం డానతిచ్చిన నుద్ధవుండు నానందభరితాంతరంగుండై తత్పాదారవిందంబులు హృదయంబునం జేర్చుకొని, పావనంబైన బదరికాశ్రమంబునకు నరిగె' నని శుకుండు పరీక్షిన్నరేంద్రునకుం జెప్పుటయు. 115

* ఉద్ధవు డడిగిన ప్రశ్నకు నారాయణు డిలా అన్నాడు- నేను అన్ని వర్ణాలకు సమమైన పూజాపద్ధతి చెపుతాను. రాతితోగానీ, మట్టితోగానీ, కొయ్యతోగానీ తమ ఆచారం ప్రకారం ఒక ఆకారం కల్పించి ఒక పేరు పెట్టి కొందరు పూజిస్తారు. కంచుతో గానీ, సీసంతో గానీ, వెండితోగానీ, బంగారంతో గానీ చేసిన బొమ్మలు శ్రేష్ఠమైనవి. ఈ విధంగా నా ప్రతిరూపాలలో నా భావాన్ని ఉంచి కొలిచిన వారికి నేను ప్రసన్నుడ నవుతాను.

ఈ లోకంలో మనుషులకు ధ్యానం నిలువదు. కనుక ఎన్నో విధాలుగా ఉండే దేవతాప్రతిమలలో బాగా అందంగా ఉండే రూపాలలో నేను ప్రసన్నుడనై ఉంటాను. కనుక పాలసముద్రంలో పడుకొన్న వానినిగా భావించి శుభ్రమైన వస్త్రాలనూ, ఆభరణాలనూ, పూలదండలనూ, మైపూతలనూ అర్పించి దివ్యమైన అన్నపానాలతో షోడశోపచారాలతో, రాజోపచారాలతో బాహ్యమైన పూజలు చేసి, నా కిష్టమైన పదార్థాలను సమర్పించి కానీ, లేదా ప్రతి దినమూ మానసిక పూజాపద్ధతులతో సంతుష్టి పరచి నన్ను, దివ్యమైన వస్త్రాలతో, భూషణాలతో, పూలదండలతో ప్రకాశిస్తూ శంఖము, చక్రము కిరీటము మొదలైన వానితో అలంకృతుడనైన దివ్యమంగళవిగ్రహునిగా భావించి ధ్యానపరవశుడైన నా భక్తుడు నాయందు కలుస్తాడు.

ఉద్ధవా! నీవు ఇటువంటి అతి తీవ్రమైన యోగనిష్ఠతో బదరికాశ్రమం చేరి నేను చెప్పిన సాంఖ్యయోగాన్ని మనస్సులో నిలుపుకొని కలియుగం చివరి దాకా ఉండు- అని పరమేశ్వరు డానతీయగా ఉద్ధవుడు ఆనందముతో నిండిన మనస్సు కలవాడై కృష్ణుని పాదపద్మాలను హృదయాన చేర్చుకొని పవిత్రమైన బదరికాశ్రమానికి వెళ్ళాడు- అని శుకయోగీంద్రుడు పరీక్షిన్మహారాజుకు చెప్పాడు.

క. చెప్పిన విని రాజేంద్రుఁడు, సొప్పడ 'శ్రీకృష్ణుకథలు చోద్యము గాఁగం
జెప్పినఁ దనియదు చిత్తం, బొప్పుఁగ మునిచంద్ర! నాకు యోగులు మెచ్చన్. 116

* మునీంద్రుని పలుకులు విని రాజేంద్రుడు- మునిచంద్రా! శ్రీ కృష్ణుని కథలు చాలా అద్భుతంగా ఉన్నవి. యోగులు మెచ్చే విధంగా మీరెంత చెప్పినా నేను ఎంత వినినా తనివి తీరడం లేదు.

తే. అంతటను గృష్ణుఁ డేమయ్యెఁ? నరసిచూడ, యదువు లెట్టులు వర్తించి రేర్పడంగ
ద్వారకాపట్టణం బె వ్విధమున నుండె, మునివరశ్రేష్ఠ! యానతీ ముదముతోడ.' 117

* అనంతరం కృష్ణు డేమైనాడు? యాదవు లెలా ప్రవర్తించారు? ద్వారకాపట్టణం ఏమైంది? మునివర్య! అన్ని విషయాలూ ఆనతీయవలసినది.

## -: శ్రీ కృష్ణ బలరాములు వైకుంఠమున కరుగుట :-

వ. అనిన రాజునకు శుకుం డిట్లనియె 'నట్లు వాసుదేవుం డన్యాయ ప్రవర్తకు లగు దుష్టుల సంహరించి, న్యాయప్రవర్తకులగు శిష్టులఁ బరిపాలనంబు సేసి, బలరామ సమేతంబుగా ద్వారకానగరంబు వెడలినం గని యాదవులు దమలోఁ దాము మదిరాపానమత్తులై మత్సరంబున నుత్సాహ కలహంబునకున్ గమకించి, కరితురగరథ పదాతి బలంబులతో ననర్గళంబుగా యుద్ధసన్నద్ధులై, యుద్ధంబునకుం జొచ్చి మునిశాపకారణంబున నుత్తుంగంబు లయిన తుంగ సమూహంబులు బడలుపడంగఁ బొడుచుచు, వ్రేయుచుం దాఁకునప్పుడు నవియును వజ్రాయుధ సమానంబులై తాఁకిన ఖండనంబునం బడి ఖండంబులై యొరగు కబంధంబులును, వికలంబులైన శరీరంబులును, విభ్రష్టంబులైన రథంబులును, వికటంబులైన శకటంబులును, వ్రాలెడు నశ్వంబులును, మ్రొగ్గెడి గజంబులునై, యయ్యోధనంబున నందఱుం బొలియుటకు నగి నగధరుండును రాముండునుం జని చని యంత నీలాంబరుం డొక్కత్రోవం బోయి యోగమార్గంబున ననంతునిం గలసె; న ప్పరమేశ్వరుండు మఱియొక మార్గంబునం జని యొక్క నికుంజపుంజంబు చాటున విశ్రమించుటం జేసి చరణంబు వేఱొక చరణంబుమీఁద సంఘటించి చంచలంబుగా వినోదంబు సలుపు సమయంబున నొక్క లుబ్ధకుండు మృగయార్థంబుగా వచ్చి దిక్కులు నిక్కి నిరీక్షించుచుండ, వృక్షంబు చాటున న ప్పరమపురుషుని చరణకమలంబు హరిణకర్ణంబు గాఁబోలు నని దానింగని శరంబు శరాసనంబు నందు సంధానంబు సేసి యేసిన నతండు హాహారవంబునం గదలుచుండ నప్పరమేశ్వరుని సన్నిధానంబునకు వచ్చి జగన్నాథుంగాఁ దెలిసి, భయంబున 'మహాపరాధుండను; బాపచిత్తుండను; గుటిల ప్రచారుండ'నని యనేకవిధ దీనాలాపంబులం బలుకుచు బాష్పజల ధారాసిక్త వదనుండైన, సరోజనేత్రుండు వానిం గరుణించి యిట్లనియె. 'నీ వేల జాలింబడెదు? పూర్వజన్మ కర్మంబు లెంత వారికైన ననుభావ్యంబులగుం గాని యూరకపోవ నేరవు; నీవు నిమిత్తమాత్రుండ; వింతియ కాని' యని వానికిం దెలిపిన వాఁడును 'మహాపరాధులైనవా రూరక పోవరు; దేవగురు వైష్ణవ ద్రోహులకు నిలువ నెట్లగు' నని పవిత్రాంతః కరణుండై ప్రాయోపవేశంబునం బ్రాణంబులు వర్జించి వైకుంఠ పదప్రాప్తుండయ్యె నప్పుడు. 118

* అప్పుడు రాజుతో శుకుడిలా అన్నాడు- ఆ విధంగా కృష్ణుడు అన్యాయపు నడవడి గల దుర్మార్గులను చంపి, న్యాయపు నడవడి గల సన్మార్గులను కాపాడి, బలరామునితో కలిసి ద్వారక నుండి వెళ్లి పోగా, యాదవులు తమలో తాము మద్యపానం చేసి మత్తిల్లి, ఈర్ష్యతో సరదాగా పోట్లాడుకోటం మొదలుపెట్టారు. అది నిజమైన పోట్లాటగా మారింది. ఏనుగులు, గుర్రాలు, రథాలు, కాల్బంట్లు- అన్నింటితో కూడి అడ్డు

లేకుండా సిద్ధమై యుద్ధం మొదలుపెట్టారు. మునిశాపం కారణంగా ఎత్తుగా పెరిగిన తుంగబెత్తాలతో అలసిపోయేలా కొట్టుకుంటూ బాదుకొంటూ వజ్రాయుధంతో సమానమైన ఆయుధాలతో ఒకరినొకరు పొడుచుకుంటూ భయంకరంగా యుద్ధం చేశారు. రణరంగమంతా ముక్కలు ముక్కలై చెదరిన మొండెములతో, వికలమైన దేహాలతో, విరిగిన రథాలతో, కూలిన గుర్రాలతో, వాలిన ఏనుగులతో నిండిపోయింది. యాదవులు అందరూ ఆ సమరంలో చచ్చిపోయినారు. ఇదంతా చూచి నవ్వుకుంటూ కృష్ణుడూ, బలరాముడూ అలా అలా వెళ్ళిపోయారు. కొంతదూరం వెళ్ళిన తర్వాత బలరాముడు ఒక్కడూ ఒక మార్గాన పోయి యోగమార్గంతో అనంతునిలో కలిశాడు. పరమేశ్వరుడైన కృష్ణుడు మరోమార్గంలో వెళ్ళి గుబురుగా ఉన్న ఒక పొదచాటున పడుకొని విశ్రాంతి తీసుకుంటూ ఒక కాలుమీద మరొకకాలు పెట్టి ఆడిస్తూ ఉండగా ఒక బోయవాడు వేటకు వచ్చి దిక్కులన్నీ నిక్కి చూస్తూ ఉంటే చెట్టుచాటున ఆ పరమపురుషుని కదలుతున్న కాలు లేడి చెవిలాగా కన్పించింది. వాడు వెంటనే అమ్ములపొదినుంచి బాణం తీసి విల్లెక్కుపెట్టి గురిచూచి కొట్టాడు. ఆ బాణం తగిలి శ్రీకృష్ణుడు "హోహో"అని అరిచాడు. వాడు దగ్గరకు వచ్చి చూచి జగదీశ్వరుడైన కృష్ణుడని తెలుసుకొని భయంతో- "అపరాధం చేశాను. పాపాత్ముణ్ణి వక్రబుద్ధిని" అని పలు విధాలుగా దీనంగా ఏడుస్తూ కన్నీరు కారుస్తూ ఉంటే- వానిని చూచి దయతో కృష్ణుడిలా అన్నాడు. 'నీ వెందుకు దుఃఖిస్తావు? పూర్వజన్మ కర్మల అనుభవాలు ఎవరికైనా తప్పవు. వాటి ఫలితా లూరకపోవు. నీవు నిమిత్తమాత్రుడివి. ఇంతే' అని వానికి తెలియజేసినా వాడు- ఇంత పెద్ద తప్పుచేసిన వాడు ఊరక పోగూడదు. దైవానికీ, గురువులకూ, వైష్ణవులకూ ద్రోహం చేసినవాడు ధరణిపై నిలువరాదు- అని పవిత్రమైన మనస్సుతో నిరాహారదీక్ష చేసి ప్రాణాలు వదిలి వైకుంఠానికి వెళ్ళాడు.

**క. దారుకుఁడు గనియె నంతటఁ, జారు నిరూఢావధాను సర్వజ్ఞు హరిన్**
**మేరునగధీరు దనుజ వి, దారుని నేకాంతపరునిఁ దద్దయు నెమ్మిన్.** 119

* ఆ సమయంలో రథసారథి యైన దారుకుడు వచ్చి సర్వజ్ఞుడూ, మేరు పర్వతధీరుడూ, దనుజ సంహారుడూ అయిన కృష్ణుడు ఒంటరిగా ఉండటం చూచాడు.

**వ. కని యత్యంతభయభక్తి తాత్పర్యంబుల ముకుళిత కరకమలుండై యిట్లనియె.** 120

* అలా చూచి మిక్కిలి భయంతో, భక్తితో, చేతులు జోడించి దారుకుడు ఇలా అన్నాడు.

**తే. 'నిన్నుఁ జూడని కన్నులు నిష్ఫలములు, నిన్ను నొడువని జిహ్వ దా నీరసంబు**
**నిన్నుఁ గానని దినములు నింద్యములగుఁ, గన్నులను జూచి మమ్మును గారవింపు.'** 121

* స్వామీ! నిన్ను జూడని కన్నులు నిష్ఫలాలు, నిన్ను వర్ణించని నాల్క నీరసమైనది. నిన్ను కనుగొనని దినాలు నిందింపదగినవి. నీ కన్నులెత్తి మమ్ము దయతో చూడు.

**వ. అనుచు నా దారుకుండు నిర్వేదనపరుండై యిట్లని విన్నవించె;'యాదవసముద్రం బడంగె; బంధు గురుమిత్రజనంబు లక్కడక్కడం బోయిరి; ద్వారకకుం బోయి సుహృజ్జనంబులతోడ నేమందు?' నని పలుకు నవసరంబున దివ్యాయుధంబులును, దివ్యరథరథ్యంబులు నంతర్ధానంబు నొందె;**

**నారాయణుండు వానితో 'నక్రూరవిదురులకు నీ వృత్తాంతం బంతయుఁ జెప్పుము; సవ్యసాచిం గని స్త్రీబాల గురువృద్ధజనంబులఁ గరిపురంబునకుం గొని చను మనుము; పొమ్మనిన వాఁడును మరలి చని కృష్ణుని వాక్యంబులు సవిస్తరంబుగాఁ జెప్పె! నట్లు సేయు నాలోన ద్వారకానగరంబు పరిపూర్ణజలంబై మునింగె; నంత నెవ్వరికిం జనరాక యుండె; నప్పరమేశ్వరుండును శతకోటి సూర్యదివ్యతేజో విభాసితుండై వెడలి నారదాది మునిగణంబులును, బ్రహ్మరుద్రాది దేవతలును, జయజయ శబ్దంబుల తోడం గదలి రా నిజపదంబున కరిగె; నన్నారాయణ విగ్రహంబు జలధి ప్రాంతంబున జగన్నాథస్వరూపంబై యుండె' నని శుకుండు పరీక్షిన్నరేంద్రునకుం జెప్పెనని చెప్పి.122**

* అంటూ దారుకుడు దుఃఖంతో ఇలా విన్నవించాడు- సముద్రమంత యాదవసమూహం నశించింది. బంధువులూ, గురువులూ, మిత్రులూ మిగిలిన వారు అటూ, ఇటూ చెల్లాచెదరై పోయారు. ద్వారకకు పోయి మిత్రులతో ఏమి చెప్పేది? అని అంటుండగానే శ్రీకృష్ణుని దివ్యమైన ఆయుధాలూ, గుర్రాలూ మాయమైనవి. నారాయణుడు దారుకునితో- అక్రూరునికీ విదురునికీ జరిగిందంతా చెప్పు. స్త్రీలనూ, పిల్లలనూ, పెద్దవాళ్ళనూ, ముసలివాళ్ళనూ హస్తినాపురానికి తీసుకొని వెళ్ళమని అర్జునుడితో చెప్పు వెళ్ళు అన్నాడు. దారుకుడు తిరిగి వెళ్ళి కృష్ణుని మాటలు వివరంగా అందరికీ చెప్పాడు. ఆయన చెప్పినట్లు చేసినంతలో ద్వారకానగరం పరిపూర్ణజలాలలో మునిగిపోయింది' ఎవరికీ ప్రవేశించటానికి వీలులేని స్థితికి వెళ్ళింది.

అప్పుడు పరమేశ్వరుడైన కృష్ణుడు నూరు కోట్ల సూర్యుల దివ్యతేజస్సుతో వెడలి నారదుడు మొదలైన మునుల సముదాయమూ, బ్రహ్మ, రుద్రుడు మొదలయిన దేవతలూ, జయజయ నినాదాలతో తోడు రాగా తన స్థానానికి వెళ్ళిపోయినాడు. ఆ నారాయణుని మూర్తి సముద్రప్రాంతంలో జగన్నాథుని రూపంతో ఉంది అని శుకుడు పరీక్షిత్తునకు చెప్పాడు.

**క. ఈ కథ విన్నను వ్రాసినఁ, బ్రాకటముగ లక్ష్మి యశము భాగ్యము గలుగుం
జేకొని యాయువు ఘనుఁడై, లోకములో నుండు నరుఁడు లోకులు వొగడన్. 123**

* ఈ కథను విన్నవారూ, వ్రాసినవారూ, సిరిసంపదలూ, కీర్తి, అదృష్టమూ కలిగి దీర్ఘాయువుతో లోకులు మెచ్చగా గొప్పవారై ప్రకాశిస్తారు.

**చ. నగుమొగమున్ సుమధ్యమును నల్లని మేనును లచ్చి కాట ప
ట్టగు నురమున్ మహాభుజము లంచితకుండలకర్ణముల్ మదే
భ గతియు నీల వేణియుఁ గృపారసదృష్టియుఁ గల్గు వెన్నుఁ డి
మ్ముగఁ బొడసూపుఁగాతఁ గనుమూసిన యప్పుడు విచ్చినప్పుడున్. 124**

* నవ్వు ముఖమూ, చక్కని నడుమూ, నల్లని దేహమూ, లక్ష్మీదేవికి నివాసమైన వక్షమూ, పెద్దబాహువులూ, అందమైన కుండలాలు గల చెవులూ, గజగమనమూ, నల్లని జుట్టూ, దయారసం చిందే చూపూ, గలిగిన విష్ణుమూర్తి నేను కనులు మూసినప్పుడూ, తెరచినప్పుడూ పొడసూపుగాత!

క. రాజీవసదృశనయన! వి, రాజితసుగుణా! విదేహరాజవినుత! వి
భ్రాజితకీర్తి సుధావృత, రాజీవభవాండభాండ! రఘుకులతిలకా! 125

* పద్మములవంటి కన్నులు గలవాడా! ప్రకాశించే సుగుణాలు గలవాడా! జనకునిచే పొగడబడినవాడా! ప్రకాశించే కీర్తి అనే అమృతంతో ఆవరించబడిన బ్రహ్మాండభాండం గలవాడా! రఘువంశానికి తిలకం వంటివాడా!

మాలిని. ధరణి దుహితృరంతా! ధర్మమార్గానుగంతా!
నిరుపమనయవంతా! నిర్జరారాతిహంతా!
గురుబుధసుఖకర్తా! కోసలక్ష్మోణిభర్తా!
సురభయపరిహర్తా! సూరిచేతోవిహర్తా! 126

* భూపుత్రి-సీతతో ఆనందించువాడా! ధర్మమార్గాన్ని అనుసరించి చరించువాడా! సాటిలేని నీతిగలవాడా! దేవతల శత్రువులను చంపేవాడా! గురువులకూ పండితులకూ సుఖము కలిగించేవాడా! కోసలరాజా! దేవతల భయమును పోగొట్టేవాడా! పండితుల హృదయాలలో విహరించేవాడా!

గద్యము: ఇది శ్రీపరమేశ్వరకరుణాకలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారయ నామధేయప్రణీతంబైన శ్రీమహాభాగవతం బను మహాపురాణంబు నందుఁ గృష్ణుండు భూభారంబు వాపి యాదవుల కన్యోన్య వైరానుబంధంబుఁ గల్పించి, వారల హతంబు గావించుటయు, విదేహర్షభ సంవాదంబును, నారాయణముని చరిత్రంబును, నాలుగు యుగంబుల హరి నాలుగు వర్ణంబులై వర్తించుటయు, బ్రహ్మాది దేవతలు ద్వారకా నగరంబునకుం జని కృష్ణుం బ్రార్థించి నిజపదంబునకుఁ రమ్మనుటయు, నవధూతయదుసంవాదంబును, నుద్ధవునకుఁ గృష్ణుం డనేకవిధంబులైన యుపాఖ్యానంబు లెఱింగించుటయు, నారాయణప్రకారం బంతయు దారుకుం డెఱింగి వచ్చి ద్వారకా నివాసులకుం జెప్పుటయుఁ, గృష్ణుండు దన దివ్యతేజంబుతోఁ బరమాత్మం గూడుటయు నను కథలు గల యేకాదశ స్కంధము. 127

* ఇది పరమేశ్వరుని దయచేత లభించిన విచిత్రమైన కవిత్వము కలవాడూ, కేసనమంత్రి కుమారుడూ, సహజ పాండిత్యుడూ అయిన పోతనామాత్యుని ప్రియశిష్యుడు వెలిగందల నారయ్య అను పేరుగల వానిచే రచించబడిన శ్రీ మహాభాగవతమనే పురాణంలో కృష్ణుడు భూభారం పోగొట్టి యాదవులకు పరస్పరశత్రుత్వం కల్పించి వాళ్ళను నాశనం చేయటం, విదేహ ఋషభసంవాదం, నారాయణ మునిచరిత్ర, నాలుగు యుగాలలో హరి నాలుగు వర్ణాలై వర్తించటం, బ్రహ్మ మొదలైన దేవతలు ద్వారకా నగరానికి వెళ్ళి కృష్ణుని ప్రార్థించి తనస్థానానికి రమ్మనటం, అవధూత యదుసంవాదం, ఉద్ధవునకు కృష్ణుడు పలు విధాలైన ఉపాఖ్యానాలు తెలపటం, కృష్ణుడి విషయమంతా తెలుసుకొని దారుకుడు వచ్చి ద్వారకలోని వారికి చెప్పటం, కృష్ణుడు తన తేజస్సుతో పరమాత్మను కలవటం- అనే కథలు గల పదకొండో స్కంధం.

# పోతన భాగవతము

## ఐదవ సంపుటము

### పండ్రెండవ స్కంధము

# ప్రవేశిక

ద్వాదశ స్కంధంలో కలియుగ రాజవంశ చరిత్రం, కలియుగ లక్షణం, ప్రళయకాల వివరణం, శుకమహర్షి అంత్యోపదేశం, తక్షకాగమనం, పరీక్షిన్మరణం, జనమేజయుని సర్పయాగం, మార్కండేయోపాఖ్యానం, పురాణశ్లోక గణనం, శ్రీమద్భాగవత మహత్త్వం అనే ఘట్టాలు ఉన్నాయి.

దశమ స్కంధంలోని ఘట్టాలన్నీ పోతనగారు రచించగా ఏకాదశ ద్వాదశ స్కంధాలు పోతన్నగారి ప్రియశిష్యుడు వెలిగందల నారయ రచించాడు.

పరీక్షిన్మహారాజుకు శ్రీమద్భాగవతం అంతా వినిపించిన శుక యోగీంద్రుడు సార్వకాలికమూ, సార్వజనీనమూ అయిన ఎంతటి మహత్తర సందేశాన్ని అందించాడో చూడండి-

**ఏను మృతుండ నౌదు నని యింత భయంబు మనంబులోపలన్**
**మానుము; సంభవంబు గల మానవకోటికి చావు నిక్కమౌ,**
**గాన హరిం దలంపుఁ మిఁకఁ గల్గదు జన్మము నీకు ధాత్రిపై;**
**మానవనాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్.** 12-25

ఇంతటి భాగవత మహాఫలాన్ని మానవజాతికి అందించిన శుకమహర్షిని నారయ్యగారు ఎలా ప్రస్తుతించారో పరికించండి-

**సకలాగమార్థ పారగుఁ; డకలంక గుణాభిరాము; డంచిత బృందా**
**రక వంద్యపాదయుగుఁడగు, శుక యోగికి వందనంబు సొరిది నొనర్తున్.** 12-49

ఈ విధంగా సూతమహాముని వినిపించిన భాగవతాన్ని ఆద్యంతం ఆలకించి శౌనకాది మహర్షులు దివ్య తేజోవిరాజితుడైన శ్రీమన్నారాయణుణ్ణి ఎదలలో పదిలపరచుకొని వారి వారి ఆశ్రమాలకు చేరుకున్నారు.

**అని యీరీతి నుతించి భాగవత మాద్యంతంబు సూతుండు సె**
**ప్పిన సంతుష్ట మనస్కులై విని మునుల్ ప్రేమంబునం బద్మ నా**
**భుని చిత్తంబున నిల్పి తద్గుణములన్ భూషించుచున్, ధన్యులై**
**చని రాత్మీయనికేతనంబులకు నుత్సాహంబు వర్ధిల్లఁగన్.** 12-51

నారయ్య కవిత్వం పోతన్న కవిత్వమంత రసవంతం కాదు. అయినప్పటికీ నారయ్య అదృష్టవంతుడు. కనుకనే మహాకవి పోతన్నగారి ప్రక్క ఆయనకు స్థానం లభించింది. నారయ్య ఏకాదశ ద్వాదశ స్కంధాల గద్యలో తాను పోతన్నగారి ప్రియ శిష్యుణ్ణని చెప్పుకున్నాడు.

ప్రాజ్ఞులూ, అభిజ్ఞులూ, రసజ్ఞులూ ఐన భాగవత పాఠక మహోదయు లందరికీ అభివందనాలు. ఈ సంపుటంతో పోతన భాగవతం సంపూర్ణ మయింది. మందార మకరంద మాధుర్యమయమూ, నిర్మల మందాకినీ వీచికా విలసితమూ, బాలరసాలసాల నవపల్లవ కోమలమూ, భక్తిరస ప్రపూర్ణమూ అయిన

పోతన భాగవతాన్ని ప్రతిపద్యభావార్థ సహితంగా సర్వాంగసుందరంగా ప్రకటింపవలెనన్న తిరుమల తిరుపతి దేవస్థానములవారి సత్ సంకల్పం సమగ్రంగా నెరవేరింది. ఈ పుణ్యకార్యంలో నాకున్నూ కొంత అవకాశం కల్పించిన కార్యనిర్వహణాధికారి శ్రీ ఎం.వి.యస్., ప్రసాద్, ఐ.ఏ.యస్. గారికీ, డాక్టర్ రావుల సూర్య నారాయణమూర్తి పి.ఆర్.ఓ., గారికీ. ఎడిటర్ శ్రీ కె. సుబ్బారావు. యం. ఏ., గారికీ నా కృతజ్ఞతాపూర్వక ధన్యవాదాలు.

ద్వాదశ స్కంధమును సరళ సుందరమైన గద్యంలో అనువదించిన వారు శ్రీ టి. భాస్కరరావు "స్ఫూర్తిశ్రీ" గారు. వీరు సంస్కృతాంధ్ర హిందీ భాషలలో ప్రవీణులు. ఉత్తమశ్రేణికి చెందిన కవిచంద్రులు. 30కి పైగా రసవత్కృతులు రచించినవారు. వీరి అనువాదం నిర్దుష్టము, సుమనోమనోజ్ఞము.

ఈ సంపుటాన్ని ముచ్చటగా ముద్రించి యిచ్చిన దేవస్థానం ప్రెస్ మేనేజర్ శ్రీ ఎం. విజయ కుమార్ రెడ్డి గారికీ, వారి సిబ్బందికీ నా శుభాకాంక్షలు. సహస్రాక్షులై ప్రూఫులు సరిదిద్దిన మహాకవి శ్రీ ముదివర్తి కొండమాచార్యుల వారికి, శ్రీ ములుకుట్ల రామకృష్ణశాస్త్రి ఎం.ఎ., గారికి నా ధన్యవాదాలు. నిర్దుష్టంగా ప్రెస్ కాపీని సిద్ధంచేసి యిచ్చిన చిరంజీవి కోరాడ రామకృష్ణ, యం.ఎ., యం. ఫిల్., కు నా విజయాశీస్సులు.

**గుంటూరు** **భవదీయుడు**

15-6-1991 **కరుణశ్రీ**

శ్రీరామచంద్ర పరబ్రహ్మణే నమః

# పోతన భాగవతము

## (సరళ గద్యానువాద సహితము)

## పండ్రెండవ స్కంధము

**శ్రీ మరుదశనపతిశయన!**
**కామిత మునిరాజ యోగి కల్పద్రుమ! యు,**
**ద్దామ! ఘనజనకవరనృప**
**జామాతృవరేశ! రామచంద్రమహీశా!** 1

* వాయుభక్షణం చేసే సర్పకులానికి సర్వాధిపతి అయిన ఆదిశేషునిపైని పవ్వళించేవాడా! కోరికలతో ఆశ్రయించిన మునులకు, రాజులకు, యోగులకు కోరికలు తీర్చే కల్పవృక్షం వంటి వాడా! ఉన్నతోన్నతుడా! ఘనుడైన జనకమహారాజు యొక్క అల్లుండ్రలో ఘనత వహించినవాడా! రామచంద్రభూనేతా!

**వ. మహనీయ గుణగరిష్ఠులగు న మ్మునిశ్రేష్ఠులకు నిఖిలపురాణ వ్యాఖ్యానవైఖరీ సమేతుండైన సూతుం డిట్లనియె; నట్లు పరీక్షిన్నరేంద్రునకు శుకయోగీంద్రుండు వాసుదేవ నిర్యాణ పర్యంతంబుఁ దజ్జన్మ కర్మంబులు సెప్పిన విని సంతసం బంది య న్నరపాలపుంగవుండు 'మహాత్మా, నారాయణ కథా ప్రపంచంబును, దద్గుణంబులును, నాచారవిధియును, జీవాత్మభేదంబును, హరిపూజా విధానంబును, జ్ఞానయోగ ప్రకారంబును, మొదలైనవి యెఱింగించి విజ్ఞానవంతులగాఁ జేసి మన్నించితి; వింక భావికార్యంబు లన్నియు నెఱింగింపు' మనిన శుకుండు రాజున కిట్లనియె.** 2

* గొప్పగుణాలు కలిగి గొప్పవారయిన ఆ మునివర్యులకు సర్వపురాణాలను వివరించి చెప్పే సామర్థ్యం గల సూతుడు ఈ విధంగా చెప్పాడు- ఆ విధంగా పరీక్షిన్మహారాజుకు శుకమహాయోగి శ్రీకృష్ణుడు అవతారం ముగించేవరకు జరిగిన జన్మకర్మలు చెప్పగా విని, సంతోషం పొంది 'మహాత్మా! నారాయణుని కథలను, అతని గుణాలను, ఆచారవిధులను, జీవాత్మభేదాన్ని, హరిని పూజించవలసిన విధానాన్ని, జ్ఞానయోగ విధానాన్ని, ఇంకా ఇటువంటి వాటి నెన్నింటిలో చెప్పి నాకు విజ్ఞానం కలిగించావు. ఆదరించావు. ఇంక భవిష్యత్తులో జరగబోయే వాటిని కూడా తెలియజెప్పు' అని మహారాజు కోరాడు. శుకమహర్షి యీవిధంగా చెప్పడం మొదలు పెట్టాడు.

## -: శుకయోగి పరీక్షిత్తునకు భావికాలగతులఁ జెప్పట :-

క. నరవర! యీ ప్రశ్నములకు, సరి సెప్పఁగ రాదు; నేను సామర్థ్యము చేఁ
బరికించి నీకుఁ జెప్పెదఁ, గర మొప్పఁగ భావికాలగతులన్ వరుసన్. 3

* ఓ రాజవర్యా! నీవు అడిగిన యీ ప్రశ్నకు సమాధానం సరిగా చెప్పడం సాధ్యం కాదు. అయినా, నేను నా సమర్థతతో దర్శించి తగినట్లుగా భావికాలగతులను నీకు వరుసగా వెల్లడిస్తాను.

వ. అందు రాజులప్రకారం బెఱింగించెద; బృహద్రథునకుం బురంజయుండు పుట్టు; వానికి శునకుం డనెడివాఁడు మంత్రియై పురంజయునిం జంపి తా రాజ్యం బేలుచుండు; నంతఁ గొంతకాలంబున కతనికిం గుమారుం డుదయించిన వానికిఁ బ్రద్యోతననామం బిడి పట్టంబు గట్టు; నా భూభుజునకు విశాఖరూపుం డదయింపంగలం; డాతనికి నందివర్ధనుండు జన్మించు; నీ యేవురు నూటముప్పది యెనిమిది సంవత్సరములు వసుంధరా పరిపాలనంబునం బెంపు వడయుదురు! తదనందరంబ శిశునాగుండను పార్థివుం డుదయించు; నా మూర్ధాభిషిక్తునకుఁ గాకవర్ణుండు, జనియించు, నా రాజన్యునకు క్షేమవర్ముఁ డుదయింపఁగలం; డా పృథ్వీపతికి క్షేత్రజ్ఞుం, డతనికి విధిసారుండును, విధిసారున కజాతశత్రుండు, నా భూపాలునకు దర్భకుండును, దర్భకునికి నజయుండు, నతనికి నందివర్ధనుండు, నతనికి మహానందియు ననంగల శైశునాగులు పదుండ్రు నరపాలకు లుద్భవించి షష్ట్యుత్తరత్రిశతి హాయనంబులు గలికాలంబున ధరాతలం బేలుదు; రంతట మహానందికి శూద్రస్త్రీ గర్భంబున నతి బలశాలి యయిన మహాపద్మపతి యగు నందనుం డుదయించు; నతనితో క్షత్రియవంశం బడంగిపోఁగల; దా సమయంబున నరపతులు శూద్రప్రాయులై ధర్మ విరహితులై తిరుగుచుండ మహాపద్మునకు సుమాల్యుం డాదిగాఁ గల యెనమండ్రు కుమారు లుదయించెదరు; వారు నూఱుసంవత్సరంబులు క్షోణీతలం బేలెద; రంతటఁ గార్మికుండు మొదలుగా రాజనవకంబు నందాఖ్యలం జనియించు; నా నవనందుల నొక భూసురోత్తముం డున్మూలనంబు సేయు; నప్పుడు వారు లేమిని మౌర్యులు గొంతకాలం బీ జగతీ తలంబు నేలుదు; రత్తఱి నా భూదేవుండు చంద్రగుప్తుం డను వానిం దన రాజ్యంబందు నభిషిక్తుంగాఁ జేయంగలం; డంత నాచంద్ర గుప్తునకు వారిసారుండును, వానికి నశోకవర్ధనుండు, నతనికి సుయశస్సును, వానికి సంయుతు, డమ్మహనీయునకు శాలిశూకుం డతనికి సోమశర్ముండు, వానికి శతధన్వుండు, న వ్వీరునకు బృహద్రథుండు నుదయించెదరు; మౌర్యులతోఁ జేరిన యీ పదుగురును సప్తత్రింశదుత్తర శతాబ్దంబులు నిష్కంటకంబుగా భూపరిపాలనంబు సేసెద; రా సమయంబున బృహద్రథుని సేనాపతి యగు పుష్యమిత్రుఁడు శుంగాన్వయుఁడతని వధించి రాజ్యంబు గైకొను; నతనికి నగ్ని మిత్రుండను నరపతి పుట్టఁగలవాఁ ; డాతనికి సుజ్యేష్ఠుండు, సుజ్యేష్ఠునకు వసుమిత్రుండు, నతనికి భద్రకుండును, భద్రకునకుఁ బుళిందుండు, నా శూరునకు ఘోషుండును, వానికి వజ్రమిత్రుండును, నతనికి భాగవతుండును, వానికి దేవభూతియు నుద్భవించెద; రీ శుంగులు పదుండ్రును ద్వాదశోత్తరశత హాయనంబు లుర్వీపతు లయ్యెద; రంతమీఁదట శుంగకులసంజాతుండైన దేవభూతిని గణ్వామాత్యుండగు వసుదేవుం డనువాఁడు వధియించి, రాజ్యం బేలు; వానికి భూమిత్రుండు, న మ్మహానుభావునకు

**నారాయణుండును గలిగెదరు; కణ్వవంశజులైన వీరలు మున్నూట నలువదేను సంవత్సరంబులు మేదినీతలం బేలుదురు; మఱియును.** 4

* వాటిలో ముందుగా రాజుల గురించి చెబుతాను. బృహద్రథుడు అనే రాజుకు పురంజయుడు పుడతాడు. అతనికి శునకుడనే అమాత్యుడుంటాడు. అతడు పురంజయుని సంహరించి తానే గద్దెనెక్కి రాజ్యం పరిపాలిస్తుంటాడు. అతనికి కొంతకాలానికి ఒక కొడుకు పుడతాడు. వాడికి ప్రద్యోతుడని పేరు పెట్టి రాజ్యం కట్టబెడతాడు. ప్రద్యోతునికి విశాఖరూపుడు, అతనికి నందివర్ధనుడు పుడతారు. ఈ రాజు లైదుగురు నూటముప్పైయెనిమిది సంవత్సరాలు భూమిని పరిపాలించి వృద్ధి చెందుతారు. ఆ తరువాత శిశునాగుడు అనే రాజు జన్మిస్తాడు. అతనికి కాకవర్ణుడనే కొడుకు పుడతాడు. ఆ కాకవర్ణుని కొడుకు క్షేమవర్ణుడు. క్షేమవర్ణమహారాజుకు క్షేత్రజ్ఞుడు పుత్రుడు. అతనికి విధిసారుడు, అతనికి అజాతశత్రుడు, అతనికి దర్భకుడు, అతనికి అజయుడు, అతనికి నందివర్ధనుడు, అతనికి మహానంది ఉదయిస్తారు. శైశునాగులు అన్న పేరుతో ప్రసిద్ధులయిన యీ పదిమంది మహారాజులు కలికాలంలో మూడువందల అరవైయేళ్ళు అవిచ్ఛిన్నంగా అవనీపాలన చేస్తారు.

ఆ పిమ్మట మహానందికి శూద్రవనిత కడుపున మహాపద్ముడు పుడతాడు. అతడు మహాబలవంతుడవుతాడు. అయినప్పటికీ, అతనితో క్షత్రియవంశం అంతరించిపోతుంది. ఆ సమయంలో రాజులు శూద్రప్రాయులైపోతారు; ధర్మహీనులైపోతారు. మహాపద్మునికి సుమాల్యుడు మొదలయిన తనయులు ఎనమండుగురు కలుగుతారు. వంద సంవత్సరాల పాటు వారి పరిపాలన సాగుతుంది. ఆ పిమ్మట కార్ముకుడు మొదలయిన రాజులు తొమ్మండుగురు పుడతారు. వారికి నవనందు లని వ్యవహారం. ఆ నవనందులను ఒక అవనీసుర శ్రేష్ఠుడు అంతరింపజేస్తాడు. నందులు లేకపోవడం చేత కొంతకాలంపాటు మౌర్యులు పరిపాలన చేస్తారు.

ముందు చెప్పిన అవనీసురశ్రేష్ఠుడు చంద్రగుప్తునికి అభిషేకం చేసి రాజ్యాన్ని అప్పగిస్తాడు. ఆ చంద్రగుప్తునికి వారిసారుడు ఆవిర్భవిస్తాడు. క్రమంగా వారిసారుని కొడుకు అశోకవర్ధనుడు, అతని తనయుడు సుయశస్సు, వాని సుతుడు సంయుతుడు, అతని నందనుడు శాలిశూకుడు, వాని పుత్రుడు సోమశర్ముడు, వాని తనూభవుడు శతధన్వుడు, వాని కొమరుడు బృహద్రథుడు వరుసగా రాజులవుతారు. మౌర్యునితో కలసి ఆ పదిమంది రాజులు మొత్తం మీద నూటముప్పయ్యేడు సంవత్సరాలు నిరాఘాటంగా రాజ్యపాలన చేస్తారు. ఆ సమయంలో బృహద్రథుని సైన్యాధినేత శుంగవంశజు డయిన పుష్యమిత్రుడు అతనిని చంపి రాజ్యాన్ని అపహరిస్తాడు. అతనికి అగ్నిమిత్రుడు పుట్టి రాజవుతాడు. అతని తరువాత సుజ్యేష్ఠుడు, వసుమిత్రుడు, భద్రకుడు, పుళిందుడు, ఘోషుడు, వజ్రమిత్రుడు, భాగవతుడు, దేవభూతి వరుసగా తమ తండ్రినుంచి సంక్రమించిన రాజ్యాన్ని తాము గ్రహించి పరిపాలిస్తారు. పైని చెప్పిన పదిమంది శుంగులు నూటపన్నెండు సంవత్సరాలు రాచరికం నిలుపుకుంటారు. శుంగవంశజులలో చివరివా డయిన దేవభూతిని కణ్వమంత్రి అయిన వసుదేవుడు వధించి తానే రాజ్యాధిపతి అవుతాడు. అతనికి భూమిపుత్రుడనే పుత్రుడు కలుగుతాడు. ఆ మహానుభావునికి

నారాయణుడనే కొడుకు పుడతాడు. కణ్వవంశస్థులు మొత్తం మీద మూడువందల నలభై అయిదు సంవత్సరాలు ప్రభువులై పరిపాలన చేస్తారు.

**క. చతురత నీ క్షితి నేలియు, మతిమోహము విడువలేక మానవనాథుల్**
**సతతముఁ దమ కీ కాలం, బతిచంచల మగుట నెఱుఁగరయ్య మహాత్మా! 5**

* వారు ఎంతో నేర్పుతో ఈ భూమిని పరిపాలిస్తారు. అయినప్పటికీ, తమ అంతరంగలోని మోహం తొలగించుకోలేరు. కాలం మిక్కిలి చంచలమైన దన్న సత్యాన్ని తెలుసుకోలేరు మహాత్మా!

**క. నరపతులమహిమ నంతయు, నురగాధిపుఁడైన నొడువ నోపఁడు; ధాత్రిం**
**జిరకాల మేలి యిందే, పరువడి నడఁగుదురు వారు భ్రాంతులు నగుచున్. 6**

* ఆ రాజుల గొప్పతనాన్ని సమగ్రంగా వెయ్యితలలు గల ఆదిశేషుడైనా చెప్పలేడు. వారు చాలాకాలం భూమి నేలుతారు. అయినా, భ్రాంతిమగ్నులై యీ భూమిలోనే అణగిపోతారు.

**క. గజతురగాదిశ్రీ లను, నిజ మని నమ్మంగ రాదు;నిత్యమును హరిన్**
**గజిబిజి లేక తలంచిన, సుజనులకును నతనియందుఁ జొరఁగా వచ్చున్. 7**

* గుఱ్ఱములు, ఏనుగులు మొదలయిన సంపదలు శాశ్వతమని నమ్మరాదు. ప్రశాంత హృదయంతో నిరంతరం హరిని స్మరించే సుజనులు అతని యందే చేరుకుంటారు.

**వ. మఱియుఁ గణ్వవంశజుండగు సుశర్ముండను రా జుదయించిన వాని హింసించి తద్భృత్యుం డంధ్ర జాతీయుం డయిన వృషలుం, డధర్మమార్గవర్తియై, వసుమతీచక్రం బవక్రుండై యేలునంత వాని యనుజుండు కృష్ణుం డనువాఁడు రాజై నిలుచు; నా మహామూర్తికి శాంతకర్ణుండును, వానికిఁ బౌర్ణమాసుండును, వానికి లంబోదరుండును, వానికి సిబిలకుండు, నతనికి మేఘస్వాతియు, వానికి దండమానుండును, వానికి హాలేయుం డగు నరిష్టకర్మయు, నతనికిఁ దిలకుండు, నతనికిఁ బురీష సేతుండును, వానికి సునందనుండును, నా రాజశేఖరునకు వృకుండును, వృకునకు జటాపుండును, జటాపునకు శివస్వాతియు, వానికి నరిందముండు, నా భూమీశునకు గోమతియును, వానికిఁ బురీమంతుండు, నతనికి దేవశీర్షుండును, వానికి శివస్కందుండును, నతనికి యజ్ఞశీలుండు, నాభవ్యునకు శ్రుతస్కందుండు, వానికి యజ్ఞశత్రుండు, వానికి విజయుం, డవ్విజయునికిఁ జంద్రబీజుం, డతనికి సులోమధియు నిట్లు పెక్కం డ్రుదయించి నన్నూట యేఁబదియారు హాయనంబులు ధాత్రిం బాలించెద; రంత నాభీరు లేడ్వురు, గర్దభులు పదుండ్రు, గంకవంశజులు పదాఱుగురు, మేదినీభరంబు దాల్చియుండెద; రటమీఁద యవనులెనమండ్రు, బర్బరులు పదునల్గురు దేశాధీశులై యేలెదరు; మఱియుం బదుముప్వురు గురుండులును, బదునొకండ్రు మౌనులును, వేయుందొమ్మన్నూట తొమ్మిది హాయనంబులు గర్వాంధులయి యేలెద; రటమీఁద నా మౌనవంశజు లగు పదునొకండ్రు త్రిశతయుతంబైన వత్సరంబులు మత్సరంబున నేలెద; రాసమయంబున, గైలికిలు లను యవనులు భూపతు లగుదు; రంత భూతనందుండు నవభంగిరుండు శిశునందుండుఁ దద్భ్రాతయగు యశోనందుండుఁ బ్రవీరకుండు- వీరలు వీరులై షడుత్తరశత**

హాయనంబు లేలెద; రంత నా రాజులకుఁ బదుముప్వురు కుమారు లుదయంచి యందు నార్గురు బాహ్లికదేశాధిపతు లయ్యెదరు; కడమ యేడ్వురును గోసలాధితు లయ్యెద; రంత వైడూర్యపతులు నిషధాధి పతులై యుండెదరు; పురంజయుండు మగధ దేశాధిపతియై పుట్టి, పుళింద యదు మద్ర దేశవాసులగు హీనజాతిజనులు బ్రహ్మజ్ఞానహీనులై హరిభక్తి విరహితులై యుండ, వారికి ధర్మోపదేశంబు సేసి, నారాయణభక్తి నిత్యంబు నుండునట్లుగాఁ జేసి, బలపరాక్రమవంతులైన క్షత్రియవంశంబు లడంచి, పద్మావతీ నగర పరిపాలకుండై యా గంగా ప్రయాగపర్యంతం బగు భూమి నేలఁగలండు; శూద్రప్రాయులగు రాజులును, వ్రాత్యులును, బాషండులు నగు విప్రులును గలిగి సౌరాష్ట్రావంత్యాభీరార్బుద మాళవదేశాధిపతు లయ్యెదరు; సింధుతీరంబులఁ జంద్రభాగా ప్రాంతంబులఁ గాశ్మీర మండలంబున మేధాహీనులై మ్లేచ్ఛాకారులగు రాజులు భూభాగం బేలుచు, ధర్మసత్యదయాహీనులై, క్రోధమాత్సర్యంబుల, స్త్రీబాలగోద్విజాతుల వధియింప రోయక, పరధన పరస్త్రీ పరులై, రజస్తమోగుణరతులై, యల్పజీవులై, యల్పబలులై హరిచరణారవింద మకరంద రసాస్వాదులు గాక తమలో నన్యోన్యవైరానుబంధులై సంగ్రామరంగంబుల హతు లయ్యెద; రా సమయంబునఁ బ్రజలు తచ్ఛీల వేష భాషాదుల ననుసరించి యుండెదరు; కావున. 8

* ఆ పిమ్మటి విషయం విను. కణ్వవంశంలో సుశర్ముడనే రాజు పుడతాడు. కాని, అతనికి భృత్యుడయిన ఆంధ్రజాతీయుడు వృషలు డనేవాడు అతనిని వధిస్తాడు. అధర్మమార్గంలో సంచరిస్తూ ఆ రాజ్యాన్ని అవక్రవిక్రమంతో పరిపాలిస్తాడు. అతని తరువాత, అతని తమ్ముడు కృష్ణుడు రాజవుతాడు. ఆ తరువాత శాంతకర్ణుడు, పౌర్ణమాసుడు, లంబోదరుడు, శిబిలకుడు, మేఘస్వాతి, దండమానుడు, హాలేయుడైన అరిష్టకర్మ, తిలకుడు, పురీష సేతుడు, సునందనుడు, వృకుడు, జటాపుడు, శివస్వాతి, అరిందముడు, గోమతి, పురీమంతుడు దేవశీర్షుడు, శివస్కందుడు, యజ్ఞశీలుడు, శ్రుతస్కందుడు, యజ్ఞశత్రుడు, విజయుడు, చంద్రబీజుడు, సులోమధి అనే రాజులు పైతృకంగా వచ్చిన రాజ్యసంపదను క్రమంగా అనుభవిస్తారు. వారందరూ పరిపాలించిన కాలం నాలుగు వందలయేభై ఆరు సంవత్సరాలు.

ఆ తరువాత నాభీరవంశజు లేడుగురు, గర్దభవంశజులు పదిమంది, కంకవంశజులు పదహారుగురు భూభారాన్ని ధరించి పరిపాలిస్తారు. ఆ తరువాత ఎనిమిది మంది యవనులు, పదునలుగురు బర్బరులు ప్రభువు లవుతారు. ఆ పిమ్మట గురుండులు పదముగ్గురు, మౌనులు పదకొండుమంది గర్వంతో కన్నూ మిన్నూ కానకుండా పందొమ్మిదివందల తొమ్మిది సంవత్సరాలు పరిపాలన సాగిస్తారు. ఆ పిమ్మట మౌనవంశంలో పుట్టిన పదకొండుమంది మూడవందల సంవత్సరాల పాటు మత్సరగ్రస్తులై పరిపాలన సాగిస్తారు. అదే సమయంలో కైలికిలులు అనే యవనులు అవనీపాలకు లవుతారు. ఆ తరువాత భూతనందుడు, నవభంగిరుడు, శిశునందుడు, అతని తమ్ముడయిన యశోనందుడు, ప్రవీరకుడు అనేవారు వీరులై నూటారు సంవత్సరాలు పాలకు లవుతారు. ఆ రాజులకు పదముగ్గురు కొడుకులు పుడతారు. వారిలో ఆరుగురు బాహ్లికదేశానికి అధిపతు లవుతారు. మిగిలిన యేడుగురు కోసలదేశానికి అధిపతు లవుతారు.

అప్పుడు వైడూర్యపతులు నిషధదేశానికి అధీశ్వరు లవుతారు. పురంజయుడు మగధదేశప్రభువుగా ప్రభవిస్తాడు. పుళిందులూ, యదువంశస్థులూ, మద్రదేశీయులూ అయిన హీనజాతి జనులు బ్రహ్మజ్ఞానహీనులూ, హరిభక్తి విహీనులూ కాగా వారికి ధర్మాన్ని ఉపదేశించి నారాయణుని పట్ల భక్తి

తాత్పర్యం కలుగజేస్తాడు. శక్తి శౌర్యసమన్వితు లయిన క్షత్రియుల వంశాలను తొక్కిపెట్టి పద్మావతీనగరం రాజధానిగా చేసుకొని గంగ నుంచి ప్రయాగ వరకు గల భూమిని పరిపాలిస్తాడు.

శూద్రప్రాయులైన రాజులు, వ్రాత్యులు నాస్తికులు అయిన బ్రాహ్మణులు సౌరాష్ట్రమూ, అవంతీ, ఆభీరమూ, అర్బుదమూ, మాళవమూ అనే దేశాలకు అధిపతు లవుతారు. సింధుతీరంలోనూ, చంద్రభాగ పరిసరాలలోనూ, కాశ్మీరదేశంలోనూ మ్లేచ్ఛాకారు లయిన రాజులు పరిపాలన చేస్తారు. వారికి తెలివితేట లుండవు; ధర్మమూ, సత్యమూ, దయా ఉండవు. క్రోధమాత్సర్యాలతో పెచ్చరిల్లి స్త్రీలనూ, బాలకులనూ, గోవులనూ, బ్రాహ్మణులనూ వధించడానికి వెనుదీయరు. పరధనాసక్తి, పరవనితాసక్తి కలిగి రజోగుణంలోనూ, తమోగుణంలోనూ మునిగి అల్పాయువులూ, అల్పబలులూ అవుతారు. శ్రీవిష్ణు పాదపద్మమకరందంలోని రుచి వారికి తెలియదు. ఒకరి పట్ల ఒకరు వైరం పెంచుకొని యుద్ధాలకు సిద్ధపడి ప్రాణాలు కోల్పోతారు. ఆ సమయంలోని ప్రజలు కూడా వారి వేషభాషలనూ, శీలవృత్తులనూ అనుసరిస్తారు.

**క.** **దినదినమును ధర్మంబులు, ననయము ధర నడఁగిపోవు నాశ్చర్యముగా**
**విను వర్ణ చతుష్కములోఁ, నెనయఁగ ధనవంతుఁడైన నేలు ధరిత్రిన్.** 9

* అందువల్ల లోకంలో రోజు రోజుకూ ధర్మం తగ్గిపోతుంది. నాలుగు కులాలలోనూ ధనవంతు డయినవాడే ధాత్రీపాలకు డవుతాడు.

**క.** **బలవంతుఁ డైనవాఁడే, కులహీనుండైన దొడ్డగుణవంతుఁ డగుం**
**గలిమియు బలిమియుఁ గలిగిన, నిల లోపల రా జతండె; యేమన వచ్చున్?** 10

* బలం కలవాడిని కులం లేకపోయినప్పటికీ గొప్ప గుణవంతుడుగా పరిగణిస్తారు. ఇంక చెప్పడానికేముంది' కలిమీ, బలిమీ- రెండూ ఉంటే లోకంలో అతడే రాజు.

**వ.** **అట్లుగాన జనంబులు లోభులై జారత్వ చోరత్వాదులచేత ద్రవ్యహీనులై వన్యశాక మూలఫలంబులు భుజించుచు, వన గిరి దుర్గంబులం గృశీభూతులై దుర్భిక్ష శీత వాతాతప క్షుధా తాపంబులచేత భయంపడి, ధనహీనులై యల్పాయుష్కులు, నల్పతర శరీరులునై యుండ రాజులు చోరులై సంచరించుచు, నధర్మ ప్రవర్తనులై వర్ణాశ్రమ ధర్మంబులు విడనాడి, శూద్రప్రాయులై యుండెద; రంత నోషధు లల్పఫలదంబులు, మేఘంబులు జలశూన్యంబులు, సస్యంబులు నిస్సారంబులు నగు; నిట్లు ధర్మ మార్గంబు దక్కి యున్న యెడ ముకుందుండు దుష్ట నిగ్రహ శిష్ట పరిపాలనంబుల కొఱకు శంబలగ్రామంబున విష్ణుయశుండను విప్రునకుఁ గల్క్యవతారుండై దేవతాబృందంబులు నిరీక్షింప, దేవదత్త ఘోటకారూఢుండై దుష్టమ్లేచ్ఛ జనంబులం దన మండలాగ్రంబున ఖండీభూతులం జేయు; నప్పుడు ధాత్రీమండలంబు విగతక్రూర జనమండలంబై తేజరిల్లు; నంత నరులు విష్ణుధ్యానవందన పూజాదివిధానాసక్తులై నారాయణ పరాయణులయి వర్తిల్లెద; రిట్లు కల్క్యవతారంబున నిఖిల జనులు ధన్యు లయ్యెద; రంతటఁ గృతయుగ ధర్మంబయి నడచుచుండుఁ జంద్ర భాస్కర శుక్ర గురువు లేకరాశి గతు లయినం, గృతయుగం బయి తోఁచు; రాజేంద్రా, గత వర్తమాన భావికాలంబులు భవజ్జన్మంబు మొదలు నందాభిషేక పర్యంతంబుఁ**

**బంచదశాధికశతోత్తర సహస్ర హాయనంబు లయియుండు; నంతట నారాయణుం డఖిలదుష్ట రాజధ్వంసంబు గావించి ధర్మంబు నిలిపి వైకుంఠనిలయుం డగు నని చెప్పిన. 11**

* ఆ విధమైన వ్యవహారం వల్ల ప్రజలు దురాశాపరులై వ్యభిచారమూ, దొంగతనమూ మొదలయిన వాటికి లొంగి ధనహీను లవుతారు. అడవులలో కూరలూ, దుంపలూ, పండ్లూ తింటూ కొండలలో గుహలలో తిరుగుతూ కృశించిపోయి కరువుకూ, కాటకానికీ, చలికీ, గాలికీ, ఎండకూ, ఆకలికీ భయపడిపోతారు. వారి ఆయుర్దాయం తరిగిపోతుంది. వారి శరీరాలు కూడా చిక్కి చిక్కి చిన్నవై పోతాయి. ఇంక రాజులు తామే దొంగలై తిరుగుతుంటారు. అధర్మంగా సంచరిస్తూ, వర్ణాశ్రమ ధర్మాలను విడిచి పెట్టి శూద్రసమానులై ఉంటారు.

ఆ సమయంలో ఓషధులు కూడా అంత ఫలవంతాలు కావు. మబ్బులు వట్టిపోయి వర్షాలు కురవవు. పండిన పంటలలో పస ఉండదు. ఈ విధంగా లోకం ధర్మమార్గాన్ని తప్పినప్పుడు విష్ణుమూర్తి దుష్టశిక్షణ కొరకూ, శిష్టరక్షణకొరకూ శంబలగ్రామంలో విష్ణుయశుడనే విప్రునికి తనయుడై జన్మిస్తాడు. అతడే కల్కిరూపంలో వచ్చే అవతారమూర్తి. దేవతాసమూహాలు చూస్తూ ఉండగా, దేవదత్త మనే అశ్వాన్ని అధిరోహించి కల్కిభగవానుడు దుష్టులయిన మ్లేచ్ఛులను తన కత్తితో తుత్తునియలు చేస్తాడు.

అప్పుడు భూమండలం దుష్టజనమండలం తొలగిపోవడం చేత వెలుగు వెలుగుతుంది. ప్రజలలో విష్ణుభక్తి కుదురుకుంటుంది. ధ్యానవందనార్చనాదులందు ఆసక్తి కలిగి, ప్రజలు నారాయణభక్తి పరాయణులై మెలగుతుంటారు. ఈవిధంగా కల్క్యవతారం వల్ల అందరూ ధన్యత్వం పొందుతారు. అన్ని చోట్లా కృతయుగధర్మమే ఆచరణలో ఉంటుంది. చంద్రుడు సూర్యుడు శుక్రుడు బృహస్పతి ఒకేరాశిలో ప్రవేశింపగా, అది కృతయుగంగా కనబడుతుంది. మహారాజా! నీ పుట్టువు మొదలుకొని నందాభిషేకం వరకు జరిగిన, జరుగుతున్న, జరుగవలసిన కాలం వెయ్యిన్నూట పదిహేను సంవత్సరాలు. (మిగిలిన కాలాన్ని నువ్వే గణించ వచ్చు). ఆ పిమ్మట నారాయణుడు దుష్టరాజుల నందరినీ ధ్వంసం చేసి, ధర్మాన్ని నిలిపి, మళ్లా వైకుంఠానికి వెళ్లిపోతాడు అని శుక మహాయోగి చెప్పాడు.

**క. 'మునినాథ! యే విధంబున, ఘనతరముగఁ జంద్రసూర్య గ్రహముల జాడల్**
**సనుఁ? గాలవర్తనక్రమ, మొనరఁగ నెఱిఁగింపయ్య ముదము దలిర్పన్.' 12**

* అప్పుడు మహారాజు 'మునినాథా! చంద్రగ్రహం, సూర్యగ్రహం సంచరించే మార్గాలు ఏవి? కాలవర్తనక్రమ మేమిటి? నాకు తెలియజెప్పి సంతోషం కలిగించవా?' అని అడిగాడు.

**వ. అనిన నట్లకాక యని చెప్పందొడంగె; 'వినుము; సప్తర్షి మండలాంతర్గతంబు లయిన పూర్వ ఋక్షద్వయి సమమధ్యంబునందు నిశాసమయంబున నొక్క నక్షత్రంబు గానిపించిన కాలంబు మనుష్యమానంబున శతవత్సర పరిమితం బయ్యేనే, నా సమయంబున జనార్దనుండు నిజపదంబునం బొదలె; నా వేళనె ధాత్రీమండలంబు గలి సమాక్రాంతం బయ్యెఁ; గృష్ణుం డెంతకాలంబు భూమి యందుఁ బ్రవర్తించె, నంతకాలంబును గలి సమాక్రాంతంబు గాదు; మఘానక్షత్రంబందు సప్తర్షులు నే ఘస్రంబునఁ జరియింతు రా ఘస్రంబునఁ గలి ప్రవేశించి వేయు నిన్నూఱు వర్షంబు లయి యుండు, నా ఋషిసంఘంబు**

**పూర్వాషాఢ కరిగినం గలి ప్రవృద్ధంబు నొందు; నే దివసంబున హరి పరమ పదప్రాప్తుం డయ్యె. నా దివసంబునంద కలి ప్రవేశించి దివ్యాబ్దసహస్రంబులు సనిన యనంతరంబు నాలవ పాదంబునఁ గృతయుగధర్మంబు ప్రాప్తం బగు.** 13

* 'సరే' అని శుకమహర్షి పరీక్షిన్మహారాజుకు చెప్పడం మొదలు పెట్టాడు. విను. సప్తర్షిమండలంలోని పూర్వనక్షత్రాలకు రెండింటికీ సమంగా మధ్యగా రాత్రిసమయంలో ఒక నక్షత్రం కనిపిస్తుంది. అది కనిపించి మనుష్యగణనప్రకారం నూరు సంవత్సరాలు గడిస్తే జనార్దనుడై కృష్ణుడు స్వస్థానానికి వెళ్ళిపోయాడు. ఆ రోజుననే కలి ప్రవేశించాడు. కృష్ణుడు భూమిమీద ఉన్నంతకాలం కలి భూమిమీద అడుగు మోపలేదు. సప్తర్షులు మఘానక్షత్రంలో ఏ రోజున ప్రవేశిస్తారో ఆ నాటికి కలి ప్రవేశించి పంద్రెండువందల సంవత్సరాలు అవుతుంది. ఆ ఋషు లేడుగురూ పూర్వాషాఢలో ప్రవేశించి నప్పుడు కలి ప్రవర్ధమాను డవుతాడు. కృష్ణుడు లోకాన్ని విడిచి పరమపదమైన తన లోకాన్ని చేరుకున్న రోజుననే కలి ప్రవేశించాడు. ఈ విధంగా దివ్యసంవత్సరాలు వెయ్యి గడచిన పిమ్మట నాలుగవపాదంలో కృతయుగధర్మం నడుస్తుంది.

**చ. నరవర! తొంటి భూపతుల నామగుణంబులు, వృత్తచిహ్నముల్,**
**సిరియును, రూపసందలుఁ, జెన్నగురాజ్యము, లాత్మవిత్తముల్.**
**వరుస నడంగెఁ గాని, యట వారల కీర్తులు నిర్మలంబులై**
**యురవడి భూమిలో నిలిచి యున్నవి నేఁడును రాజశేఖరా!** 14

* ఓ రాజోత్తమా! పూర్వరాజుల పేరులు, గుణాలు ప్రవర్తన గుర్తులు, సిరులు, సంపదలు, అందచందాలు, రాజ్యాలు, ఐశ్వర్యాలు అన్నీ వరుసగా అణగారిపోయాయి, కాని యీనాటికి కూడా ఎంతో యెక్కువగా వారి కీర్తులు నిర్మలంగా ధాత్రిలో నిలిచి ఉన్నాయి.

**వ. శంతనుని యనుజుం డగు దేవాపియు, నిక్ష్వాకువంశజుం డగు మరుత్తును, యోగయుక్తులై కలాపగ్రామ నిలయులై కలియుగాంతంబున వాసుదేవప్రేరితులై, ప్రజల నాశ్రమాచారంబులు దప్పకుండ నడపుచు, నారాయణ స్మరణంబు నిత్యం బొనర్చి, కైవల్యపదప్రాప్తు లగుదు; రి క్కరణి నాలుగు యుగంబుల రాజులును నే నెఱింగించిన పూర్వరాజన్యులును, వీ రందఱును సమస్త వస్తు సందోహంబుల యందు మమత నొంది యుత్సాహవంతులై యుండి పిదప నీ భూతలంబు వదలి నిధనంబు నొందిరి; కావునఁ గాలంబు జాడ యెవ్వరికిం గానరాదు; మత్పూర్వులు హరిధ్యానపరవశులై దయా సత్య శౌచ శమ దమాది ప్రశస్తగుణంబులం బ్రసిద్ధులై నడచి; రట్లు గావున.** 15

* శంతనుని తమ్ముడు దేవాపి, ఇక్ష్వాకువంశంలో పుట్టినవాడు మరుత్తు. ఈ యిద్దరూ కలాపగ్రామంలో ఉంటూ యోగాన్ని అవలంబించినవారై కలియుగాంతంలో వాసుదేవునివల్ల ప్రేరేపణ పొంది ప్రజలందరూ ఆశ్రమాచారాలు పాటించేటట్లు నడిపిస్తూ, నిత్యమూ నారాయణస్మరణ గావిస్తూ కైవల్యం పొందుతారు. ఈ విధంగా నాలుగు యుగాల రాజులూ, పూర్వం నేను చెప్పిన రాజులు కూడా లోకంలోని సమస్త వస్తువులమీదనూ మమకారం పెంచుకొని, ఉత్సాహంతో జీవితాన్ని గడపి యీ భూమిని విడిచిపెట్టి మరణం

ఒడిలోకి చేరారు. కాల గమనాన్ని ఎవరూ గమనించలేరు. మా పెద్దలు  విష్ణుధ్యాన పరాయణులై తమ జీవితాలు  గడిపారు. దయా, సత్యం శౌచం, శమం, దమం మొదలయిన ప్రసిద్ధగుణాలు పాటించి కీర్తిమంతు లయ్యారు.

**క. ధర్మము సత్యముఁ గీర్తియు, నిర్మలదయ  విష్ణుభక్తి నిరుపమ ఘన స**
**త్కర్మ మహింసావ్రతమును, నర్మిలి గలవారె పుణ్య లవనీనాథా! 16**

* ఓ మహారాజా! ధర్మం, సత్యం, కీర్తి, అచ్ఛమైన దయ, విష్ణుభక్తి, అనుపమ మహనీయసత్కర్మ, అహింస అనే గుణాలు కలవారే పుణ్యవంతులు; వారే మహనీయులు.

**తే. ఈ జగం బేలు తొల్లిటి రాజవరులు, గాలవశమున నాయువుల్ గోలుపోయి**
**నామమాత్రావశిష్టు లైనారు;  గాన, సలుపవలవదు మమత నెచ్చట నృపాల! 17**

* ఈ లోకాన్ని  పరిపాలించిన పూర్వరాజులు కాలానికి లొంగిపోయి, ప్రాణాలు కోలుపోయారు. కేవలమూ నామమాత్రావశిష్టు లయ్యారు. మహారాజ! మమత అనేది సల్పడానికి కూడా ఎప్పుడూ ఎక్కడా పనికిరాదు.

**వ. గర్వాంధు లయిన నరపతులం జూచి భూదేవి హాస్యంబు సేయు; 'శత్రు క్షయంబు సేసి యెవ్వరికి నీక తామ యేలు చుండెద' మనియెడి మోహంబునం బితృపుత్త్రభ్రాతలకు భ్రాంతి గల్పించి, యన్యోన్య వైరానుబంధంబులం గలహంబు సేసి, రణరంగంబులఁ దృణప్రాయంబులుగా దేహాదులు వర్జించి, నిర్జరలోక ప్రాప్తులైన పృథు యయాతి గాధి నహుష భరతార్జున మాంధాతృ సగర రామ ఖట్వాంగ దుందుమార రఘు తృణబిందు పురూరవ శ్శంతను గయ భగీరథ కువలయాశ్వ కకుత్స్థ నిషధ హిరణ్యకశిపు వృత్ర రావణ నముచి శంబర భౌమ హిరణ్యాక్ష తారకాదులైన రాజు లందు, దైత్యులును ధరణికి మమత్వంబునం జేసి కదా కాలవశంబున నాశంబు నొందె? రది యంతయు మిథ్య గాన సర్వంబునుం బరిత్యజించి 'జనార్దన' వైకుంఠ, వాసుదేవ, నృసింహ, ' యని నిరంతర హరికథామృత పానంబు సేసి, జరారోగవికృతులం బాసి హరిపదంబు నొందు' మని చెప్పె. 18**

* గర్వవశులై కన్నూ మిన్నూ కానక సంచరించే రాజులను చూచి భూదేవి నవ్వుకుంటుంది. శత్రువులను సంహరించి భూమిని గ్రహించి ఎవరికీ యివ్వకుండా తామే యేలుకుంటామనే మోహంతో ఉంటారు. ఆ విధంగా తండ్రి కొడుకులకూ, అన్నదమ్ములకూ ఆశ పుట్టించి పరస్పరమూ వైరాన్ని పెంచుకొని కలహించి యుద్ధరంగంలో గడ్డిపరకలను విడిచినట్టు శరీరాలు విడిచిపెట్టి, దేవలోకాన్ని పొందిన పృథువు, యయాతి, గాధి, నహుషుడు, భరతుడు, అర్జునుడు, మాంధాత, సగరుడు, రాముడు, ఖట్వాంగుడు, దుందుమారుడు, రఘువు, తృణబిందువు, పురూరవుడు, శంతనుడు, గయుడు, భగీరథుడు, కువలయాశ్వుడు, కకుత్స్థుడు, నిషధుడు, హిరణ్యాకశిపుడు, వృత్రుడు, రావణుడు, నముచి, శంబరుడు, భౌముడు, హిరణ్యాక్షుడు, తారకుడు మొదలైన రాజులూ, రాక్షసులూ భూమిని 'నాది' అని అనుకోవడంచేతనే కాలానికి లొంగి నాశనమై పోయారు. ఇది అంతాపైకి కనిపించేదే కాని యథార్థం కాదు. కాబట్టి అంతటినీ విడిచిపెట్టి 'జనార్దనా! వైకుంఠా! వాసుదేవా! నృసింహా!' అని ఎల్లప్పుడూ శ్రీహరి కథలనే సుధను త్రాగి ముసలితనమూ, రోగమూ అనే వికారములను దూరం చేసుకొని విష్ణుస్థానమును చేరుకో!

తే. ఉత్తమశ్లోకుఁ డన నెవ్వఁ డున్నవాఁడు! , సన్నుతుండగు నెవ్వఁడు సకల దిశల
నట్టి పరమేశ్వరునిఁ జిత్తమందు నిలిపి , తద్గుణంబులు వర్ణింపు ధరణినాథ! 19

* ఓ మహారాజా! ఉత్తములకు కీర్తనీయుడూ, సర్వదిశలయందు సన్నుతుడూ అయినట్టి వాడు పరమేశ్వరుడు. ఆ పరమేశ్వరునే మనస్సులో నిల్పుకొని అతని గుణములనూ, మహిమలనూ వర్ణిస్తూ ఉండు.''

## -: యుగధర్మప్రాకృతాది ప్రళయచతుష్టయ వివేచనము :-

వ. అనిన శుకయోగీంద్రునకు రాజేంద్రుం డిట్లనియెఁ; 'గలియుగం బతిపాప సమ్మిళితంబు; గాన దురితంబు లే లాగున రాకుండఁ జేయుదురు? కాలం బే క్రమంబున నడచుఁ? గాల స్వరూపకుండైన హరిప్రభావం బేలాగునం గానఁబడు' నీ జగజ్జాలం బెవ్విధంబున నిలుచు?' నని యడిగిన రాజేంద్రునకు శుకయోగీంద్రుం డిట్లనియెఁ; 'గృతత్రేతాద్వాపర కలియుగంబులను యుగ చతుష్టయంబును గ్రమంబుగాఁ బ్రవర్తించు; ధర్మంబునకు సత్య దయా తపో దానంబులు నాలుగు పాదంబులై నడచు; శాంతి దాంత్యాత్మ జ్ఞాన వర్ణాశ్రమాచారంబులు మొదలగునవి గలిగి ధర్మంబు మొదటి యుగంబున నాలుగు పాదంబులం బరిపూర్ణంబై ప్రవర్తిల్లు; శాంతి దాంతికర్మాచరణాది రూపం బగు ధర్మంబు మూఁడు పాదంబుల రెండవ యుగంబునం బ్రవర్తిల్లు; విప్రార్చనాహింసా వ్రతజపానుష్ఠానాది లక్షణంబులు గలిగి ధర్మంబు రెండు పాదంబుల మూఁడవ యుగంబునం దేజరిల్లు; మఱియు జనులు గలియుగంబున ధర్మరహితులు; నన్యాయకారులు, క్రోధమాత్సర్య లోభమోహాది దుర్గుణ విశిష్టులు, వర్ణాశ్రమాచారరహితులు, దురాచారులు, దురన్నభక్షకులు, శూద్ర సేవారతులు, నిర్దయులు, నిష్కారణవైరులు, దయా సత్య శౌచాది విహీనులు, ననృతవాదులు, మాయోపాయులు, ధనవిహీనులు, దోషైకదృక్కులునై పాపచరితులగు రాజుల సేవించి, జననీజనక సుతసోదర బంధు దాయాద సుహృజ్జనులం బరిత్యజించి, సురతాపేక్షులై కులంబులం జెఱుచుచుండెదరు; మఱియు క్షామ డామరంబులం బ్రజాక్షయంబగు; బ్రాహ్మణులు దుష్ప్రతిగ్రహవిహారులై యజ్ఞాదికర్మంబులు పదార్థపరులై చేయుచు హీనులై నశించెద; రట్లుగాన యీ కలియుగంబున నొక్క ముహూర్తమాత్రం బయిన నారాయణ పరాయణులై మనంబున శ్రీనృసింహ వాసుదేవ సంకర్షణాది నామంబుల నచంచలభక్తిం దలంచువారలకుఁ గ్రతుశత ఫలంబు గలుగు; నట్లు గావున రాజశేఖరా! నీ మది ననవరతంబు హరిం దలంపుము; కలి యనేకదురితాలయంబు గాన, యొక్క నిమిషమాత్రంబు ధ్యానంబు సేసినం బరమ పావనత్వంబు నొంది కృతార్థుండ వగుదు' వని పలికి మఱియును. 20

* అని యోగివర్యుడైన శుకుడు రాజేంద్రుడై పరీక్షిత్తుకు చెప్పాడు. అప్పుడు పరీక్షిన్మహారాజు శుకమహాయోగిని ప్రశ్నిస్తున్నాడు. "కలియుగం ఘోరపాపాలకు ఆలవాలం. అటువంటప్పుడు ప్రజలు తమకు పాపాలు రాకుండా ఏ విధంగా చేసుకుంటారు? ఏ విధంగా కాలం నడుస్తుంది? కాలస్వరూపుడు విష్ణువే. అతని ప్రభావం ఏ విధంగా తెలుస్తుంది? ఈ లోకాలన్నీ ఏ విధంగా నిలుస్తాయి? '' అని.

శుకమహర్షి మహారాజు ప్రశ్నలకు ఈ విధంగా బదులు చెప్పడం మొదలుపెట్టాడు- 'కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అని యుగాలు నాలుగు. ఆ నాలుగు యుగాలూ క్రమంగా ప్రవర్తించే ధర్మముంది. ఆ ధర్మానికి సత్యమూ, దయా, తపస్సు, దానమూ అని నాలుగు పాదాలు. మొదటిదైన కృతయుగంలో శాంతీ, దాంతీ, ఆత్మ జ్ఞానమూ, వర్ణాచారాలూ, ఆశ్రమాచారాలూ మొదలైన వాటిని గలిగి ధర్మం నాలుగుపాదాలతోనూ పరిపూర్ణత్వం పొంది నడుస్తుంది.

రెండవదైన త్రేతాయుగంలో శాంతీ, దాంతీ, కర్మాచరణా మొదలైన లక్షణాలు కలిగి ధర్మం మూడు పాదాలతో నడుస్తుంది. మూడవదైన ద్వాపరయుగంలో బ్రాహ్మణపూజా, జపానుష్ఠానములూ, అహింసావ్రతమూ మొదలయిన లక్షణాలు కలిగి ఉంటుంది ధర్మం. ఆ ధర్మం రెండు పాదాలతో నడిచి ప్రకాశిస్తుంది.

ఇంక నాలుగవది కలియుగం. ఈ యుగంలో జనులు ధర్మదూరులుగా, అన్యాయం ఆచరించే వారుగా, క్రోధమూ, మాత్సర్యమూ, మోహము, లోభమూ మొదలయిన దుర్గుణాలతో కూడుకొన్న వారుగా ఉంటారు. వర్ణాచారాలనూ, ఆశ్రమాచారాలనూ విడిచి పెట్టేస్తారు. దురాచారాలు అవలంబిస్తారు. తినరాని అన్నం తింటారు. శూద్రసేవయందు మునిగి ఉంటారు. దయలేనివారై, నిష్కారణంగా వైరం వహించిన వారౌతారు. దయా, సత్యమూ, శౌచమూ మొదలయిన గుణాలు లేనివారై, అబద్ధాలు చెబుతూ, కపటోపాయాలు పన్నుతూ, దరిద్రులై, దోషదర్శనం మీదనే చూపు నిల్పిన వారై పాపశీలం కలిగిన రాజులను సేవిస్తూ ఉంటారు. తల్లీ, తండ్రీ, కొడుకూ, సోదరుడూ, చుట్టమూ, జ్ఞాతీ, స్నేహితుడూ అన్న అనురాగబంధం గల వారి నందరినీ విడిచిపెట్టి, కేవలమూ కాముక కర్మయందే కాంక్ష గలవారై తిరుగుతూ, కులపవిత్రతను కూలదోస్తారు. అంతే కాదు. ఆ కాలంలో కరువు కాటకాలవల్ల ప్రజలు నశించిపోతారు. బ్రాహ్మణులు పరిగ్రహింపరాని దానాలు పరిగ్రహిస్తూ యథేచ్ఛావిహారులై ఉంటారు. ఇతరుల ధనమందున్న ఆసక్తి చేత మాత్రమే యజ్ఞయాగాదులు చేస్తుంటారు. ఇలా భ్రష్టులూ, నీచులూ కావడం చేత నశిస్తారు.

కాబట్టి, యీ కలియుగంలో ఒక్కక్షణమైనా సరే 'శ్రీ నృసింహా! వాసుదేవా! సంకర్షణా!' మొదలయిన నామాలతో సుస్థిరమైన భక్తితో హరిని స్మరించాలి. ఆ విధంగా హరిస్మరణ పరాయణులైన వారికి స్మరణమాత్రాన వందయజ్ఞాలు చేస్తే ఎంత ఫలం వస్తుందో అంత ఫలమూ వస్తుంది. కాబట్టి రాజచూడామణీ! నువ్వు నీ మనస్సులో నిరంతరాయంగా నిరంతరంగా హరిని స్మరించు. కలియుగం అనేక పాపాలకు పుట్టిల్లు. అందువల్ల ఒక్కనిమిషం ధ్యానం చేసినప్పటికీ నీకు ఉత్తమమైన పావనత్వం కలిగి కృతార్థుడవౌతావు"- అని చెప్పాడు శుకమహర్షి.

క. మూఁడవ యుగమున నెంతయు, వేడుక హరికీర్తనంబు వెలయఁగ ధృతిచేఁ
బాడుచుఁ 'గృష్ణా;' యనుచుం, గ్రీడింతురు కలిని దలఁచి కృతమతు లగుచున్. 21

* మళ్ళీ ఆయనే అందుకొని "మూడవయుగమైన ద్వాపరంలో 'కృష్ణా' అని హరినామ స్మరణ చేస్తూ, హరిని గానం చేస్తూ కలిని తలచి, ముందుగానే, బుద్ధిమంతులు కావడం చేత భగవంతునియందు క్రీడిస్తున్నారు'' అని చెప్పాడు.

వ. అనినఁ 'గల్పప్రళయప్రకారం బె' ట్లనిన నతం డిట్లనియెఁ; 'జతుర్యుగ సహస్రంబులు సనిన నది బ్రహ్మకు నొక్క పగ లగు; నా క్రమంబున రాత్రియు వర్తిల్లు; నంత బ్రహ్మకు నొక్కదినం బగుటవలన నది నైమిత్తికప్రళయం బనంబడు; నందు విధాత సమస్త లోకంబులం దన యాత్మయందు నిలిపి శయనింప ప్రకృతి వినష్టంబయిన నది ప్రాకృతప్రళయం బని చెప్పంబడు; నా ప్రళయ ప్రకారంబు విను; మిట్లు పవలు నైమిత్తిక ప్రళయంబును, రాత్రి ప్రాకృత ప్రళయంబు నగుట గలిగిన నది యజునకు దినప్రమాణం; బిట్టి దిన ప్రమాణంబున మున్నూట యఱువది దినంబు లయిన నలువకు నొక్క సంవత్సరంబు పరిపూర్ణం బగుఁ; దద్వత్సరంబులు శతపరిమితంబు లయిన.22

సీ. అంత లోకేశున కవసానకాలంబు, వచ్చిన నూతేండ్లు వసుధలోన
వర్షంబు లుడిగిన వడిఁ దప్పి మానవుల్ దప్పి నాఁకటఁ జిక్కి నొప్పి నొంది
యన్యోన్యభక్షులై యా కాలవశమున నాశ మొందెద; రంత నలినసఖుఁడు
సాముద్రదైహికక్ష్మాజాత రసములఁ జాతురిఁ గిరణాళిచేతఁ గాల్ప

తే. నంతఁ గాలాగ్ని సంకర్షణాఖ్య మగుచు, నఖిలదిక్కులు గలయంగ నాక్రమించు
నట్టియెడ నూఱు వర్షంబు లాదుకొనఁగ వీఁకతోడుత వాయువుల్ వీచు నపుడు. 23

* అప్పుడు పరీక్షిత్తు "కల్పప్రళయం ఏ విధంగా జరుగుతుంది?" అని అడిగాడు. దానికి సమాధానంగా శుకయోగీంద్రుడు "యుగ చతుష్టయాలు ఒకవెయ్యి గడిస్తే బ్రహ్మకు ఒక పగలు. అట్లే రాత్రికూడా అంతటి ప్రమాణమే కలిగి ఉంటుంది. ఇటువంటి రాత్రింబగళ్ళు కలిస్తే బ్రహ్మకు ఒకరోజు అవుతుంది. దానిని "నైమిత్తిక ప్రళయం" అని అంటారు. ఆ సమయంలో విధాత లోకాల నన్నింటినీ తన ఆత్మలో చేర్చుకొని నిద్రిస్తాడు. అప్పుడు ప్రకృతి అంతరిస్తుంది. దాన్ని "ప్రాకృత ప్రళయం" అని అంటారు. ప్రళయ విషయం వివరించి చెబుతాను, విను. పగటి పూట నైమిత్తికప్రళయం. రాత్రి పూట ప్రాకృతప్రళయం. ఈ రెండూ కలిసి బ్రహ్మకు ఒకరోజు అవుతుంది. ఇటువంటి రోజులు మూడు వందల అరవై అయినప్పుడు బ్రహ్మకాలమానంలో ఒక సంవత్సరం అయినట్టు లెక్క.

అటువంటి సంవత్సరాలు వంద అయినప్పుడు బ్రహ్మకు అవసానకాలం వస్తుంది. అప్పుడు భూమిమీద నూరేళ్ళపాటు వానలు కురవవు. దానితో మానవులు ఆకలి దప్పులకు తట్టుకోలేక అల్లాడిపోతారు. అప్పుడు ఒకరి నొకరు తినడం మొదలు పెడతారు. ఆ విధంగా కాలవశులై అంతరిస్తారు. అప్పుడు పద్మబాంధవుడైన సూర్యుడు సముద్రజలాలను, శరీరములందున్న రసాలను, భూమియందు పుట్టిన ద్రవాలను తన కిరణసముదాయంచేత కాల్చి పీల్చివేస్తాడు. ఆ విధమైన కాలాగ్ని సంకర్షణం అనే పేరుతో అన్ని దిక్కులలోను వ్యాపించి ఆక్రమిస్తుంది. అప్పుడు నూరు సంవత్సరాల పాటు విడువకుండా వాయువులు వీస్తాయి.

వ. ఇట్లు వర్షశతంబు వర్ష శూన్యంబగును. అంత శతవర్షంబులు ద్వాదశ భాస్కర ప్రచండ కిరణ తాండవం బగును. పిదప శతవర్షంబులు ప్రళయాగ్ని దందహ్యమానం బగును పిమ్మట సప్తమారుత ఝంఝానిల వేగతాడితం బగును. అందు మీఁద శతహాయనంబులు నవ ధారాధరంబులు మహాఘోషంబులతోడం గరికరోపమానంబు లయిన నీరధారల నిఖిల జగంబును శంబరమయంబు చేసిన బ్రహ్మాండం బెల్ల జలమయం బగుటం చేసి, భూమి

హృత గంధ గుణంబయి కబంధంబున లీనంబగు; న న్నీరంబు జీర్ణరస గుణంబై తేజంబున నడంగు; నా తేజంబు వాయువందు నష్టరూపంబయి కలయు; నా పవనుండు గతస్పర్శగుణుండై నభంబున సంక్రమించు; నా యాకాశంబు విగతశబ్దంబయి భూతాదిం బ్రవేశించుఁ, దైజసం బైన మహద్రూపం బనహంకారంబై వైకారిక గుణ సమేతంబై, యింద్రియంబుల లయించు; నహంకారంబును సత్త్వాదిగుణంబులు గ్రసియించు; నవి కాలచోదితంబైన ప్రకృతియం దడంగు; నా ప్రకృతి యనాదియు నిత్యంబు నవ్యయంబు నవాఙ్మానస గోచరంబునై సత్త్వరజస్తమోగుణ రహితంబయి, మహదాది సన్నివేశంబు లేక స్వప్నాద్యవస్థా రహితంబయి, పృథివ్యాదిహీనంబై యప్రతర్క్యంబగు; దానిని మూలభూతం బయిన పదంబని చెప్పుచుందురు, కాలవిపర్యయంబయి, పురుషావ్యక్తులు విలీనం బగునది ప్రాకృత ప్రళయం బనంబడు' నని చెప్పి 'మఱియు నొక విశేషంబు వినుము; బుద్ధీంద్రియార్థ రూపంబులచే జ్ఞానంబు తదాశ్రయం బయి వెలుంగు; దృశ్యత్వావ్యతిరేకంబులచే నది యాద్యంతంబులు గలదై యుండుఁ; దేజంబునకు దీపచక్షూ రూపంబులు వేఱు గానియట్లు బుద్ధీంద్రియార్థంబులు పరార్థమూర్తికి నన్యంబులు గానేరవు; బుద్ధిసంభవంబు ప్రధానంబు; జాగ్రత్స్వప్న సుషుప్త్యవస్థాభేదం బాత్మమయంబై, బుద్ధియుక్తంబైన యోగంబునం బరిణమించుఁ; బ్రాణిజాతం బీశ్వరునందు లయోదయంబులు వొందుచుండు; సర్వంబు నన్యోన్యాపాశ్రయంబై యాద్యంత వంతం బగుట నవస్తు వై వర్తించు; నొక్క తేజంబు బహురంధ్రంబులం గానంబడు వడువున నొక్క పరమాత్మ పెక్కు విధంబుల భావింపంబడు; హాటకంబు పెక్కు రూపంబులు గలదైన, నేకంబయిన తెఱుంగునఁ బరమాత్మ నేకంబుగా భావింపవలయు; నేత్రంబులకు మేఘావరణంబు దలంగినప్పుడు భాస్కర మండలంబు గనిపించు కరణి బంధహేతు వైన యహంకారం బాత్మ జ్ఞానంబునం దిరస్కృతం బైనయప్పుడే పరమాత్మ నిర్మలంబయి తోఁచు; నా పరమాత్మను నిరంతరంబును దలంచుచు, యోగులు తదేకాయత్తచిత్తులై యుందురు; కాలవేగంబున సర్వప్రపంచంబునకు నవస్థాంతరంబులు గల్గు చుండుఁ; బరమేశ్వరమూర్తి యైన కాలంబున నభంబునం బగల తారకంబులు గానరాని కరణిం గానంబడక, కల్పావస్థలు చరించు; నిత్యనైమిత్తిక ప్రాకృతికాత్యంతికంబులని ప్రళయంబులు చతుర్విధంబులై పరఁగు; నందులం గలుగు నారాయణుని లీలావతారంబులఁ గమలభవ భవాదు లయిన వచింప నోపరు;నే నెఱింగి నంతయుం జెప్పితి; సంసారసాగరంబు దాట హరికథ యనెడు నావయ సహాయంబు గాని వేఱొకటి లే' దని చెప్పి. 24

* ఈ విధంగా నూరు సంవత్సరాలపాటు మేఘాలు మహాధ్వని చేసుకుంటూ ఏనుగుతొండాలవలె అనిపించే జలధారలు కురిపించి సకలభూమిని జలమయం చేసివేస్తాయి బ్రహ్మాండమంతా జలమయం కావడంచేత పృథ్వి తన తన్మాత్ర అయిన గంధగుణాన్ని పోగొట్టుకుని నీళ్లలో లీనమైపోతుంది.

నీరు తన తన్మాత్ర అయిన రసగుణాన్ని పోగొట్టుకుని కాంతిలో అణగిపోతుంది. కాంతి అనగా తేజస్సు, తన తన్మాత్ర అయిన రూపగుణాన్ని పోగొట్టుకుని వాయువులో కలుస్తుంది. వాయువు తన తన్మాత్ర అయిన స్పర్శగుణాన్ని పోగొట్టుకుని ఆకాశంలో చేరుతుంది. ఆకాశం తన తన్మాత్ర అయిన శబ్దగుణాన్ని పోగొట్టుకుని ఆదిభూతంలో ప్రవేశిస్తుంది. అది తేజోమయమైన మహద్రూపంతో అహంకారం గలదై, వికార గుణములు కలదై, యింద్రియాలను లీనం చేసుకుంటుంది. అహంకారాన్ని సత్త్వమూ,

మొదలయిన గుణాలు తమలో లీనం చేసుకుంటాయి. ఆ సత్త్వాదిగుణాలు తిరిగి కాలంచేత ప్రేరేపింపబడిన ప్రకృతిలో లీనమైపోతాయి.

ప్రకృతి అనేది అనాదిగా ఉంది; అది శాశ్వతమైనది; దానికి నాశనం కాని మార్పు కాని లేదు. మాటలకు మనస్సుకు గాని గోచరం కాక, సత్త్వమూ రజస్సూ తమస్సూ అనే గుణత్రయమూ లేనిదై, మహత్తు మొదలయిన వానితో సమావేశం లేనిదై, స్వప్నావస్థ మొదలయిన అవస్థాత్రయమూ లేనిదై, పృథివి మొదలయిన పంచభూతాలూ లేనిదై, తర్కానికి అందనిదై ఉంది. దానిని మూలభూతమైన పదార్థంగా చెబుతారు. కాలం విపరిణామం చెందినప్పుడు పురుషుడూ, అవ్యక్తుడూ ఒకరిలో ఒకరు లీనమౌతారు. ఆ స్థితిని "ప్రాకృతప్రళయం" అని అంటారు.

ఇంకొక సంగతి ఉంది. దానిని కూడా విను. బుద్ధి, ఇంద్రియములు, ఇంద్రియార్థములైన విషయములు- ఈ మూడింటినీ ఆశ్రయించుకుని జ్ఞానం ప్రకాశిస్తుంటుంది. గోచరం కావడం అనే లక్షణం కలిగీ, విరుద్ధం కాకపోవడమనే లక్షణం కలిగీ, ఆదినీ అంతాన్నీ కలదై ఈ జ్ఞానం ఉంటుంది. కాంతికంటె దీపమూ, నేత్రమూ, వస్తురూపమూ వేరుకావు. అదేవిధంగా బుద్ధీ, యింద్రియాలూ, విషయాలూ పరార్థమూర్తి అయిన పరమాత్మకంటె భిన్నమైనవి కావు.

ప్రధాన మనేది బుద్ధియందు పుడుతుంది. మెలకువగా ఉండుట అనే జాగ్రదవస్థ, కలలు కనుట అనే స్వప్నావస్థ, గాఢనిద్రపోవుట అనే సుషుప్తి అవస్థ- అనే ఈ మూడు విధములైన అవస్థలూ ఆత్మ మయాలై బుద్ధితో కలిసినట్టయితే అదే యోగ మనిపించుకుంటుంది.

జీవులు ఈశ్వరునిలో ఉదయం పొంది లయం పొందుతూ ఉంటారు. ఒకదానికొకటి ఆధారం కానిదై సమస్తమూ ఆదీ అంతమూ కలదై ఉండడంవల్ల అవస్తువై (వస్తువు కానిదై) ప్రవర్తిస్తుంది. ఒకే తేజం అనేకరంధ్రాలలో నుంచి అనేక తేజములుగా గోచరించేటట్లు ఒకే భగవంతుడు అనేకవిధములుగా భావింపబడుతున్నాడు. నగల భేదాన్ని బట్టి అనేకరీతులుగా కనిపించినప్పటికీ బంగారాన్ని ఒకేవిధంగా భావించినట్లు గానే పరమాత్మను ఒకటిగానే భావించాలి. కళ్ళకు అడ్డుగా నిలిచిఉన్న మబ్బుతెర తొలగిపోయినప్పుడు సూర్యబింబం కనిపించినట్టుగా ఆత్మజ్ఞానం వల్ల అహంకారం తొలగిపోయినప్పుడు పరమాత్మ స్వచ్ఛంగా కనిపిస్తుంది. అహంకారం బంధనకారణం. అందువల్లనే అడ్డు నిలుస్తుంది. యోగులు పరమాత్మనే యెల్లప్పుడూ తలుస్తూ, పరమాత్మ యందే మనస్సును నిల్పి ఉంటారు.

కాలగమనంచేత ప్రపంచానికి భిన్నభిన్నమైన దశలు కలుగుతుంటాయి. పరమాత్మ యొక్క స్వరూపమే కాలం. ఆకాశంలో పగటిపూట చుక్కలు కనిపించని విధంగా కాలంలో కల్పావస్థలు కనిపించకుండా సంచరిస్తుంటాయి. నిత్యప్రళయం, నైమిత్తిక ప్రళయం, ప్రాకృతిక ప్రళయం, ఆత్యంతిక ప్రళయం అని ప్రళయాలు నాలుగు విధాలు. ఆ యా సమయాలల్లో సంభవించే నారాయణుని యొక్క లీలలనూ, అవతారాలనూ, బ్రహ్మ కానీ ఈశ్వరుడు కానీ తదితరులు కానీ చెప్పలేరు. నేను నాకు తెలిసినంతవరకూ

చెప్పాను. సంసారమనే మహాసముద్రాన్ని దాటడానికి 'విష్ణుకథ' అనే నావ ఒక్కటే సాధనం; మరొకటేదీ సాధనం కాలేదు. సహాయపడలేదు.

ఉ. ఏను మృతుండ నౌదునని యింత భయంబు మనంబులోపలన్
మానుము; సంభవంబు గల మానవకోట్లకుఁ జావు నిత్యమౌఁ;
గాన హరిం దలంపు; మికఁ గల్గదు జన్మము నీకు ధాత్రిపై;
మానవనాథ! పొందెదవు మాధవలోక నివాస సౌఖ్యముల్. 25

* 'నేను చనిపోతాను' అన్న భయాన్ని పూర్తిగా మనస్సులో నుంచి విడిచిపెట్టు. జన్మించిన మానవుల కందరికీ మరణించడం కూడా నిత్యధర్మం. కాబట్టి హరిని ధ్యానం చేసుకో! దీనివల్ల నీవు మళ్లా మానవలోకంలో జన్మించడం జరుగదు. ఓ రాజా! మాధవలోకమైన వైకుంఠంలో నివసించి, అక్కడ సౌఖ్యాలు అనుభవించే యోగం కలుగుతుంది.

## -: పరీక్షిత్తు తక్షకునిచే దష్టుండై మృతి నొంద నతని పుత్త్రుఁడు సర్పయాగము సేయుట :-

వ. రాజేంద్రా! జరామరణ హేతుకంబయిన శరీరంబున నుండు జీవుండు ఘటంబులలోఁ గనంబడు నాకాశంబు ఘటనాశంబయిన మహాకాశంబునం జేరు తెఱంగున, శరీరపతనం బగుడు నీశ్వరుం గలయుఁ, దైలనాశపర్యంతంబు వర్తి తేజంబుతోడ వర్తించు కరణి దేహకృతంబగు భవంబు రజస్సత్త్వ తమోగుణంబుల చేతం బ్రవర్తించు; నాత్మ నభంబు మాడ్కి ధ్రువంబై యనంతంబై వ్యక్తావ్యక్తంబులకుఁ బరంబై యుండు; నిట్లాత్మ నాత్మస్థునిఁగా జేసి, హరి నిజాకారంబు భావించుచుండుట విశేషంబు; నిన్నుఁ దక్షకుండు గఱవ సమర్థుండు గాఁడు; హరిం దలంపుము; ధన గృహ దారాపత్య క్షేత్రపశుప్రకరంబుల వర్జించి, సమస్తంబును నారాయణార్పణంబు సేసి, విగతశోకుండవై నిత్యంబును హరిధ్యానంబు సేయు' మని వినిపించిన రాజేంద్రుండును గుశాసనాసీనుండై జనార్దనుం జింతించుచుండె; నంత శుకుండును యథేచ్ఛా విహారుండయి చనియె; నిటఁ గ్రుద్ధుండైన బ్రాహ్మణోత్తమునిచేఁ బ్రేరితుండైన తక్షకుండు ద్విజరూపంబుఁ దాల్చి, పరీక్షిద్వధార్థంబుగా నేతెంచుచుండి మార్గమధ్యంబునఁ గాశ్యపుండును సర్ప విషహరణ సమర్థుం డగు నొక్క విప్రునిం గని యతని నపరిమిత ధనప్రదానంబునఁ దృప్తుం గావించి, పరీక్షిన్నికటంబునకు రాకుండ న ట్లొనర్చి, యంతటఁ బరీక్షిన్మహారాజు చెంతనున్న వారల చేతి కొక్క ఫలంబిచ్చి చనిన, వా రా ఫలంబు రాజునకిచ్చిన నతం డాఫలంబు నాస్వాదించినం గ్రిమిరూపంబున నందుండి వెడలి మహాభయంకర రూపంబునం గాకోదరంబై రాజుం గఱచిన నతండు నా క్షణంబ విషాగ్నిచే భస్మీభూతుం డయ్యెఁ; నట్టి యవసరంబున భూమ్యంతరిక్షంబులనుండు నిఖిలప్రాణు లాశ్చర్యకరంబగు తన్మరణంబు గని హాహారవంబులు సేసి; రంత నీ యర్థంబు నతని తనయుండైన జనమేజయుండు విని క్రోధావేశంబున సర్పప్రళయం బగు నట్లు యజ్ఞంబు సేయుచుండ సహస్ర సంఖ్యలు గల సర్పంబులు హతంబు లయ్యెఁ. నా సమయంబునఁ దక్షకుండు రాక వాసవాలయంబున నుండుట యెఱింగి "సహేంద్ర తక్షకాయానుబ్రూహి" అను ప్రేషవాక్యంబు నొడువునంతఁ,

**దక్షకసహితుండయి విమానముతో నింద్రుండు స్థాన భ్రంశంబు నొంది పడుచుండ, నత్తఱి నాంగీరసుం డేతెంచి పరీక్షిత్తనయుని బహుభంగులం గీర్తించి. 26**

* మహారాజా! ముసలితనానికీ మృతికీ ఆశ్రమం శరీరం. ఈ శరీరంలో ఉన్న జీవుడు, కుండలో ఉన్న ఆకాశం కుండ పగిలినప్పుడు మహాకాశంలో కలసిపోయినట్టుగా, శరీరం నాశన మైనప్పుడు దేవునిలో కలిసిపోతాడు. అనగా జీవాత్మ పరమాత్మలో చేరిపోతుంది. చమురు అయిపోయేవరకు వత్తి వెలుగుతుంది. అదేవిధంగా శరీరం ధరించి వచ్చిన జన్మ సత్త్వ రజస్తమో గుణములచేత ప్రవృత్తిని కలిగి ఉంటుంది. ఆత్మ మాత్రం ఆకాశం మాదిరిగా నిశ్చలంగా అనంతంగా గోచరత్వానికీ, అగోచరత్వానికీ అతీతంగా ఉంటుంది. ఇటువంటి ఆత్మను ఆత్మస్థునిగా చెయ్య గలిగి ఉండాలి. అప్పుడు హరియొక్క నిజాకారాన్ని ధ్యానం చెయ్యగలిగి ఉండాలి. అది గొప్ప విషయం.

నిన్ను కరవగల శక్తి తక్షకునికి లేదు. విష్ణువును సదా ధ్యానించు. ధనధాన్యములనీ, గృహక్షేత్రములనీ, పుత్రకళత్రములనీ వ్యామోహం పెట్టుకోక, అన్నింటినీ విడిచిపెట్టి భగవదర్పణబుద్ధితో శోకరహితుడవై నిరతమూ నిరంతరమూ హరినే ధ్యానిస్తూ ఉండు'' అని శుకయోగి వినిపింపగా రాజశ్రేష్ఠుడైన పరీక్షిత్తు దర్భాసనం మీద కూర్చుండి జనార్దనుడైన విష్ణుదేవుని చింతించడం మొదలుపెట్టాడు. శుక మహర్షి తాను స్వచ్ఛందసంచారియై వెళ్ళిపోయాడు.

కోపం పొందిన విప్రుని (శృంగి) వల్ల ప్రేరేపింపబడినవాడై తక్షకుడు బ్రాహ్మణ వేషం ధరించి పరీక్షిత్తును సంహరించడంకోసం వస్తూ త్రోవలో కాశ్యపుడనే ఒక బ్రాహ్మణుని కలుసుకున్నాడు. ఆ కాశ్యపుడు పాము విషానికి విరుగుడు వెయ్యగల సమర్థుడు. అందువల్ల అతనికి అంతులేని ధనం సమర్పించి సంతృప్తి పరచి పరీక్షిన్మహారాజు చెంతకు వెళ్లకుండా చేశాడు. ఆ తరువాత తక్షకుడు పరీక్షిత్తు దగ్గర ఉంటున్న వారికి ఒక పండు నిచ్చి తాను వెళ్ళిపోయాడు. ఆ సన్నిహితులు ఆ పండును రాజుకు సమర్పించారు. ఆయన ఆ ఫలాన్ని చవిచూచినంతలో, లోపలినుంచి తక్షకుడు ఒక పురుగువలె పైకి వచ్చి భయంకరమైన మహాసర్పంగా మారిపోయి రాజును కరవగా ఆయన ఆ క్షణమే విషాగ్నివల్ల బూడిదగా మారిపోయాడు.

ఆ సమయంలో ఆశ్చర్యకరమైన ఆ మరణాన్ని అవలోకించిన సర్వజీవులూ హాహాకారాలు చేశారు. ఈ విషయమంతా అతని కుమారుడైన జనమేజయుడు విని క్రోధావేశం పొంది సర్పాలన్నీ నాశనం కావాలన్న సంకల్పంతో యజ్ఞం చేస్తూ ఉండగా వేనకు వేలు పాములు నాశనమై పోయాయి. తక్షకుడు రాకుండా ఇంద్రుని మందిరంలో ఉండటం తెలుసుకుని ఋత్విజుడు 'సహేంద్రతక్షకాయానుబ్రూహి' అని పలికి నంతటిలో తక్షకునితో పాటుగా ఇంద్రుడు కూడా విమానంతో సహా తన స్థానంనుంచి పడుతుండగా, ఆ సమయానికి ఆంగీరసుడు వచ్చి పరీక్షిత్తుకుమారుడైన జనమేజయ మహారాజును పెక్కు విధములుగా స్తుతించాడు.

**చ. 'మృతియును జీవనంబు నివి మేదినిలోపల జీవకోటికిన్**
**సతతము సంభవించు; సహజం బిది; చోరహుతాశసర్ప సం**

హతులను దప్పి నాఁకటను బంచత నొందెడు నట్టి జీవుఁడున్
వెతలను బూర్వకర్మ భవవేదన లొందుచుఁ గుందు నెప్పుడున్. 27

వ. అట్లు గావున నసంఖ్యంబులైన దందశూకంబులు హతంబు లయ్యెఁ; శాంత మానసుండవై, క్రోధంబు వర్జింపు మనిన గురూపదిష్ట ప్రకారంబున సర్పయాగంబు మానియుండె; నంత దేవతలు గుసుమవృష్టిఁ గురియించి; రా రాజన్యుండు మంత్రి సమేతుండై నగర ప్రవేశంబు సేసె; బాధ్యబాధక లక్షణంబులు గల విష్ణుమాయా చోదిత గుణవ్యాపారంబుల నాత్మ మోహపడుం గావున, నట్టి మాయావికారంబులం బరిత్యజించి, తదాశ్రయాకృత మానసుండై వర్తించుచు, పరనింద సేయక, వైరంబు వర్జించి, భగవత్పదాంభోజభక్తి సంయుక్తుండై తిరుగు నతండు హరిపదంబుఁ జేరు; నని చెప్పి వెండియు సూతుండు పరమహర్ష సమేతుండై శౌనకున కిట్లనియె. 28

* ఆ పిమ్మట 'చావు బ్రతుకులు భూమిమీద ఉండే జీవసముదాయానికి ఎల్లప్పుడూ కలుగుతూనే ఉంటాయి. ఇది సహజం; పుట్టుకతో వచ్చేదే. దొంగలవల్ల, అగ్నివల్ల, పాముకాటువల్ల, దప్పికవల్ల, ఆకలివల్ల చనిపోయే మానవుడు కష్టములతో కుమిలిపోయి తాను పూర్వం చేసిన పాపాలయొక్క ఫలాన్ని ఎప్పటికీ అనుభవిస్తాడు.

అందువల్ల శాంతిని పొందిన మనస్సు కలిగి కోపాన్ని విడిచిపెట్టు. ఇప్పటికే లెక్కలేనన్ని పాములు మృతిచెందాయి'' అని చెప్పగా గురువు యొక్క ఉపదేశాన్ని బట్టి జనమేజయుడు సర్పయాగాన్ని మానివేశాడు. అందుకు సంతోషించి దేవతలు పూలవాన కురిపించారు.

ఆ తరువాత జనమేజయ మహారాజు మంత్రులతో కూడుకొన్నవాడై రాజధానీనగరంలో ప్రవేశించాడు. గుణసమేతాలైన ప్రవృత్తులు విష్ణుమాయవల్ల ప్రేరేపణ పొందుతుంటాయి. వాటికి బాధ్యబాధక లక్షణాలు కూడా ఉంటాయి. వాటి వల్ల ఆత్మకూడా భ్రాంతిని పొందుతుంటుంది. జనమేజయుడు ఆవిధమైన మాయావికారములను విసర్జించివేశాడు; తన మనస్సును వాటికి ఆశ్రయం కాకుండా చేసుకుని, యితరులను నిందించడం కానీ, ఇతరులతో విరోధించడం కానీ లేకుండా భగవంతుని పాదపద్మాలయందే భక్తి కలవాడై కాలం వెళ్ల బుచ్చుతున్నాడు. అతను తప్పకుండా విష్ణుపదాన్ని చేరుకుంటాడు'' అని చెప్పి సూతుడు ఆనందంతో శౌనకునితో ఈ విధంగా చెప్పసాగాడు.

## -: శ్రీవేదవ్యాసుండు వేదములను, బురాణములను లోకమందుఁ బ్రవర్తింపఁ జేయుట :-

క. ధారుణిఁ బారాశర్యున, కార్యులు పైలుఁడు సుమంతు జైమిని మునులన్
ధీరుఁడు వైశంపాయనుఁ, డారయ నలువురును శిష్యులై యుండి రొగిన్. 29

* "పరాశరుని కుమారుడైన వ్యాసునికి పైలుడు, సుమంతుడు, జైమిని, వైశంపాయనుడు అని ఆర్యులూ, ధీరులూ అయిన నలుగురు శిష్యులున్నారు.

వ. వారలు ఋగ్యజుస్సామాథర్వంబు లనియెడు నాలుగు వేదంబుల వ్యాసోపదిష్టక్రమంబున లోకంబులం బ్రవర్తింపఁజేసి రని చెప్పిన, నా క్రమం బెట్లని శౌనకుం డడిగిన సూతుండు సెప్పం దొడంగె; 'నాదియందుఁ జతుర్ముఖుని హృదయంబున నొక  నాదం బుద్భవించె; నది వృత్తి నిరోధంబువలన మూర్తీభవించి వ్యక్తంబుగాఁ గనుపట్టె; నట్టి నాదోపాసన వలన యోగిజనంబులు నిష్పాపులై ముక్తి నొందుదు; రందు నోంకారంబు జనియించె; నదియె సర్వమంత్రోపనిష న్మూలభూత యగు వేదమాత  యని చెప్పంబడు; నా యోంకారంబు త్రిగుణాత్మకంబై యకారోకార మకారంబు లనెడు త్రివర్ణరూపంబై ప్రకాశించుచుండె; నంత భగవంతుండగు నజుం డాప్రణవంబువలన స్వరస్పర్శాంతస్థోష్మాది లక్షణ లక్షితంబగు నక్షర సమామ్నాయంబు గల్పించి, తత్సాహాయ్యంబునం దన వదన చతుష్టయంబువలన వేదచతుష్టయంబు గలుగంజేసె; నంత నతని పుత్త్రులగు బ్రహ్మవాదు లా వేదంబులం దదుపదిష్ట ప్రకారంబుగా నభ్యసించి, యా క్రమంబున వారలు దమ శిష్యపరంపరకు నుపదేశించి; రిట్లు వేదంబులు సమగ్రంబుగాఁ బ్రతియుగంబున మహర్షులచే నభ్యసింపం బడియె; నట్టి వేదంబులు సమగ్రంబుగఁ  బఠియింప నశక్తులగు వారలకు సాహాయ్యంబు సేయుటకై ద్వాపర యుగాదియందు భగవంతుండు సత్యవతీదేవియందుఁ బరాశరమహర్షికి సుతుండై యవతరించి, యా వేదరాశిం గ్రమమ్మున ఋగ్యజుస్సామాథర్వంబు లన నాలుగు విధంబులుగ విభజించి, పైల వైశంపాయన జైమిని సుమంతు లనియెడు శిష్యవరులకుఁ గ్రమంబుగ నా వేదంబుల నుపదేశించె; నందుఁ బైలమహర్షి సేకొన్న ఋగ్వేదం బనంతంబు లగు ఋక్కులతోఁ జేరి యుండుటంజేసి బహ్వృచశాఖ యని చెప్పంబడు; నంత నా పైలుం డింద్రప్రమితికి బాష్కలునకు నుపదేశించె; బాష్కలుం డా సంహితం జతుర్విధంబులు గావించి శిష్యు లగు బోధ్యుండు యాజ్ఞవల్క్యుండుఁ బరాశరుండు నగ్నిమిత్రుండు ననువారికి నుపదేశించె; నింద్రప్రమితి దన సంహిత మాండూకేయున కుపదేశించె; మాండూకేయుండు దేవమిత్రుం డనువానికిం జెప్పె; నతనికి సౌభర్యాదిశిష్యు లనేకులై ప్రవర్తిల్లి; రందు సౌభరిసుతుండు శాకల్యుండు దా నభ్యసించిన శాఖ నైదు విధంబులుగ విభజించి; వాత్స్యుండు మౌద్గల్యుండు శాలీయుండు గోముఖుండు శిశిరుం డనెడు శిష్యుల కుపదేశించె; నంత జాతుకర్ణి యనువానికి వా రుపదేశింప నతండు బలాకుండు పైంగుండు వైతాళుండు విరజుం డనువారి కుపదేశించె; నదియునుం గాక మున్ను వినిపించిన బాష్కలుని కుమారుండైన బాష్పలి వాలఖిల్యాఖ్యసంహితను బాలాయని గార్గ్యుండు కాసారుం డను వారలకుం జెప్పె; ని త్తెఱంగున  బహ్వృచసంహిత లనేక ప్రకారంబులం బూర్వోక్త బ్రహ్మచారులచే ధరియింపంబడె; యుజుర్వేదధరుండగు వైశంపాయనుని శిష్యసంఘంబు నిఖిలక్రతువుల నాధ్వర్యవ కృత్యంబుచేఁ దేజరిల్లిరి; మఱియు నతని శిష్యుఁడగు యాజ్ఞవల్క్యుండు గుర్వపరాధంబు సేసిన, నా గురువు కుపితుండై 'యధీతవేదంబుల మరలం దన కిచ్చి పొమ్మ'నిన నతండు దాను జదివిన యజుర్గణంబును దదుక్త క్రమంబునఁ గ్రక్క, నవి రుధిరాక్తం బగు రూపంబుఁ దాల్చిన యజుర్గణాధిష్ఠిత శాఖాధి దేవతలు తిత్తిరిపక్షులై వానిని భుజియించిరి; దానంజేసి యా శాఖలు తైత్తిరీయంబు లయ్యె; నంత నిర్వేది యగు నా యాజ్ఞవల్క్యుం డపరిమిత నిర్వేదంబు నొంది, యుగ్రతపంబున సూర్యుని సంతుష్టుం గావింప, నతండు సంతసిల్లి హయరూపంబుఁ దాల్చి. యజుర్గణంబు నతని కుపదేశించెఁ; గావున నది వాజసనేయశాఖ యని వాక్రువ్వంబడె; నంత నా యజుర్గణంబు కాణ్వ మాధ్యందినాదులచే నభ్యసింపబడె;

నిట్లు యజుర్వేదంబు లోకంబునఁ బ్రవర్తిల్లె; సామవేదాధ్యేత యగు జైమిని మహర్షి దన సుతుండగు సుమంతునికి నుపదేశించె; నతఁడు సుకర్ముండను తన సుతునకుఁ దెలిపె; నతం డావేదమును సహస్రశాఖలుగా విభజించి, కోసలుని కుమారుండైన హిరణ్యానాభునికిని, దన కుమారుం డగు పౌష్పంజి యనువానికి నుపదేశించె; నంత వారిరువురు బ్రహ్మవేత్త లగు నావంత్యులు నుదీచ్యు లను నేనూర్గురికి నుపదేశించి, వారిని సామవేదపారగులంగాఁ జేసి; రిట్లు సామవేదంబు లోకంబున వినుతి నొందె; మఱియు నథర్వవేత్త యగు సుమంతుమహర్షి దానిం దన శిష్యున కుపదేశింప నతండు వేదదర్శుండు పథ్యుం డను శిష్యుల కుపదేశించె; నందు వేద దర్శుఁ డనువాఁడు శౌల్కాయని బ్రహ్మబలి నిర్దోషుండు పిప్పలాయనుం డనువారలకును, బథ్యుం డనువాఁడు కుముదుండు శునకుండు జాబాలి బభ్రు వంగిరసుండు సైంధవాయనుం డనువారలకు నుపదేశించి ప్రకాశంబు నొందించె; నిత్తెఱంగున నథర్వవేదంబు వృద్ధి నొందె; ని ట్లఖిలవేదంబుల యుత్పత్తి ప్రచారక్రమం బెఱింగించితి; నింకం బురాణక్రమం బెట్టు లనిన వినిపింతు, వినుము; లోకంబునఁ బురాణప్రవర్తకు లనం బ్రసిద్ధులగు త్రయ్యారుణి కశ్యపుండు సావర్ణి యకృతవ్రణుండు వైశంపాయనుండు హారీతుం డను నార్గురు మజ్జనకుండును వ్యాస శిష్యుండునగు రోమహర్షణుని వలన గ్రహించి; రట్టి పురాణంబు సర్గాది దశలక్షణలక్షితంబుగా నుండు; మఱియుఁ గొంద ఱా పురాణంబు పంచలక్షణలక్షితం బనియుఁ బలుకుదు; రట్టి పురాణ నామానుక్రమంబుఁ బురాణవిదులగు ఋషులు సెప్పెడు తెఱంగున నెఱింగింతు; వినుము; బ్రాహ్మంబు పాద్మంబు వైష్ణవంబు శైవంబు భాగవతంబు భవిష్యోత్తరంబు నారదీయంబు మార్కండేయం బాగ్నేయంబు బ్రహ్మకైవర్తంబు లైంగంబు వారాహంబు స్కాందంబు వామనంబు కౌర్మంబు మాత్స్యంబు బ్రహ్మాండంబు గారుడంబు నని పదునెనిమిది మహాపురాణంబులు మఱియు నుపపురాణంబులుం గలవు; వీని లిఖించినం జదివిన వినిన దురితంబు లడంగు నని సూతుండు శౌనకాదులకుం జెప్పిన వారు 'నారాయణుగుణ వర్ణనంబును దత్కథలును జెప్పితి; వింక దోషకారులుఁ బాపమతులు నెవ్విధంబున భవాబ్ధిం దరింతు, రాక్రమంబు వక్కాణింపవే!' యని యడిగిన నెఱింగింపం దలంచి యిట్లనియె. 30

* ఆ నలుగురూ తమ గురువైన వ్యాసుడు బోధించిన క్రమంలో ఋగ్వేదాన్నీ, యజుర్వేదాన్నీ, సామవేదాన్నీ, అథర్వవేదాన్నీ లోకంలో ప్రచారం చేశారు.

ఈ మాట విని శౌనకుడు "ఆ క్రమము ఏమిటి?" అని ప్రశ్నింపగా సూతుడు బదులు చెప్పసాగాడు. "మొట్టమొదట బ్రహ్మ హృదయంలో ఒక నాదం పుట్టింది. చిత్తవ్యాపారాన్ని నిరోధించడంవల్ల అది రూపం ధరించి స్పష్టంగా గోచరించింది. అటువంటి ధ్వనిని ఉపాసించడంవల్ల యోగులు పాపరహితులై ముక్తిని పొందుతారు. ఆ నాదంలోనే ఓంకారం పుట్టింది. ఓంకారం మంత్రాల కన్నింటికీ మూలం కావడం వల్లనూ, ఉపనిషత్తుల కన్నింటికీ మూలం కావడం వల్లనూ "వేదమాత" అన్న విఖ్యాతిని గడించుకుంది.

ఓంకారంలో మూడు గుణా లున్నాయి. ఆ విధంగానే అకారమూ, ఉకారమూ, మకారమూ అనే మూడు వర్ణాలున్నాయి. ఆ గుణాలతోనూ వర్ణాలతోనూ ఓంకారం ప్రకాశిస్తూ ఉంది. ఆ ప్రణవం వల్ల

భగవంతుడైన బ్రహ్మ స్వరములు, స్పర్శములు, అంతస్థములు, ఊష్మములు మొదలయిన లక్షణాలతో కలిసియున్నటువంటి అక్షరసముదాయమును కల్పించాడు. ఆ అక్షర సమామ్నాయం యొక్క తోడ్పాటుతో తన నాలుగు ముఖములనుంచీ నాలుగు వేదాలను కలుగజేశాడు. బ్రహ్మచారులయిన తన పుత్రులకు వ్యాసుడు ఒక క్రమంలో వాటిని ఉపదేశించాడు. అతని పుత్రులు తమ తండ్రి తమకు బోధించిన క్రమంలోనే శిష్యులకు బోధించారు. ఆ విధంగా వేదాలు ప్రతియుగంలోనూ సమగ్రంగా ఋషివర్యులచేత అభ్యాసం చేయబడుతూ వచ్చాయి.

వేదములను సమగ్రంగా చదువలేని శక్తిహీనులకు సాహాయ్యం చెయ్యడం కోసం భగవంతుడు ద్వాపరయుగ ప్రారంభంలో సత్యవతీదేవికీ పరాశరమహర్షికీ కుమారుడై అంతరించి సమగ్రమైన వేదరాశిని క్రమముగా ఋగ్వేదమూ, యజుర్వేదమూ, సామవేదమూ, అథర్వవేదమూ అని నాలుగు విధాలుగా విడదీసి క్రమముగా వాటిని పైలమహర్షికీ, వైశంపాయన మహర్షికీ, జైమిని మహర్షికీ, సుమంతు మహర్షికీ బోధించాడు.

ఆ వరుసలో పైలమహర్షి ఋగ్వేదాన్ని నేర్చుకున్నాడు. ఋగ్వేదం అనంతంగా ఋక్కులు ఉండడం వల్ల "బహ్వృచశాఖ" అన్న ప్రసిద్ధిని పొందింది. పైలుడు తాను నేర్చుకున్న వేదాన్ని ఇంద్రప్రమితికీ, బాష్కలునికీ ఉపదేశించాడు. బాష్కలుడు తను నేర్చుకున్న భాగాన్ని నాలుగు భాగాలుగా చేసి తన శిష్యులైన బోధ్యుడు యాజ్ఞవల్క్యుడు, పరాశరుడు, అగ్నిమిత్రుడు అనే నలుగురికి ఉపదేశించాడు. ఇంద్రప్రమితి తను నేర్చుకొన్న సంహితను మాండూకేయుడు అనేవానికి ఉపదేశించాడు. అతడు దేవమిత్రుడు అనేవానికి ఉపదేశంచేశాడు. దేవమిత్రునికి శిష్యులు చాలామంది ఉన్నారు. అందులో ఒకడు సౌభరి కుమారుడైన శాకల్యుడు. శాకల్యుడు తను నేర్చుకొనిన శాఖను అయిదు భాగాలు చేసి తన అయిదుగురు శిష్యులకూ బోధించాడు. వాత్స్యుడు, మౌద్గల్యుడు, శాలీయుడు, గోముఖుడు, శిశిరుడు- అనే అయిదుగురూ సౌభర్యుడైన శాకల్యుని శిష్యులు. వారందరూ జాతుకర్ణి అనే వానికి ఉపదేశించారు. జాతుకర్ణి బాలకుడు, పైంగుడు, వైతాళుడు, విరజుడు అనే నలుగురికి ఉపదేశించాడు. బాష్కలుని కుమారుడు బాష్కలి. అతడు వాలఖిల్య సంహితము బాలాయని, గార్గ్యుడు, కాసారుడు అనే ముగ్గురికి బోధించాడు. ఈ విధంగా బహ్వృచసంహితలు, అనగా ఋగ్వేద సంహితలు అనేకవిధములై యింతకుముందు చెప్పిన మహర్షుల చేత ధరింపబడి నిల్చి ఉన్నాయి.

యజుర్వేదమును ఉపదేశం పొందిన మహర్షి వైశంపాయనుడు. ఆయన శిష్యులందరూ యజ్ఞము లన్నింటిలోనూ పాల్గొని, అధ్వర్యువులుగా ఉ ండి ప్రసిద్ధి పొందారు. యాజ్ఞవల్క్యుడు కూడా వైశంపాయనుని శిష్యుడే. అతడు గురువుపట్ల అపరాధం చెయ్యడం మూలంగా "నేర్చుకొన్న వేదములను తన కిచ్చి పో"మ్మని కోపగ్రస్తుడై వైశంపాయను డనగా యజుస్సంహితలను, తాను నేర్చుకొన్న వాటిని యాజ్ఞవల్క్యుడు నేర్చుకొన్న క్రమంలోనే వమనం చేశాడు. అవి రక్తసిక్తమైనట్లుండగా యజుర్మంత్రగణముల అధిష్ఠానదేవతలు తిత్తిరిపక్షులరూపంలో వచ్చి వాటిని తినేశారు. అందువల్లనే ఆ శాఖలకు తైత్తిరీయశాఖలు అనే పేరు వచ్చింది.

తను నేర్చిన విద్య పోవడం చేత యాజ్ఞవల్క్యమహర్షి నిర్వేది అయ్యాడు. అందువల్ల బాగా నిర్వేదం పొంది తీవ్రతపస్సు చేసి సూర్యునికి సంతృప్తిని కలుగజేశాడు. సూర్యుడు యజుర్మంత్ర సంహితలను అశ్వరూపం ధరించి అతనికి బోధించాడు. అందువల్లనే వాటికి వాజసనేయశాఖ అన్న వాసి కలిగింది. ఈ శాఖలో ఉండే యజుస్సంహితలను కాణ్వులు, మాధ్యందినులు మొదలయినవారు స్వీకరించి అభ్యసిస్తున్నారు. ఈ విధంగా లోకంలో యజుర్వేదం వ్యాపించింది.

సామవేదాన్ని అభ్యసించిన జైమిని మహర్షి తన కుమారుడైన సుమంతునికి దానిని బోధించాడు. అతడు తన సుతుడైన సుకర్మునికి బోధించాడు. సుకర్ముడు సామవేదమును వెయ్యిశాఖలుగా విడదీసి యిద్దరికి బోధించాడు. ఒకడు కోసలుని పుత్రుడైన హిరణ్యానాభుడు. రెండవవాడు తన కుమారుడైన పౌష్పంజి. వారిద్దరూ బ్రహ్మవేత్తలయిన ఆవంత్యులూ, ఉదీచ్యులూ అనే అయిదువందలమందికి ఉపదేశించి వారిని సామవేద పారగులుగా చేశారు ఈ విధంగా సామవేదం లోకంలో ప్రశంస పొందింది.

అథర్వవేదాన్ని అభ్యసించిన సుమంతుడునే మహర్షి దానిని తన శిష్యునికి బోధించాడు. ఆ శిష్యుడు తన శిష్యులయిన వేదదర్శుడు, పథ్యుడు అనే యిద్దరికి ఉపదేశించాడు. వేదదర్శుడు శౌల్కాయని, బ్రహ్మబలి, నిర్దోషుడు, పిప్పలాయనుడు అనే నలుగురికి బోధించాడు. కుముదుడు, శునకుడు, జాబాలి, బభ్రువు, అంగిరసుడు, సైంధవాయనుడు అనే ఆరుగురికి పథ్యుడు బోధించాడు. ఈ విధంగా ప్రకటన పొంది అథర్వవేదం వృద్ధి గాంచింది. ఈ విధంగా నాలుగు వేదముల ఉత్పత్తినీ, వ్యాప్తినీ తెలియజేశాను. ఇప్పు డింక పురాణాల గురించి వినిపిస్తాను. విను.

త్రయ్యారుణి, కశ్యపుడు, సావర్ణి, అకృతవ్రణుడు, వైశంపాయనుడు, హారీతుడు- అని ఆరుగురు పురాణప్రవక్తలుగా ప్రసిద్ధులు. ఆ ఆరుగురూ కూడా మా తండ్రి అయిన రోమహర్షణుని దగ్గర నేర్చుకున్నారు. మా తండ్రి వ్యాసులవారి శిష్యుడు. పురాణం అనేది సర్గలక్షణం కలిగి ఉంటుంది. కొందరు పురాణానికి అయిదు లక్షణాలు ఉంటాయని అంటారు. పెద్దలు పూర్వసంగతులు తెలిసిన అనుభవజ్ఞులు చెప్పిన పద్ధతిని అనుసరించి పురాణాలను క్రమంగా చెబుతాను. విను. బ్రహ్మపురాణం, పద్మపురాణం, విష్ణుపురాణం, శివపురాణం, భాగవతం, భవిష్యోత్తరపురాణం, నారదపురాణం, మార్కండేయ పురాణం, అగ్నిపురాణం, బ్రహ్మకైవర్తపురాణం, లింగపురాణం, వరాహపురాణం, స్కాందపురాణం, వామనపురాణం, కూర్మపురాణం, మత్స్యపురాణం, బ్రహ్మాండపురాణం, గరుడపురాణం- ఈ పద్దెనిమిదీ మహాపురాణాలు. ఇవికాక, యింకా ఉపపురాణాలు ఉన్నాయి. వీటిని వ్రాసినా, చదివినా, వినినా పాపాలు నశించిపోతాయి

ఈ విధంగా సూతుడు శౌనకాది మహర్షులకు చెప్పాడు. వారు "నీవు నారాయణుని గుణాలను వర్ణించావు. ఆయన కథలను వినిపించావు. పాపం చేసినవారూ, పాపబుద్ధి కలవారూ సంసారసముద్రాన్ని తరించే మార్గం కూడా చెప్పవా?'' అని అడిగారు. అప్పుడు ఆ విషయం చెప్పడానికి ఈ విధంగా మొదలుపెట్టాడు సూతుడు.

## -: మార్కండేయోపాఖ్యానము :-

**క. తొల్లిటి యుగమునఁ దపములఁ, బల్లిదులగు ఋషుల మహిమ భాషింపఁగ రం**
**జిల్లెడు మార్కండేయుం, డుల్లంబున హరిని నిలిపి యుడుగక బ్రదికెన్. 31**

* "పూర్వయుగంలో తపస్సుచేత సమర్థులైన మునీశ్వరుల మహిమ ప్రకాశమానంగా ఉండడంవల్ల మార్కండేయమహర్షి హరిని మనస్సులో నిలుపుకుని, ఎప్పుడూ విడిచిపెట్టకుండా ఆనందంతో మనుగడ సాగించాడు.

**వ. లోకంబులు గల్పాంతసమయంబునం గబంధమయంబు లయి, యంధకార బంధురంబు లయి యున్నయెడ నేకాకి యయి చరించుచు బాలార్కకోటి తేజుం డయిన బాలుని హృదయంబునం బ్రవేశించి యనేకసహస్ర వత్సరంబులు దిరిగి వటపత్త్రశాయి యయిన య బ్బాలునిఁ గ్రమ్మఱం గనియె'నని చెప్పిన శౌనకాదులు సూతునిం గనుకొని, 'యా మునీంద్రునకు నీ ప్రభావం బెట్లు గలిగె?' నని యడిగిన నతం డిట్లనియె. 32**

* కల్పం అంతమయ్యే సమయంలో, అంటే ప్రళయకాలంలో లోకాలన్నీ జలమయమై పోయాయి. చీకట్లతో నిండిపోయాయి. అటువంటి సమయంలో ఒక్కడే సంచరిస్తూ కోటి బాలసూర్యుల తేజస్సుతో ప్రకాశించే ఒక బాలుని హృదయంలో ప్రవేశించి ఎన్నో వేల సంవత్సరాలు అక్కడే సంచరించి మళ్లా మఱ్ఱియాకు మీద పవ్వళించిన ఆ బాలుని చూశాడు. "ఈ విధంగా చెప్పగా శౌనకాదులైన శ్రోతలు వక్తయైన సూతుని చూచి " ఆ మునీంద్రునికి ఈ మహిమ యేవిధంగా లభించినది?'' అని ప్రశ్నించారు. వారికి సమాధానంగా సూతుడు చెప్పాడు-

**క. 'భూవినుత, బ్రహ్మచర్యము, దా వదలక నిష్ఠచేతఁ దథ్యము గాఁగన్**
**భావించి హరిఁ దలంచుచుఁ, గోవిదనుతుఁడై మృకండు గుణముల వెలసెన్. 33**

* "మృకండు అని ఒకాయన ఉన్నాడు. జగత్సన్నుతమైన బ్రహ్మచర్యాన్ని అవలంబించి, నిష్ఠతో నిలుపుకుని, హరిని మనస్సులో నిత్యమూ ధ్యానిస్తూ, విబుధుల స్తుతికి పాత్రం కాదగిన ఉత్తమగుణాలు కలిగి తపస్సు చేస్తున్నాడు.

**వ. ఇట్లు దపంబు సేయ నతనికి హరిహరులు ప్రత్యక్షంబయి 'వరంబడుగు' మనిన గుణగణాఢ్యుం డయిన కుమారు నడిగిన 'నట్లకాక' యని యతండు గోరిన వరం బిచ్చి యంతర్ధానంబు నొంది; రనంతరంబ య మ్మునికి మార్కండేయుం డుదయించి నియమనిష్ఠా గరిష్ఠుడయి యుండ; మృత్యువు వానిం బాశబద్ధుంజేసిన నెదిర్చి మిత్తిని ధిక్కరించి, పదివేల హాయనంబులు తపంబు సలుప, నింద్రుండు భయంపడి య మ్మునివరుని యుగ్రతపంబు భంగపఱచుటకు దేవతాంగనలం బంప, వా రేతెంచు నెడఁ బుష్పఫలభరితంబును, మత్తమధుకర శుకపికాది శకుంతారవ నిరంతర దిగంతరంబును; జాతివైర రహిత మృగపక్షికుల సంకులంబును, సారసచక్రవాక బకక్రౌంచ కారండవ**

**కోయష్టికాది జలవిహంగమాకులిత సరోవర సహస్ర సందర్శనీయంబును నగు నా తపోవనంబున జటావల్కలధారియై హవ్యవాహనుండునుంబోలెఁ దపంబు సేయు మునీంద్రునిం గని య య్యంగనలు వీణావేణు వినోదగానంబుల నలవరింప మెచ్చక ధీరోదాత్తుం డగు న మ్మునీంద్రుని గెల్వనోపక యింద్రుని కడకుం జని; రంత హరి యతని తపంబునకుఁ బ్రసన్నుండై యావిర్భవించినం గనుగొని 'దేవా, నీ దివ్యనామ స్మరణంబునంజేసి యీ శరీరంబుతోడన యనేక యుగంబులు బ్రదుకునట్లుగాఁ జేయవే?' యనినం గరుణించి యిచ్చుటయును. 34**

* ఈ విధంగా తపస్సు చేస్తూ ఉంటే విష్ణువూ ఈశ్వరుడూ ప్రత్యక్ష మయ్యారు; 'వరం కోరుకో' అన్నారు. గుణసంపద గల కొడుకు కావాలని అతను కోరుకున్నాడు. వాళ్లిద్దరూ సమ్మతించి, అతనికి కోరిన వరాన్ని ప్రసాదించి అదృశ్యులయ్యారు.

ఆ తరువాత ఆ మునికి మార్కండేయుడు పుట్టి నియమనిష్ఠలను చక్కగా పాటిస్తూ, గరిష్ఠుడై ఉండగా మృత్యువు వచ్చి తన పాశంతో కట్టివేయగా, ఎదిరించి ఆ మృత్యువును తృణీకరించి పదివేల సంవత్సరాలపాటు ఉగ్రమైన తపస్సు చేశాడు.

ఆ మార్కండేయుని తీవ్రతపస్సుకు భయపడి యింద్రుడు తపోభంగం చెయ్యడానికై దేవతాస్త్రీలను పంపించాడు. వారు వస్తూ పువ్వులతో పళ్లతో నిండి మదించిన తుమ్మెదలూ చిలుకలూ కోకిలలూ మొదలయిన పక్షుల కూజితాలతో నిరంతరమూ దిగంతాలన్నీ నింపేటటువంటి జాతివైరాన్ని విడిచిపెట్టి సఖ్యతతో సంచరిస్తున్న జంతువులతోనూ పక్షులతోనూ నిండి ఉన్నటువంటి, బెగ్గురులు జక్కవలు కొంగలు కొంచలు బాతులు కొక్కెరలు మొదలయిన నీటి పక్షులతో సందడిగా ఉన్న వేలాది సరోవరాలతో చూడముచ్చటగా ఉన్నటువంటి ఆ తపోవనంలో జడలూ నారచీరలూ ధరించి అగ్ని దేవునివలె తేజరిల్లుతూ తపస్సు చేస్తున్న మార్కండేయ మునివర్యుని చూచి, ఆ సురభామినులు వీణావాదనంతో, వేణుగానంతో, వినోదాలతో వివశుణ్ణి చెయ్యడానికి యత్నించినప్పటికీ అతను వారిని మెచ్చుకోలేదు. వారికి లొంగలేదు. ధీరోదాత్తుడైన అతనిని ఆ నిలింపకాంతలు గెల్వలేక, తమ ఓటమిని అంగీకరించి యింద్రుని చెంతకు తిరిగి వెళ్ళిపోయారు.

విష్ణువు అతని తపస్సుకు ప్రసన్నుడై ప్రత్యక్షమయ్యాడు. మార్కండేయుడు విష్ణుభగవానుని చూచి "దేవా! దివ్యమైన నీ నామాన్ని స్మరించడంతో ఈ శరీరంతోనే అనేక యుగాలు జీవించి ఉండేట్లు వరం ప్రసాదింపవా?'' అని వేడుకున్నాడు. విష్ణువు ఆ విధంగా వరప్రదానం చేశాడు.

**తే. జగము రక్షింప జీవులఁ జంప మనుపఁ, గర్తవై సర్వమయుఁడవై కానిపింతు**
**వెచట నీ మాయఁ దెలియంగ నెవ్వఁ డోపు?, విశ్వసన్నుత! విశ్వేశ! వేదరూప! 35**

* "లోకంలోని ప్రాణులను పుట్టించడానికీ, పోషించడానికీ, చంపడానికీ కర్తవు నీవు. సర్వమయుడవు నీవే. విశ్వసన్నుతా! విశ్వేశా! వేదరూపా! నీ మాయను తెలుసుకోవడం ఎవరికీ సాధ్యం కాదు.

మ. బలిభిన్ముఖ్య దిశాధినాథవరులున్ ఫాలాక్షబ్రహ్మాదులున్
జలజాతాక్ష పురందరాది సురులుం జర్చించి నీ మాయలం
దెలియన్ లేరఁట ! నా వశంబె తెలియన్? దీనార్తి నిర్మూల! యు
జ్జ్వల పంకేరుహపత్త్ర లోచన! గదాచక్రాంబుజాద్యంకితా!' 36

* ఇంద్రుడూ మొదలైన దిక్పాలకులూ, బ్రహ్మ, శివుడూ మొదలైనవారూ, దేవతలూ చర్చించి కూడా నీ మాయలను అవగాహన చేసుకోలేరట! జలజాతాక్ష! నేను తెలుసుకోగలుగుతానా? దీనుల దీనత్వాన్ని నాశనం చేసే మహానుభావ! ప్రకాశమానమైన పద్మపత్రాల వంటి నేత్రాలు గలవాడా! గదాచక్రాదులతో అలంకృతమైన బాహువులు కలవాడా!"

వ. అని వినుతించి 'దేవా, నీ మాయం జేసి జగంబు భ్రాంతంబై యున్న యది! యిది దెలియ నానతీ వలయు' నని యడిగిన నతండు నెఱింగించి చనియె, మునియును శివపూజ సేయుచు హరిస్మరణంబు సేయ మఱచి శతవర్షంబులు ధారాధరంబులు ధారావర్షంబుచే ధరాతలంబు నింప, జలమయంబై యంధకార బంధురంబైన, నంత నా తిమిరంబునం గన్ను గానక భయంపడి యున్నయెడ నా జలమధ్యంబున నొక వటపత్త్రంబునం బద్మరాగ కిరణపుంజంబులు రంజిల్లు పాదపద్మంబులు గల బాలునిం గని, మ్రొక్కి యతని శరీరంబు ప్రవేశించి, యనేకకాలం బనంతంబగు జఠరాంతరంబునం దిరిగి; యతని చరణారవింద సంస్మరణంబు సేసి, వెలువడి కౌఁగిలింపం బోయిన మాయఁ గైకొని యంతర్ధానంబు నొంద;మునియు నెప్పటియట్ల స్వాశ్రమంబు సేరి తపంబు సేయుచున్న సమయంబున. 37

* అని మార్కండేయుడు స్తోత్రం చేశాడు. ఆ పిమ్మట "నీ మాయ చేతనే ప్రపంచం భ్రాంతి పొంది ఉన్నది. దీనిని గురించి స్పష్టంగా నాకు తెలియజెప్పవలసింది" అని అడిగితే విష్ణువు తెలియజేసి వెళ్ళిపోయాడు.

మార్కండేయముని శివపూజ చేస్తూ హరినామస్మరణ మరచిపోయాడు. నూరుసంవత్సరాలపాటు మేఘాలు విడువకుండా ధారాపాతంగా వర్షం కురిసి ధాత్రిని నింపివేశాయి. దానితో ధాత్రి జలమయం కావడమేకాక కారుచీకటికోనగా మారిపోయింది. ఆ చీకటిలో కళ్లు కనిపించక భయపడి ఉన్న సమయంలో ఆ నీటి మధ్యలో వటపత్రం మీద పద్మరాగమణి ప్రభలతో ప్రకాశించే పాదపద్మాలు గల ఒక బాలకుని చూచి నమస్కరించి, అతని శరీరంలో దూరి చాలాకాలం అతని ఉదరంలోనే ఉండి సంచరించి, అతని పాదపద్మాలను స్మరించుతూ బయటికి వచ్చి కౌగిలించుకోబోగా అతను మాయాధారియై అదృశ్యు డయ్యాడు. ముని అంతకు ముందువలెనే తన ఆశ్రమంలో ప్రవేశించి తపస్సు చేసుకుంటున్నాడు.

చ. నిలిచిన శంకరుం గనియు నిత్యసుఖంబుల నిచ్చు గౌరి యి
మ్ముల 'హర, భూతిభూషణ సముజ్జ్వలగాత్రునిఁ గంటె, యెంతయున్
వలనుగ వానితోడ నొక వాటపు మాటను బల్కఁగాఁ దగున్
సలలితమైన యీ తపసి జాడ వినం గడు వేడ్క యయ్యెడిన్. 38

* ఆ సమయంలో ఈశ్వరుడు నిలిచిపోగా శాశ్వత సుఖప్రదాత్రియైన గౌరీదేవి "హరా! విభూతియే విశేషాలంకారంగా ధరించి విలసిల్లుతూ ఉన్న శరీరం గాల యీ తపస్విని చూశావా? వానితో ఒక మంచి మాట పలకడం బాగుంటుంది. ఈ తపసి విషయం తెలుసుకుందామని ఉంది'' అని అంది.

**వ. అనిన శంకరుండును శాంకరీసమేతుండయి నభంబున నుండి ధరణీతలంబునకు నేతెంచి యితరంబు గానక యేకాగ్రచిత్తుండగు నమ్మునిం గని తప దివ్యయోగమాయా ప్రభావంబుచేత నతని హృదయంబునం బ్రవేశించి చతుర్బాహుండును, విభూతి రుద్రాక్ష మాలికాధరుండును, త్రిశూల డమరుకాది దివ్య సాధన సమేతుండును, వృషభవాహనారూఢుండును, నుమాసమేతుండునై తన స్వరూపంబు గనంబఱిచిన విస్మయంబు నొంది యమ్ముని యా పరమేశ్వరు ననేక ప్రకారంబుల స్తుతియించిన నప్పు డమ్ముని తపఃప్రభావంబునకు మెచ్చి 'మహాత్మా' పరమశైవుండ' వని పరమేశ్వరుం డానతిచ్చిన మార్కండేయుండును శంకరు నిరీక్షించి, దేవా హరిమాయాప్రభావంబు దుర్లభం; బయ్యది భవత్సందర్శనంబునం గంటి; నింతియ చాలు; నైన నొక్క వరంబు గోరెద; నారాయణ చరణాంబుజ ధ్యానంబును, మృత్యుంజయంబునుం గలుగునట్లుగాఁ గృపసేయవే?" యని ప్రార్థించినఁ గృపాసముద్రుండై 'యట్లకాక' యని జరారోగవికృతులు లేక కల్పకోటి పర్యంతంబు నాయువుం, బురుషోత్తముని యనుగ్రహంబుఁ గలుగు'నని యానతిచ్చి య మ్మహాదేవుం డంతర్ధానంబు నొందె' నని చెప్పి యీ మార్కండేయోపాఖ్యానంబు వ్రాసిన వినినం జదివినను మృత్యువు దొలంగు నని మఱియు నిట్లనియె; హరిపరాయణుండగు భాగవతుండు దేవతాంతర మంత్రాంతర సాధనాంతరంబులు వర్జించి, దుర్జనులం గూడక నిరంతరము నారాయణ గోవిందాది నామస్మరణంబు సేయుచు నుండెనేని నట్టి పుణ్యపురుషుండు వైకుంఠంబున వసియించు; మఱియు హరి విశ్వరూపంబును జతుర్విధ వ్యూహభేదంబును, జతుర్మూర్తులును, లీలావతారంబులును జెప్ప నగోచరంబు లనిన శౌనకుం డిట్లనియె. 39**

* ఆ మాట విని ఈశ్వరుడు ఈశ్వరితోపాటుగా ఆకాశం నుంచి భూమిమీదికి దిగాడు. ఆ ముని యేకాగ్రమైన మనస్సుతో ఉండడం చేత మరి దేనినీ చూడడం లేదు. అప్పుడు ఈశ్వరుడు తనదైన దివ్యయోగ మాయ నుపయోగించి అతని హృదయంలో ప్రవేశించాడు. నాలుగు చేతులు కలిగి, విభూతిని ధరించి, రుద్రాక్షమాలికాధారణ చేసి, త్రిశూలమూ, డమరుకమూ మొదలైన దివ్యసాధనములతో కూడుకున్నవాడై పార్వతితో పాటుగా వృషభవాహనాన్ని అధిరోహించినవాడై ఆ మునికి తన రూపాన్ని చూపించాడు.

అప్పు డాముని ఆశ్చర్యపోయి ఆ పరమేశ్వరుని బహువిధాలుగా స్తోత్రం చేశాడు. పరమేశ్వరుడు ఆ ముని తపోమహిమకు సంతసించి "మహాత్మా! నీవు పరమశైవుడవు'' అని ప్రశంసారూపమైన తన నిశ్చయం చెప్పగా మార్కండేయుడు ఈశ్వరుని చూచి "దేవా! విష్ణుదేవుని మాయా ప్రభావం లభించేది కాదు. కాని నీ సందర్శనం చేత దానిని తెలుసుకోగలిగాను. ఇంత మాత్రం చాలు. అయినా నిన్ను ఒక వరం కోరుకుంటాను. నారాయణుని పాదపద్మాలను ధ్యానించే బుద్ధినీ, మరణాన్ని జయించే శక్తినీ నాకు అనుగ్రహించు'' అని ప్రార్థించాడు.

ఈశ్వరుడు దయాసముద్రుడు కావడంవల్ల అతని కోరికను అనుమతించాడు. ముసలితనమూ, రోగమూ, మొదలైన వికారాలు లేకుండా కోటికల్పాల వరకూ ఆయుర్దానం చేశాడు. నారాయణుని అనుగ్రహం కలుగుతుందని వాగ్దానం చేశాడు. ఆ తరువాత అదృశ్యుడైపోయాడు.

ఈ మార్కండేయకథను వ్రాసినా, వినినా, చదివినా మరణం దరిదాపులకు రాకుండా తొలగిపోతుంది. హరియందు భక్తి కలిగిన భాగవతుడు ఇతరదేవతలనుకాని, యితరమంత్రాలనుకాని, ఇతర సాధనలను కాని పూర్తిగా విడిచిపెట్టెయ్యాలి. దుష్టులతో సహవాసం చెయ్యరాదు. ఎల్లప్పుడూ 'నారాయణ, గోవిందా' మొదలయిన విధంగా నామస్మరణ చేస్తూ ఉండాలి. ఆ విధంగా ఆచరించే భక్తుడు పుణ్యాన్ని సంపాదించుకుంటాడు. అందువల్ల వైకుంఠం చేరుకుని అక్కడ నివసిస్తుంటాడు. సరే! విష్ణుదేవుని విశ్వరూపాన్నీ, నాలుగు విధములయిన వ్యూహభేదాల్నీ, లీలావతారాల్నీ, నాలుగు విధాలయిన రూపభేదాలనూ చెప్పడం సాధ్యం కాదు.'' ఈ విధంగా సూతుడు చెప్పగా శౌనకుడు ఈ విధంగా అన్నాడు-

**క. హరికథలు హరిచరిత్రము, హరిలీలావర్తనములు నంచితరీతిం**
**బరువడి నెఱిఁగితి మంతయుఁ, సురనుత! యనుమాన మొకటి సొప్పడెడి మదిన్.** 40

* "విష్ణుదేవుని కథలూ, విష్ణుదేవుని చరిత్రా, విష్ణుదేవుని లీలలూ, చక్కగా సక్రమంగా తెలుసుకున్నాము. అయినా దేవసన్నుతా! సూతా! నామనస్సులో ఒక అనుమానం మిగిలిపోయింది.

## -: చైత్రాదిమాసంబుల సంచరించెడు ద్వాదశాదిత్యుల క్రమంబును దెలుపుట :-

**వ. అది యెయ్యది యనిన లోకచక్షువు చైత్రమాసంబు మొదలుగా నేయే మాసంబున నేయే నామంబునం బ్రవర్తించుం; జెప్పవే?" యని యడిగినఁ 'జైత్రంబుననుండి చైత్రాది ద్వాదశమాసంబుల సౌరగణసప్తకం బీశ్వర నియుక్తంబై నానాప్రకారంబుల సంచరించు; నా క్రమంబు దొల్లి శుకుండు విష్ణురాతునికిఁ దెలిపిన చందంబునం జెప్పెద'నని సూతుం డిట్లనియె. 'శ్రీమన్నారాయణ స్వరూపుం డగు మార్తాండుం డేకస్వరూపుండైన, నతనిం గాలదేశ క్రియాది గుణములంబట్టి ఋషు లనేకక్రమంబుల నభివర్ణించి భావించు చున్నవా రా ప్రకారం బెట్లనినఁ జైత్రంబున సూర్యుండు ధాత యను నామంబు దాల్చి కృతస్థలిహేతి వాసుకి రథకృత్తు పులస్త్యుండు తుంబురుండు ననెడు పరిజనులతోఁ జేరికొని సంచరించు; వైశాఖంబున నర్యముం డను పేరు వహించి పులహుండోజుండు ప్రహేతి పుంజికస్థలి నారదుండు కంజనీరుం డను ననుచర సహితుండై కాలంబు గడుపుచుండు; జ్యేష్ఠంబున మిత్రాభిధానంబున నత్రి పౌరుషేయుండు; తక్షకుండు మేనక హాహారథ స్వనుం డను పరిజనులతోడం జేరి వర్తించుచుండు; నాషాఢంబున వరుణుం డను నాహ్వాయంబు నొంది వసిష్ఠుండు రంభ సహజన్యుండు హూహువు శుక్రుండు చిత్రస్వనుండను సహచర సహితుండై కాలక్షేపణంబు సేయుచుండు; శ్రావణంబున నింద్రుండను నామంబుచే వ్యవహృతుండై విశ్వావసువు శ్రోత యేలాపుత్త్రుం డంగిరసుండు ప్రమ్లోచ చర్యుండను సభ్యులతోఁ జేరి కాలంబు గడుపుచుండు; భాద్రపదంబున వివస్వంతుండను నామంబు దాల్చి యుగ్రసేనుండు వ్యాఘ్రుం డాసారణుండు భృగు వనుమ్లోచ శంఖపాలుండు లోను గాఁగల పరిజనులతో నావృతుండై కాలయాపనంబు సేయుచునుండు.** 41

* అది యేమిటంటే ప్రపంచానికీ నేత్రం వంటి వాడైన సూర్యుడు చైత్రమాసం మొదలుకుని కడవరకూ ఏ నెలలో, ఏ పేరుతో, ఎలా సంచరిస్తాడో అని ఆ విషయం చెప్పవా?"

శౌనకుని ప్రశ్నకు సూతుడు సమాధానం చెప్పడం సాగించాడు. "చైత్రం నుంచి పన్నెండు మాసాలలోనూ సౌరగణసప్తకం అంటే సూర్య సంబంధమైన ఏడు మూర్తులూ వాటి గుణాలూ ఈశ్వరునియోగం చేత ఎన్నో విధాలుగా సంచరిస్తూ ఉంటాయి. ఈ విషయాన్ని యింతకు ముందు శుకమహర్షి విష్ణురాతునికి చెప్పాడు. ఆ క్రమంలో నేను మీకు చెబుతాను. శ్రీమన్నారాయణ స్వరూపుడైన సూర్యుడు ఒకే రూపం గలవాడు. అయినప్పటికీ మహర్షులు కాలమూ, దేశమూ, క్రియా మొదలయిన వాటి భేదాన్ని బట్టి అనేక విధాలుగా వర్ణిస్తూ భావిస్తూ ఉన్నారు. ఆ వివరాలు చెబుతాను. విను!

సూర్యుడు చైత్రమాసంలో ధాత అనే పేరు ధరిస్తాడు అతనికి కృతస్థలి, హేతి, వాసుకి, రథకృత్తు, పులస్త్యుడు, తుంబురుడు అనేవారు పరిజనులుగా చేరి సంచరిస్తుంటారు.

వైశాఖమాసంలో సూర్యుడు అర్యముడు అనేపేరు వహిస్తాడు. పులహుడు, ఓజుడు, ప్రహేతి, పుంజికస్థలి, నారదుడు, కంజనీరుడు అనేవారు అనుచరులు కాగా కాలగమనం సల్పుతుంటాడు.

జ్యేష్ఠమాసంలో సూర్యుడు మిత్రు డన్న పేరు దాల్చి అత్రి, పౌరుషేయుడు, తక్షకుడు, మేనక, హాహ, రథస్వనుడు అనే పరిచరులతో కలిసి ప్రవర్తిస్తుంటాడు.

ఆషాఢమాసంలో సూర్యుడు వరుణుడు అనేపేరు పొందుతాడు. వసిష్ఠుడు. రంభ, సహజన్యుడు, హూహువు, శుక్రుడు , చిత్రస్వనుడు అనే వారు తనకు పరివారం కాగా కాలం గడుపుతుంటాడు.

శ్రావణమాసంలో సూర్యుడు ఇంద్రు డన్న పేరు స్వీకరిస్తాడు. అతనికి సహచరులుగా విశ్వావసువు, శ్రోత, ఏలాపుత్రుడు, అంగిరసుడు, ప్రమ్లోచ, చర్యుడు అనేవారు కలసి రాగా కాలం నిర్వహిస్తాడు.

భాద్రపదమాసంలో సూర్యుడు వివస్వంతు డన్న పేరుతో విరాజిల్లుతూ ఉగ్రసేనుడు, వ్యాఘ్రుడు, ఆసారణుడు, భృగువు, అనుమ్లోచ, శంఖపాలుడు అనే వారు ఆవరించి ఉండగా సమయపాలనం చేస్తుంటాడు.

**క. ధరలోఁ ద్వష్టాహ్వయమును, నిరవుగ ధరియించి ధాత్రి కింపు దలిర్పం**
**జరియించుచు నభమందున్, సరసిజహితుఁ డాశ్వయుజము సయ్యనఁ గడపున్. 42**

* ఆశ్వయుజమాసంలో సూర్యుడు త్వష్ట అన్నపేరుతో భూమికి ప్రమోదం కలిగేటట్లు ఆకాశంలో సంచరిస్తుంటాడు.

**వ. ఈ మాసంబున బుచీకతనయుండు కంబళాశ్వుండు తిలోత్తమ బ్రహ్మోపేతుండు శతచిత్తు ధృతరాష్ట్రుం డిషంభరు లను సభ్యులతోడ (గూడి కాలంబు గడుపుచుండుఁ; గార్తికమాసంబున విష్ణువని వ్యవహరింపఁ బడి యశ్వతరుండు రంభ సూర్యవర్చసుఁడు సత్యజిత్తు విశ్వామిత్త్రుండు మఘాపేతుఁడను**

పరిజనవర్గంబుతోఁగూడి కాలంబు నడపుచుండు; మార్గశిరంబునం దర్యమనామ వ్యవహృతుండై కశ్యపుండు తార్క్ష్యుండు ఋతసేనుం డూర్వశి విద్యుచ్ఛత్రుండు మహాశంఖుం డనెడు ననుచరులం గూడి చరించుచుండు; బుష్యమాసంబున భగుం డను నామంబు దాల్చి స్ఫూర్జుం డరిష్టనేమి యూర్ణుం డాయువు కర్కోటకుండు పూర్వచిత్తి యనెడు సభ్యజనపరివృతుండై కాలక్షేపణంబు సేయుచునుండు; మాఘమాసంబునఁ బూషాహ్వయంబు వహించి ధనంజయుండు వాతుండు సుషేణుండు సురుచి ఘృతాచి గౌతముం డను పరిజనపరివృతుండై చరియించుచునుండు. 43

* ఈ నెలలో ఋచీకుని సుతుడైన కంబళాశ్వుడు, తిలోత్తమ, బ్రహ్మోపేతుడు, శతజిత్తు, ధృతరాష్ట్రుడు, ఇషంభరుడు అనే సభ్యులతో సహవర్తియై కాలక్షేపం చేస్తుంటాడు. కార్తికమాసంలో సూర్యుడు విష్ణువనే పేరుతో వ్యవహరిస్తాడు. అతనికి పరిచరులుగా అశ్వతరుడు, రంభ, సూర్యవర్చసుడు, సత్యజిత్తు, విశ్వామిత్రుడు, మఘాపేతుడు అనేవారు సహకరింపగా కాలాన్ని నడుపుతుంటాడు.

మార్గశీర్షమాసంలో సూర్యుడు అర్యము డన్నపేరుతో అభిహితు డౌతాడు. కశ్యపుడు, తార్క్ష్యుడు, ఋతసేనుడు, ఊర్వశి, విద్యుచ్ఛత్రువు, మహాశంఖుడు అనేవారు అనుచరులు కాగా కాలనిర్వహణ కార్యక్రమం చేస్తుంటాడు.

పుష్యమాసంలో సూర్యుడు భగుడనే పేరు ధరించినవాడై స్ఫూర్జుడు, అరిష్టనేమి, ఊర్ణుడు, ఆయువు, కర్కోటకుడు, పూర్వచిత్తి అనేవారు సభ్యజనులై అనుసరింపగా సమయం జరుపుతుంటాడు.

మాఘమాసంలో పూషుడన్న పేరుతో వ్యవహరింపబడుతూ ధనంజయుడు, వాతుడు, సుషేణుడు, సురుచి, ఘృతాచి, గౌతముడు అనేవారు పరిజనం కాగా సంచరిస్తూ ఉంటాడు.

క. క్రతునామంబు ధరించియుఁ, జతురతఁబాలించుచుండుఁ జాతుర్య కళా
రతుఁడై సహస్రకిరణుఁడు మతియుతు లౌననఁ దపస్యమాసము లీలన్. 44

* ఫాల్గుణ మాసంలో సహస్రకిరణుడైన సూర్యుడు చాతుర్యకళా కేళీలోలుడై బుద్ధిమంతులు ప్రశంసించునట్లుగా క్రతు వన్న పేరు పెట్టుకుని కాలాన్ని పరిపాలిస్తాడు.

వ. అందు వర్చసుండు భరద్వాజుండు పర్జన్యుండు సేనజిత్తు విశ్వుం డైరావతుం డనువారలతో నెనసి కాలయాపనంబు సేయుచుండు; నిట్లు ద్వాదశమాసంబుల నపరిమేయ విభూతులచేఁ దేజరిల్లుచు నుభయసంధ్యల నుపాసించు జనుల పాపసంఘంబుల నున్మూలనంబు సేయుచుఁ, బ్రతిమాసంబును బూర్వోక్త పరిజన షట్కంబు వెంట నంట నుభయలోక నివాసులగు జనంబుల నైహికాముష్మిక ఫలంబుల నొసంగుచు ఋగ్యజుస్సామాథర్వణ మంత్రంబులఁ బఠియించుచు, ఋషిసంఘంబులు స్తుతియింపఁ బురోభాగంబున నప్సరస లాడ, గంధర్వులు పాడ, బ్రహ్మవేత్తలగు నఱువది వేవురు వాలఖిల్యమహర్షు లభిముఖులై నుతించుచు నరుగ, నధికబల వేగవిరాజ మానంబులగు నాగరాజంబులు రథోన్నయనంబు సలుప, బాహాబల ప్రతిష్ఠాగరిష్ఠులగు నైర్పత్రశ్రేష్ఠులు రథపృష్ఠభాగంబు మోచి త్రోయుచుండ ననాదినిధనుం డగు నాదిత్యుండు ప్రతికల్పంబున నిట్లు కాలయాపనంబు సేయుచుఁ

**దేజరిల్లుచుండు; నట్లుగావున నివి యన్నియు వాసుదేవమయంబులుగాఁ దెలియు' మని పౌరాణి కోత్తముండగు సూతుండు శుకయోగీంద్రుండు ప్రాయోపవిష్టుం డగు పరీక్షిన్నరపాలున కుపదేశించిన తెఱంగున నైమిశారణ్య వాసులగు శౌనకాది ఋషిశ్రేష్ఠులకుఁ దెలిపె; నిట్టి పురాణరత్నంబగు భాగవతంబు వినువారును బఠియించువారును లిఖియించువారును నాయురారోగ్యైశ్వర్యంబులు గలిగి విష్ణుసాయుజ్యంబు నొందుదు; రదియునుం గాక.** 45

* ఆ సమయంలో వర్చసుడు, భరద్వాజుడు, పర్జన్యుడు, సేవజిత్తు, విశ్వుడు ఐరావతుడు అనేవారు అతనిని పరిచరిస్తుంటారు.

ఈ విధంగా పంద్రెండు నెలలలోనూ 'ఇంత' యని కొలిచి చెప్పడానికి వీలుకాని విభవంతో ప్రకాశిస్తూ, ఉభయసంధ్యలలోనూ తనను ఉపాసనచేసే ఉపాసకుల పాపాలను పరిమార్చుతూ ప్రతినెలలోనూ పూర్వం చెప్పుకున్నట్టుగా ఆరుగురు పరిజనులూ అనుసరించి రాగా ఉభయలోక వాసులకూ లౌకికఫలములనూ, ఆముష్మికఫలములనూ ప్రదానం చేస్తూ ఋగ్యజుస్సామాథర్వ వేదమంత్రాలను పఠిస్తూ ఋషులు ప్రస్తుతింపగా, ముందరి భాగంలో అచ్చరలు నాట్యం చేస్తుండగా, గంధర్వులు గానం చేస్తుండగా, బ్రహ్మవేత్తలయిన అరవై వేల సంఖ్యగల వాలఖిల్యమహర్షులు ఎదురుగా నిల్చి స్తోత్రం చేస్తూ నడుస్తుండగా, మిక్కిలి వేగమూ బలమూ కలిగి విరాజిల్లుతున్న మత్తేభాలు రథాన్ని లాగుతుండగా, బాహుబలంలో ప్రతిష్ఠను ఆర్జించివారిలో శ్రేష్ఠులైన నైర్ఋతులు రథం వెనుక భాగాన్ని నెట్టుతూ ఉండగా, ఆదీ అంతమూ లేని ఆదిత్యుడు ప్రతికల్పంలోనూ ఈ విధంగా కాలాన్ని నడిపిస్తూ తేజరిల్లుతూ ఉంటాడు. కావున వీటి నన్నింటినీ వాసుదేవమయము లని తెలుసుకో'' అని ప్రాయోపవేశం పొందిన పరీక్షిన్మహారాజుకు శుకయోగీంద్రుడు చెప్పిన విధంగా పౌరాణికులలో ఉత్తముడైన సూతుడు శౌనకుడూ మొదలయిన ఋషి శ్రేష్ఠులకు చెప్పాడు.

పురాణాలలో శ్రేష్ఠమైన భాగవతాన్ని శ్రవణం చేసేవారూ, పఠనం చేసేవారూ, లిఖించేవారూ ఆయువూ, ఆరోగ్యమూ, ఐశ్వర్యమూ కలిగి విష్ణువుతో సాయుజ్యాన్ని పొందుతారు. మరొకటి యేమిటంటే-

**తే. పుష్కరంబందు ద్వారకాపురమునందు, మథురయందును రవిదినమందు నెవఁడు**
**పఠన సేయును రమణతో భాగవతము, వాఁడు తరియించు సంసారవార్ధి నపుడ.** 46

* పుష్కరతీర్థంలో కానీ, ద్వారకా పట్టణంలో కానీ, మథురానగరంలో కానీ ఆదివారం నాడు ఆసక్తి పూర్వకంగా భాగవతాన్ని చదివిన భక్తుడు వెనువెంటనే సంసారసముద్రాన్ని తరిస్తాడు.

**క. శ్రీరమణీరమణకథా, పారాయణచిత్తునకును బఠికిఁ బరీక్షి**
**ద్భూరమణున కెఱిఁగించెను, సారమతిన్ శుకుఁడు ద్వాదశస్కంధములన్.** 47

* లక్ష్మీరమణుడైన విష్ణుదేవుని కథలను వినడంలో ఆసక్తి గలవాడూ, భూరమణుడూ అయిన పరీక్షిత్తుకు శుకమహర్షి నిపుణంగా పంద్రెండు స్కంధాలు వినిపించాడు.

వ. మఱియు నష్టాదశపురాణంబులందలి గ్రంథసంఖ్య లెట్లనిన బ్రాహ్మపురాణంబు దశసహస్రగ్రంథంబు; పాద్మం బేఁబదియైదు వేలు; విష్ణుపురాణం బిరువదిమూఁడు సహస్రంబులు; శైవంబు చతుర్వింశతి సహస్రంబులు; శ్రీభాగవతం బష్టాదశ సహస్రంబులు; నారదంబు పంచవింశతి సహస్రంబులు; మార్కండేయంబు నవసహస్రంబు; లాగ్నేయంబు పదియేనువేల నన్నూఱు; భవిష్యోత్తరంబు పంచశతాధిక చతుర్దశ సహస్రంబులు; బ్రహ్మకైవర్తం బష్టాదశ సహస్రంబులు; లైంగం బేకాదశసహస్రంబులు; వారాహంబు చతుర్వింశతి సహస్రంబులు; స్కాందం బెనుబది యొక్క వేలనూఱు; వామనంబు దశసహస్రంబులు; కౌర్మంబు సప్తదశ సహస్రంబులు;మాత్స్యంబు చతుర్దశ సహస్రంబులు; గారుడంబు పందొమ్మిది సహస్రంబులు; బ్రహ్మాండంబు ద్వాదశసహస్రంబు లిట్లు చతుర్లక్ష గ్రంథసంఖ్యాప్రమాణంబులం బ్రవర్తిల్లు నీ పదునెనిమిది పురాణంబుల మధ్యంబున నదులయందు భాగీరథివిధంబున, దేవతల యందుఁ బద్మగర్భుమాడ్కిఁ, దారకలందుఁ గళానిధిగరిమ, సాగరంబులందు దుగ్ధార్ణవంబు చందంబున, నగంబులను హేమనగంబు భాతి, గ్రహంబుల విభావసుకరణి, దైత్యులందుఁ బ్రహ్లాదునిభంగి, మణులయందుఁ బద్మరాగంబు రేఖ, వృక్షంబులందు హరిచందనతరువు రీతి, ఋషులందు నారదు మాడ్కి, ధేనువులందు గామధేనువు పోల్కి, సూక్ష్మంబులందు జీవుని తెఱంగున, దుర్జయంబులందు మనంబు చొప్పన, వసువులందు హవ్యవాహనుని పోఁడిమి, నాదిత్యులందు విష్ణువు కరణి, రుద్రుల యందు నీలలోహితుని రీతిని, బ్రహ్మలందు భృగువు సొబగున, సిద్ధులయందుఁ గపిలుని లీల, నశ్వంబులందు నుచ్చైశ్శ్రవంబులాగున, దర్వీకరంబులందు వాసుకి రూపమున, మృగములందుఁ గేసరిచెలువున, నాశ్రమంబు లందు గృహస్థాశ్రమంబు క్రియ, వర్ణంబులలో నోంకారంబు నిరవున, నాయుధంబులఁ గార్ముకంబు సోయగంబున, యజ్ఞంబుల జపయజ్ఞంబుచాడ్పున, వ్రతంబులం దహింస కరణి, యోగంబులం దాత్మయోగంబురమణ, నోషధులయందు యవలసొబగున, భాషణంబు లందు సత్యంబు తేవ, ఋతువులందు వసంతంబు ప్రౌఢి, మాసంబులందు మార్గశీర్షంబు మహిమ, యుగంబులందుఁ గృతయుగంబు నోజఁ దేజరిల్లు; నిట్టి భాగవత పురాణంబు పఠియించి విష్ణుసాయుజ్యంబుఁ జెందుదు రని మఱియు నిట్లనియె. 48

* పద్దెనిమిది పురాణాల పరిమాణమూ, ఈ విధంగా ఉంది: బ్రహ్మపురాణం పదివేలశ్లోకాలు గల గ్రంథం. పద్మపురాణం పరిమాణం ఏభైఅయిదువేలు. విష్ణుపురాణం ఇరవైమూడువేలు. శివపురాణం ఇరవైనాలుగువేలు. భాగవతం పద్దెనిమిదివేలు. నారదపురాణం ఇరవైఅయిదువేలు. మార్కండేయపురాణం తొమ్మిది వేలు. అగ్నిపురాణం పదిహేనువేల నాలుగు వందలు. భవిష్యోత్తరపురాణం పధ్నాలుగు వేల అయిదువందలు. బ్రహ్మకైవర్తపురాణం పద్దెనిమిదివేలు. లింగపురాణం పదకొండువేలు. వరాహపురాణం ఇరవైనాలుగువేలు. స్కాందపురాణం ఎనభైయొక్కవేలనూరు. వామనపురాణం పదివేలు. కూర్మపురాణం పదిహేడువేలు. మత్స్యపురాణం పధ్నాలుగువేలు. గరుడపురాణం పందొమ్మిదివేలు. బ్రహ్మాండపురాణం పండ్రెండువేలు.

ఈ విధంగా నాలుగులక్షల పరిమాణం గల పద్దెనిమిది పురాణాలలో నదులలో గంగానదివలె, దేవతలలో బ్రహ్మవలె, తారకలలో చంద్రుని వలె, సముద్రాలలో పాలసముద్రంవలె, పర్వతాలలో మేరుపర్వతంవలె, గ్రహాలలో సూర్యునివలె, రాక్షసులలో ప్రహ్లాదునివలె, రత్నాలలో పద్మరాగం వలె, చెట్లలో హరిచందనంవలె, ఋషులలో నారదునివలె, ధేనువులలో కామధేనువువలె, సూక్ష్మాలలో జీవునివలె

జయింపరాని వాటిలో మనస్సు వలె, వసువులలో హవ్యవాహనునివలె, అదితి సంతానంలో విష్ణువువలె, రుద్రులలో నీలలోహితునివలె, బ్రహ్మలలో భృగువువలె, సిద్ధులలో కపిలునివలె, గుఱ్ఱాలలో ఉచ్చైఃశ్రవమువలె, సర్పాలలో వాసుకివలె, మృగాలలో సింహంవలె, ఆశ్రమాలలో గృహస్థాశ్రమంవలె, వర్ణాలలో ఓంకారంవలె, శస్త్రాలలో ధనుస్సువలె, యజ్ఞాలలో జపయజ్ఞంవలె, వ్రతాలలో అహింసవలె, యోగాలలో ఆత్మయోగంవలె, ఓషధులలో యవలవలె, వాక్కులలో సత్యవాక్కువలె, ఋతువులలో వసంతఋతువువలె, మాసాలలో మార్గశీర్షమాసంవలె, యుగాలలో కృతయుగంవలె, భాగవతం ప్రకాశిస్తూ ఉంటుంది. ఈ భాగవత పురాణం చదివినవారు విష్ణుసాయుజ్యం పొందుతారు అని చెప్పి మళ్లా ఈ విధంగా అంటున్నాడు-

**క. సకలాగమార్థపారగుఁ, డకలంక గుణాభిరాముఁ డంచిత బృందా**
**రక వంద్య పాదయుగుఁ డగు, శుకయోగికి వందనంబు సొరిది నొనర్తున్.** 49

* "సర్వశాస్త్రాల అర్థాన్నీ కడముట్ట తెలిసినవాడునూ, కళంకం లేని గుణాలతో ఆకర్షణీయమైన వాడునూ, దేవతలచేత సైతం నమస్కృతులు పొందే పాదద్వంద్వం కలవాడునూ అయిన శుకయోగికి నేను నమస్కారం చేస్తున్నాను.

**సీ. సకలగుణాతీతు సర్వజ్ఞు సర్వేశు నఖిలలోకాధారు, నాదిదేవుఁ**
**బరమదయార సోద్భాసితుఁ ద్రిదశాభి వందితపాదాబ్జు వనధిశయను**
**నాశ్రితమందారు నాద్యంతశూన్యుని వేదాంతవేద్యుని విశ్వమయునిఁ**
**గౌస్తుభ శ్రీవత్స కమనీయవక్షుని శంఖచక్రగదాసిశార్ఙ్గ ధరుని**

**తే. శోభనాకారుఁ బీతాంబరాభిరాము, రత్నరాజితమకుటవిభ్రాజమానుఁ**
**బుండరీకాక్షు మహనీయపుణ్యదేహుఁ దలఁతు నుతియింతు దేవకీతనయు నెపుడు.'** 50

* గుణముల కన్నింటికీ అతీతమైనవాడునూ, సర్వమూ తెలిసినవాడునూ, అన్నింటికీ ఈశ్వరుడైన వాడునూ, సర్వలోకాలకూ ఆధారమైనవాడునూ, ఆదిదేవుడునూ, గొప్పదైన కరుణారసం చేత ప్రకాశించే వాడునూ, దేవతల వందనాలను అందుకునే పాదాబ్జాలు కలవాడునూ, సముద్రంలో శయనించేవాడునూ, ఆశ్రయించిన వారి పాలిటికి కల్పవృక్షం వంటివాడునూ, ఆదీ, అంతమూ అనేవి లేనివాడునూ, వేదాంతంచేత తెలియదగినవాడునూ, విశ్వమంతా నిండిఉన్నవాడునూ, వక్షస్థలం మీద కౌస్తుభమూ శ్రీవత్సమూ కలవాడునూ, శంఖమూ చక్రమూ గదా ఖడ్గమూ శార్ఙ్గం అనే ధనుస్సూ ధరించి ఉండేవాడునూ, మంగళకరమైన రూపం కలవాడునూ, పీతాంబరం, ధరించి మనోహరంగా కనిపించేవాడునూ, రత్నాలచేత ప్రకాశించే కిరీటంతో వెలుగులు నింపేవాడునూ, పద్మపత్రాలవంటి నేత్రాలు కలవాడునూ, గొప్పదైన పుణ్యవంతమైన శరీరం కలవాడునూ అయిన దేవకీనందనుని స్మరించి యెల్లప్పుడూ స్తుతిస్తూ ఉంటాను."

**మ. అని యీరీతి నుతించి భాగవత మాద్యంతంబు సూతుండు సె**
**ప్పిన సంతుష్టమనస్కులై విని మునుల్ ప్రేమంబునం బద్మనా**
**భునిఁ జిత్తంబున నిల్పి తద్గుణములన్ భూషించుచున్ ధన్యులై**
**చని రాత్మీయనికేతనంబులకు నుత్సాహంబు వర్ధిల్లఁగన్.** 51

* ఈ విధంగా స్తోత్రం చేసి సూతుడు మొదటినుంచి చివరివరకూ భాగవతపురాణం చెప్పగా మునులు మనస్సులలో ఎంతో సంతోషించి, హృదయంలో పద్మనాభుడైన విష్ణుదేవుని నిల్పుకొని ఆయన గుణములనే కొనియాడుతూ ధన్యులై ఉత్సాహం ఉప్పొంగుతుండగా తమ తమ నివాసస్థానాలకు తరలిపోయారు.

**క. జనకసుతాహృచ్చోరా!, జనకవచోలబ్ధ విపినశైల విహారా!**
**జనకామిత మందారా!, జననాదిక నిత్యదుఃఖచయ సంహారా! 52**

* జనకుని పుత్రియైన సీత హృదయాన్ని దొంగిలించినవాడా! తండ్రి మాటవల్ల లభించిన అరణ్యాచలవిహారాలు గలవాడా! ప్రజల కోరికలను తీర్చే పారిజాతమా! పుట్టుక మొదలైన నిత్యదుఃఖ సమూహాన్ని సంహరించేవాడా!

**మాలిని. జగదవనవిహారీ, శత్రులోక ప్రహారీ! సుగుణవనవిహారీ, సుందరీమానహారీ!**
**విగతకలుషపోషీ! వీరవర్యాభిలాషీ! స్వగురుహృదయతోషీ! సర్వదా సత్యభాషీ! 53**

* లోకరక్షణకై విహరించేవాడా! పగతురను ప్రహరించేవాడా! సుగుణాలనే వనాలలో విహరించేవాడా! అందగత్తెల అభిమానమును హరించేవాడా! కలంకరహితులైన వారిని పోషించేవాడా! వీరవర్యుల చేత అభిలషింపబడేవాడా! స్వీయ గురువుయొక్క మనస్సుకు సంతోషం కలిగించినవాడా! ఎల్లప్పుడూ సత్యమే వచించేవాడా!

**గద్యము: ఇది శ్రీ పరమేశ్వరకరుణా కలిత కవితావిచిత్ర కేసనమంత్రి పుత్ర సహజపాండిత్య పోతనామాత్య ప్రియశిష్య వెలిగందల నారాయణ నామధేయ ప్రణీతంబైన శ్రీ మహాభాగవతం బను మహాపురాణంబునందు రాజుల యుత్పత్తియు, వాసుదేవ లీలావతార ప్రకారంబును, గలియుగధర్మప్రకారంబును, బ్రహ్మప్రళయ ప్రకారంబును, బ్రళయ విశేషంబులును, దక్షకునిచే దష్టుండై పరీక్షిన్మహారాజు మృతి నొందుటయు, సర్పయాగంబును, వేదవిభాగక్రమంబును, బురాణానుక్రమణికయు, మార్కండేయోపాఖ్యానంబును, సూర్యుండు ప్రతిమాసంబును వేర్వేఱు నామంబుల వేర్వేఱు పరిజనంబులతో, జేరుకొని సంచరించు క్రమంబును తత్తత్పురాణ గ్రంథసంఖ్యలు నను కథలు గల ద్వాదశస్కంధము. 54**

* ఇది శ్రీ పరమేశ్వరకరుణచేత సంప్రాప్తించిన కవిత్వవైచిత్రి కలవాడునూ, కేసనమంత్రి పుత్రుడునూ, సహజపాండిత్యుడునూ అయిన పోతనామాత్యుని ప్రియశిష్యుడైన వెలిగందల నారాయణ నామధేయునిచేత లిఖింపబడిన శ్రీమహాభాగవతం అనే మహాపురాణంలో రాజుల పుట్టుకా, వాసుదేవుని లీలావతారభేదములూ, కలియుగ ధర్మప్రకారమూ, బ్రహ్మప్రళయప్రకారమూ, ప్రళయవిశేషములూ, తక్షకుడు కరవడంచేత పరీక్షిన్మహారాజు పరమపదించడమూ, సర్పయాగమూ, వేదవిభాగక్రమమూ, పురాణానుక్రమణికా, మార్కండేయోపాఖ్యానమూ, సూర్యుడు నెలానెలా భిన్ననామాలతో భిన్న పరిజనులతో చేరి సంచరించే క్రమమూ, ఆ యా పురాణాల పరిమాణమూ అనే కథలు గల ద్వాదశస్కంధం.

***శ్రీ మహాభాగవతము సమాప్తము.***

***ఓం తత్సత్.***

**T.T.D. Religious Publications Series N0.639 - E**
**Price : Rs. 205/-**

విష్ణుకథలు కల్యాణాత్మకమైనవి. అంటే శుభాలను ప్రసాదించేవి. అవి ఎన్ని మార్లు విన్నా, ఎప్పటికప్పుడు కొత్తవిగానే ఉంటాయి. భాగవతం అలాంటి పవిత్ర కథలకు నిలయం. ఈ పురాణరత్నం సహజకవి పోతన అమృతహస్తం నుండి మధుర భక్తిమయ కావ్యంగా తెలుగులో అవతరించిన నాటినుండీ ఎందరో భక్తులకు, కవులకు, వాగ్గేయకారులకు ఉపాదేయమై, అనేకవిధాల మార్గదర్శకమై అలరారుతోంది.

"పోతన్న తెనుగుల పుణ్యపేటి" అన్న విశ్వనాథ వారి మాటలు అక్షరసత్యాలు. పోతన తెలుగులో భాగవతాన్ని శ్రీకైవల్యపదాన్ని చేరడానికి రచించినా, ఆ గ్రంథాన్ని చదివినవాళ్లందరికీ కూడా మోక్షాన్ని సిద్ధింపజేశారు. భాగవతంలోని ప్రతిపద్యం ఎంతో హృద్యం. తెలుగునాట పోతన గారి పద్యం నోటికి రాని పండితుడు గాని, పామరుడు గాని లేడంటే అతిశయోక్తి కాదు.

అలాంటి ఉత్తమగ్రంథమైన భాగవత సందేశాన్ని, పోతనకవితా వైశిష్ట్యాన్ని, ఎన్నో వ్యాపకాలతో సతమతమయ్యే నేటి 'సగటుమనిషి'కి ప్రత్యేకించి యువతరానికి వీలైనంత సమగ్రంగా, సరళంగా అందించాలనే ఉదారాశయంతో తిరుమల తిరుపతి దేవస్థానం ఆంధ్రమహాభాగవతాన్ని కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి ప్రధాన సంపాదకత్వంలో తాత్పర్యసహితంగా ప్రచురించింది. ఈ సంపుటాలకు అనేకమంది పండితులు చక్కటి తాత్పర్యాన్ని సమకూర్చారు. ఇప్పటికి ఐదుసార్లు ముద్రితమైన ఈ సంపుటాలు పరిష్కరింపబడి పునర్ముద్రితమై వెలువడ్డాయి. పాఠకులు యథాపూర్వం ఆదరించగలరు!

"భాగవతపురాణఫలరసాస్వాదన
పదవిఁ గనుఁడు! రసికభావ విదులు!"

**Published by I.Y.R.Krishna Rao, I.A.S., Executive Officer, T.T.Devasthanams, Tirupati and Printed at Prajasakti Daily Printing Press, Hyderabad - 500 020.**